

గురువులు
విచారణ
పారమార్ధిక నిధులు


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి.కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **రామ కృష్ణ సేవా సమితి బాపట్ల** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **రామ కృష్ణ సేవా సమితి బాపట్ల** వారి వెబ్ సైట్: http://www.unworldliness.org/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో **రామ కృష్ణ సేవా సమితి బాపట్ల** వెబ్ సైట్ వారు అందించటం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు వారికి గలవు,కనుక వారిని సంప్రదించగలరు.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

రామ కృష్ణ సేవా సమితి బాపట్ల వారి వెబ్ సైట్:

http://www.unworldliness.org/



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

పారమార్థిక నిధులు

శ్రీ తురీయానంద స్వామి లేఖలు

(సంక్షిప్త జీవితచరిత్ర సహితము)

ఆంగ్లానువాదం, సంస్కరణ

స్వామి చేతనానంద

తెనుగుసేత

బొడ్డుపల్లి సీతారామాంజనేయులు

(బి.యస్.ఆర్. ఆంజనేయులు)

ప్రకాశకులు

శ్రీరామకృష్ణ సేవా సమితి

బాపట్ల - 522101

pAramArthika nidhulu (Telugu)
shrI turIyAnanda swAmi lEkhalu
code: /002

ప్రకాశకులు
శ్రీరామకృష్ణ సేవా సమితి
బాపట్ల - 522 101

ప్రథమ ప్రచురణ సెప్టెంబరు, 2000 ప్రతులు 1500
ద్వితీయ ప్రచురణ సెప్టెంబరు, 2013 ప్రతులు 200

ప్రతులకు :
శ్రీరామకృష్ణ సేవా సమితి
బాపట్ల - 522 101
e-mail : rksamithibapatla@gmail.com
website : www.unworldliness.org

తెలుగు గ్రంథ ప్రకాశకుల మనవి

మా సంస్థ వ్యవస్థాపకులైన కీర్తిశేషులు శ్రీ బి.యస్.ఆర్. ఆంజనేయులు గారు ఈ "పారమార్థిక నిధులు" అనే గ్రంథాన్ని కొన్ని సంవత్సరాల క్రితమే అనువదించారు. దీన్ని ఇప్పుడు ప్రచురించగలగడం మా మహద్భాగ్యంగా భావిస్తున్నాము. పారమార్థిక సాధకులందరికీ ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

ఈ పుస్తకానికి తమ అమూల్యమైన ముందుమాటను అనుగ్రహించిన రామకృష్ణ మఠం మరియు మిషన్ అధ్యక్షులు పరమపూజ్య శ్రీ మత్ స్వామి రంగనాథానందజీ మహరాజ్ వారికి మా హృదయపూర్వక ప్రణామములు.

ఈ పుస్తక ప్రచురణకు ఆశీఃపూర్వకంగా ధనసహాయం అందించిన శ్రీమత్ స్వామి పరమార్థానందజీ మహరాజ్ (అధ్యక్షులు, రామకృష్ణ మఠం, హైదరాబాదు) వారికి మా కృతజ్ఞతాపూర్వక ప్రణామములు.

ఆంగ్లంలో ఈ పుస్తకాన్ని మొదట వేదాంత సొసైటీ ఆఫ్ సెయింట్ లూయీ వారు ప్రచురించారు. దాని తెలుగు అనువాదాన్ని ప్రచురించుటకు దయతో అనుమతినిచ్చిన శ్రీమత్ స్వామి చేతనానందజీ మహరాజ్, అధ్యక్షులు, వేదాంత సొసైటీ ఆఫ్ సెయింట్ లూయీ వారికి మా కృతజ్ఞతాపూర్వక ప్రణామములు.

భారతదేశంలోని పాఠకులకు అద్వైతాశ్రమ, మాయావతి వారు ఈ ఆంగ్లగ్రంథాన్ని పునః ప్రచురణ ద్వారా అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుత ప్రచురణలో తమ అమూల్యమైన మార్గనిర్దేశనం అందించిన శ్రీ మత్ స్వామి ముముక్షానందజీ మహరాజ్ (అధ్యక్షులు, అద్వైతాశ్రమ, మాయావతి) వారికి మా హృదయపూర్వక ప్రణామములు.

మేము కోరిన వెంటనే ఈ పుస్తకాన్ని ప్రచురించడానికి అనుమతి ఇచ్చిన శ్రీమత్ స్వామి గౌతమానందజీ మహరాజ్ వారికి (అధ్యక్షులు, శ్రీ రామకృష్ణ మఠం, చెన్నై) మా హృదయపూర్వక అభివాదములు.

ఈ పుస్తకం వ్రాతప్రతిని సరిదిద్దడంలోనూ, ప్రచురణకు సిద్ధం చెయ్యడంలోనూ సహాయపడిన వారందరికీ, ముఖ్యంగా ప్రొఫెసర్ పన్నాల శ్యామసుందరమూర్తి గారికి (కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ రామకృష్ణ వివేకానంద భావప్రచార పరిషత్) మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ప్రకాశకులు

ఆంగ్లమూలంలోని ప్రకాశకుల సూచన

దైవసాక్షాత్కారం పొందిన మహనీయుని జీవితమెప్పుడూ సేదదీర్చేదిగా, ఉత్సాహం గొలిపేదిగా ఉంటుంది. జీవితమే జీవితానికి ప్రేరణ ఇస్తుంది. తురీయానంద స్వామి జీవితం, వారి సందేశం భగవచ్చైతన్యంతో నిండి నిబిడీకృతమై ఉన్నాయి. ఆయనను గురించి చెపుతూ, వారి గురువయిన శ్రీరామకృష్ణులు, “భగవద్గీతలో నిర్వచించబడిన యోగి అతడు!” అన్నారు. స్వామి వేదాంతంలోనూ, యోగశాస్త్రంలోనూ నిష్ణాతులు. కొందరు సన్న్యాసులతోనూ, గృహస్థులతోనూ నెరిపిన ఉత్తరప్రత్యుత్తరాల ద్వారా ఆయన తన జీవితానుభవాన్ని, శాస్త్రజ్ఞానాన్ని పంచుకున్నారు.

కొన్ని దశాబ్దాలకాలం తురీయానంద స్వామి అధికభాగం బెంగాలీలోను, మిగిలినవి ఆంగ్లంలోను లేఖలు వ్రాశారు. అవి అనేకమంది నిజమైన ఆధ్యాత్మిక అన్వేషకులకు ఎడతెగని ప్రోత్సాహానికి, మార్గదర్శకత్వానికి మూలమయ్యాయి. సెయింటు లూయిాలోని ‘వేదాంత సొసైటీ’కి చెందిన శ్రీ చేతనానంద స్వామి – వీటిని తర్జుమా చేసి, పరిష్కరించి, ‘పారమార్థిక నిధులు – తురీయానంద స్వామి లేఖలు’ అనే గ్రంథరూపంలో ప్రచురించడం ద్వారా అమోఘమైన సేవ చేశారు.

ఈ గ్రంథాన్ని ప్రచురించి, భారతదేశంలో వ్యాప్తి చెయ్యడానికి మాకు అనుజ్ఞ ఇచ్చిన వేదాంత సొసైటీ, 205, సౌత్‌స్కింకర్ బౌలెవాడ్, సెయింటు లూయీ, మిస్సోరి 63105, యు.యస్.ఎ వారికి మేము కృతజ్ఞులం.

ప్రకాశకులు

అద్వైత ఆశ్రమ
మాయావతి, ఉత్తర ప్రదేశ్
1 జనవరి, 1994.

ఆంగ్లమూల అనువాదకుని ఉపోద్ఘాతం

“నీ దగ్గర నుండి ఉత్తరం వచ్చినప్పుడు నీ మానసికస్థితి నాకు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది; ఎక్కువ ఆలోచన చేయకుండా, ప్రేరణ ద్వారా నేను జవాబు వ్రాస్తాను!” ఈ విధంగా బ్రహ్మజ్ఞాని, శ్రీరామకృష్ణుల శిష్యుడు అయిన శ్రీతురీయానంద స్వామి తనకు వచ్చిన ఉత్తరాలకు సమాధానాలు వ్రాశారు. స్వానుభవాలతో పాటు, ఈ లేఖలు – ఉపనిషత్తులు, భగవద్గీత, భాగవతం, యోగసూత్రాలు, భక్తి సూత్రాలు, యోగవాశిష్ట రామాయణం; తులసీదాసు, సూరదాసు, హఫీజు, కబీరు వంటి మహనీయుల బోధనల సారాంశాన్ని కలిగి ఉన్నాయి. శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల బోధనల మీద శ్రీతురీయానంద స్వామి లేఖలు వెలుగును ప్రసరిస్తాయి. అంతేకాక స్వామికి వారితో కలిగిన వ్యక్తిగత అనుభవాల స్మృతులు కూడా ఈ లేఖలలో ఉన్నాయి. శ్రీతురీయానంద స్వామి గ్రంథాలను, వ్యాసాలను

వ్రాయలేదు. ఆయన ఒకసారి ఒక సన్న్యాసితో, "నేను లోకానికి ఏమి ఇవ్వాల్సి ఉందో, దానిని నా ఉత్తరాల ద్వారా ఇచ్చాను," అన్నారు.

పారమార్థిక అన్వేషకుడు పారమార్థిక ప్రయాణంలో ఏదో ఒక సమయంలో 'ఒక చీకటి రాత్రి'లో పయనించి, అహంకార కేంద్రీకృతమైన జీవితం నుండి, దైవకేంద్రీకృతమైన జీవితంలోకి రావలసి ఉంటుంది. ఆ సందర్భంలో అతడు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే కానరాని సూక్ష్మ-విరోధుల్ని ఎదుర్కొంటాడు. ఇది ఒక నిజమైన యుద్ధం. అనేకమంది అన్వేషకులు ఆ మాయలో చిక్కుకొని వ్యామోహానికి లొంగిపోతారు. ఈ నైతిక లేక పారమార్థిక మరణమన్నది భౌతికమైన మరణం కంటే ఎంతో బాధాకరమైనది. అయినా వివేకానంద స్వామి చెప్పినట్టు, "గొప్పతనం పైకి లేవడంలో లేదు. కానీ పతనం చెందిన ప్రతిసారీ పైకి లేవడంలోనే ఉంది" కదా.

జీవితమంటే పోరాటమని అర్థం. ప్రాపంచిక జీవితంలోగానీ, పారమార్థిక జీవితంలోగానీ కఠోరపరిశ్రమ లేకుండా దేనినీ సాధించలేం. పారమార్థికాభివృద్ధి సరళరేఖలో నడవక, ఎత్తుపల్లాలలో నడుస్తుంది. ఒక మనిషి ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కాలనుకున్నాడనుకోండి. దాన్ని చేరే త్రోవలో, ఒక శిఖరాన్ని దాటిన తర్వాత ఒక లోయలోకి దిగి, తర్వాత మరొక శిఖరాన్ని ఎక్కుతాడు. ప్రతిసారీ, పైకి ఎక్కిన తర్వాత అతడు మళ్ళీ క్రిందకి వచ్చినట్లు కనిపించినా, మొత్తం మీద అతడు పైకే పోతున్నాడు. పారమార్థిక జీవితం విషయంలో కూడా అంతే.

మఠంలో చేరిన తర్వాత తురీయానంద స్వామి ఒకసారి అటువంటి నిరాశావహస్థితిని అనుభవించారు. తర్వాత దానిని ఇలా వర్ణించారు: "నేను యువకుడుగా బారానగరంలో ఉన్నప్పుడు తీవ్రమైన విషాదస్థితిలో ఉన్నాను. ధ్యానం చెయ్యలేకపోయాను. ఒక రాత్రి డాబా మీద అటూయిటూ పచార్లు చేస్తున్నాను. అకస్మాత్తుగా మేఘాలు విచ్చుకుని, వాటి మధ్యలో నుండి పూర్ణచంద్రుడు దేదీప్యమానంగా బయటకు వచ్చాడు. అంధకారమంతా పటాపంచలైపోయింది. భూభాగమంతా వెన్నెలతో నిండిపోయింది. అప్పుడు, నేనొక తేజస్సుననీ, నా వెలుగు లోకానికంతా వెలుగునిస్తున్నదనీ ఒక ఆలోచన నా మనస్సులో మెరిసింది. క్షణంలో నా విషాదమంతా మటుమాయమై పోయింది".

తురీయానంద స్వామికి అతి సన్నిహితుడైన ఒక వృద్ధసన్న్యాసి నాతో, "నీ పారమార్థిక జీవితంలో ఎప్పుడైనా విచారం, నిరుత్సాహం, మందకొడితనం నెలకొంటే తురీయానంద స్వామి లేఖలు చదువు; నీకు తక్షణమే ఉత్సాహం కలుగుతుంది," అని చెప్పారు. ఆయన మాటలు అక్షరాలా యథార్థం. తురీయానంద స్వామి పారమార్థిక బోధలు, ఆయన స్వీయస్మృతులు కలిగివున్న ఈ లేఖలను నేను అనువాదం చేశాను. అంతేకాక ఆంగ్లంలో వ్రాసిన నలభై ఒక్క లేఖలను ఇందులో చేర్చాను. వాటిలో అధికభాగం 'ప్రబుద్ధభారత' లో ప్రకటించబడ్డాయి.

తురీయానంద స్వామి 1922లో మరణించిన తర్వాత రామకృష్ణ సాంప్రదాయ స్వామీజీలు అనేకమంది ఈ 'లేఖలలో' కొన్నింటిని పూర్తిగా కానీ, వాటిలో కొన్ని అంశాలు

కానీ ఆంగ్లంలోకి అనువదించారు. వాటిని 'ప్రబుద్ధ భారత,' 'వేదాంత కేసరి,' 'వేదాంత అండ్ ది వెస్ట్' అనే ప్రతికలలో ప్రచురించారు. ఈ విషయంలో ఈ స్వాములు గావించిన ప్రాథమిక కృషికి, అందులో ముఖ్యంగా పవిత్రానంద స్వామికి నేను ఋణపడి ఉన్నాను. పవిత్రానంద స్వామి ఈ లేఖలలో కొన్ని భాగాలు అనువాదం చేసి 'వేదాంత అండ్ ది వెస్ట్'లో ప్రచురించారు. గీత నుండి గానీ, ఉపనిషత్తుల నుండి గానీ తురీయానంద స్వామి ఉదహరించినప్పుడు ఆ స్థానాలలో న్యూయార్కు, రామకృష్ణ-వివేకానంద కేంద్రం వారు ప్రచురించిన నిఖిలానంద స్వామి అనువాదాలను ఉపయోగించాను.

'స్వామి తురీయానందేర్ పత్ర' అనే బెంగాలీ గ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించడానికి అంగీకరించిన కలకత్తా ఉద్బోధన కార్యాలయ అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. వ్రాత ప్రతిని సంస్కరించి, టైపుచెయ్యడంలో సహాయపడిన వేదాంత విద్యార్థులకు నేను కృతజ్ఞుణ్ణి.

నేడు ప్రజలు బోధనలు వినడంతోనూ, బుద్ధిశక్తితో ధర్మాన్ని అన్వేషించడం తోనూ, విసిగివేసారిపోయారు. మరి కొంతమంది సంఘటితమతం యొక్క ఆవశ్యకతనూ, ఉపయోగాన్నీ తీవ్రంగా శంకిస్తున్నారు. వారికి దైవాన్ని గురించిన ప్రత్యక్షానుభవం కావాలి. ఈ సందర్భంగా రాబోయే శతాబ్దంలో యోగశాస్త్రం ప్రధానపాత్రను వహించనున్నది. తురీయానంద స్వామిలాగా సత్యాన్ని దర్శించినవారే నిజమైన యోగి. అందువల్లనే ఆయన మాటలు అంత శక్తిమంతమైనవి – చొచ్చుకొనిపోయే శక్తి కలిగినవి.

ఈ అతీంద్రియ ప్రాచీన వేదాంత విషయాలను – పారమార్థిక నిధులు అనే ఈ గ్రంథంలో విశదపరచిన వాటిని – పాఠకులు చదివి, ఆనందిస్తారని నా నమ్మకం.

– చేతనానంద

రామకృష్ణ మఠ్
పి.ఒ. బేలూరు మఠ్ –711 202
హౌరా జిల్లా, వెస్ట్ బెంగాల్.

విషయసూచిక

ముందుమాట

బాపట్ల శ్రీ రామకృష్ణ సేవా సమితి, 'పారమార్థిక నిధులు – తురీయానంద స్వామి లేఖలు' అన్న పేరుతో, తురీయానంద స్వామి లేఖల తెలుగు అనువాదాన్ని ప్రచురిస్తున్నదని తెలిసి సంతోషించాను. నేను మైసూరులోని రామకృష్ణ ఆశ్రమంలో బ్రహ్మచారిగా ఉన్నప్పుడు, 1920 దశకంలో ప్రబుద్ధభారత పత్రికలో నెలనెలా ప్రచురితమవుతున్న తురీయానంద స్వామి ప్రసంగాలను చదివి ఆనందించేవాణ్ణి. ఆయన ప్రసంగాలు, బోధనలు ఎంతో స్ఫూర్తిదాయకమైనవి. ఆయన కొన్ని సంవత్సరాలు శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉండి, అక్కడకు దగ్గరలో ఉన్న పర్వతప్రాంతంలో శాంతి ఆశ్రమాన్ని స్థాపించారు. నేను ఆ ఆశ్రమాన్ని సందర్శించాను. ఆయన ఎక్కువ కాలం వారణాసి సేవాశ్రమంలో గడిపారు.

తెలుగు పాఠకులు ఈ తెలుగు అనువాదాన్ని చదివి పారమార్థిక ప్రేరణను పొందగలరని నా ఆకాంక్ష.

స్వామి రంగనాథానంద

అధ్యక్షులు

రామకృష్ణ మఠం మరియు రామకృష్ణ మిషన్

శ్రీ తురీయానంద స్వామి

జీవిత సంగ్రహం

బాల్యం

ఉత్తర కలకత్తాలో ఒక రోజు తెల్లవారు ఝామున ఒక బాలుడు గంగానదిలో స్నానం చేస్తున్నాడు. అతడి వయస్సు ఇరవైకు తక్కువే ఉంటుంది. అప్పుడు నీటిలో తన సమీపంలో ఏదో తేలుతున్నట్టు అతడికి కనిపించింది. ఒడ్డునవున్న కొంతమంది, "మొసలి! మొసలి! త్వరగా బయటకు రా!" అని కేకలు పెట్టారు. ఆ బాలుడు వెంటనే ఒడ్డుకు పరుగెత్తబోయి, అంతలోనే ఆగిపోయాడు. "రాత్రింబగళ్ళూ, 'నేనే భగవంతుణ్ణి, నేనే భగవంతుణ్ణి' అంటుంటావే, ఇప్పుడు ఒక్కసారిగా నీ ఆదర్శాన్నే మరిచిపోయి నీవు ఈ శరీరానివని అనుకుంటున్నావే! ఎంత సిగ్గుచేటు!" అనుకున్నాడు. వెంటనే తిరిగి లోతు నీటిలోకి వెళ్ళి స్నానం చెయ్యసాగాడు. అదృష్టవశాత్తూ అతనికేమీ అపకారం చెయ్యకుండానే ఆ మొసలి వెళ్ళిపోయింది.

హరినాథ్ ఛటోపాధ్యాయ అనే పేరుగల ఈ నిర్భయుడైన బాలుడు ఎవరో కాదు, కాబోయే తురీయానంద స్వామి. అతడు ఉత్తర కలకత్తాలో 1863 సంవత్సరం, జనవరి 3వ తేదీన జన్మించాడు. మూడవ ఏటనే తల్లి మరణించింది. తండ్రిని 12వ ఏట పోగొట్టుకున్నాడు. అందువల్ల తన అన్న, వదినల దగ్గర పెరిగాడు. బాల్యం నుండి హరినాథ్ కఠినమైన ఆధ్యాత్మిక జీవితం వైపు మొగ్గు చూపించాడు. లౌకికవిద్య మీద శ్రద్ధ లేకపోవడం వల్ల ప్రవేశపరీక్ష కూడా ముగించలేదు. అయినా బైబిలు క్లాసులకు క్రమం తప్పకుండా హాజరయ్యేవాడు. తాలింఖానాలో కుస్తీ పట్టేవాడు. నూరు దండీలు, ఐదువందల బస్కీలు ఏకబిగిన చెయ్యగలిగేవాడు. తాను పెళ్ళి చేసుకోననీ, సన్న్యాసజీవితం గడుపుతాననీ తన మిత్రులకు చెప్పేవాడు.

శ్రీరామకృష్ణుల శిష్యరికం

హరినాథ్ తన 13, 14 ఏళ్ళ వయస్సులో కలకత్తాలో దీనానాథ్ బసు ఇంటిలో శ్రీరామకృష్ణులను మొదటిసారి దర్శించాడు. ఈ సమాగమాన్ని గురించి తన 1917 సెప్టెంబరు, 19వ తేదీ ఉత్తరంలో (110వ లేఖలో) వర్ణించాడు. ఆ లేఖ ఈ గ్రంథంలో ఉంది. అతని రెండవ సమాగమం దక్షిణేశ్వరంలో 1879 లేక 1880వ సంవత్సరంలో సంభవించింది. ఆ తర్వాత అతడు తరచుగా అక్కడికి వెళుతూ ఉండేవాడు. గురుదేవులు (శ్రీరామకృష్ణులు) ఈ యువశిష్యునికి తర్ఫీదు ఇవ్వసాగారు. ఒకరోజు హరినాథ్ గురుదేవులతో, "మహాశయా! ఇక్కడికి ఎప్పుడు వచ్చినా నేను పారమార్థికంగా ఎంతో ప్రోత్సాహం పొందుతూ ఉంటాను. కానీ కలకత్తాకు పోగానే ఈ స్వభావం మారి పోతుంది. ఇలా జరగడానికి కారణమేమిటి?" అని అడిగాడు. గురుదేవులు, "నీవు హరి–దాసుడివి. నీవు హరికి (భగవంతునకు) దాసుడివి. భగవంతుణ్ణి తలచకుండా జీవించడం నీకు సాధ్యం కాదు!" అని సమాధానమిచ్చారు.

క్రమంగా గురుదేవులతో హరినాథ్ పరిచయం పెరగసాగింది. గురుదేవులను తనకు తోచిన అన్ని రకాలైన ప్రశ్నలను అడగడం మొదలు పెట్టాడు. ఒక రోజు, “అయ్యా! మనిషికి కామం నుంచి విముక్తి కలిగేది ఎలా?” అని అడిగాడు. శ్రీరామకృష్ణులు, “అబ్బాయీ! కామం అనేది పోవాలి అని ఎందుకు అనుకుంటున్నావు? దాని త్రోవ మరలించి, సరైన దారిలో పెట్టు! అసలు కామమంటే ఏమిటి? ఏదో కావాలని కోరడం. కాబట్టి భగవంతుడే కావాలని కోరుకుని, ఆ కోరికను మరింతగా బలపరచుకో!” అని సమాధానమిచ్చారు. శ్రీరామకృష్ణుల బోధనా విధానం చాలా సరళంగాను, సహజంగాను, దృఢతరంగాను ఉండేది. ఆయన శిష్యులను తమను తాము హింసించుకోమని చెప్పలేదు. “మీరు తూర్పువైపు వెళ్ళేకొద్దీ, పడమరకు దూరమైపోతారు. భగవంతుని యందు మీ భక్తి వృద్ధి చెందే కొద్దీ మీ కామం, క్రోధం, ఈర్ష్య తగ్గిపోతాయి,” అని బోధించారు.

శ్రీరామకృష్ణులు హరినాథ్‌కు స్త్రీలను నీచంగా చూడవద్దనీ, దానికి బదులు వారిని దివ్యజనని స్వరూపాలుగా గౌరవించమనీ బోధించారు. ధ్యానాన్ని గురించి, ఇతర పారమార్థిక సాధనలను గురించి ఆయన అతనికి ప్రత్యేకమైన బోధనలు గావించారు. హరినాథ్‌ను అద్వైత వేదాంతం ఎక్కువగా ఆకర్షించింది. స్వయంకృషి ద్వారా నిర్వాణాన్ని పొందాలని శాయశక్తులా కృషి చెయ్యసాగాడు. వేదాంతసాధన చేస్తూ, (శ్రవణ, మనన, ధ్యానాల ద్వారా) ఆదిశంకరుల గ్రంథాల అధ్యయనంలో మునిగిపోయి గురుదేవుల వద్దకు రావడం మానేశాడు. ఒకరోజు గురుదేవులు కలకత్తాలోని బలరాంబోసు ఇంటికి వెళ్ళినప్పుడు హరినాథ్‌కు కబురు చేశారు. ఆ బాలుడు వచ్చిన తర్వాత గురుదేవులు అతడి క్షేమసమాచారాలు విచారించి, “జ్ఞానం, భక్తి, ప్రత్యక్ష పారమార్థిక అనుభవం – వీటిలో దేనినీ భగవంతుని కరుణ లేకుండా సాధించలేం. ...కామకాంచనాలు అనిత్యమనీ, ఈ జగత్తు ఎల్లప్పుడూ మిథ్యయే అనీ దృఢనిశ్చయం కలగడం అంత సులభమా? భగవత్కరుణ లేకుండా అది సాధ్యమా?” అని సూటిగా ప్రశ్నించారు.

కొంతసేపైన తర్వాత గురుదేవులు సమాధిలో నిమగ్నులయ్యారు. నెమ్మది నెమ్మదిగా బాహ్యచైతన్యానికి వచ్చి ఉత్తరరామచరితంలో హనుమంతుడు శ్రీరాముని కుమారులైన కుశలవులకు చెప్పిన మాటను పాటగా పాడారు:

ఇంతటి పొగరేల మీకు కుశలవులారా!
నా అంతట నేను మీకు వశముగాక యున్న తరిని
సుంతయేని సాధ్యమౌన కట్టడి చేయంగ నన్ను
మీదు సొంత బలముతోడ ఓటమి పాల్జేయ నన్ను

గురుదేవులు ఈ పాటను పాడినప్పుడు హరినాథ్ కన్నుల నుండి అశ్రువులు జాలువారాయి. ఈ విషయాన్ని ఉదహరిస్తూ హరినాథ్ తర్వాత కాలంలో ఇలా చెప్పాడు: “ఆ రోజు నేనొక పాఠాన్ని నేర్చుకున్నాను. అది నా మనస్సుపై ఎన్నటికీ చెరగని ముద్రను వేసింది. భగవత్కరుణ లేకుండా ఏదీ సాధ్యం కాదని నేను ఆ రోజే తెలుసుకున్నాను.”

మరొక సందర్భంలో గురుదేవులు హరినాథ్‌కు ఇలా చెప్పారు: "శాస్త్రాలలో ఏముంది? అవి అంగట్లో వస్తువులు కొనడానికి జాబితా వ్రాసిన చీటీల లాంటివి. కొన్న సామాన్లను సరిచూసుకున్న తర్వాత ఆ చీటీని అవతల పారేస్తాం. కాబట్టి నీ జ్ఞానం, భక్తి సక్రమంగా ఉన్నాయో లేదో సరిచూసుకోవడానికి మాత్రమే శాస్త్రాలను సంప్రదించాలి. 'బ్రహ్మజ్ఞానం కలిగిన తర్వాత శాస్త్రాలు గడ్డిపరకలతో సమానం,' అని అంటారు కదా."

ప్రతిదీ శాస్త్రాలలో లేదు. శాస్త్రాలు ఉటంకించే ఆదర్శాలను ఆచరణలో పెట్టిన ఒక వ్యక్తి ఉదాహరణగా ఎంతైనా అవసరం. ఒక జీవితమే మరొక జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. శ్రీరామకృష్ణులు తమ సాధనల ద్వారా, పరిపూర్ణమైన దివ్యజీవితానికి ఒక మూసను తయారుచేసి, తమతమ జీవితాలను ఆ మూసలో ఎలా పోత పోసుకోవాలో శిష్యులకు బోధించారు. సామాన్య గురువులు మతాన్ని బోధిస్తారు. కానీ, బుద్ధుడు, క్రీస్తు, శ్రీరామకృష్ణులవంటి గురువులు మతాన్ని 'ఇస్తారు'. తర్వాత దక్షిణేశ్వర ఉద్యానవన దేవాలయంలో గురుదేవులతో తాను గడిపిన రోజులను, స్మృతులను హరినాథ్ ఈ విధంగా తెలిపాడు:

ఆహా! దక్షిణేశ్వరంలో గడిపిన ఆ దినాలు స్వర్గతుల్యంగా ఉండేవి. ఉదయం మొదలుకుని, మధ్యాహ్నం ఒంటి గంటకు బీదలకు భోజనం పెట్టేవరకు ప్రతివారూ పూలు కొయ్యడంలోను, పూజకు ఇతర ఏర్పాట్లు చేసే తొందరలోనూ నిమగ్నమై ఉండేవారు. ఈ మధ్యలో శ్రీరామకృష్ణులు ఇతర శిష్యులతో పారమార్థిక విషయాలను చర్చించేవారు. భక్తులు తన్మయులై వింటుండేవారు. ఆయన హాస్యమాడడం, ఛలోక్తులు విసరడం కూడా చేసేవారు. కానీ అవన్నీ భగవంతుని గురించే ఉండేవి తప్ప మరో విషయం ఉండేది కాదు.

ప్రతి విషయం చివరకి ఆయన సమాధిలో (భావాతీత చైతన్యస్థితిలో) లీనమై పోవడంతో ముగిసేది. మధ్యాహ్నభోజనమైన తర్వాత శ్రీ రామకృష్ణులు కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని, మళ్ళీ పారమార్థిక విషయాలను గురించే ప్రవచిస్తూ ఉండేవారు. సాయంసంధ్యా ఆరాత్రికసమయంలో ఆయన కాళీమాత గుడికి వెళ్ళి కొద్దిసేపు వింజామర వీచేవారు. అక్కడ దివ్యతన్మయత్వం చెంది, ఆ స్థితిలో తూలుతూ తన గదికి తిరిగి వచ్చేవారు. వారి శిక్షణలో పారమార్థిక సాధనలు చేస్తున్న మమ్మల్ని, "ఉదయం, సాయంకాలం మీరు ధ్యానం చేస్తున్నప్పుడు దివ్యోన్మాదం కలుగుతున్నదా?" అని ప్రశ్నించేవారు. రాత్రిపూట శ్రీరామకృష్ణులు చాలా తక్కువగా నిద్రపోయేవారు. నిద్రలేచి, తన గదిలో నిద్రపోయేవారిని, "ఎక్కువ నిద్రపోవద్దు, లేచి ధ్యానం చెయ్యండి," అంటూ లేపేవారు. మళ్ళీ కొంచెంసేపు విశ్రాంతి తీసుకుని వేకువ ముందే లేచి, అనుకరించడానికి వీలుకాని తన మధురకంఠంతో భగవన్నామాలను గానం చేసేవారు. శిష్యులు లేచి కూర్చుని, వాళ్ళవాళ్ళ పద్ధతులలో ధ్యానం చేసేవారు. అప్పుడప్పుడు గురుదేవులు వాళ్ళ దగ్గరకు వెళ్ళి, వాళ్ళు కూర్చున్న భంగిమను సరిచేసేవారు.

గురుదేవుల సాంగత్యంలో సామూహికంగా ఒక గంట భజన చేసినప్పుడు మేమంతా ఏవేవో లోకాలకు పోయిన మహదానందాన్ని అనుభవించేవాళ్ళం. కానీ, ఇప్పుడు ధ్యానం కూడా అటువంటి దివ్యానందాన్ని కానీ, కనీసం దానిలో లేశమాత్రమైనా కానీ, కలిగించలేకపోతున్నది. ఆ ఆనందం వరుసగా ఒక వారం రోజులు నిలిచి ఉండేది. ఎందుకో ఏమో తెలియదుగాని, మేము మత్తిల్లిపోయి ఉండేవాళ్ళం. ఈ విషయాన్ని నమ్మేవాళ్ళెవరు? ఎవరినైనా ఒప్పించడం చాలా కష్టం. అయినా నేను చెప్పక తప్పదు. సామాన్య మానవుడు ప్రపంచంలోని బాధలకు తట్టుకోలేక నిర్వాణాన్ని ఆశిస్తాడు. కానీ, దివ్యతన్మయత్వంలో కలిగే అప్రతిహతమైన ఆనందం గురించి అతనికి తెలియదు.

శ్రీరామకృష్ణులతో నివసించడమే ఒక గొప్ప విద్యాభ్యాసం. సేవలోనూ, సమాధిలోనూ ఎలా పరిపూర్ణత్వాన్ని పొందాలో ఆయన శిష్యులకు నేర్పారు. హరినాథ్ తర్వాత ఇలా గుర్తుచేసుకున్నాడు:

"ఒకరోజు దక్షిణేశ్వరంలో గురుదేవులు నాతో, 'పంచవటికి వెళ్ళు! అక్కడ భక్తులు వనభోజనాలు చేశారు. వాళ్ళు ఏదైనా అక్కడ వదలిపెట్టారేమో చూడు. ఏదైనా దొరికితే ఇక్కడికి తీసుకు రా!' అని చెప్పారు. నేను అక్కడికి వెళ్ళాను. ఒకచోట ఒక గొడుగు, మరొకచోట ఒక చాకు, కొన్ని ఇతర వస్తువులు కనిపించాయి. వాటినన్నింటినీ పోగుచేసి గురుదేవుల వద్దకు తీసుకుపోయాను. ఆ చాకును గురుదేవుల దగ్గర నుండి అరువుగా తీసుకున్నారు. నేను దాన్ని అలమారలో పెట్టబోతుంటే, ఆయన, 'దాన్ని ఎక్కడ పెడుతున్నావు? అక్కడ కాదు. దాన్ని ఎక్కడ ఉంచాలో అక్కడే ఉంచాలి. రాత్రిపూట నాకు ఆ చాకు కావలసి వస్తుందనుకో, నీ ఇష్టం వచ్చిన చోట ఉంచితే దాన్ని వెతకడానికి నేను చీకట్లో చేతులు చాపి దేవులాడుతూ ఇక్కడ, అక్కడ వెతకాలి. అటువంటి సేవ, సేవ అవుతుందా? కాదు. నీ ఇష్టం వచ్చినట్లు చేస్తే, దాని వల్ల కేవలం బాధనే కలిగిస్తావు. ఇతరులకు సరిగా సేవ చెయ్యాలనుకుంటే నిన్ను నీవు పూర్తిగా మరచిపోవాలి' అన్నారు."

శ్రీ రామకృష్ణులు, "అమ్మా! ఈ నా బిడ్డలు ఆధ్యాత్మికతలో నన్ను మించిపోవాలి!" అని ప్రార్థించేవారు. ఒక సామెత ఉంది: "శిష్యుని చేతులలో, పుత్రుని చేతులలో ఓటమిని ఆహ్వానించు." వారి గురువులాగా, ఆ శిష్యులు పారమార్థిక జీవితంలో అనేక విధానాలను పరిశోధించారు. హరినాథ్ ఒకసారి, "సర్వశాస్త్రసారమైన గీతాబోధనల మీద నేనెంతో ధ్యానం చేశాను. నేను, భగవద్గీతలో చెప్పబడినటువంటి ఒక సన్న్యాసినని శ్రీరామకృష్ణులే స్వయంగా చెప్పారు," అన్నాడు.

శ్రీ రామకృష్ణుల నిర్యాణానంతరం

శ్రీరామకృష్ణులు ఆగష్టు 16, 1886న కాశీపూరు ఉద్యానవన గృహంలో మహాసమాధి చెందారు. తర్వాత శిష్యులు బారానగర్‌లో రామకృష్ణమఠాన్ని స్థాపించారు. వివేకానంద స్వామి ఆధిపత్యం క్రింద 1887 పూర్వభాగంలో వారందరూ సన్న్యాసదీక్ష తీసుకున్నారు. అప్పుడు హరినాథ్, తురీయానంద స్వామి అయ్యారు. 1887 నుండి 1896 వరకు

తురీయానంద స్వామి పరివ్రాజక జీవితం గడిపి, భారతదేశపు ఉత్తర, పశ్చిమ భాగాల్లో విస్తారంగా పర్యటించారు. తర్వాత తన తాపసిక జీవితపు దినాలను గురించి, తన వ్యక్తిగత అనుభవాలను గురించి కళ్ళకు కట్టినట్టు వర్ణించారు:

ఇదివరలో నా నరాలు చాలా సున్నితంగా ఉండేవి. విషయాలను వివరించే గొప్ప శక్తులుండేవి. ఎవరైనా నన్నొక ప్రశ్నవేస్తే దాని పుట్టుక నుండి దాని బాహ్య వ్యక్తీకరణ వరకు – అతడు ఏ ఉద్దేశ్యంతో అడిగాడో, ఎందుకు ప్రశ్నించాడో – నేను చూడగలిగే వాణ్ణి. నా ఒక్కొక్క మాటలో ఒక తేజోప్రవాహముండేది.

నవరాత్రులలో (తొమ్మిది దుర్గాపూజ దినాల్లో) నేను పూర్తిగా మౌనం పాటించేవాణ్ణి. నాకొక విధమైన మత్తు కలిగేది. నా మనస్సు ఏకాగ్రమయ్యేది. మనిషిగా జన్మించినందుకు చెయ్యవలసిన దాన్ని నేను సాధించాను. నా లక్ష్యం – జీవితాన్ని పావనం చేసుకోవడమే. నేను ఎంతో చదివేవాణ్ణి. రోజూ ఎనిమిది నుంచి తొమ్మిది గంటలు చదువులో గడిపేవాణ్ణి. అనేక పురాణాలు చదివాను. తర్వాత వేదాంతం చదివాను. చివరకు నా మనస్సు వేదాంతం మీద నిలచిపోయింది...

ప్రారంభ దినాల్లో నేను విస్తారంగా పర్యటించాను. నర్మదవైపు ఒంటరిగా, చేతిలో ఒక్క పైసా కూడా లేకుండా వెళ్ళాను. ఎక్కడ పడితే అక్కడ నిద్రించాను. అలహాబాదు మీదుగా చిత్రకూటం, రేవా, జబల్పూరు వెళ్ళాను. అంతా కాలినడకనే. నేను ఎప్పుడు ప్రయాణించినా, ఏదో ఒక యాత్రాస్థలాన్ని మనస్సులో ఉంచుకుని, ప్రజలను అడుగుతూ దారి కనుక్కునేవాణ్ణి. తర్వాత హరిద్వార్, ఋషికేశ్, ఉత్తరకాశి వగైరా ప్రదేశాలకు వెళ్ళాను. పర్వత ప్రాంతాల నుండి క్రిందికి రాదలుచుకోలేదు. గఢ్వాల్ పర్వతాలలో సుఖంగా ఉన్నాను. ప్రపంచం ఉనికినే పూర్తిగా మరచిపోయాను – దైవసాక్షాత్కారాన్నే లక్ష్యంగా పెట్టుకున్నాను. నేను ఎంతో ధ్యానం, పఠనం చేశాను. కానీ, వివేకానంద స్వామి నన్ను క్రిందకు వచ్చేటట్లు చేశారు. మీరట్‌లో ఆయనను కలిశాను. ఆ తరువాత మేము ఏడెనిమిదిమంది కలిసి ఢిల్లీలో ఉన్నాం. అప్పుడు మహరాజ్ (స్వామి బ్రహ్మానంద) జవాల్జీ దర్శించాలని, నన్ను తనతోపాటు రమ్మన్నారు. ఆయనతో జవాల్జీ, గోపినాథ్‌పూరు, బైద్యనాథ్, పఠాన్‌కోట్, ముల్తాన్, గుజరన్‌వాలా, మాంటుగోమరీ మొదలైన చోట్లకు వెళ్ళాను. తర్వాత కరాచీ ద్వారా బొంబాయికి వచ్చాం. బొంబాయిలో వివేకానంద స్వామిని కలిశాం. అప్పుడు ఆయన అమెరికాకు ఓడ ప్రయాణం చెయ్యబోతున్నారు...

నేను కొంతకాలం మౌంటు అబూలో ఉన్నాను. అక్కడి నుండి అజ్మీరు, పుష్కర్, ఆ తర్వాత బృందావనం వెళ్ళాను. బృందావనంలో ఆరుమాసాలున్నాను. తర్వాత ఆరునెలలు లక్నోలో ఉన్నాను. తర్వాత అయోధ్య వెళ్ళాను. అయోధ్యలో మహాపురుష మహరాజ్ (స్వామి శివానంద) నన్ను కలిసి ఆలంబజారు మఠానికి రమ్మని కోరారు.

నేను ఎంత పర్యటిస్తున్నా, దారిలో విస్తారంగా అధ్యయనం కూడా చేశాను. బృందావనంలో అనేక భక్తి శాస్త్రాలను అధ్యయనం చేశాను. పారమార్థిక కృషి కొనసాగించలేనప్పుడు ఎక్కువగా పర్యటించడం మంచిది కాదు.

పూరీలో జగన్నాథ దేవాలయంలో, అకస్మాత్తుగా ఒక ధ్వని నా చెవులలో వినిపించసాగింది. నా హృదయం మహదానందంతో నిండిపోయింది. ఆ శబ్దం అనేక రాగాలుగా కొనసాగింది. నేను గాలిలో నడుస్తున్నానా అని అనిపించింది. నా మనస్సంతా ఎక్కడికో వెళ్ళిపోయింది. నేను క్రితం చదివిన 'అనాహత ధ్వని' అనేది అప్పుడు నాకు జ్ఞాపకానికి వచ్చింది. అప్పుడు అది అనాహత ధ్వని కావచ్చునని భావించాను.

ఉజ్జయినిలో ఒకనాటి రాత్రి చెట్టుక్రింద నిద్రిస్తున్నాను. తుఫాను వచ్చింది. అకస్మాత్తుగా ఎవరో నా శరీరాన్ని తాకారు. నేను పైకి లేచాను. తక్షణమే ఒక కొమ్మ విరిగి నేను నిద్రిస్తున్న చోట పడింది.

నేను మొదటిసారిగా "జీవితం జీవన్ముక్తి (శరీరంతో ముక్తిని పొందడం) కోసం ఉద్దేశించబడింది" అని (నరహరి రచించిన) ఒక శ్లోకంలో చదివినప్పుడు ఆనందంతో ఎగిరి గంతులు వేశాను. ఎందుకంటే, నిజంగా, అదే నా జీవితలక్ష్యం.

"యోగానికి ప్రథమ ద్వారం వాఙ్నిరోధం (వాక్కును నిరోధించడం), అపరిగ్రహం (దేనిని ఆశించకపోవడం), దేని కోసమూ ఎదురు చూడకపోవడం, కోరికలు లేకపోవడం, ఏకాంతం మీద ప్రేమ" ఈ శ్లోకం నా మీద గొప్ప ప్రభావాన్ని చూపించింది. ఇంతకు ముందు నేను ఎక్కువగా మాట్లాడేవాణ్ణి. కానీ ఇది చదివినప్పుడు, "ఏమిటీ! నేను యోగంలో మొదటి ద్వారాన్ని కూడా ప్రవేశించలేదా?" అనుకున్నాను. అప్పటి నుంచి వాక్కును నిగ్రహించాలని తీర్మానించుకున్నాను. ఎవ్వరితోనూ మాట్లాడకుండా, ఒంటరిగా ఉంటూ, నా పనులు నేనే చేసుకుంటూ, నాకు మంచిదని తోచిన విధంగా నడుచుకున్నాను.

నా జీవితాన్ని మలిచినది ఆదిశంకరులు. గురుదేవుల వద్దకు రావడానికి ముందు ఆదిశంకరుల ఒక్కొక్క శ్లోకం నన్ను ఒక్కొక్క మెట్టు పైకి తీసుకుపోయి, నాకొక జ్యోతిప్రవాహాన్ని ఇచ్చేది...

ఒకసారి నా సహచరులు వెళ్ళిపోయిన తర్వాత గంగాతీరంలో నేను ఏకాంతంగా కూర్చున్నాను. కొంచెం సేపైన తర్వాత రెండు గంటలు కొట్టింది. తర్వాత అకస్మాత్తుగా ఎవరో, "రా! ఇంటికి పోదాం!" అన్నట్టు వినిపించింది. ఈ మాటలు నా తలమీద మోదుతున్నట్లు అనిపించాయి. అవి నా మనస్సులోనుంచే వచ్చాయని గ్రహించాను. నిజంగా నాకు ఇల్లనేది లేదు. కానీ తిరిగి వెళ్ళడానికి నాకొక ఇల్లనేది ఉందని నా మనస్సు ఇంకా ఆలోచిస్తూ ఉండివుండవచ్చు. ఆపై ఈ మానసిక స్వభావాన్ని నిర్మూలించాలని నిశ్చయించుకున్నాను.

ఓహో! ఆ రోజులు మళ్ళీ నాకు గుర్తుకు వస్తున్నాయి. నేను శ్రీనగర్ ఘట్టంలో ఉన్నప్పుడు చాలా త్వరగా లేచి స్నానం చేసేవాణ్ణి. అప్పుడు ధ్యానానికి కూర్చునేవాణ్ణి. ఆ తర్వాత

గ్రంథపఠనం చేసేవాణ్ణి. పదకొండు గంటలకు లేచి కొద్దిమాత్రపు భిక్ష తెచ్చుకోవడానికి ఒక గంట గడిపేవాణ్ణి. తర్వాత మళ్ళీ ధ్యానం, జపం ఆరంభించేవాణ్ణి. అక్కడే నేను ఎనిమిది ఉపనిషత్తులు కంఠస్థం చేశాను. నేను చదివిన ప్రతి శ్లోకం మీద ధ్యానం చేసేవాణ్ణి. అది ఎటువంటి వర్ణనాతీతమైన ఆనందం! ఆదిశంకరుల భాష్యం, జ్ఞానానంద టీక చదివేవాణ్ణి. తర్వాత ధ్యానం వల్ల మరింత వికాసం కలిగేది.

బ్రహ్మజ్ఞాని నిర్భయుడవుతాడని వేదాంతం చెపుతున్నది. ద్వైతం నుండి భయం జనిస్తుంది. జ్ఞానోదయం పొందిన మహాపురుషుడు అద్వైతానుభూతిని పొందుతాడు. కాబట్టి అతడెప్పుడూ భయపడడు. ఒకసారి హిమాలయ (తెహ్రి-గడ్వాల్) ప్రాంతంలో తురీయానంద స్వామి ఒక పూరిగుడిసెలో నివసిస్తున్నారు. దాని తలుపు విరిగిపోయింది. ఒక రాత్రి 'పులి, పులి' అని గ్రామస్థులు అరవడం ఆయన విన్నారు. పులి తన గుడిసెలోకి రావచ్చనుకుని, తక్షణమే ఆయన ఆ విరిగిన తలుపునే మూసిపెట్టి, దాని వెనుక కొన్ని ఇటుకల్ని అడ్డం పెట్టారు. అంతలో, 'భగవంతుని కరుణవల్ల మృత్యువు కూడా పారిపోతుంద'న్న ఒక శాస్త్రవాక్యం ఆయనకు గుర్తు వచ్చింది. దానితో ఆయన ఆత్మజ్ఞానం జాగృతమైంది. శరీరభావం తొలగిపోయింది. ఆయన వెంటనే తలుపుల వెనుక పెట్టిన ఇటుకల్ని తన్నివేసి, తిరిగి ధ్యానానికి కూర్చున్నారు.

తురీయానంద స్వామి 1896 సంవత్సరం చివరి భాగంలో కలకత్తాకు తిరిగి వచ్చారు. వివేకానంద స్వామి పాశ్చాత్యదేశాల నుండి 1897 ప్రారంభంలో తిరిగి వచ్చి, 1897 మే 1వ తేదీన రామకృష్ణ మిషన్‌ను స్థాపించారు. వివేకానంద స్వామితో పాటు తురీయానంద స్వామి మన దేశంలోని పలు ప్రదేశాలు పర్యటించారు. ఆయన తన రోజులను తపస్సులో గడపాలని వాంఛించారు. కానీ వివేకానంద స్వామి కల్పించుకుని, "సోదరా! నేను నా జీవితపు ప్రతిక్షణాన్ని గురుదేవుల ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి వెచ్చించి, జీవితపు అవసానస్థితికి రావడం నీవు గమనించడం లేదా? ఇదంతా చూస్తూ నిలబడగలవా? నా అండకు వచ్చి ఈ నా అధికభారాన్ని కొంత తగ్గించవా?" అని అడిగారు. తురీయానంద స్వామి తమ నాయకుని అభ్యర్థనలను నిరాకరించలేకపోయారు.

అమెరికాలో

తురీయానంద స్వామి, జూన్ 1899లో వివేకానంద స్వామితోను, ఆయన ఐరిష్ శిష్యురాలు సోదరి నివేదితతోను అమెరికా బయలుదేరారు. ఓడలో, తనకు పాశ్చాత్య పద్ధతులు నేర్పమని నివేదితను అడిగారు. దానిని ఆమె ఒక ఉదాహరణతో తెలియజేశారు. ఒక చాకును తీసుకుని పదునుగల వైపును తాను పట్టుకుని, పిడిని స్వామికి అందించి ఇలా చెప్పారు: "ఎవరికైనా మీరు దేనినైనా ఇచ్చినప్పుడు అసౌకర్యంగా ఉన్న వైపును మీరు తీసుకుని, సౌకర్యంగా ఉన్న వైపును ఇతరులకు ఇవ్వండి!"

ఇంగ్లండును దర్శించిన తర్వాత వివేకానంద స్వామి, తురీయానంద స్వామి 1899 ఆగష్టు 16న అమెరికాకు బయలుదేరారు. న్యూయార్క్ చేరిన తర్వాత రిడ్జిలే మ్యానర్‌లోని, లెగ్గెట్

కుటుంబానికి చెందిన గ్రామీణ గృహానికి వెళ్ళారు. అక్కడ కొన్ని వారాలు విశ్రాంతి తీసుకున్నారు. క్రమంగా వివేకానంద స్వామి తురీయానంద స్వామిని న్యూయార్కులోని వేదాంత విద్యార్థులకు పరిచయం చేశారు. ఆయన యొక్క సరళమైన, ధ్యానమగ్నమైన స్వభావాన్ని చూసి వాళ్ళు ఆయనను ప్రేమతో అంగీకరించారు. అతులానంద స్వామి (అమెరికా సన్యాసి) తర్వాత ఇలా వ్రాశారు: "ఆయన వైరాగ్యంతోను, ఉత్సాహంతోనూ మాట్లాడారు. ఆ సమయంలో మిగిలినవన్నీ పూర్తిగా మరచిపోయి, చెపుతున్న విషయంలో మునిగిపోయి ప్రసంగించారు." తురీయానంద స్వామి జ్ఞానోదయం పొందిన సన్యాసి – త్యాగం, పవిత్రతలతో పూర్తిగా నిండిపోయిన వారు. విద్యార్థులకు ఆయన ఎల్లప్పుడూ ఉత్సాహాన్నిచ్చేవారు. ఒకరోజు న్యూయార్క్ నగరవీథిలో ఒక విద్యార్థితో బిగ్గరగా ఇలా అన్నారు: "సింహంలాగా ఉండు! సింహంలాగా ఉండు! పంజరాన్ని బద్దలుకొట్టి విముక్తుడవు కా!"

వివేకానంద స్వామి కాలిఫోర్నియాలో బోధిస్తున్నప్పుడు తురీయానంద స్వామి న్యూయార్క్‌లో ఒక సంవత్సరం వేదాంత కార్యక్రమాన్ని కొనసాగించారు. శాన్‌ఫ్రాన్సిస్కో వదలివెళ్ళే ముందు వివేకానంద స్వామి విద్యార్థులతో (శిష్యులతో) ఇలా చెప్పారు: "నేను వేదాంతం మీద ఉపన్యసించాను. మీరు తురీయానంద స్వామిలో రూపుదాల్చిన వేదాంతాన్ని చూస్తారు. వేదాంతాన్ని ఆయన తన జీవితంలో అనుక్షణం జీవిస్తారు. ఆయన ఒక ఆదర్శ హిందూ సన్యాసి. మీరందరూ పవిత్రమైన సాధుజీవితాన్ని జీవించడానికి ఆయన సహాయం చేస్తారు."

అంతర్యోగ కార్యక్రమాలను నిర్వహించేందుకు వీలుగా ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేయడానికి కుమారి మిన్ని సి. బూక్ (న్యూయార్క్‌కు చెందిన వేదాంత విద్యార్థి) ఉత్తర కాలిఫోర్నియాలో ఉన్న తన 160 ఎకరాల ఆస్తిని దానంగా ఇస్తానని ముందుకు వచ్చింది. వివేకానంద స్వామి 1900 జూన్‌లో న్యూయార్క్ తిరిగి వచ్చినప్పుడు, ఆ విరాళాన్ని అంగీకరించి ఆ పథకాన్ని నిర్వహించమని తురీయానంద స్వామితో చెప్పారు. ఆ బాధ్యతను వహించడానికి తురీయానంద స్వామి ముందు సందేహించారు. అయినా, వివేకానంద స్వామి ఈ విధంగా చెపుతూ ఆయనను ప్రోద్బలం చేశారు: "ఉపన్యాసాలివ్వగలనో లేదోనని నీవు దిగులుపడవద్దు. నీవు జీవితాన్ని గడిపి చూపించు. భక్తులకు ఆదర్శంగా ఉండు. విరాగులైనవారు ఎలా జీవిస్తారో వారిని చూడనియ్యి.... వెళ్ళి కాలిఫోర్నియాలో ఒక ఆశ్రమాన్ని నెలకొల్పు. వేదాంత ధ్వజాన్ని అక్కడ ఎగుర వెయ్యి. ఈ క్షణం నుంచి నీలో భారతదేశ స్మృతిని కూడా ధ్వంసం చెయ్యి. మిగిలినదంతా జగజ్జనని నెరవేర్చుతుంది."

తురీయానంద స్వామి జులై 8, 1900 తేదీన లాస్‌ఏంజిలిస్ చేరుకున్నారు. మీడ్ సోదరీమణులకు అతిథిగా వారి పసదేనా గృహంలో ఉన్నారు. రెండు వారాల తర్వాత శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళి, ఆగష్టు 2వ తేదీన ఒక డజను మంది ఉత్సాహవంతులైన స్త్రీ, పురుషులతో కలసి ఆశ్రమానికి బయలుదేరారు. వారు శాన్‌జోస్ వరకు రైలులో ప్రయాణం

చేసి, నాలుగు గుర్రాలతో పూన్చిన అంచెలంచెల బండిలో మౌంటు హ్యామిల్‌టన్ వరకు, అక్కడ నుండి ఒక అద్దె గుర్రపుబండిలో, సన్నని కొండదారుల్లో 22 మైళ్ళు ప్రయాణం చేసి, సాన్ ఆంటోనియో లోయకు చేరుకున్నారు. ఆ ఆశ్రమానికి 'శాంతి ఆశ్రమం' అని పేరుపెట్టారు.

ఆశ్రమజీవితం అనాగరిక పరిస్థితులలో ప్రారంభమైంది. నీటి పంపులు లేవు, విద్యుచ్ఛక్తి లేదు, స్నానపుగదుల సదుపాయాలు లేవు. ఆ ప్రదేశం పాములు, తేళ్ళు, పెద్దపెద్ద విషపు సాలీళ్ళతో నిండి ఉంది. ఆరుమైళ్ళ దూరం నుంచి నీళ్ళు తెచ్చుకోవాలి. శాకాహారం మీద జీవించాలి. అంతేకాక, సమీపంలో ఆహార పదార్థాలమ్మే దుకాణం లేదు. అటువంటి అరణ్యప్రాంతంలో, తన మీద ఆధార పడుతున్న అంతమందిని చూసి తురీయానంద స్వామి తాను అగమ్యగోచరమైన పరిస్థితులలో చిక్కుకున్నట్లు భావించారు. చాలా అధైర్యపడి దివ్యజననితో, "అమ్మా! ఏమి చేశావమ్మా? దీనివల్ల ఏమి సాధించాలనుకుంటున్నావు? వీళ్ళంతా ఇక్కడే చనిపోతారు. తలదాచుకునే ఆశ్రయం లేదు, కనీసం నీళ్ళు కూడా లేవు – వీళ్ళు ఏమి చేస్తారు?" అని మొరపెట్టుకున్నారు. శ్రీమతి ఆగ్నెస్ స్టాన్లీ వెంటనే ఆయనతో, "స్వామీ! మీరు ఎందుకిలా అధైర్యపడతారు? మీరు దివ్యజననిలో విశ్వాసాన్ని కోల్పోయారా? బేబీ (ఇడా అన్‌సెల్) కున్నంత నమ్మకం కూడా మీకు ఉన్నట్లు లేదే!" అని, తన చేతిసంచిలోని డబ్బులన్నింటినీ ఆయన ఒడిలో గుమ్మరించింది.

ఆమె చేసిన పని చూసి, తురీయానంద స్వామి అమెరికా దేశస్థుల ఔత్సాహిక స్ఫూర్తిని రేఖామాత్రంగా దర్శించగలిగారు. ఈ విద్యార్థులు కష్టాలను చూసి బెదిరిపోయేవారు కారు. అమెరికాను మొట్టమొదట కనుగొన్న అన్వేషకుల తరగతికి చెందినవారు. తన విద్యార్థి నుండి ఇటువంటి ధైర్యవంతమైన మాటలు రావడం చూసి తురీయానంద స్వామి ఉత్సాహం పొందారు. ఆమెతో ఇలా అన్నారు: "నీవు చెప్పింది యథార్థం. జగజ్జనని తానే మనను రక్షిస్తుంది. నీ శ్రద్ధ ఎంత గొప్పది! ఇప్పటి నుండి నీ పేరు 'శ్రద్ధ'." (భగవంతుని మీద దృఢమైన నమ్మకం గలది.)

సుదూరమైన ఆ ఎగుడుదిగుడు కొండప్రాంతంలో కష్టాలు, కడగండ్లు కొనసాగాయి. అయినా విద్యార్థులు తమ గురువు ఒక అద్భుతమైన వేదాంత గురువని, తమ మనస్సుల్ని, శరీరస్మృతిని మరచిపోయేట్లు చేసి, ఉన్నత పారమార్థిక లోకాలకు తీసుకుపోయే శక్తిగలవారని కనుగొన్నారు. ప్రారంభంలో వారికి ఒక చిన్న కర్రగుడిసె, ఒక పాక మాత్రమే ఉన్నాయి. వారి మొట్టమొదటి భోజనంలో వండిన అన్నం, బెల్లం మాత్రమే ఉన్నాయి. రాత్రి భోజనానంతరం అందరూ అగ్ని చుట్టూ చేరారు. స్వామి ఇలా పఠించారు: "ఈ జగత్తును సృజించిన ఆరాధ్యమైన ఆ బ్రహ్మతేజాన్ని మేము ధ్యానిస్తున్నాము! మా బుద్ధులను ఆయన ప్రకాశింపజేయు గాక!"

శాంతి ఆశ్రమ నిర్మాణానికి అందరు విద్యార్థులతో పాటు స్వామి కూడా ఎంతో కష్టపడి పని చేశారు. మొట్టమొదట ఒక ధ్యానకుటీరాన్ని నిర్మించారు. తర్వాత క్రమంగా సభ్యుల కోసం

మరి కొన్ని మందిరాలు నిర్మించారు. ఆశ్రమంలో వారొక నిత్య కార్యక్రమాన్ని పాటించినా అక్కడ ఎటువంటి నిశ్చితమైన నియమాలు, నిబంధనలు లేవు.

ఒక రోజున ఒకరు ఆశ్రమానికి కొన్ని నియమాలను ఏర్పాటు చెయ్యాలని ప్రతిపాదించారు. స్వామి ఇలా బదులు చెప్పారు: "నియమాలు కావాలని ఎందుకంటున్నావు? నియమాలు, నిబంధనలు లేకుండా అన్నీ చక్కగా, సక్రమంగా సాగిపోవడం లేదా? ప్రతివారు ఎలా సమయాన్ని పాటిస్తూ ఉన్నారో చూడడం లేదా, మనమందరం ఎంతో క్రమశిక్షణతో ఉండడం లేదా? ఎన్నడైనా, ఎవ్వరైనా తరగతుల నుండి గానీ, ధ్యానానికి గానీ హాజరు కాకుండా ఉన్నారా? జగజ్జనని ఆమె నియమాలను ఆమె ఏర్పరచింది. వాటితో మనం తృప్తి పడదాం. మనంతట మనం ఎందుకు నియమాలను ఏర్పరచాలి? స్వేచ్ఛ ఉండాలి, కానీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించకూడదు. జగజ్జనని పాలించే విధానమది. మనకొక సంఘం లేదు. కానీ మనం ఎంత సంఘటితంగా ఉన్నామో చూశారా! ఈ విధమైన సంఘమే కలకాలం నిలచి ఉంటుంది. వేరే రకాల సంఘాలు కాలగర్భంలో విచ్ఛిన్నమై పోతాయి. ఈ విధమైన సంఘం మనిషిని ముక్తుణ్ణి చేస్తుంది: మిగిలిన రకాలు బద్ధుణ్ణి చేస్తాయి. ఇది పారమార్థిక నియమాల మీద ఆధారపడి ఉన్న ఉత్తమోత్తమమైన సంఘం."

శాంతి ఆశ్రమంలో తురీయానంద స్వామి బోధనా విధానాన్ని గురించి అతులానంద స్వామి ఇలా వ్రాశారు:

"మీరు మీరుగా ఉండండి, బలిష్ఠులుగా ఉండండి. బలిష్ఠులైన, పవిత్రులైన నిజాయితీపరులకే సాక్షాత్కారం లభిస్తుంది. మీరు ఆత్మ అని గుర్తుంచుకోండి. అది మీకు మహత్తరమైన శక్తిని, ధైర్యాన్ని ఇస్తుంది. ధైర్యవంతులు కండి. మాయాబంధాన్ని తెంచి వేయండి. సింహసదృశులుగా ఉండండి. దేన్ని చూసైనా సరే భయపడవద్దు. వివేకానంద స్వామి ప్రతి జీవాత్మ సహజసిద్ధంగా దివ్యమేనని మీకు బోధించారు. మీ దివ్యత్వాన్ని గుర్తించండి. తర్వాత జీవులందరు దివ్యమని మీరు తెలుసుకుంటారు. మేఘం సూర్యుణ్ణి కప్పివేస్తుంది. 'సూర్యుడు లేడ'ని మనం అంటాం. కానీ సూర్యుడు ఎల్లప్పుడూ ప్రకాశిస్తూనే ఉంటాడు. కాబట్టి మనం బలహీనమైన మానవమాత్రులమని నమ్మేలా చేసేది మనలోని అజ్ఞానమనే మేఘమే. అయితే, ఆత్మ అనే సూర్యుడు ఎల్లప్పుడూ ప్రకాశిస్తూనే ఉంటాడు. అజ్ఞానమేఘాన్ని తొలగించండి. అప్పుడు మీ హృదయంలో ఆత్మ దానంతటదే దర్శనమిస్తుంది. ఆ విషయాన్ని సాక్షాత్కరించుకోగలిగితేనే మీరు మనుష్యులు, లేకపోతే పశువుల కన్న వేరే కాదు."

ఆత్మను ఏ విధంగా సాక్షాత్కరింపజేసుకోవాలని అడిగినప్పుడు ఆయన ఇలా జవాబిచ్చారు: "ధ్యానం ద్వారా! సత్యద్వారాన్ని తెరిచే తాళపుచెవి ధ్యానం. ధ్యానించండి! ధ్యానించండి! మీ మనస్సులలో జ్యోతి తళుక్కుమని దర్శనమిచ్చే వరకూ, మీ ఎదుట ఆత్మ సాక్షాత్కరించే వరకూ, ధ్యానం చెయ్యండి. మాటలతో కాదు, అధ్యయనంతో కాదు – ధ్యానంతోనే ఆత్మ తెలియబడుతుంది."

దైవంలో మాత్రమే విశ్వాసముంచడం అనే భావననే ఆయన ఎల్లప్పుడూ ఆధారంగా చేసుకునేవారు. అందువలన, భవిష్యత్తు గురించి ప్రణాళికలు వేయడాన్ని స్వామి తీవ్రంగా ప్రతిఘటించారు. అక్కడ కూడా ఇవే మాటల్ని ఉపయోగించారు: "మీరు ఎందుకు ప్రణాళికలు వెయ్యాలి? ఎందుకు అంచనాలు వేస్తారు? ఎందుకు అంత దూరాలోచన? జగజ్జననినే ప్రణాళిక వెయ్యనివ్వండి! ఆమె ప్రణాళికలు జరిగి తీరుతాయి. జగజ్జనని అంగీకరించక పోతే మనుష్యులు వేసే ప్రణాళికలు అన్నీ వ్యర్థమే. ఏమి జరుగబోతోందో ఆమెకు తెలుసు. భవిష్యత్తు అనేది ఆమెకు తెరిచిపెట్టిన పుస్తకం. వర్తమానంలో జీవించండి! మీ కాలాన్నీ, మీ అవకాశాలనూ సక్రమంగా వినియోగించుకోండి. భవిష్యత్తును గురించి ఆలోచించవద్దు. జగజ్జనని సంకల్పం జరిగి తీరుతుందని దృఢంగా విశ్వసించండి. ఆమెయందే నమ్మకముంచండి. కపటం లేకుండా ఆమెను ప్రేమించడానికి ప్రయత్నించండి. మిమ్మల్ని ఆమెకు సమర్పించుకోండి. ఆమెకు తోచినట్లుగా మిమ్మల్ని ఉపయోగించుకోనివ్వండి." కానీ ఒక సందర్భంలో ఇలా అన్నారు: "జగజ్జననిని నమ్మడమంటే సోమరితనం కాదు. ఆమె సంకల్పాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించు. పౌరుషంతో ప్రవర్తించు. నన్ను చూడలేదా? నేనెప్పుడూ సోమరిగా ఉండను. మనస్సు ఎల్లప్పుడూ ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండాలి. శారీరికంగా పని చెయ్యకపోతే పఠనం, అధ్యయనం, ధ్యానం మొదలైన వాటితో మనస్సును ఉపయోగించాలి. కబుర్లలో కాలాన్ని ఉబుసుపుచ్చవద్దు. కబుర్లు అనర్థాన్ని కలిగిస్తాయి. మాట్లాడితే భగవంతుణ్ణి గురించే మాట్లాడండి!"

చదవడం విషయంలో తురీయానంద స్వామి పారమార్థిక సాక్షాత్కారం పొందినవారు రచించిన గ్రంథాలను మాత్రమే చదవమని మాకు సలహా ఇచ్చారు. ఒక శిష్యురాలు, 'నూతన భావన' అనే పుస్తకం చదవడం చూసి ఆమెకు ఇలా చెప్పారు: "మూలాన్ని తీసుకుని చదువు! మతాన్ని బోధించాలనుకునే ప్రతి మూఢుని భావాలను చదువుతూ నీ కాలాన్ని వ్యర్థం చేసుకోవద్దు. మతం మీద లక్షల పుస్తకాలున్నాయి. వాటినన్నింటినీ నీవు చదవలేవు. కాబట్టి వాటిలో అత్యుత్తమమైన వాటిని మాత్రమే ఎంచుకో. సత్యాన్ని దర్శించిన వారే, సత్యాన్ని గురించి సాధికారికంగా ప్రసంగించగలరు. లేకపోతే గ్రుడ్డివాడు గ్రుడ్డివాడికి త్రోవ చూపినట్లుంటుంది. ఇద్దరూ కలిసి గోతిలో పడతారు, దుఃఖాన్ని అనుభవిస్తారు. సద్గురువు మాత్రమే సరైన మార్గాన్ని చూపగలడు. బ్రహ్మాన్ని ఎరిగినవాడే సద్గురువు."

ఒకసారి ఒక క్రైస్తవశాస్త్ర విద్యార్థి, "మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం మన ధర్మం కాదా?" అని అడిగాడు. "అవును," అని చెపుతూ, "కానీ, అత్యున్నత దృక్పథం నుండి చూస్తే శరీరమే ఒక గొప్ప రోగం. ఈ శరీరభావనకు అతీతమైన స్థితికి చేరుకుని మనం 'ఆత్మ' అని తెలుసుకోగోరుతున్నాం. 'నేను ఆత్మను, నేను ఈ దేహాన్ని కాదు; నేను ఆత్మను, ఈ శరీరం ఒక భ్రాంతి' అని ఏ ఉన్నతస్థితి నుండి చెప్పగలమో ఆ ఉత్తమస్థితిని తెలుసుకోవడానికి ఈ శరీరం అడ్డుగా నిలుస్తుంది. శరీరాన్ని మనం ప్రేమిస్తున్నంత కాలం మళ్ళీమళ్ళీ జన్మించవలసిందే.

కానీ, మనం ఎప్పుడు ఆత్మను ప్రేమిస్తామో, అప్పుడు దేహం విషయంలో ఉదాసీనత క్రమంగా పెరుగుతుంది. శరీరం మీద ప్రేమంతా నశిస్తే త్వరలోనే ముక్తి లభిస్తుంది" అన్నారు.

విద్యార్థులలో ఒకామె మానసిక శక్తులు ప్రదర్శించగలదు. ఒకరోజు ఆమె అనియంత్రిత లేఖనాన్ని అభ్యాసం చేస్తున్నది. దాన్ని తురీయానందస్వామి చూశారు. ఆమె మనస్సును స్తబ్ధంగా చేసి చేతిలో పెన్సిలు పట్టుకుని కూర్చుంటే దానంతటదే వ్రాయడం ప్రారంభమవుతుంది. చెయ్యి కదులుతూ వ్రాస్తుంది. దానిలో ఏమి వ్రాయబడిందో ఆ తర్వాత ఆమె స్నేహితురాలు చూసేది. ఏవేవో ఆసక్తికరమైన విషయాలు ఆ విధంగా వ్రాయబడేవి. ఆమె ఆ పనిలో నిమగ్నం కావడం చూసి స్వామి ఆమెను తీవ్రంగా మందలించారు: "ఏమిటి ఈ పిచ్చిపని? భూతాలకు, ప్రేతాలకు లొంగిపోదామనుకుంటున్నావా? ఈ అర్థంలేని పనిని వదలిపెట్టు! మనకు ముక్తి కావాలి. ఈ లోకానికే కాక అన్ని లోకాలకూ అతీతంగా మనం ఎదిగిపోవాలి. ప్రేతాత్మలతో మాట్లాడాలని నీవెందుకు ప్రయత్నిస్తున్నావు? వాళ్ళను ప్రశాంతంగా ఉండనియ్యి. నీవు చేస్తున్నదే మాయ. మాయను తప్పించుకో! విముక్తి పొందు!"

తురీయానంద స్వామితో ఉండడం అనవరతమైన ఆనందాన్నీ, ప్రోత్సాహాన్నీ ఇచ్చేది. అదే ఒక విద్యాభ్యాసం. ఆయనతో ఉన్నవారు ఎల్లప్పుడూ నేర్చుకుంటూనే ఉంటారు. ఆయన వల్ల కలిగిన ఆ ఆధ్యాత్మిక సహాయాన్ని మేమందరం అనుభవించాం. కొన్నిసార్లు సౌమ్యంగా, కొన్నిసార్లు వేదాంత సింహగర్జనతో స్వామి ఎల్లప్పుడూ పరిపూర్ణమైన ఆత్మచైతన్యంతో ఉండేవారు. ఒక క్షణం కూడా ఆశ్రమంలో నిరుత్సాహంగా ఉండేది కాదు.

తురీయానంద స్వామి ఆరోగ్యం 1902వ సంవత్సరం మొదట్లో దెబ్బతిన్నది. చికిత్స కోసం శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళారు. తర్వాత ఆశ్రమానికి వచ్చారు. తిరిగి భారతదేశం వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. ఆశ్రమ బాధ్యతను గురుదాసుకు (తర్వాత స్వామి అతులానంద) అప్పగించి 1902 జూన్ 6వ తేదీన భారతదేశానికి తిరిగి వచ్చారు. రంగూన్, బర్మా (ఇప్పుడు మాయాన్మారు) చేరినప్పుడు వివేకానంద స్వామి నిర్యాణాన్ని గురించి విన్నారు. విషాదపూరితులై కలకత్తా చేరారు. బేలూరు మఠంలో కొద్దికాలం ఉండి, పారమార్థిక సాధనలు చెయ్యడానికి బృందావన యాత్రకు బయలుదేరారు.

భారతదేశంలో ఆఖరు సంవత్సరాలు

తురీయానంద స్వామి మిగిలిన జీవితంలో ఎక్కువ కాలం, ఉత్తర భారతంలో, నంగోల్, గదముక్తేశ్వర్, ఋషికేశ్, ఉత్తరకాశీలలో గడిపారు. అమెరికాలో మూడు సంవత్సరాల కాలం ఉన్నా పాశ్చాత్యంలో లభించిన పేరు ప్రఖ్యాతులు, అక్కడి సంపదలు ఆయన తాపసిక, సన్న్యాసజీవితంపై ప్రభావం చూపలేదు. యథాప్రకారం ప్రాచీన వేదాంత సన్న్యాస ఆదర్శాన్ని ఆయన అనుసరించారు:

"వేదాంత అరణ్యంలో ఎల్లప్పుడూ తిరుగుతూ, భిక్షాన్నంతో తృప్తి చెందుతూ, హృదయంలో దుఃఖం లేకుండా ఉన్న కౌపీనవంతుడే నిజంగా ధన్యుడు." (ఆదిశంకరాచార్య).

మళ్ళీ ఆరోగ్యం చెడిపోయినప్పుడు రామకృష్ణ కేంద్రాలైన కన్‌ఖల్, అల్మోరా, పూరి, కలకత్తాలలో ఉన్నారు. ఆరోగ్యం దెబ్బతిన్నప్పటికీ సన్న్యాసులకు, భక్తులకు మహత్తరమైన వేదాంత విషయాలను బోధించారు. వికాసాన్ని కలుగజేసే ఆయన ప్రసంగాలు, 'పారమార్థిక సంభాషణలు' అనే గ్రంథంగానూ, ఉత్సాహపూరితమైన ఆయన లేఖలు అనువదించబడి, పరిష్కరింపబడి ఈ ప్రస్తుత గ్రంథంగానూ, వెలువడ్డాయి.

ఫిబ్రవరి, 1919లో తురీయానంద వారణాసి చేరి వారి నిర్యాణం వరకు అక్కడే ఉన్నారు. ఆయన ఎక్కడ ఉన్నా వివిధ శాస్త్రాల మీద తరగతులు నిర్వహించి, ప్రసంగాలు చేసేవారు. సంభాషించడంలో ఆయన ఒక అద్భుతవ్యక్తి. సంభాషణల ద్వారా ప్రజలను ఉత్తమ జీవితంవైపు ప్రోత్సాహ పరచారు. ఒకసారి ఒకరు, "స్వామీ! ఎల్లప్పుడూ పవిత్ర విషయాల మీద ప్రసంగించడం మీకు ఎలా సాధ్యమవుతుంది? మీకు అలసట కలుగదా?" అని ప్రశ్నించారు. స్వామి, "చూడు! నా బాల్యం నుంచి నేను ఇటువంటి జీవితాన్నే గడుపుతున్నాను. అది నాలో ఒక భాగమై పోయింది. జగజ్జనని యొక్క భావాల గిడ్డంగి ఎప్పటికీ ఖాళీ కాదు. అది ఖాళీ అవుతున్న కొద్దీ ఆమె తక్షణమే దాన్ని నింపివేస్తూ ఉంటుంది," అని ప్రత్యుత్తరమిచ్చారు.

తురీయానంద స్వామి మనుష్యులను జాగృతపరిచేవారు. ఒకసారి స్వామి ఒక యువకుణ్ణి వృథాగా అటూయిటూ తిరగకుండా ధ్యానమయమైన జీవితాన్ని గడపమని ప్రోత్సహిస్తూ, "కస్తూరి మృగం బొడ్డులో కస్తూరి పెరుగుతూ ఉంటుంది. కానీ ఆ విషయం ఆ మృగానికి తెలియదు. అది ఆ సుగంధపరిమళం కోసం పిచ్చెక్కినట్లు అటూయిటూ పరుగులు తీస్తుంది. అదే విధంగా మనం కూడా దివ్యజ్ఞానం కావాలని అంటూ ఎటెటో పరుగులు తీసి అలసిపోతాం. కానీ నిజానికి ఆ జ్ఞానం ఎల్లప్పుడూ మనలోనే ఉంది" అని చెప్పారు.

స్వామికి 1911లో మధుమేహవ్యాధి సోకింది. దాన్ని మరచిపోవడానికి గురుదేవుల ఈ బోధనను తలుస్తూ ప్రయత్నం చేశారు: "శరీరం, దాని వ్యాధి, వాటి సంగతి వాటిని చూసుకోనీ, ఓ మనసా! నీవు మాత్రం ఎల్లప్పుడూ భగవదానందంలో ఓలలాడు!" చివరి రోజుల్లో ఆయన వీపు మీద రాచపుండు లేచింది. దాని కోసం అనేకసార్లు ఆయన శస్త్రచికిత్స చేయించుకోవలసి వచ్చింది. కానీ, శస్త్రచికిత్స చేయించుకోవడానికి వైద్యులు మత్తుమందు ఇవ్వబోతే ఆయన అందుకు అంగీకరించలేదు. మనస్సును శరీరం నుండి సులభంగా వేరుచేసి, వైద్యులను శస్త్రచికిత్స చెయ్యమనేవారు. ఆ స్థితిలో కత్తితో కోసినా, ఆయనకు నొప్పి తెలిసేది కాదు. స్వామి చూపిన అద్భుతానికి ఆ వైద్యులు ఎంతో ఆశ్చర్యపోయారు.

తర్వాత ఈ సంఘటనను గురించి స్వామి ఇలా వివరించారు: "ఇది ఎలా ఉంటుందో నీకు తెలుసా? మనం భగవద్గీతలో చదువుతాం. 'అంతరాత్మ యొక్క దివ్యానందంలో నిమగ్నమై ఉన్నవాడు అత్యధికమైన విషాదం చేత, బాధల చేత కూడా కదిలింపబడడు (గీత: 6.22). ఈ శ్లోకం ఆదిశంకరులచే ఈ విధంగా వివరించబడింది: 'సాక్షాత్కారం పొందినవాడు, పదునైన కత్తితో కోసినందువల్ల కలిగిన నొప్పివల్ల కూడా ఏమాత్రం చలించడు.' ఇక్కడ రెండు భావాలు

మనకు కనిపిస్తాయి. మొదటిది – పరిపూర్ణుడైన యోగికి తన మనస్సు మీద అద్భుతమైన నిగ్రహముంటుందనీ, రెండవ దానిలో – అటువంటి యోగి ప్రకృతి అధీనానికి లొంగక, దానికి ఎంతో అతీతమైన స్థితిలో ఉంటాడని ఆదిశంకరులు తెలియపరిచారు." ఈ రెండు లక్షణాలనూ మనం తురీయానంద స్వామిలో ప్రత్యక్షంగా చూడవచ్చు.

తురీయానంద స్వామి 1922 జులై 21వ తేదీన మహాసమాధి పొందారు. మరణానికి ముందు రాత్రి తన అంతేవాసులకు, "రేపే ఆఖరి రోజు!" అని చెప్పారు.

చివరిగా, "ఓం రామకృష్ణ! ఓం రామకృష్ణ!" అని ఉచ్చరించి, తర్వాత తన సేవకుణ్ణి కూర్చోవడానికి సాయం చెయ్యమన్నారు. చేతులు జోడించి గురుదేవులకు నమస్కరించి, కొంచెం చరణామృతాన్ని తీసుకున్నారు. తర్వాత తన జీవితానుభవాన్ని విశదీకరించారు: "అన్నీ సత్యమే, బ్రహ్మం సత్యం, జగత్తు సత్యం, జగత్తు బ్రహ్మం. సత్యంలో ప్రాణశక్తి ప్రతిష్ఠితమై ఉంది. జై రామకృష్ణ! జై రామకృష్ణ! ఆయనే సత్యస్వరూపం! ఆయనే జ్ఞానస్వరూపం!" అని పలికి, తర్వాత అఖండానంద స్వామితో కలిసి ఈ ఉపనిషద్ మంత్రాన్ని పఠించారు: "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" – "బ్రహ్మం సత్యం, బ్రహ్మం జ్ఞానం, బ్రహ్మం అనంతం." బ్రహ్మంలో లీనమవుతున్నట్లు మెల్లగా ఆయన కన్నులు వాల్చారు. అప్పుడు సాయంత్రం 6 గంటల 45 నిమిషాలు అయింది.

నిజంగా తురీయానంద స్వామి తన పేరును సార్థకం చేసుకున్నారు. (తురీయ–ఆనందం అంటే సుషుప్తి, స్వప్న, జాగ్రదావస్థలకు అతీతమైనస్థితిలో కలిగే ఆనందం). అఖండ బ్రహ్మానందాన్ని ఆయన రుచి చూశారు. ఆ ఆనందాన్ని అందరికీ పంచిపెట్టారు. నిజమైన జ్ఞానిలాగా, నిశ్శబ్దంగా, ప్రాక్పశ్చిమ దేశాల్లో అనేక జీవితాలను ఆయన మార్చివేశారు. అమెరికాలో ఆయన వేదాంత విద్యార్థులకు (శిష్యులకు), "మీరు త్రాచుపాము చేత కరవబడ్డారు. ఆ విషం, దాని ప్రభావాన్ని తప్పక చూపిస్తుంది. మీ ఇదివరకటి వ్యక్తిత్వాలు మీకు మిగిలి ఉండవు. శ్రీరామకృష్ణులు మిమ్మల్ని అంగీకరించారు," అని చెప్పారు. ఒక విద్యార్థి, "నే పడిపోతే?" అన్నాడు. స్వామి, "నీవు పడిపోతే, దివ్యజనని ఒడిలో పడతావు. మళ్ళీ లేచి, మళ్ళీ ప్రయత్నిస్తావు!" అన్నారు. ఆహా! ఏమి అభయము!

ప్రథమ భాగము

బెంగాలీలో వ్రాయబడిన లేఖలు

(1)

బేలూరు మఠం

హౌరా, ఇండియా

ప్రియమైన హరిమోహన్,

చాలాకాలం తర్వాత ఇప్పుడే నీ ఉత్తరం అందింది. నీ జబ్బు ఏమిటి? మళ్ళీ ఛాతిలో నొప్పేనా? ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండు. జాగ్రత్తపరుడు దుఃఖానికి గురికాడు. ఆ విషయాన్ని ఎప్పుడూ మరువవద్దు. ఎల్లప్పుడూ జాగరూకతతో ఉన్నవాణ్ణి ప్రారబ్ధకర్మ (ఫలాన్ని ఇవ్వనారంభించిన పూర్వకర్మ) బాధపెట్టలేదు.... ప్రస్తుతం నీవు దేన్ని అధ్యయనం చేస్తున్నావు? శాస్త్రాధ్యయనాన్ని ఎన్నడూ విడువవద్దు. దానితో పాటు క్రమపద్ధతిలో స్థిరంగా ధ్యానాన్ని కూడా అభ్యాసం చేస్తూ ఉండు. పవిత్రమైన జీవనం గడపడమనేది చాలా దుర్లభం. కాబట్టి నీ హృదయాన్ని పవిత్రంగా ఉంచుకోవడం కోసం ఎల్లప్పుడూ జాగ్రత్త వహించు. నీకు అపాయం లేదని ఎన్నడూ తలచవద్దు. ఎల్లప్పుడూ భగవంతునికి శరణాగతుడివై ఉండు.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(2)

బేలూరు మఠం

హౌరా, ఇండియా

ప్రియమైన హరిమోహన్,

ఇప్పుడే నీ దగ్గర నుంచి మరో ఉత్తరం వచ్చింది. నీవు కులాసాగా ఉన్నావని తెలిసి సంతోషించాను. నీ ఆరోగ్యాన్ని గురించి జాగ్రత్తగా ఉండు. మాటిమాటికీ కలిగే రుగ్మతలను నయం చేసుకోవడంలోనే నీ శక్తిని ఖర్చుపెట్టే కంటే భగవంతుని స్మరణలో వెచ్చించడం చాలా మంచిది.. కే.బాబాజీ ప్రవర్తన గురించి ఆందోళన చెందవద్దు. అతని తెగకు చెందినవారిలో విద్యాగంధం చాలా తక్కువ. దానివల్ల వారు సంకుచితంగాను, మూఢనమ్మకాలతోను ఉంటారు. నీ పద్ధతిలో నీవు నీ జీవితాన్ని గడపడానికి ప్రయత్నించు. పరుల సంక్షేమాన్ని కోరి ప్రార్థన చెయ్యి. ఎవరితోనైనా సరే పోరాడడం అర్థరహితమైన పని. నీవు గీతాధ్యయనం చెయ్యడం చాలా మంచిది. సర్వశాస్త్రాలసారం గీతలో ఇమిడివుంది. గీతాశ్రవణం చేసిన తర్వాత అర్జునుడు మోహం నుంచి, సందేహం నుంచి విముక్తుడయ్యాడు. అదే విధంగా

గీతను ఎవరు మననం చేసినా వారికి తప్పక అదే ఫలితం కలుగుతుంది. ఎన్నడూ గీతాధ్యయనాన్ని మానవద్దు. నా ప్రేమను, ఆశీస్సులను స్వీకరించు.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(3)

బేలూరు మఠం, హౌరా, ఇండియా
14 నవంబరు, 1898

ప్రియమైన హరిమోహన్,

నేను క్రితం విజయదశమినాడు (దుర్గాపూజ ఆఖరు రోజు) అల్మోరా నుండి ఇక్కడికి వచ్చానని బహుశా నీకు తెలిసి ఉంటుంది. నీ ఉత్తరం అందింది కానీ సమాధానమివ్వలేకపోయాను. నా విజయదశమి శుభాకాంక్షలు అందుకో! ఆధ్యాత్మిక జీవితంలో ఎల్లప్పుడూ జాగరూకుడవై ఉండు. ఏ విషయంలోనూ అతిసాహసం పనికి రాదు. మితిమీరిన ఆత్మవిశ్వాసం అనర్థానికి దారితీస్తుంది. 'భయమెక్కడ ఉన్నదో జయమక్కడ ఉన్నద'ని గట్టిగా తెలుసుకో. (ఇది ఒక బెంగాలీ సామెత. దీని అర్థమేమంటే మాయావ్యామోహాలను చూసి ఆధ్యాత్మిక సాధకుడు భయపడడం ద్వారా ఆ వ్యామోహాలలో చిక్కుకోకుండా ఉండగలుగుతాడు.) నీకు మణిరత్నమాల గుర్తున్నదనుకుంటాను. (మణిరత్న మాల: ఇది ఆది శంకరాచార్యులు ప్రశ్నోత్తరాల రూపంలో వ్రాసిన వేదాంత గ్రంథం). ఈ బోధనలను అర్థం చేసుకుని వాటిని నీ జీవితంలో ఆచరణలోకి తీసుకురాలేకపోతే నీ శాస్త్రాధ్యయనం అంతా వృథా, నీ సత్పురుష సాంగత్యం నిష్ఫలం. ఈ విషయాలన్నీ ఎందుకు చెపుతున్నానో ఆలోచించు! తర్వాత నీకు ఏది మంచిదని తోస్తే, దాన్ని ఆచరించడానికి ఎన్నడూ వెరవవద్దు.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

మలిమాట: "మంచి కూడా చాలా సులభంగా చెడిపోగలదు. పాలు సులభంగా గడ్డకడతాయి, మళ్ళీ తిరిగి ఎప్పటికీ తిరిగి పాలు కావు. కాబట్టి ఒకసారి మనిషి చెడిపోతే, మళ్ళీ ఎప్పటికీ మంచివాడు కాలేడు" – సంత్ తులసీదాసు.

(4)

అమెరికా

ప్రియమైన ఎస్.,

నీకేమయింది? అంత విలపించడం ఎందుకు? నిద్రపోదామని ఎందుకు అనుకుంటున్నావు? "ఎవరు సుఖంగా నిద్రపోతారు? సమాధిస్థితుడైనవాడు మాత్రమే!" (మణిరత్నమాల, 4). సమాధిస్థితుడైనప్పుడు మాత్రమే నిజమైన నిద్ర వస్తుంది. ఎప్పుడూ

తనను గురించే ఆలోచించే వాడికి ఎన్నడైనా శాంతి చిక్కుతుందా? మనస్సును తోచినట్లు గంతులు వెయ్యనివ్వు! అలసిపోయిన తర్వాత అదే శాంతపడుతుంది. ఈ మూర్ఖమైన మనస్సును గురించి అతిగా ఆలోచించవద్దు. దానిని సంబాళించడానికి ఇదే ఉత్తమమైన మార్గం. నీ పనికిరానితనాన్ని గురించి నీకేం తెలుసు? నీ గురించి నీవే ఎందుకంత భయపడుతున్నావు? అమెరికాలో పారమార్థికాన్వేషులు చాలామంది ఉన్నారు. ఇక్కడికి రావడానికి నీవు అంగీకరిస్తే, వచ్చే ఏర్పాటు నేను చేస్తాను. నాకు తెలియజెయ్యి. నేను హాస్యమాడడం లేదు. ఇక్కడ చెయ్యవలసిన పనులు చాలా ఉన్నాయి. చేతిలో పనిలేనప్పుడు మనిషి తనను గురించే తలపోస్తూ ఉంటాడు. చివరకు ఏదీ చెయ్యలేదు. ఎంతకాలం నీ గురించి నీవు ఆలోచించుకుంటావు? చాలు! ఇప్పుడు ఇతరులను గురించి ఆలోచించడానికి ప్రయత్నించు. ఇక్కడకి రా! ప్రతిదీ దాని సంగతి అదే చూసుకుంటుంది.

నా ప్రేమ, శుభాకాంక్షలు స్వీకరించి ఇతరులకు కూడా వాటిని అందజెయ్యి.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(5)

బృందావనం, ఇండియా
28 డిసెంబరు, 1902

ప్రియమైన హరిమోహన్,

నీవు ఆప్యాయతతో వ్రాసిన ఉత్తరం అందింది. నీవు స్థాపించిన సంఘం ప్రశాంతంగా నడుస్తున్నదనీ, అందులో పని చేస్తున్నవారు ఉత్సాహంతో ఉన్నారనీ తెలుసుకుని నాకెంతో ఆనందం కలిగింది. శుద్ధానంద (స్వామి) సంఘాన్ని జయప్రదంగా నడుపుతున్నాడని అనుకుంటున్నాను.

నిజమైన సానుభూతి, ప్రేమ కలిగినదే ఉత్తమమైన మానవస్వభావం. అంతేకానీ, కేవలం పాండిత్యం, ప్రజ్ఞ కలిగినది కాదన్న విషయాన్ని దృఢంగా విశ్వసించు. నీకు ఇతరులపట్ల నిజమైన సానుభూతి ఉన్నప్పుడు, నీ జీవితం పవిత్రంగానూ, నిర్మలంగానూ, నిస్వార్థంగానూ ఉన్నప్పుడు దివ్యజనని నీ ద్వారా అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తుంది. శుష్కపాండిత్యంతో చేసే ఉపన్యాసాలు ఏ ఫలితాన్నీ కలిగించవు. ఇదే రహస్యం....

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(6)

ఋషీకేశ్

19 జనవరి, 1906

సోదరుడు శరత్‌కు (స్వామి శారదానంద),

నీవు దయతో వ్రాసిన ఉత్తరం ఇప్పుడే అందింది. నీ ఆత్మీయతను వర్ణించడం అసాధ్యం. 'సఖుడు లేనివాడు నిజంగా అభాగ్యుడు' అనే సామెత అక్షరసత్యం. భయంకరమైన ఈ లోకంలో మనస్సులోని భావాలను అరమరికలు లేకుండా పంచుకుని శాంతి పొందడానికి ఎవరో ఒకరైనా స్నేహితుడు ఉండాలి. అటువంటి స్నేహితుడు లేనివాడు నిజంగా దురదృష్టవంతుడు. ఈ విషయాన్ని గురించి నేను ఆలోచించినప్పుడు, నిన్ను గుర్తు చేసుకుని నేను ఎంత అదృష్టవంతుణ్ణో అని తలపోస్తూ ఉంటాను...

మన పరివ్రాజక దినాలలో ఈ ఋషీకేశ్‌లోనే మనం ఎంతో ఆనందాన్ని అనుభవించాం. వివేకానంద స్వామిని పోగొట్టుకుంటామేమోనని, ఇక్కడే ఆందోళనతోను, వ్యథతోను దినాలు గడిపాం! (ఆ సమయంలో వివేకానంద స్వామి తీవ్రమైన అనారోగ్యంతో ప్రాణాపాయస్థితిలో ఉన్నారు.) ఇక, వివేకానంద స్వామి మనల్ని వదలిపెట్టి వెళ్ళిపోయారు కనుక, ఇప్పుడు మనం రోజులు లెక్క పెట్టుకుంటున్నాం. భగవంతుడి యొక్క నిర్దాక్షిణ్యమైన శాసనం అటువంటిది! నా ప్రేమను, ప్రణామాలను స్వీకరించగోరుతున్నాను.

భవదీయభృత్యుడు,

తురీయానంద

(7)

గదముక్తేశ్వరం, మీరట్, ఉత్తరప్రదేశ్

4 ఫిబ్రవరి, 1908

ప్రియమైన విశుద్ధానంద,

నీవు వివరంగా వ్రాసిన ఉత్తరం నిన్న అందింది. ఎక్స్. ద్వారా కొంతకాలం క్రితం నీ విషయం తెలిసింది. వారణాసిలో పారమార్థిక సాధనలు చేస్తున్నావనీ, భగవంతుని కృపవల్ల క్షేమంగా ఉన్నావనీ తెలిసి సంతోషించాను. మాతృదేవి (శ్రీరామకృష్ణుల ధర్మపత్ని శ్రీ శారదాదేవి) నుండి ఉపదేశం (మంత్రదీక్ష) పొందావు. కాబట్టి, ఇక భయపడవలసిన పని లేదు. ఇప్పుడు, ఆనందంగా భగవంతునికి శరణాగతుడివై, ఆందోళన చెందకుండా ఉండు.

బంధం బయట ఎక్కడో లేదు, మన అంతరంగంలోనే (మనిషి మనస్సులోనే) ఉంది. కానీ అది పొరపాటున బాహ్యంగా ఉన్నట్లు కనిపిస్తుంది. భగవంతుని కరుణ వల్ల, సత్కర్మ వల్ల మనస్సు పరిశుద్ధమైనప్పుడు ఈ విషయాన్ని మనిషి స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతాడు. కానీ బంధం నుండి తప్పించుకోవడానికి బుద్ధి ద్వారా తెలుసుకుంటే చాలదు. గురుకటాక్షం వల్ల, తీవ్రమైన స్వయంకృషి వల్ల మనిషి బంధవిముక్తుడు కాగలడు.

నీవు అదృష్టవంతుడివని వేరే చెప్పనక్కరలేదు. లోకం అశాశ్వతమైనదని తెలుసుకుని, శాశ్వతమైన ఆ పెన్నిధి కోసం నీవు ఈ లోకాన్ని త్యాగం చేశావు. నీవు అదృష్టవంతుడివని చెప్పడానికి ఇదే తార్కాణం. వీటికి తోడు మాతృదేవి ఆశీస్సులను పొందావు. తీర్థయాత్రకు వెళ్ళి, ఏకాంత ప్రదేశంలో ఆధ్యాత్మిక సాధనలను చెయ్యాలని ఉద్దేశించావు – అది చక్కని నిర్ణయం. దానికి తోడు మాతృదేవి అంగీకారాన్ని కూడా పొందావు. నీ ఆరోగ్యాన్ని గురించి జాగ్రత్త తీసుకోమని అమ్మ చెప్పిన సలహాను ఎప్పుడూ మరచిపోవద్దు. గురుదేవులను హృదయంలో నిలుపుకుని ఎక్కడికి వెళ్ళినా భయం లేదు. అన్ని ప్రదేశాలూ భగవంతునివే. ఆయన లేని ప్రదేశమెక్కడైనా ఉందా? కాబట్టి కలత చెందవద్దు. పుణ్యక్షేత్రాలలో స్వేచ్ఛగా పర్యటిస్తూ, ఏకాంతంగా పారమార్థిక సాధనలు ఆచరిస్తూ, నీ హృదయ వాంఛను తీర్చుకో. దీనికి ఎవ్వరూ అభ్యంతరం చెప్పరు.

పనిలో చిక్కుకోవడాన్ని గురించి వ్రాశావు. దాని గురించిన నీ భయం నాకు నిరాధారంగా కనిపిస్తున్నది. కర్మ చెయ్యడంలో తప్పేమీ లేదు. అదే లేకపోతే చిత్తశుద్ధి (మానసిక పవిత్రత) ఎలా కలుగుతుంది? పని చేసినప్పుడు మాత్రమే మనిషి పరీక్షించబడతాడు. చేసిన పనుల యొక్క ఫలితాల మీద ఎంత ఆసక్తి ఉందో, కోరికలు ఎంత తగ్గాయో, స్వార్థపరత్వం ఎంత తగ్గిందో, ఇంకా ఎంత మిగిలి ఉందో తెలుస్తుంది. ఇదంతా కర్మ చెయ్యడం వల్లనే తెలుస్తుంది. హృదయంలో దివ్యప్రేమ జనించిన పిమ్మట మనిషి కర్మను కర్మగా ఎంతమాత్రం భావించడు. ఆ కర్మ ఆరాధనగా మారిపోతుంది. అదే నిజమైన భక్తి.

పారమార్థిక జీవితపు ఆరంభంలో, మనిషి మనస్సును తన ఆదర్శం మీద కేంద్రీకరించి – కర్మను, ఆరాధనను రెంటినీ అభ్యసించాలి. తర్వాత భగవంతుని దయ వల్ల కర్మకు, ధ్యానానికి మధ్య తేడా లేనటువంటి సమయం ఆసన్నమవుతుంది. చేసే అన్ని పనులు ఆరాధనగా మారిపోతాయి. ఎందుకంటే భగవంతుడు అన్నింటిలోనూ వ్యాపించి ఉన్నాడు. కాబట్టి భగవంతుణ్ణి నీ హృదయంలో నిలుపుకుని, నీకు మంచిదని తోచిన ప్రకారం చెయ్యి. మఠంలో ఉంటూ నిస్వార్థ (నిష్కామ) కర్మ చేసినా లేక పవిత్రమైన ఏకాంత స్థలంలో పారమార్థిక సాధనలు చేసినా, రెండూ ఒకటే. రెండూ మంచివే.

నీవు బలహీనుడివని ఎన్నడూ తలచవద్దు. నీవు బలహీనుడవే కావచ్చు, కానీ నీవు ఎవరిని శరణు వేడావో ఆయన సర్వశక్తి సంపన్నుడు. కాబట్టి ఆయన బలం చేత నీవు కూడా బలవంతుడివవుతావని భావించు. మానవుడికి భగవంతుడే తన సర్వస్వమని ఎప్పుడు దృఢవిశ్వాసం కలుగుతుందో, అప్పుడు అతడు తన హృదయంలో మహోత్కృష్టమైన శక్తి పెల్లుబకడాన్ని అనుభవిస్తాడు.

నీ భక్తి, శ్రద్ధ, భగవంతుని కోసం వ్యాకులత వృద్ధి చెందాలనీ, ఆయన చింతనలో నీవు లీనం కావాలనీ, ఈ జీవితంలోనే సార్థకతను పొందాలనీ – నా ప్రార్థన ఇంతకంటే ఏమి వ్రాయగలను?

భవదీయ,
తురీయానంద

(8)

గదముక్తేశ్వర్
మీరట్, ఉత్తరప్రదేశ్

ప్రియమైన ఎక్స్.,

నీ ఉత్తరం నిన్న అందింది. నీ గురించి ఇదివరలో శివానంద స్వామి నుండి విన్నాను. ఇప్పుడు ప్రాపంచిక బంధాలన్నీ తెంచుకుని, నీ యావజ్జీవితం భగవదారాధనలో గడపాలని నిర్ణయించుకున్నావని తెలిసి ఆనందించాను. భగవంతుని కోసం పరితాపం కలగడం చాలా మంచిది. అదే అత్యంత ప్రధానం. కానీ మనశ్శాంతి చిక్కలేదని ఆతురత, విచారం అంత మంచిది కాదు. భగవంతుని కోసం ఆరాటపడడమే ధన్యత అని మనిషి భావించుకోవాలి. ప్రాపంచిక జీవితంలో నుండి నిన్ను ఇవతలకి తెచ్చి, పారమార్థిక సాధనలు చెయ్యాలనే బుద్ధిని నీకు కలిగించడమే ఆయన చూపిన అపారమైన కరుణ కాదా? ఇప్పుడు నీ మనస్సు ప్రశాంతంగా ఉండడం, లేకపోవడం అంతా ఆయన మీదనే ఆధారపడి ఉంది. ఆయన పారమార్థిక సాధనలు నీ చేత చేయిస్తే చాలు. అది నీ అదృష్టంగా భావించు. పారమార్థిక అన్వేషణలో నిన్ను నిమగ్నుణ్ణి చెయ్య మని ఆయనను ప్రార్థించు. మనశ్శాంతి కోసం నీవు ఎందుకు ప్రార్థించాలి?

వంశపారంపర్యంగా వ్యవసాయం చేస్తున్న రైతును గురించి శ్రీరామకృష్ణులు చెపుతూ ఉండేవారు. అటువంటి రైతు అతివృష్టి వచ్చినా, అనావృష్టి వచ్చినా లెక్క చెయ్యకుండా పంట వేస్తూనే ఉంటాడు. అదే విధంగా భగవన్నామం చేస్తూ నీవు ధన్యుడవైనట్లు తలుచుకో. నీ సంతోషాన్నీ, దుఃఖాన్నీ, శాంతినీ, అశాంతినీ భగవంతునికి సమర్పించు. నిన్ను ఏ పరిస్థితిలో ఉంచితే దానితో సంతృప్తిపడు. నిరంతరం సాధన సాగిస్తూ ఉండే బుద్ధిని ప్రసాదించమని ప్రార్థించు. అప్పుడు శాంతి దానంతటదే కలుగుతుంది.

ఖరీదుపెట్టి కొనడానికి దేవుడేమైనా పాలకూరా, చేపా? సాధనకు అంతు ఉంటుందా? కేవలం సాధన ద్వారా ఎవరైనా భగవంతుణ్ణి పొందగలరా? ఆయన మీదే ఆధారపడి, ఆయన గుమ్మం దగ్గర వేచి ఉండు! అది ఒక్కటే చాలు. భగవత్కరుణ దానంతట అదే ప్రవహిస్తుంది. శ్వాసను నిరోధించడాన్ని అభ్యసించడం వల్లనో, లేకపోతే ఏ ఇతర పారమార్థిక సాధనల వల్లనో ఎవ్వరూ ఆయనను పొందలేరు. భగవంతుణ్ణి పొందినవాడు ఎవడైనా భగవంతుని దయవల్లనే ఆయనను పొందాడు. ఆయన గుమ్మం ముందు నిన్ను వేచి ఉండనిస్తే, అదే నీ మహద్భాగ్యమని తెలుసుకో. పారమార్థిక సాధన అంటే నిష్కపటంగా మనస్సును, వాక్కును ఏకం చేసి, భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉండడమే. నీ హృదయమందిరంలో దొంగతనానికి తావు

లేకుండా చూసుకో. (అంటే ఆత్మవంచన లేకుండా ఉండడం.) అది చాలు. ఇక అవసరమైతే ఆయన నీ ద్వారా తనకు కావలసిన పని చేయించుకుంటాడు.

నా శుభాశీస్సులతో,

తురీయానంద

(9)

ప్రియమైన ఎక్స్.,

నా క్రితం జాబులోని భావాన్ని నీవు అర్థం చేసుకున్నట్లు కనిపించడం లేదు. నీవు పారమార్థిక సాధనలు చేయకూడదని నా అభిప్రాయం కానేకాదు. భగవంతుని కృప వల్లనే గాని, పారమార్థిక సాధనలవల్ల భగవంతుణ్ణి పొందజాలమని మాత్రమే నేను నీకు చెప్పదలిచాను! (కేవలం సాధనవల్లే పొందగలిగితే భగవంతుడు కూడా బజారులో అమ్మకానికి దొరికే వస్తువే అవుతాడు!) – ఇది సర్వశాస్త్రాలు, మహాపురుషులు ఇచ్చిన చివరి తీర్పు. అంతేకాక, నీ సాధనను గురించి నీవు ఎన్నడూ గర్వపడకు! పూర్తిగా భగవంతునికి శరణాగతుడివై ఉండు. నీ మానసిక చాంచల్యం వల్ల పారమార్థిక మార్గం నుండి తొలగిపోయే ప్రమాదం ఉందని భయపడడం అనవసరం.

శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: "నీవు తూర్పు వైపు వెళ్ళే కొద్దీ, పడమరకు దూరమై పోతావు!" పారమార్థిక సాధనల మీద నీ ఏకాగ్రత ఎంత ఎక్కువయితే, నీ మనస్సు నుండి ప్రాపంచిక భావాలు అంత ఎక్కువగా తొలగిపోతాయి. జరగనిదాన్ని గురించి ఊహిస్తూ కష్టాన్ని కోరి తెచ్చుకోవడం వల్ల ప్రయోజనమే ముంది? ఎప్పుడోవొకప్పుడు చావు రాక తప్పదు. అందుకు భయపడి, ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటారా? కష్టాలను ఊహించుకుని ఎప్పుడూ బాధపడుతుంటే చేతిలో పని చెడిపోవడమే తప్ప, నీకెటువంటి ప్రయోజనం కలుగదు. "నేను భగవంతుణ్ణి శరణువేడాను. నా ఆటంకాలు, సమస్యలు, అన్నీ తొలగిపోతాయి! నాకు ప్రమాదం ఎలా కలుగుతుంది?" అని విశ్వసించు. నీవు శక్తిమంతుడివైనా, శక్తిహీనుడివైనా భగవంతుణ్ణి శరణువేడడం కంటే మరో గత్యంతరం లేదు. నాకు తెలిసిందంతవరకే. నీకింకేమైనా తెలిస్తే దాన్ని ప్రయత్నించు! "ఎవడైనా భగవంతుని వైపు ఒక అడుగు వేస్తే, వాడి వైపు భగవంతుడు పది అడుగులు వేస్తాడు." యావజ్జీవితం నేను విన్నది, కొంతవరకు నా అనుభవంలోకి వచ్చినది ఇదే. కానీ దానికి విరుద్ధమైన విషయాలను నీవు వ్రాశావు. అవి సరి కాదు. భగవంతుడు సర్వజ్ఞుడు. మన లోపల, బయట, అంతా ఆయనకు పూర్తిగా తెలుసు. ఈ విశ్వాసం లేకుండా నీవు పారమార్థిక సాధనలను ఎలా చేయగలవో నాకు తెలియడం లేదు. ఇతర విషయాలను వదిలిపెట్టి భగవంతుని కోసం నీ మనస్సును తీవ్రంగా వ్యాకుల పడనివ్వు – ఈ విషయంలో నీ మనస్సు ఎలా పనిచేస్తున్నదన్న విషయాన్ని జాగ్రత్తగా కనిపెట్టి ఉండు. వంశపారంపర్యంగా వ్యవసాయం చేసే రైతు వ్యవసాయం మీదనే జీవిస్తాడు గాని, మరి ఏ ఇతర వృత్తిని చేపట్టడు.

ఎవరిని పిలువను ఓ శ్యామా!
నేనెవరిని పిలవను ఓ తల్లీ!
బిడ్డ ఆర్తితో తల్లిని మాత్రమె
అమ్మా అనుచును పిలచు గదా
ఎదురుపడిన వారందరినీ మరి
పిలిచే బిడ్డను కానమ్మా!
నన్ను కొట్టినా, నెట్టి వేసినా
నిన్నే మరినే పిలతు గదా!
అమ్మా అమ్మా అని ఎలుగెత్తుచు
నిన్ను మాత్రమే పిలతు గదా!

ఇదే నాకు నచ్చిన వైఖరి.

"స్వశక్తి మీద పారమార్థిక సాధన ఆధారపడి ఉంటుందా?" అని అడిగావు. స్వశక్తితోనే పారమార్థిక సాధనలు చేయలేమన్నదే దానికి నా సమాధానం. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడు భగవంతునికి శరణాగతుడవ్వడం, అతని కరుణమీద ఆధారపడడం తప్ప మనిషికి మరో మార్గం కనుపించదు. నీవు ఒకదాని కొకటి సంబంధం లేకుండా వ్రాశావు. సరిగ్గా ఆలోచించడం నేర్చుకో. తెరచాప విప్పడమంటే పారమార్థిక సాధనలను అభ్యాసం చేస్తూ ఉండడమే కానీ మరొకటి కాదు. భగవంతుడి ముఖారవిందాన్ని దర్శించడానికి నీ మనస్సు ఇష్టపడకపోతే, చెవులు మెలిపెట్టుకోవడమో లేక మరేదైనా కఠినమైన విధానం ద్వారానో నిన్ను నీవు శిక్షించుకో. అభ్యాసమంటే ఒక భావాన్ని మళ్ళీమళ్ళీ మనస్సులో ఉంచడానికి ప్రయత్నించడమే!

భక్తివిశ్వాసాలతో ఈ ప్రయత్నాన్ని చెయ్యాలి. ఏకాంతంలో ఉంటే, మనిషి తన మనస్సును స్పష్టంగా చూడగలుగుతాడు. ఏకాంతం మనస్సును నిగ్రహించడానికి సహాయపడుతుంది. సన్న్యాసమంటే భగవంతునికి సంపూర్ణంగా శరణాగతుడివి కావడమే. ఆత్మవంచన ఏ మాత్రం పనికిరాదు. ఇదే మానవ జీవిత పరమలక్ష్యం.

భవదీయ,
తురీయానంద

(10)

వారణాసి,

19 జులై, 1911

ప్రియమైన ఎక్స్.,

కొద్దిరోజుల క్రితం నీవు ఆషాఢమాసం, 27వ తేదీన (జులై, 1911) వ్రాసిన ఉత్తరం అందింది. 'పరిపూర్ణమానవుడు'గా తయారుకావాలనే నీ వాంఛ తెలిసి ఎంతో ఆనందించాను. ఈ జన్మలోనే నీవు పరిపూర్ణత్వాన్ని పొందాలని మనఃపూర్వకంగా ప్రార్థిస్తున్నాను... నీ వాంఛ నిజాయితీ కలదైతే ఏదో ఒకరోజు అది తప్పక ఈడేరుతుంది. నీవేదైనా మంచి పనిని సాధించాలనుకుంటే, దానికి చాలా ఆటంకాలు వస్తాయి. కానీ దానికి అర్థం ఆ పనిని వదలిపెట్టాలని కాదు. ఆటంకాలు ఎంత ఎక్కువగా ఎదురైతే, అంత ఎక్కువగా వాటిని ఎదుర్కోవడానికి ప్రయత్నం చెయ్యాలి. నీ వ్యాకులతను వృద్ధి చేసుకోవడం మంచిదే కానీ అది హృదయ పూర్వకమైనదిగా ఉండాలి.

నీకు సాధుసాంగత్యం ప్రత్యక్షంగా లభించకపోతే నీ లోపల ఉన్న భగవంతుని సాంగత్యం కోసం మనస్సును వినియోగించు. నీ ఆంతరంగిక మిత్రుడైన భగవంతుణ్ణి నీ సొంతవాణ్ణి చేసుకోగలిగితే, నీకు ఇతరులతో పనిలేదు. నీలో ఉన్నది సచ్చిదానందుడే (సత్–చిత్–ఆనంద పరబహ్మ). ఆయనను గురించి యోచిస్తే నీవు జడపదార్థంగా మిగిలి ఉండవు. పరమ ప్రేమమయుడైన భగవానుణ్ణి హృదయపూర్వకంగా శరణువేడు. ఆయనే నీకు సమస్తం తెలియజేస్తాడు. ఆయన సర్వజ్ఞుడు. మన ఆంతరంగిక భావాలను తెలుసుకుని, ఆయన సర్వం నెరవేరుస్తాడు.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(11)

రామకృష్ణ సేవాశ్రమం, కన్‌ఖల్

25 మార్చి, 1912

ప్రియమైన సురేష్ (స్వామి యతీశ్వరానంద),

నీవు మార్చి 8వ తేదీన వ్రాసిన జాబు అందింది. అనేక కారణాలవల్ల ఇంతకంటే ముందుగా నీకు జవాబివ్వలేకపోయాను. నిన్ను గురించి నీవు వ్రాసింది, నీ సమస్యను సరిగ్గానే వివరిస్తోంది. అది నీ ఒక్కడి విషయంలోనే కాక అందరికీ వర్తిస్తుంది. నియమనిబంధనలతో మనల్ని మనమే బంధించుకుని, మన పురోభివృద్ధికి ఆటంకం కలిగించుకుంటున్నాం. నియమాల అవసరం లేదని నేను చెప్పడం లేదు. కానీ, నియమాలు ఎప్పుడు అవసరమో, ఎప్పుడు అనవసరమో తెలుసుకోవడం ప్రధానం.

"యోగాన్ని సాధించాలనుకునే వాడికి (స్వార్థరహితమైన) కర్మ సాధనమని చెప్పబడింది. కానీ యోగాన్ని సాధించిన వాడికి (కోరికల వాసనలు అంటని) ప్రశాంతత సాధనమని చెప్పబడింది" (గీత: 6.3).

దేవతామూర్తి విగ్రహంలోకి ఎంతో శ్రమపడి దైవాన్ని ఆవాహన చేస్తాం. కానీ, పూజ పూర్తికాగానే ఆ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తాం. అది, పరిస్థితులు మారినప్పుడు, ఏర్పాట్లను కూడా మార్పు చెయ్యడం వంటిది. ఈ విషయాన్ని తెలుసుకోవడం చాలా కష్టం. కానీ, ఒక విషయం మాత్రం సత్యం. పరిపూర్ణంగా భగవంతుణ్ణి శరణువేడితే, ఇక ఏ విషయంలోను మనం విచారపడనక్కరలేదు. భగవంతుని దయవలన సర్వం చక్కబడుతుంది. బాధపడకు! భగవంతుడి శరణు పొందు, భగవంతుడి శరణు పొందు!

ప్రేమతో,

తురీయానంద

(12)

ప్రియమైన ఎక్స్.,

మీ తండ్రికి సేవ చెయ్యమని ప్రత్యేకంగా చెప్పడం అనవసరం. "పితృసేవ స్వర్గానికి మార్గం. అది అత్యుత్తమమైన ధార్మిక కర్మ. అత్యున్నతమైన పారమార్థిక సాధన. తండ్రి సంతృప్తుడైతే సర్వదేవతలూ సంప్రీతులవుతారు." ఇది హిందూ శాస్త్రనియమం. నీవు సేవాధర్మాన్ని అంగీకరించావు – సర్వజీవులకు మంచి చెయ్యడమే నీ ధర్మం. ఇక తండ్రికి సేవ చెయ్యడాన్ని గురించి వేరే చెప్పేదేముంది!

నీకు సత్సాంగత్యం దొరకడం లేదని తెలిసి విచారిస్తున్నాను. కానీ, నీవేమి చెయ్యగలవు? పవిత్రమైన వాటన్నింటికంటే పవిత్రమైనది నీ హృదయంలో ఉంది. దాని ఆకర్షణలో మునిగిపో... ఆయన నీకు సర్వం అనుకూలంగా చేస్తాడు... నీ బంధువులతో చక్కగా ప్రవర్తించు. లేకపోతే నీ సేవాధర్మం అసత్యమై పోతుంది. సర్వజీవులలోను సర్వేశ్వరుణ్ణి దర్శించడమే ప్రధాన లక్ష్యం.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(13)

రామకృష్ణ సేవాశ్రమం, కన్‌ఖల్

6 ఏప్రిల్, 1912

ప్రియమైన శ్రీ.,

నీవు మార్చి 29వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది. నీవు కులాసాగా ఉన్నావని తెలిసి సంతోషించాను. నీ మానసిక ఆందోళన ఒక 'పెద్ద సమస్య' అయిందని తెలిసి ఆశ్చర్యం, విచారం కలిగాయి. తల్లిదండ్రులను 'పరమ గురువుల'ని ఎందుకు అంటారని నీవు

అడిగినందుకు దిగ్భ్రాంతి చెందాను. హిందూ కుటుంబంలో జన్మించి, ప్రజలు తమ తల్లిదండ్రులకు, "పితృసేవ స్వర్గానికి సోపానం: అది ఉత్తమోత్తమ ధార్మిక కృత్యం, అత్యున్నత ధార్మిక సాధన: తండ్రి సంతృప్తుడైతే సర్వదేవతలు సంప్రీతులవుతారు" అని చెపుతూ హవిస్సులు అర్పించడం కళ్ళారా చూస్తూనే, ఇలా అడిగినందుకు నిన్ను చూసి జాలిపడుతున్నాను. ఇప్పుడు నీ తల్లితండ్రుల్ని బజారు మనుష్యులతో సమానమని తలుస్తున్నావు. ఏమి పారమార్థిక పతనం!

'సామాన్యమైన జ్ఞానం' అని ఉదహరించావు. అన్ని జీవులకు నిస్సందేహంగా సామాన్య జ్ఞానం ఉంది. కానీ మానవుడికి ప్రత్యేకమైన జ్ఞానముంది. అందుకే మనిషి పశువుల కంటే ఉన్నతుడు. "ఆహారం, నిద్ర, భయం, మైథునం (కామ సంతృప్తి) – వీటన్నింటిలో మనిషి పూర్తిగా పశువులతో సమానమే. కానీ జ్ఞానం లో అతడు పశువులకు భిన్నంగా ఉంటాడు. జ్ఞానహీనులైన మనుష్యులు పశువు లతో సమానం" (హితోపదేశం). తల్లిదండ్రుల వల్ల సంతానం కలుగుతోంది. వారు ఆ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. స్వాభావికమైన మాతాపితృ స్వభావం చేత ప్రేరేపించబడి, వాళ్ళు ఆ సంతానాన్ని పెంచి పెద్ద చేస్తున్నారు. పశువుల విషయంలో కూడా ఇది కనిపిస్తుంది. కానీ, మానవుని విషయంలో ఇది పూర్తిగా భిన్నంగా ఉంటుంది. నీవు ఉదహరించినట్లు, తల్లిదండ్రులకు సేవ చెయ్యడం ద్వారా మనిషి వారి ఋణాన్ని తీర్చుకోవాలి. ఈ బుద్ధి పశువులకు లేదు. పశుసామ్రాజ్యంలో పిల్లలకు తమంతట తాము జీవించే శక్తి రాగానే, తల్లిదండ్రులతో వాటి సంబంధం తెగిపోతుంది. మానవ ప్రపంచంలో ఇలా ఉండదు. పశువులలో తమంతట తాము తినడం నేర్చుకున్న తర్వాత వాటికి తల్లిదండ్రులు ఇచ్చే శిక్షణ అయిపోతుంది. కానీ మనుష్యుల విషయంలో నేర్చుకోవడమనేది ఈ జీవితంతోనే అంతం కాదు. మరుజీవితంలో కూడా కొనసాగుతూనే ఉంటుంది. ఈ పరలోక జ్ఞానమే మానవుణ్ణి భక్తి కలిగిన కుమారునిగానూ, ప్రేమించే తండ్రిగానూ తీర్చిదిద్దుతుంది. తెలియని దాన్ని తెలిసేటట్లుగా చేసే శాస్త్రవిజ్ఞానాన్ని మనకు కలిగించడం కోసం, భగవంతుడు ఎంతో దయతో వేదాలను సృష్టించాడు. మనుష్యులకు శాస్త్రవిజ్ఞానం కావాలి కానీ, పశువుకు దాని సహజసిద్ధమైన ప్రకృతిజ్ఞానం సరిపోతుంది. కాబట్టి మనం మానవమాత్రులం అని అనిపించుకోవాలంటే, శాస్త్రాలను అనుసరించాలి. కృష్ణుడు భగవద్గీతలో ఇలా చెప్పాడు:

"ఎవరైతే శాస్త్రంలో చెప్పబడిన విధులను ఉల్లంఘించి, కోరికల చేత ప్రేరేపింపబడి పనిచేస్తూ ఉంటారో, వాళ్ళు పరిపూర్ణత్వాన్ని గానీ, సుఖాన్ని గానీ, పరమగతిని గానీ పొందరు. కాబట్టి నీవు ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అనే దాన్ని నిర్ణయించుకోవడానికి శాస్త్రాన్ని ప్రమాణంగా చేసుకో. శాస్త్రవిధులను తెలుసుకుని ఈ లోకంలో నీ కర్మను ఆచరించు" (గీత: 16.23–24).

అందరూ శాస్త్రపాండిత్యాన్ని సంపాదించలేని మాట సత్యమే. కాబట్టి శాస్త్రాలను తెలిసిన గురువుల యందు శ్రద్ధ, భక్తి ఉండాలి. ఈ శ్రద్ధాభక్తులు మానవునిలో జనించినప్పుడు అతడు

శాస్త్రజ్ఞానాన్ని సులభంగా పొందుతాడు. నిస్సందేహంగా శ్రద్ధ, భక్తి అనేవి భగవంతుడు ప్రసాదించినవే. కానీ తత్త్వదర్శులైన మహాత్ములను సేవించి, వారి సాంగత్యం పొందడం వల్ల కూడా ఈ జ్ఞానాన్ని పొందవచ్చు. గీతలో భగవానుడు ఇలా చెప్పాడు: "సాష్టాంగపడడం వల్ల, పరిప్రశ్నవల్ల, సేవచెయ్యడం వల్ల దీన్ని నేర్చుకో! సత్యాన్ని దర్శించిన జ్ఞానులు ఆ జ్ఞానాన్ని నీకు బోధిస్తారు" (గీత: 4.34).

మనిషి ప్రతి జీవిలోను భగవంతుణ్ణి దర్శించినప్పుడు, అతడి మనస్సులోని సమస్త భేదాలు నశిస్తాయి. అతడు సమదర్శి అవుతాడు. అప్పుడు తల్లిదండ్రు లకు, వీధిలో వారికి చేసిన సేవ ఒకటే అవుతుంది. ఎందుకంటే భగవంతుడు అందరిలోను ఉన్నాడు. కానీ, ఆ జ్ఞానోదయం చాలా దూరంలో ఉంది. తల్లిదండ్రులకు, గురువులకు, సాధువులకు భక్తిపూర్వకంగా సేవ చెయ్యడం వల్ల ఆ ఉత్తమజ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞానం కలిగే వరకు తల్లిదండ్రులను పరమగురువులుగా గౌరవించాలి. వారి అనుగ్రహం ద్వారానే మనం పరమజ్ఞానాన్ని పొందడానికి అర్హులమవుతాం. ఈ రోజుకు ఇంత వరకు చాలు.

ప్రేమ, శుభాశీస్సులతో
తురీయానంద

(14)

కన్‌ఖల్
8 ఏప్రియల్, 1912

ప్రియమైన తేజ్ నారాయణ్ (స్వామి శర్వానంద),

నీవు మార్చి 31వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది. నీ కార్యక్రమాలు చక్కగా జరుగుతున్నాయని తెలిసి సంతోషించాను. తనలో ఉన్న పరమాత్మ ప్రబోధం ప్రకారం నిస్వార్థంగా, కపటం లేకుండా, తెలిసినంతవరకు పారమార్థిక బోధనలు చేస్తే నిస్సందేహంగా అవి సత్ఫలితాన్ని కలిగిస్తాయి. బోధకుడు విద్యార్థుల స్థాయికి దిగి, వారి ప్రశ్నలలోని తాత్పర్యాన్ని గ్రహించి, తన బోధనలవల్ల వాళ్ళు ప్రయోజనాన్ని పొందేలా ప్రయత్నించాలి.

పారమార్థిక సాధకుడికి భగవంతుడి మీద యథార్థమైన భక్తి ఉండి, కపటం లేకుండా ప్రార్థిస్తూ ఉంటే, ఏమీ కొదవ ఉండదు. సర్వజ్ఞుడైన భగవంతుడు అతనికి సర్వం అనుకూలంగా చేస్తాడు. స్వీయ అభివృద్ధికి నమ్రత గొప్ప సహాయ కారి. గురుదేవులు ఇలా చెప్పేవారు: "నీళ్ళు పల్లానికి చేరతాయి, కానీ ఎత్తయిన గుట్టమీద నుండి క్రిందకి పారతాయి." వినయశీలుడి వద్దకు అన్ని సద్గుణాలు వస్తాయి. నమ్రత అనేది ఒక గొప్ప లక్షణం. గురుదేవులు నీకు ఆ లక్షణాన్ని ప్రసాదించారు. గురుదేవులు నీ ద్వారా ఎన్నో మహత్కార్యాలు చేయిస్తారని విశ్వసిస్తున్నాను. నీ కర్తవ్యాన్ని నీకు తెలిసినంత వరకు శక్తివంచన లేకుండా చేస్తూ ఉండు. పర్యవసానాన్ని లెక్కచెయ్యవద్దు. ఫలితాలను భగవంతుని పాదపద్మాల వద్ద వదిలివెయ్యి. ఆయన మూర్తీభవించిన మంచితనం. ఆయన మంచి తప్ప మరేమీ

చెయ్యడు. మనిషి తన మనస్సును భగవంతుని మీద ఉంచితే పెడత్రోవ త్రొక్కుతానేమోనని భయపడాల్సిన అవసరముంటుందా? మన జీవితానికి ఆయన ధ్రువతార. ఆయనే గమ్యం, ఆయనే మార్గం, ఆయనే పర్యవసానం.

నిజంగా, నీవు చేపట్టిన నిష్ఠకు అంతమనేది లేదు. దాని ఆరంభంలో, మధ్యలో, అంతంలో భగవంతుడున్నాడు. ఆయన తప్ప మరొక శరణ్యం లేదు. ఈ వ్రతంలో "నీవు పడుకున్నప్పుడు దివ్యజనని ముందు మోకరిల్లుతున్నానని తలుచుకో. నిద్రిస్తున్నప్పుడు ఆమెను ధ్యానిస్తున్నాననీ, తింటున్నప్పుడు తల్లి శ్యామకు ఆహుతులు అర్పిస్తున్నాననీ భావించు." ఈ వ్రతంలో, "నీవు చెవుల ద్వారా ఏ శబ్దాన్ని వింటున్నా అది జగజ్జనని మంత్రమని భావించు. ఎందుకంటే అక్షరమాల అంతా ఆమెయే. ప్రతి అక్షరంలోను ఆమే నివసిస్తున్నది." ఈ వ్రతంలో, "రామప్రసాదు ఆనందంతో చేసిన గానం – ప్రతిజీవిలోను దివ్యజనని ఉన్నది. వీధులలో తిరుగుతున్నప్పుడు నీవు జగజ్జననికి ప్రదక్షిణం చేస్తున్నావని భావించు!" అంతే. ఇదే ఈ నిష్ఠను పాటించే విధానం. దీన్ని మనస్సులో ఉంచుకుంటే పతనం చెందడానికి అవకాశమే లేదు. సర్వం జగజ్జననియే...

నీవు గీతను గురించి వ్రాసినది యథార్థంగా అనిపిస్తుంది కానీ అది సరికాదు. శ్రీధరస్వామి ఆ విధంగా అర్థం చేసుకుని ఉండవచ్చు. అందువల్ల ఆ విధంగా ఆయన 'గీతాభాష్యం'లో వ్రాసి ఉండవచ్చు. ఆదిశంకరుల భాష్యంలో జ్ఞానానికి ప్రాధాన్యత ఎక్కువగా ఉంది. ఆయన జగత్తును దాటిపోయారు, కాబట్టి ఆయనకు జగత్తు ఆ విధంగా కనిపించింది. శ్రీరామకృష్ణుల అద్వైతం, ఆదిశంకరుల అద్వైతం వేర్వేరు కాదు. అవి రెండూ ఒక్కటే! పాటించే విధానంలో అవి తేడాగా కన్పిస్తాయి. నీ దగ్గర నుండి విపులమైన ఉత్తరం వచ్చిన తర్వాత, ఈ విషయాన్ని గురించి నీకు మరో జాబు వ్రాస్తాను.

వివేకానంద స్వామి ఉత్తరాలు అద్భుతమైనవి. వాటిని చదివేటప్పుడు నాకు కలిగే భావాలను వర్ణించడానికి మాటలు చాలవు. వైరాగ్యానికి అవి పరిపూర్ణ మైన ఉదాహరణలు. సంధ్యాసమయం సమీపిస్తున్నప్పుడు ఆ 'దివ్యశిశువు' తన స్వధామానికి తిరిగి వెళ్ళిపోయాడు. పగలంతా ఆటలోనే గడిపాడు. తర్వాత దానిని పూర్తిగా మరచిపోయాడు. ఆయన ఎల్లప్పుడూ దివ్యజనననినే గుర్తుంచుకున్నాడు. "అమ్మా! నేను వస్తున్నాను!" అనేదే ఆయన దృక్పథం.

ప్రేమతో,

తురీయానంద

(15)

25 ఏప్రియల్, 1912

ప్రియమైన శ్రీధర్ (స్వామి నిరుపమానంద),

నీవు ఏప్రియల్ 19వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది. నా క్రితం ఉత్తరంలోని భావాన్ని అర్థం చేసుకున్నావో లేదో నాకు తెలియదు.

అటువంటి వింత విషయాన్ని ఎందుకు వ్రాశావు? పశువు కంటే మెరుగుగా లేనని ఎందుకు అనుకుంటున్నావు? నీ హృదయంలో ఎంతో భక్తి ఉంది. నీవు అనేకమంది కంటే అదృష్టవంతుడివి, గొప్పవాడివి. మనిషి తనని తాను పనికిరానివాణ్ణని అనుకోకూడదు. భగవంతుడు నిన్ను రక్షిస్తున్నాడనీ, ఆయన నీ సొంతవాడనీ తెలుసుకో – అప్పుడే నీవు పురోభివృద్ధి చెందుతావు.

తాను 'ఎందుకూ కొరగానివాణ్ణని' తలచేవాడు నిజంగానే 'పనికిరానివాడు' అవుతాడని గురుదేవులు చెప్పేవారు. వివేకానంద స్వామి అదే విధమైన సలహా ఇస్తూ, తమనుతాము తక్కువ వాళ్ళమని అనుకోవద్దని చెప్పేవారు. మేము భగవంతునికి చెందినవారమని భావించమని గురుదేవులు మాకు బోధించారు. నీ శరీరాన్నీ, మనస్సునూ భగవంతునికి అర్పించడాన్ని తీవ్రంగా అభ్యాసం చెయ్యి. ఇది నీకెంతో మేలు చేస్తుంది.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద.

(16)

కన్‌ఖల్

29 ఏప్రిల్, 1912

ప్రియమైన శ్రీ.,

నీవు ఏప్రియల్ 21వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది... నీవు కొన్ని రోజులు యోగాశ్రమంలో ఉండడానికి నిశ్చయించుకోవడం చాలా మంచిది. కానీ అశాంతిగా ఉండకుండా, శాంతంగా ఉండు. అలా చేయడం కష్టమే అయినా, అంతరంగంలో భగవంతుని చింతిస్తూ ఉండు. బహుశా, అక్కడి పరిస్థితులు ఆ భగవంతుని స్మరణప్రవాహాన్ని ఆపివేసే విధంగా ఉండివుండవచ్చు. అయినప్పటికీ నీ భగవత్స్మరణాభ్యాసాన్ని అశ్రద్ధ చెయ్యవద్దు. నీ సాధనను హృదయపూర్వకంగా కొనసాగిస్తూ ఉండు.

'గాలివాన చెట్టును ఎంతగా ఊపితే, దాని వేళ్ళు అంతగా గట్టిపడతాయి' – ఈ నియమాన్ని ఎల్లప్పుడూ నీ మనస్సులో ఉంచుకో కష్టాలు, ఆటంకాలు ఎంత ఎక్కువగా ఉంటాయో అంత ఎక్కువగా పట్టుదల యొక్క ఆవశ్యకత ఉంటుంది. తప్పకుండా భగవత్కృప వల్ల సర్వం అనుకూలమవుతుంది. కావలసినదేమంటే ఓర్పు, సుస్థిరత, అచంచలమైన విశ్వాసం. భయపడవద్దు! భగవంతుణ్ణి శరణువేడి, నిరంతరం ఆయన స్మరణలో కాలం గడుపు. అంతా మంచే జరుగుతుంది. దీనిలో సందేహమేమీ లేదు.

ఇక్కడ నేను ఇంకా రెండు, మూడు నెలలు ఉంటాను. కలత చెందవద్దు. భగవంతుడు నిన్నెక్కడ ఉంచినా, అది నీ మంచి కోసమే. ఆయనకు తెలిసినట్లుగా మరెవరికీ తెలియదు. సర్వాన్నీ ఆయనకు వదిలివెయ్యి. నీ కర్తవ్యం ఆయనను మరువకుండా ఉండడమే. ఎక్కడ, ఏ

పరిస్థితిలో నిన్ను ఉంచాలో, నీ చేత ఏమి చేయించాలో, అది ఆయన బాధ్యత. ఆయనను విస్మరించకుండా ఉండడమే నీవు చెయ్యవలసిన పని. ఈ అభ్యాసాన్ని కొంతకాలం కొనసాగిస్తే, ప్రతిదీ నీకు సులభమైపోతుంది. నీవు ఆయనను మరువకుండా ఎల్లప్పుడూ స్మరించేటట్లు చెయ్యమని హృదయపూర్వకంగా ప్రార్థించు. ఆయన సర్వజ్ఞుడు. నిష్కపటంగా, హృదయపూర్వకంగా చేసే ప్రార్థనలకు సమాధానమిస్తాడు.

భవదీయ శ్రేయోభిలాషి,

స్వామి తురీయానంద

(17)

కన్‌ఖల్

5 మే, 1912

ప్రియమైన సురేష్ (స్వామి యతీశ్వరానంద),

ఏప్రిల్ 28వ తేదీన నీవు వ్రాసిన ఉత్తరం అందింది... ప్రధాన వేదాంత గ్రంథాలు: ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు. వీటిని ప్రస్థానత్రయం అంటారు. ఈ మూడు మూలగ్రంథాల యొక్క కూలంకషమైన జ్ఞానం కావాలి. వేదాంతగ్రంథాలు కోకొల్లలుగా ఉన్నాయి. వాటినన్నింటినీ చదవడం కష్టం. పంచదశి, యోగవాశిష్టం, వివేకచూడామణి అనేవి వ్యాఖ్యాన గ్రంథాలు. పంచదశిని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే అద్వైత వేదాంతం మీద చక్కగా పట్టుచిక్కుతుంది. సాధన చెయ్యడం అన్నిటికంటే అవసరం. వేదాంత సత్యాల అనుభూతి కలగడం ముఖ్యం. అది మన సాధన మీద ఆధారపడి ఉంటుంది. శాస్త్రాల అధ్యయనం వల్ల కలిగేది పరోక్ష సహాయం మాత్రమే.

ప్రేమతో,

తురీయానంద

(18)

కన్‌ఖల్

10 జూన్, 1912

ప్రియమైన శ్రీధర్ (స్వామి నిరుపమానంద),

...చాలా రోజుల తర్వాత నీ ఉత్తరం ఈ రోజు అందింది. చాలా సంతోషం కలిగింది. సత్సంగం వల్ల నీ కెల్లప్పుడూ ప్రయోజనమే కలుగుతుంది. నీలోనే ఉన్న ఆ శాశ్వతమైన సత్ (బ్రహ్మం) యొక్క సాంగత్యంలో ఉండడానికి ప్రయత్నించు. బాహ్యజీవితంలో కూడా మనిషికి సజ్జనసాంగత్యం అవసరం – భగవంతుడు దానిని నీకు సమకూర్చుతాడు. హృదయాంతరాళం నుండి నిష్కపటంగాను, వ్యాకులతతోనూ ప్రార్థించాలి. సదా ప్రార్థిస్తూ ఉండు. పరమాత్ముడు నిన్ను సంరక్షిస్తాడు. భయపడవద్దు.

ప్రస్తుతం నీ విధ్యుక్తధర్మాన్ని ఏ మాత్రం లోపం లేకుండా నిర్వర్తించు. తర్వాత భగవంతుడు నిన్ను మరొక పనిలో నియోగించినప్పుడు, హృదయపూర్వకంగా ఆయన ఇచ్ఛానుసారం ప్రవర్తించు. అన్ని పనులలోనూ భగవంతుడి ఇచ్ఛనూ, శక్తినీ చూడడాన్ని నేర్చుకో. ఆ విధంగా చెయ్యడం వల్ల అన్ని చింతలూ వీడిపోతాయి. నీకు వీలు కలిగినప్పుడల్లా శాస్త్రాధ్యయనం, ధ్యానాభ్యాసం చెయ్యి. నీ విద్యాతృష్ణ శ్లాఘనీయం. అది తప్పకుండా నీకు మేలు చేస్తుంది.

ప్రేమ, శుభాశీస్సులతో,

తురీయానంద

(19)

కన్‌ఖల్

18 జులై, 1912

ప్రియమైన ఎస్.,

నీ ఉత్తరం నిన్న అందింది.. నీవు ప్రస్తుతం చేస్తున్నట్లు నీ పారమార్థిక సాధనలు కొనసాగించు. నీ ప్రయత్నాలను, ఏకాగ్రతను సడలించకు. మనస్సు సాధారణంగా మంచి, చెడు అవస్థలను దాటిపోతూ ఉంటుంది. అలా జరగడం నీ పారమార్థిక సాధనలకు అంతరాయం కాకూడదు. నీవు సాధన చేసే కొద్దీ, నీ మానసిక పరిస్థితి మెరుగుపడుతుంది. విచారపడనవసరం లేదు. ఎల్లప్పుడూ సద్భావనలను వృద్ధిచేసుకుంటూ, ఉదాత్తమైన సంభాషణలను చెయ్యడానికి ప్రయత్నించు. అపవిత్రమైన భావనలకు చోటివ్వకు. నీవు ఇంకా చిన్నవాడివే. అందువల్ల జాగ్రత్తగా ఉండాలి. వినయాన్ని అలవరచుకో. ఉత్సాహంతో పొంగిపోవడం, నిరుత్సాహంతో క్రుంగిపోవడం – రెండూ మంచివి కావు. ఒక్క మాటలో చెప్పాలంటే, నిరంతరం భగవంతుణ్ణి స్మరించడం కోసం ప్రయత్నించి, భగవంతుని ఇష్టప్రకారం నడుస్తూ, వినయవిధేయతలతో నీ కాలం గడుపు.

ప్రేమ, శుభాశీస్సులతో,

తురీయానంద

(20)

కన్‌ఖల్

19 జులై, 1912

ప్రియమైన శ్రీధర్ (స్వామి నిరుపమానంద),

నీ ఉత్తరం ఇప్పుడే అందింది.. కొంచెం ఆలోచించి చూస్తే, ఒక్క క్షణం కూడా ఎవ్వరూ మాట్లాడకుండా ఉండలేరని నీవే గ్రహిస్తావు. ఇతరులతో మాట్లాడ నప్పుడు, మనిషి తప్పకుండా తన మనస్సుతో మాట్లాడుతూ ఉంటాడు. ఆలోచన అంటే తనతో తాను మాట్లాడుకోవడమే గాని వేరొకటి కాదు. మాట్లాడకుండా తప్పించుకోవడానికి వీలులేదు.

విషయమిలా ఉన్నపుడు, ఏదో చెత్తను మాట్లాడడం కంటే భగవన్నామాన్ని ఉచ్చరించడం మంచిది కాదా? ఇతరులతో సంభాషించేటప్పుడు, నీవు అనేక విషయాల మీద మాట్లాడాలి. కానీ నీవు ఏకాంతంగా ఉన్నప్పుడు, నీ ఆలోచనలను నిరుపయోగమైన విషయాల మీద ఎందుకు వ్యర్థం చెయ్యాలి? భగవంతుణ్ణి గురించి ఆలోచించడం మంచిది. ఎవరైనా సరే భగవంతుని చింతనలో స్థిరపడడానికి జపాన్ని అభ్యాసం చెయ్యాలి.

జపమంటే భగవంతుని నామాన్ని మళ్ళీ మళ్ళీ స్మరించడం. జపం కంటే ధ్యానం ఉత్తమం. గురుదేవులు, "కర్మకలాపం కంటే జపం మంచిది, జపం కంటే ధ్యానం ఉత్తమం. ధ్యానంలో సిద్ధి పొందినవాడు మోక్షస్థితిని పొందుతాడు," అని చెప్పేవారు. జపాన్ని అభ్యాసం చేస్తున్నప్పుడు, భగవంతుని నామం, వ్యక్తి – ఈ రెండూ ఒకటేనని భావిస్తూ ఉండాలి. ఒక వ్యక్తిని పేరుపెట్టి పిలిస్తే అతని రూపం కూడా వ్యక్తమవుతుంది కదా! ఆ శాశ్వతపురుషుడు మన హృదయంలోనే ఉన్నాడు. కాబట్టి ధ్యానంలో మనిషి ఆనందాన్ని అనుభవిస్తాడు. క్రమంగా ఆ భావన తీవ్రమైతే నీకు జ్ఞానోదయం కలుగుతుంది. అది నెమ్మదినెమ్మదిగా వస్తుంది. ఒక్క రోజులో రావాలని ఆశించవద్దు. ధ్యానంలో ఆనందం కలగడమనేది అంత చిన్న విషయం కాదు.

మనస్సులో డబ్బు గురించి కోరిక వస్తే, "డబ్బు నాకు ఏమి ఇస్తుంది? చాలామందికి డబ్బు ఉంది. కానీ, వారందరూ సుఖంగా ఉన్నారా?" అని విచక్షణ చెయ్యి. గురుదేవులు, "పదార్థంలో నుండి భౌతిక వస్తువులు వస్తాయి. పదార్థం 'సచ్చిదానందాన్ని' (సత్, చిత్, ఆనంద పరబ్రహ్మను) ఇవ్వలేదు. డబ్బుతో ఆహారాన్నీ, దుస్తుల్నీ, ఇతర వస్తువులనూ కొనవచ్చు కానీ, దేవుణ్ణి కొనలేం," అని చెప్పేవారు. ఈ రోజుకు ఇది చాలు.

ప్రేమ, శుభాశీస్సులతో,
తురీయానంద

(21)

కన్‌ఖల్
9 ఆగష్టు, 1912

ప్రియమైన శ్రీ..,

నీవు ఆగష్టు 4వ తేదీ వ్రాసిన ఉత్తరం అందింది... నీవు మంచి ప్రశ్నే వేశావు. నీ ప్రశ్న నీ ఆంతర్యాన్ని సూచిస్తోంది. నీవు క్రమక్రమంగా ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతున్నట్లు కనిపిస్తున్నది. అటువంటి అతీంద్రియమైన విషయాన్ని ఉత్తరం ద్వారా అర్థమయ్యేట్లు చెప్పడం కష్టం. అయినా ప్రయత్నం చేస్తాను.

కుండలినీ శక్తి (వెన్నెముక అట్టడుగున చుట్టచుట్టుకుని ఉన్న శక్తి), ఆత్మ యొక్క జ్ఞానశక్తి. ఆ శక్తి ప్రతి మానవునిలోను ఉంటుంది. ఆమెను (ఆ శక్తిని) చైతన్యమయి, బ్రహ్మమయి వగైరా పేర్లతో పిలుస్తారు. ఆమె ప్రతి జీవిలోను నిద్రిస్తూ ఉంటుంది. ఆమె గుదస్థానం దగ్గర ఉన్న

మూలాధారచక్రంలో ఉంది. మానవదేహంలో షట్చక్రాలు (ఆరు చక్రాలు) ఉన్నాయి. యోగులు వాటి మీద ధ్యానం చేస్తారు. ఇవి కాక ఇడ, పింగళ, సుషుమ్న అనే మూడు నాడులు (నరాలు) కూడా మానవదేహంలో ఉన్నాయి. ఈ కుండలినీ శక్తి పరమశివునిలో (అఖండంతో) ఐక్యం చెందినప్పుడు మనిషి వికాసాన్ని పొందుతాడు.

పరమశివుని స్థానం మెదడులో ఉంది. సర్పిలాకారంగా చుట్టుకుని ఉన్న ఈ కుండలినీశక్తి మేలుకుని, సుషుమ్న నాడి ద్వారా క్రిందదైన మూలాధార చక్రాన్ని దాటి, మెదడులో ఉన్న సహస్రార చక్రాన్ని చేరుకుని, పరమశివునితో ఐక్యం చెందినప్పుడు, మనిషి జ్ఞానోదయాన్ని పొందుతాడు. యోగం, ఉపాసన, ధ్యానం, ఇంకా అనేక ఇతర విధానాల ద్వారా, మనిషి ఈ కుండలినీ శక్తిని జాగృతం చెయ్యవచ్చు. ఆమె మేలుకున్నప్పుడు మనిషి తేజస్సును, దివ్యరూపాలను దర్శిస్తాడు. అతనికి అనేక అద్భుతమైన అనుభవాలు కలుగుతాయి. గురువు అనుగ్రహం వల్ల ఆ శక్తి, తనంతట తానే కొన్నిసార్లు మేలుకుంటుంది.

ఈ ఆరు చక్రాలు ఈ స్థానాలలో ఉన్నాయి. మలవిసర్జన స్థానానికి జననేంద్రియ స్థానానికి మధ్య: జననేంద్రియ స్థాన మూలంలో: నాభి స్థానంలో: హృదయ స్థానంలో: కంఠస్థానంలో: కనుబొమల మధ్య. ఈ ఆరు చక్రాలను వరుసగా మూలాధార, స్వాధిష్ఠాన, మణిపుర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా చక్రాలని పిలుస్తారు. ఇక ఈ మూడు నాడులు ఈ ప్రకారంగా ఉన్నాయి. ఇడ నాడి వెన్నెముక ఎడమ వైపుగాను, పింగళ నాడి కుడి వైపుగాను, సుషుమ్న నాడి వెన్నెముక మధ్యలోను ఉన్నాయి. సుషుమ్నామార్గం మూసి ఉంటుంది. కుండలినీ శక్తి జాగృతమైనప్పుడు ఆ సుషుమ్నా మార్గం తెరుచుకొంటుంది. ఈ రోజుకు ఇంత వరకు చాలు.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(22)

కన్‌ఖల్

31 ఆగష్టు, 1912

ప్రియమైన తేజ్‌నారాయణ్ (స్వామి శర్వానంద),

నీవు ఆగష్టు 21వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది. నీ సమాచారమంతా తెలిసి సంతోషించాను. జీవితం కష్టాలతో నిండి ఉంటుంది. కానీ, తెలివైనవాడు అనేక చికాకుల మధ్యనే తన పనిని స్థైర్యంగా కొనసాగించగలడు. "ఈ జన్మలోని, మరుజన్మలన్నింటిలోని లక్ష్యాలను సాధించుకోవడానికి ఉపయోగించేదే నిజమైన తెలివి.."

మనస్సు పరిశుద్ధంగా ఉంటే, సర్వం అనుకూలమై, చిక్కులన్నీ తొలగి పోతాయి. అనర్థాలన్నింటికీ మూలం మనస్సు. మనస్సు వక్రంగా ఉంటే అంతా ప్రతికూలంగా మారిపోతుంది. "మనస్సు, వాక్కులను ఒకటిగా చెయ్యగలిగిన వారి ప్రతి పారమార్థిక సాధన జయప్రదమవుతుంది," అని గురుదేవులు చెప్పిన బోధలోని అర్థాన్ని నేను రోజులు గడిచేకొద్దీ

మరింత స్పష్టంగా గ్రహించగలుగు తున్నాను. అన్ని సాధనలలోను ఉత్తమోత్తమమైన సాధన మనస్సు, వాక్కులను ఏకం చెయ్యడం. లోపల ఆలోచించేది ఒకటి, బయటికి మాట్లాడేది ఒకటి అయినప్పుడు అన్ని విధాలైన అశాంతులు, బాధలు పెల్లుబుకుతాయి...

నేను అమెరికాలో ఉన్నప్పుడు జరిగిన ఒక సంఘటన చెపుతాను. అప్పుడు నేను న్యూజెర్సీలో, మౌంట్‌క్లేర్‌లోని శ్రీమతి వీలరుగారి గృహంలో బసలో ఉంటున్నాను. ఒక నడివయస్సున్న స్త్రీ ప్రాణాయామాన్ని గురించి బోధిస్తున్నదని విన్నాను. ఆమె రెండు పాఠాలు చెప్పి, ఒకొక్కదానికి అయిదు డాలర్లు వసూలు చేసేది. వివేకానంద స్వామి శిష్యురాలినని ఆమె తనను తాను పరిచయం చేసు కునేది. నన్ను కలవడానికి శ్రీమతి వీలరు ఆమెను తన ఇంటికి ఆహ్వానించింది. ఆమెతో అనేక విషయాలు ప్రసంగించాను. ఆమె మంచి వ్యక్తిగా కనిపించింది. తర్వాత వివేకానంద స్వామిని న్యూయార్క్‌లో కలిసినప్పుడు, మాటల మధ్యలో ఆ స్త్రీ విషయం ప్రస్తావించాను. ఆయనను, "ఆ స్త్రీ మీ శిష్యురాలా? అలా చెప్పుకొంటూ డబ్బు వసూలు చెయ్యడం, మీ పేరుతో వ్యాపారం చెయ్యడం సమంజసంగా ఉందా?" అని అడిగాను. వివేకానంద స్వామి, "నీవు ఆమెను ఒక్కరినే చూశావు. ఆమెలాంటి వాళ్ళు అనేక మంది ఉన్నారు. ఆమె జీవించడానికి కొంత డబ్బు సంపాదించుకోవడం తప్పు కాదు. ఆమె నా ఉపన్యాసాలకూ, తరగతులకూ హాజరై ఉండవచ్చు. ఆమె ముఖాన్ని నేను గుర్తుపట్టగలనేమో గాని ఆమె పేరు నాకు తెలియదు. ఈ విధంగా ఆమె పొట్ట పోసుకోవడం మంచిదే," అని సమాధానం చెప్పారు. ఈ విధంగా వివేకానంద స్వామి ఆమెను గురించి తన సానుభూతిని, కరుణను వ్యక్తం చేశారు. నేను నా సంకుచిత బుద్ధికి సిగ్గుపడ్డాను. వివేకానంద స్వామి యొక్క ఉదారస్వభావం అద్వితీయం, అసామాన్యం. అందువల్లనే ఆయన అంత గొప్ప వారయ్యారు!

నీ రెండు ప్రశ్నలు చాలా కఠినమైనవి. అందులో మొదటిది శ్రాద్ధకర్మను గురించి. మహాభారతంలోని శాంతిపర్వం చదివావంటే దీనిని గురించి నీవు తెలుసుకుంటావు. ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు భీష్ముడు సమాధానమిచ్చాడు. దానినిబట్టి పితృలోకమనే ఒక ప్రత్యేక లోకం ఉంది. అక్కడ పితృదేవతలుం టారు. ఈ శ్రాద్ధకర్మ వారి గౌరవార్థం జరుపబడుతుంది. శాస్త్రాలలో చెప్పబడిన పద్ధతిలో చనిపోయిన తమ పితరులకు వారి బంధువులు ఈ కర్మను ఆచరిస్తారు. చనిపోయిన వారి విషయం తెలియకపోయినా, వాళ్ళు ఆనందిస్తారని భావిస్తూ బంధువులు శ్రాద్ధకర్మ చేస్తారు. ఎందుకంటే వీరికి, మృతులైన వీరి పితరులకు మధ్య మరణానంతరం ఒక సూక్ష్మమైన సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది.

'శ్రాద్ధం' అనే ఈ పదం శ్రద్ధ అనే పదం నుండి ఏర్పడింది. శ్రద్ధ అంటే నిజానికి పరలోకం మీద నమ్మకమే. ఈ లోకం నుంచి వెళ్ళిపోయిన తర్వాత కూడా జీవులు ఇంకా ఉంటారు. కాబట్టి వారి సంతానం తమ పితృదేవతల ఆనందం కోసం ప్రార్థించడం, కర్మలను చెయ్యడం సహజం. ఈ పితృదేవతలు, వారి కర్మానుసారం ఏ లోకంలో ఉన్నా, వారి వంశీయులు ఆహారం, పానీయం అర్పిస్తే సంతృప్తులవుతారు. ఈ సూక్ష్మ సంబంధాన్ని శ్రాద్ధకర్మ

నిలుపుతుంది. శాస్త్రాల భావం ఇదే అని నా అభిప్రాయం. స్మృతిశాస్త్రాలలోని శ్రాద్ధభాగానికి సంబంధించిన సిద్ధాంతాలను చదివితే నీవు మరింత తెలుసుకోవచ్చు.

నీ రెండవ ప్రశ్న వేదాల యొక్క అపౌరుషేయమైన మూలాన్ని గురించి. ఏ మనిషో వ్రాయడం వల్ల వేదాల ఉత్పత్తి జరగలేదు. అందువల్ల అవి శాశ్వతమైనవి. 'వేద' అనే పదానికి అర్థాన్ని తెలుసుకున్నావంటే నీకు సర్వం స్పష్టంగా తెలుస్తుంది. 'వేద' మంటే 'జ్ఞానం' (తెలియబడినది) అని అర్థం. జ్ఞానమంటే ఏమిటి? "జ్ఞానం రెండు రకాలు. ఒకటి శాస్త్రాల నుండి వచ్చే జ్ఞానం. రెండవది, విచక్షణ ద్వారా వెల్లడయ్యే జ్ఞానం. వేదాలు లేదా శబ్దబ్రహ్మం అనే జ్ఞానం శాస్త్రాల విచారణ వల్ల లభిస్తుంది. పరబ్రహ్మాన్ని గురించిన జ్ఞానం విచక్షణ చెయ్యడం వల్ల తెలియబడుతుంది."

జ్ఞానం మనిషి చేత తయారు చెయ్యబడలేదనీ, శాశ్వతమైనదనీ నీవు అంగీకరిస్తే, అప్పుడు నీ అంతట నీవే శాస్త్రజ్ఞానమైన శబ్దబ్రహ్మం లేదా వేదాలు శాశ్వతమైనవనీ, మనిషి చేత అవి సృష్టించబడలేదనీ అంగీకరిస్తావు. నిశ్చయంగా వేదాలు గ్రంథాలు కావు. అవి శబ్దరాశి – కొన్ని భావాలను సూచించడానికి ఉపయోగించబడిన కొన్ని ప్రతీకలు. అదే విధంగా ఒక పేరు నుండి ఆ పేరుగల వ్యక్తిని విడదీయలేం. (పేరును ప్రస్తావించగానే ఆ వస్తువు, వస్తువును గురించి చెప్పగానే దాని పేరు గుర్తుకు వస్తాయి.) ఇక, పేర్లు అనేకమున్నా ఆ పేర్లచే సూచించబడేవాడు ఒక్కడే. అదే విధంగా పరబ్రహ్మానికి వేదాలనే శబ్దరాశి ఒక ప్రతీక. ఒకదాని నుండి మరొక దానిని వేరు చెయ్యడానికి వీలులేని విధంగా అవి జతపరచబడి ఉన్నాయి. మరొకసారి ఈ విషయాన్ని మరింతగా విశదీకరించ డానికి ప్రయత్నిస్తాను. ఈ రోజుకు ఇంత వరకు చాలు.

ప్రేమ, శుభాశీస్సులతో,
తురీయానంద

(23)

కన్‌ఖల్
26 అక్టోబరు, 1912

ప్రియమైన శ్రీధర్ (స్వామి నిరుపమానంద),

నీవు అక్టోబరు 22వ తేదీన వ్రాసిన పోస్టుకార్డు చేరింది... నీ ప్రశ్నలకు ఇప్పుడు జవాబిస్తున్నాను. ఆదిశంకరులు ప్రశ్నోత్తరమాలలో ఇలా వ్రాశారు:

ప్రశ్న: ఎవరు గురువు?

సమాధానం: శిష్యుడికి ఏది ప్రయోజనకరమో దానిని బోధించేవాడు.

ప్రశ్న: ఎవరు శిష్యుడు?

సమాధానం: గురువు నందు భక్తి కలిగి ఉన్నవాడు. అనగా గురువు ఆజ్ఞలను పాలించి, ఆయనను సేవించేవాడు.

'ప్రయోజనం' అనే మాట పారమార్థిక జ్ఞానానికి లేక పరమగమ్యానికి సంబంధించింది. దానికి వ్యతిరేకమైనది 'సంసారం' లేక వ్యావహారిక జీవనం. భగవంతుని వైపు పోవడానికి మనకి దారిచూపి, సంసారతాపాన్ని చల్లార్చేవాడు గురువు. అటువంటి గురువుకు విధేయుడై, ఆయనను సేవించేవాడు శిష్యుడు. గురుశిష్యసంబంధం ఆధ్యాత్మికమైన పితృ-పుత్ర సంబంధం వంటిది. ప్రపంచం లో తండ్రి కుమారుణ్ణి కంటాడు. కానీ గురువు శిష్యుణ్ణి జననమరణచక్రం నుంచి రక్షించి, పరమగమ్యానికి దారి చూపిస్తాడు. సంతానాన్ని కనడం ద్వారా, (ఆ పిల్లలు వంశాన్ని నిలబెడతారు), తల్లిదండ్రులకు దహనక్రియలు గావించడం ద్వారా (ఈ కర్మలు మరణించిన వారి ఆత్మలకు శాంతిని కలిగిస్తాయి) తండ్రి ఋణాన్ని తీర్చవచ్చు. కానీ గురువు మాయాసాగరాన్ని దాటిస్తాడు. కాబట్టి తన సర్వస్వాన్ని సమర్పించినా గురువు ఋణం తీర్చడానికి ఎవరికీ శక్యం కాదు.

మనస్సును ఇంద్రియ విషయాల నుండి విడుదల చేసి, దైవోన్ముఖం చేసే శబ్దాన్ని మంత్రం అంటారు. మంత్రదీక్ష పొందడం ప్రయోజనం: మంత్రాన్ని జపిస్తే, మనస్సు ఇంద్రియ విషయాల నుండి విడిపోయి భగవంతునిలో ప్రతిష్ఠిత మవుతుంది. ఇదే మానవజీవితగమ్యం. ఈ లక్ష్యాన్ని సాధిస్తే మానవజన్మ అర్థవంతమవుతుంది, ధన్యమవుతుంది. లేకపోతే తినడం, నిద్రపోవడం, కుక్కనక్కలలాగా పిల్లల్ని కనడంతో సరిపోతుంది. మనిషి ఈ జననమరణ చక్రంలో కొన్నిసార్లు మనిషిగాను, కొన్నిసార్లు పశువుగాను – అనంతంగా పరిభ్రమిస్తుంటాడు. ఈ మహామాయాచక్రాన్నీ 'సంసారం' అంటారు. కాబట్టి శ్రీకృష్ణుడు కరుణించి గీతలో ఇలా చెప్పాడు: "అశాశ్వతం, దుఃఖమయమైన ఈ లోకంలో జన్మించావు కనుక ఇక నీవు నన్ను భజించు" (గీత: 9.33). కాబట్టి భగవంతుణ్ణి అర్చించకపోతే బాధపడక తప్పదు. ఈ రోజుకు ఇది చాలు.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(24)

రామకృష్ణ అద్వైతాశ్రమం, వారణాసి
27 నవంబరు, 1912

ప్రియమైన సురేష్ (స్వామి యతీశ్వరానంద),

చాలాకాలం తర్వాత వచ్చిన నీ ఉత్తరాన్ని చూసి సంతోషించాను. నీ ప్రశ్నకు ఉత్తరం ద్వారా సమాధానం వ్రాయడం చాలా కష్టం. ఈ ప్రశ్నలు ముఖాముఖి చర్చించడం మంచిది. అయినా ప్రయత్నిస్తాను.

ఒక విత్తనంలో దాని అంకురం, పెరుగుదల, పుష్పించడం మొదలైన 'భవిష్యత్తు వృక్షం' అంతా గర్భితమై ఉన్నట్లుగా ఏ శబ్దం (మాట) పారమార్థిక సాధకునికి, పారమార్థిక శక్తినంతా

కలుగజేసి, పరమసత్యాన్ని సాక్షాత్కరించుకోవడానికి ఉపయోగిస్తుందో దాన్ని బీజమంత్రం అంటారు. యోగి, మహర్షి అయిన రామప్రసాదు ఇలా పాడాడు.

ఓ మనసా! కడు మందబుద్ధివే!
సాగుచేయుటే నీకు తెలియదే!
జీవితక్షేత్రము బీడు వారినది
పదును చక్కగా చేసియున్నచో
గొప్పపంటనే కోయగలవు గద!
కాళీ నామపు కంచెను వేయుము
పంటకు చక్కని రక్షణ కూర్చుము
కంచెలన్నిటిలో గట్టికంచె ఇది
మృత్యువైన ఆ దరికి చేరదు
గురూపదేశపు దివ్యమంత్రమను
మేలు బీజముల నాటి పొలములో
భక్తిశ్రద్ధలతో నీరు పెట్టుము
భారమైనచో రామప్రసాదుని
సాయపడుటకును కోరి పిలువుము

'జీవితమనే పొలంలో', 'గురువు ఉపదేశించిన దివ్యనామం అనే', 'విత్తనాలను నాటుము!', 'భక్తిశ్రద్ధలనే నీరు పెట్టుము!', 'కాళినామమనే కంచె వేయుము!' ఆ విధంగా ఈ ప్రకారంగా ఆధ్యాత్మిక సాధనలు చేస్తూ మనిషి చివరకు తనను తాను పూర్తిగా భగవంతునికి అర్పించుకోవాలి. అదే ఈ పాట అర్థం. గురు దేవులు ఇలా చెప్పేవారు: "రామప్రసాదును సాయమడుగుము"– దీని అర్థం: "నేను ఫలానా రామప్రసాదును అనే ఆత్మభావనను కూడా మరచిపోవాలి."

భగవంతునిలో పూర్తిగా లీనం కావడమే సాధన యొక్క చరమగమ్యం. వివిధ దేవీదేవతలరూపాలన్నీ ఒకే అఖండ బ్రహ్మం నుంచి రూపుదిద్దుకున్న వివిధ స్వరూపాలు. ఆ రూపాలను అనేక పేర్లతో పిలుస్తారు. వివిధ భక్తుల కోరికలను తీర్చడానికి ఆ రూపాలు వేర్వేరుగా వ్యక్తమవుతున్నాయి. కాబట్టి 'బీజమంత్రాలు' కూడా వేర్వేరుగా ఉంటాయి. తంత్రశాస్త్రాలలో ఈ విషయం వివరించబడింది.

హిందూ మతమంతా వేదాల మీదే ఆధారపడి ఉంది. పౌరాణిక, తాంత్రిక, ఇతర సాంప్రదాయాలన్నీ వేదాల నుంచి వచ్చినవే. అందువల్ల అన్ని సాంప్రదా యాల మూలాలు వేదాలలో ఉన్నాయి. వివిధ రకాల భక్తులు అర్థం చేసుకోవ డానికీ, వారికి ఉపయోగపడడానికీ, ఋషులు వివిధ సాంప్రదాయాలను నిర్దేశించారు. అంతే! వారివారి తాత్త్విక సిద్ధాంతాలన్నీ వేదాలలో ఉదహరించ బడ్డాయని శాస్త్రకర్తలు చెపుతారు. వేదాలను

పూర్తిగా అధ్యయనం చెయ్యకుండా “అది వేదంలో లేదు” అని మనం విమర్శిస్తే అది నిస్సందేహంగా పొరపాటే అవుతుంది. శబ్దాలన్నీ ‘ఓం’కారం నుండే ఉద్భవించినట్లు, బీజమంత్రా లన్నీ ఓంకారానికి చెందినవే. ఈ విషయాన్ని ఎవరు కాదనగలరు? కొంతమంది ‘అనాహతధ్వని’ని విన్నామనీ, కొంతమంది బీజమంత్రాలను స్వర్ణాక్షరాలతో చూశామనీ చెప్పడం విన్నాను. బీజమంత్రం ఓంకారంలో లీనమవుతుందో లేదో నాకు తెలియదు. కానీ మంత్రం, మంత్రాధిష్ఠాన దేవత ఒకటేనని నాకు తెలుసును. మంత్రం అధిష్ఠానదేవత యొక్క శరీరం వంటిది. ప్రశ్నించడం వల్ల ఈ విషయాలు తెలియవు. మనిషి ఆధ్యాత్మిక సాధనలు చెయ్యాలి. అప్పుడు గురువు అనుగ్రహం వల్ల అతడు వాటిని సాక్షాత్కరించుకుంటాడు.

‘సిద్ధి’ లేక ‘భంగు’ అని పలికినంత మాత్రాన మత్తు కలగదని గురుదేవులు అనేవారు. దాన్ని తెచ్చి, ‘భంగు’ తయారుచేసి, త్రాగితేనే మత్తు కలుగుతుంది. ఆ సమయంలో ‘జై కాళీ’, ‘జై కాళీ’ అని అంటూ త్రాగినవాడు గంతులు వేస్తాడు. ఎల్లకాలం తర్కించడం మంచిది కాదని శాస్త్రాలు కూడా చెపుతున్నాయి. మొదట్లో అర్థం చేసుకోవడం కోసం ప్రశ్నలు వెయ్యాలి. కానీ, నీవు సాధన చేస్తూ ఉంటే, నీ ప్రశ్నలు వాటంతట అవే సమసిపోతాయి. సాధన లేనిదే, ప్రశ్నించడాన్ని ఆపడం అసాధ్యం.

లోపలి నుండే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నట్లు, సాధన ద్వారా సత్యదర్శన మైనప్పుడు, వాటికి సమాధానాలు కూడా లోపల నుంచే వస్తాయి. దీనిని శాంతి లేక పరిపూర్ణ విశ్రాంతి లభించడం అని అంటారు. భగవదనుగ్రహం పొందిన వాడే దీన్ని తెలుసుకుంటాడు. ఎన్ని చర్చలు చేసినా ఈ స్థితి కలుగదు – ఇది శాస్త్రనిర్ణయం. “ఈ ఆత్మ వేదాధ్యయనం వల్ల లభ్యం కాదు” (కఠోపనిషత్తు, 1.2.23). అటువంటి వందల శాస్త్రవచనాలు ఈ సత్యాన్ని ధ్రువపరుస్తున్నాయి. లేచి ముందుకు ఉద్యమించు, తప్పకుండా నీ మీద భగవంతునికి కృప కలుగుతుంది. అప్పుడు, నీవు దివ్యజనని వైభవాన్ని కీర్తించి, పరమానందాన్ని అనుభవిస్తావు. ఇక ఈ రోజుకు చాలు.

ప్రేమ, శుభాశీస్సులతో,
తురీయానంద.

(25)

రామకృష్ణ అద్వైతాశ్రమం, వారణాసి
14 డిసెంబరు, 1912

ప్రియమైన శ్రీధర్ (స్వామి నిరుపమానంద),

నీవు డిసెంబరు 10వ తేదీ వ్రాసిన ఉత్తరం అందింది... భగవచ్చింతన ఎన్నడూ మానవద్దు. నీకు ఆనందం కలిగినా, కలుగకపోయినా క్రమవిధానంలో నిత్యం ధ్యానం చేస్తూనే ఉండు. వదలకుండా, స్థిరంగా అభ్యాసం చెయ్యగలిగితే మళ్ళీ నీవు ఆనందాన్ని అనుభవిస్తావు. వ్యాసమహర్షి ఇలా చెప్పారు: “పైత్యరసం ప్రకోపిస్తే చక్కెర రుచించదు. కానీ, శ్రద్ధగా

ప్రతిరోజూ చక్కెర తింటూ ఉంటే, పైత్యప్రకోపం నయమై పంచదార రుచిని ఆనందించడం నెమ్మదినెమ్మదిగా ప్రారంభిస్తావు." ఇదే విధంగా 'అవిద్య' లేక అజ్ఞానం వల్ల పారమార్థిక సాధనలు రుచించవు. కానీ జపధ్యానాలు వదలకుండా నిత్యం ప్రేమ, ఉత్సాహాలతో చేస్తూ ఉంటే అజ్ఞానం వల్ల కలిగిన విషాదం నశించి, భగవత్ప్రేమ (భక్తి) జనిస్తుంది. కాబట్టి ఎన్నడూ ఆధ్యాత్మిక సాధనలు వదలవద్దు. మరింత హృదయపూర్వకంగా వాటిని కొనసాగిస్తూ ఉండు. చివరకు వాటి నుండి ఆనందాన్ని పొందుతావు.

కర్మఫలాల గురించి ఎందుకంత శ్రద్ధ చూపిస్తావు? నీ పనులను చేస్తూ ఉండు. ఈ లోకంలో యజమాని తన ఉద్యోగస్తులకు జీతం ఇస్తూనే ఉంటాడు. తన కోసం పనిచేస్తున్న నీకు భగవంతుడు ఏమీ ఇవ్వకుండా ఉంటాడా? నీ ధర్మాన్ని నీవు నిర్వర్తించు. "నేనేమీ సాధించలేదు" అనీ, "నేనేమీ అభివృద్ధి చెందలేదు" అనీ ఫిర్యాదులు చేసి ఏమి సాధిస్తావు? ఈ ఫిర్యాదులకు బదులు శాంతంగా నీ పని నీవు చేసుకుపోతూ ఉంటే ఫలితం దానంతటదే వస్తుంది. యోగి అయిన రామప్రసాదు ఇలా పాడాడు.

పలు తరాలుగా వ్యవసాయమ్మును
నమ్మిన కర్షకు బోలు రీతి నువు
మనస్ఫూర్తిగా కర్మ చేయుచును
మానబోకు నీ ప్రయత్నమ్ములను
అట్టి యత్నమే బంగరు పంటను
తప్పక హెచ్చుగ నీకే ఇచ్చును

అంతే! ఓర్పు అవసరం. విత్తనం నాటగానే పంట పండుతుందా? ఓర్పు కలిగి ఉండు. ఎంతో శ్రమపడ్డ తర్వాత – అంటే విత్తనాన్ని రక్షించి, నీరు పెట్టి, కలుపుతీసి, చీడపీడల నుండి రక్షించి, పశువుల నుండి రక్షించడానికి కంచె వేసి – ఇన్ని చేసిన తర్వాత మనిషి పంట కోసుకుంటాడు. ఇంతకంటే ఏమి చెప్పను?

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(26)

వారణాసి
29 డిసెంబర్, 1912

ప్రియమైన శ్రీధర్ (స్వామి నిరుపమానంద),

నీ డిసెంబరు 22వ తేదీ జాబు చేరింది. అవిద్య లేక అజ్ఞానం అనేది కామక్రోధాలకు నెలవు. పతంజలి ఆ అవిద్యను ఇలా వర్ణించాడు: "అనిత్యాన్ని నిత్యంగానూ, అపవిత్రతను పవిత్రతగానూ, దుఃఖాన్ని సుఖంగానూ, అనాత్మను ఆత్మగానూ భావించడమే అజ్ఞానం" (పతంజలి యోగసూత్రాలు, 2.5).

మరోమాటలో చెప్పాలంటే, అశాశ్వతమైన లోకాన్ని శాశ్వతమైనదిగానూ, అపవిత్రమైన శరీరాన్ని పవిత్రమైనదిగానూ, బాధాకరమైన ఇంద్రియభోగాల్లో సుఖమున్నట్లుగానూ, తనకు చెందని ఇతరులను – భార్యాబిడ్డలను – తన సొంతవారు గానూ భావించడమే అజ్ఞానం. ఈ తప్పుడు భావనలు అజ్ఞానం వల్ల కలుగుతాయి. ఈ అవిద్య అనాదిగా ఉన్నదే. దానికి మూలం, అంతం ఏమిటో కనుక్కోలేము. అంటే భగవంతుని కరుణ వల్ల జ్ఞానోదయాన్ని పొందే వరకు అవిద్య నిలిచి ఉంటుంది, నశించదు. ఈ అవిద్య మనల్ని భగవంతుని వైపు పోనివ్వదు. కాబట్టి గీతలో కృష్ణుడు ఇలా చెప్పాడు. "నన్ను శరణువేడినవారు మాత్రమే ఈ మాయను దాటుతారు" (గీత: 7.14). మన కర్తవ్యమేమంటే భగవంతుణ్ణి శరణువేడి, దైవమే లక్ష్యంగా జీవితాన్ని గడపడం.

వివేకానంద స్వామి చెప్పినది సత్యం. "భగవద్భక్తి అందరిలో అంతర్గతంగా ఉన్నది. కామకాంచనాల ముసుగు తొలగినప్పుడు ఆ భక్తి దానంతట అదే బయటపడుతుంది." ఆ ముసుగును తొలగించడానికి చేసే ప్రయత్నాన్నే సాధన లేక ఆధ్యాత్మిక శిక్షణ అంటారు. ఈ ముసుగు తొలగినప్పుడు, కుండలినీ శక్తి మేలుకుంటుంది. నీ మనస్సును అన్ని విషయాల మీదికీ పోనిస్తే ఏదీ సాధ్యం కాదు. నీకు ఇష్టమైన మార్గాన్ని గట్టిగా పట్టుకుని, దాని ద్వారా మాత్రమే ముక్తిని, భక్తిని పొందగలవని తీర్మానించుకో. అప్పుడే నీవు జయాన్ని పొందగలవు.

నేను నీకు అనేకసార్లు చెప్పాను. అయినా నీవు నా మాట వినడం లేదు. అందువల్ల ఇప్పుడు నేనేమి చెయ్యగలను? నీ ఇష్టప్రకారం చెయ్యి. నీ గురువును ఎన్నుకోవడానికి, పారమార్థిక సాధనలు చేపట్టడానికి నీకు సంపూర్ణమైన స్వతంత్రం ఉంది. కాబట్టి ఈ విషయంలో దయచేసి ఇక నన్నేమీ ప్రశ్నించవద్దు. ఒక్కసారి కాదు, అనేకసార్లు నీకు ఇలా వ్రాశాను: "ఎవరికి విశ్వాసం, ఉత్సాహం ఉంటాయో, ఇంద్రియాలను ఎవరు జయించారో, వారికి జ్ఞానం లభిస్తుంది. జ్ఞానాన్ని పొందిన తర్వాత త్వరలో పరమశాంతిని పొందుతారు" (గీత: 4.39). "శ్రద్ధలేని అజ్ఞాని ఎల్లప్పుడూ సంశయిస్తూ వినాశం చెందుతాడు. అనుమానించే వాడికి ఈ లోకంలోగానీ, పరలోకంలోగానీ, సుఖం ఉండదు" (గీత: 4.40). ఇవి భగవంతుడు చెప్పిన మాటలు. ఇక నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి.

ప్రేమ, శుభాశీస్సులతో,
తురీయానంద

(27)

వారణాసి,
10 జనవరి, 1913

ప్రియమైన శ్రీ..,

మానవులు సాధారణంగా చాలా స్వార్థపరులుగా నాకు కనిపిస్తారు. అన్నీ తమ కోసమే జరగాలని ఆశిస్తారు, కానీ శ్రమపడడానికి ఇష్టపడరు. ముఖ్యంగా పారమార్థిక విషయాలలో

ప్రతివారు తక్షణమే పరిపూర్ణత చెందాలని వాంఛిస్తారు. కానీ, దాని కోసం ప్రయత్నించడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు? పూర్వజన్మల నుండి ఎన్ని చెడు సంస్కారాలు వారి మనస్సులలో గూడుకట్టుకుని ఉన్నాయో వారు గ్రహించరు. ఆ సంస్కారాలు ఒక ముసుగులాగా వారివారి ఆత్మలను దర్శించనివ్వవు. ఎంతో కష్టపడి ఈ సంస్కారాలను తొలగించుకున్నప్పుడు మాత్రమే వారిలో జ్ఞానం లేక భక్తి వ్యక్తమవుతుంది.

భవదీయ, శ్రేయోభిలాషి,

తురీయానంద

(28)

రామకృష్ణ అద్వైతాశ్రమం, వారణాసి

20 ఫిబ్రవరి, 1913

ప్రియమైన సురేష్ (స్వామి యతీశ్వరానంద),

ఫిబ్రవరి 9వ తేదీన నీవు వ్రాసిన ఉత్తరం అందింది... మనిషి కేవలం ఒక యంత్రం. భగవంతుడు దానిని నడిపేవాడు (యంత్రి). ఎవరి ద్వారా భగవంతుడు తన పనిని నెరవేర్చుకుంటాడో, అతడు ధన్యాత్ముడు. ఈ లోకంలో ప్రతివారు పనిచెయ్యాల్సిందే, ఎవ్వరూ దాని నుండి తప్పించుకోలేరు. కానీ, స్వార్థ ప్రయోజనాల కోసం చేసేవాడి పని మాయాజాలం నుండి అతన్ని తప్పించదు. మరింతగా బంధిస్తుంది. దానికి మారుగా జ్ఞానవంతుడు భగవంతుని కోసం తన బాధ్యతలను నిర్వర్తిస్తూ బంధాలను ఖండించి వేస్తాడు. 'నేను కర్తను కాదు, భగవంతుడే కర్త' అనే జ్ఞానం బంధాలను తెంచివేస్తుంది. ఇది సత్యమైన సిద్ధాంతం. నేను కర్తను అనే భావన కేవలం భ్రాంతి మాత్రమే. ఎందుకంటే నేను అనేది ఎవరో గుర్తించడం దుస్సాధ్యం కాబట్టి. ఈ నేను అనేది ఏమిటో జాగ్రత్తగా విశ్లేషించి చూసినప్పుడు అది భగవంతుడిలో లీనమైపోతుంది. శరీరం, మనస్సు, బుద్ధి, తదితరాలతో మనం తాదాత్మ్యం చెందడం కేవలం అజ్ఞానం వల్ల ఏర్పడే భ్రాంతి. అవి శాశ్వతంగా ఉంటాయా? వీటినన్నింటినీ వివేకం అంతం చేస్తుంది. అవన్నీ అదృశ్యమై పోతాయి. ఎవరి నుండి ఈ సమస్తమూ ఉత్పన్నమైందో, ఎవరిలో ఇది ఉంటున్నదో, చివరకు ఎవరిలో లీనమై పోతుందో ఆ ఏకైక సత్యం మాత్రమే నిలిచి ఉంటుంది. ఆ సత్యం – సచ్చిదానందం లేక పరబ్రహ్మం. 'అహం' భావానికి అది సాక్షి. అంతా వ్యాపించివున్న భగవానుడే సృష్టి స్థితి లయ కారకుడు. అయినా వాటి చేత అతడు స్పృశింపబడడు – నిరంజనుడు.

ఈ లోకమనే యంత్రం భగవంతుని మీద ఆధారపడి ఉంది. ఆయన శక్తి ద్వారా పనిచేస్తున్నది. ఈ లోకం ద్వారా క్రీడ సలుపుతున్న ఆ భగవంతుడు, తన క్రీడను చూస్తూ వినోదిస్తున్నాడు. దీనిని ఎవరికి అర్థమయ్యేలా భగవంతుడు చేస్తాడో, అతడు మాత్రమే దీనిని తెలుసుకోగలుగుతున్నాడు. ఇతరులు దీనిని గురించి విన్నప్పటికీ అర్థం చేసుకోలేరు. వారు వ్యామోహంలో పడి, తాము భగవంతుని కన్నా వేరని తలుస్తూ ఉంటారు. ఇది భగవంతుని

మాయ. భగవంతునికి శరణాగతుడై మనిషి పని చేసినప్పుడు ఈ మాయ అదృశ్యమై పోతుంది. అప్పుడు తాను నిజంగా కర్తను కాదనీ, కేవలం యంత్రాన్ని మాత్రమేనన్న అనుభూతిని పొందుతాడు. 'కర్మలో అకర్మ' అంటే ఇదే. తానేదీ చెయ్యడం లేదని తెలుసుకోవడం – ఇదే జీవన్ముక్తి. శరీరంలో జీవించి ఉండగానే ముక్తి పొందడంలోని ఆనందాన్ని అనుభవించడానికే ఆత్మ మానవరూపాన్ని దాల్చి జీవన్ముక్తుడిగా జన్మిస్తుంది. లేకపోతే 'నిత్యముక్తమైన ఆత్మ' ప్రాపంచిక సుఖాలు అనుభవించడానికే పుట్టడమనేది న్యాయసమ్మతమైన విషయం కాదు. 'శరీరం లేని స్థితిని, శరీరం ఉండగానే అనుభవించడమే మానవజీవితం యొక్క పరమగమ్యం.' ఈ స్థితిని పొంది మనిషి జీవితసాఫల్యతను పొందుతాడు. గురుదేవుల కరుణవల్ల మనం ఆ జీవన్ముక్త స్థితిని ఈ జీవితంలోనే రుచి చూడాలని ఆయనను ప్రార్థిస్తున్నాను. ఇదే మనకు ఆఖరి జన్మ అగుగాక! అంటే స్వార్థప్రయోజనాల కోసం మళ్ళీ మనం జన్మించకుండా ఉండాలి! ఆయన కోసమే తప్ప వేరేదాని కోసం మనం జీవించకుండా ఉండాలి! ఈ నమ్మకం, విశ్వాసం, అనుభవం మన జీవితాలలో దృఢంగా వేళ్ళూనుకోవాలి! గురుదేవులు మన యెడల కరుణాళువై ఉందు గాక!

నీకు, ఇతరులందరికీ ప్రేమతో,

తురీయానంద

(29)

కన్‌ఖల్

14 మే, 1913

ప్రియమైన సురేష్ (స్వామి యతీశ్వరానంద),

నీవు మే 6వ తేదీన వ్రాసిన ఉత్తరం అంది సంతోషించాను. "మనిషి తనను తాను ఉద్ధరించుకోవాలి! తనను తాను అధోగతిపాలు చేసుకోకూడదు! ఎందుకంటే తనకు తానే మిత్రుడు, తనకు తానే శత్రువు" (గీత: 6.5).

మీ మిత్రుడైన ఎస్..కు ఈ విషయం జ్ఞాపకం చెయ్యి. 'తండ్రి, తల్లి, భార్య, కుమారుడు, బంధువులు – వీరెవ్వరూ పరలోకంలో నీకు సహాయపడరు. ధర్మం (సచ్ఛీలం) ఒక్కటే నిలిచి ఉంటుంది.' ఈ విషయాన్ని అతడు పూర్తిగా అవగాహన చేసుకోవాలి. భగవంతుడే నీకు తోడు. భయపడవద్దు. బాధలన్నీ తొలగి పోతాయి. స్థిరంగా ఉండి, గురుదేవుల యందు భక్తి కలిగివున్నప్పుడు భయపడవలసినదేదీ లేదు.

శుభాశీస్సులతో,

తురీయానంద

(30)

రామకృష్ణ సేవాశ్రమం, కన్‌ఖల్
23 మే, 1913

ప్రియమైన ఎస్.,

నీవు మే, 17వ తేదీన వ్రాసిన ఉత్తరాన్ని అందుకుని ఆనందించాను. వారణాసి నుండి కన్‌ఖల్ వచ్చిన తర్వాత కొంచెం కులాసాగా ఉంది. కానీ, వ్యాధి ఏమాత్రం తగ్గినట్లు అనిపించడం లేదు...

మనకు ఏది జరగవలసివుందో అదే జరిగింది. ఇప్పుడు మీరందరు లేచి నిలబడి, జగజ్జనని పనిచేస్తూ ధన్యత చెందాలని వాంఛిస్తున్నాను. 'తన ముక్తి కోసం, పరుల హితం కోసం మనిషి తన జీవితాన్ని గడపాలి!' అనే వివేకానంద స్వామి సందేశాన్ని మీ జీవితాలలో సార్థకమవ్వనివ్వండి. నీ మనస్సు స్థిరంగా ఉందనీ, గట్టి నిర్ణయాలు తీసుకోగలుగుతున్నదనీ తెలిసి సంతోషిస్తున్నాను. కావలసింది అదే! ఒక ఉత్తమమైన ఆదర్శానికి జీవితాన్ని సమర్పించడం కన్న గొప్ప విషయం ఇంకేమైనా ఉందా? "చావు తప్పనప్పుడు జీవితాన్ని ఒక మహత్తర ప్రయోజనం కోసం త్యాగం చెయ్యడం మంచిది కాదా?" (హితోపదేశము:3). అటువంటి ఉపదేశాలు కేవలం పుస్తకాలకే పరిమితమై ఉండాలా? నీ జీవితంలో వాటిని ఆచరణలోకి తీసుకురావా?

నీవు సరైన పని చేశావు. (బహుశా 'ఎస్..' మఠంలో చేరి ఉంటాడు.) అన్ని విషయాలనూ విని, తెలుసుకున్న తర్వాత కూడా నీవు అలా చేయకపోతే నీ జ్ఞానమంతా అజ్ఞానమైపోయేది. ఏ బలహీనతనూ నీ దగ్గరికి రానీయకు. గురుదేవుల యొక్క, వివేకానంద స్వామి యొక్క ఆదర్శాన్ని నీ ముందుంచుకుని, నిర్భయంగా ముందుకు సాగిపో! దిగులు పడవద్దు! జగజ్జనని తానే నిన్ను రక్షిస్తుంది. నీవు కొంచెం ఆలోచిస్తే, తానే నిన్ను సర్వదా కాపాడుతూ ఉందని తెలుసుకోగలవు. దివ్యజనని నీ చెయ్యి పట్టుకుని కాపాడకపోతే, ఇంతకాలం ఇలా ఏ మాత్రం చెక్కుచెదరకుండా ఉండగలిగే వాడివేనా? కానే కాదు. దివ్యజనని తానే నీకు మార్గాన్ని సుగమం చేసి, తన దరికి రప్పించుకుంది. కాబట్టి, ఎందుకు భయపడతావు? ఇప్పుడు ఆమెతో నీ సంబంధబాంధవ్యాలను తీవ్రతరం చేసుకో. మొదట 'సంసార బంధాలన్నిటినీ నేను తెగతెంచుకున్నాను', అనే విషయాన్ని తెలుసుకో. అప్పుడు జగజ్జనని స్వయంగా తానే, కృపతో, ఈ విశ్వంలో ఆమె తప్ప మరేమీ లేదని నీకు తెలియజేస్తుంది. "అదే రాముడు అన్ని జీవులలో క్రీడిస్తున్నాడు." అన్నింటిలో జగజ్జనని వ్యాపించి ఉంది. "బ్రహ్మ మయి, దివ్యజనని సర్వత్రా వ్యాపించి ఉంది. గంగ, గయ, కాశీ, మొదలైనవన్నీ ఆమె పాదారవిందాల వ్రాలనున్నాయి," అని అమ్మ నీకు తెలియ జేస్తుంది. ఈ విధమైన అనుభవం కలిగినప్పుడు నీవు ఉత్తమోత్తమమైన స్థితికి చేరినట్టే! ఆ సమయంలో 'అహం' (నేను) అనే భావం – అదృశ్యమవుతుంది. అప్పుడు మనిషి సర్వం దేవీమయమనే అనుభూతిని పొందుతాడు.

ఇప్పుడు నీవే చెప్పినట్లుగా భగవద్భక్తుల సాంగత్యంలో ఆనందాన్ని నీవు చూడగలగాలి. వారు నిన్ను భగవంతుని వైపుకు గొనిపోతారు. భగవంతునికి నిన్ను దూరం చేసేవారి చెంతకు చేరవద్దు. వారికి దూరంగా ఉండు. ఇప్పుడు అన్ని బంధుత్వాలూ, సంబంధాలూ జగజ్జనని ద్వారానే. ఇతరులెవ్వరి ద్వారా కాదు. ఈ విషయాన్ని ఇప్పుడు అన్ని విధాలా అనుభవానికి తెచ్చుకోవడానికి ప్రయత్నించు: "నేను అమ్మకు చెంది ఉన్నాను, అమ్మ నాకు చెందింది – ఈ విషయాన్ని నేను నా హృదయంలో తెలుసుకున్నాను." దీన్ని సాధించడానికి అవసరమైతే నీ చేత్తో నీ హృదయాన్నే ఊడపెరకడానికి కూడా సిద్ధంగా ఉండాలి. నీవు తెలివైనవాడివి. ఇంకా ఎక్కువేమి చెప్పేది?

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(31)

కన్‌ఖల్

25 భాద్ర (ఆగష్టు), 1913

ప్రియమైన ఎక్స్.,

నీవు 18 భాద్ర (ఆగష్టు) 1913న వ్రాసిన ఉత్తరం అందింది. భగవద్గీత సారాంశాన్ని గురించి వ్రాయమని కోరావు. గీతను గురించి శ్రీరామకృష్ణులు ఏమి చెప్పారో నీకు తెలిసే ఉంటుంది. గురుదేవులు ఈ విధంగా చెపుతుండే వారు: "మనిషి గీత అని పదేపదే ఉచ్చరిస్తే దాని అర్థాన్ని అతడు అవగాహన చేసుకుంటాడు. అంటే నీవు గీతా గీతా గీతా అని ఉచ్చరిస్తే, అది తాగీ తాగీ తాగీ అని ధ్వనిస్తుంది. తాగీ అంటే త్యాగం చేసిన వాడు అని అర్థం." కాబట్టి గీత యొక్క సారాంశం త్యాగం. నిజానికి ఎవరైనా, గీతను అధ్యయనం చేసిన తర్వాత, గీత యొక్క ప్రధానమైన బోధ "సర్వాన్నీ భగవంతునికి అర్పించు!" అని అర్థం చేసుకుంటారు.

స్వధర్మాన్ని ఆచరించడమే (అంటే తన బాధ్యతలను నిర్వర్తించడమే) గీతా సందేశమని కొందరంటారు. అనగా తన ధర్మాన్ని కోరికలు లేని బుద్ధితో ఆచరించి, ఆ కర్మఫలాన్ని భగవంతునికి సమర్పించడం. నేను చెప్పేదేమంటే, ఈ రకంగా చెయ్యగలిగితే, మనిషికి ఇంకా కావల్సిందేమిటి? భగవంతుడు గీతలో స్వయంగా ఇలా చెప్పాడు: "నీవు ఏమి చేసినా, ఏది భుజించినా, యజ్ఞంలో ఏది అర్పించినా, ఏది దానం చేసినా, తపస్సు రూపంలో నీవు ఏది అభ్యాసం చేసినా, ఓ కుంతీపుత్రా! దానిని సమర్పణ బుద్ధితో నాకు అర్పించు" (గీత: 9.27). అనగా దేనినీ నీ కోసం ఉంచుకోకు. కానీ, అది అంత సులభమైన పనేనా? కానేకాదు. దాని కోసం అఖండమైన ప్రయత్నం చెయ్యాలి: అది దానంతట అదే జరిగే పని కాదు. కానీ, నిరుత్సాహం చెందనవసరం లేదు. భగవానుడు ఇలా చెప్పాడు: "అనేక జన్మల ద్వారా పరిపూర్ణతను పొంది యోగి అయినవాడు పరమగతిని పొందుతున్నాడు" (గీత: 6.45). ఈ జన్మలోనే ఆ గమ్యాన్ని పొందలేకపోతే, మరో జన్మలో లభిస్తుంది. అయితే, గమ్యాన్ని ఏ

మాత్రం విస్మరించకుండా ఉండాలి. అభ్యాసం చేస్తూ ఉండాలి. ఏదో ఒకరోజు సిద్ధి కలిగి తీరుతుంది. మనిషి తన ఆఖరుజన్మలో దైవీసంపదతో (దివ్యలక్షణాలతో) జన్మిస్తాడు. అతని సంస్కారాలు, స్వభావాలు అన్నీ మంచివిగా ఉంటాయి. అతడు తప్పకుండా దైవసాక్షాత్కారం పొందుతాడు.

నా అభిప్రాయం ప్రకారం గీతాసారాంశమేమంటే, 'అహం' భావాన్ని పూర్తిగా తొలగించి భగవంతునికి శరణాగతుడవ్వడమే. పూర్తిగా భగవంతునికి చెంది ఉండడం – ఏ మాత్రం తన మీద గాని, ఇతరుల మీద గాని, ఆధారపడకుండా ఉండడం – రూఢిగా ఇదే గీత యొక్క ప్రధాన ఉపదేశం. మనిషి దీనిని ఏ విధంగా సాధించినా ఫర్వాలేదు. అతని జీవితం సార్థకత చెందుతుంది. భగవంతుడు పరమదయాళువు. మనం ఆయన మీద ఆధారపడితే, మనకేది అవసరమో దానిని ఆయనే మనకు ఇస్తాడు. గీతలో కృష్ణుడు ఇలా వాగ్దానం చేశాడు: "నా భక్తుడెన్నడూ నశించడు" (గీత: 9.31). గీతలో మరొక ఉత్తేజకరమైన బోధ కూడా ఉంది: "మంచిపని చేసేవాడు ఎన్నడూ దుర్గతిని పొందడు" (గీత: 6.40).

ప్రేమ, శుభాశీస్సులతో,
తురీయానంద

(32)

కన్‌ఖల్
27 సెప్టెంబరు, 1913

ప్రియమైన ఎక్స్.,

నీవు ఆశ్వయుజమాసం 4వ తేదీన (సెప్టెంబరు, 1913) వ్రాసిన ఉత్తరం అందింది.. గీత మీద నేను చేసిన వ్యాఖ్యానాలను చదివి నీవు ఆనందించావని తెలిసి సంతోషించాను. "నీవు ఏది చేసినా, ఏది అనుభవించినా...వగైరా" (గీత: 9.27) అనే శ్లోకానికి నీవు వ్రాసిన తాత్పర్యం సరిగానే ఉంది. దాని భావమేమంటే: తాను కేవలం ఒక పనిముట్టునని, భగవంతుడే పని చేయించే వాడని తలచడం. మరో భావం కూడా ఉంది: భగవంతుడే అన్నింటిగా మారి, ప్రతిజీవిలోనూ ఉండి ఈ ఆటలన్నీ ఆడిస్తున్నాడు. ఇదే విధంగా అనేక రకాలైన వివరణలున్నాయి. అల్పమైన అహంకారాన్ని నశింపజేయడమే ఈ భావాలన్నింటి ఉద్దేశ్యం. అల్పమైన అహంభావమే అన్ని అనర్థాలకు, అజ్ఞానానికి మూలకారణమని దృఢంగా తెలుసుకో.

శరణాగతి (ఆత్మసమర్పణ) అంటే: నన్ను భగవంతుడు ఎక్కడ ఉంచినా అది నా మంచి కోసమేనని భావిస్తూ సంతృప్తితో జీవించడాన్ని అభ్యాసం చెయ్యడం: తన సంకల్పాన్ని భగవంతుని సంకల్పంతో ఒకటిగా చెయ్యడం: రెండుగా కనిపించే సుఖదుఃఖాలు, లాభనష్టాలు మొదలైన వాటన్నింటినీ ఒకే రకంగా చూసే బుద్ధిని అలవరచుకోవడం. మరో రకంగా చెప్పాలంటే, ముక్తి పొందిన తర్వాతనే మనిషి పరిపూర్ణమైన శరణాగతిని

సాధించగలడు. అలా చెయ్యగలగ డానికి ముందు ఎడతెగని యోగాభ్యాసం చెయ్యాలి. భగవంతునికి యథార్థమైన ఆత్మసమర్పణ చేసుకోవడమే ముక్తి. ఈ విధమైన శరణాగతిని హృదయపూర్వకం గా, కపటం లేకుండా అభ్యసిస్తే భగవత్కృప వల్ల మనిషి ముక్తిని పొందుతాడు.

త్యాగాన్ని గురించి ఉదహరించావు. ఈ విషయంలో గురుదేవులు, "గృహిణి మొదట్లో ఇంట్లోని పనులన్నీ చేస్తూ, బరువైన పనులు కూడా చాలా చేస్తుంది. కానీ ఆమె గర్భం ధరించినప్పుడు ఆమె అత్తగారు క్రమక్రమంగా కోడలి బాధ్యతలను తగ్గించి వేసి, ఎక్కువ పని చెయ్యనివ్వదు. చివరికి బిడ్డను కన్న తర్వాత అసలు ఏ పనీ చెయ్యనివ్వదు. ఆమె పని అంతా బిడ్డను చూసుకుంటూ, ఆ బిడ్డను పోషించడమే. బిడ్డ సుఖమే ఆమె సుఖమవుతుంది," అని చెప్పేవారు. గర్భవతి కావడమంటే భగవంతుణ్ణి హృదయంలో ప్రతిష్ఠించుకోవడం, బిడ్డను కనడమంటే దైవసాక్షాత్కారం.

మరొక భావముంది: భగవంతుడి గుమ్మం వద్ద నిలిచివుండి, ఆయన అనుగ్రహం కోసం వేచిచూడడం. కపటం లేకుండా ఉంటే నీ మీద భగవంతునికి కరుణ కలుగుతుంది. గురుదేవులు దీన్ని పిల్లికూన కథతో (మార్జాలకిశోర న్యాయంతో) వివరించారు. పిల్లికూన తనకు తానుగా ఏ ప్రయత్నం చెయ్యదు; తల్లి ఎక్కడ ఉంచితే అది అక్కడే ఉంటుంది. ఈ సాధనలలో ఏదో ఒక దానియందు పరిపూర్ణత సాధించడమే కావలసిన విషయం. భగవంతుడు సర్వజ్ఞుడు. ఆయనకు సర్వం తెలుసు. 'నీ శ్రద్ధ ఎంతో నీ సిద్ధి అంత'.

ప్రేమతో,
తురీయానంద

(33)

కన్‌ఖల్
1 నవంబర్, 1913

ప్రియమైన ఎక్స్.,

నా ఉత్తరాల వల్ల నీవెంతో లాభం పొందావని తెలిసి సంతోషించాను. కాబట్టి నా శ్రమ ఫలించినట్లుగా భావిస్తున్నాను.

పారమార్థిక సామ్రాజ్యంలో సంతోషంగా ఉండడానికి శ్రద్ధ లేక విశ్వాసం అనేదొక్కటే మూలకారణం. గీతలో భగవానుడు ఇలా చెప్పాడు: "శ్రద్ధగలిగిన వాడు జ్ఞానాన్ని పొందుతాడు" (గీత: 4.39). నచికేతుడి మనస్సులో శ్రద్ధ మేలుకున్నప్పుడు అతడు సత్యాన్ని దర్శించినట్లుగా మనం కఠోపనిషత్తులో చూస్తున్నాం. యోగ శాస్త్రాలలో కూడా శ్రద్ధను గొప్పగా కొనియాడడం మనకు కనిపిస్తుంది. ప్రసిద్ధి పొందిన ఒక సూత్రం ఉంది: 'మతి ఎంతో గతి అంత'. కాబట్టి నీ శ్రద్ధయే నీ పారమార్థికాభివృద్ధికి కారణమని గుర్తుంచుకో.

సర్వదా భగవంతుణ్ణి స్మరించడానికి ప్రయత్నించు. నీ మనస్సు ఆయన మీదే ఉండాలని హృదయపూర్వకంగా ప్రార్థించు. అప్పుడు ఆయన నీ మీద కరుణ చూపిస్తాడు. జీవితంలో సుఖదుఃఖాలు తప్పవు. భగవద్భక్తి ఉంటేనే మానవజన్మ సార్థకత చెందుతుంది; లేకపోతే అది కేవలం బాధామయమే.

భవదీయ,

తురీయానంద

(34)

డెహ్రాడూన్

14 ఏప్రియల్, 1914

ప్రియమైన ఎక్స్.,

నీ ఆరోగ్యం బాగా లేదని తెలిసి విచారపడుతున్నాను. చికిత్స చేయించుకున్నా ఫలితం కనిపించకపోవడం నిజంగా విసుగు కలిగించే విషయం.

అయినా నీవు నీ సాధనను కొనసాగిస్తూ ఉండాలి. శరీరం బాగున్నా, లేకపోయినా భగవన్నామాన్ని జపించడంలో అశ్రద్ధ, ఏమరుపాటు పనికిరావు. శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: "బాధ, శరీరం వాటి విషయం వాటిని చూసుకోనీ. ఓ నా మనస్సా! నీవు బ్రహ్మానందంలో నిలిచి ఉండు!" ఆనంద మయుడైన ప్రభువును మరువవద్దు. "ఆరోగ్యం బాగా ఉన్నప్పుడు భగవంతుణ్ణి ధ్యానిస్తాను," అని అనుకునేవాడు అలా ఎన్నటికీ చెయ్యలేడు. వ్యాసమహాముని, "తన జీవిత సమస్యలన్నీ తీరిన తర్వాత భగవంతుణ్ణి తలుస్తాననుకునేవాడు, అలలు ఆగిన తర్వాత సముద్రంలో స్నానం చేస్తాననుకునే మూర్ఖునివంటివాడు," అని చెప్పారు. సముద్రంలో తరంగాలు ఆగిపోవడమనేది ఉండదు; గాలివానలో అల్లకల్లోలంగా ఉన్న మహాసముద్రంలో దూకగలవాడే, స్నానం చెయ్యగలడు.

అదే విధంగా సుఖదుఃఖాల మధ్య, వ్యాధి, దిగులు, బాధ, పేదరికాల మధ్య సాధన చేసేవాడే పరిపూర్ణతను పొందగలడు. దానికి బదులు అనుకూల పరిస్థితులు వచ్చినప్పుడు సాధన చేస్తాలే అనుకునేవాడు, ఎప్పటికీ సాధన చెయ్యలేడు. ఈ లోకంలో ఏ కొద్ది అదృష్టవంతులకో గాని, సంపూర్ణంగా అనుకూలమైన పరిస్థితులు ఏర్పడవు. వ్యాధి, దిగులు, బాధ, ఆందోళన అనేవి మానవజీవితంలో ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. నీవు ఏ పరిస్థితులలో ఉన్నా పరాత్పరుణ్ణి చింతిస్తూ ఉండు. లేకపోతే పారమార్థిక జీవితంలో అభివృద్ధి సాధించడమనేది దుస్సాధ్యం.

శుభాశీస్సులతో,

తురీయానంద

(35)

కన్‌ఖల్

14 జూన్, 1914

ప్రియమైన ఎక్స్..,

నీవు జూన్ 9వ తేదీన వ్రాసిన ఉత్తరం అంది సంతోషించాను. అన్ని దేహాలూ వ్యాధిగ్రస్తమవుతాయి. అది సహజం. గొప్ప పుణ్యం చేసుకున్నందువల్ల మాత్రమే చక్కని ఆరోగ్యవంతమైన శరీరం లభిస్తుంది. శాస్త్రాలు, "వ్యాధి, వియోగం, బాధ, బంధం, దురదృష్టం – ఇవి మానవుని పాపకర్మ ఫలితాలు," అని చెపుతున్నాయి (హితోపదేశం). భగవంతుణ్ణి శరణు పొంది, "బాధలు, శరీరం వాటి విషయాలను వాటిని చూసుకోనీ; ఓ మనస్సా! నీవు భగవదానందంలో నిలిచి ఉండు," అని తలుస్తూ ఉంటే బాధను చాలావరకూ తగ్గించుకోవచ్చు. విచారపడడం, ఫిర్యాదు చెయ్యడం అనేవి ఏ విధంగానూ సహాయం చెయ్యవు. వాటివల్ల బాధ ఎక్కువ కావడమే కాక, అవి భగవంతుణ్ణి మరచిపోయేటట్లు చేస్తాయి. వ్యాధిగ్రస్తమైన శరీరాన్ని కలిగి ఉండి, ఇంద్రియసుఖాల కోసం తపించడం మనిషికి అత్యంత బాధాకరమైన విషయం.

మరొకవైపు, పారమార్థిక సాధనలు అభ్యసించడానికి పరిపూర్ణమైన ఆరోగ్యం అంత ముఖ్యం కాదు. మంచి మనస్సు మాత్రం అవసరం. మనిషి భగవంతుణ్ణి తన మనస్సులో ఆరాధిస్తాడు. ఆరోగ్యమెలా ఉన్నా, సత్కర్మలు ఆచరిస్తే మనస్సు మంచిస్థితిలో ఉంటుంది. అందువల్ల మనిషి తన పనుల యొక్క పవిత్రత విషయంలో అమితంగా జాగరూకుడై ఉండాలి. ప్రతి నిత్యం శరీరం నెమ్మది నెమ్మదిగా వినాశంవైపు పోతూ ఉంటుంది – దీనినెవ్వరూ ఆపలేరు. మనస్సు మాత్రం శాశ్వతంగా నిలిచి ఉంటుంది. ఒక శరీరం తర్వాత మరొక శరీరం వస్తుంది, పోతుంది. కానీ మనస్సు మాత్రం పరిపూర్ణమైన జ్ఞానోదయం కలిగే వరకు నిలిచివుండి, మళ్ళీమళ్ళీ శరీరాలను ధరిస్తూ ఉంటుంది. కాబట్టి మనోనైర్మల్యం కోసం ప్రయత్నం చెయ్యడమే మానవుని ప్రధానకర్తవ్యం.

ద్వైతం కానీ, అద్వైతం కానీ – నీవు ఏది చెప్పినా – అవి రెండూ మనస్సుకు సంబంధించినవే. 'నేను ఆత్మను' అనే అనుభవం కలిగినప్పుడు, అప్రయత్నంగా మనిషి అద్వైతంలో స్థిరపడతాడు. శరీరం, మనస్సు ఉన్నాయన్న ఎరుకలో ఉన్నప్పుడు అతడు ద్వైతస్థితిలో ఉంటాడు. తాను ఆత్మననే అనుభూతి కలిగిన తక్షణమే ఈ ద్వైతబుద్ధి అదృశ్యమవుతుంది. అప్పుడు మాత్రమే అన్నింటిలోనూ చైతన్యం సమానంగా ఉన్నదన్న జ్ఞానం, అభిన్న చైతన్యసాక్షాత్కారం నిలిచి ఉంటుంది. "నేను ఫలానా వాణ్ణి, ఫలానా వారి కుమారుణ్ణి, ఫలానా కులం, ఫలానా లక్షణాలు కలవాణ్ణి" అనే ఉపాధులవల్లనే అన్ని సమస్యలూ ఉత్పన్న మవుతున్నాయి. అటువంటి భావాలు ద్వైతభావనను వృద్ధిచేస్తాయి. "నేను దేహాన్ని కాను, మనస్సును కాను, బుద్ధిని కాను – నేను ఆత్మను, పరిశుద్ధుణ్ణి పాపరహితుణ్ణి,

అఖండ సచ్చిదానందుణ్ణి," అని తలపోసినప్పుడు ద్వైతమెక్కడ ఉంటుంది? ఈ మాటలు కేవలం వల్లిస్తే సరిపోదు. అవి అనుభవంలోకి రావాలి. ఇప్పుడు నీకు నీ పేరు, నీ వ్యక్తిత్వం పూర్తిగా జ్ఞాపకమున్నాయి. ఈ జ్ఞాపకం ఆత్మలో ఐక్యం చెందినప్పుడు నీకు అద్వైతానుభూతి కలుగుతుంది. మనం ద్వైతస్థితిలో ఉంటున్నాం కాబట్టి ద్వైతభావంతో భగవంతుణ్ణి ఆరాధించడం ద్వారానే అద్వైతస్థితిని చేరుకోగలం. భగవంతుణ్ణి ఆరాధిస్తూ, ఆయనతో సన్నిహిత సంబంధాన్ని ఏర్పరుచుకోవడం ద్వారా ఈ ద్వైత స్వభావాన్ని క్రమక్రమంగా పరిశుద్ధం చేసుకోవాలి. ఇప్పుడు మన సంబంధం కేవలం ఈ ప్రపంచంతోనే ఉంది. మనం ఈ సంసారబంధాన్ని ఛేదించి భగవంతునితో సంబంధం ఏర్పరుచుకోవాలి. దాన్ని సాధించినప్పుడు ద్వైతభావన దానంతటదే తొలగిపోతుంది. పరమాత్మ అయిన భగవంతుడొక్కడే అప్పుడు నిలిచివుంటాడు. ఈ క్షుద్రమైన నేను లేక అహం అదృశ్యమై పోతుంది. ఈ సాధనామార్గం ద్వారా మనిషి ద్వైతం నుండి అద్వైతాన్ని చేరుకుంటాడు.

'నేతి, నేతి' – 'ఇది కాదు, ఇది కాదు' అనే విచక్షణను అభ్యాసం చెయ్యడం ద్వారా ఈ అద్వైతానుభూతిని పొందవచ్చును. ఇది మరోమార్గం. ఈ క్షణంలోనే అన్నింటిని 'నేతి, నేతి' అని త్రోసివేసి, "నేనీ శరీరాన్ని కాను, మనస్సును కాను, బుద్ధిని కాను – నేను ఆత్మను, అఖండ సచ్చిదానందాన్ని! దేహం మరణిస్తే నేను మరణించను. సుఖదుఃఖాలనేవి మనస్సు యొక్క లక్షణాలు కానీ నావి కావు. నేను పరిపూర్ణమైన ఆత్మను. ఒకేవొకణ్ణి, రెండు కానివాణ్ణి (ఏకమేవాద్వితీయం), మనస్సుకు, వాక్కుకు అతీతుణ్ణి (మనోవాచామగోచరుణ్ణి)" అని ఆలోచించు! ఈ స్థితిని పొంది, అనుభవించినప్పుడు, మనిషి అద్వైతస్థితిలో నిలిచి ఉంటాడు. కానీ, దాన్ని పొందడం అంత సులభమైన విషయమా? కేవలం మాటలతోనే ఆ స్థితి సిద్ధిస్తుందా? అలా కానే కాదు. గురుదేవులు, "నీవు గట్టిగా కళ్ళుమూసుకుని, 'ముల్లు లేదు – గ్రుచ్చుకోవడం లేదు, ముల్లు లేదు – గ్రుచ్చు కోవడం లేదు,' అని అరిస్తే ఏమవుతుంది? ఎప్పుడు ముల్లు మీద చెయ్యిపెట్టినా అది గ్రుచ్చుకుంటుంది... 'నేను ఆకాశస్వభావం కలవాణ్ణ'ని కేవలం పలికితే ఏమవుతుంది? పన్నులు కట్టవలసి వచ్చినప్పుడు బాధ కలుగుతూ ఉంటే నీ ఆకాశతత్వం ఎక్కడ?" అనేవారు. కాబట్టి మనిషి అద్వైతస్థితిని ఒక్క దుముకులో సాధించలేడు. అందువల్లనే శ్రీకృష్ణుడు గీతలో ఇలా చెప్పాడు: "(జన్మ ద్వారా) శరీరాన్ని ధరించిన వారికి, వర్ణనకు అతీతమూ, నిరాకారమూ అయిన ఆదర్శాన్ని సాక్షాత్కరించుకోవడం చాలా కష్టం" (గీత: 12.5).

కానీ, "ఓ పార్థా! ఎవరు అన్ని పనులనూ నాకు అర్పించి, నన్నే పరమగతిగా భావిస్తూ, ఏకాగ్రమైన మనస్సుతో నన్నే ధ్యానిస్తూ ఉపాసిస్తారో, ఆ విధంగా ఎవరి మనస్సులు నా యందు లగ్నమై ఉంటాయో, అటువంటివారిని నేను శీఘ్రమే మృత్యుసాగరం నుండి ఉద్ధరించేవాణ్ణవుతున్నాను" (గీత: 12.6,7).

మనిషి నిజంగా భగవంతుని మీద ఆధారపడగలిగితేనే ఆయన సహాయాన్ని పొందగలుగుతాడు. అటువంటివాడికి దైవం సర్వాన్నీ అనుకూలంగా చేస్తుంది. అయితే అది

అంత సులభమా? ప్రతివారూ అలా చెయ్యగలరా? చెయ్యలేరు. భగవంతుని కృప వల్ల, ఒక మహనీయుని సాంగత్యం వల్ల మాత్రమే అది సాధ్యమవుతుంది తప్ప మరొక విధంగా కాదు. కేవలం కబుర్లు చెప్పడం వల్ల ప్రయోజనం లేదు. నీ మనస్సును శోధించి దానిలో ఎటువంటి సంస్కారాలు ఉన్నాయో తెలుసుకో. తర్వాత ఆ సంస్కారాలను పరిశుద్ధం చేసి వాటిని భగవంతునికి అర్పించు. ఇది కూడా అంత సులభమైన పని కాదు. కాబట్టి ఒక వ్యక్తి తన జీవితమంతా ప్రయత్నించి, పూర్తిగా ఆత్మసమర్పణ చేసుకోగలిగితేనే ధన్యుడవుతాడు. మొత్తం మీద చూస్తే ఆధ్యాత్మిక జీవితమనేది తమాషా కాదు.

ద్వైతం కానీ, అద్వైతం కానీ, నీవు ఏమి చెప్పినా సరే – దానిని జీవితంలో అనుభవానికి తేవడం చాలా కష్టం. గొప్ప వేదాంత ఆచార్యులైన ఆదిశంకరులు ద్వైతానికి, అద్వైతానికి గల తేడాను సూచించారు: "ద్వైతి, 'నేను నీ వాణ్ణి' అని చెపుతాడు. అద్వైతి, 'నిశ్చయంగా నేనే నీవు' అంటాడు. ఈ ఇరువురి ప్రవృత్తులలో స్వల్పమైన తేడా ఉంది. అయినా వాటి ఫలితం మాత్రం ఒకటే. అదే అజ్ఞానం నుండి, బాధల నుండి విముక్తి" (బోధసార, 32.23). అందువల్ల ఈ రెంటిలో మనకు అనువైన ఒక పద్ధతిని అనుసరించాలి.

ముఖ్యమైన విషయమేమంటే, మనిషి తన సాధనను మనఃపూర్వకంగా చెయ్యాలి. లేకపోతే గురుదేవులు చెప్పిన గొల్లపడుచు కథలోని పండితుడిలాగా అవుతుంది. గొల్లపడుచు భగవన్నామం చేస్తూ నది మీద నడిచిపోగలిగింది. కానీ పండితుడు నోటితో భగవన్నామం చేస్తూనే ఉన్నా, విశ్వాసం లేకపోవడం వల్ల పంచె పైకెత్తి నడవబోయి, నీళ్ళలో మునిగిపోయాడు. ఈ విధంగా, 'చెప్పేదొకటి, చేసేదొకటి' అనే ద్వంద్వవైఖరి పనికిరాదు.

నేను అద్వైత విధానాన్ని అనుసరించదలిస్తే, నా శరీరాన్నీ, మనస్సునూ, బుద్ధినీ నిరాకరించాలి. "నేను ఆత్మను" అని చెప్పగానే, నా సుఖదుఃఖ ద్వంద్వ భావాలు రెండూ తక్షణమే అంతరించి, "నేను పరిపూర్ణుణ్ణి, కర్తవ్యరహితుణ్ణి, శాంతుణ్ణి, కళంకరహితుణ్ణి, రాగద్వేషరహితుణ్ణి" అనే అనుభవాన్ని పొందాలి (శ్వేతాశ్వతర ఉపనిషత్తు: 6.19). అలా కాక, 'నేను భగవంతుని బిడ్డను, ఆయన సేవకుణ్ణి నేను!' అని పలికినప్పుడు, 'ఆయన ఏమి చేసినా, నన్ను ఎక్కడ ఉంచినా, అది నా మంచి కోసమే!' అనే దృఢవిశ్వాసంతో ఆయన శరణు పొందాలి. ఈ రెండు మార్గాలూ కష్టమైనవే. రెంటికీ ఆధ్యాత్మిక సాధన కావాలి. కానీ రెండింటి ఫలితాలు మాత్రం ఒకటే. అవే అజ్ఞాన నివృత్తి, పరమానంద ప్రాప్తి. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. ఎవరికి ఏ మార్గం అనుకూలంగా ఉంటుందో, అతణ్ణి దాన్ని అనుసరించనివ్వు. కానీ అతడు దానిని హృదయపూర్వ కంగా అభ్యసించాలి. అలా కాకపోతే రెండు మార్గాలూ ఏ ఫలితాన్నీ ఇవ్వవు.

కృష్ణ భగవానుడు ఉద్ధవునికి బోధిస్తూ, భాగవత ఏకాదశ స్కంధంలో వివిధ రకాలైన యోగమార్గాలు, వివిధ రకాలైన వ్యక్తులకు సరిపోతాయని స్పష్టంగా చెప్పాడు. నీ సమాచారం కొరకే దీనిని ఇక్కడ ఉదహరిస్తున్నాను: "మానవ సంక్షేమం కోసం నేను మూడు రకాలైన యోగాలను గురించి చెప్పాను. అవి జ్ఞానమార్గం, కర్మమార్గం, భక్తిమార్గం. వీటి కంటే వేరే

యోగాలు లేవు. వైరాగ్యం ఉండి, కర్మ మీద ఆసక్తి లేని వారు జ్ఞానయోగాన్ని అనుసరించాలి. వైరాగ్యం ఎక్కువ లేకుండా, కోరికలున్నవారు కర్మమార్గాన్ని అనుసరించాలి. ఎవరిలో స్వాభావికంగా ప్రేమ, భక్తి భావాలు ఉంటాయో, నా పేరు స్మరించడంలో ఎవరు ఆనందాన్ని పొందుతారో, ఎవరు ఇటు సంసారానికి కానీ, అటు సంపూర్ణమైన వైరాగ్యానికి కానీ అంటిపెట్టుకుని ఉండరో అటువంటి వాళ్ళు పరిపూర్ణత్వాన్ని పొందడానికి భక్తిమార్గాన్ని అనుసరించాలి" (భాగవతం: 11.20.6,7).

పైన ఉదహరించిన గ్రంథభావాన్ని జాగ్రత్తగా నీవు మననం చేస్తే ఎవరు ఏ మార్గానికి తగినవారో సులభంగా తెలుసుకోగలుగుతావు. ఇంద్రియ, భోగవస్తువుల నుండి మనస్సుల్ని పూర్తిగా నిగ్రహించినవారు ఎక్కువమంది ఉండరు. కాబట్టి జ్ఞానమార్గాన్ని అనుసరించే వాళ్ళు చాలా తక్కువగా ఉంటారు. సంసారం మీద మక్కువ గలవారు పని చెయ్యకుండా ఉండలేరు. కాబట్టి, ఈ రెండు రకాల వారికి మధ్యరకంగా ఉన్నవారు, అంటే పూర్తి వైరాగ్యం లేకుండా, పూర్తిగా సంసారం మీద ఆసక్తి లేకుండా ఉండి, భగవంతుని యందు శ్రద్ధాసక్తులున్నవారు, భక్తిమార్గాన్ని అనుసరిస్తే త్వరలోనే జ్ఞానాన్ని పొందుతారు. ఈ భక్తియోగాన్ని సులభంగా ఆచరించవచ్చు. ఫలితాలు సులభంగా వస్తాయి. ఈ మార్గం ద్వైతభావంతో మొదలవుతుంది. తర్వాత భగవంతుని కృపవల్ల అద్వైతజ్ఞానం దానంతట అదే ఉదయిస్తుంది. ఈ రోజుకు ఇక చాలు.

భవదీయ,
తురీయానంద

(36)

కన్‌ఖల్
27 జులై, 1914

ప్రియమైన ఎక్స్.,

నీవు శ్రావణమాసం 5వ తేదీన (జులై, 27, 1914) వ్రాసిన ఉత్తరం అందింది.. భాగవతంలోని 'కర్మ యోగస్తు కామినాం' – 'కోరికలున్న వారి కోసం కర్మయోగం నిర్దేశించబడింది' (భాగవతం: 11.20.7) అనే భాగాన్ని ఉదహరించి, 'ఇది ఏ రకమైన కర్మ?' అని ప్రశ్నించావు. మొదట 'కామినాం' అనే మాట కనిపిస్తున్నది. దాని అర్థం "కోరికలున్నవారు" అని. కోరికలున్నవారు కామం లేని పనిని (నిష్కామకర్మ) ఎలా చేస్తారు? వారి కర్మలు ఎల్లప్పుడూ కోరికలతో కూడి ఉంటాయి (సకామకర్మలు). కానీ అంతమాత్రాన ఆ కోరికలు చెడ్డవి కావు. ఆ కోరికలు ఎప్పుడు చెడ్డవవుతాయంటే, అవి శాస్త్రవిరుద్ధంగా, చెడుస్వభావం చేత ప్రేరేపించబడి నప్పుడు చెడ్డవవుతాయి. సుఖం అనుభవించాలన్న తీవ్రమైన కోరికలు ఉన్నవారు, ఆ కోరికల్ని తీర్చుకోవడానికి పనిచెయ్యాలి. అటువంటి ప్రజలు, నిష్కామకర్మను గురించిన బోధలను అర్థం చేసుకోలేరు. అందువల్ల అటువంటి వారికి, వారి

కోరికల్ని తీర్చుకోవడానికి కర్మ చెయ్యమని శాస్త్రాలు బోధిస్తున్నాయి. ఫలం మీద ఆసక్తి లేకుండా నిష్కామకర్మ చెయ్యడమే కాక, కోరికలతో కూడిన కర్మలు చేయవచ్చునని కూడా గీత బోధిస్తున్నది: "ప్రారంభంలో ప్రజాపతి మనుష్యులను యజ్ఞాలతో పాటు సృష్టించి ఇలా చెప్పాడు. 'ఈ యజ్ఞం వల్ల మీరు వృద్ధి చెందండి. ఇదే మీకు కామధేనువు. మీ కోరికలను ఇది తీరుస్తుంది" (గీత: 3.10).

కానీ నిజమేమంటే, కేవలం సలహా విన్నంత మాత్రాన ప్రయోజనం లేదు. పైగా, సలహా అందరికీ ఒకే రకంగా ఉంటుందా? వేర్వేరు సాధకులకు వేర్వేరు రకాలైన సలహాల వల్ల ప్రయోజనం కలుగుతుంది. ఒక వ్యక్తి తన స్వభావాన్ని అనుసరించి ఒక రకమైన బోధనచేత ఆకర్షించబడతాడు. ఆ బోధను శ్రద్ధతో అనుసరించడం వల్ల ప్రయోజనాన్ని పొందుతాడు. కాబట్టి కృష్ణుడు ఇలా చెప్పాడు: "స్వకర్మ యందలి భక్తి వలన మనిషి సిద్ధిని, పరిపూర్ణతను పొందుతున్నాడు" (గీత: 18.45). అంటే స్వధర్మాన్ని ఆచరించడంవల్ల అతని స్వభావానికి దివ్యలక్షణాలు అలవడతాయి. ఇది శాస్త్రాల తాత్పర్యం. భోగాల మీద తీవ్రమైన కోరికలున్నవారు వాటిని సంతృప్తిపరుచుకోవాలి. బలవంతం వల్ల గానీ, వట్టి సలహాలు వినడం వల్ల గానీ మనిషికి భోగాసక్తి తగ్గదు. కానీ, భోగంతోపాటు నిత్యానిత్యవస్తువిచారణ చెయ్యాలి. ఎందుకంటే భోగాలు అనుభవించడం వల్ల తృప్తి కలుగదు. దానికి బదులుగా అగ్నిలో నెయ్యి వేస్తే అంతకంతకు ఆ అగ్ని ప్రజ్వరిల్లినట్లు, కామాన్ని తృప్తిపరుచుకోవాలని ప్రయత్నించే కొద్దీ పెరిగిపోతుంది. కాబట్టి భోగాలను పొందడంతో పాటు, విచక్షణ కూడా అభ్యాసం చెయ్యాలి. తర్వాత కాలక్రమేణా వివేకం వల్ల – మహాభారతంలో యయాతి మహారాజు విషయంలో సంభవించినట్లు, ఆత్మజ్ఞానం కలుగుతుంది. (యయాతి మహారాజు ఎంతకూ తనివితీరని కామాన్ని తృప్తి పరచుకోవడానికి తన చిన్న కొడుకు యొక్క యవ్వనాన్ని తన ముసలితనంతో మారకం వేసుకుని అనేక సంవత్సరాలు కామసుఖాలు అనుభవించాడు. ఎట్టకేలకు, ఎంత తీర్చుకున్నా కామం చల్లారదనీ, అగ్నికి ఆజ్యం తోడైనట్లు అది మరింతగా పెరిగిపోతుందనీ తెలుసుకున్నాడు.)

నిజమే, నిష్కామకర్మే గమ్యం. కానీ, బలవంతం మీద ఆ లక్ష్యాన్ని పొందలేం. ఆత్మజ్ఞానం లేకుండా మనిషికి నిష్కామకర్మ చెయ్యడం అసాధ్యం. నిజానికి, మనిషి కోరిక లేకుండా ఉండలేడు. ఆత్మజ్ఞానానికి ముందు నిష్కామకర్మ ఇలా ఉంటుంది: "అకామో విష్ణు కామో వా! – భగవంతుని గురించిన కోరిక కోరిక కాదు." (ఎందుకంటే సాంసారికమైన కోరిక ఆత్మను బంధిస్తుంది. భగవంతుని గురించిన కోరిక ఆత్మను బంధవిముక్తుణ్ణి చేస్తుంది). శ్రీరామకృష్ణులు, "భక్తిని గురించిన కోరిక, కోరికగా పరిగణించబడదు; పాలకూర (ఒక రకమైన ఆకుకూర) సామాన్యమైన ఆకుకూరగా పరిగణించబడదు; కలకండ తీపి పదార్థంగా పరిగణించబడదు; నిమ్మకాయ పులుపు, పులుపుగా పరిగణించ బడదు!" అని చెప్పేవారు. (పాలకూర, కలకండ, నిమ్మకాయ – వీటిలో ఔషధ విలువలు ఉన్నాయి). అంటే భక్తిని కోరడం బంధాన్ని కలిగించదు. కాబట్టి మనిషి భగవంతుని కోసం పనిచేస్తే, అతని కర్మ

నిష్కామకర్మ అవుతుంది. నిజంగా జ్ఞానోదయాన్ని పొందిన వారే నిష్కామకర్మ చెయ్యగలరు. ఎందుకంటే వారి కోరికలు జ్ఞానం వల్ల నిర్మూలించబడ్డాయి. అయినా, నేను ఇదివరకే చెప్పినట్లు జ్ఞానాన్ని పొందాలనే కోరికతో చేసిన కర్మలు కూడా నిష్కామకర్మలని పిలువబడుతాయి.

కర్మను గురించి విచక్షణ చెయ్యడం చాలా కష్టం. అందుకే కృష్ణుడు గీతలో ఇలా చెప్పాడు: "కర్మ చేసే విధానాన్ని తెలుసుకోవడం కష్టం... ఏది కర్మో, ఏది కర్మ కాదో తెలుసుకోవడంలో జ్ఞానులు కూడా చిక్కుల్లో పడతారు" (గీత: 4.16,17). కాబట్టే శ్రీరామకృష్ణులు ఈ చిక్కులలోకి తలదూర్చకుండా, "అమ్మా! ఇదుగో నీ పుణ్యకర్మ, ఇదుగో నీ పాపకర్మ – ఈ రెంటినీ తీసుకుని నాకు శుద్ధభక్తి నివ్వు! ఇదిగో నీ ధర్మం, ఇదిగో నీ అధర్మం – ఈ రెంటినీ తీసుకుని నాకు శుద్ధభక్తి నివ్వు!" అని ప్రార్థించేవారు. భగవత్సాక్షాత్కారానికి అందరికీ ఇంత అనుకూల మైన, సులభమైన మార్గాన్ని ఎవ్వరూ బోధించలేదు. "తెలగపిండితో కలిపి, ఏ పశుగ్రాసాన్ని పెట్టినా పశువు దాన్ని ఇష్టంగానే తింటుంది; అలాగే భక్తితో చేసిన అన్ని కర్మలను భగవంతుడు స్వీకరిస్తాడు!" అని చెపుతూ మన గురుదేవులు ఎంత గొప్ప సూచన ఇచ్చారు! ఏదో ఒక రకంగా తన సర్వస్వాన్నీ భగవంతునికి సమర్పించి, ఆయనను సొంతవాడిగా పరిగణించి, తన తలంపులన్నీ ఆయన వైపుకు మళ్ళిస్తే, మనిషి జీవిత సాఫల్యాన్ని పొందుతాడు. గురుదేవులు ఈ విషయాన్ని చెప్పినట్లే, గీతలో కృష్ణుడు, అర్జునుడికి అనేకసార్లు ఇలా చెప్పాడు:

"నీవు ఏది చేస్తున్నా, ఏది తింటున్నా, యజ్ఞంలో ఏది ఆహుతి చేస్తున్నా, ఏమి దానం చేస్తున్నా, ఏ తపస్సు చేస్తున్నా – ఓ కౌంతేయా! దానిని నాకు అర్పణగా చెయ్యి! ఆ విధంగా నీవు కర్మలవల్ల కలిగిన మంచి, చెడు బంధాల నుండి విముక్తుడివి అవుతావు. నీ మనస్సు సన్న్యాసయోగంలో సుస్థిరతను సాధించి, విముక్తుడివై నన్ను చేరుకుంటావు" (గీత: 9.27,28).

దురదృష్టకరమైన విషయమేమంటే అటువంటి సులభమైన బోధనలను కూడా మనం ఆచరణలో పెట్టలేకుండా ఉన్నాం. కోరికలున్నవాడు, శాస్త్రాల ఆదేశాల ప్రకారం పనిచేసి, తన స్వధర్మాన్ని ఆచరించాలి. ఆ విధంగా అతని మనస్సు పరిశుద్ధమై కోరికలు లేని స్థితికి చేరుకుంటుంది. అందువల్లనే ఈ విధానాన్ని కర్మయోగం అన్నారు. శాస్త్రాల ఆదేశాలు ఎందుకంత విలువైనవో ఈ విషయం కూడా విశదపరుస్తోంది: "ఎవరు శాస్త్రవిధులను ఉల్లంఘించి, ప్రకోపిస్తున్న కోరికల ప్రేరేపణలను అనుసరించి ప్రవర్తిస్తారో, వారు పరిపూర్ణతను గాని, పరమగతిని కానీ పొందరు" (గీత:16.23). ఇవి భగవంతుని వచనాలు.

సర్వస్వాన్నీ భగవంతునికి సమర్పించగలవాడికి బాధగానీ, చిరాకుగానీ, భయంగానీ ఉండవు. అటువంటి వాడు శాస్త్రరహస్యాలలోని క్లిష్టతల వలన తికమకపడడు. జీవితంలోని అనేక కష్టపరిస్థితుల నుండి తప్పించుకోగలుగు తాడు. శ్రీగురుదేవుల మార్గాన్ని అనుసరించి, శాశ్వత శాంతిని పొందడానికి ఆయనే మనకు సరైన అవగాహనను కల్గించు గాక!

శుభాశీస్సులతో,
తురీయానంద

(37)

కన్‌ఖల్
10 సెప్టెంబరు, 1914

ప్రియమైన ఎక్స్.,

నీ ఉత్తరం నిన్న అందింది. నా క్రిందటి ఉత్తరం (27 జులై, 1914) నుండి నీవు కర్మయోగాన్ని గురించి అనేక కొత్త భావాలు నేర్చుకున్నావని తెలిసి చాలా ఆనందిస్తున్నాను. నీవు ఆచరించే కర్మలు కోరికతో కూడినవా లేదా అన్నది ముఖ్యం కాదు. ప్రధానమైనది ఇది: "నీవు ఏమి చేసినా, ఏది తిన్నా, ఏది యజ్ఞంలో ఆహుతి చేసినా, ఏ దానం చేసినా, ఏ తపస్సు ఆచరించినా, దాన్ని ఓ కుంతీపుత్రా! నాకు అర్పణగా చెయ్యి" (గీత: 9.27).

ఎల్లప్పుడూ నీ మనస్సులో, "నా లోపల నీవున్నావు. బయట నీవున్నావు. నేను యంత్రాన్ని, నీవు యంత్రాన్ని నడిపేవాడివి. నీవు ఎలా నడుపుతావో నేను ఆ ప్రకారం నడుస్తాను" అన్న భావాన్ని ఉంచుకో. ఇంతకంటే కావలసినదేముం టుంది? కానీ, ఒక్కసారిగా ఇది సాధ్యమవుతుందా? అభ్యాసం అవసరం. మళ్ళీమళ్ళీ అభ్యాసం చెయ్యడం వల్ల జయం కలుగుతుంది. అప్పుడు భగవంతుడు నిజంగా ఈ శరీరాన్ని నడిపేవాడవుతాడు. ఇది యథార్థం. "ఏదో ఉపాయం చేత జగజ్జననియే భక్తి అనే పాశంతో బంధింపబడి ఉంది." సమస్తం ఆమే చేస్తున్నది. దీన్ని అర్థం చేసుకునే శక్తి లేక, మనమే చేస్తున్నామని తలపోస్తూ, కర్మచేత బంధించబడుతున్నాం. ఒకడు కుండలో బియ్యం, బంగాళాదుంపలు, ఇతర కూరగాయలతో కలిపి వండుతున్నాడనుకో. కొంతసేపయిన తర్వాత కూరగాయలు ఉడుకుతున్న నీటిలో పైకి, క్రిందకి కదలడం చూసి, చిన్నపిల్లలు కూరగాయలు తమంతట తామే కదులుతున్నాయని అనుకుంటారు. కానీ, దీనికి కారణం కుండక్రింద నిప్పు ఉండడం వల్లనే కదా. క్రింద నిప్పు తీసివేస్తే అవి కదలడం మానేస్తాయి. అదే విధంగా, మనలో చైతన్యశక్తిగాను, క్రియాశక్తిగాను ఉండి భగవంతుడు అన్నింటినీ నెరవేరుస్తున్నాడు. దీన్ని అర్థం చేసుకోలేక మనమే చేస్తున్నామని చెపుతూ ఉంటాం.

భగవంతుడు గాక ఈ జగత్తులో మరెవరైనా ఉన్నారా? అనేక రూపాలలో వ్యక్తమవుతున్నది ఆయన ఒక్కడే. మన అజ్ఞానం వల్ల, భగవంతుని స్థానంలో అనేక పదార్థాలను చూస్తున్నాం. మనం ఒకసారి ఆయనను దర్శిస్తే, భిన్నత్వాన్ని ఇక ఎంతమాత్రం చూడలేము, బాధలలో పడము. అందరిలో ఆయన ఉన్నాడు. ఆయనే సర్వస్వం. ఈ జ్ఞానంలో సుస్థిరతను సాధించినప్పుడు మనిషి ముక్తుడవుతాడు.

మహాభారతంలోని వ్యాధగీతను బోధించిన ఆ కసాయివాడు పూర్వజన్మలోనే జ్ఞానాన్ని పొందాడు. కానీ ప్రారబ్ధకర్మ (ఫలాన్ని ఇవ్వనారంభించిన పూర్వకర్మ) వల్ల కసాయిగా

జన్మించాడు. కులానికి తగినట్లు తన ధర్మాన్ని అనుసరించాడు. ఈ కథ మనకు మహాభారతంలో కనిపిస్తుంది. గీతలో నుండి నీవు ఉదహరించావు: "ఎవరికి అహంకారభావం లేదో, ఎవరి బుద్ధి కళంకితం కాలేదో, అటువంటి వాడు మనుష్యులను చంపినా, చంపినట్టు కాదు. దాని వల్ల బద్ధుడు కాడు" (గీత: 18.17). ఈ విషయాన్ని గురించి కొంత ధ్యానం చేస్తే, నీకే అర్థమవుతుంది. ఎప్పుడైతే, ఏ విధమైన అహంభావం లేకుండా, 'నేనే చేస్తున్నాను' (నేనే కర్తను అని) అని మనిషి అనుకోకుండా ఉంటాడో, అప్పుడు అతనికి ఏ విధమైన బంధం ఉండదు. 'నేను' అన్న అహంభావమే బంధాన్ని కలుగజేస్తుంది. నేను ఎప్పుడు విముక్తి పొందుతాను? ఎప్పుడంటే 'నేను' అనే భావన పోయినప్పుడు! నేను అనేది లేనప్పుడు బంధం ఎక్కడ నుండి వస్తుంది? నేను కాదు, నేను కాదు, నీవే! నీవే! అహంభావం లేనివాడు భగవంతుణ్ణి మాత్రమే దర్శిస్తాడు. కాబట్టి అతడు బంధింపబడడు.

భవదీయ,

తురీయానంద

(38)

కన్‌ఖల్

23 సెప్టెంబరు, 1914

ప్రియమైన ఎక్స్.,

ఆశ్వయుజమాసం 1వ తేదీన (సెప్టెంబరు) నీవు వ్రాసిన ఉత్తరం అందింది... దివ్యజనని పూజ ఎల్లప్పుడూ మంచినే కలిగిస్తుంది. మన హృదయాలలో ఆమె మేలుకున్నప్పుడు అన్ని బాధల నుండి విముక్తులమవుతాం. కేవలం స్వయంకృషి వల్ల దేన్ని సాధించాలన్నా కష్టమే. మన శరీరాన్నీ, మనస్సునూ ఆమెకు అర్పిస్తే తప్ప, ఆమె అనుగ్రహం మన వైపు ప్రవహించదు. ఒక్కసారి ఆమెను సాక్షాత్క రించుకుంటే, ఇక మోసపూరితమైన ఈ ప్రపంచం నీకు హాని చెయ్యలేదు. అప్పుడు ఈ ప్రపంచంలో కూడా ఆమెను చూడగలుగుతావు. నీవు స్పష్టంగా, "అమ్మా! నీవే క్రియవు. నీవే ధర్మానివీ, అధర్మానివీ కూడా!" అన్న బోధ నను అర్థం చేసుకుంటావు. ఆమె తప్పితే మరేదీ లేదనీ, ఆమెయే సర్వం అయినదనీ, స్పష్టంగా తెలుసుకోగలుగుతావు. అప్పుడు అన్ని సంకటాలూ సమసిపోతాయి.

ఎల్లప్పుడూ అమ్మను ప్రార్థించు. నీ నిత్య విధుల మధ్య నీ కార్యకలాపాల నడుమ, ఆమెను స్మరించు. ఇలా హృదయపూర్వకంగా ఎందుకు ప్రయత్నం చెయ్యవు? అలా చేసినప్పుడు, అంతా సులభమైపోయినట్లు నీకు తెలుస్తుంది. నీ ఆరోగ్యం బాగున్నా, లేకున్నా సరే, ఇలా భావించు: "రోగాన్నీ, శరీరాన్నీ వాటి సంగతి వాటిని చూసుకోనియ్యి. ఓ మనసా! నీవు బ్రహ్మానందంలో నిలిచిపో." ఈ విషయాలను అభ్యాసం చేస్తేనే ఫలితాలు వస్తాయి.

ప్రేమ, ఆశీస్సులతో,

తురీయానంద

(39)

కన్‌ఖల్

1 అక్టోబరు, 1914

ప్రియమైన ఎక్స్.,

ఆశ్వయుజమాసం 11న (సెప్టెంబరు) నీవు వ్రాసిన ఉత్తరం అందింది... నీ ఆరోగ్యం బాగా లేదని తెలిసి విచారపడుతున్నాను. నీ ఆధ్యాత్మిక సాధనలను కొనసాగించు. జగజ్జనని కృపవల్ల బాధలన్నీ సమసిపోతాయి. నీ ఆరోగ్యం బాగున్నా, లేకున్నా నీ సాధనను మాత్రం ఆపవద్దు. కష్టమైనప్పటికీ కొంతకాలం వదలకుండా, కష్టపడి సాధన చెయ్యి. నీ ఆరోగ్యం తప్పకుండా బాగుపడుతుంది. మనస్సు పరిశుద్ధమై, శాంతించినప్పుడు శరీరం కూడా జబ్బులు లేకుండా ఉంటుంది. పారమార్థిక సాధన ఒక్కటే మనస్సును పరిశుద్ధం చెయ్యగలదు. అభ్యాసం! అభ్యాసం! అభ్యాసం! స్వార్థభావన లేని సాధన! మనిషి భగవంతుని యందు ప్రేమ, భక్తి అలవరచుకోవాలి. అప్పుడు మనస్సు దానంతటదే, సాంసారిక వస్తువుల నుండి నిగ్రహింపబడుతుంది. ఆ సమయంలో శరీరాన్ని గురించిన ఆలోచన ఎక్కువ బాధపెట్టదు. జగజ్జనని తలంపే ముఖ్యమవుతుంది. అలా జరిగినప్పుడు మనిషి పరమానందంలో ఓలలాడుతాడు.

ప్రేమ, శుభాశీస్సులతో,

తురీయానంద

(40)

వారణాసి,

6 నవంబరు, 1914

ప్రియమైన ఎక్స్.,

నీవు 1914 నవంబరు 1న వ్రాసిన ఉత్తరాన్ని అందుకున్నాను. ఈ లోకంలో సుఖదుఃఖాలు ఒకదాని తర్వాత మరొకటి వచ్చిపోతుంటాయి. వాటి నుండి పూర్తిగా తప్పించుకున్న వారినెవరినైనా చూశావా? అది అసంభవం. ఒకదానికొకటి వ్యతిరేకమైన ద్వంద్వాలతో ఈ ప్రపంచం తయారై ఉంది. ఆత్మ మీద ధ్యానం చెయ్యడం వల్ల మాత్రమే మనిషి వాటిని వదిలించుకోగలుగుతాడు. వదిలించు కోవడమంటే సుఖదుఃఖాలు ఉండవని కాదు; కానీ దైవానుగ్రహం వల్ల ఆ ద్వంద్వాలు మనిషిని కలత పెట్టవు. కాబట్టి కృష్ణుడు గీతలో ఇలా చెప్పాడు: "ఓ అర్జునా! వాటిని ఓర్చుకో!" (గీత: 2.14). జాగ్రత్తగా గమనించు – సుఖదుః ఖాలు ఉండవని ఆయన చెప్పలేదు. "చలి, వేడి, సుఖం, దుఃఖం ఈ భావాలు కేవలం ఇంద్రియాలు ప్రాపంచిక వస్తువులను స్పర్శించడం చేతనే కలుగుతున్నాయి. అవి వస్తుంటాయి; పోతుంటాయి. అవి అశాశ్వతాలు. కాబట్టి వాటిని సహించు!" (గీత: 2:14)

అని నొక్కి చెప్పాడు. సహించడం, ఓర్చుకోవడం కన్నా మేలైన మార్గం మరొకటున్నట్లయితే, తన ప్రియమిత్రుడు, శిష్యుడు అయిన అర్జునుడికి తప్పకుండా ఆయన చెప్పి ఉండేవాడే!

శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "శ, ష, స - సహించు, సహించు, సహించు!" ఓర్చుకోవడం కంటే వేరే గత్యంతరం లేదని ఎత్తిపెట్టినట్లు చెప్పారు. ఇంకా ఏమన్నారంటే, "ఎవరు సహిస్తారో, వారే నిలుస్తారు. సహించలేని వారు నశిస్తారు!" కాబట్టి, మనం సహించి తీరాలి. ఓర్చుకోవడంలో ఘనత ఉంది. జీవితంలో కష్టాలు, కడగండ్లు తప్పవు. కాబట్టి వాటిని తలచుకుని వాపోయినందువల్ల ప్రయోజనమేముంది? దీనికి బదులు, వాటిని సహిస్తే నిరర్థకమైన ఏడుపు తప్పుతుంది. సంత్ తులసీదాస్ ఇలా అన్నారు: "దేహధారు లైన జీవులందరికీ, బాధపడడం తప్పదు. ఈ విషయంలో అజ్ఞానికీ, జ్ఞానికీ మధ్య తేడా లేదు. కానీ, భేదమెక్కడున్నదంటే జ్ఞాని బాధలు తప్పవని పూర్తిగా తెలుసుకున్నందువల్ల వాటిని శాంతంగా సహిస్తాడు. అజ్ఞాని ఏడుపులు, పెడబొబ్బలు పెడుతూ, తనను తాను దుఃఖంలో పడవేసుకుంటాడు." గురుదేవుల బోధనలను సదా గుర్తుంచుకో: "బాధలు, శరీరం వాటి సంగతి వాటిని చూసుకోనీ. ఓ మనసా! నీవు బ్రహ్మానందంలో ఓలలాడు." బాధతో తలక్రిందులు కాకుండా ఈ బోధ నిన్ను రక్షిస్తుంది.

భవదీయ,
తురీయానంద

(41)

వారణాసి,
19 నవంబరు, 1914

ప్రియమైన శ్రీధర్ (స్వామి నిరుపమానంద),

1914 నవంబరు 9న నీవు వ్రాసిన పోస్టుకార్డు అందింది. పని చేయకుండా సోమరిగా ఉండడాన్ని నీ స్వభావం అంగీకరించదు. కాబట్టి, భగవంతునికి సమర్పించే భావంతో పనిచేస్తూ ఉన్నప్పుడే నీ పరిస్థితి మెరుగుగా ఉంటుంది. అంటే అది ఇతరుల సంక్షేమం కోసం సుమా! దానివల్ల నిస్సందేహంగా నీవు పారమార్థిక ప్రయోజనాన్ని పొందుతావు. శక్తివంచన లేకుండా పనిచేసి భగవానుని ఆశీస్సులను పొందు. కర్మకలాపాలనన్నింటినీ పరిత్యజించి, నిరంతరం భగవత్స్మరణ చెయ్యడం చాలా కష్టం. అది అందరికీ సాధ్యం కాదు కూడా. నీ మనస్సును శాంతపరచి, మానవులను దైవంగా భావించి, సేవించడంలో నిమగ్నుడవై ఉండు. అది నీకెంతో శ్రేయస్సును కలిగిస్తుంది. నీవు ఒక పనిముట్టువనీ, భగవంతుడు ఆ యంత్రాన్ని నడిపేవాడనీ దృఢమైన విశ్వాసం కలిగివుండు - అప్పుడు నీకు ఏ సమస్యా ఉండదు.

ఎల్లప్పుడూ ప్రార్థనాసక్తుడవై ఉండు. చేతులతో పని చెయ్యి. ఆయన ఎల్లప్పుడూ నీ హృదయంలో ఉండాలనీ, నిన్ను నడిపించాలనీ ప్రార్థించు. ఇది భయాందోళనల నుండి నిన్ను విముక్తుణ్ణి చేస్తుంది. ఆయన సర్వజ్ఞుడు, సర్వశ్రేయస్కరుడు. నీకేది మంచిదో, ఆయన దాన్ని

నెరవేరుస్తాడు. కాబట్టి, మనస్సులో ఏ సందేహం పెట్టుకోకుండా, భగవంతుని కోసం పనిచెయ్యి.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(42)

వారణాసి,

6 జనవరి, 1915

ప్రియమైన ఎక్స్.,

నీ ప్రశ్నలోని మొదటి భాగానికి సమాధానమిస్తున్నాను: "నాలోని సనాతనమైన ఒక అంశ ఈ జీవలోకంలో ఒక జీవుడై, ప్రకృతిలో ఉంటూ, ఐదు ఇంద్రియాలనూ, ఆరవ ఇంద్రియమైన మనస్సునూ తన వైపుకు ఆకర్షిస్తోంది" (గీత: 15.7).

ఆ విధంగా కృష్ణుడు గీతలో జీవుని యథార్థ స్వభావాన్ని వర్ణించాడు. జీవుడు భగవంతునిలో ఒక అంశ. శరీరంలో ఆ జీవుడు ఉండి, విషయవస్తువులను అనుభవిస్తున్నాడు. మరణసమయంలో ఆ జీవుడు మనస్సు, ఇంద్రియాలతో సహా శరీరంలో నుండి వెళ్ళిపోతున్నాడు. సుఖదుఃఖాలను అనుభవించిన తర్వాత తాను చేసిన కర్మను, సంపాదించిన జ్ఞానాన్ని బట్టి సంక్రమించిన కర్మఫలాన్ని అనుభవించడానికి, ఆ ఫలానికి తగిన శరీరాన్ని మళ్ళీ ధరిస్తున్నాడు. ఆ విధంగా జ్ఞానోదయం పొందేవరకూ జననమరణ పరంపరలలో తిరుగుతున్నాడు.

మనస్సు ఇంద్రియాలకు ప్రభువు. ఆ మనస్సు సహాయంతో ఇంద్రియాలు పనిచేస్తున్నాయి. మనస్సు నిద్రపోతున్నప్పుడు కూడా ముఖ్యశక్తి అయిన ప్రాణం మేల్కొనివుండి, శరీరాన్ని నిలుపుతోంది. శరీరంలో ముఖ్యశక్తి ప్రాణం; అది లేనప్పుడు 'శరీరం మరణించింది' అని ప్రకటిస్తారు. జీవుడు, మనస్సు, ప్రాణం ఒకటి కావు. అవి వేరు వేరు. బ్రహ్మాండాన్ని గురించి సాంఖ్య తత్త్వశాస్త్రంలోను, మహాభారతంలో అనేక చోట్ల, ఉపనిషత్తులలో కూడా వర్ణించబడింది. గీతను శ్రద్ధగా అధ్యయనం చేస్తే, అక్కడ కూడా బ్రహ్మాండాన్ని గురించి చెప్పబడి ఉంది. తత్త్వసిద్ధాంతాలు అన్నింటిలోనూ సృష్టిక్రమం ఒకే రకంగా వివరించబడలేదు. అయినా ఫరవాలేదు. ప్రాథమికంగా అవన్నీ ఒకదానితో ఒకటి ఏకీభవిస్తాయి. యోగవాశిష్ట రామాయణంలో అన్ని విషయాలు విపులంగానూ, స్పష్టంగానూ వివరించబడ్డాయి. అది చదివితే నీవు సులభంగా అర్థం చేసుకుంటావు.

శుభాశీస్సులతో,

తురీయానంద

(43)

వారణాసి,

19 ఫిబ్రవరి, 1915

ప్రియమైన డి.,

నీ ఆరోగ్యం సరిగ్గా లేకపోవడం వల్ల నీ మనస్సు సరైన స్థితిలో ఉండడం లేదని అనిపిస్తోంది. మనస్సుకు, ఆరోగ్యానికి చాలా సన్నిహిత సంబంధం ఉంది. కానీ, నిరంతరం భగవత్స్మరణ చేస్తూ ఉండడానికి నీవు ప్రయత్నిస్తూనే ఉండాలి. నీ శ్రేయస్సును నీవు చూసుకోకపోతే మరెవరు చూస్తారు? "మనిషి తనను తాను ఉద్ధరించుకోవాలి! అతడు తనను తాను దిగజార్చుకోకూడదు! ఎందుకంటే తనకు తానే మిత్రుడు. తనకు తానే శత్రువు" (గీత: 6.5). "పుట్టుకను, మరణాన్ని, వృద్ధాప్యాన్ని, వ్యాధిని దుఃఖాలయాలుగా దర్శించడం..." (గీత: 13.9) "పుత్రులు, భార్య, గృహం మొదలైన వాటిలో ఆసక్తి లేకపోవడం, వాటితో తాదాత్మ్యం చెందకుండా ఉండడం..." (గీత: 13.10). జ్ఞానసముపార్జనకు ఇవి సాధనాలు కాబట్టి జ్ఞానార్జన కోసం మనిషి ఈ సుగుణాలను అభ్యసించాలి.

శుష్కమైన చర్చలవల్ల ప్రయోజనం లేదు. భగవంతుని కృప కోసం మనిషి ప్రార్థించాలి. అప్పుడు అతడు ఫలితాన్ని పొందుతాడు. అతడు హృదయ పూర్వకంగా, శక్తి వంచన లేకుండా ప్రార్థించాలి. ఈ విధమైన ఆంతరంగిక ప్రార్థన ఎక్కువ ప్రయోజనకరం. భగవంతుడు సర్వజ్ఞుడు. మన హృదయపు లోతుల్లోని ఆలోచనలు కూడా ఆయనకు తెలుసు. వినమ్రతతో ఆయనను శరణువేడు. ఈ విషయాలన్నీ నీకు తెలుసు. నేను కూడా అనేకసార్లు చెప్పాను. చెప్పడానికి ఇంకా ఏముంది?

ప్రతి దానికీ ఒక సమయమనేది ఉంది. సర్వేశ్వరుడు పరమ కరుణా మయుడు. ఆయన ద్వారం దగ్గర వేచివున్నవాడు ఎంతోకొంత సాధిస్తాడు. అది ఈ క్షణంలో కావచ్చు లేక భవిష్యత్తులో కావచ్చు. దానిలో సందేహం ఏమాత్రం లేదు. భగవంతుని యందు భక్తి కలిగి ఉండాలని ఎల్లప్పుడూ ప్రార్థించు. నీవు ఆయనను ప్రేమించగలిగితే, సాంసారిక వ్యామోహాలన్నీ వాటంతటవే రాలిపోతాయి. ఒక్కసారి దివ్యప్రేమను చవిచూశావా, మిగిలినదంతా చప్పనై పోతుంది. ఆ భక్తి కోసం శాయశక్తులా పాటుపడాలి. లేకపోతే అప్రయత్నంగా అది లభిస్తుందా? మనిషి తానుగా కష్టపడకపోతే ఇతరులెవ్వరూ అతనికి సాయం చెయ్యలేరు. ఇది తథ్యం.

ప్రేమ, ఆశీస్సులతో,

తురీయానంద

(44)

వారణాసి,

7 మార్చి, 1915

ప్రియమైన ఎక్స్.,

...భగవద్భక్తి మానవునిలోని దివ్యస్వభావాన్ని వృద్ధి చేస్తుంది. శ్రీకృష్ణభగవానుడే గీతలో ఇలా చెప్పాడు: "ఓ పార్థా! నన్ను ఎవరైతే శరణువేడుతారో, అధమజన్మలలో పుట్టినవారైనా సరే.... వారు కూడా పరమ గతిని పొందుతారు" (గీత: 9.32). "కాబట్టి ఉత్తమజన్మ లెత్తినవారు, నన్ను శరణు వేడడం ద్వారా ముక్తి పొందుతారని చెప్పడంలో సందేహమేముంది?" తర్వాత శ్రీకృష్ణుడు ఇలా ముగించాడు: "అనిత్యం, అసుఖం అయిన ఈ లోకంలోకి వచ్చావు కనుక, నన్ను భజించు" (గీత: 9.33). భగవంతుణ్ణి భజించడం, కీర్తించడం తప్ప ముక్తికి మరో మార్గం లేదు.

నీ ఉత్తరంలోని తాత్పర్యాన్ని నేను అర్థం చేసుకోలేకుండా ఉన్నాను. నీ ఉత్తరంలో, " 'ఏ కర్మ బహుకష్టంతో చెయ్యబడుతుందో అది రాజసకర్మ, దాని ఫలితం బాధ' – అని గీతలో చూశాను," అని వ్రాశావు. అలా వ్రాసిన తర్వాత, "ఈ అర్థం సరియైనదేనా?" అని అడిగావు. ఇలా వ్రాయడంలో నీ ఉద్దేశం ఏమిటి? ఉదాహరణకి, వారణాసిలో ఈశ్వరుని దర్శనం చెయ్యాలంటే ఎంతో కష్టాన్ని ఎదుర్కోవాలి కాబట్టి అది రాజసకర్మ అని, అందువల్ల దర్శించుకోవడం అనవసరమని నీవు చెపుతున్నట్టు నేను అర్థం చేసుకోవాలా? అదేనా నీ తాత్పర్యం? గీత పదునెనిమిదవ అధ్యాయంలో, "జ్ఞానం, కర్మ, కర్త అనేవి త్రిగుణాల (సత్త్వం, రజస్సు, తమస్సు) ప్రకారం మూడు విధాలని కృష్ణుడు అర్జునుడికి వర్ణించిన దానిని ఉదహరించావు. నీవు ఉదహరించినది అర్ధశ్లోకమే. పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఇది సరిపోదు. సాత్త్విక కర్మను వివరించిన తర్వాత కృష్ణుడు రాజసిక కర్మను సూచించాడు: "తన కోరికల్ని తృప్తిపరచుకోవడానికీ, అహంభావం వల్ల కలిగే ప్రేరేపణతో ఎంతో శ్రమతో చేసే కర్మ రాజసస్వభావం కలది" (గీత: 18.24). పారమార్థిక సాధనలో కష్టముంది కనుక అది రజస్సు, అందుచేత మనిషి దానిని ఆచరించకూడదు! ఇదే నీ తాత్పర్యమైతే ఇక నేను ఏమి చెప్పగలను?

మళ్ళీ, "ఇంత కాలంగా నేను ఎన్ని విషయాలో చూశాను, విన్నాను. అయినా మనస్సు సత్యం వైపు కదలడం లేదు. అది విచారకరమైన విషయం" అని వ్రాశావు. నిజానికి నీవు ఎంతకాలంగా చూస్తున్నావు? వింటున్నావు? యయాతి మహారాజు తన కుమారుని యవ్వనాన్ని అరువు తీసుకుని ఇంద్రియభోగాలు పదివేల సంవత్సరాలు అనుభవించాడు. అప్పటికి కూడా తృప్తి కలగక, "కామ భోగం వల్ల కామకాంక్ష తృప్తి చెందదు. అగ్నిలో ఆజ్యంవేస్తే అది మరింతగా రగిలినట్టు, అంతకంతకు కోరిక వృద్ధి చెందుతుంది" అన్నాడు

(విష్ణుపురాణం, 4.10.9). కాబట్టి సాంసారికమైన కోరికలన్నింటినీ త్యజించు; ఆ త్యాగమొక్కటే జీవితంలో ఆనందాన్ని తెస్తుంది. శాస్త్రాల ప్రకారం ఇదే తుది నిర్ణయం.

భవదీయ,

తురీయానంద

(45)

వారణాసి,

10 మార్చి, 1915

ప్రియమైన శ్రీధర్ (స్వామి నిరుపమానంద),

నీవు మార్చి 4, 1915 తేదీన వ్రాసిన పోస్టుకార్డు చేరింది... నీవు క్షేమంగా ఉన్నావనీ, నీ పనిని కొనసాగించాలని నిర్ణయించుకున్నావనీ తెలిసి సంతోషి స్తున్నాను. ఆ పనిలో అభివృద్ధి చెందడానికి ప్రయత్నించు. గురుదేవుల కృపవల్ల నీవు తప్పక జయిస్తావు. నీవు స్వతంత్రంగా పని చెయ్యాలనుకుంటున్నావని నాకు తెలుసు కాబట్టి, నిన్ను సొంతంగా పని ప్రారంభించమని చెప్పాను. తనకు ఇష్టమైన పని లభిస్తే సులభంగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఇతరులెవరి కోసమైనా పనిచేస్తే అలా అనిపించదు. ప్రారంభంలో నీవు ఒంటరితనాన్ని అనుభవిస్తావు; కానీ క్రమంగా అలవాటు పడతావు. తర్వాత ఇతరులు కూడా నీతో చేరతారు. పనిని వదలకుండా పట్టుకుని ఉండడం ముఖ్యం. అయితే అలా చెయ్యడం చాలా కష్టం. పరిస్థితులెలావున్నా చేపట్టిన పనికి అంటిపెట్టుకుని ఉన్నవాడు తప్పకుండా విజయం సాధిస్తాడు. ఇది ఎన్నోసార్లు నిరూపించబడిన సత్యం.

నీ శక్తికి తగినట్లు ఇతరులకు సహాయం చెయ్యడానికి ప్రయత్నించు. నిన్ను చూసి ఇతరులు కూడా అలా పని చెయ్యడం నేర్చుకుంటారు. మానవులలో మాధవుణ్ణి సేవించడం తప్ప నీ మనస్సులో ఏ కోర్కెకూ తావివ్వవద్దు. అది నీకు మంచి చేస్తుంది. నీ పేరు ప్రతిష్ఠలనూ, సర్వస్వాన్నీ భగవంతునికి అర్పించు. నీ తనువు తోనూ, మనస్సుతోనూ భగవంతుణ్ణి సేవించగలిగినందుకు భగవంతునికి కృతజ్ఞుడవై ఉండు. ఆయన నీ హృదయంలో ఆసీనుడై ఉండి ఎల్లప్పుడూ నిన్ను నడిపించాలని కోరుతూ, నిష్కపటంగా ఆయనకు ప్రార్థన చెయ్యి.

స్త్రీలను దివ్యజనని స్వరూపాలుగా దర్శించి, శక్తికొద్దీ వారిని సేవిస్తే పతనం కలుగుతుందనే భయముండదు. చాలా జాగ్రత్తగా ఉండు. మాతృభావన కంటే అన్యభావన ఏదీ మనస్సులో మెదలరాదు. స్త్రీలపట్ల నీ స్వభావం ప్రజలకు తెలిసి నప్పుడు – ఎవ్వరికీ అసంతృప్తి కలుగదు – పైగా ఎక్కువ సంతృప్తి కలుగుతుంది.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(46)

వారణాసి,

22 మార్చి, 1915

ప్రియమైన ఎక్స్.,

ఈసారి కూడా నా ఉత్తరంలోని (7 మార్చి, 1915) భావాన్ని నీవు గ్రహించి నట్లు కనిపించలేదు. అందువల్ల నేను అర్థం చేసుకున్న దాన్ని బట్టి వ్రాస్తున్నాను. నీపట్ల నాకు అసంతృప్తి కలిగిందని అనుకోవద్దు. సత్త్వగుణం - శాంతం, ప్రకాశ వంతం, నిష్కల్మషం అనేమాట సత్యమే కానీ, ప్రతివారూ సత్త్వ గుణసంపన్నులు కారు. తమస్సులో ఉన్నవాడు (సోమరి), రజస్సు (కార్యపరత) ద్వారానూ, రజస్సులో ఉన్నవాడు దాన్ని అణచివేయడం ద్వారానూ సత్త్వాన్ని చేరుకోవాలి. సత్త్వగుణం శాంత ప్రధానమైనదని, రజస్సు కష్టంతో కూడినదని, తమస్సు మోహంలో ముంచుతుందని తెలుసుకున్నంత మాత్రాన చాలదు; సత్త్వ గుణాన్ని వృద్ధిచేసుకోవాలి. మనిషి సాధన చేస్తూ అతిగా శ్రమపడడం మంచి కంటే చెరుపే ఎక్కువ చేస్తుంది. అందుచేతనే గీత ఇలా సూచిస్తోంది: “మానవుడు నెమ్మది నెమ్మదిగా శాంతిని పొందవలెను” (గీత: 6.25). “ఆహారం తీసుకోవడంలోను, వినోదవిహారాలలోను, కర్మచెయ్యడంలోను యుక్తంగా (మరీ ఎక్కువ, మరీ తక్కువ కాకుండా) ఉండు” (గీత: 6.17).

అతిగా శ్రమించడం మంచిది కాదు. అలా అని జరిగేదేదో జరుగుతుందిలే అన్నట్టు ప్రవర్తించడం కూడా మంచిది కాదు. శ్రీరామకృష్ణులు మమ్మల్ని ఉత్సాహపూర్వకంగా, “ఈ జన్మలోనే నేను ముక్తిని పొందుతాను,” అని దృఢంగా విశ్వసించమని చెపుతూ ఉండేవారు. సున్నితమైన ఆరోగ్యం గలవారికి గురు దేవులు మరోరకంగా చెప్పి వుండవచ్చు. కానీ, దానినే అందరికీ వర్తించే సలహాగా తీసుకోకూడదు. ఆధ్యాత్మిక సాధనలు క్రమం తప్పకుండా చెయ్యాల నేది, ఒక్క వివేకానంద స్వామి ఉద్దేశ్యమే కాదు. అందరి ఉద్దేశ్యం అదే. ఇక బుద్ధుని విషయం వేరే చెప్పాలా? “ఈ దేహం ఎండిపోనీ! దేహంలోని చర్మం, ఎముకలు, మాంసం వేర్వేరుగా రాలిపోనీ! కానీ ఆ పరమజ్ఞానాన్ని (‘బోధి’ని) పొందకుండా ఈ ఆసనం మీద నుంచి నేను లేవను!” అని నిర్ణయం తీసుకున్నది ఆయనే కదా! (లలిత విస్తార, అధ్యాయం 19). అటువంటి తపస్సు చేసింది బుద్ధుడు ఒక్కడే కాదు. ఇతరులు అనేకమంది కూడా చేశారు. మరణం అంచుల వరకు శ్రమపడిగానీ వారు ఆ స్థితిని పొందలేకపోయారు. చైతన్య మహాప్రభువు తన శిష్యుడితో, “సనాతనా! విలువైన వాటన్నింటిలోకీ అత్యంత విలువైన వాడైన శ్రీకృష్ణుణ్ణి పొందడం అంత సులభమనుకున్నావా?” అని అన్నాడు. శ్రీచైతన్యుల ఇతర శిష్యులైన హరిదాసు మొదలైనవారు ఎలా జపం చేశారో నీకు తెలుసా? పగళ్ళు, రాత్రులు ఎలా గడిచిపోతున్నాయో వారికి తెలియలేదు. సనాతన గోస్వామి చేసిన సాధనను గురించి నీవు చదివితే, భగవత్సాక్షాత్కారానికి ఆయన ఎంత పాటుపడ్డాడో తెలుస్తుంది. ఈ శరీరం శాశ్వతం కాదు. ఏదో ఒకరోజు అది రాలిపోతుంది. పారమార్థిక సాధనకు శరీరాన్ని

ఉపయోగించడం ఎంతటి భాగ్యమో! మనిషి ఆ ప్రకారం చేయలేక, 'ఎక్కువగా చేసేదంతా ప్రమాదకరమే' అంటూ నీతులు చెపుతాడు (చాణక్యశ్లోకం, 48).

తన అశక్తతను కప్పిపుచ్చుకునేందుకు మనిషి అతిగా వాగకూడదు. ఈ విషయాన్ని నేను నీకు వందసార్లు చెప్పాను; పారమార్థిక సాధనకు శరీరాన్ని ఆహుతి చెయ్యడం కంటే అధికమైనదేదీ లేదు. పతంజలి తన యోగసూత్రాలలో, "వ్యాధి, మానసిక మాంద్యం, అనుమానం, అనాసక్తి, మందకొడితనం, ఇంద్రియ సుఖాలపట్ల వీడని కోరిక, భ్రమ, ఏకాగ్రత లేకపోవడం, ఏకాగ్రతలో చంచలత్వం – మనస్సును చెదరగొట్టే ఈ వికారాలు జ్ఞానం పొందడానికి ఆటంకాలు" (1:30) అని బోధించాడు.

వ్యాసమహర్షి ఇలా చెప్పారు: "పైత్యం ప్రకోపించినప్పుడు నోటిలో పంచదార రుచించదు. కానీ, మనిషి ప్రతిరోజూ పంచదారను శ్రద్ధగా తింటూ ఉంటే క్రమంగా పంచదార మీద రుచి కలుగుతుంది; జబ్బు మానిపోతుంది. అదే విధంగా, అజ్ఞానంలో ఉన్నవారికి భగవన్నామం నచ్చకపోవచ్చు. కానీ, క్రమం తప్పకుండా పారమార్థిక సాధనలు అభ్యసిస్తుంటే అజ్ఞానం మాయమై, భగవన్నామం మీద రుచి కలుగుతుంది."

భవదీయ,

తురీయానంద

(47)

అల్మోరా,

24 మే, 1915

ప్రియమైన ఎక్స్.,

శరీరం ఉన్నంత వరకు మానవుడు సుఖదుఃఖాలకు లోనవుతుంటాడు. ఛాందోగ్య ఉపనిషత్తు: "మనిషి శరీరంతో తాదాత్మ్యం చెందుతున్నంత వరకు సుఖదుఃఖాలకు అంతు ఉండదు" (8.12.1). శరీరాన్ని గురించే ఆలోచిస్తూ పూర్తి జీవితాన్ని గడపడం అంత మంచి పని కాదు. "శరీరంతో తాదాత్మ్యం చెందకుండా ఉన్నవాణ్ణి సుఖదుఃఖాలు స్పృశించలేవు," అని అదే ఉపనిషత్తు చెప్తోంది. ఈ శరీరంలో, అశరీరమైన ఆత్మ ఉంది. అది మంచిచెడుల చేత స్పృశింపబడదు. "నేను ఈ శరీరాన్ని," అన్న భావనలో లీనమవ్వడం వల్లనే మనిషి సుఖదుఃఖాలకు లోనవుతున్నాడు. "నేను దేహాన్ని కాదు, దేహం లేని ఆత్మను," అనే దృక్పథాన్ని అలవరచుకోవడం ద్వారా మనిషి సుఖదుఃఖాలకు అతీతమవ్వడానికి ప్రయత్నం చేయాలి. నిస్సందేహంగా ఇది ఎన్నో బాధలను తగ్గిస్తుంది.

ఈ లోకంలో ప్రతిదీ ఆలోచన వల్ల సృష్టించబడుతోంది. మనం ఎలా ఆలోచిస్తే అలా తయారవుతాం. ఎల్లప్పుడూ దేహభావనతో కొట్టుకోవడం కంటే, మనిషి అప్పుడప్పుడు దేహం లేని ఆత్మనని భావించడం తప్పకుండా అతనికి మేలు కలిగిస్తుంది. ఏసు ప్రభువు ఇలా చెప్పాడు: "ఉన్నవారికి ఇవ్వబడుతుంది. లేనివాని నుండి అతనికి ఉన్నది కూడా

తీసివేయబడుతుంది" (మార్కు సువార్త, 4:25). ఇది ఎంతో సత్యం. మన గురుదేవులు, "నేనేమీ సాధించలేదే, నేను పాపిని, అని విలపించేవాడు, నిజంగా ఏమీ సాధించలేక పాపి అవుతున్నాడు," అని చెప్పేవారు.

కాబట్టి నిరాశకు లొంగిపోవద్దు. దానికి బదులు, "నేను భగవన్నామాన్ని జపిస్తున్నాను. నేనెందుకు భయపడాలి? భగవత్కృప వల్ల నా కష్టాలన్నీ మటు మాయమవుతాయి" అనుకునే స్వభావాన్ని అలవరచుకోవడానికి ప్రయత్నించు. "జై జగజ్జనని!" అనుకుంటూ ఆమె చింతనలో నిమగ్నుడివై ఉండు. ఆ విధంగా శక్తిని పొందుతావు. సోమరితనానికి లొంగిపోతే, ఆ సోమరితనమే కొనసాగుతుంది. పైకి లేవడానికి నీ సంకల్పశక్తిని ఉపయోగిస్తే, నీ సోమరితనం పారిపోతుంది. నీ శరీరం యొక్క కదలికలే నీకు మరింత శక్తిని కలిగిస్తాయి. మనిషికి గొప్ప ఉత్సాహం కావాలి. నీరసంగా, హుషారులేని స్వభావాన్ని శ్రీరామకృష్ణులు ఇష్టపడేవారు కాదు; నిర్భయంగా తెగబడే బందిపోటులాంటి వైఖరిని కావాలని ఆయన శిష్యులకు చెప్పేవారు. అదే పద్ధతిలో వివేకానంద స్వామి విసుగు చెందకుండా అనేకసార్లు ఇలా ఉద్బోధించారు: "లెండి! మేల్కోండి! గమ్యం చేరేదాకా ఆగకండి!" (కఠోపనిషత్తు, 13.14).

భయపడవద్దు; భగవానుణ్ణి ప్రార్థించు. ఆయన అన్నింటినీ అనుకూలంగా మారుస్తాడు. ఆయనేమీ పరాయివాడు కాదు. ఆయన మనవాడు, మన ఆప్తుడు అని నీ హృదయాంతరాళంలో గుర్తెరిగి ఆయనను ప్రార్థించు. సర్వం చక్కబడుతుంది. ఈ దేహం అశాశ్వతం. కానీ భగవానుడు శాశ్వతమైన వాడు. నీవు ఆయనను నీ సొంతవాణ్ణిగా చేసుకోవాలి.

ఎన్నడూ అధైర్యపడకు. నీ మానసికశక్తినంతా కూడదీసుకుని, అన్నివేళలా భగవంతుని చింతన చెయ్యి. అందరికీ ఆయనే శరణ్యం. నిన్ను సంపూర్ణంగా ఆయనకు అర్పించుకుని, శాంతచిత్తంతో ఉండు. అన్ని భయాందోళనలు వాటంతటవే వదిలిపోతాయి. ఒక నూతన శక్తి నీ హృదయంలోకి ప్రవహిస్తుంది. జయ్ భగవాన్!

ప్రేమ, శుభాశీస్సులతో,
తురీయానంద

(48)

అల్మోరా,
3 జూన్, 1915

ప్రియమైన ఎక్స్.,

నీ ఉత్తరానికి సమాధానం రెండు పంక్తులలో వ్రాయమన్నావు. సాంప్రదాయంగా ఇలా చెప్పబడింది. చైతన్య ప్రభువు శిష్యుడైన రూప గోస్వామి, తన సోదరుడైన సనాతనునికి ఒక

బ్రాహ్మణుడి ద్వారా ఒక ఉత్తరం పంపాడు. ఆ ఉత్తరంలో సంస్కృత వర్ణక్రమంలో నుండి, నాలుగు జంటల అక్షరాలున్నాయి – (య…రి) (ర…ల) (ఇ…రం) (న…య).

యదుపతేః క్వ గత మథురాపురి

రఘుపతేః క్వ గతోత్తరకోసల।

ఇతి విచిన్త్య కురు స్వమనః స్థిరం

న సదిదం జగత్ ఇతి అవధారయ॥

విడమరచినప్పుడు ఈ అక్షరాలు ఈ క్రింది అర్థాన్ని బయల్పరచాయి.

కృష్ణుడున్న ఆ మథురానగరం ఇప్పుడు ఏయై పోయినది?

రాముడేలినా ఉత్తర కోసల (అయోధ్య) ఈనాడేమైపోయినది?

యోచించుచు దీర్ఘముగా దీనిని మనసును స్థిరముగ చేసుకొని,

బుద్బుదమౌ ఈ జగ మనిత్యమని దృఢముగ నీవు తెలుసుకొమ్మురా!

తన సోదరుడు ఏమి తెలియపరచదలిచాడో సాక్షాత్కరించుకోవడానికి, సనాతన గోస్వామికి ఈ మాత్రం సూచన చాలు; ఎందుకంటే సనాతన గోస్వామి సంసార సుఖాల్లో మునిగితేలుతున్నాడు. అతని వివేకజ్ఞానం పూర్తిగా నశించింది. కానీ నీ విషయం వేరు. ఈ లోకంలోని బ్రతుకు ఒక చిన్నపిల్లల ఆట అని నీకు రూఢిగా తెలుసు; దానిలో సారం లేదు. భగవంతుడొక్కడే నిత్యం. ఆయన అనుగ్రహం వల్ల మానవుని ఏకైక ధర్మం భగవదారాధనే అని నీవు తెలుసుకున్నావు. అందువల్ల నీకు 'జగన్మిథ్య', 'ఈ లోకం అనిత్యం' అన్న విషయం చెప్పవలసిన అగత్యం లేదు. గీతలో కృష్ణుడు దృఢంగా, "అనిత్యం, దుఃఖమయమైన ఈ లోకంలోకి వచ్చిన తర్వాత నన్ను ఆరాధించు," అని ప్రకటించాడని నీకు తెలుసు (గీత: 9.33).

ఈ క్రింది గీతాబోధను పూర్తిగా ఆచరించలేకపోయినందుకు నీవు వెలిబుచ్చిన పరితాపాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకోగలను. "లోతుగా వేళ్ళు నాటుకొని ఉన్న సంసారమనే ఈ అశ్వత్థవృక్షాన్ని వైరాగ్యమనే గొడ్డలితో ఛేదించిన తర్వాత ఆ పరమపదాన్ని అన్వేషించు" (గీత: 15.3–4). రామప్రసాదు, కమలకాంతుడు వంటి మహాభక్తులు రచించిన పాటల ద్వారా పూర్వం అనేకమంది భక్తులు నీవలె పరితాపపడ్డారు. వాళ్ళు పదేపదే, "జగజ్జనని నిన్నెక్కడ ఉంచినా అది నీ శ్రేయస్సుకే," అని కూడా చెప్పినట్లు మనం తెలుసుకొన్నాం. అన్ని పరిస్థితుల లోను వారు జగజ్జననిని గుర్తుంచుకోదలిచారు. శ్రీరామకృష్ణులు ఇలా పాడేవారు:

తనువంత బూదితో పూసుకొనియున్నా

మేనంత బంగారు సొమ్ములే నిండినా

వృక్షముల ఛాయలో జీవితము సాగినా

సాక్షాత్తు సింహాసనమ్మునే ఎక్కినా

నిను మరువనట్టియా గుణము నాకబ్బితే

ఎనలేని శ్రేయమ్ము నాకు చేకూరినది!

గురుదేవులు ఇలా చెప్పేవారు: "తల్లి పిల్లి తన కూనను కొన్నిసార్లు బూడిద కుప్ప మీద ఉంచితే, కొన్నిసార్లు సోఫా మీద ఉంచుతుంది. కానీ, ఆ కూనకు 'మ్యావ్, మ్యావ్ అనడమొక్కటే తెలుసు." ఆయన ఇంకా ఇలా చెప్పారు: "కూనను ఎక్కడ ఉంచాలో తల్లికి బాగా తెలుసు." ఆమె సర్వశుభంకరి. ఆమె ఏమిచేసినా అది మన శ్రేయస్సుకే, మన మంచికే.

నిజమైన భక్తుడు దేనినీ యాచించడు. పంచవిధ మోక్షాలు – సామీప్య, సారూప్య, సాయుజ్య – వగైరాలలో దేనినీ అతడు అంగీకరించడు (భాగవతం: 3.29.13). దానికిమారు భగవానుణ్ణి సేవించడమనే భాగ్యమొక్కటే కావాలని ప్రార్థిస్తాడు. నీకిది బాగా తెలుసు. 'పాప'మనే పదాన్ని మన గురుదేవులు భరించలేరు. పాపులమని భావించవద్దని ఆయన గట్టిగా చెప్పేవారు. దానికి బదులు, "నేను భగవన్నామాన్ని తలుచుకుంటున్నాను. నాకు దిగులెందుకు? జగజ్జనని బిడ్డ ఎవరిని చూసి భయపడాలి?" అని భావించమనేవారు.

నీవు దాన్ని సరిగా చెప్పావు. జగజ్జనని తలచితే ఒక్క క్షణంలో సర్వాన్నీ లయం చేసి, సర్వాన్నీ నూతనంగా సృష్టించగలదు. ఆమె చెయ్యగలగడమే కాదు, ఆమె చేసింది, ఇంకా చేస్తున్నది కూడా. దీనిని నీ హృదయకుహరంలో అనుభూతి పొందావు. ఇది ఒక పిచ్చివాడి భ్రాంతి కాదు. ఇది యథార్థం, సత్యం. సమస్తం భగవంతునికి చెందినదే. ఆయన కరుణాసముద్రుడు. 'ఎందుకు, ఏమిటి' అనే వాటన్నింటికీ ఆయన అతీతుడు. మన భూత, వర్తమాన, భవిష్యత్తులు ఆయనే. ఆయన మన పాలిటి కల్పతరువు. ఆయనను తప్ప మనవాడుగా మరిదేనినైనా ఎందుకు అంగీకరించాలి?

"ఓ గుడాకేశ! నేను ఆత్మను. అన్ని జీవుల హృదయాలలో ఆసీనుడనై యున్నాను. సర్వభూతాలకూ నేను ఆదిని, మధ్యను, అంతాన్ని" (గీత: 10.20). కృష్ణుని ఈ వచనాలే మనకు నిరూపణ, శరణ్యం, అండ. మనమెందుకు ఇలా చెప్పకూడదు?

శ్రేయమంతయూ నీవే నాథా!
పాయుచుంటిమీ దీని ఋజువులను
రేయిపగలు భువి చూచుచుంటిమీ!
సంతసమిచ్చిన, సంతపమిచ్చిన
వింతగ తోచిన దేమి ఇచ్చినా,
అంతా నాకది శ్రేయంబే గద.
ఏమి జరిగి, నీవేమి చేసినా
కమలనాభ! నాచేయి విడువవని
సమదర్శీ! నే ఎరుగుదు చక్కగ
రారా నాథా రమ్మురమ్ము రా
సారసాక్ష! నా హృదిలో నీవే

సరసముగా ప్రత్యక్షము కావా

సర్వము శ్రేయమె జరుగును కాదా

ఇలా ప్రార్థిద్దాం. మా మనస్సులు పూర్తిగా భగవంతునిలో లీనమగుగాక! ఆయనను మేము మరచినా, ఆయన మమ్ము మరువకుండుగాక! వివేక వైరాగ్యాలను ఆయన మాకు ప్రసాదించు గాక! శాస్త్రాలు చెప్పినట్లు, "దృఢమైన వివేకం గలవాడు ప్రాపంచిక కల్లోలాల వల్ల ఎన్నడూ బాధపడడు!"

భవదీయ,

తురీయానంద

(49)

అల్మోరా,

4 జులై, 1915

ప్రియమైన డి.,

1915 జూన్, 26వ తేదీన నీవు వ్రాసిన ఉత్తరం అందింది...

పూర్వజన్మల పుణ్యవిశేషం వల్ల మానవదేహం లభిస్తుంది. ఒకసారి మనిషిగా జన్మిస్తే ముక్తి ద్వారం తెరువబడుతుంది. మానవదేహాన్ని ధరించిన తర్వాత ముక్తి కోసం పాటుపడకపోతే మళ్ళీ అటువంటి అవకాశం ఎప్పుడు లభిస్తుందో ఎవరికి తెలుసు? కాబట్టి మనిషి ఈ జన్మలోనే మోక్షాన్ని పొందడానికి అన్ని ప్రయత్నాలూ చెయ్యాలి. కాబట్టి శాస్త్రాలలో ఇలా చెప్పబడింది: "అనేక సత్కర్మల ఫలితంగా, దుఃఖసంసారాన్ని తరించడానికి సాయపడే నావలాగా ఈ దేహాన్ని సంపాదిం చావు. అది నాశనం కాకముందే దానిని సక్రమంగా ఉపయోగించుకో."

భాగవతం ఇలా చెపుతుంది: "ముక్తి పొందడానికి బాహాటంగా తెరువబడిన ద్వారం వంటి మానవజన్మను పొందిన తర్వాత, ఒక పక్షిలాగా (ఇంటిమీద, భార్యాబిడ్డల మీద అనురాగంతో, తానుగా వలలో చిక్కుకుని, వేటగాడి పాలైన పావురం కథలో చెప్పబడినట్టు) పంజరం మీద ఆసక్తుడై ఉన్నవాణ్ణి, జ్ఞానులు ఉన్నతస్థితి నుండి పతనమైనవాడిగా తలుస్తారు" (భాగవతం, 11.774). ముక్తి ద్వారాన్ని చేరి కూడా మనిషి సంపద మీద, బంధువుల మీద, గృహం మీద, తన దేహం మీద గల మమకారం చేత మాటిమాటికీ దిగజారిపోతున్నాడు. కాబట్టి మనిషి తన మమకారాన్ని సంసారం నుండి భగవంతుని వైపుకు మరలించాలి. అలా భగవంతుని మీద ప్రేమ, మానవుణ్ణి ముక్తుణ్ణి చేస్తుంది. వేరేమార్గం లేదు.

పరమాత్మ పరమకరుణామయుడు. మనిషి భగవంతుని వైపుకు ఒక్క అడుగువేస్తే ఆయన నూరు అడుగులు – కాదు వెయ్యి అడుగులు – ముందుకు వస్తాడు. ఇది పరమసత్యం. ఇది ఆచరించవలసిన విషయమే కానీ, మాట్లాడే విషయం కాదు. "ప్రభూ! నిన్ను శరణు వేడుతున్నాను. నాకు వేరెవ్వరు లేరు!" అంటూ ఎవరైనా మాటను, మనస్సును ఏకంచేసి

హృదయపూర్వకంగా ప్రార్థిస్తే, భగవంతుడు తప్పకుండా అతణ్ణి స్వీకరిస్తాడు. మరొక విధంగా జరగదు. అయితే అతడు హృదయపూర్వకంగా పలకాలి.

నీవే తల్లివి, నీవే తండ్రివి,

నీవే బంధువు, సఖుడవు నీవే;

నీవే విద్యవు, నీవే సంపద

దేవా! నా సర్వస్వము నీవే! (ప్రపన్న గీత)

ఈ ప్రకారంగా ప్రార్థించిన వాణ్ణి భగవంతుడు అంగీకరించకుండా ఉండగలడా? వచ్చిన చిక్కేమంటే - యథార్థంగా ఈ ప్రకారం ఆలోచించేవారు, ప్రార్థించేవారు ఎందరున్నారు? చైతన్య మహాప్రభువు ఇలా చెప్పారు:

ఓ నాథా! నీ కరుణ అపారం

నా దౌష్ట్యం మరి ఘోరమనల్పం!

శూన్యములౌ నా హృదిలో, బ్రతుకులో

కించిత్ భక్తియు కానరాదు గద (శిక్షాష్టకము-2)

భక్తి, పరితాపం కావాలి. అప్పుడు మాత్రమే పారమార్థిక జీవితం ఫలితాన్ని ఇస్తుంది. "ఓ ప్రభూ! నాకు హృదయ పరితాపాన్ని ఇవ్వు. నాకు భక్తినివ్వు!" అని ప్రార్థించు. శ్రీరామకృష్ణులు నిష్కపటమైన ప్రార్థనకు ప్రత్యుత్తరమిస్తారు. మనఃపూర్వకంగా, హృదయపూర్వకంగా ప్రార్థించు. అప్పుడు గురుదేవులు సంతృప్తి చెందుతారు. ఆయన సంతృప్తి చెందినప్పుడు నీవు సర్వాన్నీ పొందుతావు. నీ హృదయం భక్తిప్రేమలతో నింపబడుతుంది. నీ జన్మ ధన్యమవుతుంది. అప్పుడు ఈ పాటలోని మాధుర్యాన్ని చవిచూస్తావు.

జగదంబను ధ్యానించెడి వారికి

స్వర్గసుఖములే అధమములౌను

శ్యామ క్రీగంట చూచిన నరుడే

బ్రహ్మానందము నోలలాడును

శుభాకాంక్షలతో,

తురీయానంద

(50)

అల్మోరా,

7 జూలై, 1915

ప్రియమైన బిహారీబాబు,

శాంతి లభించడాన్ని గురించి నీవు ప్రశ్నించావు. మంచిది. ఈ విషయం నీకు బాగా తెలుసు, "అన్ని కోరికలనూ వదలిపెట్టి ఆపేక్ష లేకుండా, నేను, నాది అనే భావం లేకుండా ఉన్నవాడికి నిజమైన శాంతి లభిస్తుంది" (గీత: 2.71). "కోరికలున్నవాడు శాంతిని పొందడు.

అంచుల వరకు నీరు నిండి వున్న సముద్రంలోకి ఎంత నీరు ప్రవేశించినా, అది కదలకుండా స్థిరంగా ఉన్నట్లు, ఎవడు తన లోనికి కోరికలు ప్రవేశిస్తున్నప్పుడు కూడా ఆ విధంగా నిశ్చలంగా ఉండగలడో, అతడు శాంతిని పొందుతాడు" (గీత: 2.70).

నీకు పరిపూర్ణమైన శాంతి లేకపోవచ్చు; కానీ తప్పకుండా ఎంతోకొంత శాంతి ఉంది. భగవంతుణ్ణి నీ హృదయంలో ప్రతిష్ఠించుకుని, నేను, నాది అనే భావాన్ని నీలో నుంచి ఎంత ఎక్కువగా పారద్రోలగలుగుతావో నీవు అంత ఎక్కువ శాంతిని భగవంతుని కృపవల్ల పొందుతావు. మరొక రకంగా జరగడానికి వీలులేదు. భగవంతుడే అన్నీ చేస్తున్నాడు; మనం కేవలం ఆయన చేతిలోని యంత్రాలు. ఆయన కరుణవల్ల మనం ఈ స్వభావంలో ఎంత ఎక్కువ ప్రావీణ్యతను సాధించగలుగుతామో, మన యందున్న నేను, నాది అనే భావన అంతగా అంతరించిపోతుంది. ప్రసన్నత, ప్రశాంతత మన హృదయాలలో ఉదయిస్తాయి.

పంచదశి ఒక వేదాంత వ్యాఖ్యాన గ్రంథం. అది జ్ఞానమార్గానికి ప్రాధాన్యత నిస్తుంది. నిర్గుణబ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందడానికి కావలసిన సాధనాభ్యాసాన్ని అది వర్ణిస్తుంది. కానీ భగవానుడు గీతలో ఇలా ప్రవచించాడు: "నీ మనస్సును నాయందే ఉంచు. నీ బుద్ధిని నాయందే ఉంచు. ఇక నుంచి నాయందే జీవిస్తావు. దీనిలో ఏ మాత్రం సందేహం లేదు" (గీత: 12.8). ఇది ఎటువంటి రసవత్తర, మధుర, ఆనందమయ సందేశం!

గృహస్థుడు సమాధిని పొందగలడా అని ప్రశ్నించావు. గృహస్థులు సమాధిని పొందలేకపోతే, భగవానుని వచనాలు ఎలా సత్యమవుతాయి? గీతలో కృష్ణుడు ఇలా చెప్పాడు: "మహాపాపి అయినా అచంచలమైన భక్తితో నన్ను ఆరాధించేవాణ్ణి ధర్మాత్మునిగానే పరిగణించాలి. ఎందుకంటే అతడు సరైన నిర్ణయాన్ని తీసుకున్నాడు. ఓ పార్థా! నన్ను శరణువేడినవారు, అధమజన్మ లెత్తినవారైనా సరే, వారు కూడా పరమగతిని పొందుతారు" (గీత: 9.30,32).

సమాధి పొందకుండా ఎవరైనా 'పరమగమ్యాన్ని' పొందగలరా?

"సర్వం భగవంతునికి సమర్పించడం ద్వారా సమాధిని పొందవచ్చును" (2:45). ఈ పతంజలి యోగసూత్రం ద్వారా, 'యోగాంగాలు అభ్యసించ కుండానే సమాధిని పొందవచ్చు' అని తెలుస్తుంది. ఇదే విషయం, "భగవంతుని యందు భక్తి వలన" (1:23) అనే యోగసూత్రం ద్వారా కూడా తేటతెల్ల మవుతోంది. వ్యాసమహర్షి ఈ సూత్రం మీద ఇలా వ్యాఖ్యానించారు: "అతని భక్తికి మెచ్చి, భగవంతుడు అతని మీద తన కరుణను ప్రసరిస్తాడు. భగవంతుని కృపవల్ల యోగులు సమాధిస్థితిని, దాని ఫలితాలను తక్షణమే పొందుతారు." యోగాన్ని అభ్యసించకుండా సమాధిని పొందవచ్చు అనే భావాన్ని బలపరచడానికి ఇదే నిదర్శనం.

ఈ సందర్భంలో, కొందరు గోపికలు తమ స్వాభావిక శరీరాలను వదిలి భగవంతునిలో తాదాత్మ్యం చెందిన విషయాన్ని గురించి భాగవత దశమస్కంధం లో చేసిన వర్ణన నీకు జ్ఞాపకం ఉండవచ్చు. "ఎల్లప్పుడూ భగవంతుని యందు ఇంద్రియకామం, క్రోధం, భయం,

మమకారం, బంధుత్వం లేక భక్తి కలవారు భగవంతునితో ఏకత్వాన్ని పొందుతారు. ఇది యథార్థం" (భాగవతం, 10.29.15). భగవంతునిలో ఏకత్వాన్ని పొందడంలోనూ, సమాధిలోను తేడా ఏమైనా ఉన్నదా? నిజానికి భావనలోను, మార్గంలోను తేడా ఉంది. కానీ, చివరకు పొందిన స్థితి, దాని ఫలితం ఒక్కటే. గీతలో కృష్ణుడు ఇలా చెప్పాడు: "త్యాగులచేత పొందబడిన స్థితే, యోగుల చేత కూడ పొందబడుతుంది. త్యాగమార్గం, యోగమార్గం ఒకటేనని ఎరిగినవారు మాత్రమే యథార్థంగా దర్శించినవారు" (గీత: 5:5).

భగవద్గీత పన్నెండవ అధ్యాయంలో నిర్గుణోపాసనను, సగుణోపాసనను కృష్ణుడు వర్ణించి, సగుణోపాసన సులభం, సుఖం అని తీర్మానించాడు. తానే భక్తులను స్వయంగా ఉద్ధరిస్తానని తెలియజేశాడు. అటువంటి దయామయుడైన భగవానుణ్ణి వదలి వేరేవారిని శరణు వేడడమెందుకో నాకు అర్థం కావడం లేదు.

ప్రేమ, శుభాశీస్సులతో,

తురీయానంద

(51)

అల్మోరా

11 జులై, 1915

ప్రియమైన గిరిజ,

మొన్న నీ ఉత్తరం అంది సంతోషించాను. నీవు క్షేమంగా ఉన్నావు. అలాగే ఉండాలని ప్రార్థిస్తున్నాను. వివేకానంద స్వామి చెప్పిన ఈ సామెతను ఎన్నడూ మరచిపోవద్దు. 'నీకొక తోడువున్నా సరే, లోకపోయినా సరే – నీ ఏర్పాట్లు నీవే చేసుకో. సహాయం కోసం ఎవరి వైపు చూస్తావు?' గురుదేవులు ఇలా చెప్పేవారు: "నేను, మా అమ్మ (జగజ్జనని) ఉన్నాం. అంతే!" నీకు ఇంకెవరు కావాలి? ఆదర్శాన్ని ఓపికతో గట్టిగా పట్టుకుని ఉండడమే కావలసింది. నీవు అలా చెయ్య గలిగితే సర్వం అనుకూలమవుతుంది. గురుదేవులను అంటిపెట్టుకుని ఉండు; దానివల్ల కలిగే ఫలితాన్ని చూస్తే నీవే ఆశ్చర్యపడతావు. శ్రీరామకృష్ణులు ఇలా అనేవారు: "బొమ్మ సీతాఫలాన్ని చూస్తే నిజమైన పండు జ్ఞప్తికి వస్తుంది." అదే విధంగా గురుదేవుల ఛాయాచిత్రం నీకు గురుదేవులను గుర్తుకు తెస్తుంది. ఆ ఛాయాచిత్రంలో ఆయన సన్నిధిని కల్పన చేసుకుని, ఆయన సేవకు, ఆరాధనకు నిన్ను నీవు వినియోగించుకుంటే, నీవు కూడా ఆయన శక్తితో నిండిపోతావు.

భగవత్కార్యంలో నిమగ్నుడివి కావాలని మనస్సులో నిర్ణయించుకో, ఇతరులు ఎక్కడకు పోతే అక్కడకు పోనియ్యి. నీవు మాత్రం శాంతంగా, ప్రియతములైన గురుదేవులతో ఉన్నచోటనే ఉండు. నీ తనువు, మనస్సు ఆయనలోనే లీనమై ఉండనివ్వు. అటుయిటు పరుగెత్తి నీవేమి సాధిస్తావు? రోజులు దొర్లిపోతున్నాయి. పోయినవి తిరిగి రావు. నీ ప్రధాన కర్తవ్యాన్ని విస్మరించవద్దు. గురుదేవులను నీ సొంతం చేసుకో. ఆ తర్వాత సర్వం దానంతట అదే

అనుసరించి వస్తుంది. గురుదేవుల యందు భక్తి ఉండి, సాధన చెయ్యదలచిన వారిని నీతో ఉండనివ్వు. సన్న్యాసులు మధుకరభిక్షతో జీవించడంలో తప్పేమీ లేదు.

ప్రారంభంలో ఒక ఇల్లు కావాలని ఎంతో పట్టుదల ఉండేదనీ, అది దొరికిన తర్వాత దానిలో ఉండేవారే లేరని అతుల్ చక్కగా చెప్పాడు. మరొకసారి, నీ ఇల్లు జనసమ్మర్దంతో క్రిక్కిరిసిపోయి అందరికీ వసతి కల్పించడానికి సాధ్యమే కాకపోవచ్చు. ప్రతి ఉద్యమం వివిధ స్థితుల ద్వారా ముందుకు పోవాలి. మనిషికి అనంతమైన ఓర్పు అవసరం. ఓరిమి వహిస్తే కొంతకాలమైన తర్వాత అన్నీ సానుకూలమవుతాయి. ఓర్పు లేకపోవడం వల్లనే మనిషి దేనిని సాధించలేడు. ఓర్పుతో కొనసాగిన వానికి విజయం తప్పక సిద్ధిస్తుంది.

నాకు ప్రస్తుతం కన్‌ఖల్ వెళ్ళాలనే ఆలోచన లేదు. అలా అని నీమీద నాకు సానుభూతి లేదని కాదు. నిన్ను నేను పూర్తిగా సమర్థిస్తున్నాను. నిర్భయంగానూ, హృదయపూర్వకంగానూ నీ పారమార్థిక సాధనలను కొనసాగించు. నిన్ను గురించి ఇతరులు ఏమనుకున్నా సరే, దానిని ఏ మాత్రం లక్ష్యపెట్టవద్దు. నీ ఆధ్యాత్మిక మార్గం వీడకు. నీకు జయం కలుగుతుంది. ఈ విషయంలో నాకు గట్టి నమ్మకముంది. ప్రభువుకు జయమగు గాక! నడుం బిగించి కార్యరంగం లోకి దుముకు!

ప్రేమ, శుభాశీస్సులతో,
తురీయానంద

(52)

అల్మోరా,
21 జులై, 1915

ప్రియమైన ఎక్స్.,

నీవు 1915, జులై 14వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది. నీవు కులాసాగా ఉన్నావని తెలిసి సంతోషిస్తున్నాను. శరీరం సరిగా ఉంటే పారమార్థిక సాధనలు, భగవచ్చింతన, ధ్యానం సులభమవుతాయి. అప్పుడు, "పారమార్థిక జీవనానికి మొట్టమొదట కావలసిన సాధనం శరీరం" అనే సంస్కృత వచనంలోని సత్యాన్ని తెలుసుకోవచ్చు. భగవంతుని కృపవల్ల నీకు తీవ్రమైన ధ్యానం కుదురుతున్నదని తెలిసి ఎంతో ఆనందిస్తున్నాను. భగవంతుణ్ణి స్మరించడం కంటే కావలసింది ఇక ఏముంది? ఈ లోకానికి చెందినదంతా ఇక్కడే వదలివేయబడుతుంది. పరమాత్మను నీ సొంతవాడిగా చేసుకోవడమే ఇహపరలోకాలకు సార్థకమైన పని. భగవంతునితో మనకు గల సంబంధం శాశ్వతమైనది... అది పది, ఇరవై సంవత్సరాలతో ముగిసే సంబంధం కాదు.

భగవంతుణ్ణి శరణువేడి ఈ లోకంలో ఉండాలని ప్రయత్నించే వ్యక్తి లక్షణాలు నీవు తెలుసుకోగోరావు. ఇది నిజంగా మంచి ప్రశ్నే. కానీ, ఈ లక్షణాలు తెలుసుకునే కంటే

భగవంతునికి శరణాగతుడు కావడం ముఖ్యం. ఎందుకంటే ఈ లక్షణాలు వాటంతట అవే వ్యక్తమవుతాయి. అయినా శరణాగతుని లక్షణాలు తెలుసుకోవడంలో తప్పు లేదు.

సాధారణంగా ఈ లక్షణాలు రెండు విధాలు. మొదటిది 'స్వ-సంవేద్యం' - స్వాభావికంగా దానంతట అదే తెలిసేది. ఇది ఉత్తమమైన పద్ధతి. రెండవది 'పర-సంవేద్యం' - ఇతరుల ద్వారా తెలిసేది. మానవుని బాహ్యచిహ్నాలను చూసి, అతడు జ్ఞానం సంపాదించాడని ప్రజలు భావిస్తారు. కానీ ఈ రెండవ విధానంలో పొరపాటు పడడానికి అవకాశముంది. ఎందుకంటే ఈ లక్షణాలు సరియైనవి కాకపోవచ్చు. జ్ఞానంవల్ల కాక మరేదో కారణంవల్ల ఈ లక్షణాలు కనిపించ వచ్చు. కాబట్టి, ఈ విధానం లోపరహితం కాదు. అలాకాక తనకు స్వానుభవమై, సాక్షాత్కారమై, పరీక్షకు నెగ్గిన దానిలో పొరపాటుకు అవకాశముండదు. కాబట్టి 'స్వ-సంవేద్య'మే సత్యం. తినేవాడికే తన కడుపు నిండిందీ లేనిదీ తెలుస్తుంది.

ఉదాహరణకు ఒకని ముఖం ఎఱ్ఱబారి, కందగడ్డ అయినట్లు కనిపిస్తే అతనికి కోపం వచ్చిందని ఇతరులు అనుకోవచ్చు. ఇవి 'పర-సంవేద్యం' లేక ఇతరులకు కనిపించిన లక్షణాలు. కానీ ఈ జ్ఞానం తప్పు కావచ్చు. ఎందుకంటే, కోపం లేకుండా మరేదో కారణం వల్ల కూడా ఒకని ముఖంలో కోపలక్షణాలు కనపడ వచ్చు. కోపం నటించి ఒకడు ఈ లక్షణాలను వ్యక్తపరచవచ్చు. కోపం వచ్చిన వానికే తనకు కోపం వచ్చిందా లేదా, అది నిజమైన కోపమా కాదా అని నిస్సం దేహంగా తెలుస్తుంది. ఇది 'స్వ-సంవేద్యం' లేక అతని స్వానుభవం. మరొకప్రక్క, కోప లక్షణాలను కనపరచకుండానే ఒకడు కోపంతో లోలోన రగులుతూ ఉండవచ్చు. కాబట్టి తన సొంత అనుభవమే సత్యమైనది, పొరపాటు లేనిది.

అయినా, నీ ఉత్తరంలో నీవు ఉదహరించిన లక్షణాలు అద్భుతమైనవి. ఒక్కసారి మనిషి భగవంతుని శరణు పొందితే ఇక ఇతరుల మీద ఆధారపడవలసిన అవసరం ఉండదు. పైగా అతడిలోని నిర్భయత్వం అప్రయత్నంగా బహిర్గతమవుతుంది. ఎందుకంటే, అప్పుడు భగవదనుగ్రహాన్ని అతడు అనుభవించి, భగవంతుడే తనను సంరక్షిస్తున్నాడని తెలుసుకుంటాడు. అన్ని చెడు తలంపులు అతని మనస్సు నుండి తొలగిపోతాయి. హృదయంలో మంచి లక్షణాలు అభివ్యక్తమవుతాయి. ఒక అద్భుతమైన ప్రశాంతత అతనిలో రాజ్యమేలుతుంది. ఇవన్నీ 'స్వ-సంవేద్య' లక్షణాలు లేక తనకు తానుగా గుర్తించిన విషయాలు. అతడు విచారం లేకుండా, శాంతంగా, అందరి యెడల ప్రేమగా, ఎల్లప్పుడూ సంతృప్తిగా, ఉత్సాహంగా ఉన్నట్లు ఇతరులు గమనిస్తారు. ఇంకా ఇతర లక్షణాలు కూడా ఉన్నాయి. వ్రాయడానికి ఇంకేముంది?

భవదీయ,
తురీయానంద

(53)

అల్మోరా,

24 జులై, 1915

ప్రియమైన బిహారీ బాబు,

నా ఇచ్ఛప్రకారం జరిగేది అత్యల్పమే – 'భగవత్సంకల్పమే ఎప్పుడూ నెరవేరేది.' నేను కోలుకోవాలని నీవు ప్రార్థించడం నాకెంతో సంతృప్తిని కలిగించింది. దానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు స్వీకరించగోర్తాను. భగవత్సాక్షాత్కారం కోసం నీ వాంఛ ప్రశంసనీయం. కేనోపనిషత్తు, "మానవుడు ఆత్మను ఇక్కడ ఉన్నపుడు (అంటే జీవించివున్నపుడు) తెలుసుకుంటే అతడు నిజమైన జీవితగమ్యాన్ని పొందుతాడు. దానిని ఇక్కడ తెలుసుకోకపోతే గొప్ప వినాశాన్ని పొందవలసి వస్తుంది" (2.5) అని చెపుతోంది. భగవంతుని కోసం ఎవరు తపిస్తారో వారు తప్పకుండా భగవంతుణ్ణి పొందుతారు. "ఆత్మ ఎవరిని ఎంచుకుంటుందో, అతని చేతనే పొందబడుతుంది" (కఠోపనిషత్తు, 1.2.23). "నేను భగవంతుణ్ణి ఎంతయినా వెతకవచ్చుగాక, కోరవచ్చుగాక; కానీ ఎవరైతే ఆయనచేత ఎన్నుకోబడతారో వారికి మాత్రమే ఆయన సాక్షాత్కరిస్తాడు." మనిషి భగవంతుణ్ణి సులభంగా సాక్షాత్కరించుకోవచ్చు. ఆయన చాలా దయగలవాడు. కానీ, ఆయనను నిజంగా కోరేవారెవరు? ఇదే అసలు సమస్య. భగవంతుడు ఇలా వాగ్దానం చేశాడు: "నన్ను నిజంగా ఎవరైనా అన్వేషిస్తే, వారికి తక్షణమే నేను దర్శనమిస్తాను." కానీ ఆయనను కోరేదెవరు? భువనమోహినీమాయ యొక్క లీలానాటకం అటువంటిది. దివ్యజనని మనల్ని అనేక విషయాలలో సతమత మయ్యేటట్లు చేస్తుంది. అందువల్ల మనకు ఆమెను అన్వేషించాలనిపించదు.

ఈ సందర్భంలో శ్రీరామకృష్ణులు చెప్పిన ఒక ఉపాఖ్యానాన్ని చూద్దాం. ధాన్యపు వ్యాపారి మరమరాలలో కొంచెం బెల్లం కలిపి బియ్యపుగిడ్డంగి ద్వారం లో ఒక చేటలో ఉంచుతాడు. ఎలుకలు ఆ వాసనకు ఆకర్షించబడి అక్కడికి వచ్చి కడుపు నిండా ఆ మరమరాలు తింటాయి. కానీ ప్రక్కనే గిడ్డంగిలో ఉన్న అపారమైన ధాన్యపురాశుల విషయాన్ని పట్టించుకోవు. అదే విధంగా మనిషి తన ఆలుబిడ్డలతో సుఖంగా కాలం గడుపుతుంటాడు. కానీ భగవంతుడు తనకు అత్యంత సమీపంలో, తన హృదయంలోనే ఉన్నా, దివ్యానందాన్ని పొందాలన్న ప్రయత్నమే చెయ్యడు. మహామాయ లీల అటువంటిది. ఒక పాట ఉన్నది:

జగమెల్ల మహామాయ మోహమున భ్రమజెంద
స్పృహలేక బ్రహ్మయే నేలపై బడియుండ
చైతన్యరహితుడై చలగంగ విష్ణువు
మరి ఆశ ఏముండు మానవుల కింక?

ఇరుకైన సందు మరి ఏర్పరుపబడియుండి
తీరైన వలయచట దిద్దబడియుండగా
దూరు మార్గము బాగ తెరువబడి వున్ననూ
లోనజొచ్చిన మీను వెనుదిరిగి మరిరాదు

ఓర్మితో పట్టుపురు గొక గూడు అల్లుచు
బయటపడు మార్గంబు ఎదుటనే ఉన్ననూ
వెలి రాక తా కట్టు గూటినే చిక్కుబడి
మరి దాననే యుండు మరణించు కొరకు

మహామాయ లీలానాటకం అటువంటిది! అయినప్పటికీ దీనిలో భయాన్ని పారద్రోలే ఒక ఆశావహమైన సందేశం ఉంది.

"నన్ను మాత్రమే శరణువేడినవారు ఈ మాయను దాటుతారు" (గీత: 7.14). "హృదయపూర్వకంగా, అన్ని విధాలా అతణ్ణే శరణు వేడు. ఓ భారతా! అతని అనుగ్రహం వల్ల పరమశాంతిని, అమరపదాన్ని పొందుతావు" (గీత: 18.62).

మనిషికి శ్రద్ధ (విశ్వాసం) అవసరం. భగవదనుగ్రహంవల్ల హృదయంలో శ్రద్ధ ప్రవేశిస్తే, అతడు నిర్భయుడవుతాడు. "శ్రద్ధ, ఉత్సాహాలు కలిగి ఇంద్రి యాలను నిగ్రహించినవాడు జ్ఞానాన్ని పొందుతాడు. జ్ఞానాన్ని పొంది త్వరలోనే పరమశాంతిని పొందుతాడు" (గీత: 4.39). ఇతరులు చెప్పే మాటలు ఎలా ఉన్నా – మనిషి ఈ శాంతిని తానుగా సాక్షాత్కరించుకుంటాడు – ఆంతర్యంలో అనుభవిస్తాడు. దీనిని 'స్వ–సంవేద్యం' లేక స్వానుభవం అంటారు. ఇతరుల అభి ప్రాయాలు ఈ స్వానుభవాన్ని ఏ మాత్రం మార్చలేవు. సాక్షాత్కారం పొందినవాడి ఆత్మ బ్రహ్మానందంతో నిండిపోతుంది. అతడు "విచారపడడు, కోరుకోడు" (గీత: 18.54). భగవంతుని కృప ఉంటే ఈ స్థితిని సాక్షాత్కరించుకోవడం అసాధ్యమైన విషయం కాదు. వెయ్యి సంవత్సరాలుగా అంధకారంలో మునిగివున్న గది ఒక్క అగ్గిపుల్ల వెలిగించగానే ఒక్కసారిగా వెలుగుతో నిండిపోతుంది.

గురుదేవులు ఇలా చెప్పేవారు: "నక్కలన్నీ ఒకే రకంగా ఊళ వేస్తాయి." అంటే పరమజ్ఞానాన్ని పొందిన తర్వాత అందరికీ కలిగే అనుభవం ఒకటే. వారి మాటల్లో తేడాలేమీ ఉండవు. వారందరూ దివ్యజనని బిడ్డలే. అభిప్రాయాలు, మార్గాలు వేరయినా వారందరూ చేరేది ఒకే గమ్యం.

"అన్ని నదులు సముద్రంలోకి ప్రవహిస్తున్నట్టు – ప్రజలు అనుసరించే వివిధ మార్గాలు – వంకరటింకరగా ఉన్నా, సరళంగా వున్నా – వారి వారి స్వభావాలననుసరించి ఒకే గమ్యాన్ని చేరుతారు!" (శివమహిమ్నస్తోత్రం, 7).

'చందమామ అందరికీ మామే!' దీనిలో పొరపాటేమైనా ఉందా? నీ మనస్సు దుర్బలంగా ఉందని ఎందుకు అనుకుంటున్నావు? నీవు దివ్యజనని బిడ్డవు – అద్భుతమైన శక్తితో కూడినవాడివి. "దివ్యజననినే తల్లిగా కలిగినవాడు, ఎవరిని చూసైనా ఎందుకు భయపడతాడు?" మహాభక్తుడైన రామప్రసాదు ఇలా పాడాడు:

కాళినామమును వలయరూపమున
గిరిగీచుకు భద్రముగా నిలచితి
ఓ యముడా! నువు కరుకుగాను మరి
నాతో వదరిన, అమ్మతొ చెప్పెద
నీ పొగరణచుచు, నిను దండించును.
మహాకాలునే కాలరాయగల
అమ్మ శ్యామ తా పిచ్చిమనిషి మరి.
మహిషవాహనా! విను నేజెప్పెద,
తోకముడిచి నీ ఆన పాలింప,
అర్భకు కానుర లొంగుటకు నీకు,
పిల్లడి చేతిలో మిఠాయి కాదుర
ఏమార్చి వాని తస్కరించుటకు

దివ్యజనని బిడ్డకు శక్తికి లోటుంటుందా? ఆమె కరుణవల్ల నీకు అనంతమైన శక్తి కలుగుతుంది. గురుదేవులు ఇలా చెప్పేవారు: "ఆమె పేరుకు మాత్రమే తల్లి కాదు. ఆమె మన సొంత తల్లి". "దివ్యజనని బ్రహ్మస్వరూపిణి. ఆమె అన్ని జీవరాశులలో ఉన్నది. ఆమె గయ, గంగ, కాశీ మొదలైన అన్ని ప్రదేశాలలోను పరివ్యాప్తమై ఉంది".

"ఓ జననీ! నీవే విష్ణువు యొక్క శక్తివి. అనంత శక్తికి నీవే బీజం. నీవు ఆద్యాశక్తివి. విశ్వానికి కారణానివి. ఓ దేవీ! ఈ సమస్తప్రపంచాన్ని నీ సమ్మోహకశక్తి చేత మోహింపచేశావు. నీవు ప్రసన్నురాలవైతే మానవులకు మోక్షాన్ని ప్రసాదిస్తావు." (దేవీ మహాత్మ్యం: 11.5).

మన జనని బ్రహ్మమయి! మనకింకేమి భయముంటుంది? మనమెందుకు బలహీనులం? తాను బలహీనుణ్ణని తలచేవాడు నిజంగానే బలహీనుడవుతాడు. నీవు జగజ్జనని బిడ్డవు. నీవు దుర్బలుడివెలా అవుతావు? నీవు సర్వశక్తిమంతుడవు. ఆమె అనుగ్రహంవల్ల నీవు సాధించలేని దేముంటుంది? ఈ నేను, నాది అనే భావాన్ని వదిలించుకోవడానికి ఎంతకాలం పడుతుంది? జనని తన కృపతో ఒక్క తృటిలో హృదయాన్ని వెలుగుతో నింపగలదు. అవును, నిజంగా ఆమె అలా చేయగలదు.

భవదీయ,
తురీయానంద

(54)

అల్మోరా,

27 జులై, 1915

ప్రియమైన సురేష్ (స్వామి యతీశ్వరానంద),

చాలా రోజుల తర్వాత మొన్న నీ ఉత్తరం అంది, చాలా సంతోషం కలిగింది... భగవంతుణ్ణి నీ ద్వారా తన పనిని నెరవేర్చుకోనివ్వు. శక్తివంచన లేకుండా మీరందరూ ఆ పనిని నెరవేర్చి ధన్యత పొందండి. ఇంతకంటే ఆశించదగినదేముంది?

ఉత్తరంలో నీవు ఎందుకు అంత పరితాపపడ్డావో నాకు అర్థం కాలేదు. "ఇంతవరకు నేను ఏ అనుభవాన్నీ పొందలేదు. దిగులుతో రోజులు గడుపు తున్నాను," అన్నావు. భగవత్సాక్షాత్కారం కలగనందుకు నీవు నిజంగా దిగులు పడుతున్నట్లయితే, ఆ శుభఘడియ దగ్గర పడిందని గట్టిగా విశ్వసించవచ్చు. ఆ విధంగా నీవు ఎంత తీవ్రంగా వ్యాకులపడితే భగవంతుని కృప అంత సమీపిస్తున్నదని తెలుసుకో. కానీ, ఇంకేమైనా కోరిక మనస్సులో దాగివుండి ఈ విధమైన విచారాన్ని కలిగిస్తున్నట్లయితే, తక్షణమే దానిని తొలగించడానికి ప్రయత్నించు. ఈ విషయంలో అశ్రద్ధ చెయ్యవద్దు. ఎందుకంటే పారమార్థిక జీవనానికి అటువంటి స్వభావం ప్రబలమైన ఆటంకం. పారమార్థిక ప్రయాణానికి సమర్థుడివి కావడానికి ఎల్లప్పుడూ ప్రయత్నించు. అప్పుడు భగవానుడు సంతృప్తుడై, బ్రహ్మానందాన్ని పొందడానికి నిన్ను తగినవాణ్ణి చేస్తాడు.

"గురుగృహంలో ఆవులాగా, ఏ ఫిర్యాదూ చెయ్యకుండా ఉండు!" ఈ మాటను ప్రఖ్యాత సాధుపుంగవుడైన పవహారీబాబా నుండి వివేకానంద స్వామి విన్నారు; దానినే తరచూ ఆయన మాకు చెపుతూ ఉండేవారు. ఆ సాధువు చేసిన మరొక మహోపయుక్తమైన బోధ: "నీ సోదర శిష్యులను గురువుతో సమానంగా చూడు!"

వినమ్రతతో భగవానుని ద్వారం వద్ద వేచి ఉండడమే మన ప్రధాన కర్తవ్యం. నీవు అలా చెయ్యగలిగితే నీ మీద ఆయనకు కరుణ కలిగి తీరుతుంది. విషాదాన్ని ఆనందం ఆక్రమిస్తుంది. "భగవానుని అపార కరుణ, నన్ను ఆయన గుమ్మం వద్ద వేచి ఉండనిచ్చింది." దీనిని ఎవరు తెలుసుకొంటారో వారు భగవంతుని అపార కృపను నిస్సంశయంగా త్వరలోనే పొందుతారు. శాయశక్తులా భగవంతుణ్ణి ప్రేమించడానికి ప్రయత్నించు. సుఖదుఃఖాలను గురించి ఎందుకంత పట్టించు కుంటావు? ఆయనకు శరణాగతుడవై, ఆయన నిన్ను ఎక్కడ ఉంచినా, అది నీ మంచికేనని తెలుసుకో. నీ మనస్సులో శరణాగత స్వభావం సుస్థిరమై ఉండడానికి భగవంతుణ్ణి హృదయపూర్వకంగా ప్రార్థించు. అప్పుడు సర్వం చక్కబడుతుంది.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(55)

అల్మోరా,
14 ఆగష్టు, 1915

ప్రియమైన బిహారీబాబు,

కాలం బాల్యాన్ని హరించి యవ్వనానికి, యవ్వనాన్ని హరించి వార్ధక్యానికి దారితీస్తుంది. శరీరం రోజురోజుకి జీర్ణించిపోతుంది. ఇది శరీరధర్మం. "మానవ దేహం శాశ్వతం కాదు. పుట్టినవాడు గిట్టక తప్పదు. శరీరంతో శాశ్వతంగా జీవించినవాడు ఇంతకు ముందు ఎప్పుడైనా ఉన్నాడా, ఇప్పుడు ఉన్నాడా?" శారీరిక రుగ్మతలతో బాధపడనివాడు నిజంగా అదృష్టవంతుడు. శరీరం, తాను వేర్వేరని తెలుసుకోవడం అంత సామాన్యమైన విషయం కాదు. అలా తెలుసుకో గలిగినవాడు భగవత్కృప వల్ల పరమానందాన్ని అనుభవిస్తాడు.

నీ భార్యాబిడ్డలను గురించి ఎందుకంత ఆదుర్దా పడతావు? నేను చెప్పినదేమంటే: సర్వం భగవంతునికి సమర్పించి, శాంతంగా ఉండు! నీ భార్య, పుత్రుడు, నీ సర్వం భగవంతునికి చెందినవే. వారిని జాగ్రత్తగా చూసుకోవడమే నీ బాధ్యత. గురుదేవులు చెప్పినట్లు, "ధనవంతుని ఇంటిలోని దాసి తన యజమాని పిల్లలను తన పిల్లలుగా సాకుతుంది. కానీ తన మనస్సులో వారు నిజంగా తనకు చెందినవారు కారనీ, తన ఇల్లు ఎక్కడో ఉన్నదనీ, ఆమెకు స్పష్టంగా తెలుసు." నీవు ఆంతరంగిక త్యాగం కలిగివుండాలి. అనాసక్తుడవై ఉండి, నీ కుటుంబం భగవంతునికి చెందిందని తెలుసుకో. అలాంటి భక్తులకు ఏ ఆటంకాలూ ఉండవు. చర్చల ద్వారా భగవంతుణ్ణి తెలుసుకోవాలని ప్రయత్నించే వారికే అన్ని ఆటంకాలూ ఉంటాయి. నీవంటి వారికి కృష్ణుడు ఇలా చెప్పాడు: "కేవలం దయవల్ల నేను వారి హృదయాలలో ఉండి, ప్రకాశమానమైన జ్ఞానదీపం చేత, అజ్ఞానం వల్ల కలిగిన చీకటిని పారద్రోలుతున్నాను" (గీత: 10.11). "ఎవరి మనస్సులు నాయందు లగ్నమై ఉన్నాయో వారిని నేను మృత్యుసంసారసాగరం నుండి త్వరలో ఉద్ధరించే రక్షకుణ్ణి అవుతున్నాను" (గీత: 12.7). "అన్ని పాపాల నుండి నిన్ను విముక్తుణ్ణి చేస్తాను" (గీత: 18.66).

భగవంతుడు నీ తరఫున తాను స్వయంగా బాధ్యత తీసుకున్నాడు. "అదృష్టవంతుల భారం భగవంతుడు వహిస్తాడ"నే ఒక సూక్తి ఉన్నది. మీరందరూ అదృష్టవంతులు. నీవు ఉదహరించిన శ్లోకాలన్నీ జ్ఞానమార్గాన్ని అనుసరించే వారిని ఉద్దేశించినవి. వారు పునర్జన్మను చూసి భయపడతారు. కానీ భగవద్భక్తులు మరొకలా ప్రార్థిస్తారు: "ఓ కృష్ణా! నేను క్రిమికీటకాలలో గానీ, పక్షులలోగానీ, జంతువులలోగానీ, సర్పాలలోగానీ, రాక్షసులలోగానీ, పిశాచాలలోగానీ, మానవులలోగానీ, లేక మరెక్కడ పుట్టినా సరే. నీ దయవల్ల నీ యందు అచంచలమైన, నిశ్చలమైన భక్తి నాకు ఉండుగాక!" (ప్రపన్నగీత)

గురుదేవులు నాకిలా చెప్పారు: "నిర్వాణాన్ని కోరేవారు అల్పబుద్ధులు, స్వార్థపరులు. వాళ్ళు భయంతో నిండివుంటారు. తమ పావులను త్వరగా పండించాలని చూసే 'పచ్చీసు'

ఆటగాళ్ళలాంటి వారు. ఇలాంటి ప్రావీణ్యత లేని ఆటగాళ్ళు ఒకసారి పండిన పావును బయటికి తేవడానికి ఇష్టపడరు. అయితే, తన ప్రత్యర్థి పావును చంపే అవకాశం వచ్చినప్పుడు ఆరితేరిన ఆటగాడు పండిన పావును బయటికి తేవడానికి వెనుకాడడు. అప్పుడు, సరైన పందెం పడేలా పాచికలు వేసి, పావుల్ని మళ్ళీ పండిస్తాడు. ఎప్పుడు పాచికలు వేసినా అతనికి కావలసిన పందెమే పడుతుంది. కాబట్టి భయపడవద్దు. ఎటువంటి భయం లేకుండా ఆట ఆడు."

"అలా నిజంగా జరుగుతుందా?" అని నేను అడిగాను. అప్పుడాయన ఇలా చెప్పారు: "తప్పకుండా! జగజ్జనని కృప వల్ల అంతా జరుగుతుంది. మానవులు ఆట మానివెయ్యడం జగజ్జననికి ఇష్టం ఉండదు. దాగుడుమూతల ఆట చూడు! (ఈ ఆటలో ఒక తల్లి ఉంటుంది. ఒక దొంగ ఉంటాడు. వాడి కళ్ళకు గంతలు కడతారు. దొంగకు పట్టుపడకుండా తప్పించుకుని వచ్చి, తల్లిని తాకాలని పిల్లలు ప్రయత్నిస్తుంటారు.) పిల్లలు అటుయిటు పరిగెత్తుతూ ఉండాలనీ, ఆట ఎల్లకాలం సాగుతూ ఉండాలనీ అమ్మ కోరిక. ఆమెకు అవసరమనిపిస్తే పట్టుబడ కుండా ఉండడానికి ఒక బిడ్డకు చెయ్యి అందిస్తుంది. అదే విధంగా దివ్యజనని, నిర్వాణం కోరేవారిని చూసి సంతోషించదు. దానికి కారణం వారు ఆట నుండి విరమించుకోవాలని అనుకోవడమే. అలా కాక, ఆమె ఈ జగన్నాటకం సాగిపోతూ ఉండాలని కోరుకుంటుంది. అందువల్లనే భక్తులు నిర్వాణాన్ని కోరరు. 'ఓ మనస్సా! నేను పంచదార తినాలని కోరుకుంటున్నాను కానీ, నేనే పంచదారగా మారిపోవాలనుకోవట్లేదు' అని అంటారు."

గురుదేవులు నాకు అనేక విషయాలు చెప్పారు: "శాస్త్రాలలో ఏముంది? అవి అంగట్లో వస్తువులు కొనడానికి జాబితా వ్రాసిన చీటీల లాంటివి. కొన్న వస్తువు లను సరిచూడడానికి వాటిని ఉపయోగిస్తాం. సరిచూసుకున్న తర్వాత ఆ చీటీని అవతల పారేస్తాం. కాబట్టి నీ జ్ఞానాన్ని, నీ భక్తిని సరిచూసుకుని, అవి శాస్త్రాలతో సరిపోతున్నాయో లేదో తెలుసుకోవడానికి శాస్త్రాలను సంప్రదించాలి. 'బ్రహ్మ జ్ఞానం కలిగిన తర్వాత శాస్త్రాలు గడ్డిపరకలతో సమానం,' అని చెప్పబడింది."

దివ్యజనని శాస్త్రాలలోను, పురాణాలలోను, తంత్రాలలోను ఏముందో శ్రీరామకృష్ణులకు చూపించింది. కాబట్టి ఆయన చదువుకున్నవారు కాక పోయినా, పండితుల గర్వాన్ని అణచివేయగలిగారు. ఆయన, "దివ్యజనని నుండి ఒక్క చిన్న కాంతికిరణం నీకు లభిస్తే అది సమస్త విద్యలను అప్రధానాలుగా తేల్చివేస్తుంది," అని చెప్పేవారు.

జ్ఞాననిధిని పొందాలని నీవు శాయశక్తులా పాటుపడుతున్నావు. భక్తి సంపదను ప్రోగుచేసి దివ్యానందాన్ని అనుభవించు. ఆ సంపదే శ్రీరామకృష్ణులు. మన భాగ్యవిశేషం వల్లగానీ, నిరవధికమైన ఆయన కరుణవల్ల గానీ, ఆయనే మన ఎదుట వ్యక్తమై ఉన్నారు. కాబట్టి చెయ్యవలసినదంతా మన శాయశక్తులా ఆయనను ప్రేమించడమే. తర్వాత మిగిలినదంతా దానంతట అదే సమకూరుతుంది. కాబట్టి ఎవరైనా ఆయనను ప్రేమించగలిగితే, ప్రపంచాన్ని

మరిచిపోగలుగుతారు. పైగా ఆయన కరుణ వల్ల శరీరభ్రాంతి కూడా తొలగి పోతుంది. తపస్సు, తర్కం మొదలైన వాటివల్ల కలిగే ఫలితంలో నమ్మకమున్న వారిని అలా చెయ్యనివ్వు. మనకు వాటి ద్వారా పురోభివృద్ధి కనిపించలేదు. కాబట్టి మనం ఆయనను శరణువేడాము. ఇప్పుడు మనం ఆయన ద్వారం ముందు 'ఆయన ఇష్టం వచ్చినట్లు చెయ్యనీ' అని వేచి ఉన్నాం. నీకు కూడా ఆయనే శరణ్యమని నాకు తెలుసు. కాబట్టి భయపడవలసినదేమీ లేదు.

ప్రేమ, శుభాశీస్సులతో,

తురీయానంద

(56)

అల్మోరా

12 సెప్టెంబరు, 1915

ప్రియమైన బిహారీబాబు,

నీవొక సుదీర్ఘమైన జాబు వ్రాశావు. కానీ దానివల్ల ప్రయోజనం ఏమీలేదు? దాన్ని చూస్తే, 'పంచాంగాన్ని పిండడం' గురించి గురుదేవులు చెప్పిన ఉపదేశం నాకు జ్ఞాపకం వస్తున్నది. "ఆ సంవత్సరంలో ఒక పెద్ద వరద వస్తుందని పంచాంగంలో చెప్పబడింది. నీవు ఆ పంచాంగాన్ని పిండితే ఒక్క నీటి బొట్టైనా రాదు. శాస్త్రాలలో భగవత్సాక్షాత్కారాన్ని గురించి, రకరకాల స్థితులను గురించి, జీవన్ముక్తి (శరీరాన్ని ధరించి ఉండగానే ముక్తిలోని ఆనందాన్ని అనుభవించడం), పరమహంస స్థితి (జ్ఞానోదయాన్ని ఆనందించే వివేకస్థితి) మొదలైన అనేక విషయాలు వ్రాయబడి ఉన్నాయి. కానీ, ఈ స్థితులను సాక్షాత్కరించుకోకుండా, మీ జీవితాలలో వాటిని వ్యక్తీకరించుకోకుండా ఉంటే, దానివల్ల ఒరిగే ప్రయోజనమేముంది? ఒక శ్లోకంలో, 'పుస్తకాలలో ఉన్న విద్య, పరుల చేతుల్లో ఉన్న ధనం, సమయానికి అక్కరకు రాకపోతే అది విద్యా కాదు, అది ధనమూ కాదు'" అని చెప్పబడింది (చాణక్య శ్లోకం).

నేనిది తెలుసుకున్నాను: కేవలం స్వసంకల్పం వల్ల ఏదీ సాధ్యం కాదు. భగవంతుని కృప లేకుండా ఎవ్వరూ భగవంతుణ్ణి గానీ లేక ఏ ఉన్నతమైన పారమార్థిక స్థితిని గానీ, పొందలేరని నాకు అనిపిస్తున్నది.

ఓ వెర్రి మనసా! ఓ వెర్రి మనసా!
నిరతంబు రామునే చింతించరాదా
అన్యయోచనలన్ని అప్రయోజకముల్లు
ఓ నాదు నాలుకా! ఓ నాదు నాలుకా!
నిరతంబు రామునే జపియించ రాదా
అన్యభాషణలన్ని వ్యర్థభాషణముల్లు
ఓ నాదు చెవులార! ఓ నాదు చెవులార!
ధర్మవిగ్రహుడైన రామకథనే వినుడి.

లౌకికమ్మౌ అన్య గానంబు వ్యర్థమే
ఓ నాదు కనులార! ఓ నాదు కనులార!
సర్వంబునూ రామమయముగా చూడండి
అన్యంబునంతనూ విషముగా వదలండి

ఇదే అసలు సత్యం. ఈ భగవచ్చింతనను నిరంతరం అభ్యసిస్తేనే మనం రక్షింపబడతాం. లేకపోతే బాధ నుండి, జననమరణ పరంపరల నుండి మనకు విముక్తి లేదు.

"చందమామ అందరికీ మామే!" "నేను వెతికాను, కోరాను, కానీ కాంచలేక పోయాను. అయితే ఆయన ఎవరిని ఎన్నుకుంటే వారికే కనిపిస్తాడు." భగవంతుణ్ణి పూజించడానికి ప్రతివారికీ అధికారముంది. దివ్యజనని అందరికీ నిజంగా కన్నతల్లే. ఆమె సామాన్యమైన తల్లిలాంటిది కాదు. ఏదో ఒక ప్రయోజనం లేకుండా ఎవ్వరూ ఈ భువిలో జన్మించరు. కాబట్టి నీవు ఒక పశువునని ఎందుకు అనుకుంటావు? నీవు జగజ్జనని యొక్క నిజమైన బిడ్డవు. జగజ్జనని బిడ్డలకు భయం లేదు. కాబట్టి నీకు గానీ, నాకు గానీ భయమేమాత్రం లేదు. ఆమె ఉంచినట్లు మనం ఉంటాం – ఇంతవరకే నాకు తెలుసు. నా అల్పమేధస్సు చాలా పరిమితమైనది కాబట్టి ఏది మంచిదో, ఏది చెడ్డదో నాకు తెలియదు. "నీవు మంచి చెడ్డలకు అతీతుడివి. నన్ను కూడా వాటికి అతీతుణ్ణి చెయ్యి," ఇది నా హృదయపూర్వకమైన ప్రార్థన. "ఓ దేవా! నన్ను ఏ విధంగా అతీతుణ్ణి చేస్తావో నాకు తెలియదు. కానీ నీవలా చేస్తావనే గాఢవిశ్వాసం నాకుంది." గురుదేవులు ఇలా చెప్పారు: "తిండి లేకుండా ఎవ్వరూ ఉండరు. ప్రతివారికీ ఆహారం దొరుకుతుంది. అయితే, కొందరికి ఉదయం, కొందరికి మధ్యాహ్నం, మరికొందరికి సాయంత్రం." అందువలన మనం ఇలా ప్రార్థించాలి: "నీ ఇచ్ఛ నెరవేరు గాక!"

బ్రహ్మజ్ఞాని యొక్క స్థితి ఉదాత్తమైనది. ఈ ఉదాత్తమైన విషయాలను తెలుసుకోవాలని నేను ఆరాటపడను. నాకు ప్రధానంగా బలాన్ని ఇచ్చేది ఈ గీతాశ్లోకమని నీకు ఇదివరకే చెప్పాను: "ఎవరి మనస్సులు నాయందు లగ్నమై ఉన్నాయో వారికి నేను మృత్యుసంసార సాగరం నుండి త్వరలో ఉద్ధరించే రక్షకుణ్ణి అవుతున్నాను" (గీత: 12:7). "దేహం ధరించిన వారికి అవ్యక్త, నిరాకార, నిర్గుణ ఆదర్శాన్ని పొందడం చాలా కష్టం" (గీత: 12:5). నేను దురదృష్టవంతుణ్ణి; ఎందుకంటే నేను ఇంకా శరీరస్పృహకు అతీతుణ్ణి కాలేకపోతున్నాను. అందువల్ల నాకు నాశంలేని, పరబ్రహ్మాన్ని పొందడం చాలా కష్టం. కానీ, బ్రహ్మజ్ఞానం లేనందువల్ల మనం నిస్సహాయులమని దీని భావం కాదు. గురుదేవుల బోధనవల్ల ఈ విషయంలో నాకు నిశ్చితాభిప్రాయం కలిగినట్లుంది. నాకు జరిగిన ఒక సంఘటన చెపుతాను.

ఒకరోజు శ్రీరామకృష్ణులను దర్శించడానికి వెళ్ళాను. అక్కడ చాలామంది వారిని దర్శించడానికి వచ్చినవారున్నారు. వారిలో ఒక గొప్పవేదాంత పండితుడున్నాడు. గురుదేవులు ఆయనతో ఇలా అన్నారు: "మీ దగ్గర నుండి నేను కొంత వేదాంతం వినగోరుతున్నాను." ఆ పండితుడు గొప్ప గౌరవంతో, గంటకు పైగా వేదాంతాన్ని ప్రవచించాడు. శ్రీరామకృష్ణులు

చాలా సంతోషించారు. చుట్టూ ఉన్నవారు ఇది చూసి చాలా ఆశ్చర్యపడ్డారు. కానీ ఆ పండితుణ్ణి శ్లాఘించిన తర్వాత గురుదేవులు ఇలా అన్నారు: "నాకు సంబంధించినంత వరకూ, ఈ వివరాలన్నీ ఇష్టం లేదు. నేను, నా దివ్యజనని కంటే మరేదీ లేదు. మీకు జ్ఞానం, జ్ఞాత (తెలుసుకునేవాడు), జ్ఞేయం (తెలుసుకోబడేది); ధ్యాత (ధ్యానం చేసేవాడు), ధ్యానం, ధ్యేయం (ధ్యానం యొక్క లక్ష్యం) – ఈ విధంగా మూడుగా (త్రిపుటి) విభజించడం, చర్చించడం చాలా ఇష్టం. కానీ నాకు మాత్రం, 'అమ్మ–నేను, అంతే!' మరేమీ అక్కరలేదు. గురుదేవులు, 'అమ్మ–నేను' అనే మాటల్ని ఎంత వ్యాకులతతో అన్నారంటే – అవి అక్కడవున్న వారందరి మీద గాఢమైన చెరగని ముద్రవేశాయి. ఆ క్షణంలో వేదాంత భావాలన్నీ నామరూపాలు లేకుండా తుడిచిపెట్టుకుపోయాయి. గురుదేవుల 'అమ్మ–నేను' అనే మాటలు వేదాంతంలోని త్రిపుటి కంటే ఎంతో సులభంగా, సరళంగా, మనస్సుకు ఎక్కువ ఆహ్లాదకరంగా కనిపించాయి. 'అమ్మ–నేను' అనే భావం అనుసరించడానికి అత్యంత ఆదర్శవంతమైనదని అప్పుడు నాకు ద్యోతకమైంది.

జపం, ధ్యానం, తపస్సు అనేవి మానసిక చర్యలనే మాట సత్యమే. కానీ, ఆధ్యాత్మిక అనుభవం కూడా మానసిక చర్యయే. ప్రాపంచికమైన మనస్సుతో ధ్యానం చెయ్యడం అసాధ్యం. జపం, తపస్సుల చేత పవిత్రమైన పరిశుద్ధ మానసిక చర్యయే ధ్యానం. "ఆత్మసాక్షాత్కారమే పారమార్థిక సాధనల గమ్యం" – అంటే మనస్సును పరిశుద్ధం చేయాలని దీనికి అర్థం. తర్వాత ఆత్మానుభవం కలుగుతుంది. ఆత్మను పొందడమంటే దానిని ఎక్కడ నుంచో తీసుకురావడమని కాదు అర్థం. అది ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంది. కానీ కప్పబడిపోయి ఉంది. దానిని కప్పివుంచిన పైతొడుగు కూడా మనస్సులోనే ఉంది. దానిని తొలగించాలి. ఆత్మను ఆర్పివేసేదేదీ లేదు. అది స్వయంప్రకాశకం, నిత్యం.

ఉదాహరణకు ఒక స్త్రీ మెడలో పెట్టుకున్న కంఠహారం, పైన వేసుకున్న ఉన్నికోటుతో కప్పబడి ఉందన్న మాట మరచిపోయి దాని కోసం అక్కడ ఇక్కడ వెతకసాగింది. తర్వాత అది ఉన్ని కోటు క్రింద ఉన్నదనే విషయం జ్ఞప్తికి వచ్చి దానిని కనుగొంది. అదే విధంగా ఆత్మజ్ఞానం లేకపోయినా ఆత్మ ఎల్లప్పుడూ ఉంది. ఈ జ్ఞానం ఉదయించినప్పుడు ఆత్మను తెలుసుకున్నారని అంటారు. లేకపోయినా, అది తెలియబడుతున్నది. "మనస్సు ఇంద్రియ విషయాలకు అనుసంధించబడి ఉన్నప్పుడు అది అపవిత్రమవుతుంది. ఇంద్రియవిషయాల నుండి వేరయినప్పుడు పవిత్రమవుతుంది." అదే మనస్సును ఇంద్రియవిషయాల మీది నుండి భగవంతుని మీదికి మరల్చినప్పుడు పవిత్రమవుతుంది.

పెంపుడుపిల్లి అడవిలోకి పోతే అది క్రూరమైన అడవిపిల్లి అవుతుంది. సత్యాన్ని గురించిన ఊహ పరిపక్వమై పండినప్పుడు సాక్షాత్కారంగా మారుతుంది. కానీ సత్యాన్ని దృఢంగా పట్టుకుని ఉండాలి. మనిషి ప్రారంభంలో ఊహించాలి; ఆ ఊహను అనుసరించి సాక్షాత్కారం వస్తుంది; లేకపోతే అలా జరగదు. ఈ ఆత్మను గురించి మొదట వినాలి. తర్వాత దానిని

గురించి చింతన చేయాలి; చివరగా దానిని ధ్యానించాలి. తర్వాత అది అనుభవమైనప్పుడు, దానినే సాక్షాత్కారం అంటారు.

భవదీయ,

తురీయానంద

(57)

అల్మోరా,

29 సెప్టెంబరు, 1915

ప్రియమైన బిహారీబాబు,

నీవు సెప్టెంబరు 21 తేదీన వ్రాసిన ఉత్తరం అంది సంతోషించాను... నేను వేదాంతాన్ని త్రోసి పారవెయ్యలేదు. అది పారవేసే విషయమా? వేదాంతమే మన జీవనం. కానీ ప్రశ్న ఏమిటంటే: వేదాంతమంటే ఏమిటి? నీవు అద్భుతంగా చర్చించావు. దానిని గురించి చెప్పడానికి నాకు ఇంకేమీ మిగలలేదు. అయినా, నేను ఒక్క విషయం సూచించదలచాను. ఏ ఆరాధకుడైనా కేవలం జడపదార్థాన్ని ఆరాధించడు. సచ్చిదానంత స్వరూపమే ఉపాసకులందరికీ ఇష్టదేవత, ఆరాధ్య వస్తువు. కోరికలున్నవారు స్వర్గాదిభోగాల కోసం, ఇతర భోగవస్తువుల కోసం ప్రార్థిస్తారు. కృష్ణుడు గీతలో చెప్పాడు: "విశాలమైన స్వర్గలోకాన్ని అనుభవించి, చేసుకున్న పుణ్యం క్షీణించగానే వారు మానవలోకంలోకి తిరిగి వస్తారు. ఆ విధంగా మూడు వేదాల ధర్మాలను (ధర్మ, అర్థ, కామాలను) అనుసరిస్తూ, కోరికలను కోరుతూ, జననమరణాలకు లోనవుతూ ఉంటారు" (గీత: 9.21).

ఇది స్వర్గాన్ని కోరి వైదికయజ్ఞాలు ఆచరించే కర్మిష్ఠులకు సంబంధించింది. భక్తులకు కానీ, జ్ఞానులకు కానీ స్వర్గం గమ్యం కాదు. ఇప్పుడు విచారణీయాంశం 'ఆత్మ'. ఆత్మ అఖండ సత్, చిత్, ఆనంద స్వరూపం. భక్తులు వారివారి స్వభావాలననుసరించి ఈ ఆత్మను లేక బ్రహ్మాన్ని వివిధ రీతులలో ఆరాధనా విషయంగా భావిస్తారు. కొంతమంది ఆ బ్రహ్మాన్ని అఖండమనీ, దానిలో తాము అంశలమనీ భావిస్తారు. కొంతమంది తాము బ్రహ్మంతో ఏకమని తలుస్తారు. మరికొందరు బ్రహ్మాన్ని తమ ప్రభువనీ, తాము ఆయన కన్నా వేరనీ తలుస్తారు. కానీ ఇటువంటివారు (ద్వైతులు) కూడా తాము జడపదార్థమని అనుకోరు. దానికి బదులు తాము కూడా చైతన్య స్వరూపులమని భావిస్తారు. కాబట్టి, ఎక్కడా ఉపాసకుడు జడపదార్థమని చెప్పబడలేదు. ఉపాసకుడు, ఉపాసించబడే దేవత, ఇరువురూ చైతన్య స్వరూపాలే. సాధకుల ప్రవృత్తులు మాత్రం వారివారి స్వభావాలను బట్టి వేర్వేరుగా ఉంటాయి.

ఈ సందర్భంలో శ్రీరాముణ్ణి, ఆయన భక్తుడైన హనుమంతుణ్ణి గురించి ఒక ఆహ్లాదకరమైన కథ చెప్పడం అప్రస్తుతం కాదనుకుంటాను. ఒకసారి రాముడు ఋషుల, సాధువుల సమాగమంలో ఆసీనుడై ఉన్నాడు. ఆ సభికులలో హనుమంతుడు ఉండడం చూశాడు. అక్కడ చేరిన అన్ని రకాల భక్తులనూ సంతృప్తిపరిచే ఉద్దేశ్యంతో, రాముడు హనుమంతుణ్ణి, "నన్ను

నీవు ఎలా తలుస్తావు?" అని ప్రశ్నించాడు. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన హనుమంతుడు తనలో తాను ఆలోచించుకున్నాడు: "భగవంతునికి మన మనస్సులో ఉన్న భావాలన్నీ తెలుసు. అయినా నన్ను ఈ ప్రశ్న అడిగాడు కాబట్టి, ఈ ప్రశ్న వెనకాల ఏదో ప్రత్యేకమైన ప్రయోజనం ఉండి ఉండాలి." ఇలా ఆలోచించి హనుమంతుడు ఈ ప్రత్యుత్తర మిచ్చాడు: "ఓ ప్రభూ! నాకు దేహబుద్ధి ఉన్నప్పుడు, నేను నీ దాసుణ్ణి. నన్ను నేను ప్రత్యేకమైన జీవునిగా తలుస్తున్నప్పుడు నేను నీలో ఒక అంశను (భాగాన్ని); నేను ఆత్మనని భావించినప్పుడు నేను నీవు ఒకటే – ఇది నా నిశ్చితాభిప్రాయం."

ఈ ప్రకటన ద్వారా హనుమంతుడు అన్నిరకాల భక్తుల భావాలు వివరించాడు. వేదాంత సాంప్రదాయాలన్నింటి యొక్క సారాంశం ఇదే. దీనిలో ఏ ఒక్క భావాన్నీ విడిచిపెట్టలేదు. ఇంకా, వారివారికి తగిన స్థానం ఇవ్వబడింది. శరీరస్మృతిని దాటని వారికి దాసుడి యొక్క భావం: "ప్రభూ, నీవు యజమానివి, నేను నీ సేవకుణ్ణి." తనను తాను జీవాత్మగా భావించుకుంటూ, శరీరస్మృతిని కొంతవరకు దాటినవారికి అంశ భావం: "ప్రభూ! నీవు పూర్ణుడవు, నేను నీలోని అంశను." ఇక ఆత్మసాక్షాత్కారమైన వారికి అద్వైతభావం: "నీవు నేను ఒకటే." ఈ స్థాయిలో నీవు నేను వేరువేరు అనే ప్రసక్తే లేదు.

హనుమంతుడి అభిప్రాయం మూడు వేదాంత సాంప్రదాయాలను – ద్వైత, విశిష్టాద్వైత, అద్వైత సాంప్రదాయాలను తెలుపుతోంది. తన ఎదుట సమాసీనులైన భక్తులందరినీ తృప్తిపరచడానికి రాముడు మహాభక్తుడైన హనుమంతుని నోటినుండి సత్యం యొక్క మూడు రీతుల్ని వివరించేలా చేశాడు. ఇది వేదాంత సత్యానికి ఇవ్వబడిన సర్వోత్తమమైన వివరణ.

ఎవ్వరూ అసంతృప్తి చెందనక్కరలేదు. ఏయే పరిస్థితులలో ఉంచబడినా అందరూ ఒకే దైవాన్ని ఆరాధిస్తున్నారు. అందరూ ఆయనతోనే సంబంధం కలిగివున్నారు. కృష్ణుడు గీతలో ఇలా చెప్పాడు: "నేను అందరి హృదయాలలో తిష్ఠవేసి ఉన్నాను. స్మృతి, జ్ఞానం కలగడంతో పాటు అవి నష్టపోవడం కూడా నా వల్లే జరుగుతోంది. వేదాల ద్వారా తెలుసుకొనవలసినవాణ్ణి నేనే. వేదాంతానికి రచయితను నేనే, వేదాలు తెలిసినవాణ్ణి కూడా నేనే" (గీత: 15.15).

ఒకే ఒకడైన ఆ పరమపురుషుడు సర్వవ్యాపకమైన చైతన్యం. అన్నింటిలోనూ బయట, లోపల వ్యాపించి ఉన్నాడు. సర్వవేదజ్ఞానం తెలిపే విషయం ఆయనే, వేదాలకు కర్త ఆయనే, వేదాలను తెలిసినవాడు కూడా ఆయనే. ఇది తెలిసినవాడే వేదాంతాన్ని తెలుసుకున్నవాడు. దీన్ని దర్శించలేనివాడు, గ్రంథాలన్నీ అధ్యయనం చేసినప్పటికీ కూడా, వేదాంతాన్ని గురించి నిజంగా ఏమీ అర్థం చేసుకోనివాడే అవుతాడు. నేను అర్థం చేసుకున్నది ఇది: "నేనున్నాను – మా అమ్మ ఉంది." గురుదేవుల బోధను నేను ఈ విధంగా అర్థం చేసుకున్నాను. ఆయన జడమని, చైతన్యమని వేరువేరుగా ఉదహరించలేదు. చైతన్యాన్ని గురించి మాత్రమే ఆయన ప్రసంగించారు: "ఉపాసకుడు చైతన్యం. అదే విధంగా ఉపాస్యం (దైవం) కూడా చైతన్యమే. బిడ్డకు తల్లి తప్ప మరేమీ తెలియదు. దీనినే 'ఏకాగ్రభక్తి' అంటారు."

సర్వం భగవంతుడే. గీతలో కృష్ణభగవానుడు ఇలా చెప్పాడు: "నా గురించి ఇంత ఎక్కువగా తెలుసుకుని ఏమిటి ప్రయోజనం? ఓ అర్జునా! నాలోని ఒక్క అంశతోనే ఈ సమస్త జగత్తును భరిస్తున్నాను" (గీత: 10.42). ఇది ఋగ్వేదంలో కూడా చెప్పబడింది. బ్రహ్మం ఈ విధంగా వర్ణింపబడ్డాడు: "సమస్త జీవులు, ఈ విశ్వం ఆయనలో పావువంతు మాత్రమే. మిగిలిన మూడువంతులు శాశ్వతమైన స్వర్గంలో ఉంటాయి" (ఋగ్వేదం: 10.90.3).

ఇక జీవుణ్ణి (జీవాత్మను) గురించి విచారిద్దాం: జీవుడు ద్వైత అనుభవం నుండి విశిష్టాద్వైత అనుభవానికి, చివరకు అద్వైతానుభూతికి పరిణామం చెందుతాడు. ఇది వేదాంతానికి సంబంధించి ఏకాభిప్రాయం సాధించిన సత్యం. సర్వం బ్రహ్మమే. ఆయనే నిరూపణ, నిరూపించవలసిన వాడు, నిరూపించేవాడు. ఆయనే ఆత్మ, జీవుడు, విశ్వం. బ్రహ్మం కానిది మరేదీ లేదు. బ్రహ్మం కంటే అన్యమైనది ఉందనేవాడు భ్రాంతిలో ఉన్నవాడు. అతడు నిద్రలో మాట్లాడుతూ, ఆ విషయమే తెలియనటువంటి వాడు. ఈ అవ్యక్తమైన బ్రహ్మం ఆరోపణ, ప్రత్యారోపణల ద్వారా వ్యక్తమైనట్లు కనిపిస్తాడు. ఈ సందర్భంలో తైత్తిరీయో పనిషత్తు సృష్టిని గురించి ఈ విధంగా సూచించింది: "ఆత్మ నుండి (బ్రహ్మం నుండి) ఆకాశం పుట్టింది. ఆకాశం నుండి వాయువు ఇత్యాదులు." (తైత్తిరీయ ఉపనిషత్తు: 2.1.3). ఇది నిజమైన సృష్టిని తెలపడం లేదు. "సృష్టి లేదు, లయ లేదు, ఎవరూ బంధాలలో లేరు, సాధన చేసేవారెవరూ లేరు, ముక్తిని కాంక్షించే వారెవరూ లేరు, ముక్తిని పొందేవారెవరూ లేరు. ఇదే పరమసత్యం" (మాండూక్య కారిక: 2.32). ఇది వేదాంతం యొక్క అంతిమ నిర్ణయం.

(టిప్పణి: పరబ్రహ్మాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే, అది ఒక్కటే ఉంది. మరేదీ లేదు. దానిలో మార్పు కలగదు. దాని ఉనికికి వేరే కారణం కానీ, దాని నుంచి వచ్చే ఫలితం కానీ లేవు. దాని నుంచి ఫలానా వస్తువులు జన్మించాయని చెప్పలేము. పరబ్రహ్మ దృక్కోణం నుంచి ఈ చరాచర సృష్టిని వివరించలేము. అవిద్య (అజ్ఞానం) లేదా తమస్సు చేత కప్పబడిన ఈ తారతమ్య లేదా సాపేక్ష ప్రపంచ దృక్కోణం నుంచి మాత్రమే సృష్టిని వివరించగలం. పరబ్రహ్మంలోనే ఉన్న ఆ అవిద్యే దాని యొక్క సృష్టి శక్తి. ఇదే సృష్టికి కారణం.)

"నిజమైన భక్తునికి కోరిక లేదు. స్వర్గమోక్షాలు ఇచ్చినా అతడు వాటికి అంగీకరించడు. భగవంతుని సేవాభాగ్యం కోసమే అతడు ప్రార్థిస్తాడు" అని భాగవతంలో భగవానుడు ప్రకటించాడని నీకు తెలుసు. శాస్త్రాధ్యయనం, జపం, తపస్సు, ధ్యానం, ధారణ లేక సమాధి అనేవే పరమగమ్యమని ఎవ్వరూ చెప్పలేదు. "భగవంతుణ్ణి తెలుసుకున్నప్పుడు మాత్రమే మృత్యువును దాటుతారు. పరమగమ్యానికి మరొక మార్గం లేదు." (శ్వేతాశ్వతరోపనిషత్తు: 3.8) ఇదే వేదాంత ప్రమాణం.

శ్రీకృష్ణుడు గీతలో ఇలా చెప్పాడు: "బ్రహ్మలోకసహితంగా, అన్ని లోకాలలో ఉండేవారికి పునర్జన్మ ఉంది. ఓ అర్జునా! కుంతీపుత్రా! నన్ను పొందిన వారికి ఇక పునర్జన్మ ఉండదు" (గీత: 8.16). "ఓ గుడాకేశా! నేను సర్వభూతాల హృదయాలలో నిలిచి ఉండే రూపుదాల్చిన ఆత్మను (ప్రత్యగాత్మను). సర్వభూతాల పుట్టుక, ఉనికి, అంతం కూడా నేనే" (గీత: 10.20).

"పరమగమ్యం, పోషకుడు, ప్రభువు, సాక్షి, నివాసం, శరణం, సఖుడు, సృష్టికర్త, సంహారకుడు, పునాది, నిధి, అక్షయబీజం, సర్వం నేనే" (గీత: 9.18).

కాబట్టి భగవంతుడు సర్వవ్యాపి అని ఇంకా ఎక్కువగా విశదీకరించనవసరం లేదు. మామిడి తోటకు వెళ్ళి పండ్లు తినడం వల్ల ఆనందం కలుగుతుంది కానీ, ఆకులు లెక్కించడం వల్ల ఏమిటి ప్రయోజనం? భగవంతుని చేత నియమించబడిన గురువులు ఇతరుల ఆధ్యాత్మిక సమస్యలను పరిష్కరించే మార్గదర్శకులవుతారు. మామిడి పండ్లు తింటే చాలు, మనం ధన్యులమవుతాం. గురుదేవులు నిన్ను మామిడితోట యజమానికి (భగవంతునికి) పరిచయం చేయాలనేదే ఆయనకు నా ప్రగాఢమైన ప్రార్థన.

భవదీయ,

తురీయానంద

(58)

ప్రియమైన సచిన్,

నీ ఉత్తరం అంది సంతసించాను. అటువంటి ఉత్సాహం, వ్యాకులత నిన్ను విడువకుండా ఉండాలి! ఈ జీవితాన్ని అభివృద్ధి చేసుకుని, చిత్తశుద్ధిని అభ్యాసం చెయ్యడానికి ప్రతివారికీ తీవ్రమైన ఉత్సాహం కావాలి. ఆ విధంగా మనిషి భగవద్భక్తిని పొంది, తన జీవితాన్ని ధన్యం చేసుకుంటాడు. నీకు అటువంటి వ్యాకులత ఉందని తెలిసి ఆనందించాను. గురుదేవులు నీకు శక్తిని ప్రసాదించాలన్నదే నా హృదయపూర్వకమైన ప్రార్థన.

ఇంద్రియాలను జయించడం చాలా కష్టం; కానీ మరొక మార్గం లేదు. "ఏ ఇంద్రియాన్ని మొదట నిగ్రహించాలి?" అని అడిగావు. ఈ విషయంలో కృష్ణుడు గీతలో ఇలా చెప్పాడు: "యోగి వాటినన్నింటినీ నిగ్రహించి, నా యందు నిమగ్నుడై ఉంటాడు. ఎవరు ఇంద్రియాలను వశంలో ఉంచుకుంటారో, అతని ప్రజ్ఞ స్థిరమైనది" (గీత: 2.61). మనువు ఇలా చెప్పాడు: "ఒక్క ఇంద్రియమైనా నిగ్రహం లేకుండా ఉన్నట్లయితే, ఓటికుండ నుండి నీరంతా కారిపోయినట్లు, జ్ఞానమంతా అతనిని వదలిపోతుంది" (మను సంహిత: 2.99).

కాబట్టి, ఇంద్రియాలన్నింటినీ నిగ్రహించాలి. అన్ని ఇంద్రియాలూ ప్రమాద కరమైనవే అయినా, నాలుక, జననేంద్రియం నిస్సందేహంగా ప్రధానమైనవి. నాలుకను (రసేంద్రియాన్ని) నిగ్రహం చెయ్యలేకపోతే అతణ్ణి ఇంద్రియ నిగ్రహం కలవాడని అనడానికి వీలు లేదు. జిహ్వను (నాలుకను) జయిస్తే, ఇంద్రియా లన్నిటిని జయించినట్లే" (భాగవతం: 11.8.21). కాబట్టి నాలుకను జయించడం ప్రథమ కర్తవ్యం. భగవంతుడు మరో దృక్పథం నుండి ఇలా చెప్పాడు: "నిగ్రహాన్ని అభ్యసిస్తున్న సాధకుని నుండి ఇంద్రియ విషయాలు దూరమవుతాయి. కానీ వాటి మీద వాంఛ పోదు. కానీ పరబ్రహ్మ దర్శనమైనప్పుడు వాటి మీద వాంఛ కూడా తొలగి పోతుంది" (గీత: 2.59).

మన గురుదేవులు, "పటికబెల్లం పానకం రుచి చూసినవాడికి బెల్లపు పానకం చౌకగా కనిపిస్తుంది," అని చెప్పేవారు. అంటే మనిషికి భగవంతుని మీద ప్రేమ వృద్ధి చెందితే, మానవ ప్రేమను లెక్కచేయడు. మనిషికి, భగవంతుని మీద ప్రేమ ఉండాలి, అప్పుడు ఇంద్రియ వస్తువులు సారహీనమవుతాయి. భగవత్ప్రేమతో పోలిస్తే సమస్తం నిరుపయోగంగా కనిపిస్తుంది." "నీవు తూర్పువైపు పోయేకొద్దీ, పశ్చిమానికి దూరమైపోతావు." అదే విధంగా భగవంతుణ్ణి చేరుకొనేకొద్దీ ఇంద్రియాకర్షణలు తగ్గిపోయి వెనుకకు పోతుంటాయి. ఇంద్రియాలను నిగ్రహించడానికి ప్రత్యేకమైన ప్రయత్నమేమీ చెయ్యనక్కరలేదు. దీనిలో ఉన్న రహస్యమదే. ప్రధానమైన విషయం భగవదారాధన. అది చేస్తే నాలుకను, ఇతర ఇంద్రియాలను నిగ్రహించడానికి పాటుపడనవసరం లేదు – వాటంతట అవే నిగ్రహించబడతాయి.

భగవదారాధన అంటే హృదయాన్నీ, ఆత్మనూ, సర్వాన్నీ భగవంతునికి సమర్పించడం. అప్పుడు ఆయన అన్నింటికంటే ప్రియతముడవుతాడు. మానవుని వ్యాకులత అంతా భగవంతుని వైపు మరల్చబడుతుంది. మనిషి భగవంతుణ్ణి దర్శించాలని విలపిస్తే, ఆయనను ప్రేమిస్తే, భగవంతుడు అతని హృదయంలో భక్తిని ప్రసాదిస్తాడు. ఆయన అనుగ్రహం అవసరం, అది లేకపోతే ఏదీ సాధ్యం కాదు. కానీ, గురుదేవులు ఇలా చెప్పారు: "మనిషి భగవంతుని వైపు ఒక్క అడుగు వేస్తే, భగవంతుడు అతనివైపు నూరు అడుగులు వేస్తాడు. ఆయన చాలా దయామయుడు." ఇదే మన శాశ్వతమైన ఆశ.

నీ శాయశక్తులా భగవానుణ్ణి ప్రేమించడానికి ప్రయత్నం చెయ్యి. అప్పుడు భగవంతుడెంత దయామయుడో నీవే చూస్తావు. నీవు ఏమి తింటున్నా, ఏది ధరిస్తున్నా ఫర్వాలేదు. చిన్న చిన్న కోరికలను తీర్చుకోవచ్చు కానీ అది వివేకంతో చేయాలి. భగవంతునికి తప్ప మరి దేని చేత నీవు ఆకర్షింపబడకుండా జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉండాలి. సత్సాంగత్యం, భగవంతుని గురించి మాత్రమే ప్రసంగించడం, సద్గ్రంథపఠనం, చెడు సహవాసాలను వదలడం అనేవి భక్తిని సాధించడానికి అవసరం. ఈ విధంగా భగవంతుని వైపు పోవడానికి ప్రయత్నించు. అప్పుడు ఏ భయమూ ఉండదు. భగవంతుణ్ణి శరణువేడిన వాడికి ఆందోళనలు, బాధలు ఉండవు. గీతలో కృష్ణుడు ఇలా చెప్పాడు: "ఆయన అనుగ్రహంవల్ల పరమశాంతిని, శాశ్వతమైన స్థానాన్ని పొందుతావు" (గీత: 18.62). ఇంకేమి వ్రాసేది? ఆయననే శరణువేడు. నీవు అవిచ్ఛిన్నమైన ఆనందాన్ని పొందుతావు.

ప్రేమ, శుభాశీస్సులతో,
తురీయానంద

(59)

అల్మోరా,
23 అక్టోబరు, 1915

ప్రియమైన బి.,

చాలా రోజుల తర్వాత నీ ఉత్తరం అందింది. నీవు క్షేమంగా ఉన్నావనీ, నీ పని చేసుకుంటూ పోతున్నావనీ తెలిసి ఆనందిస్తున్నాను. భగవంతుని సంకల్పమేమిటో ఆయనకే తెలుసు. అది మానవబుద్ధికి అతీతమైనది. కానీ, శాస్త్రాల నుండి, సాధుపుంగవుల నుండి మనం అర్థం చేసుకున్నది ఇది: ఆయన సర్వశ్రేయస్కరుడు. మనకు భయంకరంగానూ, ప్రతికూలంగానూ కనిపించే దానినుండే ఆయన మంచిని బయటకు తీస్తాడు. ఈ భావనలో దృఢవిశ్వాసముంటే మనిషికి శాంతి కలుగుతుంది. లేకపోతే అశాంతిని, బాధలను అనుభవించక తప్పదు. గీతలో కృష్ణుడు చెపుతున్నాడు: "యజ్ఞం, తపస్సుల భోక్తను, సర్వలోకాలకు ప్రభువును, సర్వభూతాలకు స్నేహితుణ్ణీ అయిన నన్ను తెలుసుకుని, జ్ఞాని శాంతిని పొందుతున్నాడు" (గీత: 5.29).

ప్రజల బాధలను గురించి నీవు చేసిన వర్ణనను చదివి మేము విచారపడ్డాం. కానీ, నాకొక విషయం జ్ఞాపకం వస్తున్నది. వివేకానంద స్వామి మాటలు నీకు జ్ఞాపకమున్నాయని తలుస్తున్నాను.

"మూర్ఖుడా! జీవించు వేల్పునే గనవేమి?
అగణితములైనట్టి వాని ప్రతిబింబములు
జగమెల్ల నిండినవి చిన్నచూపేల రా!
విద్వేషముల పెంచు తలపోత నీడలను
వెన్నాడి, విడచితివి కాననగు దేవుణ్ణి,
అతని నర్చించుమీ, ఇతరమూర్తుల ద్రుంచి!
(ఒక మిత్రునికి ఒక పద్యము - స్వామి వివేకానంద)

ఈ కరవుపీడితులైన ప్రజలను నీవు సక్రమంగా సేవించగలిగితే, దానివల్ల నీవు నిస్సందేహంగా భగవంతుణ్ణి సేవిస్తున్నట్లే! మీరందరు ధన్యాత్ములు! తనను సేవించడానికి భగవానుడు మీకీ అద్భుతమైన అవకాశాన్ని కలిగించాడు. ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుని మీ జీవితాలను ధన్యం చేసుకోండి. ఇంతకంటే ఎక్కువ నేనేమి చెప్పేది? నీవు సరైన దృక్పథంతో సేవ చేస్తూ ఉంటే – నీ మానసికస్థితి కూడా చక్కగా ఉంటుంది. ప్రయత్నం చెయ్యి! దాని ఫలితాన్ని చూడగలుగుతావు. అసలు ఆచరించకుండా ఎలా అర్థం చేసుకోగలవు? నీ కామసంబంధమైన సమస్య కూడా మాయమై పోతుంది. ఇంద్రియకామం ఒక మానసిక బలహీనత తప్ప మరేదీ కాదు. అగ్నికి ఇంధనం చేర్చకపోతే అది ఆరిపోయినట్లు కామవాంఛ కూడా సుఖాన్ని దానికి అందించకపోతే నిన్ను వదలి వేస్తుంది. కామం కలిగినప్పుడు భగవంతుణ్ణి తీవ్రంగా ప్రార్థించి, సహాయం కోసం భోరున విలపించు. అలా చేస్తే నీలో కామవాంఛ మళ్ళీ తలయెత్తదు.

నీకు చేతనైనంత ఎక్కువగా జపం, ధ్యానం క్రమంగా అభ్యసించు. నీ పనిని కేవలం లౌకికకర్మగా తలచకుండా భగవంతునికి అర్చన చేస్తున్నట్లు భావించు. "నేను ఏ కర్మ చేస్తున్నా అది నీకు నేను చేసే ఆరాధన" (శివమానసపూజా స్తోత్రం, 4). భగవంతునికి సమర్పణ బుద్ధితో పని చేస్తే అది అర్చన క్రింద మారి యోగం అవుతుంది. ఆ విధమైన పని నిస్సందేహంగా మహత్కార్యం! అహం కారాన్ని తుడిచి వేసుకుని, భగవంతునికి శరణాగతుడై కర్మ చేసినప్పుడు అది నిజంగా ఆరాధన అవుతుంది. నీవు ఈ విషయాన్ని జ్ఞాపకముంచుకుంటే చాలు. ఒక్కసారిగా జయం కలుగకపోయినా సరే వదలకుండా, దీనిని మళ్ళీమళ్ళీ అభ్యసించు.

శుభాశీస్సులతో,
తురీయానంద

(60)

అల్మోరా,
25 అక్టోబరు, 1915

ప్రియమైన ప్రియనాథ్,

బంకూరా ప్రజల దుర్భరస్థితిని తెలుసుకుని ఎంతో బాధపడ్డాను. అక్కడి పరిస్థితులను గురించి ఎక్స్ కూడా తన ఉత్తరంలో హృదయవిదారకంగా వర్ణించాడు. ఈ క్షామపీడిత ప్రజలను, మీరిప్పుడు మీ సర్వశక్తులను ఉపయోగించి సేవించి మీ జీవితాల్ని ధన్యం చేసుకోవలసి ఉంది. దానికిమారు నీవు వ్రాసినది చూస్తే, నీకు సరైన అవగాహన లేనట్టు తోచింది. నీ ఉత్తరం చదివి నేను ఆశ్చర్యపోవడమే కాక ఎంతో బాధపడ్డాను కూడా. ఈ పని నుండి తప్పించబడాలని కోరుతూ, నన్ను ఆశీర్వదించమన్నావు. కానీ, ఇది తప్పిపోయిన తర్వాత నీవు ఇంకేపని చేస్తావు? భగవంతుణ్ణి ఆరాధించడమా? "తారతమ్యం లేకుండా జీవులందరినీ ఎవడు ప్రేమిస్తాడో, అతడు నిజంగా తన దైవాన్ని చక్కగా ఆరాధిస్తున్నాడు!" (ఒక మిత్రునికి ఒక పద్యము) అని చెప్పిన వివేకానంద స్వామి సందేశాన్ని మరచిపోయావా?

ముక్తిని పొందడానికి వివేకానంద స్వామి మీ అందరికీ ఇంత సులభమైన విధానాన్ని వదలివెళ్ళారు. ఇంత త్వరగా దాన్ని విస్మరించావా?

"మూర్ఖుడా! జీవించు వేల్పునే గనవేమి?
అగణితములైనట్టి వాని ప్రతిబింబములు
జగమెల్ల నిండినవి చిన్నచూపేల రా!
విద్వేషముల పెంచు తలపోత నీడలను
వెన్నాడి, విడచితివి కాననగు దేవుణ్ణి,
అతని నర్చించుమీ, ఇతరమూర్తుల ద్రుంచి!
(ఒక మిత్రునికి ఒక పద్యము - స్వామి వివేకానంద)

కృష్ణుడు గీతలో ఇలా చెప్పాడు: "కేవలం పనులను మానడం వల్ల మనిషి పని చేయనవసరం లేని స్థితిని పొందలేడు" (గీత: 3.4). పని చెయ్యకుండా పని నుండి నీవు ఎలా విముక్తుడవుతావు? అటువంటి తప్పుడు భావాలకు మనసులో చోటిచ్చి సోమరిగా ఉండవద్దు. దానివల్ల మందకొడితనానికి బానిస కావద్దు. దానికి బదులు హృదయపూర్వకంగా కర్మ చెయ్యి. దానిని కర్మ అని ఎందుకు అనాలి? అది ఆరాధన. యథార్థమైన ఈ ఆరాధన చేసి, నీ జీవితాన్ని ధన్యం చేసుకో. ఇటువంటి అవకాశం తరచుగా రాదని నిశ్చయంగా తెలుసుకో.

భవదీయ,

తురీయానంద

(61)

అల్మోరా,

26 అక్టోబరు, 1915

ప్రియమైన ఎక్స్.,

విజయదశమి (దుర్గాపూజ) సందర్భంలో నీ ఉత్తరం అంది సంతోషాన్ని కలిగించింది. నా దీవెనలను అందుకో! మీ గ్రామంలో కూడా దుర్గాపూజ జరిగిందనీ, ఆ సందర్భంలో అనేకమంది పేదప్రజలు సేవింపబడ్డారనీ తెలిసి నాకు ఆనందం కలిగింది. పేద ప్రజల సేవలో నీవు పాలుపంచుకోవడం ఎంతో మంచిది. ఇతరులకు నీవు ఎంత ఎక్కువ మంచి చెయ్యడానికి ప్రయత్నిస్తే, అది నీకు అంత శ్రేయస్కరం అవుతుంది.

నీ పారమార్థిక అనుభవాలను గురించి విని నాకు సంతోషం కలిగింది. నీకు కలిగిన దర్శనం నుండి, ఇతర అనుభవాల నుంచి నీవు ఎలా ప్రయోజనాన్ని పొందావో నీ అంతట నీవే చూశావు. ఈ సందర్భంలో ప్రశ్నలను లేవదీయడం అనవసరం. హృదయపు లోతులనుండి మనిషి ప్రార్థిస్తే, భగవంతుడు తప్పకుండా వింటాడు.

నీకు కలిగిన అనుభవం అద్భుతంగా ఉంది. సాకారదైవం, నిరాకారదైవం రెండూ సత్యమే. చుట్టచుట్టుకుని, కదలకుండా ఉన్నా లేక వంకరటింకరగా కదులుతున్నా పాము పామే. నిశ్చలంగా ఉన్నా లేక అలలతో నిండివున్నా సముద్రం సముద్రమే. కాబట్టి ఆకారంతో ఉన్నా, నిరాకారంగా ఉన్నా బ్రహ్మం ఎల్లప్పుడూ ఒక్కటే. ప్రజలు వారివారి అభిరుచులను బట్టి బ్రహ్మాన్ని కానీ, దేవుణ్ణి కానీ వేర్వేరుగా ప్రేమిస్తారు. కానీ, ప్రేమిస్తున్న వస్తువులో భేదమేమీ లేదు – అదే సచ్చిదానందం – ఆది, అంతం లేని సర్వవ్యాపకమైన చైతన్యం.

నీ ధ్యానాన్ని క్రమం తప్పకుండా చెయ్యి. ఆధ్యాత్మిక సాధనలలో ఏమాత్రం అలసత్వానికి లొంగవద్దు. భగవంతుని కరుణవల్ల అజ్ఞాన మేఘం తొలగిపోతుంది. సేవాకార్యక్రమాన్ని కర్మగా ఎందుకు పరిగణిస్తావు? దానిని ఆరాధనగా చెయ్యి. "తారతమ్యం లేకుండా జీవులందరినీ ఎవడు ప్రేమిస్తాడో, అతడే నిజంగా దైవాన్ని చక్కగా ఆరాధిస్తున్నాడు." (ఒక

మిత్రునికి ఒక పద్యం – వివేకానంద స్వామి) ఈ స్వభావాన్ని కలిగివుంటే నీకు కర్మ అరుచిగా ఉండదు.

ప్రేమ, శుభాశీస్సులతో,
తురీయానంద

(62)

అల్మోరా,
31 అక్టోబరు, 1915

ప్రియమైన బిహారీబాబు,

నీవు మే 27వ తేదీన వ్రాసిన ఉత్తరం, దానితో జతపరచిన రెండు చిత్తు రేఖాచిత్రాలు (కుండలినీ షట్చక్రాలు) అందాయి. అటువంటి కుండలినీ చిత్రాన్నే – దివ్యజ్ఞాన సమాజం (థియొసాఫికల్ సొసైటీ) తదితరులు ప్రకటించిన కొన్ని చిత్రాలలో ఇదివరలో చూశాను. మానవ దేహమే సర్వోత్కృష్టమైన యంత్రం. అందులో బ్రహ్మ, విష్ణువులంతటివారే చిక్కుకుపోయి, ఊపిరాడక తన్నుకుంటు న్నారు. అందువల్ల గురుదేవులు ఇలా పాడేవారు:

ఏమిటే ఈ కీలుబొమ్మా! ఓయమ్మ!
ఎటువంటి దానిని ఏర్పరచినావు
ఏడుజానల బొమ్మ! ఎగిరెగిరిపడు బొమ్మ
బొమ్మతో ఆటల్లు నీవెన్ని ఆడెదవె
చేత సూత్రము బూని నీవు
దానిలోపల దాగినావు
దీని తెలియని కీలుబొమ్మ
తానాడెనని తలచెనమ్మా
అమ్మ నెవ్వరు చూచినారో,
బొమ్మ భావము మానుతారు
భక్తిసూత్రము చేత కొన్ని బొమ్మలు
అమ్మనే బంధించినాయి.

ఈ దేహయంత్రంలో దివ్యజనని దాగి ఉన్నది. దానిని తెలుసుకోవడం వల్ల మాత్రమే మనిషి దానినుంచి తప్పించుకోగలడు. లేకపోతే అతడు యంత్రం లోపలే జననమరణాల, సుఖదుఃఖాల చక్రంలో పరిభ్రమిస్తూ ఉండి తీరాలి. కాబట్టి మహాభక్తుడైన రామప్రసాదు ఇలా పాడాడు: “అమ్మా! నా కళ్ళకు కట్టిన గంతలు తొలగించవమ్మా– భయాన్ని పారద్రోలి నీ రూపాన్ని దర్శించనివ్వమ్మా!”

మన కళ్లకు ఉన్న గంతలను అమ్మ తొలగించు గాక! ఇదే ఆమెకు నా హృదయపూర్వకమైన ప్రార్థన.

భవదీయ,
తురీయానంద

(63)

అల్మోరా,
3 నవంబరు, 1915

ప్రియమైన ప్రియనాథ్,

ఆ భీకరక్షామాన్ని (బంకూరాలో సంభవించిన కరవును) గురించి తెలిసి నిజంగా నేనెంతో విచారపడుతున్నాను. తన సంకల్పమేమిటో భగవంతునికే తెలుసు. కానీ, నీవంతుగా, నీవు అక్కడి ప్రజలకు నీ శక్తినంతా వినియోగించి చెయ్యగలిగినంత సాయం చెయ్యడానికి ప్రయత్నించు. నీ కర్తవ్యాన్ని ఏ మాత్రం అశ్రద్ధ చెయ్యవద్దు.

నీ వాదోపవాదాలు నాకిష్టం లేదు – అవి నిరుపయోగం. "వస్త్రం ఎంతదయితే ఉడుపు అంతదవుతుంది" అన్న సామెత నీకు తెలుసు. సరఫరా అయినంత మేరకు పదార్థాలను పంచిపెట్టు. అంతకంటే నీవేం చేయగలవు? చేసిన దానం ప్రేమతోనూ, గౌరవంతోనూ ఇవ్వబడిందా, లేదా అనేది పూర్తిగా నీకు సంబంధించిన విషయమే. నీ సేవాభావానికే అది పరీక్ష. ఉద్యోగంలో ఉండి పనిచేస్తున్నట్టు నీవు ఉద్యోగివి కావు. కాబట్టి ధార్మికమైన సేవాదృక్పథంతో సేవ చెయ్యి. సేవాకార్యక్రమాలను నడుపుతున్న నీ పైవారు – వసూలైన విరాళాలను బట్టి వాటిని నడుపవలసి ఉంటుంది. తగినన్ని నిధులు కూడకపోతే వారు మాత్రం ఏమి చెయ్యగలరు? నీకు అందిన దాన్ని బట్టి పంచిపెట్టు. అదేమీ పెద్ద సమస్య కాదు. సరైన దృక్పథం లేకపోవడంలోనే సమస్య ఇమిడి ఉంది. నీ దగ్గర ఏది ఉందో దాన్ని అన్నపూర్ణేశ్వరి యొక్క ఆహారకోశంగా భావించి ఉపయోగించు. ఉద్యమ విజయరహస్యం అందులోనే ఇమిడి ఉంది. లేకపోతే, నీ దగ్గర లేని పదార్థాలను గురించి మాట్లాడి ఉపయోగమేముంది?

బహుశా ఒక సేనాధిపతి కథ చదివి ఉంటావు. తన కత్తి చాలా పొట్టిగా ఉన్నందువల్ల తన విరోధులతో పోరాడలేనని అతని కుమారుడు ఫిర్యాదు చేశాడట! సేనాధిపతి, "ఒక అడుగు ముందుకి వెయ్యి!" అని సమాధాన మిచ్చాడు: అది చాలా అర్థవంతమైన సలహా. ఇతరులను దూషించేవాడు తన అశక్తతను నిరూపించుకుంటున్నాడని మరువవద్దు. కొన్ని బెంగాలీ సామెత లున్నాయి: "దేశంలో దొరకని వస్తువునే బిడ్డ కోరతాడు!" "ఆడలేని నర్తకి మద్దెల ఓటిదని అందిట!" "ఆడనేర్చినవాడు ఎప్పుడైనా ఆడతాడు!"

ప్రేమవల్లనే, కృష్ణుడు మహాభక్తుడైన విదురుని దగ్గర నూకలు తిన్నాడు. విదురుని భార్య ఇచ్చిన అరటిపండు తొక్కలు తిన్నాడు. అంతేకానీ ఆకలి వల్ల కాదు. ఈ చక్కని కథలు బాగా

తెలిసినవే – ప్రతివారూ వాటిని గురించి ముచ్చటిస్తారు. ముఖ్యమైన విషయమేమంటే – నీ దృక్పథమెలావుంది? నీ మనస్సును నూటికి నూరుపాళ్ళు పని మీద ఉంచితే జయం కలిగి తీరుతుంది. ఇతరులు ఏమి చేస్తున్నారని నీవు చూడనక్కర లేదు. నిన్ను నీవు కనిపెట్టి, నీవేమి చేస్తున్నావో గమనించుకో. మంచివారికి అంతా మంచే కనబడుతుంది. ఇది ఎంతో సత్యం.

భవదీయ,

తురీయానంద

(64)

అల్మోరా,

19 నవంబరు, 1915

ప్రియమైన ఎక్స్.,

నవంబరు 15వ తేదీన నీవు వ్రాసిన పోస్టుకార్డు నాకెంతో ఆహ్లాదాన్ని కలిగించింది. తరచుగా నీ సమాచారం నాకు తెలుస్తోంది – నీ క్షేమాన్ని గురించి ఆలోచిస్తూ ఉంటాను. సంత్ తులసీదాసు చక్కగా చెప్పారు: “కలువపువ్వు నీటిలో ఉంటుంది. చంద్రుడు ఆకాశంలో ఉంటాడు. కానీ అది వారి స్నేహాన్ని ఏ విధం గానూ బాధించదు. (తన అందాన్ని తన ప్రియుడైన చంద్రుడికి కనపరచడానికి కలువపువ్వు రాత్రి వికసిస్తుంది.) అదే విధంగా, ఒకరి హృదయంలో చోటు సంపాదించినవారు, వారికి చాలా సన్నిహితంగా ఉన్నట్లేనని తెలుసుకో.” నా హృదయం నీ దగ్గర ఉంది. ఎంతో దూరంలో హిమాలయాలలో నేను ఉన్నా, నీవు నాకు చాలా దగ్గరగా ఉన్నట్లు భావిస్తున్నాను.

భగవంతుని సంకల్పమే నెరవేరుతుంది. నేనింకేమి చెప్పగలను? నీవు క్షేమంగా ఉన్నావనీ, ప్రజలను పూజాభావంలో సేవిస్తున్నావనీ తెలిసి అమితా నందాన్ని పొందుతున్నాను. ఒకసారి శ్రీరామకృష్ణులు తమ మీద మితిమీరిన ప్రేమ చూపుతున్నారనీ, అది మంచిది కాదనీ ఫిర్యాదు చేస్తూ శ్రీవివేకానంద స్వామి జడభరతుని (పురాణకాలంలో ఒక రాజు) కథను ఉదహరించారు. జడభరతుడు ఒక జింక యందున్న మమకారంవల్ల మరుజన్మలో జింకగా జన్మించాడు. దానికి శ్రీరామకృష్ణులు సమాధానమిస్తూ, తాను ప్రేమించిన వ్యక్తి లో దేవుణ్ణి దర్శిస్తూ ఉన్నంతవరకూ ప్రమాదమేమీ లేదని చెప్పారు. కాబట్టి నీకు ఇతరులపట్ల ఆప్యాయత ఉందని భయపడడంలో అర్థం లేదు. నీవు దైవాన్ని ఆరాధిస్తున్నావు. నీవు చేసే ఇతర విషయాలు కేవలం బాహ్యమైనవే. ‘పుస్తక జ్ఞానం నిజంగా మన జీవితాలను కాపాడదు’ అనే విషయం నీకు బాగా తెలుసు. గీతలో కృష్ణుడు ఇలా అన్నాడు: “నాయనా! మంచి చేసే వారెవరికీ దుర్గతి కలగదు” (గీత: 6.40). ఇది తెలిసి కూడా ఇంకా నీ అపోహకు తావెక్కడిది?

ప్రేమ, శుభాశీస్సులతో,

తురీయానంద

(65)

అల్మోరా,

20 నవంబరు, 1915

నా ప్రియమైన బాబూరాం మహరాజ్ (ప్రేమానంద స్వామి),

నీ ప్రేమపూరితమైన ఉత్తరం మొన్న అంది చాలా ఆనందించాను... నీతోటి స్మృతులు నాకెంతో సంతోషాన్ని కలిగిస్తాయి. దానిలో తప్పేముంది? నీలో గురు దేవులు ఎంతగా నిండిపోయి ఉన్నారంటే – నీ అంతరంగంలో మరొక విషయా నికి చోటేలేదు. నాకొక సంఘటన జ్ఞాపకానికి వస్తున్నది. అది ఆలంబజారు మఠంలో జరిగింది. నీవు ఆ రోజు మాట్లాడుతూ, కనపడే ప్రతి వస్తువులోనూ గురుదేవుల స్మృతిని ఆవాహనం చేశావు. ఆ సమయంలో నీలో, "చూపు ఎక్కడ పడితే, అక్కడే భగవానుడు సాక్షాత్కరిస్తాడు!" అన్న బోధలోని సత్యాన్ని వీక్షించాను. నీవు దేనిని చూసినా అది గురుదేవులనే నీకు జ్ఞాపకం చేస్తుంది. నీకా విషయం జ్ఞాపకముందో లేదో నాకు తెలియదు. కానీ అది నా మీద చెరగని ముద్ర వేసింది. భగవంతునిలో లీనమైపోవడమంటే ఏమిటో నేను ఆ రోజున తెలుసుకున్నాను. గురుదేవులు ఆయన అపారమైన కరుణవల్ల నాకు దాన్ని దర్శింపచేశారు – కాబట్టి నా దగ్గర నీవు దేనినైనా దాచిపెట్టాలని ప్రయత్నించడం నిష్ఫలం.

మీ కుటుంబం గురుదేవులకు చెందిన కుటుంబం. (బాబూరాం మహరాజ్ లేదా ప్రేమానంద స్వామి అప్పట్లో బేలూరుమఠానికి మేనేజరు.) సాధారణంగా మనం చూసే కుటుంబాలు విడివడలేని మాయలో కొట్టుమిట్టాడుతుంటాయి. మీది అటువంటి కుటుంబం కానేకాదు. మీ కుటుంబంలో ఒక కోడెదూడకైనా చోటున్నదేమో కానీ కామకాంచనాలకు మాత్రం చోటు లేదు. అది ప్రేమ నిర్మితం. "ప్రేమ ద్వారా అన్నీ సంభవమే" అని వివేకానంద స్వామి చెప్పేవారు.

మరొక వివేకానంద స్వామి ఉండవచ్చునా? చంద్రునిలాగా ఆయనకు సాటి మరొకరు లేరు. ఆయనకు ఆయనే సాటి. మరొకరు లేరు.

ప్రేమ, నమస్కారాలతో,

తురీయానంద

(66)

అల్మోరా,

25 నవంబరు, 1915

ప్రియమైన బిహారీబాబు,

నవంబరు 18, 1915న నీవు వ్రాసిన ఉత్తరం అంది చాలా సంతోషించాను. భగవంతుని మీద సుస్థిరమైన భక్తిని పెంపొందించుకోగలిగితే బ్రాహ్మణ కుటుంబంలో జన్మించడం మంచిదే. అయితే, భక్తిలేని బ్రాహ్మణుడు ఛండాలుని కంటే అధముడు. భగవంతుని మీద

"భక్తి ఉంటే శూద్రుడు కూడా పరమగతిని పొందగలడు" (గీత: 9.32). భగవద్గీతలో చెప్పిన ఈ విషయం శాస్త్రాలలో కూడా ధ్రువపరచబడింది. మేము ఈ విషయాన్ని శ్రీరామకృష్ణుల దగ్గర కూడా తెలుసుకున్నాం. నీవు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించలేదు కాబట్టి నీకు బ్రహ్మసాక్షాత్కారం కలగదనే విషయాన్ని నేను అంగీకరించను. బ్రాహ్మణులకు తప్ప ఇతరులెవ్వరికీ భగవత్సాక్షాత్కారం లభించదనే అభిప్రాయం గలవారికి శాస్త్రాల భావం ఏమాత్రం తెలియదని నా అభిప్రాయం.

సజ్జనసాంగత్యం తప్ప మరి దేనినీ నీవు లక్ష్యపెట్టవని తెలిసి నేను అపరిమితానందం చెందుతున్నాను. ఒకవేళ ఇది గర్వంగా పరిగణించబడి నప్పటికీ, ఇది యథార్థం. 'భవసాగరాన్ని దాటించే నౌకగా సజ్జనసాంగత్యా'న్ని ఆదిశంకరులు కొనియాడారు (మోహ–ముద్గర, 5). పారమార్థిక సాధనలన్నీ త్రాసులో ఒకవైపు, రెండవవైపు ఒక్క క్షణపు సత్సాంగత్యాన్ని ఉంచితే, రెండవ వైపే ఎక్కువ బరువుతో క్రిందికి తూగుతుంది అని శాస్త్రాలలో మనం నేర్చుకున్నాం.

విషయాలను అర్థం చేసుకునే శక్తి నీ బుద్ధికి తగ్గిపోయిందని నీవెందుకు అనుకుంటావు? అలా కాకుండా నీలో మంచి చెడ్డలను విచక్షణ చేసే శక్తి వృద్ధి చెందింది. అందువల్ల నీవు చెడును అంగీకరించడానికి ఇష్టపడడం లేదు. నీ వినమ్రత నిస్సందేహంగా మెచ్చుకోదగిందే. కానీ, 20 ఏళ్ళ క్రితం ఎలా ఉన్నావో ఇప్పుడు కూడా అదే రకంగా ఉన్నావని చెప్పడం సరికాదు. ఈ విషయాన్ని నీవు ఆత్మదృష్టితో చెప్తే అది యథార్థమే. ఎందుకంటే ఆత్మ మార్పులేనిది.

ఒక సత్పురుషుడు పారమార్థిక, సాంసారిక విషయాలలో పాల్గొంటుంటే, ఆ విషయాలు అతని ఘనతను వృద్ధి చెయ్యవు. సాత్త్విక స్వభావమొక్కటే సత్పురుషునికి తగినది. నీవు ఇప్పుడు అనుభవిస్తున్న అశాంతి ఎక్కువ కాలం ఉండదు. నీవు మరింత అంతర్ముఖుడివైతే అది త్వరలోనే తొలగిపోతుంది. నెమ్మదిగాను, క్రమంగాను పారమార్థిక సాధనలు ఎక్కువ చెయ్యాలి. నీవు సరైన మార్గంలోనే ఉన్నావు. శ్రీరామకృష్ణులు, "సంసారంలో ఉండి సాధన చేయడం, కోటలో ఉండి యుద్ధం చెయ్యడం లాంటిది. దానిలో అనేక లాభాలున్నాయి. ఇతరుల (సన్న్యాసుల) విషయంలో అది మైదానంలో నిలబడి యుద్ధం చెయ్యడం లాంటిది. అది అందరికీ సరిపడదు." ఏ విధంగానైనా మనస్సును దైవంమీద నిలపడమే ముఖ్యమైన విషయం. అప్పుడే జీవితప్రయోజనం నెరవేరుతుంది.

"శరీరం ఉన్నంతవరకు ఆహారం కోసం, కట్టుగుడ్డల కోసం శ్రద్ధ వహించాలి" (నారదభక్తి సూత్రాలు, 1.14). కానీ రామప్రసాదు ఇలా చెపుతాడు, "నీవు భుజిస్తున్నప్పుడు దివ్యజననికి ఆహుతులు అర్పిస్తున్నాననుకో!" ఈ సాధుసత్తముల మాటలు పాటించాలి. అప్పుడే దైవం మీద భక్తి వృద్ధి చెందుతుంది. రామప్రసాదు ఈ పాట పాడారు:

ఓ మనసా! నా మాట వినగదే!

గురూపదేశపు మంత్రజపముచే

తోచినట్టు పూజించుము కాళిని!
నడుము వాల్చుటే నమస్కారముగ
సుషుప్తియే గంభీర ధ్యానముగ
భోజనమే ఆహుతుల సమర్పణ
విను ధ్వనులే మరి మాత మంత్రముగ
పట్నవీధులలో పరిభ్రమణమే
అమ్మకు చేసే ప్రదక్షిణముగా
భావించుచు నర్చింపుము మనసా!
ఐదు పదుల స్వరరూపము దాల్చుచు
అమ్మ కాళి ప్రకటితమగుచున్నది.
అమ్మయె తానే సర్వజీవులలో
సంస్థితమై ఒప్పారుచున్నదని
నినదించుటకును రామప్రసాదు
సంతసముతో తబ్బిబ్బవుచుండెను

ప్రతి పనిలో, సర్వజీవులలో, అన్ని విధాలా బ్రహ్మం ఉందన్న అనుభూతి పొందడానికి మించిన అనుభవమేముంది? ఈ బ్రహ్మచైతన్యానుభూతి ఒక్క యాజ్ఞవల్క్య సంహితలోనే కాక, ధర్మశాస్త్రం, యోగసూత్రాలు, పురాణాలు, తంత్రాలలో కూడా ఉదహరింపబడింది. బ్రహ్మజ్ఞానాన్ని పొందడానికి గృహస్థు లకు మహానిర్వాణతంత్రం ప్రామాణిక గ్రంథం. ఈ గ్రంథాన్ని ఆధారంగా చేసుకుని రాజా రామమోహనరాయ్ ఆదిబ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. భగవంతుడే గురువు. భక్తుల అవసరాలను ఆయన సమకూరుస్తాడు. నీ మనస్సులో ఏముందో ఆయనతో చెప్పు. నీకేది అవసరమో అది ఆయన చేస్తాడు.

భగవత్కరుణ లేకుండా పారమార్థిక సాధన నిష్ప్రయోజనమనే నీ మాట యథార్థం. కానీ హృదయపూర్వకంగా సాధన చేస్తే భగవత్కృప కలుగుతుంది. భగవంతుడు సర్వజ్ఞుడు. హృదయపూర్వకంగా ప్రార్థించిన వాని ప్రతికోర్కెను ఆయన సఫలీకృతం చేస్తాడు. ఆయన మీద ఆర్తి పెరిగేకొద్దీ ఆయన అనుగ్రహం మరింత ఎక్కువగా అనుభవమవుతుంది. భగవంతుని కోసం నీకు తీవ్రమైన వ్యాకులత కలగాలి అనేదే నా ప్రార్థన.

ప్రేమ, ఆశీస్సులతో,
తురీయానంద

(67)

అల్మోరా,
10 డిసెంబరు, 1915

ప్రియమైన ఎల్.,

డిసెంబరు 3వ తేదీన నీవు వ్రాసిన ఉత్తరం అంది సంతోషించాను. ఒక్కసారిగా ప్రతి జీవిలోను భగవంతుణ్ణి దర్శించడమనేది చాలా కష్టం. ఆత్మవికాసం కలిగితే తప్ప అది సాధ్యం కాదు. కానీ, భగవంతుడు సర్వవ్యాపి. అందరిలోనూ ఉన్నాడు. ఈ విషయం తెలుసుకుని మనిషి తోటిమానవులను సేవిస్తే అతడు భగవంతుణ్ణి సేవించిన వాడవుతాడు. ఈ దృష్టితో ఫలితాన్ని ఆశించకుండా నిండు హృదయంతో సేవిస్తే భగవంతుని కృపవల్ల, మానవసేవే మాధవుని ఆరాధన అని కాలక్రమేణా తెలుసుకుంటాడు. ఎందుకంటే భగవంతుడు ప్రతిజీవిలోను ఉన్నాడు కాబట్టి. నిజంగా ఉన్నది భగవంతుడొక్కడే.

పవిత్రత, అపవిత్రత అనేవి మానవుని స్వభావంలో ఉన్న తేడాలే. ఇంద్రియ విషయాల మీద రక్తి అపవిత్రత. భగవంతుని మీద రక్తి పవిత్రత. మానవుడిలో ఏది సత్యమో అదే భగవంతుడు. భగవంతుడు లేకపోతే మనిషి కేవలం అస్థిమాంసాల పంజరమే. మానవునిలో ఉన్న చైతన్యం భగవంతునిలో ఒక భాగం. అది పవిత్రమైనది. మిగిలినదంతా అపవిత్రమైనదే. మానవునిలో ఉన్న మంచి సంస్కారాలు అతణ్ణి భగవంతుడి వైపు కొనిపోతాయి. దుష్టసంస్కారాలు భగవంతునికి దూరం చేస్తాయి. కాలక్రమేణా మనిషి దీన్ని అర్థం చేసుకుంటాడు. కానీ, సాధన ప్రారంభదశలో ఈ పారమార్థిక సత్యాల గురించి వినాలి.

భగవదనుగ్రహం వల్లనే మనిషి మంచి నడవడిక వైపు ఆకర్షితుడవుతాడు. మంచితనానికి మూలం భగవంతుడు. కాబట్టి భగవంతుణ్ణి సాక్షాత్కారం చేసుకుంటే అశాంతి తొలగిపోయి, పరమశాంతిని పొంది ధన్యాత్ముడవుతాడు. నీవు చేయవలసినదంతా భగవంతుని గుమ్మం దగ్గర కాచుకొని ఉండడమే. భగవంతుడు నీకు సర్వం తెలియచేస్తాడు. ఎల్లప్పుడూ నీ చిత్తంలో మంచి సంస్కారాలు కలిగి ఉండు. మంచితనమే భగవంతుడు. ఆయనను నీ హృదయం లో నిలుపుకోగలిగితే నీకు ఏ లోటూ ఉండదు. భగవంతుడే మనకు తల్లి, తండ్రి, సఖుడు, తోడు, జ్ఞానం, సంపద. మన సర్వస్వం ఆయనే. ఆ విధంగా నీవు ఆయనను నీ సొంతవాణ్ణి చేసుకోగలిగితే, నీ జీవితం ఆనందమయమవుతుంది.

నీవు చాలా ప్రశ్నలు అడిగావు. వాటన్నిటికీ సమాధానాలివ్వడం సాధ్యం కాదు. ఒకవేళ నేను సమాధానాలిచ్చినా నీవు అర్థం చేసుకోగలవనే నమ్మకం నాకు లేదు. కానీ, ఒక విషయం మాత్రం సత్యం. ఆయన వైపు వెళ్ళేకొద్దీ, నీ బుద్ధి నిర్మలమవుతుంది. ఆ విధంగా నీ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. ఆంతర్యం లో పారమార్థిక భావన లేకుండా, మనిషి ఆ భావాలను అర్థం చేసుకోలేడు.

ఎల్లప్పుడూ నీ హృదయంలో భగవంతుణ్ణి దర్శించడానికి ప్రయత్నించు. నీవు తెలుసుకోవలసినది ఏమైనా ఉంటే, తెలుసుకునేటట్లు ఆయన చేస్తాడు. ప్రతివారికీ ఆయన ఈ విధంగానే చేస్తాడు. భగవంతుడే తనను గురించి తెలియచెయ్యకపోతే, మనిషి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆయనను అర్థం చేసుకోలేడు. పైగా, మరొకరికి అర్థం చేసుకోవడానికి సహాయం చెయ్యలేడు కూడా. ఇప్పుడు నీకు ఒక మాయగా కనిపించేది, ఆయన అనుగ్రహం

వల్ల సులభంగా విస్పష్ట మవుతుంది. అప్పుడు నీవు సత్యాన్ని దర్శించగలవు. దీనికి కొంతకాలం పడుతుంది. ఆతురపడవద్దు. అన్నివిధాలా ఆయనను ప్రార్థించు. ఆయనను నీవాణ్ణి చేసుకోవడానికి ప్రయత్నించు. హృదయపు లోతులలో నుంచి ప్రార్థించు. ఆయన సర్వజ్ఞుడు. మన ఉద్దేశ్యాలను గ్రహించి, ఆయన సర్వాన్ని సమకూరుస్తాడు. దీనిలో సందేహమేమీ లేదు.

ప్రేమ, ఆశీర్వాదాలతో,
తురీయానంద

(68)

అల్మోరా,
12 డిసెంబరు, 1915

ప్రియమైన బాబూరాం మహరాజ్ (ప్రేమానంద స్వామి),

నీవు 1915 డిసెంబరు 1వ తేదీన వ్రాసిన ఉత్తరం చూసి అమందానంద భరితుడనైనాను... ప్రేమ అనేది ఒక మహత్తర శక్తి. ఇందులో సందేహమేమీ లేదు. పరుల సంక్షేమం కోసం ప్రార్థించడం, పరులకు శాంతి కలగాలని కోరడం, వాళ్ళు ఆనంద మూలకందానికి చేరాలని కోరడం అనేదే బంధానికి కారణమైతే, ఆ బంధం దివ్యప్రేమ అవుతుంది. అది భవబంధాన్ని ఛేదించి అమృతత్వానికి కొనిపోతుంది. మనిషి ధన్యాత్ముడవుతాడు. ఆ ప్రేమలో ఒక్క నలుసు మాకు సంప్రాప్తించాలని ఆశీర్వదించగోరుతున్నాను.

ప్రేమ, నమస్కారాలతో,
తురీయానంద

(69)

అల్మోరా,
19 డిసెంబరు, 1915

ప్రియమైన బాబూరాం మహరాజ్ (ప్రేమానంద స్వామి),

..వివేకానంద స్వామి మీరట్‌లో (హరిద్వార్‌కు ఢిల్లీకి మధ్యలో ఉన్న పట్టణం) ఉన్నప్పటి మధురస్మృతి ఇంకా నా మనస్సులో సుస్పష్టంగానే ఉంది. ఆయన ఋషీకేశ్‌లో చాలా జబ్బుగా ఉన్నారు. తర్వాత చికిత్స కోసం ఆయనను మీరట్ తీసుకువచ్చారు. మేము ఆయన కోలుకునే వరకు, ఆరునెలలపాటు (6 నుండి 8 వారాలు – సంపాదకుడు) ఆయనతోనే ఉన్నాం. ఆ దినాలు ఎంత ధన్యమైనవో నేను వర్ణించలేను. ఆ రోజులలో ఆయన మాకు చెప్పులు బాగు చెయ్యడం దగ్గర నుండి శాస్త్రాధ్యయనం వరకు అన్నీ బోధించారు. ఒకవైపున ఆయన వేదాంత

గ్రంథాలు, ఉపనిషత్తులు, సంస్కృతనాటకాలు చదివి వివరిస్తూనే, మరోవైపున వంట చెయ్యడం మొదలుగా అనేక విషయాలు బోధించారు!

ఆ రోజులలో జరిగిన ఒక సంఘటన నా మనస్సు మీద చెరగని ముద్ర వేసింది. ఒక రోజు ఆయన పలావు, అనేక కొత్త రకాల వంటకాలు తయారు చేశారు. ఆ వంట ఎంత రుచిగా ఉందో చెప్పతరం కాదు. ఆ వంట రుచిని మేము శ్లాఘిస్తూ భోజనం చేస్తుంటే, ఆయన దానినంతా మా పళ్ళాలలో వడ్డించి తాను ఒక్క నలుసు కూడా తీసుకోలేదు. మేము అడ్డుచెపితే, "ఈ వంటల్ని నేను చాలాసార్లు తిన్నాను. మీకు వడ్డించడమే నాకు ఎంతో ఆనందంగా ఉంది, దయచేసి తినండి," అని అన్నారు.

ఆయన వ్యక్తిత్వాన్ని ఒక్కసారి ఊహించు! అది ఒక అనామక విషయమే కావచ్చు. కానీ అది మా మనస్సుల మీద శాశ్వతమైన ముద్రవేసింది. ఆయన చూపిన ప్రేమ, శ్రద్ధ ఎంత గొప్పవో కదా! మేము కలిసి మాట్లాడాం. కలిసి నడిచాం. ఆ అనుభవాలను నేను మరచిపోలేను. ఇంకా నా మనస్సులో అవి విస్పష్టంగానే ఉన్నాయి. మీరట్ నుండి వివేకానంద స్వామి ఒంటరిగా పర్యటనకు వెళ్ళిపోయారు. మళ్ళీ, ఢిల్లీలో మేము వివేకానంద స్వామిని కలిసి నెలరోజులు ఆయనతో గడిపాం. తర్వాత ఆయన అమెరికా వెళ్ళేముందు, బ్రహ్మానంద స్వామి, నేను బొంబాయిలో కొద్దిసేపు ఆయనను కలిశాం. తర్వాత జగద్విఖ్యాతపురుషుడిగా (కోల్‌కతాలోని) ఆలంబజారు మఠానికి తిరిగి వచ్చేవరకూ, ఎనిమిది సంవత్సరాలు దాదాపుగా ఆయనతో సంబంధాన్ని కోల్పోయాం. ఇప్పుడు ఆయన గురుదేవులతో ఉన్నారు కానీ ఆయన సాంగత్యపు అమరస్మృతి మన జీవితపర్యంతం ఒక చెలికాడుగా నిలిచిపోయింది. మన ధ్యానానికి, సంభాషణలకు, మన పారమార్థిక సాధనకు అదే ధ్యేయంగా మిగిలిపోయింది.

ప్రేమ, నమస్కారాలతో,

తురీయానంద

(70)

అల్మోరా,

19 డిసెంబరు, 1915

ప్రియమైన బిహారీబాబు,

నీవు 1915, డిసెంబరు 12వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది... పారమార్థికత కోసం నీవు పడుతున్న ఆవేదనను గురించి తెలిసి నాకు చాలా ఆనందం కలిగింది. శ్రీరామకృష్ణులు సాధారణంగా ఇలా అనేవారు: "భగవంతుని కోసం ఆవేదన ఎక్కువయ్యే కొద్దీ, ఆయన అనుగ్రహం అనుభూతమవుతుంది. కావాల్సింది శ్రద్ధ, ప్రేమ, భగవద్భక్తి, నిజమైన భక్తుడు భగవద్దర్శనం తప్ప మరేదీ కావాలని ప్రార్థించడు. ఆ దర్శనం కూడా దైవేచ్ఛ మీదనే ఆధారపడి ఉంటుంది."

"ఓ పురుషోత్తమా! నీ ఈశ్వర రూపాన్ని దర్శించకోరుతున్నాను" (గీత: 11.3) అని మొదట అర్జునుడు కృష్ణుణ్ణి అడిగాడు. కానీ మరుక్షణమే సిగ్గుతో, కలవరపడుతూ ఇలా చెప్పాడు: "ఓ ప్రభూ! నేను నీ ఈశ్వరరూపాన్ని దర్శించడానికి అర్హుణ్ణని తలిస్తే, ఓ యోగీశ్వరా, నీ అవ్యయ రూపాన్ని నాకు చూపించు" (గీత: 11.4).

నిజంగా ఇది సత్యం. భగవంతుడు తాను ఇష్టపడినప్పుడు తన దర్శనాన్ని అనుగ్రహిస్తాడు. అప్పటికీ, ఆ దివ్యదర్శనాన్ని ఎక్కువ సేపు భరించడం చాలా కష్టం. తన విశ్వరూపాన్ని కృష్ణుడు అర్జునునికి చూపించినప్పుడు అర్జునుడు భయంతో, "ఇక నేను ఈ రూపాన్ని దర్శించలేను," అన్నాడు. తర్వాత మళ్ళీ, "ఓ ప్రభూ! దయచేసి నీ మామూలు మానుషరూపాన్ని చూపించు," అని ప్రార్థించాడు. ఆ మానవరూపాన్ని చూసిన తర్వాత అర్జునుడు, "ఓ కృష్ణా! ఈ సౌమ్యరూపాన్ని చూసిన తర్వాత మనశ్శాంతి కలిగింది. మామూలు మనిషినయ్యాను," అని పలికాడు (గీత: 11.51).

కాబట్టి నిజమైన భక్తుడెప్పుడూ దర్శనాన్ని వాంఛించడు. శ్రద్ధ, భక్తి, ప్రేమలను ఇమ్మని ప్రార్థిస్తాడు. అతనికి ఈ లక్షణాలు కలిగితే కావాల్సింది మరేదీ ఉండదు. గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు: "అర్జునా! నా పనులను ఎవరు ఆచరిస్తారో, నన్ను పరమగమ్యంగా ఎవరు భావిస్తారో, నా మీద ఎవరు భక్తి కలిగి ఉంటారో, ఎవరు రాగద్వేషాలు లేకుండా ఉంటారో, అటువంటివారు నన్ను పొందుతారు" (గీత:11.55).

ఒకేఒక్కటి అవసరం. అదే భగవంతుని మీద ప్రేమ! అదొక్కటే సమస్తాన్నీ సాధించగలదు. ఎలా ప్రేమించాలో మనకు తెలియక పోలేదు. మన భార్యల్ని, పిల్లల్ని, సంపదను ప్రేమిస్తున్నాం. ఇప్పుడు ఈ ప్రేమను భగవంతుని వైపు మరల్చాలి. భగవంతుడు తప్ప ఈ లోకంలో శాశ్వతమైనది మరేదీ లేదు. భగవంతుడు తప్ప మిగిలినవన్నీ మార్పు చెందేవే, పాతబడిపోయి వికారం కలిగించేవే. కాబట్టి, భగవంతుణ్ణి ఒక్కణ్ణే ప్రేమించాలి. అనవరతమూ వ్యాప్తి చెందేది, అనంతమైనది భగవత్ప్రేమ ఒక్కటే. "భగవత్ప్రేమ సుందరం, మధురం, నిత్యనూతనం." మిగిలిన సుఖమేదైనా సరే అలసటను, విసుగును కలిగిస్తుంది.

కాబట్టి పరమభక్తుడైన ప్రహ్లాదుడు విష్ణువును, "అజ్ఞానులకు అశాశ్వతమైన ఇంద్రియసుఖాలమీద తరగని ప్రేమ ఎలా ఉంటుందో, అటువంటి ప్రేమ నిన్ను స్మరిస్తున్నప్పుడు నా హృదయం నుండి జారిపోకుండు గాక!" అని ప్రార్థించాడు (విష్ణుపురాణం: 1.20.23). భక్తుడు ఈ విధమైన ఏకాగ్రప్రేమను (భక్తిని) ఎప్పుడు వృద్ధి చేసుకుంటాడో, అప్పుడు అతడు దివ్యదర్శనం కోసం వేచి ఉండ నక్కరలేదు. అవసరమైతే భగవంతుడు అతని కోసం రాతిస్తంభంలో నుంచి కూడా ఆవిర్భవిస్తాడు. (ఈ సూచన ప్రహ్లాద చరిత్రకు సంబంధించింది. రాక్షసుడైన తండ్రిపెట్టే చిత్రవధ నుండి ప్రహ్లాదుణ్ణి రక్షించడానికి, మహావిష్ణువు స్తంభాన్ని బద్దలుకొట్టుకుని బయటకు వచ్చి దర్శనమిచ్చాడు – భాగవతం: 7.1.10).

హృదయపు బంధాలను ఛేదించే 'సర్వోత్కృష్టం, సర్వవ్యాపకం' అయిన బ్రహ్మదర్శనం ఈ మామూలు నేత్రాలకు అసాధ్యం. "నేతి, నేతి (ఇది కాదు, ఇది కాదు) అనే వేదాంత భావన వల్ల, ఏకత్వాన్ని ఆధారంగా చేసుకున్న జ్ఞానాన్ని మననం చెయ్యడం వల్ల, బ్రహ్మం తెలియబడతాడు. బ్రహ్మాన్ని తెలుసుకున్నవారు అమరులవుతారు," అని ఉపనిషత్తులు బోధిస్తున్నాయి (శ్వేతాశ్వతరోపనిషత్తు: 4.17). "ఓ నా మంచిమిత్రుడా! ఎవరు ఈ బ్రహ్మాన్ని తెలుసుకుంటారో, అతడు ఇక్కడే అజ్ఞానమనే ముడిని త్రెంచి వేస్తాడు" (ముండకోపనిషత్తు: 2.1.10).

అయినా, ఎవరైనా మనఃపూర్వకంగా ప్రార్థిస్తే అతనికి బ్రహ్మం తనను తాను తెలియజెయ్యడని అనుకోకూడదు. ఉపనిషత్తు ఇలా చెపుతున్నది: "బ్రహ్మం యొక్క రూపం చూడగలిగే వస్తువు కాదు. ఈ కళ్ళతో ఎవ్వరూ దాన్ని చూడలేరు. శుద్ధబుద్ధితో, నిరంతర మననం ద్వారా పొందిన సృష్టి అంతా ఆ పరమేశ్వరుడే అన్న ఏకత్వపు జ్ఞానంతో, బ్రహ్మం హృదయంలో సుస్థిరమై ఉన్నదని ఎవడైతే తెలుసుకుంటాడో, వాడు చావులేని వాడవుతాడు" (శ్వేతాశ్వతరోపనిషత్తు: 4.20).

ఇది హృదయానికి సంబంధించిన విషయం. ఎవరి హృదయం భగవంతుణ్ణి ఎక్కువగా చింతిస్తుందో, అతని హృదయంలో భగవంతుడు అంత ఎక్కువగా నివసిస్తాడు. "నిర్మలమైన హృదయం కలవారికి భగవంతుడే స్నేహితుడు!" భగవంతుడు మన హృదయాలలో ఎల్లప్పుడూ నివసిస్తూనే ఉన్నాడు. కానీ, ఆయనను దర్శించాలని మనకు ఆతురత లేదు. మన దృష్టి ఇతర విషయాలలో చిక్కుకు పోయింది. లేకపోతే భగవంతుణ్ణి దర్శించడానికి ఎక్కువ సేపు పట్టదు.

సంత్ కబీర్‌దాస్ ఇలా చెప్పారు:

ఓరీ ఎక్కడ నన్ను వెదకెదవు?
నీ దాపుననే నేనుండగ మరి
సత్యముగా నను కోరితివేని
సత్వరమే నను పొందగలుగుదువు
మందిరములలో, మసీదు లందున
ఎక్కడనూ నేనుండగ బోను
కాశీ, ద్వారక, కోసలపురముల
ఎన్నటికీ నే కానగరాను
ఎచ్చోటను మరి 'శ్రద్ధ' ఉన్నదో
అక్కడనే నే స్థిరముగ ఉందును

భగవంతుడు ఎల్లప్పుడూ మనలోనే ఉన్నాడు. ఆయనను దర్శించడానికి ఎక్కడా వెతకనక్కర్లేదు. "నేను ఆయన కోసం వెతుకుతున్నాను గాని, ఆయనను కనుక్కోలేకుండా

ఉన్నాను. ఆయన ఎవరిని వరిస్తాడో, అతడే ఆయనను దర్శిస్తాడు." మనిషి నిష్కపటంగాను, మనస్ఫూర్తిగాను ఒక్క క్షణం అన్వేషిస్తే చాలు, భగవంతుడు అతని ఎదుట ప్రత్యక్షమవుతాడు. కానీ, ఎవరు ఆయన కోసం అన్వేషిస్తారు? మనం కేవలం ప్రార్థనలను వల్లిస్తాం. మన ప్రార్థనలు పెదవుల పైనుంచి వస్తాయి గాని హృదయాల్లో నుంచి రావు. 'భగవంతుడు సర్వజ్ఞుడు. మన హృదయాలలో ఏముందో ఆయనకు తెలుసు,' - దీనిని మన శాస్త్రాల్లో చదువుతాం. కానీ మనం దాన్ని నిజంగా నమ్మం. కృష్ణుడు గీతలో, "నేను అందరి హృదయాలలో ఆసీనుణ్ణై ఉన్నాను," అని చెప్పాడు (గీత:15.15). "ఈ జీవలోకంలోని జీవుల దేహాలలో ఉన్న జీవాత్మ నాలో అంశమే" (గీత:15.7). ఈ వచనాలన్నీ అసత్యాలా? అవి తిరుగులేని నిజాలు. కానీ, అవి మనకు అసత్యాలుగా కనిపిస్తాయి. ఎందువల్ల? ఎందుకంటే ఈ భగవద్వచనా లను మనం కేవలం చదువుతాం కానీ, వాటిని నమ్మం, భగవంతుణ్ణి అన్వేషించం. అందువల్లనే మనం ఈ దీనమైన దశలో ఉన్నాం!

శ్రీరామకృష్ణులు, "మనిషి గురువు అనుగ్రహాన్నీ, భగవదనుగ్రహాన్నీ, భక్తుని అనుగ్రహాన్నీ పొందినా, ఒకరి అనుగ్రహం లేకపోవడం వల్ల అతడు నాశనమై పోతున్నాడు," అనేవారు. దీనికి అర్థం ఏమిటంటే అందరికీ అతడిపట్ల అనుగ్రహం ఉన్నా, వాటికన్న మిన్నగా మనిషికి స్వకీయమైన మనస్సు యొక్క అనుగ్రహం ఉండాలి! "తనకు తానే బంధువు. తనకు తానే శత్రువు... తనను తాను జయించని వానికి తన మనస్సే బద్ధశత్రువు" (గీత: 6.5,6). అంటే మనిషి తనకు తానుగా కష్టపడకపోతే, బయటి సహాయంవల్ల ప్రయోజనం ఉండదు. నీవు పారమార్థిక వికాసంవైపు దృష్టిని సారించావు. కాబట్టి, భగవంతుడు నిన్ను నిస్సందేహంగా అనుగ్రహిస్తాడు. భగవంతుని కోసం నీ ఆర్తిని మరికొంత వృద్ధి చేసుకో. దైవం నీ కోరికను సఫలీకృతం చేయుగాక - ఇదే నా ప్రార్థన.

భవదీయ,
తురీయానంద

(71)

అల్మోరా,
22 జనవరి, 1916

ప్రియమైన బిహారీబాబు,

చాలా రోజుల తర్వాత నీవు వ్రాసిన ఉత్తరం నిన్న అందింది. శివానంద స్వామి ఉత్తరం వల్ల నీ తండ్రి గతించినట్లు తెలుసుకున్నాను....

నీకు కలిగిన అద్భుతమైన దర్శనాన్ని గురించి విని ఆశ్చర్యచకితుణ్ణయ్యాను. చనిపోయిన నీ తండ్రి ఒకానొక మహోన్నతమార్గం ద్వారా వెళ్ళాడని నీకు తెలుపడానికి ఒక దివ్యపురుషుడు దయతో, ఆ సుందర తేజోమయరూపంలో వచ్చి ఉండవచ్చునని నాకు అనిపిస్తున్నది. ఒక సత్పురుషుని మరణసమయంలో అతని ఆత్మను ఒక ఉన్నతలోకానికి వెంట తీసుకువెళ్ళడానికి

ఒక అశరీరవ్యక్తి దర్శనమిస్తాడని వేదాంత శాస్త్రాలలో ఉదహరించబడింది. లేకపోతే అది మీ తండ్రి సూక్ష్మశరీరమై కూడా ఉండవచ్చు. ఏమైనప్పటికీ నీకు అటువంటి అద్భుత దర్శనం కలిగినందుకు నీవు నిజంగా అదృష్టవంతుడివి.

"భూతాన్ని చూసిన ఒక వ్యక్తి యొక్క పారమార్థిక ఔన్నత్యం, ఒక పండితుని యొక్క లేక సామాన్యుడైన సాధకుని యొక్క పారమార్థిక ఔన్నత్యం కన్నా ఎక్కువ" అని వివేకానంద స్వామి అనేవారు. ఎందుకంటే భూతాన్ని దర్శించిన వానికి నిస్సందేహంగా పరలోకజ్ఞానం ఎంతోకొంత కలిగిందన్నమాట. ఇక పండితుని జ్ఞానంగానీ, సాధకుని జ్ఞానంగానీ కేవలం పుస్తకాలకే పరిమితమైంది. అస్వాభావిక దర్శనం యొక్క లక్షణమే అలా ఉన్నప్పుడు, నీకు కలిగిన దర్శనం యొక్క విషయమెంతటిదో గదా! దేవతలకు మాత్రమే తేజోమయరూపాలుంటాయి. నీకు కలిగిన ఈ దృశ్యం వ్యర్థం కాదని తెలుసుకో.

నీ తండ్రి మరణానంతరం, నీ కుమారుడు పోయిన పాతదుఃఖం మళ్ళీ తలెత్తి నట్లు నాకు కనిపిస్తున్నది. మహామాయ ప్రభావాన్ని అర్థం చేసుకోవడం ఎంత కష్టమో కదా! నీకు శాస్త్రపాండిత్యముంది. వివేకజ్ఞానం కలవాడివి. అయినా దుఃఖం నిన్ను తాత్కాలికంగా ముంచి వేసింది. పుత్రదుఃఖాన్ని గురించి గురుదేవులు ఇలా చెప్పేవారు: "రావణుడు యుద్ధభూమిలో చచ్చిపడి ఉన్నప్పుడు లక్ష్మణుడు వెళ్ళి చూసి ఇలా అన్నాడు: 'ఓ రామా! నీ బాణాలకు జయమయ్యా! రావణుని శరీరంలో తూట్లుపడని భాగం లేనేలేదు.' అప్పుడు శ్రీరాముడు, 'సోదరా! అతని ఎముకల మీద నీవు చూస్తున్న చిల్లులు నా బాణాలవల్ల పడ్డవి కాదు. అతని పుత్రుల మరణం వల్ల కలిగిన దుఃఖం ఆ ఎముకల్ని తూట్లుతూట్లు పొడిచింది.' ఏమయినప్పటికీ నీవు దైవాన్ని శరణు వేడావు. నిన్ను ఆయన రక్షిస్తాడు.

"ఓ కుంతీపుత్రా! నా భక్తుడెన్నటికీ నశించడని తెలుసుకో" (గీత: 9.31). ఈ వచనాలు కవుల కల్పనలు కాదు. నినాదాలు అసలే కాదు. అవి భగవంతుని వచనాలు. భక్తుడు ప్రారబ్ధాన్ని గురించి భీతి చెందడు. "ఒకడి ప్రారబ్ధకర్మ వల్ల కాలిలో గునపం గుచ్చుకోవాల్సి వుంటే, భగవంతుని అనుగ్రహం వల్ల ఒక ముల్లు మాత్రమే గుచ్చుకుంటుంది" అని గురుదేవులు చెప్పగా మేము విన్నాము.

చిత్తం పరిశుద్ధమయ్యే కొద్దీ మనిషి తనకు బయట ఏమీ లేదనీ, ఉన్నదంతా తన అంతరంగంలోనే ఉందనీ తెలుసుకొంటాడు. భగవద్దర్శనానికి గల అంతరాయమంతా మనస్సులో ఉన్న మాలిన్యమే.

"కపటాన్ని వదిలిపెట్టగలిగితే నేను కృష్ణుణ్ణి పొందుతాను" అనే ఒక సూక్తి ఒకటి ఉంది. శ్రీరామకృష్ణులు, 'సరళస్వభావం ఉన్నవాడికి భగవంతుడు దగ్గరగా ఉంటాడు. పూర్వజన్మల పుణ్యఫలాలవల్ల ఒక వ్యక్తి ఈ జన్మలో సరళ స్వభావాన్ని పొందుతాడు" అనేవారు. సరళమైన వ్యక్తికి పారమార్థిక మార్గం సుస్పష్టమవు తుంది. పైగా కుటిలత్వం ఎక్కువయ్యే కొద్దీ సమస్యలు ఎక్కువై భగవంతునికి దూరమై పోతాడు. "దేవుడు దూరంగా ఉన్నదానికి మరింత దూరంగా ఉంటాడు. అయినా చాలా సమీపంలోనే ఉంటాడు" (ముండకోపనిషత్తు: 3.1.7).

ఉన్న తేడా అంతా కుటిలత్వానికి, నిష్కపటత్వానికి మధ్య ఉన్న తేడా మీద ఆధారపడి ఉంటుంది. హృదయం నిష్కపటంగా లేకపోతే, నైతిక పద్ధతులను సరిగా అర్థం చేసుకోకపోతే దానికి అనేక అర్థాలు, అనేక భాష్యాలు, అనేక అభిప్రాయాలు కనపడతాయి. నీవు సరిగ్గానే చెప్పావు: "మనుష్యులు పూర్తిగా పవిత్రంగాను, శాంతంగాను ఉండి తీరాలి." మనిషి కుటిలత్వాన్ని వదలి పెట్టినప్పుడే ఇది సాధ్యమవుతుంది. స్త్రీలకు సంబంధించిన ఒక నానుడి ఉంది: "ప్రతి భార్యకు తన భర్త పేరు తెలుసు. కానీ సిగ్గువల్ల బయటకు చెప్పదు." (భారతదేశంలో ఇది ఒక పురాతనమైన సాంప్రదాయం. ప్రేమవల్ల, గౌరవం వల్ల భార్య, భర్త పేరు చెప్పదు. "మనసులో మాట పైకి చెపితే నశిస్తుంది.") ఈ నానుడి పరమసత్యం. భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోకుండా మనల్ని వెనక్కు లాగేది ఏదో మనకు తెలియదా? తెలుసు. ఎల్లవేళలా కాకపోయినా కొన్ని సార్లయినా మనకు చక్కగా తెలుసు. జ్ఞానం వల్ల ఏమిటి ప్రయోజనం? మనకు సంసారం మీద మమకారం చాలా తీవ్రంగా ఉండడం వల్లే మాయ మనల్ని వ్యామోహంలో ముంచి వేస్తుంది. ఇది మేలుకుని ఉండి కూడా నిద్ర నటించే వాడి పరిస్థితి వంటిది! పూర్తి మెలకువతో ఉండడం మనకు ఇష్టం ఉండదు!

ఒక చక్కని కథ ఉంది. ఒక రాజు ఉండేవాడు. మరమరాలు చేసే విధానం తనకు అర్థమయ్యేటట్లు చెప్పిన వానికి తన అర్ధరాజ్యమిస్తానని అతడు ఒక రోజు అకస్మాత్తుగా ప్రకటించాడు. రాజు అంతఃపురంలోకి వచ్చిన తర్వాత రాణి అతనితో, "ఈ రోజు మీరు పెద్ద తప్పు చేశారు. ఏదో ఒక విధంగా, ఎవరో ఒకరు మీ అర్ధరాజ్యం తీసుకుంటారు," అంది. అప్పుడు రాజు, "ప్రియతమా! నువ్వు ఏమీ కంగారు పడవద్దు. ఏం జరుగుతుందో చూస్తావుగా?" అన్నాడు. మరునాడు అనేకమంది మరమరాలు చేసే విధానం చెప్పారు. కానీ రాజు "నాకు అర్థం కాలేదు" అని చెప్పుకుంటూ వచ్చాడు. ఇంతలో ఒకడు బియ్యం, పొయ్యి, మూకుడు, ఇతర పరికరాలు తెచ్చి రాజు ముందు ప్రత్యక్షంగా చేసి చూపించాడు. అయినా రాజు, "నాకర్థం కాలేదు" అనే అన్నాడు. దీని అర్థమేమిటి? రాజు "నాకు అర్థమైంది" అంటే అర్ధరాజ్యం ఇచ్చి తీరాలి. అందువల్ల అర్థం కానట్లు నటించాడు. అర్థం కానట్టు నటించేవాడికి ఎవరూ అర్థమయ్యేలా చెప్పలేరు. మన స్థితి కూడా ఇదే విధంగా ఉంది.

భగవంతుడు సత్యం, జగత్తు అసత్యం – ఈ విషయం మనకు రూఢి అయితే, సత్యం కోసం అసత్యమైన దాన్ని త్యాగం చేస్తాం. కానీ మనం మన మమకారా లను వదిలించుకోవడానికి ఇష్టపడం. అందువల్ల మెలకువగా ఉంటూనే నిద్రపోతుంటాం. నీవు నిజాన్నే చెప్పావు: "జీవితపు క్లిష్టపరిస్థితుల్లో భగవంతుణ్ణి ఆశ్రయించడం కంటే మరో మార్గం లేదు." భగవద్గీతలో కృష్ణపరమాత్మ ఇలా చెప్పాడు: "నన్ను మాత్రమే శరణు వేడు!" (గీత: 18.66). ఇదొక్కటే మార్గం.

ప్రేమ, ఆశీస్సులతో,

తురీయానంద

(72)

అల్మోరా,
4 ఫిబ్రవరి, 1916

ప్రియమైన డి.,

నీ మానసికస్థితి ఇప్పుడు చాలా బాగున్నట్లు కనిపిస్తున్నది. అది అలాగే ఉండాలి. "శరీరం, దాని బాధ, వాటి సంగతి వాటిని చూసుకోనీ, ఓ మనస్సా! నీవు మాత్రం ఆనందంలో మునిగివుండు" అంటూ శ్రీరామకృష్ణులు చేసిన బోధను పాటించగలిగితే మనిషి బాధనుండి విముక్తుడవుతాడు. "ఆనందంలో మునిగి ఉండడ"మంటే ఆలోచనలను పరమాత్ముని వైపు మళ్ళించడమే. మానవ జీవితంలో బాధపడడం అనివార్యం. అలా అని భగవంతుణ్ణి మరచిపొమ్మని కాదు అర్థం. బాధలు శాశ్వతం కావు – అవి వస్తుంటాయి, పోతుంటాయి. కానీ అన్నివేళలా భగవంతుడే మనకు అండ, సహాయం. శరీరం సుఖదుఃఖాల్ని అనుభవించనియ్యి! కానీ మనస్సును శరీరం నుండి విడదీసి తీరాలి. తెలివైన పనేమంటే మనస్సును ఆత్మానంద భావనలో ఉంచడమే.

"గాఢ విశ్వాసం లేకపోతే మనస్సును భగవంతుని మీద ఉంచడం సాధ్యం కాదు," అని నీవు చెప్పిన మాట ఎంతైనా నిజం. కానీ మనిషి సత్సాంగత్యం, సద్భావనలు, శాస్త్రాధ్యయనాల వల్ల ఎక్కువ సహాయాన్ని పొందవచ్చు. ఈ విధానం వల్ల మనస్సు క్రమంగా స్థిరత్వాన్ని పొందుతుంది.

ఉత్తమమైన సులభమార్గం భగవంతునికి శరణాగతుడివై వేచి ఉండడమే.

ప్రేమ, ఆశీర్వాదాలతో,
తురీయానంద

(73)

అల్మోరా,
10 ఫిబ్రవరి, 1916

ప్రియమైన బి.,

నీ రిజిష్టర్డు ఉత్తరం ఈ ఉదయం అందింది. మీ అందరినీ గురుదేవులు సుఖంగా ఉంచుగాక! మీ ముగ్గురి స్వభావాలు ఒకే రకంగా ఉండి మీరందరూ సంతోషంగా కలసివుండడం గురుదేవుల అనుగ్రహం.

లోకంలో అన్నీ సంపాదించవచ్చు కానీ భగవద్భక్తి లభించడం దుర్లభం. భక్తి లేకపోతే మిగిలిన సంపదలన్నీ నిష్ప్రయోజనమే. అవి నిజమైన ప్రయోజనాన్ని కలిగించవు. ప్రతివారికీ ఈ విషయం తెలుసు. భగవద్భక్తి జీవితాన్ని మధురం, ఆనందమయం చేస్తుంది. అదే లేకపోతే జీవితం భారంగా మారుతుంది. భక్తి సంపదనంతా గురుదేవులు నీకు సమకూర్చారు. అది నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నది. ఎవరైనా భక్తుల సాంగత్యంలో,

వారికి సేవచేస్తూ, భగవంతుని యందు మనసు ఉంచి, కాలం గడిపితే అతడి జీవితం ధన్యమవుతుంది. భగవ దనుగ్రహం వల్ల నీకు ఆ రకమైన మానసిక స్వభావమేర్పడింది – ఆ భాగ్యం తక్కువేమీ కాదు. మహాభక్తుడైన తులసీదాసు ఇలా చెప్పారు: "పాపాత్మునికి కూడా సంపద, అధికారం, స్నేహితులు ఉండవచ్చు. కానీ నిజమైన అదృష్టవంతుడికి మాత్రమే భగవద్భక్తి, సత్పురుషసాంగత్యం లభిస్తాయి".

నీ శ్రేయోభిలాషి,
తురీయానంద

(74)

అల్మోరా,
16 ఫిబ్రవరి, 1916

ప్రియమైన బి.,

నీవు ఫిబ్రవరి 5వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది. వివేకానంద స్వామి జయంతి రోజున అంతమందికి సేవ చేసే అవకాశం నీకు లభించినందుకు నేను ఎంత ఆనందించానో చెప్పలేను.

"దానమిచ్చే చెయ్యి ధన్యం" అనే ఒక సామెత ఉంది. ఇదో గొప్ప సత్యం. దీనిని మరచిపోకూడదు. ఆర్తులకు భోజనం పెట్టే భాగ్యం కలిగినందువల్ల నీవు ధన్యుడి వయ్యావు.. దేవుని పేరు మీద పని చేయడానికి పూనుకున్నప్పుడు అసాధ్యమైన దేదీ లేదనే దృఢవిశ్వాసం నీకు కలిగితే, నీవు పడిన శ్రమ వృథా కాదు. అంతే కాక అది ఫలవంతం అవుతుంది కూడా. ఘనకార్యాలు మనస్సులో గొప్పభావా లను కలిగిస్తాయి. దానివల్ల మనిషి గొప్పవాడవుతాడు. కాబట్టే, "మహా పురుషుని వద్ద ఉన్న చెత్తబుట్ట కూడా ఉద్ధరిస్తుంది" అనే మాట వాడుకలోకి వచ్చింది.

సక్రమమైన పద్ధతిలో ఈ మహత్కార్యం చేసినందువల్ల నీకు మహత్తరమైన ఆనందం, బలం చేకూరి ఉంటాయి. ఈ అనుభవం భవిష్యత్తులో నీకు మహోపకారం కలిగించడం నీవే చూస్తావు.

ఆశీర్వాదాలతో,
తురీయానంద

(75)

అల్మోరా,
4 మార్చి, 1916

ప్రియమైన డి.,

మహరాజ్ (స్వామి బ్రహ్మానంద) బేలూరు మఠానికి తిరిగి వచ్చారనీ, అంతా క్షేమంగా ఉన్నారనే వర్తమానం నాకు అందింది. గురుదేవుల ప్రత్యక్షశిష్యుల సాంగత్యం వల్ల నీకు అపరిమితానందం, లాభం కలిగిందని తెలుసుకుని నేను ఎంత ఆనందించానో చెప్పలేను. ఎంతో భాగ్యం ఉంటే తప్ప అటువంటి మహావ్యక్తుల సాంగత్యం లభించదు. ఇప్పుడు వారి అనుగ్రహం మరింతగా పొందడానికి ప్రయత్నం చెయ్యి. సత్పురుషుల సాంగత్యంవల్ల కలిగిన ఫలితాన్ని శాశ్వతం చేసుకోమని నేను నిన్ను హృదయపూర్వకంగా కోరుతున్నాను. అంటే, విడువ కుండా నిరంతరం భగవంతుని చింతన చేస్తూ ఉండు. ఇది సత్సాంగత్యం వల్ల కలిగిన మహత్తరఫలితం. అది, అశాశ్వతమైన విషయాల నుండి మనస్సును పరమగమ్యం వైపు మళ్ళిస్తుంది. ఏ పురుషుని సాంగత్యం మనలో దివ్యభావాలను మేలుకొలుపుతుందో, అతడే నిజమైన సాధుసత్తముడు. ఒక మహాపురుషుణ్ణి తెలుసుకోవడానికి ఇది ఉత్తమమైన మార్గం. గొప్ప సాధువైన తులసీదాసు ఇలా చెప్పారు: "సాధుసాంగత్యంలో ఉండు. ఎందుకంటే సాధు సాంగత్యం భవరోగాన్ని నివారిస్తుంది. దుస్సాంగత్యం ఎల్లప్పుడూ బాధలే కలిగిస్తుంది."

ప్రేమ, ఆశీర్వాదాలతో,

తురీయానంద

(76)

అల్మోరా,

14 మార్చి, 1916

ప్రియమైన బాబూరాం (స్వామి ప్రేమానంద),

నీవు ప్రేమతో వ్రాసిన జాబు నిన్న అందింది. చాలా సంతోషం కలిగింది... నీ ఢాకా ప్రయాణాన్ని గురించి కొన్ని ఉత్సాహపూరితమైన ఉత్తరాలు కూడా నాకు అందాయి. నీవు ఎక్కడికి వెళ్ళినా గురుదేవుల అనుగ్రహం వల్ల అక్కడ ఒక ప్రేమానందప్రవాహం పారుతుందని వేరే చెప్పనక్కరలేదు. "దయామయుడైన భగవంతుణ్ణి తమ హృదయాలలో ఎవరు తీసుకుపోతారో వారు ఎల్లప్పుడూ పండగనాటి ఆనందాన్ని అనుభవిస్తారు. వాళ్ళు సౌభాగ్యాన్ని, పరిపూర్ణతను పొందుతారు" (పాండవగీత). గురుదేవులు నీ హృదయంలో నివసిస్తున్నారు. అందువల్ల నీవు ఎక్కడికి వెళ్ళినా అక్కడ ఆనందాన్నీ, ఉత్సవ వాతావరణాన్నీ సృష్టిస్తావనడంలో ఆశ్చర్యం లేదు. ఈ ఆనందాన్ని అనుభవించలేని వాళ్ళను, వాళ్ళ ఇష్టం వచ్చినట్లు చెప్పుకోనివ్వు. దానివల్ల ఇబ్బంది ఏమీ లేదు. వాళ్ళను చూసి జాలిపడాలి. వివేకానంద స్వామి ఇలా చెప్పేవారు: "గుడులను పగులగొట్టి గానీ, కళాత్మకమైన వస్తువులను ధ్వంసంచేసి గానీ, కొండశిఖరాలను అధిరోహించి గానీ, ఏదోవొక రకంగా కొంతమంది ప్రముఖులుగా కనపడడానికి ప్రయత్నిస్తారు!" దానివల్ల ప్రయోజనమేమిటి? భగవదనుగ్రహం లేకపోతే వాళ్ళ ప్రయత్నాలన్నీ నిష్ఫలమైపోతాయి. వారు ప్రాముఖ్యతను పొందలేరు.

ఢాకాలో కొంతమంది నిన్ను పిడివాదం చేసేవాడివన్నారు. దానివల్ల పోయిన దేముంది? ఇప్పుడు నీ చుట్టూ ఏర్పడ్డ తెర తొలగిపోయింది. నీకు తెలిసింది భగవంతుడొక్కడేనని ప్రజలు ఇప్పుడు గ్రహిస్తున్నారు. ఒక భక్తుడు, “బాబూరాం మహరాజ్ దగ్గరికి వెళ్ళినవాడు పరాయివాడుగా ఉండలేదు. అనతికాలంలోనే ఆయన మనుష్యులను తన సొంతవారిగా చేసుకొంటారు” అని వ్రాశాడు. కాబట్టి విమర్శలను గురించి ఎందుకు కలవరపడాలి? ఇతరులను విమర్శించడమనేది మానవస్వభావంలో ఒక భాగం. దానివల్ల ఏ ప్రయోజనం లేదు. సత్యానికి అంటిపెట్టుకుని ఉండడానికి తీర్మానించుకుని ఇతరుల విమర్శలను పట్టించుకోని వారికి సమస్యలుండవు. అటువంటి మనుష్యులను నేను చూశాను. వాళ్ళు నిజంగా శాంతిని, ఉత్సాహాన్ని పొంది, భగవంతుని వైపు పురోగమించారు. విమర్శ ఎవ్వరినీ మార్చదు. కేవలం గడ్డిపోచతో భగవంతుడు అద్భుతకార్యాలు చేస్తాడు. ఇప్పుడు నీ ద్వారా శ్రీరామకృష్ణుల సందేశాన్ని వ్యాప్తి చెయ్యడానికి ఉద్దేశించబడిందనడంలో సందేహమేమీ లేదు. భగవంతుడు తన పని తాను చేసుకుంటాడు. అయినా, ఆ పనికి ప్రత్యేకమైన పనిముట్లనే ఎన్నుకుంటాడు....

ప్రేమ, నమస్కారాలతో,
తురీయానంద

(77)

ప్రియమైన ఎక్స్.,

భగవంతుని చేతిలో పనిముట్లు కావడం ఎలాగో మనం తెలుసుకుంటే అది ఎటువంటి మహత్తరమైన ఆనందమో! హృదయపూర్వకంగా ఎవరైనా భగవంతుణ్ణి ప్రార్థిస్తే, ఆ ప్రార్థనను ఆయన సఫలీకృతం చేస్తాడు. నా మాట నమ్ము. భగవంతుని అనుగ్రహం లేకపోతే సక్రమంగా ఆయనను ప్రార్థించలే మనేది కూడా వాస్తవమే. సజ్జనసాంగత్యం ద్వారా ఎవరు భగవంతుణ్ణి శరణు వేడతారో, వారి బాధలన్నీ తొలగిపోతాయనీ, వారి బాధ్యతలన్నీ తానే భరిస్తాడనీ మనం గీత ద్వారా తెలుసుకున్నాం. నీవు భగవంతుణ్ణి శరణువేడావు కాబట్టి ఇక బాధపడేది లేదు. “ఓ కౌంతేయా! నా భక్తుడెన్నడూ నశించడని బాహాటంగా చాటిచెప్పు!” అని గీతలో భగవానుడు వాగ్దానం చేశాడు (గీత: 9.31).

నీ మనస్సును కనిపెడితే ఈ భగవద్వచనాలలోని సత్యం నీకే అనుభూతమవు తుంది. దైవం నిన్ను నెమ్మదిగా ఎలా తనవైపు నడిపిస్తున్నాడో, నీ నిష్ప్రాపంచిక భావాలు ప్రాపంచిక భావాలను ఎలా ప్రక్కకు నెట్టివేస్తున్నాయో నీవే చూడగలుగుతావు. ఈ సత్యం మీద ధ్యానం చేస్తే నీ మనస్సు దానంతటదే బలం, ఉత్సాహం, భక్తి, శ్రద్ధలతో నింపివేయబడుతుంది. నీవు ఎంతో సాధన చేశావు. కాబట్టి నిస్సందేహంగా మరింత సాధన చేస్తావు. దైవకృప మీద ఆధారపడడం కంటే మరో గతి లేదు. కాలక్రమేణా ఆయన నీ కోర్కెలన్నిటినీ సఫలం చేస్తాడు.

భవదీయ,

తురీయానంద

(78)

అల్మోరా,
21 ఏప్రిల్, 1916

ప్రియమైన సురేష్ (స్వామి యతీశ్వరానంద),

ఎంతోకాలం తర్వాత నీవు వ్రాసిన ఉత్తరం నిన్న అందింది. 'ఎ.' సన్న్యాసదీక్ష తీసుకున్నాడని తెలిసి సంతోషించాను. అతడు సన్న్యాస జీవితాన్ని సక్రమంగా గడపడానికి తగిన శక్తిని గురుదేవులు ప్రసాదించి అతని జీవితాన్ని ధన్యం చెయ్యాలని ప్రార్థిస్తున్నాను. లేకపోతే, సన్న్యాసదీక్ష తీసుకున్నంత మాత్రాన సరిపోదు. సన్న్యాసమనేది చాలా కఠినమైన విషయం. శ్రీ రామకృష్ణులు ఇలా అనేవారు: "భగవంతుని పేరు చెప్పి, చెట్టు చిటారుకొమ్మ నుండి క్రిందికి దూకడానికి ఎవరికి ధైర్యస్థైర్యాలు ఉంటాయో వాళ్ళే సన్న్యాసానికి అర్హులు." కానీ అది అంత సులభమైన కార్యం కాదు. పరిపూర్ణంగా భగవంతుణ్ణి శరణువేడిన వారికే అది సాధ్యం.

ప్రేమ, ఆశీర్వాదాలతో,
తురీయానంద

(79)

అల్మోరా,
3 మే, 1916

ప్రియమైన నిర్మల్ (స్వామి మాధవానంద),

నీ పోస్టుకార్డు అంది సంతోషించాను. నీవు వారణాసికి వచ్చావని తెలిసి, నీ సదుద్దేశాన్ని సఫలీకృతం చెయ్యమని గురుదేవులను ప్రార్థించాను. మానవ జీవితలక్ష్యం భగవత్సాక్షాత్కారమే. మానవజన్మ ద్వారానే భగవత్సాక్షాత్కారం సాధ్యమవుతుంది. అందువల్ల మానవజన్మ అత్యుత్తమమైనది. ఇంద్రియభోగాలు ఇతర ప్రాణులకు కూడా లభ్యమవుతాయి. కానీ, భగవత్సాక్షాత్కారం ఒక్క మానవజన్మలోనే సాధ్యం. పారమార్థిక పరిభాషలో మానవ జీవితగమ్యం, 'అన్ని దుఃఖాల నివారణ, పరమానందాన్ని పొందడం' అనేదే.

వేర్వేరు విధాలుగా చెప్పినప్పటికీ సత్యమొక్కటే. దేనిని భక్తులు భగవంతుడని అంటారో, దానినే యోగులు 'పరమాత్మ' అంటారు. దాన్నే తత్త్వవేత్తలు 'బ్రహ్మం' అంటారు. అందువల్ల దైవసాక్షాత్కారం, ఆత్మజ్ఞానం, ముక్తి అనేవన్నీ ఒక్కదాన్నే సూచిస్తున్నాయి. మానవజీవితగమ్యం నిస్సందేహంగా అదే. నీవు చదువుకున్న వాడివి, తెలివిగలవాడివి. అందువల్ల ఆ స్థితిని పొందాలనుకోవడం సహజమే.

మనిషి దేన్ని కోరుతాడో, అది అతనికి లభించడమనేది ప్రకృతి ధర్మం. నిజమైన ఆర్తి, పట్టుదల ఉంటే అతడు కోరింది లభిస్తుంది. భగవంతుడు లేని బ్రతుకు దుర్భరమన్న తీవ్రమైన వ్యాకులత ఎవరికి కలుగుతుందో, అతనికి దైవసాక్షాత్కార మవుతుందనే మాట నీవు వినే

ఉంటావు. నీవు ఆ విధమైన ఆర్తిని వృద్ధి చేసుకుంటే జయించి తీరుతావు. చిత్తం భగవంతునిలో ఉంచుకో. గురుదేవులు, "దైవంలో లీనమై ఉండు!" అనేవారు. భగవద్గీతలో కృష్ణుడు ఇలా చెప్పాడు: "ఓ పాండవా! నేనే పరమగతినన్న దృష్టితో ఎవరు నా పనులు చేస్తారో, ఎవరు నా యందు భక్తి కలిగి ఉంటారో, సర్వభూతాల యందు రాగద్వేషాలు లేకుండా ఉంటారో వారు నన్ను పొందుతారు" (గీత:11.55).

మనిషి నిస్సందేహంగా జపధ్యానాలు చేస్తూ ఉండాలి. అలా చేస్తున్నంత మాత్రాన అతడు భగవంతుణ్ణి పొందుతాడన్న పూచీ లేదు. భగవత్సాక్షాత్కారాన్ని పొందడానికి భగవదనుగ్రహం ఒక్కటే మార్గం. మరో మార్గం లేదు. వివేకానంద స్వామి ఇలా అనేవారు: "చేపలు, కూరగాయలలాగా డబ్బుపెట్టి దేవుణ్ణి కొనవచ్చుననుకున్నావా? భగవంతుణ్ణి పొందడానికి 'ఇంత జపం చేశాను, ఇంత తపస్సు చేశాను' అని చెప్పడానికి, భగవంతునికి ఎవరైనా విలువ కట్టగలరా?" ఆయన అనుగ్రహం ఉన్నప్పుడే ఆయన లభ్యమవుతాడు. ఆయన గుమ్మం ముందు ఓపికతో వేచివున్నవారికి భగవంతుని అనుగ్రహం కలుగుతుంది. ఈ మాటలవల్ల నేను నిన్ను నిరుత్సాహపరుస్తున్నాననుకోవద్దు. పారమార్థిక సాధనలు ఇంకా హెచ్చుగా చేస్తూ ఉండు. కానీ, నీవు ఆయనకు సంపూర్ణంగా శరణాగతుడవైనప్పుడే నీకు జయం కలుగుతుంది అనే మాట మరువద్దు. అన్నింటినీ ఆయనకు సమర్పించి నిశ్చింతగా ఉండు. నీకు నేను చెప్పదలిచింది ఇదే. నీవు సాధ్యమైనంత వరకు భగవంతుని వైపు కొనసాగుతూ ఉండు. మిగిలినది సాధించడానికి ఆయనే నీకు తోడ్పడతాడు.

ఎవరైనా ఆయన ద్వారం వద్ద కాచుకొని ఉండగలిగితే, సరైన సమయంలో అతని కోర్కెలన్నింటినీ భగవంతుడు నెరవేరుస్తాడు. దేనినీ, ఆశించకుండా భక్తుడు కాచుకొని ఉంటే భగవంతుడు ఎంతో సంతృప్తి చెందుతాడు. వివేకానంద స్వామి, 'ఓ దేవా! నిన్ను తెలుసుకోవడమే, నా ఏకైక వాంఛ! ఆ వాంఛ నుండి కూడా నన్ను విముక్తుణ్ణి చెయ్యి!' అని ప్రార్థించారు (నీకు నా గీతి – వివేకానంద స్వామి).

ప్రేమ, ఆశీర్వాదాలతో,
తురీయానంద

(80)

అల్మోరా,
6 మే, 1916

ప్రియమైన ఎక్స్.,

నీవు 29వ తేదీ వ్రాసిన జాబు అందింది. నేను వ్రాసిన ఉత్తరం చదివిన తర్వాత నీ మానసికస్థితి మెరుగుపడిందని తెలిసి చాలా సంతోషిస్తున్నాను. మనిషికి ఉత్సాహం అవసరం. భగవంతుడు నీవాడని తెలిసి, ఆయన సాన్నిధ్యాన్ని అనుభవించే కొద్దీ, సాంసారిక బాధలు అంతరించి గొప్ప ఆనందాన్ని, సౌఖ్యాన్ని పొందుతావు. గురుదేవులు, "నీవు తూర్పు దిక్కుకు

పోయేకొద్దీ, పడమర దిక్కు దూరమై పోతుంది" అని చెప్పేవారు. భగవంతుని వైపు పోగలిగితే, ఈ మాయా జగత్తు దానంతటదే దూరమైపోతుంది.

భగవంతుడు ఎల్లప్పుడూ హృదయంలోనే ఉన్నాడు. మన దృష్టిని ఆయన మీద ఉంచాలి. భగవంతుడు మన ఆత్మలకు ఆత్మ. ప్రాణాలకు ప్రాణం. ఆయన దయవల్లనే మనం జీవించి, ఈ లోకంలో పని చేస్తున్నాం. కాబట్టి ఆయనే నిజానికి, మన ప్రేమకు ప్రథమ లక్ష్యం. దీనిని తెలుసుకోలేక మనం అంతులేని బాధను అనుభవిస్తున్నాం. ఎప్పుడు ఈ సత్యాన్ని తెలుసుకుంటామో, అప్పుడు అన్ని కష్టాలు అంతరించిపోతాయి. గురుదేవులు ఎల్లప్పుడూ ఈ ఎరుకను నీ హృదయంలో జాగృతం చేయుదురు గాక! అప్పుడు నీ జన్మ ధన్యమవుతుంది.

ప్రతిజ్ఞ చేస్తున్నాడా అన్నట్లు భగవానుడు గీతలో ఇలా చెప్పాడు: "అనిత్యం, అసుఖం అయిన ఈ లోకంలోకి వచ్చినందున, నన్ను భజించు! నీ మనస్సును నా యందుంచు! నాకు భక్తుడిగా ఉండు! నా కోసం యజ్ఞం చెయ్యి! నాకు నమస్కరించు! ఈ విధంగా క్రమశిక్షణను అలవరచుకుని, నన్నే పరమగతిగా భావించి, నన్ను పొందుతావు" (గీత: 9.33,34). భగవంతుడు ఉత్సాహకరమైనదీ, విస్పష్టమమైనదీ అయిన ఈ సందేశాన్ని మనకు ఇచ్చినా కూడా, మన చూపులను ఆయన వైపు మరల్చకపోతే, అంతకంటే దురదృష్టకరం, విచారకరం ఇంకేముంటుంది?

సుఖం, దుఃఖం – వీటిలో ఏదీ ఈ లోకంలో శాశ్వతం కాదు. అందువలన భగవానుడు మనకు వీటికి అతీతంగా ముందుకు సాగమని సలహా ఇచ్చాడు. మన మనస్సులను పూర్తిగా ఆయన యందు నిలిపినప్పుడే ఇది సాధ్యమవు తుంది. మరి ఏ ఇతర పద్ధతుల వల్లనైనా ఇది సాధ్యం కాదు. అందువల్ల ఎల్లప్పుడూ ఆయనను నీ హృదయంలో ఉంచుకో. మిగిలిన విషయాలను ఆయనే చూసుకుంటాడు.

ఓ వెర్రి మనసా! ఓ వెర్రి మనసా!
నిరతంబు రామునే చింతించరాదా
అన్యయోచనలన్ని అప్రయోజకముల్లు
ఓ నాదు నాలుకా! ఓ నాదు నాలుకా!
నిరతంబు రామునే జపియించ రాదా
అన్యభాషణలన్ని వ్యర్థభాషణముల్లు
ఓ నాదు చెవులార! ఓ నాదు చెవులార!
ధర్మవిగ్రహుడైన రామకథనే వినుడి.
లౌకికమ్మౌ అన్య గానంబు వ్యర్థమే
ఓ నాదు కనులార! ఓ నాదు కనులార!
సర్వంబునూ రామమయముగా చూడండి
అన్యంబునంతనూ విషముగా వదలండి

ఆశీర్వాదాలతో,
తురీయానంద

(81)

అల్మోరా,
20 మే, 1916

ప్రియమైన బిహారీ బాబు,

నీవు మే 13, 1916న వ్రాసిన జాబు అందింది. అది చదివిన తర్వాత నాకు ఆనందం, విషాదం కలిగాయి. నీకు ప్రాపంచికసుఖాల యందున్న వైరాగ్యానికి, విధుల నిర్వహణలో నీకున్న నిష్కాపట్యానికి నాకు ఆనందం కలిగింది. నీ విచారం, నిన్ను నీవు కించపరుచుకోవడం, తగిన కారణమేమీ లేకుండానే నీవు నిరుత్సాహపడడం చూసి నాకు బాధ కలిగింది. గర్వం మంచిది కాదు. కానీ, “నా జీవితం నిష్ఫలం, నేను సాధించిందేమీ లేదు,” అనే వ్యతిరేక భావాలకు ఆశ్రయమివ్వడం కూడా మంచిది కాదు. గురుదేవులు అహంభావులను ఇష్టపడలేదు. అయితే మనిషి తనను తాను కించపరచుకోవడాన్నీ, విమర్శించుకోవడాన్నీ కూడా ఆయన భరించలేకపోయేవారు. అంతేకాక భగవంతునితో సంబంధమున్నందుకు గర్వపడమనీ, “నేను భగవంతుని బిడ్డను, నాకు భయమేముంది? ఆయన కరుణవల్ల నేను ఈ మాయాసాగరాన్ని సులభంగా దాటగలను,” అనీ నొక్కి చెప్పమనేవారు.

గొప్ప అంతరార్థం గల పాటలు వ్రాసే సాధుసత్తముడైన రామప్రసాదు పాటల్లో కూడా అలాంటి భావాలే మనకు కనిపిస్తాయి: “దివ్యజనని పుత్రుడు ఎవరిని చూసి భయపడతాడు?” రామప్రసాదు దివ్యజననితో దెబ్బలాడడానికి కూడా వెనుకాడడు. పొగరుబోతు బిడ్డలాగా ఇలా పాడాడు: “అమ్మా! అమ్మా! అని నిన్ను ఇక పిలవనే పిలవను.” గురుదేవులు మాకు ఈ భావాన్ని గట్టిగా బోధించారు. అందువలన నీవు ఈ దైన్యస్థితిని వదలివెయ్యాలి. నీవేమీ కొరగానివాడివా? గొప్ప కార్యకలాపాలలో పాల్గొన్నప్పుడు కూడా వీలు కల్పించుకుని భగవంతుణ్ణి గురించి సంభాషిస్తావు. నీ విరామసమయాలను దైవధ్యానానికి వినియోగిస్తావు. ఇది మధ్యాహ్నకాలం, ఇది సాయంకాలం అని చెప్పాలా? కాలమంతా భగవంతునికి చెందినదే. మనిషి జీవితమంతా ఆయనకు చెందిందే. ఒక్క క్షణమైనా మనిషి హృదయపూర్వకంగా భగవంతుణ్ణి శరణువేడితే, అతని జీవితం పవిత్రం, ధన్యం అవుతుందని, అతని లోపాలన్నీ మటుమాయమవుతాయనే విశ్వాసం ఉండాలి.

వేదస్తుతిని (భాగవతం:10.87) చాలాకాలం క్రితం చదివాను. అది నాకు ఎక్కువ జ్ఞాపకం లేదు. అందులో భాష చాలా జటిలమని మాత్రం జ్ఞాపకమున్నది. భగవద్భక్తినీ, గురుభక్తినీ వృద్ధిచేసుకోకుండా మనిషి పారమార్థిక సామ్రాజ్యంలోకి అడుగుపెట్టలేడనేది పరమసత్యం. అయితే దేవుడెప్పుడూ మన హృదయాలలోనే నివసిస్తున్నాడు. అలా కాకపోతే మరెక్కడా

ఆయనను కలుసుకునే ఆస్కారమే లేదు. గురువు కూడా దేవుడే. "నా దేవుడు జగన్నాథుడు. నా గురువు జగద్గురువు" (గురుగీత: 75). ఇది సత్యం కాకపోతే అటువంటి భగవంతుని యొక్క, గురువు యొక్క, అవసరమేముంది? గురువు, దైవం, ఇద్దరూ ఎల్లప్పుడూ మనలోనే ఉన్నారు. లేకపోతే మనం ఎలా జీవించగలం? సర్వదా మనల్ని ఎవరు కాపాడుతారో, ఆయనే అందరిపైన కృప చూపుతున్నాడు. ఎవరు అన్వేషిస్తారో, వారే ఆయనను దర్శిస్తారు.

అడవిలోకి పోయినప్పుడు ఇంటిపిల్లి అడవిపిల్లి అవుతుంది. ఈ మామూలు కళ్ళు, చేతులు, చర్మం భగవంతుణ్ణి దర్శించినప్పుడు దివ్యమైనవిగా మార్పు చెందుతాయి. కేవలం మాటలు నేర్చుకోవడం నిష్ఫలం. కానీ భగవంతుడే మాట లన్నింటికీ ఆది, మధ్యం, అంతం అని గ్రహించినప్పుడు ఆ పదాలకు సార్థకత కలుగుతుంది. "భగవంతుణ్ణి వర్ణించడానికి ప్రయత్నించినప్పుడు మాత్రమే మాటకు సార్థకత." ఈ పరమ సత్యాన్ని శ్రీధరస్వామి చెప్పారు. గురుదేవులు కూడా, "ప్రపంచంలో నక్కలన్నీ ఒకే విధంగా ఊళవేస్తాయి," అని చెప్పేవారు.

"మమకారాల నుండి విముక్తులయినవారు బ్రహ్మాన్ని తెలుసుకుంటారు. అందరు దేవతలకూ గురువైన నారాయణుణ్ణి సతతం చింతిస్తూ ఉంటారు. పాపజనితాలైన బాధలన్నింటి నుండి ధ్యానం ద్వారా విముక్తులవుతారు. వారు తిరిగి జన్మించరు" (ప్రపన్న గీత). భగవంతుడు ప్రతిజీవినీ పునీతం చేసి, అన్నింటా వ్యాపించి ఉంటాడు. "ఆయన ఒక్క పాదమే ఈ సకల జగత్తు, ఈ సకల జీవులు" (ఋగ్వేదం: 10.90.3). మనం ఎల్లప్పుడూ ఆయన పాదంలోనే నివసిస్తున్నాం. ఆయనను కాక మరెవరిని మనం ఆరాధిస్తాం? ఆయనను ఆరాధించడానికి మనకు అన్ని హక్కులు ఉన్నాయి. ఆయన మన "ప్రాణాలకు ప్రాణం, కంటికి కన్ను" (కేనోపనిషత్తు: 1.2). ఈ విషయం మనకు తెలిసినా, తెలియకపోయినా మన సర్వస్వం ఆయనే. కాబట్టి మనల్ని మనం ఆయనకు సమర్పించుకుని, సంపూర్ణంగా ఆయనలో ఉండెదము గాక! ఆయనను తప్ప అన్యమేమీ మనం చూడకుందుము గాక! ఓం.

ప్రేమ, ఆశీర్వాదాలతో,

తురీయానంద

(82)

అల్మోరా,

21 మే, 1916

ప్రియమైన డి.,

జ్యేష్ఠ తదియ (మే 1916) నాడు నీవు వ్రాసిన ఉత్తరం ఈ ఉదయం అందింది. ఇదివరకటి కంటే ఈ మధ్య నీవు చాలా బాగున్నావని తెలిసి సంతోషిస్తున్నాను. "మబ్బులు పట్టిన రోజు చెడ్డరోజు కాదు; భగవత్సంభాషణలో నుండి పైకెగిసే అమృతాన్ని పానం చెయ్యని రోజు నిజంగా చెడ్డరోజు" (శబ్దార్థ చింతామణి). సుఖదుఃఖాలతో, మంచిచెడ్డలతో దినాలు గడిచిపోతూ ఉంటాయి. కానీ, భగవదారాధన లేకుండా గడచిన రోజు వ్యర్థమైన రోజు.

ఇప్పుడు నీ మనస్సు పారమార్థిక సాధనలో స్థిరంగా ఉన్నదనీ, నీవు మహదానందాన్ని అనుభవిస్తున్నావనీ తెలిసి, నేను ఎంత సంతోషిస్తున్నానో చెప్పలేను. మరింత ఎక్కువ సాధన చేసి భగవంతునిలో లీనమైపో. అప్పుడే నీ జన్మ ధన్యమవుతుంది. నీ శరీర సంరక్షణకు అవసరమైనంత కర్మను మాత్రమే ఆచరించు. ఆ పని కూడా విసుగుతో కాకుండా ప్రశాంతంగా చెయ్యి.

దైవం నిన్ను ఎక్కడ ఉంచితే అక్కడ ఉండు. హృదయానికి సంతృప్తి కలిగేటట్లు ఆయనను ప్రార్థించు. ఒక ప్రదేశానికి మరో ప్రదేశానికి పెద్ద తేడా ఉండదు. కానీ ఆధ్యాత్మిక సాధనలు చెయ్యడానికి అనుకూలంగా ఉండే చోట ఉండడం మంచిది. మీ ఇంట్లోనే అనుకూలంగా ఉంటే, మరో చోటికి ఎందుకు పోవాలి? నీ సాంసారిక విధులను పూర్తి వైరాగ్యంతో నిర్వర్తించు. ఈ సాధన ద్వారా నీవెంతో సాధించగలవు. భగవంతుణ్ణి శరణువేడి, శాంతంగా ఉండడానికి ప్రయత్నించు. సర్వం ఆయనే చేస్తున్నాడు. మనిషి మోహంలో చిక్కుకుని తానే చేసేవాణ్ణని అనుకుంటున్నాడు. దాని వల్ల బద్ధుడై పోతున్నాడు. ఈ మహామంత్రాన్ని ఎప్పుడూ మరచిపోవద్దు. “నాహం, నాహం, తుహూ, తుహూ!” “నేను కాదు, నేను కాదు. నీవే, నీవే, దేవా!” సతతం ఆయననే చింతించు. అప్పుడు ప్రాపంచిక చింతలన్నీ తొలగిపోతున్నట్లు తెలుసుకుంటావు. శరీర బాధలు భగవత్స్మరణకు అంతరాయాలు. కాబట్టి, రోగాల నుండి నీ శరీరాన్ని కాపాడుకోవాలి. శరీరం కోసమే కాకుండా, పారమార్థిక సాధనల కోసం శరీరాన్ని గురించి జాగ్రత్త తీసుకోవాలి.

నీ ఉత్సాహాన్నీ, నిజాయితీని చూసి ఆనందిస్తున్నాను. ఇది చాలా ప్రశంసనీయమైన సంగతి. ఇది పారమార్థిక జీవితంలో అభివృద్ధి చెందడానికి ఎక్కువ ఉపయోగిస్తుంది. మరొకప్రక్క విచారం, మందకొడితనం మనిషిని అంతకంతకు దిగజార్చివేస్తాయి. భగవంతుణ్ణి శరణువేడిన వాడికి భయం, తొందరపాటు ఉండవు. భగవంతుడు భక్తునికి అన్ని విధాలా సహాయం చేసి అతణ్ణి తనవైపు ఆకర్షించుకుంటాడు.

మనసులో ఒడుదొడుకులు కలగడం సహజం. కొన్నిసార్లు మనిషి పారమార్థిక సాధనలవల్ల ఆనందాన్ని చవి చూస్తాడు. అప్పుడు అతని మనస్సు సులభంగా భగవంతుని వైపు ఆకర్షించబడుతుంది. కొన్నిసార్లు అసలు ఆనందమే కలగదు. పారమార్థిక సాధనలు కూడా చెయ్యాలని అనిపించదు. గొప్ప విచారంతో హృదయం కప్పివేయబడుతుంది. కానీ, మంచి, చెడు పరిస్థితులన్నింటిలోనూ సాధనలను ఆపకుండా కొనసాగించే వాడి మనస్సు అటూయిటూ ఊగడం క్రమంగా ఆగిపోయి ఒకే రకమైన ఆనందప్రవాహం అందులో ప్రవహిస్తుంది. అప్పుడు ఆ మనస్సు ఒకే రీతిగా భగవత్స్మరణలో నిమగ్నమై ఉంటుంది. సుఖదుఃఖాలు ఇక ఎంతమాత్రం అతణ్ణి కలవరపెట్టవు. అన్ని పరిస్థితుల్లోను అతడు సాధన కొనసాగిస్తూ, ఆంతర్యంలో ఎంతో ఆనందాన్ని అనుభవిస్తాడు. భగవంతుని అనుగ్రహం వల్ల ఈ స్థితిని పొందినప్పుడు అతడు ధన్యుడవుతాడు.

నీ శ్రేయోభిలాషి,

తురీయానంద

(83)

అల్మోరా,

1 జూన్, 1916

ప్రియమైన ప్రజ్ఞానంద,

ఇప్పుడు పారమార్థికాభ్యాస విషయం చూద్దాం. ధ్యానం, ఏకాగ్రత, జపం, తపస్సు, అర్చన, శాస్త్రాధ్యయనం, యోగం, వైదిక కర్మ – ఈ సాధనలన్నీ చిత్తశుద్ధిని సాధించడానికి మాత్రమే పనికివస్తాయి. చిత్తశుద్ధి యొక్క లక్ష్యం ఆత్మజ్ఞానం లేక ఆత్మసాక్షాత్కారం. మనస్సులో కోరికలు ముసురుతున్నప్పుడు అది అపవిత్రమవుతుంది. కోర్కెల నుండి విముక్తి చెందినప్పుడు అది పవిత్రమవు తుంది. ఇప్పుడు ముఖ్యంగా చెయ్యవలసిన పని – ఏ విధంగానైనా మనస్సును స్వార్థరహితంగా చెయ్యడం. ఆ పనిని ధ్యానం, సేవ, వివేకం, భక్తి – ఏదో ఒక దానిద్వారా చెయ్యవచ్చు. ప్రతివారికీ వారివారి ఇష్టముంటుంది. కానీ ప్రతివారూ అహంకారాన్ని నిర్మూలించుకోవాలి. ఈ 'అల్పమైన అహం' కరిగిపోయినప్పుడు, 'బ్రహ్మాండం యొక్క అహం' లేక 'పరబ్రహ్మం' మనిషి అనుభూతిలోకి వస్తుంది. ఈ స్థితిని జీవన్ముక్తి అంటారు. అంటే శరీరంతో జీవించి ఉండగానే ముక్తిని పొందడం.

భగవంతుని అనుగ్రహం సర్వకాలాల్లోనూ ఉంది. అది లేని సమయం లేదు. మనస్సు పరిశుద్ధమైనప్పుడు మనిషి ఆ దివ్యానుగ్రహాన్ని పరిపూర్ణంగా రుచి చూసి అనుభవిస్తాడు. ఆత్మజ్ఞానం ఎల్లకాలాలలోనూ అస్తిత్వాన్ని కలిగివుం టుంది. దానికి భూతకాలం లేదు, భవిష్యత్తు లేదు. మేఘం తొలగిపోయినప్పుడు సూర్యుడు కనిపిస్తాడు. అదే విధంగా అజ్ఞానం తొలగించబడినప్పుడు స్వయం ప్రకాశం, స్వయంవేద్యం అయిన ఆత్మదర్శనమవుతుంది. ఆత్మజ్ఞానం కలగడానికి మానవులు రకరకాల పనులు చేస్తారు. కానీ శ్రద్ధ లేక అచంచల విశ్వాసం అనేది మొట్టమొదట ఉండవలసిన అత్యంత ప్రధానమైన విషయం. గీత ఇలా చెపు తుంది: "ఎవడు ఇంద్రియాలను జయిస్తాడో, ఉత్సాహం, శ్రద్ధ (పరిపూర్ణమైన విశ్వాసం) కలిగివుంటాడో, వాడు జ్ఞానాన్ని పొందుతాడు" (గీత: 4.39).

నీ శ్రేయోభిలాషి,

తురీయానంద

(84)

అల్మోరా,

7 జూన్, 1916

ప్రియమైన బిహారీబాబు,

నీవు మే 31వ తేదీన వ్రాసిన ఉత్తరం మొన్న అందింది. విచారాన్ని తరిమివెయ్యడానికి నీవు తీసుకున్న తీర్మానాన్ని గురించి తెలిసి ఆనందించాను. నిరాశాభావాన్ని వదిలేకొద్దీ ఆశాజ్యోతి

ఎక్కువగా దర్శనమిస్తుంది. నీ సంక్షేమం కోసం నేను దైవాన్ని ఎల్లప్పుడూ ప్రార్థిస్తున్నాను. నీవు కూడా ప్రార్థించు. నీకు ఆయన సమాధానమిస్తాడు...

నీవు తర్జుమా చేసిన 'వేద–స్తుతి' (భాగవతం:10.87) చదివాను. బాగా వ్రాసినట్లు నాకు అనిపించింది. భాష్యానువాదం విపులంగాను, సూచనాత్మకం గాను, ఆకర్షణీయంగాను ఉన్నది. అందులోని విషయాన్ని గురించి నేనేమి చెప్పగలను? అది సర్వశాస్త్రాల యొక్క సారాంశం. "వేదాలు, పురాణాలు, రామాయణం, మహాభారతం, మొదలైన ఇతర శాస్త్రాల యొక్క ఆది, మధ్య, అంతాలలో భగవంతుడు కీర్తింపబడ్డాడు." భగవంతుని కన్నా మరో శరణ్యం లేదు. ఎందుకంటే ఆయన ఒక్కడే సత్యం. ఆయన ఒక్కడే నిత్యం. మిగిలినదంతా అశాశ్వతం. ఈ క్షణంలో ఉంటుంది. మరుక్షణంలో మాయమవుతుంది. కాబట్టి అశాశ్వత విషయాల మీద ఆధారపడడం అర్థరహితం. అలా చేయడం వలన తప్పకుండా దుఃఖాన్ని పొందవలసిస్తుంది. కానీ, భగవంతుని మాయ ఎంత బలీయమైనదంటే, ఈ మామూలు సత్యాన్ని కూడా మనం అర్థం చేసుకోలేం. కాబట్టి భగవానుడు మనకు అసలు రహస్యాన్ని చెపుతున్నాడు: "నన్నే ఎవరు శరణువేడతారో వారు ఈ మాయను దాటుతారు" (గీత:7.14).

ప్రేమ, ఆశీస్సులతో,

తురీయానంద

(85)

అల్మోరా,

12 జూన్, 1916

ప్రియమైన ప్రజ్ఞానంద,

... ఈ లోకంలో ఏ చోటు, ఏ మనిషి, ఏ వస్తువు లోపం లేకుండా లేదు. అందువల్ల గీతలో, "ఏ విధంగా అగ్నిని పొగక్రమ్మి ఉంటుందో, అదే విధంగా చేయబడే ప్రతి ప్రయత్నం (అంటే పని లేదా కర్మ) దోషం చేత కప్పబడి ఉంటుంది," అని చెప్పబడింది (గీత:18.48). ఆ విధంగా పనులు అన్నీ లోపంతో కూడినవే. అయినా భగవంతుడు "ఓ కౌంతేయా! దోషభూయిష్టమైన దైనా సరే, స్వధర్మాన్ని (అంటే తద్వారా ప్రాప్తించిన కర్మలను) వదలకూడదు" (గీత:18.48) అని చెప్పాడు. ఇంకా, "సమబుద్ధిని అలవరచుకుని, నీ హృదయాన్ని నిరంతరం నా యందు నిలుపు" (గీత:18.57) అని చెప్పాడు. ఈ విధంగా పనిచేస్తే అన్ని బాధలు సమసిపోతాయి.

మళ్ళీ మళ్ళీ అభ్యాసం చెయ్యడం ద్వారా ఈ దివ్యచైతన్య స్థితిని సాధించవచ్చు. "దీర్ఘకాలం వదలకుండా భక్తిశ్రద్ధలతో అభ్యాసం చేసినప్పుడు మనిషి దివ్యచైతన్యంలో దృఢంగా నిలిచిపోతాడు" (పతంజలి యోగసూత్రాలు: 1.14). ఒక్క క్షణంలో ఏదీ సంభవించదు. పట్టువిడువకుండా సాధన చెయ్యడమే దీనికి కీలకం. "భగవంతుణ్ణి అంటిపెట్టుకుని ఉండు. క్రమంగా నీవు దివ్యత్వాన్ని పొందుతావు." భగవంతుణ్ణి ఎలా అంటిపెట్టుకుని ఉండాలనే

దాన్ని మనిషి నేర్చుకోవాలి. అభ్యాసం ద్వారా అది మనిషి యొక్క రెండో స్వభావమై (సహజలక్షణమై) పోయినప్పుడు అతడు గమ్యాన్ని పొందుతాడు. అప్పుడు అతడు దైవాన్ని లోపలా, బయటా కూడా దర్శిస్తాడు. దానివల్ల మారుతున్న లోకపరిస్థితులు అతనిని ఎంతమాత్రం కలవరపెట్టలేవు. అంటే కలవరపెట్టే పరిస్థితులు రావని కాదు – వస్తాయి. అవి వస్తూపోతూ ఉంటాయి కానీ, ఏ ప్రభావాన్నీ కలిగించవు. "శరీరమున్న ప్రతి వారికీ బాధలు రాక తప్పదు. కానీ, ఆ బాధలను తప్పించునే అవకాశం లేదని జ్ఞానికి తెలుసు. కాబట్టి, అతడు శాంతంగా వాటిని భరిస్తాడు. ఇక అజ్ఞాని అయినవాడు ఎప్పుడూ ఏడుస్తూ, పెడబొబ్బలు పెడుతూ, తనను తాను దైన్యంలోకి తోసివేసుకుంటాడు" (భక్త తులసీదాసు). వీరిరువురిలో ఉన్న తేడా ఇదే.

గురుదేవులు అన్నీ నీకు అనుకూలంగా చేస్తారు. ఆయనను శరణువేడిన వారికి భయం ఉండదు.

ప్రేమ, అశీస్సులతో,
తురీయానంద

(86)

అల్మోరా,
16 జూన్, 1916

ప్రియమైన డి.,

పారమార్థిక జీవితంలో చేపలు, మాంసం తినడాన్ని గురించి నీవు ప్రశ్నించావు. ఈ విషయంలో అనేక భిన్నాభిప్రాయాలున్నాయి. ప్రదేశాన్ని బట్టి ఆహారపు అలవాట్లు ఉంటాయి. అంతేకాక మానవస్వభావంలో తేడాలుంటాయి. కొంతమందికి శాకాహారం ప్రయోజనకరం. మరికొందరికి మాంసాహారం మంచిది. ఒక రోగి ఆహారవిషయానికి వచ్చినప్పుడు, వేరే విధమైన నియమాలు వర్తిస్తాయి. కొన్నిచోట్ల వైద్యశాస్త్రం మాంసాహారాన్ని విధిస్తుంది. మరి కొన్నిచోట్ల దాన్ని నిషేధిస్తుంది. రోగాలను బట్టి వేర్వేరు ఆహారాలు చెప్పబడతాయి.

ఒకరికి సాత్త్వికాహారమైనది మరొకరికి కాకపోవచ్చు. పాలు చాలా మంచి ఆహారం. అవి శరీరాన్ని పోషిస్తాయి. ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. అందాన్ని చేకూరుస్తాయి. కానీ అవే పాముకు ఆహారమైనప్పుడు విషాన్ని వృద్ధి చేస్తాయి. 'పాలు త్రాగి పాము, కాలకూటవిషాన్ని కక్కుతుంది' అనే సామెత ఉంది కదా.

ఆహార విషయంలో గురుదేవులు చెప్పిన సలహా అత్యుత్తమమైనది. "మనస్సును భగవంతుని మీద స్థిరంగా నిలపడానికి ఏ ఆహారం ఉపయోగపడు తుందో, అది ఉత్తమోత్తమమైన ఆహారం." ఒక ఆహారం సాత్త్వికమైనదా, కాదా అనే విషయాన్ని తీర్మానించుకోవడానికి ఇదే మార్గం. ఎందుకంటే సాత్త్వికస్వభా వం మనస్సును దేవుని వైపు మళ్ళిస్తుంది. వివేకానంద స్వామి, 'భక్తియోగం'లో ఆహార విషయాన్ని విస్తారంగా

చర్చించారు. నీ శరీరాన్నీ, మనస్సునూ ఏ ఆహారం ఆరోగ్యవంతంగా ఉంచుతుందో ఆ ఆహారాన్ని నీవు తీసుకోవాలి. మనస్సు భగవంతుని యందు ఉండడమే ప్రధానమైన లక్ష్యం. ఇంద్రియభోగాలను అనుభవించడానికి తగినట్టు శరీరాన్ని శక్తిమంతంగా ఉంచుకోవడమే లక్ష్యంగా ఉన్నవారికే ఈ ఆహార నియమనిబంధనలు వర్తిస్తాయి. భగవదారాధనే ఎవరి గమ్యమో, వారి విషయంలో ఈ నియమనిబంధనలు నిరుపయోగం. శరీరం ఆరోగ్యంగా ఉంటే చాలు, మనిషి భగవంతుణ్ణి ధ్యానించగలడు.

కాబట్టి శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచి, పారమార్థిక సాధనలు కొనసాగించడానికి ఉపయోగించే ఆహారం తీసుకోవడం మంచిది.

ప్రేమ, ఆశీస్సులతో,
తురీయానంద

(87)

అల్మోరా,
8 జూలై, 1916

ప్రియమైన బిహారీబాబు,

నీ ఉత్తరం చదివి ఎంతో ఆనందపడ్డాను. నీలో ఇదివరకటి ఆత్మన్యూనతా భావం తిరిగి మేలుకోవడాన్ని గమనించి విచారపడ్డాను. నీవు దివ్యజనని బిడ్డవు! అటువంటప్పుడు అంత అప్రయోజకుణ్ణని ఎందుకు అనుకుంటావు? ఈ వ్యతిరేక భావాన్ని పూర్తిగా వదలివెయ్యి. గురుదేవులు ఈ రకంగా వల్లించమని మాకు బోధించారు: "నేను భగవన్నామ స్మరణ చేసేవాణ్ణి. ఇక నాకు దిగులెందుకు?" నీ ఆత్మనిందా విధానాన్ని చూసి నేను నిజంగా బాధపడుతున్నాను. ఇది పార మార్థికాభివృద్ధికి ఆటంకమని గురుదేవుల నుండి మేం విన్నాం. భగవంతునితో నీకు ఉన్న గాఢమైన సంబంధాన్ని గుర్తించి, నీవు ఆయనవైపు పయనించాలి. నీవు ఆయన బిడ్డవని ఎన్నడూ మరువవద్దు. మానవ సంబంధాలు, బంధుత్వాలు తాత్కాలికాలు, క్షణికాలు. కానీ, భగవంతునితో సంబంధం శాశ్వతమైనది.

'జీవన్ముక్త స్థితి యొక్క ఆనందాన్ని చవిచూడడానికే ఈ నిత్యముక్తాత్మ మానవజన్మ ఎత్తుతుంది గాని, ప్రాపంచిక సుఖాలను అనుభవించడానికి కాదు." ఆదిశంకరులు వ్రాసిన ఈ శ్లోకం మొట్టమొదట నేను చదివినప్పుడు, నాకు ఎంత అద్భుతమైన ఆనందం, జ్ఞానోదయం కలిగాయో నీకు చెప్పలేను. (నిజానికి ఈ శ్లోకం 'నరహరి' చేత వ్రాయబడింది – సంపాదకుడు.) అప్పుడు జీవితం యొక్క ఉద్దేశ్యమేమిటో నా ముందు ప్రకాశించింది. సమస్యలన్నీ వాటంతటవే తీరిపోయాయి. మానవజన్మ ఎత్తడం యొక్క ఉద్దేశ్యం జీవన్ముక్తి, అంటే జీవించి ఉండగానే ముక్తిని పొందడంలోని ఆనందాన్ని చవిచూడడమేనని నాకు అవగత మైంది. నిజంగా నిత్యముక్తాత్మ మనిషి రూపం దాల్చడానికి కారణం, శరీరంలో ఉండగానే మోక్షానందాన్ని అనుభవించడం కోసమే తప్ప మరేదీ కాదు.

నీవు ఆ నిత్యముక్తాత్మవు. 'నిన్ను చూసి నీవే జాలి పడడమనేది నీవంటి వానికి ఎంత మాత్రం తగదు. నేరుగా సూర్యుణ్ణి చూడడం కష్టమే. కానీ, సూర్యుడి ప్రతిబింబాన్ని చూడడం సులభం. అదే విధంగా అహం బ్రహ్మాస్మి అని సచ్చిదా నందాన్ని సాక్షాత్కరించుకోవడం కష్టమే కావచ్చు కానీ, నేను భగవంతుని బిడ్డను లేక ఆయన అంశాన్ని అని నిశ్చయంగా తాదాత్మ్యం చెందవచ్చు. భగవంతుని కంటే తాను వేరని మనిషి తలంచకూడదు. అది ప్రయోజనకారి కాదు. నేను ఎటువంటి వాణ్ణైనా కావచ్చు కానీ, నేను భగవంతునికి చెందిన వాణ్ణి. మరెవరికి చెందినవాణ్ణి కాదు. కుమారుడు అప్రయోజకుడు కావచ్చు కానీ పుత్రుడు పుత్రుడే గదా! రామప్రసాదు పాట ఒకటి ఉంది: "నేను మంచివాణ్ణి కావచ్చు, చెడ్డవాణ్ణి కావచ్చు. ఏమైనా కావచ్చు. నీకు అన్నీ తెలుసు. పిల్లవాడు చెడ్డవాడైనంత మాత్రాన తల్లి తన పుత్రుణ్ణి కాదంటుందా?" నీవు మంచివాడివైనా, చెడ్డవాడివైనా, ఆ దివ్యజనని బిడ్డవు. ఇందులో సందేహం ఏ మాత్రం లేదు.

ప్రేమ, ఆశీస్సులతో,
తురీయానంద

(88)

అల్మోరా,
19 జులై, 1916

ప్రియమైన డి.,

నీవు వ్రాసిన ఆషాఢ (జులై 1916) జాబు నిన్న అందింది. నీవు కులాసాగా ఉన్నావనీ, సంతృప్తికరంగా సాధనలు చేస్తున్నావనీ తెలిసి ఆనందిస్తున్నాను.

ఆహార విషయంలో మంచిచెడ్డల విచక్షణ చెయ్యడం ఆధ్యాత్మిక జీవితంలోని ప్రారంభకులకే గానీ, భగవంతునిలో మనసు నిమగ్నమైన వారు ఆహారం వల్ల ఏ విధంగానూ ప్రభావితులు కారు. భగవంతుని మీద మనస్సు నిలపడమే ప్రధానమైన విషయం. బహుశా వివేకానంద స్వామి సంపూర్ణ గ్రంథావళిలో స్వామీజీ ఏమి చెప్పారో నీవు చదివి ఉంటావు. "ఒక మాంసం ముక్క తినగానే, తన నిర్హేతుక కృపానదీ ప్రవాహానికి అడ్డుకట్ట వెయ్యడానికి భగవంతుడు నీలాంటి పిచ్చిపుల్లయ్య అనుకుంటున్నావా? భగవంతుడు అటువంటివాడే అయితే అతడు ఒక పైసాకు కూడా కొరగాడు!" (వివేకానంద సాహిత్య సర్వస్వం, ఆంగ్లం, 1996, సంపుటం, 4:359). దీని అర్థమేమంటే, ఆధ్యాత్మిక జీవితంలో ఆహార మనేది ప్రధాన సమస్య కాదు. చిత్తశుద్ధియే ముఖ్యమైన విషయం. భగవంతుణ్ణి తలచేవాడు పంది మాంసం తిన్నా అది వండిన కూరలు, అన్నం, నెయ్యి కలిసిన హవిష్యాన్నంతో సమానం. దానికి మారుగా పవిత్రాహారం భుజిస్తూ మనస్సులో అసూయ, ద్వేషం, కామం, లోభం మొదలైన వాటికి ఆశ్రయమిస్తే, ఆ పవిత్రమైన ఆహారం యొక్క ప్రయోజనమేముంది? 'నేను శాకాహారిని' అనే ధార్మిక అహంకారం మనిషిని అధఃపతనం గావిస్తుంది.

దీనివల్ల ఆహారవిషయంలో విచక్షణ అవసరం లేదని కాదు అర్థం. నేను చెప్పదలచిందేమంటే నీ మనస్సును ఆహారవిషయంలో పెట్టవద్దు. నీ మనస్సుని పూర్తిగా భగవంతునిపై ఏకాగ్రం చెయ్యడానికి ప్రయత్నించు. మిగిలినదంతా అదే సమకూరుతుంది. "బంగారాన్ని వదలిపెట్టి కొంగు ముడి వెయ్యవద్దు." బంగారం కోసమే కొంగు ముడి వేస్తారు. ముడిలో బంగారం లేకపోతే దానివల్ల ప్రయోజనమేమిటి? అదే విధంగా ఈ నియమనిబంధనలు, ఆధ్యాత్మిక సాధనలు అన్నీ భగవత్సాక్షాత్కారం కోసమే. మనస్సు భగవంతుని మీద కేంద్రీకృతం కాకపోతే, యాంత్రికమైన నియమాలు, కార్యక్రమాలు అర్థరహితమవుతాయి. ఈ సందర్భంలో నాకో గీతం జ్ఞాపకానికి వస్తున్నది:

ఏ నిధితో నే బ్రతుకు ఈడ్చెదను?
ఓ దేవా! నా హృదిలో వెలసిన
పరమ పెన్నిధివి నీవే కావా!
అన్నిటినీ త్యజియించుచు చక్కగ
కుటిలోనైనా నీ సహవాసము
ఎంతో శ్రేయము నిచ్చును గాదా!
అట్టి తరిని నువు నాదు మనస్సును
జ్ఞానకాంతితో నింపి వేసెదవు
వెతలను మరచుచు నిను నే వేడెద
'ఓ ప్రియుడా! విడనాడకు నను!' అని.
ఈ జగతిలో నిను బాసి ఎటుల నే
బ్రతుకు బండి మరి లాగగలుగుదును?
మానధనములతొ నా కేమీ పని?
కడపటి రోజున వెంట రావు గద!
నే నీ వాడను, నా వాడవు నువు,
నానాటికి నువు నా వాడివి మరి!

'నీవెల్లప్పుడూ నా వాడివే!' – ఇదే సరైన విధానం. ఈ లోకంలో ప్రతిదీ అనిత్యమే. కొద్దిరోజులు మాత్రమే ఉంటుంది. భగవంతుడు తప్ప శాశ్వతమైనదేదీ లేదు. కాబట్టి మనం ఏ పరిస్థితులలో ఉన్నా భగవంతుని మీద కేంద్రీకృతమైన జీవితం గడిపితే ఏ బాధలు మనను తాకలేవు. ఘోరమైన విపత్తులలో కూడా భగవత్సన్నిధిని హృదయంలో అనుభవించగలిగితే అనంతమైన ఆనందం కలుగుతుంది. కాబట్టి భగవంతుడు మనకు కావాలి. ఒక్కసారి ఆయనను పొందితే మనకు సర్వం ఉన్నట్లే. మరేదీ అవసరం లేదు.

“నీవు ఒక్కరిని (భగవంతుణ్ణి) అన్వేషిస్తే, సర్వం లభిస్తుంది. అనేకం కోరితే నీకేదీ రాదు. చెట్టు మొదట్లో నీళ్ళు పోస్తే వృక్షం పుష్పాలతో, ఫలాలతో నిండి పోతుంది. చెట్టుకు ఇంకెక్కడైనా నీరు పోస్తే ఏ ఫలితమూ రాదు” (తులసీదాసు).

కాబట్టి దైవకరుణవల్ల ఆయనను సాక్షాత్కరించుకున్నవారు, “ఓ ప్రభూ! నిన్ను తప్ప మరి దేన్ని మేము కోరగలం? నీవే మా ఏకైక పెన్నిధి!” అని చెపుతారు. ఈ విషయాన్ని దృఢవిశ్వాసంతో గ్రహించు.

ప్రేమ, ఆశీస్సులతో,
తురీయానంద

(89)

అల్మోరా,
27 జులై, 1916

ప్రియమైన బిహారీబాబు,

ఎంత అద్భుతమైన ఉత్తరం వ్రాశావు! అందులో పొందిక లేకపోయినా ఎన్నో ఉదాత్తమైన భావాలున్నాయి. ఫరవాలేదు. ప్రధానవిషయం సక్రమంగా ఉన్నప్పుడు, మిగిలినవన్నీ వాటివాటి స్థానాల్లో కుదురుకుంటాయి. ఎంత చక్కగా వ్రాశావు! భగవత్సాక్షాత్కారానికి సత్సాంగత్యం సర్వోత్కృష్టమైన మార్గం. భళీ! దీనికి ఇంకేమి కలుపగలం? భగవంతుడు అఖండ సచ్చిదానందం. సజ్జన సాంగత్యంలో ఉంటే భగవత్సాంగత్యంలో ఉన్నట్లే... నీవు ఇంకో విషయం కూడా వ్రాశావు. భగవంతుడే భగవంతుని ఉనికికి నిరూపణ. ఎంత పరమసత్యం!

గీతలో అర్జునుడు, “ఓ పురుషోత్తమా! నీవే నిన్ను, నీవల్లనే తెలుసుకుంటావు,” అన్నాడు (గీత: 10:15). కృష్ణుడు ఇలా చెప్పాడు: “దేవతలుగానీ, మహర్షులు గానీ, నా మూలాన్ని తెలుసుకోలేరు. సర్వదేవతలకు, మహర్షులకు అన్ని విధాల నేనే మూలాన్ని” (గీత: 10:2).

భగవంతుణ్ణి ఎవరు తెలుసుకోగలరు? తన అపారకరుణ వల్ల తనను తాను తెలిపితేనే అది సాధ్యమవుతుంది. ఒక రోజు గురుదేవులు ఈ పాట పాడి నా కంటతడి పెట్టించారు:

ఇంతటి పొగరేల మీకు కుశలవులారా!
నా అంతట నేను మీకు వశముగాక యున్న తరిని
సుంతయేని సాధ్యమౌన కట్టడి చేయంగ నన్ను
మీదు సొంత బలముతోడ ఓటమి పాల్జేయ నన్ను

అది విని నేను చలించిపోయాను. పారమార్థిక సాధనలు చెయ్యడం వల్ల, స్వప్రయత్నం ద్వారా, మనిషి దైవాన్ని పొందలేడని గురుదేవులు నా మనస్సు మీద ప్రగాఢమైన ముద్ర వేశారు. భగవంతుడు తనకు తానుగా, తనను తెలియజేసుకున్నప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది. “ఈ పరిపూర్ణమైన ఆత్మ కదలదు కానీ మనస్సు కంటే వేగంగా పోగలదు.

దేవతలు (ఇంద్రియాలు) కూడా దాన్ని చేరలేరు. ఎందుకంటే అది ఎప్పుడూ ముందే ఉంటుంది" (ఈశోపనిషత్తు, 4). "ఎవరిని ఈ ఆత్మ వరిస్తుందో వారిచేత మాత్రమే పొందబడుతుంది" (కఠోపనిషత్తు, 1.2.23).

నీ ఉత్తరంలోని ప్రతి పంక్తిలోను శరణాగతభావం చొచ్చుకొనిపోయి ఉండడం చూసి ఆనందంతో తబ్బిబ్బైపోయాను. గురుదేవులు నీ ప్రార్థనను ఆలకించి, చేయిపట్టుకుని నిన్ను నడుపుతారని విశ్వసిస్తున్నాను. నా ప్రేమను స్వీకరించకోరుతున్నాను.

నీ శ్రేయోభిలాషి,
తురీయానంద

(90)

ప్రియమైన ఎక్స్.,

..వారణాసి నీకు నచ్చలేదు కాబట్టి, మరోచోటికి పోవాలనుకుంటున్నావు. ఎక్కడికి పోతావు? స్వాభావికంగా మనస్సు చంచలమైనది. నీవు ప్రదేశం మార్చినంత మాత్రాన అది ప్రశాంతమవుతుందా? నీవు ఆంతర్యంలో మనస్సును శాంతింపజేసి పరిస్థితులను అధిగమించాలి. పరిస్థితులకు నీవు బానిసవైతే, నీవు ఎక్కడికి పోయినా అవి నీ వెంట వస్తూనే ఉంటాయి. కానీ, పరిస్థితులను పూర్తిగా నీ ఆధీనంలోకి తెచ్చుకుంటే అవి ఇక ఏ బాధను కలిగించలేవు.

నీ శ్రేయోభిలాషి,
తురీయానంద

(91)

అల్మోరా
5 ఆగష్టు, 1916

ప్రియమైన డి.,

నీవు సంతృప్తికరంగా పారమార్థిక సాధనలు చేస్తూ కులాసాగా ఉన్నావని తెలిసి ఆనందించాను. భగవత్ సంస్మరణ వల్ల మానసిక శాంతిని మనిషి పొందాడంటే దానిలో ఆశ్చర్యమేమీ లేదు... "మన ఇచ్ఛయే భగవదిచ్ఛ"– అజ్ఞానంలో ఉన్నంత వరకు మనుష్యునికి ఈ దృఢ విశ్వాసం కలగదు. భగవదిచ్ఛ సత్యంలో ప్రతిష్ఠితమై ఉంది. కానీ మానవ సంకల్పం తరచుగా అసత్యమవుతూ ఉంటుంది. అందువల్ల మానవ సంకల్పం, దైవ సంకల్పం ఒకటేనని చెప్పలేం. భగవదనుగ్రహం వల్ల చిత్తశుద్ధి కలిగితే మనిషికి అన్నింటిని గురించి సరైన అవగాహన కలుగుతుంది.

నీ శ్రేయోభిలాషి,
తురీయానంద

(92)

అల్మోరా,

11 ఆగష్టు, 1916

ప్రియమైన బిహారీ బాబు,

ఆగష్టు 5వ తేదీన నీవు వ్రాసిన ఉత్తరం నిన్న అందింది. ఆరోగ్యమైన శరీరంతోనూ, ప్రశాంతమైన మనస్సుతోనూ నీ సాధనలు సాగిపోవాలని గురు దేవులను ప్రార్థిస్తున్నాను. "బొందిలో ప్రాణమున్నంత వరకు భగవన్నామాన్ని పాడుతూ ఉండు." ఇదే ప్రధానమైన విషయం. "ఓ ప్రియా! నా హృదయ తాపాన్ని నీ నామగానంతో చల్లబరచుకుంటాను." ఇంతకంటే ఉత్తమమైన ప్రార్థన మరొకటి లేదు.

"పారమార్థిక సాధనకు ప్రేమ అత్యుత్తమ విధానం." పారమార్థిక సాధన అంటే ఏమిటి? సర్వజీవుల యందు ప్రేమ. వివేకానంద స్వామి ఇలా చెప్పారు. "ప్రేమ అజ్ఞానసాగరాన్ని దాటించే ఏకైన నౌక." దీన్ని ఆయన తన జీవితంలో అమలుచేసి చూపించారు. భక్తి లేక ప్రేమ అనే దాన్ని నారద మహర్షి ఇలా నిర్వచించారు: "పరమప్రేమ యొక్క నిజస్వభావం అనిర్వచనీయమైనది. అది మూగవాడు మనోహరమైన రుచిని వర్ణించడానికి యత్నించినట్లుంటుంది. అయినా కొంతమంది అదృష్టజీవులకు అది వ్యక్తమవుతుంది" (నారద భక్తి సూత్రాలు, 51-52). ఆ దివ్యప్రేమను పొందే మార్గాన్ని కూడా నారదమహర్షి సూచించారు: "భగవన్నామం గానం చేసినప్పుడు భగవంతుడు ఆలస్యం లేకుం డా తననుతాను తెలియపరచి, ఆ ప్రేమను భక్తుడు అనుభవించేలా చేస్తాడు."

కాబట్టి భగవన్నామ గానం కంటే మరొక ఉత్తమ మార్గం లేదు.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్ ।
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతి రన్యథా ॥
(బృహన్నారదీయ పురాణం, 38:26)

"ఈ కలియుగంలో భగవన్నామ సంకీర్తన ఒక్కటే సాక్షాత్కారాన్ని పొందడానికి మార్గం," అని చెప్పబడింది. కాబట్టి గురుదేవులు ఇలా గానం చేశారు:

"అమ్మా! శ్యామా! నీ నామమొక్కటే నాకు శరణ్యం.
సాంఘిక నియమాలు, కర్మకలాపాలు నేనెందుకు పాటించాలి?"

ఈ యుగంలో హరినామ గానమే ముక్తికి సోపానం. ఇది సత్యం.

ప్రేమ, ఆశీస్సులతో,

తురీయానంద

(93)

రామకృష్ణ కుటీర్, అల్మోరా,

14 ఆగష్టు, 1916

ప్రియమైన నిర్మల్ (స్వామి మాధవానంద),

నీవు వ్రాసిన పోస్టుకార్డు మొన్న అందింది... సర్వజనుల సంక్షేమానికి నేను ఎల్లప్పుడూ భగవానుణ్ణి ప్రార్థిస్తానని స్పష్టంగా తెలుసుకో. ఆయనను శరణు వేడిన వారు మనకు అత్యంత ప్రీతిపాత్రులు. "చైతన్యుని యందు భక్తి గలవాడు నిజంగా నాకు ప్రాణం, నా ఆత్మ," ఇది ప్రతి భగవద్భక్తుని ఆంతరంగిక భావన.

నీవు అద్వైతాశ్రమంలో ఆధ్యాత్మిక సాధనలు చేస్తున్నావని తెలిసి చాలా సంతోషించాను. తన మనస్సును పూర్తిగా అదుపు చెయ్యడం చాలా కష్టం. కానీ ప్రయత్నం చేసిన వాణ్ణి దైవం తన దగ్గరకు చేదుకుంటాడు. గురుదేవులు ఇలా చెప్పేవారు: "మనిషి భగవంతుని వైపు పది అడుగులు వేస్తే, భగవంతుడు అతని వైపు నూరు అడుగులు వేస్తాడు." ఇది సత్యం కాకపోతే భగవంతుణ్ణి ఎవరు సాక్షాత్కరించుకోగలరు? మానవప్రయత్నంతో ఆయనను పొందడం సాధ్యమా? వివేకానంద స్వామి ఒకసారి నాతో ఇలా అన్నారు: "హరిభాయి! నీవు వెల ఇచ్చి కొనడానికి భగవంతుడేమైనా ఒక చేపా లేక కూరగాయా? ఇంత జపం, ఇంత తపస్సు చేసి ఆయన్ను పొందడానికి ఎవరైనా భగవంతునికి వెలకట్టగలరా? ఆయనను సాక్షాత్కరించుకోవడానికి ఆయన అనుగ్రహం ఒక్కటే కావాలి."

కఠోపనిషత్తు ఇలా చెపుతున్నది: "ఎవరిని ఆత్మ వరిస్తుందో అది వారిచేతే పొందబడుతుంది. అటువంటి వారికి ఆత్మ తన స్వరూపాన్ని తెలియజేస్తుంది" (1.2.23). దీనికి అర్థం నీవు జపధ్యానాదులు, సాధన చెయ్యనక్కరలేదనా? నీ హృదయంలో సంతృప్తి కలిగే వరకు శక్తివంచన లేకుండా చెయ్యాలి. కానీ, నీవు పారమార్థిక సాధనలు చేసినంత మాత్రాన భగవంతుడు నీకు దర్శనమియ్యడని తెలుసుకో. పరమకారుణ్యమూర్తి అయిన దైవం తన కరుణచేత, నీ మీద తన అనుగ్రహాన్ని ప్రసరిస్తాడు. నేను జపధ్యానాలు ఎందుకు చేశానంటే, అలా చెయ్యకుండా ఉండలేను కాబట్టి. ఈ పారమార్థిక సాధనలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలలాగా స్వాభావికాలు కావాలి. మనశ్శాంతికి ఇదొక్కటే మార్గం.

భగవత్సాక్షాత్కారం ఆయన అనుగ్రహం మీదనే ఆధారపడి ఉంటుంది కానీ నా పారమార్థిక సాధనల మీద కాదు అని మనిషికి తన మనస్సులో దృఢవిశ్వాసముండాలి. పారమార్థిక సాధనల ఉద్దేశ్యం 'మన రెక్కలు అలసిపోవ డానికే'! పక్షి రెక్కలు అలసిపోయినప్పుడు అది ఎక్కడో ఒకచోట విశ్రాంతి తీసుకుంటుంది. ఎక్కడా విశ్రాంతికి స్థానం దొరకకపోతే పడవ తెరచాప కొయ్య మీద వాలి తీరవలసిందే! భగవంతుడు తప్ప విశ్రాంతికి మరోస్థానం లేదని దృఢంగా విశ్వసించినప్పుడు మనిషి సంపూర్ణంగా భగవంతుణ్ణి శరణువేడతాడు. కాబట్టి మనిషి ఏ మాత్రం శక్తివంచన లేకుండా, జపధ్యానాలు ఆచరించాలి. తర్వాత ఈ సాధనలన్నీ నిష్ఫలమనే నిర్ణయానికి వస్తాడు యోగి. కవి అయిన కమలకాంతుడు ఈ విధమైన స్థితికి చేరుకుని, ఇలా గానం చేశాడు: "నా జప మాల, ఇతర సామగ్రి, నా మందిరంలో వ్రేలాడు తున్నాయి." ఇంకా, "శ్రమతో కొట్టుమిట్టాడే జీవులకు నీ అపారమైన కరుణచేత

సాయపడడమే నీ స్వభావమైతే, ఓ ప్రభూ! కమలకాంతుడికి సాక్షాత్కరించు. జపం చేసి నిన్ను సాక్షాత్కరించు కోవాలనే పేరాశ, భూతప్రేతాల వివాహం లాగా అబద్ధం!" అన్నాడు. భూతప్రేతాలకు పెళ్ళి ఎన్నడూ జరగలేదు. భవిష్యత్తులో జరగబోదు. అదే విధం గా, సాధనవల్ల ఎవ్వరూ భగవంతుణ్ణి పొందలేదు. ఇక పొందబోరు. కేవలం భగవంతుడు తన అపారమైన కరుణ వల్ల కనికరించినప్పుడే భక్తుడు ఎంతోకొంత సాధించగలడు. లేకపోతే రామప్రసాదు ఇలా ఎందుకు గానం చేశాడు?

ఓ నా మనసా! ఓ నా మనసా!

అమ్మను కోరుచు ఏడ్చుటెందులకు?

ఇక నీ వామెను చూడగ నేరవు

అమ్మ తానె మరణించె నిక్కముగ

లేనిచో తానే అగుపించును గద!

కానీ ఇది నిరాశవల్ల కలిగిన విలాపం కాదు. "సముద్రాన్ని ఈదడం ఎలా అసాధ్యమో, భగవత్సాక్షాత్కారం కూడా అలాగే అసాధ్యం," అన్న కఠోరసత్యాన్ని ఎరిగి కూడా ఆ కవి ఇలా చెప్పాడు:

మది ఎరింగినను హృది ఎరుంగక

అందమైన ఆ చందమామను

పట్టుకొనుటకై కొట్టుకొనెడు

మరుగుజ్జువాని వలె కోరుచున్నది.

భగవంతుడు మన ప్రాణాలకు ప్రాణం, ఆత్మలకు ఆత్మ. భగవంతుణ్ణి వదలి మనమెలా జీవించగలం? ఆయనను మనం పొందాలి. "గాఢమైన ప్రేమ యొక్క లక్ష్యం భగవంతుడు, అటువంటి ప్రేమ లేకుండా ఆయనను పొందడం ఎలా?" ఆయన భక్తుణ్ణి ఆ ఉన్నతమైన స్థితికి ఉద్ధరిస్తాడు. హృదయపూర్వకంగా ఆయనను ప్రార్థించినప్పుడు తనంతట తానే భక్తుడి హృదయంలో దర్శనమిచ్చి, నిజమైన జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. అప్పుడే మనిషి దివ్యజనని ముఖారవిందాన్ని దర్శిస్తాడు. గురుదేవులు శీఘ్రంగా నీకు ఆ అనుభవాన్ని ప్రసాదించు గాక! ఇదే ఆయనకు నా హృదయపూర్వక ప్రార్థన.

నీ శ్రేయోభిలాషి,

తురీయానంద

(94)

అల్మోరా,

7 సెప్టెంబరు, 1916

ప్రియమైన బిహారీబాబు,

...భగవంతుని సంకల్పం ఎల్లప్పుడూ నెరవేరుతుంది ...మరో విధంగా కాదు. భగవంతుడు సర్వపరిపూర్ణుడు. అంతా మన మంచికే చేస్తాడు. మన స్వార్థం వల్ల దీన్ని మనం తెలుసుకోలేం. మానవజాతికి మంచి చెయ్యడం తప్ప ఆయన చేసే పనికి వేరే కారణమేమీ ఉండదు. 'నేను భగవంతునికి చెందినవాణ్ణి' – ఈ విషయాన్ని మనిషి తెలుసుకున్నప్పుడు అతని జీవితం ధన్యమవుతుంది. అప్పుడు భగవంతుడు మనల్ని ఏ పరిస్థితులలో ఉంచినా ఫరవాలేదు. ఆత్మజ్ఞానం కలిగిన తర్వాత నీవు ఎక్కడ ఉన్నావనేది ప్రధానం కాదు.

భగవదనుగ్రహం వల్ల మీలో చాలామందికి పారమార్థిక జ్ఞానం బాగానే ఉంది. అందువల్ల ఈ మాయాప్రపంచం మీకే విధమైన అపకారం చెయ్యలేదు. అన్నీ భగవత్సంకల్పానికి వదలిపెట్టి జీవితాన్ని సంతృప్తితో గడపడం ముఖ్యం. ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ఆయనే మన సర్వం. మనస్సుని ఆయన యందు నిలిపి ఆయన అనుగ్రహం కోసం వేచి ఉండు. నీ ఆరోగ్యం బాగా లేదని, పని ఎక్కువ చెయ్యాల్సి వస్తున్నదని తెలిసి విచారపడుతున్నాను. అలా ఉన్నా మనస్సును భగవంతుని మీద ఉంచుతున్నావు. నిస్సంశయంగా, ఇది ఆయన నీ మీద చూపుతున్న ప్రత్యేకమైన అనుగ్రహం. భగవంతుని మీద మనస్సును కేంద్రీకరించకుండా కులాసాగా వెళ్ళదీసే జీవితం మంచి బ్రతుకనిపించుకోదు. కఠినతరమైన పనుల మధ్య కూడా భగవంతుణ్ణి తలచేవాడే ధన్యాత్ముడు.

"ఆనందాన్ని వాంఛించేవాడు, కోరికలను నిగ్రహించి, సంతృప్తితో ఉండాలి. ఎందుకంటే ఆనందానికి మూలం సంతృప్తి. అసంతృప్తి దుఃఖాన్ని కొనితెస్తుంది."

(పూర్వకర్మల వల్ల మంచివాడు కష్టపడవచ్చు. చెడ్డవాడు సుఖంగా ఉండవచ్చు.) కాబట్టి ప్రస్తుతం అనుభవిస్తున్న సుఖదుఃఖాలను బట్టి పూర్వకర్మ ఫలాన్ని తీర్మానించకూడదు. ఇది మనిషికి శాంతినివ్వదు. భగవంతుడు తాను కరుణామయుణ్ణని, జగత్ సంరక్షకుణ్ణని చెప్పిన మాటలు మన అనుభవంలోకి వచ్చినప్పుడే శాంతి కలుగుతుంది. "భగవంతుడు జగత్కర్తలకు (బ్రహ్మ, విష్ణువు, శివుడు) వారి వారి విధులను నియమించాడు" (ఈశోపనిషత్, 8).

గీతలో కృష్ణుడు కూడా ఇలా చెప్పాడు: "యజ్ఞాలు, తపస్సులు మొదలైన వాట న్నింటికి ఫలాన్నిచ్చేవానిగానూ, అన్ని లోకాలకూ అధిపతిగానూ, అన్ని జీవులకు స్నేహితునిగానూ నన్ను తెలుసుకుని, శాంతిని పొందుతాడు" (గీత: 5:29).

భగవంతుడు అన్ని జీవులకు సుఖప్రదాత. ప్రతివారి సంక్షేమాన్నీ ఆయన కనిపెట్టి ఉంటాడు – ఈ జ్ఞానం శాంతిని చేకూరుస్తుంది.

ప్రేమ, ఆశీస్సులతో,
తురీయానంద

(95)

ప్రియమైన ఎక్స్.,

"దుర్గామాత నామాన్ని ఎందుకు మరిచిపోతావు? ఓ మనసా! ఆమె నామాన్ని జపించు. జీవితంలోను, మరణంలోను అమ్మను విడువవద్దు!" భగవంతుడు ఏది చేసినా మన మంచికే–ఈ విశ్వాసం మన హృదయాలలోకి చొచ్చుకుపోవాలి.

సాధన తీవ్రంగా కొనసాగించు. పరిస్థితులు ప్రతివారికీ ఎల్లప్పుడూ అనుకూలంగా ఉండవు. కాబట్టి భగవంతుడు నిన్ను ఏ పరిస్థితిలో ఉంచినా, నీ సాధనను కొనసాగించాలి. ఎల్లప్పుడూ ఆయనను చింతిస్తూ, పూర్తిగా ఆయన మీదే ఆధారపడడం కంటే ధన్యత పొందడానికి మరోమార్గం లేదు. భగవంతునికి మనల్ని మనం పూర్తిగా సమర్పించుకున్నప్పుడే, పూర్తి ప్రయోజనం కలుగుతుంది – ఇదే సత్యం. తర్కం కూడా ఈ సత్యాన్ని సమర్థిస్తుంది. ఈ విషయంలో మహాపురుషులంతా ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. జ్ఞాని ప్రతికూలమైన పరిస్థితులలో కూడా భగవంతుణ్ణి స్మరిస్తూ, ఆ పరిస్థితుల్ని అధిగమిస్తున్నాడు.

భగవదనుగ్రహం కంటే ఈ లోకంలో మనిషికి మరో శరణ్యం లేదు. ఈ విషయాన్ని ఎంత ఎక్కువగా తెలుసుకోగలిగితే అంత ఎక్కువగా శాంతిని పొందుతావు. నీవు దూరప్రాంతంలో ఉన్నందువల్ల, మా నుండి దూరమయ్యా వని తలచవద్దు. దగ్గర, దూరం అనేవి మనస్సులోనే ఉన్నాయి. ఒకడు దూరంలో ఉండవచ్చు. అయినా సన్నిహితంగానే ఉంటాడు. దగ్గరగా ఉన్నా ఎంతో దూరంగా ఉండవచ్చు. నీవెల్లప్పుడు మాకు సన్నిహితంగానే ఉన్నావు....

భగవంతుడు నన్ను ఎక్కడికి తీసుకుపోతాడో, ఆయనకే తెలుసు. ఎక్కడికి తీసుకుపోయినా నాకు ఆయన యందు భక్తి ఉండుగాక! ఇదే నా ప్రార్థన. భగవంతుడు ఏది తలిస్తే అది జరుగుతుంది. నిస్సందేహంగా అది మన మంచికే జరుగుతుంది. కానీ, వచ్చిన చిక్కేమంటే మనం దీన్ని అర్థం చేసుకోం సరికదా, మనకు వేచివుండే ఓర్పు కూడా ఉండదు. భగవంతుడు ఏమి చేసినా అది మన మంచికేనని మనం విశ్వసించగలిగితే, శాంతి కలగడానికి అంతకంటే మంచి మార్గం మరొకటి లేదు. మనిషికి ఈ అవగాహన లేకపోతే మనశ్శాంతి ఉండదు. శరీరమున్నంతవరకూ సుఖదుఃఖాలు, వ్యాధులు, విషాదాలు అనివార్యాలు. కానీ, నాకు సుఖమిచ్చేది మంచిదనీ, బాధ కలిగించేది చెడ్డదనీ తలచడం సరైనది కాదు. ఇది కేవలం స్వార్థపరత్వమే. సుఖంలోగాని, దుఃఖంలోగాని, వ్యాధిలోగాని, విషాదంలోగాని భగవంతుడు మనల్ని ఎల్లప్పుడూ కలత చెందకుండా ఉంచుగాక! ఏ పరిస్థితిలోనైనా మనకు సరైన అవగాహన ఉండుగాక! భగవంతుడికి ఇది నా హృదయపూర్వక ప్రార్థన.

నీవేం సాధువువోయీ? శరీరాన్ని గురించి అంత ఆలోచన ఎందుకు? పెరగడం, క్షీణించడం, మరణించడం శరీర స్వభావాలు. కానీ శరీరంలో పెరగని, చావని వాడొకడున్నాడు. అతనిని దర్శించడానికి ప్రయత్నించు.

నిన్ను నీవు భగవంతునికి సమర్పించుకున్నావు. కాబట్టి బాధ్యతంతా ఇప్పుడు ఆయనది. నీ ద్వారా ఆయన అన్నీ సాధించుకుంటాడు. నీవు ఆయన చేతిలో ఒక పరికరంగా ఉండి, నీ కోసం ఆయన ఎంచిపెట్టిన మార్గాన్ని అనుసరించు. అప్పుడు భయాల నుండి, బాధల నుండి

విముక్తి పొందుతావు. భగవంతుణ్ణి శరణువేడిన వారు ఇక దేనికి భయపడాలి? "సోదరా! ఎల్లప్పుడూ భగవంతునికి అంటిపెట్టుకుని ఉండు. క్రమంగా నీవు దివ్యత్వాన్ని పొందుతావు."

కాలగమనంతో సర్వం మంచిగా మారుతుంది. వ్యథ చెందవద్దు. తొందర పడ వద్దు. భగవానుడు తన పనిని తాను చేసుకుంటాడు. చేసుకుంటూనే ఉన్నాడు. ఎవరిని ఆయన తన సాధనాలుగా చేసుకుంటాడో వారు ధన్యాత్ములు. ఈశ్వరుని పనిముట్టుగా పనిచేసే సామర్థ్యం నీకుంది. అది నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. భగవంతుడు నీ హృదయాన్ని ఈ భావంతో నింపివేయు గాక!

"ఓ ప్రభూ! నీవు అందరి అంతరాత్మవు. సత్యం చెపుతున్నాను! నా హృదయంలో ఏ ప్రాపంచిక భావం లేదు. నీ యందు నాకు అత్యంత భక్తిని ప్రసాదించు. నా మనస్సు నుంచి కామకాంచనాల వంటి దోషాలను తొలగించు" (తులసీ రామాయణ్, 5.2).

ఈ ప్రార్థనే నా హృదయంలో పరిపూర్ణమైన శాంతి కలుగుతుందనే ఆశను కలిగిస్తోంది. మనిషి ఈ ప్రార్థనను అనుభూతి చెందగలిగితే అతనికి పరిపూర్ణసిద్ధి త్వరలోనే కలుగుతుంది.

దివ్యజనని విధానాలను అర్థం చేసుకోవడం కష్టం. "ఆ దేవి, ఆ భగవతి, ఆ మహామాయయే జ్ఞానుల మనస్సులను కూడా ప్రబలంగా ఆకర్షించి మోహ గ్రస్తులుగా చేస్తున్నది సుమా!" (దేవీ మహత్మ్యం, 1.55). జ్ఞానుల స్థితే ఇలా ఉంటే సామాన్యజనుల విషయం వేరే చెప్పాలా? ఎవరు దివ్యజననిని ఎల్లప్పుడూ ప్రార్థిస్తూ ఉంటారో వారే క్షేమంగా ఉంటారు. నీవు సరిగా వ్రాశావు: "లోకంలో ప్రజలు ఈ విషయాన్ని తెలుసుకోరు: 'ఎండిన పిడక కాలుతుంటే, తాను కూడా ఒక రోజు కాలిపోతాననే విషయం తెలుసుకోకుండా పచ్చిపేడ నవ్వుతుంది!" "అమ్మా! మాయ నుండి నీవు రక్షించకపోతే నాకు విముక్తి లేదమ్మా!" ఇదే సత్యం. భగవత్సంకల్పం నెరవేరుగాక! దివ్యభావంలో లీనమైపోగలిగితే బాహ్యవిషయాలను గురించి కలత చెందనక్కరలేదు. ఈ విషయంలో భగవంతుని కరుణ ఒక్కటే ప్రధానమైన ఆధారం.

ఎల్లప్పుడూ ప్రార్థన చేస్తూ ఉండు. నీ హృదయావసరాలను గురించి ఎల్లప్పుడూ భగవంతునితో మొర పెట్టుకో. ఆయన మనవాడు. నీలో ఈ భావం దృఢంగా నాటుకుంటే భయాల నుండి, ఆందోళనల నుండి విముక్తుడవుతావు. క్రమంగా భగవంతుడు నీకు అన్నీ తెలిసేటట్లు చేస్తాడు.

నీ శ్రేయోభిలాషి,
తురీయానంద

(96)

ప్రియమైన ఎక్స్.,

..భగవంతుడు ఏది సంకల్పించినా అది జరుగుతుంది. మనకు అర్థమైనా, కాకపోయినా, సర్వశుభంకరుడైన పరమాత్మ ఏది చేసినా అది నిస్సంశయంగా మన మంచికే. ఇది మనం తెలుసుకోగలిగితే మన ఆనందానికి అంతుండదు.

జీవితంలోని అన్ని పరిస్థితులలోను, గురుదేవులు నీకు సరైన అవగాహన, సద్బుద్ధి ప్రసాదించినందుకు నేను సంతోషపడుతున్నాను. ప్రకాశమానమైన సాత్త్విక బుద్ధి ఏర్పడినప్పుడు ఇది సంభవిస్తుంది. అది మనస్సులో ఎటువంటి దుష్ట సంకల్పాన్ని చేరనివ్వదు. పరిస్థితులు బావున్నా, లేకపోయినా ఈ సాత్త్విక బుద్ధి సర్వత్రా మంచినే చూస్తుంది. భగవంతుని ప్రత్యేకమైన కరుణ వల్ల మనిషిలో అటువంటి స్వభావం వృద్ధి చెందుతుంది. అతడు దానిలో పరిపూర్ణత పొందిన తర్వాత అతని కష్టాలన్నీ తీరిపోతాయి. గురుదేవుల అనుగ్రహం దివ్యానంద భరితం కాదా!

భగవంతుణ్ణి గురించి ఎంతగా ప్రసంగించి, ఆయన ఘనతను గురించి ఎంతగా ఆనందిస్తే మనకు అంత మంచిది. ఈ లోకంలో భగవంతుడొక్కడే ప్రధానమైనవాడు – ఈ విషయాన్ని గురుదేవులు మాటిమాటికి బోధిస్తుండేవారు.

ఒక బెంగాలీ కవి (సురేంద్రనాథ మజుందారు) ఇలా అన్నాడు:

సుఖమంతా ఊహలలో ఉన్నది
దుఃఖమంత భయమందే ఉన్నది
నరుని తలంపులు జరుగగ నేరవు
చింతయె పురుషుని బాధకు మూలము

ఇదే సత్య సందేశం. చింత వల్లనే మనం తల్లక్రిందులవుతుంటాం. లేకపోతే అన్నింటినీ సహించగలం. గురుదేవులు ఇలా అనేవారు: "నీళ్ళు ఆనకట్టకు ఒకవైపు నుండి వచ్చి మరోవైపు పోతున్నట్లు, పవిత్రకార్యాల కోసం తమ ధనాన్ని ఖర్చుపెట్టేవారు ఎన్నటికీ బద్ధులు కారు. ఈ మాయాజగత్తులో డబ్బుతో వ్యవహరిస్తున్నా, వాళ్ళు ముక్తపురుషులుగా ఉంటారు." వివేకానంద స్వామి ఇలా అనేవారు: "గది తలుపు తెరిచి ఉంచితే దానిలోని గాలి చెడువాసన కొట్టదు; అలాగే తమ ధనాన్ని సత్కార్యాలకు ఖర్చుచేసే వారిని పాపమేదీ అంటదు."

భగవంతుడు మనల్ని ఏ స్థితిలో ఉంచితే అదే మనకు ఉత్తమమైనది. ఆయన అనుగ్రహం వల్ల మన ఆలోచనలు ఆయన మీద నిలిచి ఉంటే, బాహ్య పరిస్థితులు ఏమీ చెయ్యలేవు. ఆఖరుసారి జబ్బుపడ్డ రోజుల్లో గురుదేవులు ఇలా చెప్పడం నేను విన్నాను: "రోగం, శరీరం వాటి విషయాలను వాటిని చూసుకోనీ, ఓ మనసా! నీవు ఆనందంలో ఉండు." మనస్సు దివ్యానందంలో మునిగి ఉన్నంతవరకూ శరీరం బాధకు గురి అయితే ఏమవుతుంది? నిజంగా మానసిక బాధే దుర్భరమైనది. తన కరుణాకటాక్షం వల్ల భగవంతుడు మన మనస్సులను తనలో లీనం చేసుకుంటే అప్పుడు అంత బాధ అనిపించదు.

దివ్యజనని, శ్రీశారదాదేవి త్వరలో కలకత్తా వస్తున్నారన్నది నిజంగా శుభవార్త. ఆమెను అనేకమంది దర్శించి, శాంతిని పొందుతారు. అమ్మ అనుగ్రహం ధన్యతమం. ఆమె సహనం ఎంత గొప్పది! ఎప్పుడూ ఏదీ ఆమెను కలవరపెట్టదు. ప్రజలు తండోపతండాలుగా ఆమె దగ్గరకు వస్తుంటారు. ఏమాత్రం వెనుకంజ వేయకుండా ఆమె వారికి మేలు చేస్తుంది. మాతృదేవి కలకత్తాలో ఉన్నప్పుడు అక్కడికి వెళ్ళాలని నీవు నిర్ణయించుకోవడం చాలా బాగుంది. ఇది, 'ఒక్క దెబ్బతో రెండు పిట్టలను కొట్టినట్లు, గోపికలు ఒక్క ప్రయాణంలో రెండు పనులు సాధించినట్లు ఉంటుంది – ఒకటి పాలు అమ్మడం, రెండవది కృష్ణుణ్ణి కలుసుకోవడం! (సంత్ సూర్‌దాస్). ఏమి మనోహరమైన ప్రవృత్తి! గోపికలు ఏది చేసినా కృష్ణుని కోసమే. ముందు భగవంతుడు, తర్వాతే మిగిలినదేదైనా! సుస్థిరమైన వారి కృష్ణప్రేమ అసమానమైనది. మనస్సు పరిశుద్ధమయ్యే కొద్దీ, మనిషి దీన్ని తెలుసుకుంటాడు. నీ మీద భగవంతుని కరుణ ఉంది. క్రమంగా నీవు ఉన్నతమైన అనుభూతులన్నింటినీ సాక్షాత్కరించు కుంటావు. ప్రభువు అనుగ్రహిస్తే మనిషి ఏ కొరతవల్లా బాధపడడు.

జనకుని నేర్పుకు సాటి ఎక్కడిది?
ఇహపరముల కొదవేమి టాతడికి?
దీనిని, దానిని (ఇహపరమ్ములను) పట్టి గట్టిగా
అంచుల వరకూ నిండిన పాత్రతో
తనివితీర క్షీరములను గ్రోలెను!

ఈ పాటలోని ఈ చరణాలను పాడుతూ గురుదేవులు తన గృహస్థభక్తులను జ్ఞాని, గృహస్థు అయిన జనక మహారాజులాగా ఉండమని ప్రోత్సహించారు. గృహంలోవున్నా, వనంలోవున్నా భగవద్భావనలో మునిగి ఉండడమే ప్రధాన మైన విషయం. భగవంతుణ్ణి సాక్షాత్కారం చేసుకోకుండా, అరణ్యంలో సన్న్యాస జీవితం గడిపి ఏమిటి ప్రయోజనం? నీ మనస్సు భగవంతునిలో లగ్నమైతే నీవు ఎక్కడవున్నా ఫరవాలేదు. మనకు భగవంతుడు కావాలి. మనం కూర్చున్నా, నిలుచున్నా, తింటున్నా, పడుకున్నా భగవంతుణ్ణి స్మరిస్తూ ఉండాలి. కాలక్రమం లో ఆయన అనుగ్రహం వల్ల మనమందరం ఆయనలో ఆశ్రయం పొందుతాం.

గురుదేవులు ఇలా అనేవారు: "సన్న్యాసి, పాము ఇళ్ళు కట్టరు. ఇతరుల ఇళ్ళలో నివసిస్తారు!" ఇది ఒక అద్భుతమైన భావన. ఇల్లు కట్టడం ఎంత కష్టమో నేను ఇప్పుడు చూస్తున్నాను. (ఆ సమయంలో హిమాలయాల్లోని అల్మోరాలో తురీయానంద స్వామి సాధువుల కోసం నిర్మిస్తున్న కుటీరం యొక్క నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్నారు.)

భగవద్భక్తునికి చీకుచింతలు, భయాందోళనలు ఉండవు. గీతలో కృష్ణుడు అర్జునుడికి చెప్పిన ఈ భాగాన్ని నీకు అనేకసార్లు ఉదహరించాను: "ఓ కుంతీపుత్రా! నా భక్తుడెన్నడూ నశించడని చాటిచెప్పు" (గీత: 9:31).

శుద్ధభక్తి దేవతలలో కూడా ఉండదు. భగవంతుణ్ణి భక్తుల చెప్పుచేతల్లో ఉంచే పరాభక్తిని పొందడం అంత సులభమైన పనేనా? తీవ్రమైన భావంతో గురుదేవులు ఈ (శ్రీకృష్ణుని) గీతాన్ని పాడుతుండేవారు:

ముక్తి నొసగ వెరువగాని శుద్ధభక్తి నొసగ వెరతు నేను

రామప్రసాదు ఇలా అన్నాడు: "ఆధ్యాత్మిక జీవితానికి భక్తే మూలం. ముక్తి కేవలం ఒక అనుబంధం." మనిషి భగవద్భక్తిని వృద్ధిచేసుకోగలిగితే నిజంగా సమస్తాన్ని సాధించగలడు.

తన భార్యతో పారమార్థిక విషయాలు మాట్లాడుతూ ఉండడం గృహస్థు యొక్క విధి. నీవు, నీ భార్య కలిసి శ్రీరామకృష్ణ కథామృతం చదువుతున్నారు కాబట్టి అది తప్పకుండా మీకు మేలు కలిగిస్తుంది. మీ ఇద్దరిది ఒకే మనస్సై, ఒకే గమ్యమై ఉంటే ప్రతి విషయంలోనూ మీరు సుఖంగా ఉంటారు. ఆదర్శ గృహస్థు కావడం కంటే ఉత్తమమైన గమ్యం మరేముంది? ఈ చరణాన్ని గురుదేవులు తరచుగా గానం చేస్తుండేవారు: "కాళీమాత భక్తుడు జీవన్ముక్తుడు, సదానందమయుడు." పెట్టెలో పెట్టినా, చెత్తకుండీలో పడవేసినా బంగారం బంగారమే. అదే విధంగా భక్తుడెక్కడున్నా అతడు భగవంతునికి చెందినవాడే.

నీ శ్రేయోభిలాషి,
తురీయానంద

(97)

అల్మోరా,
24 సెప్టెంబరు, 1916

ప్రియమైన ఎక్స్.,

నీవు భగవంతుని కోసం పనిచేస్తున్నావనే దృఢవిశ్వాసాన్ని కలిగి ఉండు. ఇక బాధ పడవద్దు. నీ మనస్సును ఎందుకు చలించనిస్తావు? "ఓ ప్రభూ! నేను ఏయే పనులు చేసినా, అవన్నీ నీ పూజలే!" (శివమానసపూజా స్తోత్రము, 4). భగవంతుడు సర్వత్రా ఉన్నాడు, అన్నింటిలోనూ ఉన్నాడు – ఈ విధంగా మననం, ధ్యానం చేస్తూ ఉంటే మనిషి ముక్తిని పొందుతాడు. ఊహలే నిజమవుతాయి. మొట్టమొదట ఊహించాలి; తర్వాత అది నిజమవుతుంది.

భవదీయ,
తురీయానంద

(98)

అల్మోరా,
12 అక్టోబరు, 1916

ప్రియమైన డి.,

దుర్గాపూజ (విజయదశమి) సమయంలో నీ ఉత్తరంతోపాటు నీవు శారీరికంగానూ, మానసికంగానూ కులాసాగా ఉన్నావన్న కబురు, నాకెంతో సంతోషాన్ని కలిగించింది. నీ సాధన హాయిగా సాగిపోతున్నదనేది శుభవార్త.

మానవశరీరం వ్యాధులకు, వ్యథలకు గురి అవుతూ ఉంటుంది. అలా అయినా, భగవంతుణ్ణి దృఢమైన చిత్తంతో పూజించేవాడు, సుఖం, దుఃఖం మొదలైన ద్వంద్వాలను, విషయాలను తప్పుడుగా చూపించే మోహాన్ని దాటిపోతాడు. గీతలో కృష్ణభగవానుడు ఇలా చెప్పాడు: "పుణ్యకర్మలచేత ఎవరి పాపాలు అంతరించాయో, వారు ద్వంద్వ మోహాల నుండి విముక్తులై దృఢసంకల్పంతో నన్ను భజిస్తారు" (గీత: 7:28).

గురుదేవులు, "శరీర బాధ, శరీరం వాటి సంగతి వాటిని చూసుకోనీ! ఓ మనసా, నీవు ఆనందంలో ఓలలాడు," అనేవారు. గురుదేవుల వచనంలో అంతరార్థాన్ని నీవు అర్థం చేసుకోవడం అద్భుతం. భగవంతుణ్ణి అర్చించడమే జీవితంలో ప్రధాన విషయం. నీవు ఎక్కడ ఉన్నప్పటికీ, భగవంతుణ్ణి నీ హృదయంలో నిలుపుకుని, ఆయన గుమ్మం దగ్గర వేచి ఉంటే, ఆయన కరుణ, దీవెన నీ మీద ప్రసరిస్తాయి.

భగవంతుడు సర్వశుభప్రదుడు – ఈ విశ్వాసం శాంతిసౌఖ్యాలను కలిగి స్తుంది. ప్రపంచాన్ని బుద్ధివాదంతో వివరించడానికి ప్రయత్నిస్తే నీవు చిక్కుల్లో పడతావు. అందువల్ల గురుదేవులు ముందు భగవంతుణ్ణి తెలుసుకుని, తర్వాత ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించమని మాకు సలహా ఇచ్చారు. భగవంతుణ్ణి అంటిపెట్టుకుని ఉండు. ఆ తర్వాత సకలశ్రేయస్సు నీకు లభిస్తుంది.

ప్రేమ, ఆశీర్వాదాలతో,
తురీయానంద

(99)

అల్మోరా,
26 నవంబరు, 1916

ప్రియమైన బిహారీబాబు,

నవంబరు 20వ తేదీన నీవు వ్రాసిన ఉత్తరం అందింది. నీవు కుటుంబ సంబంధమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నావని తెలిసి విచారపడుతున్నాను. కానీ నీకు ఏమి చెప్పాలో తోచడం లేదు. "నీవు గొప్ప నేర్పరివైతేనే గుర్రంపైన స్వారీ చెయ్యాలి." ఈ సామెత ఎంతైనా నిజం. సంసారాన్ని నడపడానికి అవసరమైన విధంగా నీవు ప్రవర్తించలేకపోవడం వల్లనే నీకు ఈ కష్టాలన్నీ వచ్చినట్లు తోస్తోంది.

పోనీ, 'లౌకికమైన తెలివితేటలున్నవారు సుఖపడుతున్నారా?' అని ఆలోచిస్తే అలా జరుగుతున్నట్లు అనిపించడం లేదు. ఒక సామెత ఉంది: "నది లోతు ఒక్కొక్క ప్రదేశాన్ని బట్టి మారుతూ ఉంటుంది. కానీ సగటు లోతు ఎల్లప్పుడూ సమానంగానే ఉంటుంది." దీనివల్ల

తెలిసేదేమంటే, ఈ లోకంలో ఏ ఒక్కరూ నిజంగా సుఖపడడం లేదు. అందుకే కృష్ణభగవానుడు గీతలో, "అనిత్య మసుఖం లోక మిమం ప్రాప్య భజస్వ మాం" (గీత: 9:33). "అశాశ్వతం, అసుఖం (సుఖం లేనిది) ఆయన ఈ లోకంలోకి వచ్చినందున నన్ను భజించు" అన్నాడు. ఈ ప్రపంచంలో సంతోషమనేది లేదు. ఇలాకాక ఇంకోలా చేసివుంటే, బహుశా సుఖంగా ఉండేవాళ్ళమేమో అని అనుకుంటాం. కానీ, ఇది వ్యర్థమైన ఆలోచన. ఈ లోకమే అసుఖం. అందువల్ల భగవానుడు, 'ఇమం ప్రాప్య భజస్వ మాం!' (అటువంటి ఈ లోకంలో ఉంటున్నందున నన్ను భజించు) అన్నాడు.

జీవితంలో ప్రధానమైన విషయం భగవంతుణ్ణి ఆరాధించడం. ఆయన మనకు జ్ఞాపకం చేస్తున్నాడు: "సుఖం కలగనీ, దుఃఖం కలగనీ, నీవు నన్ను ఆరాధిస్తూనే ఉండు. అశాశ్వతమైన ఈ లోకంలో శాశ్వతమైనదేదీ లేదు. సుఖం, దుఃఖం, రెండూ గతిస్తాయి. నేనొక్కడినే శాశ్వతుణ్ణి. నీవు నన్ను భజిస్తే, నా శాశ్వత సంపదకు నీవు వారసుడవవుతావు. కాబట్టి, 'భజస్వ మాం' నన్ను భజించు." నీవు ఆ పని చేస్తున్నావు కదా.

వేదస్తుతిని (భాగవతం, 10.87) తర్జుమా చెయ్యడంలో నిమగ్నుడవు కావడం వల్ల, అది నీకు అద్భుతమైన పారమార్థిక తన్మయత్వం కలిగిస్తున్నది. నీవు ధన్యాత్ముడవు. ఈ లోకంలోని ప్రాపంచిక మోహాలతో మైమరచిపోని వాడు ఉండడు. కానీ వేదస్తుతిలో తన్మయత్వం చెందేవాడు నిస్సందేహంగా అరుదైన వాడు.

నీ జీవితం సుఖదుఃఖాల ద్వారా గడిచిపోతున్నదని ఉదహరించావు. ఈ లోకం శాశ్వతమైనది కాదని నీకు తెలుసు. కాబట్టి మిగిలిన కొద్ది దినాలు భగవంతుని స్మరణలోను, దివ్యోన్మాదంలోను గడుపు. అంతకన్న, ఈ లోకంలో ఉన్నదేమిటి?

ఈ సాంసారిక జీవితం నీకు తగినది కాదు. ప్రాపంచిక స్వభావం గలవారిని వారి ఇష్టానుసారం పోనివ్వు. నీ జీవితంలో మిగిలిన కాలం భగవన్నామ స్మరణ చేస్తూ, ఆ స్మరణ ఇంకాయింకా కొనసాగాలని ఆయనను ప్రార్థించు. మొట్టమొదట నీ ఉత్తరం చదివిన తర్వాత కోర్టు ద్వారా న్యాయసమ్మతమైన చర్య తీసుకోమని సలహా ఇద్దామనుకున్నాను. తర్వాత ఆ పని నీవల్ల కాదని తెలుసు కున్నాను. నీ స్వభావం వేరు. నీవు భయంకరమైన కోర్టు యుద్ధంలో చిక్కుకోవడం కంటే ఆర్థిక ఇబ్బందులను ఓర్చుకోవడాన్నే ఇష్టపడతావు. అది నీ తప్పు కాదు. నీ మానసిక దౌర్బల్యం కాదు. నీవు గృహస్థువు అయినప్పటికీ మామూలు రకం గృహస్థువు కావు. అలా అయివుంటే ఆ వ్యక్తి మీద వ్యాజ్యం వెయ్యడానికి ఏమాత్రం జంకేవాడివి కాదు.

డబ్బు సంపాదించడానికి ప్రజలు ఏం చేస్తున్నారో చూడడం లేదా? వారికి మంచిచెడ్డల జ్ఞానమే ఉండదు. ఏ రకంగా అయినా సరే, డబ్బు వస్తే చాలు. ఇక నీవో? ఇతరులకి కష్టం కలిగించాల్సి వస్తుందని, నీ న్యాయసమ్మతమైన హక్కును అమలు జరపడానికి ఇష్టపడడం లేదు. అందువల్ల నీవు మామూలు గృహస్థువని నేనెలా అనగలను?

నేను చెప్పినట్లు: నీకు ఏది జరిగినా దాన్ని ఓర్చుకో. భగవంతుణ్ణి అంటిపెట్టుకుని, నీ జీవితంలో చివరి రోజులు గడుపు. "ఎవరు ఓర్చుకుంటారో వారే నిలుస్తారు.

ఓర్చుకోలేనివారు నశిస్తారు.” గురుదేవులు చెప్పిన ఈ మాటలు స్మరించుకుంటూ సుఖదుఃఖాలలో కాలం గడుపు. చివరకు నీవు పరమశాంతిని పొందుతావు.

నీ శ్రేయోభిలాషి,

తురీయానంద

(100)

రామకృష్ణ అద్వైతాశ్రమం, వారణాసి

3 జనవరి, 1917

ప్రియమైన బిహారీబాబు,

...పైకి అనుభవిస్తున్నట్లు కనిపించినా, ముక్తపురుషులు పూర్వకర్మ ఫలితాలను వారివారి జీవితాలలో అనుభవించరు. ఎందుకంటే పూర్వజన్మ కర్మఫలితాలు శరీరస్మృతి ఉన్నప్పుడే కనిపిస్తాయి. “ప్రారబ్ధకర్మ (ఫలాన్ని ఇవ్వనారంభించిన పూర్వకర్మ) శరీరంతో మనను తాదాత్మ్యం చేసుకుంటున్నంత వరకే ఉంటుంది. కానీ ప్రకాశమానుడైన ఆత్మయోగి విషయంలో శరీరభ్రాంతి ఉంటుందని ఎవరూ చెప్పరు. కాబట్టి అతని విషయంలో ప్రారబ్ధకర్మ త్యజించబడింది” (వివేక చూడామణి, 460). దీనికి పర్యవసానాన్ని ఈ విధంగా చెప్పవచ్చు. భక్తులు భగవంతుని ఇచ్ఛానుసారం నడుస్తారు. అందువల్ల ప్రారబ్ధమనే పదాన్ని వాళ్ళు ఉపయోగించరు. సాధారణంగా కర్మయోగాన్ని అనుసరించేవారు ప్రారబ్ధకర్మ అనే పదాన్ని వాడుతారు.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(101)

బేలూరు మఠం

4 ఏప్రిల్, 1917

ప్రియమైన డి.,

ఏప్రిల్ 1వ తేదీన నీవు వ్రాసిన ఉత్తరం అంది సంతోషం కలిగింది. నీవు క్షేమంగా ఉన్నావన్నదీ, నీ మనస్సు నిరుత్సాహం చెందకుండా ఉన్నదనేది శుభవార్త. నిత్యం పారమార్థిక భావాలతో ఉండడం, సజ్జనసాంగత్యం కోసం నీవు ఆర్తి చెందడం శుభసూచకాలు. నీవు ప్రాపంచిక సంభాషణలను, సాంసారికుల సాంగత్యాన్ని లెక్కపెట్టకపోవడం ఎంతో అభిలషణీయమైన మంచిపని.

అందరికీ భగవంతుడే గతి. భగవంతుడే గమ్యం. నీ హృదయంలో ఎల్లప్పుడూ ఆయనను ధ్యానిస్తూ ఉండు. విచారపడవద్దు. అన్నింటినీ ఆయన సానుకూలపరుస్తాడు. భగవంతుడు నిన్ను ఎక్కడ ఉంచినా, నీ మనస్సు ఎల్లప్పుడూ ఆయన మీదే ఉండాలని ప్రార్థించు. నిన్ను

ఆయన ఏ విధంగా ఉంచినా అది నీ మేలు కొరకే. హాఫీజ్ అనే సూఫీకవి, “నేను పేదరికపు దుమ్ము లో పొర్లడాన్ని చూడడమే నా ప్రియునికి సంతోషమైనప్పుడు, నేను నా దృష్టిని స్వర్గంలోని సరోవరం మీదికి మరల్చితే, నిజంగా నేను ముందుచూపు లేనివాణ్ణే!” అని చెప్పాడు. భగవంతుడు ఎక్కడ ఉంచినా ఎల్లప్పుడూ సంతృప్తి చెందడం మంచిది. ఆయన సర్వశ్రేయస్కరుడు, సర్వజ్ఞుడు. ప్రతివారికీ ఏది మంచిదో అది ఆయనకు తెలుసు. వారికి ఆ ప్రకారమే ఆయన ఏర్పాటు చేస్తాడు. కానీ, మన ఇష్టప్రకారమే జరగాలని కోరుతూ మనం గందరగోళాన్ని సృష్టిస్తున్నాం.

“ప్రాపంచిక వాంఛలున్నవారు అరణ్యంలో ఏకాంతంగా ఉన్నప్పటికీ, అశాంతితో కొట్టుమిట్టాడుతూ ఉంటారు. ఇంటిలో జనసమ్మర్దం మధ్య ఉన్నప్పటికీ, ఇంద్రియ నిగ్రహం గలవారు తపస్సాధనలు ఆచరిస్తుంటారు” (హితోపదేశం, అధ్యాయం 4). ఇదే సత్యం. కాబట్టి, “ఓ దేవా! నేను ఎక్కడ ఉన్నప్పటికీ, నిన్నెన్నడూ మరువకుందును గాక! నీ భక్తుల సాంగత్యం నాకు కలుగుగాక! దయచేసి ప్రాపంచిక ప్రజల నుండి నన్ను దూరం చెయ్యి” అని ప్రార్థించడంలో తప్పేమీ లేదు. అరమరికలు లేకుండా హృదయపూర్వకంగా ఆయనను ప్రార్థించు. నీకు ఏది శ్రేయస్కరమో దాన్ని ఆయన చేస్తాడు.

దైవం నిన్ను ఇంటిలో ఉంచినంతవరకూ, మీ అమ్మను సాక్షాత్తు “దివ్యజనని” అన్న భావంతో సేవించు. అది నీకు గొప్ప మేలు కలిగిస్తుంది. భగవంతుడు నీకు ఏ మార్గాన్ని నిర్దేశించాడో, దాన్ని ఏ మాత్రం సందేహం లేకుండా అనుసరించు. నీకు, నాకు, అందరికీ, దేవుడు చూపించిన దారిని అనుసరించడమే కర్తవ్యం. మరొక కర్తవ్యం లేదు. చిత్తశుద్ధితో భగవంతుణ్ణి అర్చించు. ఆయనే ఇష్టదైవం, ఆయనే పూజనీయుడు, ఆరాధనీయుడు. ఆయనను ఆరాధిస్తే అన్ని బాధ్యతలు తీరిపోతాయి. చెట్టు మొదట్లో నీరు పోస్తే వృక్షం మొత్తానికి పోషణ అంది, పుష్పాలను, ఫలాలను సమకూర్చుతుంది.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(102)

బేలూరు మఠం
17 ఏప్రిల్, 1917

ప్రియమైన డి.,

చైత్ర 31వ తేదీన (ఏప్రిల్ 1917) నీవు వ్రాసిన ఉత్తరం అందింది.

“అర్జునా! ఈశ్వరుడు అన్ని జీవరాశుల హృదయాలలో ఉండి, తన మాయ సహాయంతో వాటిని యంత్రం మీది బొమ్మలలాగా గిరగిర త్రిప్పుతున్నాడు” (గీత: 18:61). ఈ భగవంతుని వచనాలు ఆయన మనల్ని నడుపుతున్నాడనే విషయాన్ని గుర్తుచేస్తున్నాయి.

“నన్ను చేరడానికి, ఎవరు ఏ మార్గం అనుసరిస్తే, దానికి తగ్గట్టు వారికి ఫలిత మిస్తున్నాను. ఓ పార్థా! అన్ని మార్గాలలోనూ మనుష్యులు నన్నే చేరుతున్నారు” (గీత: 4:11). ఈ భగవద్వచనాలు అందరూ ఆయన మార్గాన్నే అనుసరిస్తున్నారని నిర్ధారణ చేస్తున్నాయి. ఇప్పుడు మనం ఆయన ఆజ్ఞను శిరసా వహించాలి. “ఓ భారతా! అన్నివిధాలా ఆయనను శరణువేడు. ఆయన అను గ్రహం వలన పరమశాంతిని, శాశ్వతపదాన్ని పొందుతావు” (గీత: 18:62).

“భగవంతుని చింతన చెయ్యడానికి ప్రయత్నం చెయ్యడమే మన కర్తవ్యం, మరేదీ కాదు,” అని నీ ఉత్తరంలో ఉదహరించావు. అలాంటప్పుడు గందరగోళానికి తావేదీ? నీ ఆలోచనావిధానాన్ని చూసి ఆనందిస్తున్నాను. చాలా చక్కగా వాదించావు. ఆ విధంగా ఆయన వైపుకు ముందుకు సాగి, ఆయన అనుగ్రహం కోసం వేచి ఉండు. క్రమేణా నీవు ఆయన అనుగ్రహాన్ని పొందుతావు. నీ జీవితం ధన్యమవుతుంది. ఇప్పుడు కూడా నీది ధన్యజీవితమే! నీవు భగవంతుణ్ణి యోచించగలుగుతున్నావు. ఇక కావలసిన దేముంది?

ప్రేమ, ఆశీస్సులతో,
తురీయానంద

(103)

బేలూరు మఠం,
5 మే, 1917

ప్రియమైన రమేష్,

నీవు మే నెల మూడవ తేదీన వ్రాసిన సుదీర్ఘమైన ఉత్తరం అందింది. దిగులు చెందవద్దు. దాదాపు ప్రతివారు ఆ విధమైన అనుభవాలకు గురి అవుతారు. ఇష్టం కలుగకపోతున్నా ధ్యానం చెయ్యడం మాత్రం ఎప్పుడూ మానవద్దు. కొంతకాలమైన తర్వాత మనస్సు స్వభావం మళ్ళీ మారుతుంది. భగవంతుని యందు ప్రేమ జనిస్తుంది. లోకం మనోహరంగాను, ఆనందదాయకంగాను కనిపిస్తుంది. క్రుంగిపోవద్దు. నీ హృదయపులోతుల నుంచి భగవంతుణ్ణి ప్రార్థించు. అప్పుడు శక్తి వస్తుంది. పరిస్థితులనన్నింటినీ అనుకూలమైనవిగా చేసుకోగలుగుతావు.

గాలివాన వస్తున్నప్పుడు ప్రజలు తల్లక్రిందులవుతుంటారు. కానీ, ఆ సమయం లో శాంతంగా ఉండడానికి ప్రయత్నించాలి. అదే రకంగా మన మనస్సులో కూడా తుఫాను చెలరేగుతూ ఉంటుంది. ఆ సమయంలో భగవంతుణ్ణి గట్టిగా అంటిపెట్టుకుని ఉండగలిగితే, తుఫాను ఏమీ చెయ్యలేదు. హృదయపూర్వకంగా భగవంతుణ్ణి శరణువేడు. గాలివాన ఎల్లకాలం ఉండదు. మనస్సులోకి మళ్ళీ మంచి భావాలు వచ్చి, నీవు శాంతిని పొందుతావు. శాంతి స్వరూపుడైన భగవంతుణ్ణి విడువనే విడువవద్దు. ఇప్పుడు ఇది నీ ప్రధాన కర్తవ్యం.

శాంతంగాను, స్థిరంగాను ఉండి నిన్ను నీవు భగవంతునికి సమర్పించు కుంటూ, నీ విధిని నిర్వర్తించు. నీ శరీరం, మనస్సు మళ్ళీ పారమార్థికపథంలో అభివృద్ధి చెందుతాయని

నిశ్చయంగా తెలుసుకో. శ్రేయోమార్గం నుండి ఎన్నడూ తొలగిపోకు. తుదకు అన్ని శ్రేయస్సులు నీకు లభ్యమవుతాయి. ఒక నీతి వాక్యముంది: "కష్టాలలో ఉన్నప్పుడు భగవంతుణ్ణి ప్రార్థించు." కాబట్టి ఆయనను ఆశ్రయించు. నీ కష్టాలు గట్టెక్కుతాయి. భయపడవద్దు. ఇతర ఆలోచనలన్నింటినీ కట్టిపెట్టి భగవంతుణ్ణే తలుచుకో. అన్యచింతలు వద్దు. నిస్సంశయంగా నీవు జయించి తీరతావు.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(104)

బేలూరు మఠం,
11 మే, 1917

ప్రియమైన డి.,

నీ మే 6వ తేదీ ఉత్తరం అందింది. నీ ఉత్తరాన్ని బట్టి నీవు మరింతగా భగవంతుని మీద ఆధారపడడం నేర్చుకుంటున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. అది నీ మీద భగవంతుడు కనపరుస్తున్న ప్రత్యేకమైన అనుగ్రహానికి నిదర్శనం. భగవంతుడు నీకు మరింత భక్తి, శ్రద్ధ, ఆంతరంగిక శక్తి ప్రసాదించు గాక! నీ ప్రాణాన్నీ, నీ ఆత్మనూ ఆయనకు సమర్పించి, క్రమంగా నీవు ఆయన వైపు పురోగమిస్తావు గాక! అల్పమైన, నిరుపయోగకరమైన ఆలోచనల బంధాల నుండి విముక్తుడవవుతావు గాక! నీ జీవితానికి ఆయనే ఆధారమని గుర్తెరిగి, ఆయననే ఆశ్రయిస్తావు గాక! ఇలా జరిగినప్పుడు అన్ని క్లేశాలు, బాధలు, లోట్లు, అపరిపూర్ణతలు అదృశ్యమై నీవు పరమశాంతిని పొందుతావు.

తూర్పు వైపు ప్రయాణించే కొద్దీ నీవు పడమర నుండి దూరమైపోతావు. భగవంతుని ఆలోచనలతో నీ హృదయాన్ని నింపే కొద్దీ ప్రాపంచిక తలంపులు, తాపాలు తొలగిపోతాయి. వాటిని పారద్రోలడానికి నీవు ప్రత్యేకమైన ప్రయత్నం చెయ్యనక్కరలేదు. భక్తిశ్రద్ధలతో నిరంతరం హృదయంలో భగవంతుని నామ స్మరణను తప్పక అభ్యాసం చెయ్యాలి. అప్పుడు మన మనస్సు స్థిరమవుతుంది.

మనిషి ఎల్లప్పుడూ ప్రార్థనాశీలుడై ఉండడం అవసరం. తన ఆంతరంగిక భావాలను మాటిమాటికి అతడు భగవంతునికి మనవి చేసుకుంటున్నట్లయితే ఆయన వాటిని ఆలకిస్తాడు. నీ ప్రార్థనావిధానం నాకు నచ్చింది. భగవంతుణ్ణి భక్తి, శ్రద్ధ, ప్రేమల కోసం ప్రార్థించాలి. ఇవి దుర్లభం; ఒకసారి అవి నీకు లభిస్తే ఇక ఏ లోటూ ఉండదు. అప్పుడు హృదయం మహదానందంతో నిండిపోతుంది. అప్పుడు మనిషి అన్ని పరిస్థితులలోను పరిపూర్ణమైన శాంతిని అనుభవిస్తాడు. ఓర్పుతో భగవంతుని గుమ్మం దగ్గర కాచుకొని ఉండాలి. అప్పుడు సర్వం సుగమమవుతుంది. ఆయన అన్నింటిని అనుకూలంగా మార్చుతాడు.

శరీరం కొన్నిసార్లు చక్కగా ఉంటుంది, కొన్నిసార్లు సరిగా ఉండదు. రోజురోజుకూ అది నాశనమై పోతూ ఉంటుంది. అది దాని స్వభావం. శరీరం అశాశ్వతం. నేడోరేపో అది పతనమైపోతుంది. ఇంతకంటే నేను దాన్ని గురించి ఎక్కువ ఏం చెప్పగలను? భగవంతునికి శరణాగతుడవై ఉండి, శాంతం వహించు. దీనిని మించిన పరిపూర్ణానందం మరొకటి లేదు.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(105)

శశినికేతన్, పూరీ

10 జులై, 1917

ప్రియమైన డి.,

నీవు జులై 7వ తేదీన వ్రాసిన ఉత్తరం సంతోషాన్ని కలిగించింది. భగవంతుణ్ణి గురించిన నీ ప్రార్థనలు చక్కగా ఉన్నాయి. మనిషి తన ఆంతరంగిక భావాలను భగవంతునికి విన్నవించుకోవాలి. ఆయన సర్వజ్ఞుడు. ఆ ప్రార్థనలు హృదయంలో నుంచి వస్తే, వాటిని ఆయన ఆలకించి నిస్సందేహంగా అనుగ్రహిస్తాడు. నీ మనస్సును భగవంతుని మీద నిలపడానికి ప్రయత్నించు. నీకు ఆయన తప్పక సహాయం చేస్తాడు.

మనస్సు అపవిత్రంగా ఉన్నప్పుడు సందేహాలు కలుగుతుంటాయి. కాబట్టి నీ హృదయంలో స్వార్థం చోటు చేసుకోకుండా ఉండేట్లు చూసుకో. సంపూర్ణంగా భగవంతునికి శరణాగతుడివై ఉండు. అలా చేసిన తర్వాత ఇక ఆయనను అన్వేషించనక్కరలేదు. "ఈ ప్రపంచమనే సంతలో నా దేహాన్ని అమ్మి దుర్గానామాన్ని కొన్నాను!" హృదయపూర్వకంగా ఇటువంటి భావనను జీవితానికి అన్వయించితే భయాందోళనల్ని ఎదుర్కోవలసిన పని ఉండదు. అయితే ఇది క్రమంగా సంభవిస్తుంది.

జగజ్జనని పాదారవిందముల
లీనమందుచును ఉండవె మనసా!
అందు పూర్ణముగ లీనమైనచో
తీరు భవార్ణవ దురిత దుఃఖములు
నిజముకాని ఈ లోకములో నువు
దిక్కుతోచకను తిరుగుట ఎందుకు
బ్రహ్మశక్తి కుండలినిని తలచుచు
హృదయమధ్యమున ధ్యాన మొనర్చుము
శ్యామాంబను కీర్తించు వానికిని
నెమ్మదిగా తన నావ నడుపుటకు

జీవితమ్మె సంతోష నదమ్మగు

ననుచు వాక్రుచ్చె కమలకాంతుడు!

మొదట జీవితం ఒక ఆనందపు నది అని తెలుసుకో. తర్వాత నీ నావను మెల్లగా నడుపు. త్వరపడకు. అమ్మను స్మరిస్తూనే ఉండు. మనకు అంతకంటే కావలసినదేమిటి? అమ్మను తలపోయగలిగితే తాను ధన్యుడైనట్లు భావించాలి. ఇంతకంటే వేరే కోరిక ఉంటే, అప్పుడు అది ప్రాపంచికమైన కోరిక అవుతుంది. అది సందేహాన్ని, అపార్థాన్ని, అశాంతిని కలిగిస్తుంది. కాబట్టి, జాగ్రత్త!

అమ్మను గురించిన కోరిక కంటే మరొక కోరికను నీ హృదయంలో ఉండనివ్వ వద్దు. సాంసారిక కోరికల అంతిమ ఫలితాలు బాధాకరంగా ఉంటాయి. దివ్యజనని క్రమంగా సమస్తం నీకు అర్థమయ్యేటట్లు చేస్తుంది. నీ యథార్థమైన ఉద్దేశ్యాన్ని పరిపూర్ణం చేసే శక్తిని నీకు ప్రసాదించమని కోరుతూ ఆమెను ప్రార్థించు. నీ మనస్సు, మాట ఏకమైతే సమస్తం సాధించగలవు.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(106)

శశినికేతన్, పూరీ

21 జులై, 1917

ప్రియమైన డి.,

శ్రావణమాసం 1వ తేదీన (జులై 1917) నీవు వ్రాసిన ఉత్తరం చూసి సంతోషించాను. నీ ఉత్తరం ద్వారా భగవంతుడు నిన్ను సద్భావాలతో ప్రోత్సహిస్తున్నాడనీ, నీ మనస్సు అంతకంతకు పవిత్రమవుతున్నదనీ తెలిసి సంతోషపడ్డాను. ఆయన నిన్ను ఇతోధికంగా ఆశీర్వదించు గాక – ఇదే ఆయనకు నా హృదయపూర్వకమైన ప్రార్థన.

నిజంగా కోర్కెల నుండి తప్పించుకోవడం సాధ్యం కాదు; కానీ మనస్సు వివేకంతో కూడుకుని ఉంటే కోరికలు మనస్సును వశపరచుకోలేవు. "వివేకమున్నట్లయితే, అతి క్లిష్టమైన సమయంలో కూడా మనిషి ఏ మాత్రం తొణకడు," అని యోగవాశిష్టంలో వశిష్టమహర్షి శ్రీరామచంద్రుడికి చెప్పాడు. వివేక శక్తిని స్థిరంగా ఉంచుకుంటే మాయాశక్తి మనిషిని వశపరచుకోలేదు. ఈ సమస్తం అశాశ్వతమైనదేనని భావించేవాడికి ఏ కోరికయినా ఏ అపకారం చెయ్యగలదు? స్వల్పమైన కోరికలవల్ల భయపడవలసినదేమీ లేదు. మనస్సును భగవంతునికి దూరం చేసే కోరికే నిజంగా ప్రమాదకరమైనది. మనస్సును భగవంతుని మీద నిలిపితే, మనిషి సంసారంలో ఉన్నా కోరికలు అతణ్ణి తప్పుదారి పట్టించలేవు. భగవంతుణ్ణి ప్రార్థించి, నీ హృదయాన్ని ఆయన ముందు తెరిచిచూపు. సర్వాన్నీ ఆయన సరిచేస్తాడు.

త్యాగాన్ని గురించి యోగవాశిష్టంలో ఒక కథ ఉంది. ఒక బ్రహ్మచారి తాను త్యాగపురుషుణ్ణని అనుకుని తనకున్నదంతా త్యాగం చేశాడు. ఒక కౌపీనం, ఒక ఆసనం, ఒక కమండలం – ఇవే అతడికి మిగిలిన ఆస్తి. అతనికి త్యాగాన్ని గురించి సరైన అవగాహన కలిగించడానికి గురువుగారు అతనితో, "నాయనా! నీవు త్యాగం చేసిందేమిటి? నీవు ఏమీ త్యాగం చెయ్యలేదని నాకనిపిస్తున్నది," అన్నారు. దానికి బ్రహ్మచారి ఇలా తలపోశాడు: "నాకున్నదేమిటి? ఒక గోచీ, ఆసనం, కమండలం మాత్రమే కదా? వీటిని కూడా త్యజించమని మా గురువుగారి అభిప్రాయమా?" ఈ విధంగా తర్కించిన తర్వాత ఒక చితి పేర్చి తన దగ్గర ఉన్న ఒకొక్క దానినే అగ్నిలో వేసి తాను నిజమైన త్యాగాన్ని సాధించాననుకున్నాడు. గురువుగారు అతనితో ఇలా అన్నారు: "నీవు త్యాగం చేసిందేమిటి? నీ ఆసనం, ఒక గుడ్డముక్క, కమండలం ఇవే కదా! ఈ గుడ్డముక్క పత్తితో చెయ్యబడింది. నీ ఆసనం, కమండలం, ఇతర వస్తువులతో చెయ్యబడ్డాయి. ఈ వస్తువులన్నీ ప్రకృతికి చెందినవి గదా! సొంతంగా నీవేమి త్యాగం చేశావు?" బ్రహ్మచారి ఇంకా ఆలోచించాడు: "ఇక నా దగ్గర ఉన్నదేమిటి? నా శరీరం. ఈ శరీరాన్ని కూడా అగ్నికి ఆహుతి చేస్తాను." బ్రహ్మచారి అగ్నిజ్వాలలలోకి దూకబోతున్న ప్పుడు గురువుగారు అన్నారు: "ఒక్క క్షణం ఆగు, నాయనా! ఏం చేస్తున్నావు? నాతో కొంచెం తర్కించు. ఈ శరీరం నీదా? నీ శరీరాన్ని తయారు చేసినవారు నీ తల్లిదండ్రులు. దాన్ని వారి శుక్రశోణితాలతో తయారు చేశారు. తర్వాత ఆహారపోషణ వల్ల అది పెరిగింది. అందులో నీకు చెందిందేమిటి?" చివరకు బ్రహ్మచారికి సద్బుద్ధి కలిగింది. గురువు అనుగ్రహంవల్ల, ఈ అనర్థానికంతా మూలకారణం తన 'అహంకారమే' నని తెలుసుకున్నాడు. అహంకారత్యాగమే నిజమైన త్యాగం. లేకపోతే బాహ్యవస్తువుల త్యాగం, తుదకు శరీరత్యాగం కూడా త్యాగమనిపించుకోదు.

కాబట్టి స్వీకరించడం, విసర్జించడం – వ్యతిరేకమైన ఈ ద్వంద్వాలు పనికిమాలినవి. ఎందుకంటే అవి మాయ యొక్క ఆధీనంలో ఉన్నాయి. జీవితంలో ప్రధానమైన విషయం భగవంతుని యందు శరణు పొందడమే. మానవుడు తనకు ఏకాగ్రభక్తిని, భక్తుల మీద ప్రేమను, భగవన్నామ స్మరణలో అభిరుచిని, ఇమ్మని ప్రార్థించాలి.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(107)

శశినికేతన్, పూరీ
31 జులై, 1917

ప్రియమైన డి.,

నీ శ్రావణ దశమి (జులై 1917) ఉత్తరం అంది సంతోషం కలిగింది. ...మీ ఇంటిలో జరిగిన శ్రీకృష్ణుని డోలోత్సవం (ఉయ్యాల ఉత్సవం) విషయం కూడా తెలిసి ఆనందించాను.

శ్రీకృష్ణుడు ఉద్ధవునికి ఇలా చెప్పాడు: "ఉత్సవాలు జరపడం భక్తి సాధనలలో ఒక విధమైన సాధన" (భాగవతం, 9.11.36). ఇక్కడ పూరీలో జరిగే జగన్నాథస్వామి ఉత్సవాన్ని ప్రతివారూ సంతోషంగా జరుపుకుంటారు.

భగవంతుడు సంప్రీతుడైతే ప్రతివారూ సంతృప్తి చెందుతారు. కాబట్టి మొదట భగవంతుణ్ణి సేవించడం మరువవద్దు. కానీ, సాధారణంగా దీన్ని తల్లక్రిందులు గా చేస్తాం. భగవంతుణ్ణి సేవించడానికి బదులు పండగ సమయంలో మన ఆనందాల కోసం చూసుకుంటాం. మతానికి సంబంధించిన ఉత్సవ కార్యక్రమా లలో ఇది ఒక గొప్ప లోపం. మనిషి జాగ్రత్తగాను, శ్రద్ధగాను, భక్తిపూర్వకం గాను, నిష్కామంగాను ఉంటే ఈ ప్రమాదం నుండి రక్షించబడతాడు.

అపక్వస్థితిలో, ప్రతీ మతంలోనూ, పతనభయం, ప్రమాదభయం ఉంటాయి. భక్తి తీవ్రతరమయితే ఇక ఆ భయముండదు. స్వార్థం నిర్మూలమైతే కానీ భక్తిలో తీవ్రత కలగదు. ఏ మార్గాన్ని అనుసరించినా అహంకారం, స్వార్థం, ఇంద్రియ సుఖాల మీద తృష్ణ వదిలి పోనిదే పారమార్థికత పరిపూర్ణంగా అభివ్యక్తం కాదు.

భక్తుడికి సరైన వైఖరి ఉంటే భగవంతుడే అతణ్ణి కాపాడతాడు. కాబట్టి, భగవద్భక్తునికి భయమనేది ఉండదు. నిజాయితీ ఒక్కటే కావలసింది. మనస్సును, వాక్కును ఏకం చెయ్యడమే విశిష్టతమమైన సాధన. ఇది ఒక్కసారిగా సాధ్యం కాకపోయినా, క్రమమైన సాధన చెయ్యడం వల్ల దానిని నిస్సందేహంగా సాధించవచ్చు. భగవంతుడే దీనిని సాధించడానికి మనిషికి సాయం చేస్తాడు. ఆయన సహాయం లేకపోతే అందరూ నిస్సహాయులే.

"వారి యందలి కృపవల్ల, వారి హృదయాలలో ఉండి, అజ్ఞానం వల్ల కలిగిన అంధకారాన్ని ప్రకాశమానమైన జ్ఞానదీపం చేత నాశనం చేస్తున్నాను" (గీత: 10:11). ఈ భగవద్వచనాలే మనకు అండ, ఆశ.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(108)

శశినికేతన్, పూరీ
31 ఆగష్టు, 1917

ప్రియమైన డి.,

నీ ఉత్తరాన్ని బట్టి నీవు మంచి ఉత్సాహంలో ఉన్నట్లు తెలుస్తోంది. నిస్సందేహంగా అది భగవంతుడు నీ మీద చూపుతున్న కరుణ. భగవంతుని చింతనను కొనసాగిస్తూ, తీవ్రంగా, నిజాయితీతో భగవంతుణ్ణి ప్రార్థించు. ఆయన సర్వజ్ఞుడు. అత్యంత కరుణామయుడు. నిర్మలమైన హృదయంతో చేసే ప్రార్థనలను ఆయన సఫలీకృతం చేస్తాడు.

అశాంతి మనస్సు యొక్క స్వభావం. ప్రార్థనవల్ల, ధ్యానంవల్ల అది శాంతపడుతుంది. మరొక పద్ధతి లేదు. పారమార్థిక సాధనాఫలితంగా, భగవత్కరుణవల్ల మనస్సు ప్రశాంతమవుతుంది.

"ఆనందంగా ఉన్నవారిపట్ల మైత్రి, దుఃఖంలో ఉన్నవారిపట్ల కరుణ, ధర్మాత్ముల పట్ల సంతోషం, పాపాత్ముల పట్ల ఉపేక్షలను అభ్యాసం చెయ్యడం వల్ల చిత్తంలో నిశ్చలమైన ప్రశాంతి ఏర్పడుతుంది" (పతంజలి యోగసూత్రాలు, 1.33). ఇది పతంజలి యోగసూత్రాలలో ఇచ్చిన సూచన.

అన్ని జీవరాసులలోను భగవంతుడున్నాడు. కాబట్టి ప్రతివారూ మన ప్రేమకు పాత్రులే. ఈ విధానాన్ని అనుసరించడం ద్వారా కూడా మనశ్శాంతిని పొందవచ్చు.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(109)

శశినికేతన్, పూరీ

7 సెప్టెంబరు, 1917

ప్రియమైన నిర్మల్ (స్వామి మాధవానంద),

నీవు ఆగష్టు 28వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది... విచక్షణ చెయ్యడం ద్వారా ప్రారంభంలో సత్యాన్ని తెలుసుకోవాలి. వివేకం స్థిరపడి, అనుమానాలు తొలగిన మరుక్షణమే సాక్షాత్కారం కలుగుతుంది. సత్యాన్ని గురించిన అనుమానం, అపార్థం, వ్యతిరేకభావాలు నశించినప్పుడు మనస్సు ఆత్మలో సుప్రతిష్ఠమవుతుంది. దీనిని సత్య సాక్షాత్కారం అంటారు. "భగవంతుని అనుగ్రహం వల్ల కాలక్రమంలో తనలోనే ఆత్మను దర్శిస్తాడు" (గీత: 4:38).

'ఎమ్' దగ్గర నుండి ఈ రోజు ఒక పోస్టుకార్డు వచ్చింది. ఏమీ చెయ్యకుండా ఊరుకున్నంత మాత్రాన 'అహంకారం' తొలగదని అతనితో చెప్పు. అహం కారాన్ని తొలగించుకునే మార్గం కర్మచెయ్యడం ద్వారా మాత్రమే. ఏ వస్తువునైనా వేయించదలిస్తే నూనెను కాచడానికి నిప్పును ఉపయోగించాలి. పంచదారను శుద్ధం చెయ్యాలంటే దాన్ని నీటిలో మరిగించి పైచెత్తను తొలగించాలి. అదే విధంగా మనస్సును పరిశుద్ధం చెయ్యాలంటే ఫలితం ఆశించకుండా కర్మలను ఆచరించాలి. ఒక తాబేలులాగా కాళ్ళు, చేతులు ముడుచుకుని కూర్చుంటే చిత్తశుద్ధి తయారుకాదు. "గర్వం కలిగిస్తుంది కాబట్టి నేను పనిచెయ్యను" – ఇటు వంటి స్వభావం కేవలం స్వార్థపరత్వం వల్ల మాత్రమే కలుగుతుంది. నిజానికి అది భయంకరమైన తామసిక స్వభావానికి చిహ్నం. తమస్సును కర్మ చెయ్యడం ద్వారా రజస్సులోకి మార్చాలి. తర్వాత అది క్రమంగా పారమార్థిక శిక్షణలద్వారా సత్త్వంగా మారుతుంది. ఆ విధంగా అహంకారం తరిమి వేయబడుతుంది.

అహంకారభావన లేనివాడు పని (కర్మ) చేస్తున్నా, పని చేసినవాడు (కర్త) కాబోడు. గర్వానికి ఆశ్రయమిచ్చినవాడు సోమరిగా ఉన్నప్పటికీ గర్వంగానే ఉంటాడు. నమ్రతతోను, శాంతంగాను ఉన్నవాడు అనేక విషయాలు నిర్వర్తిస్తున్నప్పటికీ, తాను ఏమీ చెయ్యడం లేదని భావిస్తాడు.

ప్రేమ, ఆశీర్వాదాలతో,
తురీయానంద

(110)

శశినికేతన్, పూరీ
19 సెప్టెంబరు, 1917

ప్రియమైన డి.,

..నీ విచక్షణాశక్తిని చూసి నేను ఆనందిస్తున్నాను. నా చిన్నతనాన్ని గురించి నీవు తెలుసుకోగోరుతున్నావు. కానీ, దాన్ని గురించి నేను మాట్లాడదలుచుకోలేదు. శ్రీరామకృష్ణులతో నా మొదటి పరిచయాన్ని గురించి కూడా తెలుసుకోగోరావు. దానికి క్లుప్తంగా సమాధానమిస్తున్నాను.

నేను మొట్టమొదట శ్రీరామకృష్ణులను బాగ్‌బజారులోని దీనానాథ్ బోస్ ఇంటిలో దర్శించాను. అది చాలా, చాలా కాలం నాటి సంగతి. ఆ రోజులలో గురుదేవులు తరచుగా సమాధిని పొందుతుండేవారు. సుమారు అదే సమయం లో కేశవచంద్రసేన్‌కు వారితో పరిచయం కలిగింది. దీనానాథ్‌బోస్ సోదరుడు అయిన కాళీనాథబోస్ కేశవచంద్రసేన్ శిష్యుడు. శ్రీరామకృష్ణులను చూసి కాళీనాథ్‌బోస్ గాఢంగా ప్రభావితుడైనాడు. అందువల్ల శ్రీ రామకృష్ణులను తమ ఇంటికి తీసుకురమ్మని సోదరుణ్ణి కోరాడు. ఆ విధంగా గురుదేవులు బాగ్‌బజారు రావడం తటస్థించింది. మేమంతా చిన్నపిల్లలం. 13, 14 ఏళ్ళు ఉంటాయి. ప్రజలు శ్రీరామకృష్ణులను పరమహంస అని చెప్పుకునేవారు. అందువల్ల వాళ్ళంతా పరమహంసగారు వస్తారని చెప్పుకుంటున్నారు. నేను, ఇంకా కొంత మంది పిల్లలు ఆయనను చూడాలనే కుతూహలంతో అక్కడికి వెళ్ళాం. దీనానాథ్ ఇంటి ముందు ఒక బండి వచ్చి ఆగింది. అందులో ఇద్దరు వ్యక్తులున్నారు. వెంటనే అక్కడున్న వాళ్ళు, "పరమహంసగారు వచ్చారు, పరమహంస గారు వచ్చారు" అంటూ బండివైపు వెళ్ళారు. బండిలో నుంచి మొదట ఒకరు దిగారు. (అది శ్రీరామకృష్ణుల మేనల్లుడు హృదయరామ్.) అతడు దృఢకాయుడు. ముఖాన పెద్ద కుంకుమబొట్టు పెట్టుకున్నాడు. కుడిచేతికి ఒక బంగారు తాయెత్తు కట్టుకున్నాడు. చూడగానే అతడు చాలా చురుకైనవాడని, బలిష్ఠుడని తోచింది. అతడు బండి దగ్గరే నిలబడి రెండవ వ్యక్తి దిగడానికి సహాయం చేస్తున్నాడు.

రెండోవ్యక్తి సన్నగా ఉన్నారు. ధోవతిని నడుముకు గట్టిగా చుట్టుకున్నారు. ఒక పాదం బండి మెట్టుమీద ఉన్నది. రెండోపాదం ఇంకా బండిలోనే ఉన్నది. ఆయన సగం స్పృహలో ఉన్నట్టు,

తప్పుతాగినవాణ్ణి బండిలోనుండి దింపుతున్నట్లుగా అనిపించింది. కానీ దిగగానే ఆశ్చర్యం కలిగింది. ఆహా! అది ఒక అద్భుతమైన దృశ్యం. వారి ముఖం అనిర్వచనీయమైన తేజస్సుతో వెలిగిపోతున్నది. నేను, 'శాస్త్రాలలో శుకమహర్షిని గురించి విన్నాను. వీరేనా ఆ శుకమహర్షి?' అను కున్నాను. ఇంతలో చాలామంది అక్కడికి చేరుకున్నారు. వారిని ఇంటి రెండవ అంతస్తులోకి తీసుకువెళ్ళారు. నేను కూడా వాళ్ళను అనుసరించాను. కొంత బాహ్యస్పృహ కలిగిన తర్వాత పరమహంస గారు కళ్ళు తెరిచి, ఎదురుగా గోడ మీద ఉన్న ఒక పెద్ద కాళికాదేవి చిత్రపటాన్ని దర్శించారు. వెంటనే దేవికి నమస్కరించి సమ్మోహనంగా పాడడం ప్రారంభించారు. ఆ పాట అక్కడ చేరిన వారందరిలోను ఒక భక్తి తరంగాన్ని లేవనెత్తింది. "ఓ అమ్మా! నిన్ను, 'నాయనా! నా నీలమణి!' అని యశోద పిలిచినప్పుడు నీవు ఆమె ముందు చిందులు వేస్తావు గదమ్మా..." అంటూ ఆయన పాడిన పాట కాళీ, కృష్ణుడు ఒకరేననే భావాన్ని వ్యక్తం చేసింది. ఆ పాట అందరిలోను ఎటువంటి అద్భుతమైన చైతన్యాన్ని మేల్కొల్పిందో వర్ణించడం అసాధ్యం. మళ్ళీ రెండు మూడేళ్ళ తర్వాత నేను దక్షిణేశ్వరానికి వెళ్ళి శ్రీరామకృష్ణులను వారి గదిలో దర్శించాను. ఈ రోజుకు ఇది చాలు.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(111)

57, రాంకాంతబోస్ వీధి, కలకత్తా
25 నవంబరు, 1918

ప్రియమైన నిర్మల్ (స్వామి మాధవానంద),

నీవు నవంబరు 19వ తేదీన వ్రాసిన జాబు అంది సంతోషించాను... వివేకానంద స్వామి బోధించిన జ్ఞానయోగాన్ని చదవడం ద్వారా నీవు ఆనందాన్ని పొందావని తెలిసి సంతోషం కలిగింది. వివేకానంద స్వామి తన సొంత అనుభవాల నుండి ప్రసంగించడం వల్లనే ఆ జ్ఞానయోగ ఉపన్యాసాలకు అంతటి అమోఘమైన శక్తి ఉంది. విని మాట్లాడిన దానికి, స్వానుభవం నుంచి మాట్లాడిన దానికి మధ్య ఉన్న తేడా అటువంటిది.

ఎందుకంత విచారం? అహంకారం పోకపోతే గురుదేవులు చెప్పినదాన్ని గుర్తుకు తెచ్చుకో. "ఈ అహంకారం ఎవరిది? ఈ అహంకారం భగవంతునిది!" – ఈ విషయాన్ని తెలుసుకుని నిశ్చింతగా ఉండు. అహంకారం తొలగిపోకపోతే ఈ విధానాన్ని అనుసరించాలని గురుదేవులు మాకు బోధించారు: "నేను భగవంతుని దాసుణ్ణి; నేను భగవంతుని బిడ్డను!" భగవంతునితో ఏదో ఒక సంబంధం పెట్టుకున్నప్పుడు భయం గానీ, ఆందోళన గానీ ఉండవు.

భగవంతుడు నిన్ను ఎక్కడ ఉంచితే అక్కడ ఉండి నీ మనస్సును ఆయన మీద నిలుపు. అప్పుడు ఏ చోటైనా సరే నీకు ఆనందంగానే ఉంటుంది. నిజానికి ఈ దగ్గరలు, దూరాలు అన్నీ మనస్సులోనే ఉన్నాయి. అందుకే ఉపనిషత్తు ఇలా చెపుతున్నది: "ఈ ఆత్మ దూరంలో ఉంది,

అలాగే దగ్గరలోనూ ఉంది. ఈ అంతటిలోను ఉంది, దీనికంతటికి బయట కూడా ఉంది.” (ఈశోపనిషత్తు, 5) భగవానుడు నీ ప్రార్థనను సఫలం చేయు గాక! ఇదే భగవంతునికి నా హృదయపూర్వకమైన ప్రార్థన.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(112)

57, రాంకాంత బోసు వీధి, కలకత్తా
4 డిసెంబరు, 1918

ప్రియమైన రమేష్,

నీవు వ్రాసిన ఉత్తరం కొన్ని రోజుల క్రితం అందింది. నీవు తీసుకున్న ఉదాత్తమైన నిర్ణయానికి నేను చాలా సంతోషించాను. మనిషి తప్పేమీ చెయ్యకుండా ఉండడమనేది దుర్లభం, అసహజం. కానీ, తన తప్పు తెలుసుకుని మళ్ళీ దానిని చెయ్యకుండా ఉండడం వల్ల మనిషి తన మానవత్వాన్ని వ్యక్తపరుస్తున్నాడు. పూర్వం చేసిన పనులను గురించి తలపోస్తూ కూర్చోకుండా వర్తమాన విషయాన్ని, భవిష్యత్తు విషయాన్ని గురించి జాగ్రత్తపడితే ఎంతో ప్రయోజనాన్ని సాధించగలడు. శరీరాన్ని, మనస్సును సమర్థవంతం గానూ, ఆరోగ్యవంతం గానూ, పవిత్రం గానూ ఉంచుకోవడం అత్యంత ప్రధానమైన విషయం. లేకపోతే మనిషి ఏ ఘనకార్యాన్నీ సాధించడానికి అర్హుడు కాడు.

ధ్యానాన్ని అభ్యసించడానికి ముందు అవసరమైన అర్హతను సంపాదించు కోవాలి. ఒక్కసారిగా ధ్యానంలో మునిగిపోవడం చాలా కష్టం. మొదట మనస్సును ఇంద్రియవిషయాల నుండి ఉపసంహరించి, ఒక ప్రత్యేకమైన ఆలోచన వైపు మళ్ళించాలి. దీన్ని ప్రత్యాహారం అంటారు. ప్రత్యాహారాన్ని అభ్యాసం చేసిన తర్వాత మనస్సును శరీరంలోని ఒక భాగం మీద – నాసికాగ్రం, భ్రూమధ్యం, హృదయం – ఏది అనుకూలమైతే దాని మీద కేంద్రీకృతం చెయ్యాలి. దీన్ని ధారణ (ఏకాగ్రత) అంటారు. ఈ అభ్యాసంలో నైపుణ్యం సంపాదించిన తర్వాత మనిషి ధ్యానాన్ని అభ్యసించడానికి పూనుకోవాలి.

ఆలోచనాప్రవాహాన్ని ఒక ప్రత్యేకమైన వస్తువు మీదగాని, ఒక భావం మీద గాని, అవిచ్ఛిన్నమైన తైలధారలాగా (ధారగా పడే నూనెలాగా) స్థిరంగా ఉంచగలిగితే దాన్ని ధ్యానం అంటారు. తైలధార ఉదాహరణ ఎందుకిచ్చారంటే, నూనెధారలో ఆగుతూ, చుక్కలుగా పడడమనేది ఉండదు. అదే విధంగా ధ్యానంలో ధ్యానవిషయం వైపు ఆలోచన ఆగకుండా ప్రవహిస్తుంది. దీర్ఘకాలం పారమార్థిక అభ్యాసం వల్ల మనిషి మనస్సును ఏకాగ్రం చేసే శక్తిని సాధించి, ధ్యానం చెయ్యడానికి సమర్థుడు అవుతాడు.

ధ్యానాన్ని మొదట అభ్యాసం చేసేటప్పుడు ఒక దేవతా ప్రతిమవంటి స్థూల వస్తువు మీద ధ్యానం ప్రారంభించాలి. ప్రారంభంలో పూర్తి ఆకారం మీద ధ్యానం చెయ్యడం సులభమైన పని

కాదు కాబట్టి శరీరంలో భాగమైన ముఖం మీద లేకపోతే పాదాల మీద ధ్యానం చెయ్యడానికి ప్రయత్నించాలి. ఈ అభ్యాసంలో ప్రావీణ్యత కలిగిన తర్వాత పూర్తి రూపం మీద ధ్యానం చెయ్యడం సులభమవు తుంది. ఆపైన సాకారధ్యానం నెమ్మదిగా, సూక్ష్మమైన నిరాకార ధ్యానానికి దారితీస్తుంది. ధ్యానం ఈ స్థితికి చేరుకున్నప్పుడు ధ్యానం చేసేవాడు చాలా జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. ఎందుకంటే నిద్ర (లేక మందకొడితనం), వేరే తలంపులు, సోమరితనం (స్తబ్ధత) మొదలైన అంతరాయాలు కలుగుతూ ఉంటాయి. ఈ వివరాలను సాధకుడు తెలుసుకోవడం అవసరం.

కొన్ని సమస్యలకు సమాధానాలను గురించి ఆలోచిస్తున్నప్పుడు మనస్సు ఏకాగ్రం చెందుతుందని వ్రాశావు. ఇది కూడా ధ్యానంలో ఒక విధానమే. “నేను గట్టిగా ప్రయత్నిస్తే ధ్యానస్థితికి రాగలను!” అనే నీ విశ్వాసం నిస్సందేహంగా మంచిదే. గీత 6వ అధ్యాయంలో కృష్ణభగవానుడు ధ్యానానికి కొన్ని ప్రత్యేకమైన సూచనలు ఇచ్చాడు. “శుచియైన ప్రదేశంలో ఆసనం మీద స్థిరంగా కూర్చొని...” అనే 11వ శ్లోకంతో ప్రారంభించి, “నాలో ఉన్న పరమశాంతిని పొందుతాడు – అది నిర్వాణంలో అంతమౌతుంది” అనే 15వ శ్లోకంతో ముగిస్తాడు. ఎవరైనా సరే, నిత్యం గీత చదువుతుంటే అతని హృదయం నిర్మలమవుతుంది.

నీ మనస్సును భగవంతుని యందు నిలిపి, ఆయన వైపు సాగిపో. అప్పుడు ఈ లౌకికమాయను చూసి భయపడనక్కరలేదు. భగవంతుడు నిన్ను సంరక్షించి, తన వాణ్ణిగా చేసుకుంటాడు. నీ హృదయమందిరంలో కపటం లేకపోతే, నీ మనస్సూ –మాటా ఏకమైతే, అప్పుడు సర్వజ్ఞుడైన పరమాత్మ నీకు ఏది శ్రేయస్కరమో దాన్ని ప్రసాదిస్తాడు. ఇది సర్వశాస్త్రాల సారమనీ, అందరు మహా పురుషుల నిర్వివాదమైన బోధ అనీ తెలుసుకో! దుష్టసాంగత్యానికి దూరంగా ఉండు. నిత్యం ప్రార్థిస్తూ ఉండు. అది చెయ్యగలిగితే భగవంతుడు నీ హృదయంలో ఆసీనుడై నిన్ను ముందుకు నడిపిస్తాడు. ఇంతకంటే ఎక్కువ ఏమి వ్రాయగలను?

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(113)

57, రాంకాంత బోసు వీధి, కలకత్తా
16 డిసెంబరు, 1918

ప్రియమైన ఫణి,

నీ ఉత్తరం కొన్ని రోజుల క్రితం అందింది. నీవు క్షేమంగా ఉన్నావని తెలిసి సంతోషించాను. నీ ప్రశ్నలకు సమాధానమివ్వడానికి ప్రయత్నిస్తాను.

1) నిరోధమనే పదానికి “సంపూర్ణమైన నిగ్రహం” అని అర్థం. బాహ్య పదార్థాల మీదకు మనస్సుని పోనివ్వకుండా ఉండడాన్ని యోగపరిభాషలో చిత్త నిరోధం అంటారు. అది ఒక స్థితి. దానివల్ల మనస్సు లోనికి త్రిప్పబడుతుంది.

2) నీవు సరిగ్గానే ఉదహరించావు. "ఆలోచనల అలలు లేని స్థితిని నిరోధం అంటారు." మనస్సు ఆలోచించడం ఆగిపోయినప్పుడు సాక్షిగా ఏ ఆత్మ ఉందో, అది అప్పుడు తన స్వభావంలో సుప్రతిష్ఠితమై ఉంటుంది.

3) ఏకాగ్రత (ధారణ) అంటే మనస్సును (ఏక-అగ్రం) మొనదేలేటట్లు చెయ్యడం. అది సూదిలోకి దారం ఎక్కించేటప్పుడు సూదిబెజ్జంలోకి దూరడానికి దారపుకొనను మొనదేలేటట్లు చెయ్యడం వంటిది. "సన్నని పత్తిపోగులు బైటికి వచ్చినప్పుడు దారం సూదిలోకి దూరదు," అని గురుదేవులు చెప్పేవారు. అదే విధంగా మనస్సు ఏ మాత్రం చలించినా ధ్యానం కుదరదు. ధారణ లేక ఏకాగ్రత అంటే మనస్సును ఒకే విషయం మీద నిశ్చలంగా ఉండేటట్టు చేయ్యడమని అర్థం.

4) "ఆలోచనల అలలను అదుపు చెయ్యడం," ఏకాగ్రత నుండి వస్తుంది. కాబట్టి ఏకాగ్రత తర్వాత స్థితి నిరోధం లేక 'సంపూర్ణ నిగ్రహం'.

5) వైరాగ్యాన్ని అభ్యాసం చెయ్యడం వలన ఆలోచనల తరంగాలు నిగ్రహం చెయ్యబడతాయి. మనస్సులో ఒకే భావాన్ని మళ్ళీమళ్ళీ నిలిపి ఉంచడాన్ని అభ్యాసం అంటారు. సాధారణంగా మనస్సు ఒక భావం మీద నుండి మరో భావం మీదికి దూకుతూ ఉంటుంది. అది ఎప్పుడూ నిశ్చలంగా ఉండదు. మనస్సును ఒక్క విషయం మీద నిలిపి, అటూయిటూ తిరగకుండా ఉంచటాన్ని అభ్యాసం అంటారు. ఈ సందర్భంలో గీతలో కృష్ణుడు ఇలా అన్నాడు: "చంచలం, అస్థిరం అయిన మనస్సును ఏయే విషయాలు చలించేటట్లు, తప్పించుకు పోయేటట్లు చేస్తాయో వాటి నుండి నిగ్రహించి, ఆత్మ యొక్క వశంలోకి తీసుకురావాలి" (గీత: 6:26).

6) "ఏకాగ్రత, ధ్యానం సాధన చెయ్యకుండా వివేకం, వైరాగ్యం, అభ్యాసాల ద్వారా ఆలోచనలను పూర్తిగా నిగ్రహించవచ్చునా?" అని నీవు ప్రశ్నించావు. వివేకాన్ని అభ్యసించడం వల్ల ధ్యానం యొక్క ఫలితం లభిస్తుంది. మనస్సులోని మార్పులను (ఆలోచనల) సంపూర్ణంగా నిగ్రహించగలుగుతావు. అంటే మనస్సు లోని మార్పులను ధ్యానం ద్వారా గాని, వివేకం ద్వారా గాని నిగ్రహించవచ్చును. నిత్యానిత్యవస్తు విచక్షణ చెయ్యడం వల్ల - ఇది శాశ్వతమైనది, ఇది అశాశ్వతమైనది అని వివేచన చెయ్యడం వల్ల - మనస్సు నిగ్రహం చెందుతుంది. చివరకు గమ్యానికి చేరుతుంది. అతీంద్రియ స్థితిలో, అఖండ సత్స్వరూపమైన ఆత్మానుభవం కలుగుతుంది. ఏకాగ్రత, ధ్యానం అభ్యసించడం ద్వారా కూడా మనస్సు నిగ్రహం చెంది అతీంద్రియ స్థితిని పొందుతుంది. ఆ విధంగా ఏకాగ్రమైన మనస్సు మార్పు చెందకుండా ఉండి ఆత్మానుభవాన్ని పొందుతుంది. ఆత్మజ్ఞానానికి వివేకం జ్ఞానయోగపరమైన మార్గం. అలాగే ధారణ (ఏకాగ్రత), ధ్యానాలు రాజయోగపరమైన మార్గాలు. ఈ మార్గాలు వేరువేరయినా చేరే గమ్యం ఒక్కటే. ఈ రెండు మార్గాలను అనుసరించేవాళ్ళు ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది అన్ని దుఃఖాలకు అతీతులవుతారు. అయితే భక్తుడు అటువంటి బాధాకరం, కష్టభూయిష్ఠం అయిన విధానాలను అనుసరించకుండానే తన హృదయాన్ని,

ఆత్మను భగవంతునికి అంకితం చేస్తాడు. తీవ్రమైన ప్రేమ (భక్తి) చేత భగవంతుణ్ణి పొందడం ద్వారా భక్తుడు ధన్యాత్ముడవుతాడు. భక్తుడికి ఇది సులభతమమైన మార్గం.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(114)

57, రాంకాంత బోసు వీధి, కలకత్తా

6 జనవరి, 1918

ప్రియమైన ఫణి,

నీ ఉత్తరం నిన్న అందింది. నీ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానమిస్తాను.

1) పతంజలి యోగ సూత్రాల ప్రకారం, "యోగమంటే మనస్సులో కలిగే ఆలోచనా తరంగాల నిరోధం" (యోగ సూత్రం, 1.2). భగవద్గీతలో యోగమనే పదం అనేక విధాలుగా నిర్వచించబడింది. ఉదాహరణకు "జయాపజయాల పట్ల ఒకే విధమైన భావాన్ని కలిగి ఉండడాన్ని యోగం అంటారు" (గీత: 2:48). "కర్మ చెయ్యడంలో కుశలత్వం యోగమని పిలువబడుతుంది" (గీత: 2:50). ఈ నిర్వచనాలన్నీ మనస్సులో కలిగే మార్పులను నిగ్రహించడానికే ఉద్దేశించ బడినవని గుర్తుంచుకో.

2) కాబట్టి "మనస్సులోని ఆలోచనా తరంగాలను నిగ్రహించడం అనే యోగం", "జయాపజయాలలో సమభావం" అనేవి రెండూ ఒకే స్థితిని సూచిస్తున్నాయి గాని, వేర్వేరు విషయాలను సూచించడం లేదు.

3) ఆలోచనా తరంగాలు పూర్తిగా ఆగిపోయినప్పుడు మనస్సుకు 'సమత్వం' కలుగుతుంది. లేకపోతే సమత్వం కలగడం సాధ్యం కాదు.

4) గురుదేవుల అరికాళ్ళలో చక్రాల గుర్తులు ఉన్నాయేమో నేను చూడలేదు; ఇతరులు ఎవరూ చెప్పగా కూడా నేను వినలేదు. ఎవరైనా కలలో ఆ గుర్తులను చూస్తే అది యథార్థమో కాదో నేను చెప్పలేను కానీ, గురుదేవులను స్వప్నంలో దర్శించడం శుభప్రదం.

5) "కర్మలో నేర్పరితనం (కౌశలం) యోగమని చెప్పబడుతుంది." దీని భావమేమంటే ఒక కర్మను మామూలుగా ఆచరించినప్పుడు అది బంధాలలో పడవేస్తుంది. దానినే సరియైన భావంతో ఆచరిస్తే మనస్సును పవిత్రం చేసి చివరకు బంధాన్ని నాశనం చేస్తుంది. ఆ విధంగా అది యోగమవుతున్నది. ఉదాహరణకు మమకారంతో చేసిన కర్మ బంధాన్ని కలిగిస్తుంది. అదే మమ కారం లేకుండా చేస్తే విముక్తికి కారణమవుతుంది. ఈ అనాసక్తస్థితి యోగం నుండి వస్తుంది. అందువల్ల ఈ నేర్పరితనాన్ని (కౌశలాన్ని) యోగం అంటారు.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(115)

వారణాసి

18 ఏప్రిల్, 1919

ప్రియమైన శర్వానంద,

నీ ఉత్తరం కొంత కాలం క్రితం అందింది గాని అనారోగ్యం వల్ల ఇప్పటి వరకు సమాధానం వ్రాయలేకపోయాను. 'శ్రీరామకృష్ణతత్త్వ సిద్ధాంతం' అనే విషయాన్ని వివరించడం కష్టమైనా భగవత్కరుణ వల్ల నీ ప్రశ్నలకు సమాధానమివ్వడానికి ప్రయత్నిస్తాను.

శ్రీరామకృష్ణ తత్త్వాన్ని గురించి ప్రసంగించడం అంత సులభమైన విషయం కాదు. "యతో మత్ తతో పథ్" – ఎన్ని మతాలో అన్ని మార్గాలు అని ఆయన చేసిన ప్రకటన అన్ని మతాల అనుయాయులను ప్రోత్సహించడానికి చేసినట్లు నాకు అనిపిస్తున్నది. అనేక మత సాంప్రదాయాలను తానుగా ఆచరించి ఆ మార్గాలన్నీ ఒకే సత్యానికి చేరుస్తాయని అనుభవపూర్వకంగా తెలుసుకున్న తర్వాతే ఆయన ఆ ప్రకటన చేశారు.

అసలు సత్యం ఒకటే. అది రెండు కాదు. దానిని 'బ్రహ్మం, పరమాత్మ, భగవాన్, భగవంతుడు మొదలైన పలురకాల పేర్లతో ఉదహరిస్తారు. ఎవరెవరు సాక్షాత్కారం పొందారో, వారు తమ యొక్క స్వభావం, అవగాహనల మేరకు దానికి ఒక పేరు పెట్టి వివరించడానికి ప్రయత్నించారు. కానీ పరిపూర్ణ సత్యాన్ని వివరించలేకపోయారు. "దైవం ఏమిటో, అదే!" – అదే భగవంతుణ్ణి సాక్షాత్కరించుకున్న వారి అంతిమ నిర్ణయం.

గౌడపాదుల అజాతవాదం, ఆదిశంకరుల ఆరోపణ సిద్ధాంతం, రామానుజుల పరిణామ సిద్ధాంతం, శ్రీకంఠుల శివాద్వైతం మొదలైన వివిధ అభిప్రాయాలను బట్టి వీటిలో ప్రతి ఒక్కటీ సత్యమే. ఈ సిద్ధాంతాలన్నీ కాక, భగవంతుడు మానవుని వర్ణనకు, మనస్సు యొక్క తెలివితేటలకు అతీతుడు. ఈ అన్ని సిద్ధాంతాల వ్యవస్థాపకులు తపస్సు చేసి భగవదనుగ్రహాన్ని పొంది, భగవంతుని ఆజ్ఞ ప్రకారం వివిధ సిద్ధాంతాలను బోధ చేశారు. 'భగవంతుడు' అనే విషయం మీద ఈ సిద్ధాంతాలన్నీ మొదలయ్యాయి. కానీ భగవంతుడు వీటన్నింటికీ అతీతమైనవాడు. ఈ సత్యాన్ని తెలియచెయ్యడమే శ్రీరామకృష్ణ సిద్ధాంతమని నేను అనుకుంటున్నాను.

హనుమంతుడు శ్రీ రామునితో ఇలా అన్నాడు: "రామా! నేను శరీరంలో తాదాత్మ్యం చెందినప్పుడు, నీ దాసుణ్ణి. జీవుణ్ణి అనుకున్నప్పుడు నేను నీలో ఒక అంశను (భాగాన్ని). నన్ను ఆత్మగా భావించినప్పుడు నీవే నేను. ఇది నా నిశ్చితాభిప్రాయం." ఈ ప్రకటనను ఆధ్యాత్మిక అనుభవం యొక్క వివిధదశలను వర్ణించే ఉత్తమమైన నిర్ణయంగా శ్రీరామకృష్ణులు ఉదహరించారు.

పూజాపాత్రలను చైతన్యమయమైన బ్రహ్మంగా దర్శించడం ఎందుకు సాధ్యం కాదు? (కాళికాలయంలో తనకు కనిపించిన ఒక దృశ్యంలో సమస్తం శక్తిమయంగా దర్శనమిచ్చిన

విషయాన్ని శ్రీరామకృష్ణులు ఉదహరించారు.) "ఈ విశ్వమంతా భగవంతుడు ఉన్నాడు. సజీవమైన ప్రతిప్రాణిలో, నిర్జీవమైన ప్రతివస్తువులో ఆయన వ్యాపించి ఉన్నాడు." భగవంతుడు తప్ప మరేమీ లేదు. సర్వం భగవంతుడే. మనం ఆయనను దర్శించలేం కాబట్టి భగవంతునికి మారుగా వస్తువులను చూస్తున్నాం. కానీ, యథార్థమేమంటే సర్వం భగవంతుడే. నామరూపాలు ఆయనలోనుండే వచ్చి, ఆయనలోనే ఉన్నాయి. అలలు, నురుగు, బుడగలు – అవన్నీ నీటి కంటే వేరు కాదు. నీ ఆరోపణ సిద్ధాంతం నిలిస్తేనేం, నిలవకపోతేనేం? ఎవరికి లెఖ్ఖ? సమస్తం బ్రహ్మమే అన్న ఈ సత్యాన్ని తెలుసుకున్నవాడు దీనికంటే తక్కువైన దానితో సంతృప్తి చెందడు.

తలంపులకు, భావాలకు అతీతమైన స్థితిని గురుదేవులు అనుభవించేవారు. ఆ స్థితి నామరూపాలనూ, మనోవాక్కులనూ దాటిపోయిన స్థితి. ఆ స్థితిలో ఉన్నది ఒకటే. రెండవది లేదు. అది – ప్రకృతికి అతీతం. ఆ ఏకత్వస్థితిలో ఆరోపణ సిద్ధాంతం గానీ, అజాత సిద్ధాంతం గానీ ఎక్కడ ఉన్నాయి? అయినప్పటికీ అన్ని సిద్ధాంతాలు – ఆరోపణ సిద్ధాంతం, అజాత సిద్ధాంతం, పరిణామ సిద్ధాంతం – ఇవన్నీ భగవంతుని నుంచే పుట్టుకు వచ్చాయి.

ఆయన ఒక్కడే సత్యం. జగత్తుకు, సర్వజీవరాశులకు ఆయనే మూలకారణం. ఆయనను మరువనంతవరకూ ఈ నామారూపాలు కూడా నిజమే. ఆయనను మరచిపోతే నామరూపాలు అసత్యమవుతాయి. ఎందుకంటే భగవంతుడు లేకపోతే వాటికి ఉనికి లేదు. (శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: "సున్నాలు ఎన్ని చేర్చినా సున్నాయే అవుతుంది. వాటి ముందు ఒకటి వేసినప్పుడే వాటి విలువ పెరుగుతుంది." ఆ ఒకటియే ఆ భగవంతుడు.) ఆయన మన ఆలోచనలలో ఉంటే ఈ సత్యాన్ని మనం తెలుసుకుంటాం. "అరటిచెట్టులోని దవ్వ, పైపొరలకు చెందింది. పైపొరలు దవ్వకు చెందినవి." ("అరటి చెట్టుకు ఎంతవరకూ పైపొర లు ఉంటాయో, అంతవరకూ దవ్వ కూడా ఉంటుంది," అనే శ్రీరామకృష్ణుల ఉప దేశాన్ని ఇది సూచిస్తున్నది. భగవంతుడు మనిషిలో, "నేను భక్తుణ్ణి అనే అహం కారం," ఉంచినంతవరకు అశాశ్వతమైన పైపొరలు సత్యమే, శాశ్వతమైన దవ్వ కూడా సత్యమే.) ఈ సందర్భంలో ఈ గీతావచనాలను కూడా తెలుసుకోవచ్చు. "ఈ సమస్త జగత్తు నాచేత పరివ్యాప్తమై ఉన్నది" (గీత: 9:4). "మణులు దారంతో గ్రుచ్చబడినట్లు సమస్తం నాపై ఆధారపడి ఉన్నది" (గీత: 7:7).

భగవంతుణ్ణి దర్శించడమే ప్రధానైన విషయం. భగవంతుణ్ణి దర్శించిన తర్వాత మిగిలినదంతా అదృశ్యమవుతుంది. మనిషి భగవంతుణ్ణి అన్నింటా సాక్షాత్కరించుకుంటాడు. ఆయనను దర్శించక ముందు మనకు అన్నిరకాలైన సందేహాలు, గందరగోళం, సిద్ధాంతాలు, వాదోపవాదాలు ఉంటాయి. కానీ ఆయనను దర్శించిన తర్వాత ఇవన్నీ ఉండవు. అప్పుడు మనిషి అవిచ్ఛిన్నమైన సుఖశాంతులను అనుభవిస్తాడు.

కాబట్టి శ్రీరామకృష్ణుల సిద్ధాంతం ఇది: "ఏ విధంగానైనా, ఎంత కష్టమైనా, మనం భగవంతుణ్ణి పొంది తీరాలి." గురుదేవులు, "ముందు నీ కొంగు చివర అద్వైతజ్ఞానాన్ని

ముడివేసుకుని, ఆ తర్వాత నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించు!" అని చెప్పారు. దీని అర్థమేమిటంటే, ఒక్కసారి భగవంతుణ్ణి పొందితే, ఆ తర్వాత నీ స్వభావం నిన్ను ఏ సిద్ధాంతాన్ని అనుసరించమని ఆదేశించినా ఫరవాలేదు. భగవంతుణ్ణి తెలుసుకుంటే ముక్తి లభించినట్లే. అప్పుడిక నీకు బంధముండదు. చనిపోయిన తర్వాత మరో జన్మ ఎత్తాలా, అక్కరలేదా అనే విషయం నీ ఇష్టం మీద ఆధారపడి ఉంటుంది.

నిర్వాణాన్ని (ముక్తిని) అన్వేషించేవాళ్ళు ఈ జగత్తును స్వప్నంగా పరిగణిస్తారు. వారి మనస్సులను నిర్గుణబ్రహ్మంలో లీనం చేసి, దానిలో ఏకమై పోతారు. సాకారుడైన భగవంతుని యందు అనురక్తులైన భక్తులు ఈ లోకాన్నీ భగవంతుని వైభవం యొక్క వ్యక్తీకరణగా భావిస్తారు. అఖండ సచ్చిదానందమైన భగవంతునిపట్ల వాళ్ళు అనురాగాన్ని కలిగి ఉంటారు. మళ్ళీమళ్ళీ జన్మలెత్తడానికి వాళ్ళు వెనుకంజ వేయరు. భగవంతుని క్రీడలో తాము చెలికాళ్ళమని భావించి ఆయన దివ్యనాటకంలో పాల్గొనడానికి వారు ఈ లోకంలోకి వస్తారు. వారు ఆత్మలోని ఆనందాన్ని పొందుతూ ఉండి, అదే సమయంలో భగవంతుని యందు భక్తి కలిగి ఉంటారు. ఈ లోకంలో వారు దేనినీ వాంఛించరు. నిర్వాణాన్ని ఇస్తానన్నా వారు దానిని నిరాకరిస్తారు. నేటికి ఇంత మాత్రం చాలు.

తురీయానంద

(116)

వారణాసి

11 జూన్, 1919

ప్రియమైన ఎక్స్.,

నీవు జ్యేష్ఠ మాసం 21న (జూన్, 1919) వ్రాసిన ఉత్తరం అందింది. చాలాసార్లు నీవు జ్ఞాపకానికి వస్తుంటావు. నీలో ఏమీ మార్పు వచ్చినట్టు లేదు. నీవు స్థిరపడడానికి ఎందుకు ప్రయత్నించవు? నీవు భగవంతుణ్ణి తలచకపోవచ్చు. ఆయనలో నమ్మకం లేకపోవచ్చు. కానీ, నిన్ను నీవు ప్రేమించ డానికి ఎందుకు ప్రయత్నించవు? ఎవరికైనా తమపై తమకు నమ్మకం లేకుండా ఉంటుందా? అటువంటప్పుడు నీకు నీవు మంచి చేసుకోవడానికి ఎందుకు ప్రయత్నం చెయ్యవు? చెత్తవిషయాలను గురించి ఎందుకు ఆలోచిస్తావు? అభివృద్ధి అనేది ఒకటి ఉందని నీవెందుకు తెలుసుకోవు? దాని కోసం నీవు ఎందుకు ప్రయత్నం చెయ్యవు? స్వప్రయత్నం ద్వారా మార్గాన్ని కనుక్కోలేకపోతే, ఇతరులు మన కోసం చేసే ప్రయత్నాలు నిరుపయోగం.

"నేను పాపిని, నేను పనికి మాలినవాణ్ణి" అని అనుకోమని నీకు ఎవరు సలహా ఇచ్చారు? ఈ మాంద్యస్థితి నుండి నిన్ను నీవు ఉద్ధరించుకో. నీ తలమీదనున్న పెద్దభారాన్ని దించడానికి మరొకడు సహాయం చెయ్యగలడు గానీ, ఇంకొకడు తినడం వల్ల నీ ఆకలి తీరదు. ఆకలి బాధ నుండి తప్పించుకోవాలంటే నీకు నీవే తినాలి. ఎప్పుడూ నిరుత్సాహపడవద్దు. ప్రయత్నం చేస్తే

జయాన్ని పొందుతావు. కేవలం విలపించడం ఏ ఫలితాన్నీ ఇవ్వదు. మంచి ఫలితాన్ని కలిగించడానికి బదులు అది అపకారం చేస్తుంది కూడా. మనస్సును ఏకాగ్రం చెయ్యడానికి ప్రయత్నించు. దానిని చెల్లాచెదరు కానివ్వవద్దు.

ప్రేమ, ఆశీర్వాదాలతో,

తురీయానంద

(117)

వారణాసి,

18 జూన్, 1919

ప్రియమైన రమేష్,

తేదీ వేయని నీ ఉత్తరం కొద్దిరోజుల క్రితం అందింది. అది కలకత్తా నుండి ఇక్కడికి తిరిగి బట్వాడా చెయ్యబడింది... మాతృదేవి చేత అనుగ్రహింపబడ్డావని తెలిసి ఆనందించాను. ఆమె అనుగ్రహంతో నీవు సమస్తాన్ని తెలుసుకోగలవు. నీ గురువు, నీ ఇష్టదైవం ఒకరేనని ఆమెయే నీకు తెలిసేటట్లు చేస్తుంది. గురువు ఇష్టదైవంగా సాక్షాత్కరిస్తాడు. అంటే ఇష్టదైవం గురువులో దర్శనమిస్తుంది. చైతన్య రూపంలో ఇరువురు ఒకటే – పారమార్థిక సాధన వల్ల ఈ విషయం నీకు వ్యక్తమవుతుంది. "గురువు బ్రహ్మ, గురువు విష్ణువు, గురువు మహేశ్వరుడు, గురువు సాక్షాత్తు పరబ్రహ్మ. కాబట్టి గురువుకు నమస్కారములు." గురుగీతలోని ఈ శ్లోకం ద్వారా పైన చెప్పినదాని యొక్క ప్రత్యేకమైన అర్థాన్ని నీవు తెలుసుకో గలుగుతావు. మాతృదేవి యందు పరిశుద్ధమైన భక్తిని వృద్ధిచేసుకోవడానికి ప్రయత్నించు. అప్పుడు నీ బంధాలన్నీ ఛేదింపబడతాయి.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(118)

వారణాసి

16 జులై, 1919

ప్రియమైన ఎక్స్.,

నీ సుదీర్ఘమైన ఉత్తరం ఈ ఉదయం అందింది. సాధనను ఆపివెయ్యడం వల్ల నీ మనస్సు గందరగోళంలో పడ్డట్టు కనిపిస్తున్నది. ఇంకా కొన్నాళ్ళు నీ సాధనను కొనసాగిస్తే నీకు కొంత శాంతి చిక్కేదే. కానీ, ఇప్పుడు పోయిందేమీ లేదు. సాధన మళ్ళీ ఉత్సాహంతోనూ, ఏకాగ్రచిత్తంతోనూ ప్రారంభిస్తే తప్పకుండా అది మంచిగా పరిణమిస్తుంది. ఒకసారి సాధనను వదిలిపెడితే – అందులోనూ సాంసారిక అనుభవాన్ని చవిచూసిన తర్వాత – మళ్ళీ దాన్ని

ప్రారంభించడం చాలా కష్టం. కానీ గురుదేవుల అనుగ్రహం వల్ల నీవు ప్రాపంచిక అనుభవాల బంధాలలో చిక్కుకున్నట్లు కనిపించడం లేదు.

జీవితమంతా శరీరం ఒకే రకంగా ఉండదు. వివేకం, వైరాగ్యం, సాధన మీద గాఢమైన ప్రేమ లేకపోతే భిక్షాటన మీద జీవించడం కష్టమనిపిస్తుంది: మనస్సు శారీరిక సౌఖ్యాల మీదికి పరుగులు తీస్తుంటుంది. అప్పుడు మనిషి మంచి ఆహారం కోసం అన్వేషించడం, భక్తుల్ని చేరదియ్యడం, ధనాన్ని కూడబెట్టడం లాంటి ఆలోచనలు చేస్తుంటాడు. ఆ విధంగా అతని సాధన మందగిస్తుంది. క్రమంగా చెల్లాచెదరైన అతని మనస్సు అతని ధ్యానాన్ని నాశనం చేస్తుంది. ఇటువంటి సమయంలో ఆత్మనిగ్రహం, వైరాగ్యం కలిగిన ఒక మహాపురుషుని సాంగత్యంలో ఉండడం ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తుంది.

ఏది ఏమైనా మళ్ళీ నీ సాధనను పూర్తి శక్తిసామర్థ్యాలతో ప్రారంభించి తీరాలి. భిక్షాటనం మీద జీవించడం కష్టమైతే అప్పుడప్పుడు నీ అంతట నీవు కొంత ఆహారాన్ని వంట చేసుకుని తిను. జబ్బున పడకుండా ఉండేట్లు ఆరోగ్య విషయం లో జాగ్రత్త తీసుకో. ఒక ఆశ్రమాన్ని ప్రారంభించడం చాలా కష్టం. నీవు వ్రాసి నట్లు కొంతమంది ఇతరుల కోసం అలా చేస్తున్నామంటారు కానీ, నిజంగా అది తమ కోసమే చేసుకుంటూ ఉంటారు. అందువల్ల సుఖానికి బదులు దుఃఖాన్నే అనుభవిస్తారు. మంచిచెడ్డలు ప్రతి దానిలోనూ ఉన్నాయి. చెడ్డ విషయాలను వదిలిపెట్టి మంచి విషయాలనే తీసుకుంటామని చెప్పడం సులభమే. కానీ చెయ్య డం కష్టం. ఈ విషయంలో ఏ ప్రణాళికలు వెయ్యకపోవడం చాలా మంచిది. భగవదిచ్ఛానుసారం సంభవిస్తే అది వేరే విషయం. అప్పుడు ప్రత్యేకమైన ప్రయత్నమేమీ చెయ్యకుండానే అన్ని పనులు సులభంగా జరిగిపోతాయి. పని ఎలా జరిగిపోయిందో అనే విషయం చేసేవాడికి కూడా తెలియదు. కాబట్టి, నీ ఆలోచనలన్నీ కట్టిపెట్టి భగవదారాధనలో నిమగ్నమైపోతే ఎంతో మంచిది.

నీవు ఎక్కడికైనా వెళ్ళదలిస్తే, సులభంగా భిక్ష లభించే ప్రశాంతమైన చోటు చూసుకో. ఏకాంతంగా నివసించు. వీటన్నిటి కంటే ముఖ్యం – విడవకుండా పారమార్థిక సాధనలలో నిమగ్నమై ఉండడానికి ప్రయత్నం చెయ్యి. సాధుసాంగత్యంలోను, భక్తి గ్రంథాధ్యయనంలోను కాలం గడుపు. కొన్ని దినాలు ఈ విధంగా చేస్తే భగవత్కరుణ వల్ల చిత్తశాంతిని పొందుతావు. మళ్ళీ సాధనలోని ఆనందాన్ని నీ మనస్సు చవిచూస్తుంది. ఎక్కువ కాలం ధ్యానం చెయ్యడం వల్ల అలసటగా ఉంటే కొంతసేపు మంత్రజపం చెయ్యి. జపం విసుగు కలిగిస్తే కొన్ని స్తోత్రాలు చదువుతూ, గీతాలు పాడుతూ ఉండు. ఏ పద్ధతిలోనైనా సరే మనస్సును భగవంతుని మీద ఉంచి కాలం గడుపు.

ధనం కూడబెట్టడం గురించిన ఆలోచనలలో మనస్సును ఎన్నడూ ఉంచవద్దు. ధనం అనేక అనర్థాలను కొనితెస్తుంది. మాయ రెండు విధాలు – ఒకటి కామం, రెండవది కాంచనం. ఈ రెంటికి దూరంగా ఉన్నప్పుడు ధ్యానం చక్కగా సాగుతుంది. కానీ, భగవంతుని కరుణవల్ల ఆత్మజ్ఞానం కలిగితే అప్పుడు భయముండదు. కానీ జ్ఞానం కలగడమనేది చిన్నవిషయమేమీ

కాదు. కష్టపడి పనిచెయ్యాలి. భగవంతుణ్ణి ఆరాధించు. మనస్సును మరి దేనిమీద ఉంచవద్దు. భగవంతుడు నీ మీద కరుణను వర్షించడం చూస్తావు. ప్రతిదీ నీకు సానుకూలమవుతుంది.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(119)

వారణాసి,

1 ఆగష్టు, 1919

ప్రియమైన ఎక్స్.,

నీవు వ్రాసిన జులై 3వ తేదీ, 28వ తేదీ ఉత్తరాలు రెండూ అందాయి... ఎప్పుడూ నిరాశ అనే పాడిన పాటనే ఎందుకు పాడుతుంటావు? ఇది ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. ఎంతోకాలంగా ఆ పని చేశావు. దాని వల్ల ఏమైనా ఫలితం కనిపించిందా? ఒకసారి ఈ పాత పాటను మార్చి, ఏమి జరుగుతుందో ఎందుకు చూడవు? భగవంతుని మీద, భూతదయ మీద, జీవితంలోని కర్తవ్యాలను దృఢనిశ్చయంతో నిర్వర్తించడం మీద, శాస్త్రవాక్యాల మీద, సాధువుల మీద విశ్వాసం కలిగి ఉండడానికి ఎందుకు ప్రయత్నించవు? నీకు పోయేదేదీ లేదు. కొంతకాలం ఈ జీవితవిధానాన్ని అనుసరించు. సంశయానికి, బలహీనతకు ఆశ్రయమిచ్చి అనవసరంగా నిన్ను నీవు ఎందుకు చిత్రవధ చేసుకుంటావు? అనుక్షణం నడిపించడానికి నీవేమీ పసిబిడ్డవు కావు. ఇక నీ అంతట నీవే అన్నీ చేసుకోవాలి. ఉత్సాహం, ధైర్యం, వీర్యం – ఇవన్నీ నీలోనే ఉన్నాయి. క్రమంగా ఆ లక్షణాలు మరింతగా వ్యక్తం అవుతూ నిన్ను ముందుకు నడిపిస్తాయి. ఇప్పుడు నడుం బిగించి గమ్యం వైపు నడువు. ఇంకా ఏమి చెప్పేది?

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(120)

వారణాసి,

8 డిసెంబరు, 1919

ప్రియమైన ఎక్స్.,

నీ ఉత్తరం నిన్న అందింది. నీ ఆరోగ్యం సరిగా లేదని తెలిసి విచారిస్తున్నాను. అనవసరంగా నీ మనస్సును ఎందుకు అశాంతికి గురి చేస్తున్నావు? బాధపడడం మంచిది కాదు. దానివల్ల లాభం కలగదు సరికదా, పని కూడా పాడైపోతుంది. ఆత్మవిశ్వాసంతో తన శక్తికొద్దీ శ్రమపడిన తర్వాత భగవంతుణ్ణి శరణువేడితే అది నిజమైన శరణాగతి అనిపించుకుంటుంది. లేకపోతే ఏమాత్రం శ్రమపడకుండా ఎవరైనా ఒట్టిమాటలతో భగవంతుణ్ణి శరణువేడితే, అతడు

సోమరితనానికి చోటిచ్చిన వాడవుతాడు. ఎవరు ఉత్సాహవంతులో, కార్యశూరులో వారు మాత్రమే భగవంతుని సహాయాన్ని పొందుతారు కానీ సోమరులు కాదు.

నీవు జపాన్ని అభ్యాసం చేస్తున్నావని తెలిసి సంతోషపడుతున్నాను. మహరాజ్ (బ్రహ్మానంద స్వామి) నుండి దాని విధానాన్ని తెలుసుకో. ప్రతి పనిని శ్రద్ధతో ఆచరించాలి. నీ సందేహాలకు స్వస్తి చెప్పు. ఏకాగ్రతతో చేసినదేదైనా మంచిదే. లేకపోతే యాంత్రికంగా పారమార్థిక సాధనలు కొనసాగిస్తే ఫలితమేమీ కనపడదు. స్థిరమైన భక్తి అవసరం. సమయాన్ని గురించి అంతగా శ్రద్ధ వహించవద్దు. అది అనవసరపు అలజడిని కలిగిస్తుంది. ముఖ్యమైన విషయమేమంటే మనస్సును భగవంతుని మీద నిలపడం. నీకు ప్రశ్నలేమైనా ఉంటే 'మహరాజ్'ను (బ్రహ్మానంద స్వామిని) అడుగు. సద్గురువు చేత నడపబడడం శ్రేయస్కరం.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(121)

వారణాసి,

15 జనవరి, 1920

ప్రియమైన ఎక్స్.,

నీవు జనవరి 13వ తేదీ వ్రాసిన ఉత్తరం అందింది. పరీక్ష కోసం నీవు కష్టపడి చదువుతున్నావని తెలిసి నాకు సంతోషంగా ఉంది. నీవు చేపట్టిన పనిని హృదయపూర్వకంగా నెరవేర్చు. అప్పుడది జయాన్ని కలిగిస్తుంది. ఇది నిజం.

భగవత్సాక్షాత్కారం కోసం నీ నిజాయితీని చూసి నాకెంతో ఆనందంగా ఉంది. 'భగవంతుడు లేడు' అని ఎవరైనా ధైర్యంగా చెప్పవచ్చు – అంత మాత్రాన భగవంతుడు లేకుండా పోడు. ఆయన ఎప్పుడూ ఉంటున్నట్టే ఉన్నాడు. కానీ, ఆయన లేడనడం వల్ల నమ్మకం లేనివాడి మనస్సు మరింత అంధకారబంధుర మవుతుంది. కఠోపనిషత్తు ఇలా చెపుతోంది: "మొదట భగవంతుణ్ణి ఉపాధులచే పరిమితమైన సత్యంగా (సత్‌గా) సాక్షాత్కరించుకోవాలి. తర్వాత పరిమితులకు అతీతమైన ఆయన భావాతీత స్వభావాన్ని సాక్షాత్కరించుకోవాలి. ఈ రెండవ సాధన సాధకుడికి తన నిజస్వభావాన్ని దర్శింపజేస్తుంది" (కఠోపనిషత్తు, 2.3.13).

ప్రతి వస్తువు యొక్క ఉనికియే భగవంతుడు. సత్యం (సత్), అసత్యం (అసత్) కానేరదు. గీత ఇలా చెపుతోంది: "అసత్, సత్ కాదు. అలాగే సత్ ఎన్నటికీ అసత్ కాదు" (గీత: 2:16). ఇది సత్యసందేశం. మనిషి భగవంతుణ్ణి సాక్షాత్కరించు కోలేకపోవడానికి కారణమేమీ లేదు. తీవ్రమైన ఆవేదన, సరైన రీతిలో ప్రయత్నించడం, పట్టుదల, సద్గురువు ఉంటే మనిషి భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోగలడు. "ఎవడు కోరుతాడో వాడే పొందుతాడు", "అడుగుము, ఇవ్వబడును" (మత్తయి సువార్త, 7.7).

నీకు ఎంత స్థైర్యం, కార్యశక్తి ఉన్నాయో పరీక్షించడానికి నిన్ను పరీక్షలో ఉత్తీర్ణత పొందమని చెప్పాను. “చిన్నపనులందె మానవుడెన్నబడును.” ఒకరి గొప్పతనాన్ని వాళ్ళు చిన్న, చిన్న పనులను ఎలా చేస్తారో గమనించడం ద్వారా పరీక్షించవచ్చు. గాలి ఎలా వీస్తున్నదో గడ్డిపరకకు బాగా తెలుస్తుంది. ఈ రోజుకు ఇంత మాత్రం చాలు.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(122)

వారణాసి,

16 జనవరి, 1920

ప్రియమైన రమేష్,

నీవు జనవరి 12వ తేదీన వ్రాసిన ఉత్తరం నిన్న అందింది... ఈ ఉత్తరాన్ని నాకు కాకుండా, ‘శ్రీరామకృష్ణ లీలా ప్రసంగ’ గ్రంథకర్త అయిన శారదానంద స్వామికి వ్రాసి ఉండవలసింది. ఈ గ్రంథానికి సంబంధించిన నీ ప్రశ్నకు ఆయన స్పష్టంగా సమాధానం వ్రాసి ఉండేవారు. అయినా, నా శక్తి వంచన లేకుండా వివరించడానికి ప్రయత్నిస్తాను.

తనకు ముక్తి లేదని శ్రీరామకృష్ణులు చెపుతూ ఉండేవారు. ఈ విషయాన్ని ఆయన నోటిద్వారా నేను విన్నాను. ఇక్కడ ముక్తి అంటే ‘నిర్వాణముక్తి’ అని అర్థం. అంటే ఈ ముక్తిని పొందిన తర్వాత మనిషి ఈ లోకంలో తిరిగి జన్మించ నక్కరలేదు. జీవకోటికి చెందినవారు (సామాన్యజీవులు) సాంసారిక బాధలతో కొట్టుమిట్టాడి మళ్ళీ జన్మ ఎత్తడానికి ఇష్టపడరు. ఈ బాధల నుండి ఎప్పటికీ తప్పించుకోవాలని చూస్తారు. అందువల్ల వారు ముక్తి కోసం పాటుపడతారు. నిర్వాణమంటే – ‘నిర్’ అంటే లేదు అని, ‘వాణ’ అంటే శరీరం అని అర్థం. కాబట్టి నిర్వాణముక్తి అంటే ఆ వ్యక్తి మళ్ళీ శరీరాన్ని ధరించడు – అని అర్థం.

ఈ లోకంలోకి మళ్ళీ మళ్ళీ అవతరించవలసిన వాడికి, లోకానికి మేలు చెయ్యాలనే కనికరం గలవాడికి పూర్తి నిర్వాణం ఎలా సాధ్యం? అందువల్లనే శ్రీరామకృష్ణులు వివేకానంద స్వామితో, “ఎవరు రాముడో, ఎవరు కృష్ణుడో అతడే ఈ శరీరంలో శ్రీరామకృష్ణుడుగా అవతరించాడు. కానీ నీ వేదాంత దృష్టిలో కాదు సుమా!” అని చెప్పారు. ఇక్కడ నొక్కి చెప్పిన విషయమేమంటే, అద్వైత వేదాంతం ప్రకారం జీవుడు, బ్రహ్మం ఏకమే. కొందరు దీన్నిబట్టి ప్రతీవారూ రామునితోను, కృష్ణునితోను సమానమేనని, రాముడికి, కృష్ణుడికి ప్రత్యేకమైన లక్షణాలు లేవని అర్థం చేసుకుంటారు. “ఎవరు రాముడో, ఎవరు కృష్ణుడో వాడే ఈ శరీరంలో శ్రీరామకృష్ణుడు,” అనే వాక్యాన్ని వివేకానంద స్వామి అపార్థం చేసుకుంటారేమోనని, శ్రీరామకృష్ణులు, “నీ వేదాంతదృష్టిలో కాదు సుమా!” అనే మాటలతో దానికి వివరణ ఇచ్చారు. అంటే శ్రీరామకృష్ణుల చైతన్యం, ఈశ్వర చైతన్యమే గాని జీవచైతన్యం కాదు. అద్వైత వేదాంత ప్రకారం జీవుడు సమాధి నిచ్చే పారమార్థిక సాధనలు చేసిన తర్వాత మాత్రమే తన

అజ్ఞానాన్ని పోగొట్టు కుని, తానూ, బ్రహ్మం ఏకమే అనే జ్ఞానాన్ని పొందగలడు. కానీ, తోచిన ప్రయత్నాలన్నింటినీ చేసినా సరే, జీవుడు ఎన్నటికీ ఈశ్వరుడు కాడు. ఎవరు ఈశ్వరుడో అతడు శాశ్వతంగా ఈశ్వరుడే. శరీరాన్ని ధరించి, జీవునిలాగా కనిపించినా, అతడు ఈశ్వరుడుగానే కొనసాగుతాడు కానీ జీవుడు కాడు.

గీతలో కృష్ణుడు చెప్పినట్లు: “ఓ అర్జునా! నాకు అనేక జన్మలు గడిచాయి. నీకు కూడా గడిచాయి. నేను వాటిని ఎరుగుదును. నీవు ఎరుగవు. నేను జన్మలేనివాణ్ణయినా, శాశ్వతుణ్ణయినా, జీవులకు ఈశ్వరుణ్ణయినా, నా ద్వారా సృష్టించబడిన ఈ ప్రకృతిని నా వశమందుంచుకుని నా మాయ ద్వారా జన్మనెత్తుతున్నాను” (గీత: 4:5–6). ఇదే విధంగా గురుదేవులు కూడా, “నీ వేదాంత దృష్టిలో కాదు సుమా” అని చెప్పారు. శ్రీకృష్ణుడు చెప్పిన దానినే ఆయన కూడా చెప్పారు...

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(123)

వారణాసి,

13 ఫిబ్రవరి, 1920

ప్రియమైన ఎస్.,

నీవు డిసెంబరు 18వ తేదీన వ్రాసిన ఉత్తరం అంది సంతోషం కలిగింది... నీ ప్రశ్నలను స్పష్టంగా గ్రహించలేకపోయాను. అయినా, నాకర్థమైనంత వరకు వాటికి సమాధానమివ్వడానికి ప్రయత్నిస్తాను.

వేదాంతం మూడు సిద్ధాంతాలలో ప్రతిపాదింపబడుతున్నది – అవి ద్వైత, విశిష్టాద్వైత, అద్వైత సిద్ధాంతాలు. ద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతాల ప్రకారం ఈ జగత్తు మిథ్యగా భావించబడడం లేదు; సత్యంగా భావించబడుతోంది. మరో రకంగా చెపితే ప్రకృతి (జగత్తు), జీవుడు (వ్యక్తిగత ఆత్మ), భగవంతుడు – ఈ మూడు నిత్యం, సత్యం. కానీ జగత్తు, వ్యక్తిగతజీవులు కొన్నిసార్లు వ్యక్తంగాను, మిగిలిన సమయాలలో అవ్యక్తంగాను ఉంటాయి. కానీ అవి పూర్తిగా అసత్యం కాదు. ఈ సిద్ధాంతాల ప్రకారం ముక్తి అనేక విధాలుగా ఉంది. ఉదాహరణకు, సాయుజ్య (భగవంతునితో కలసి), సామీప్య (భగవంతుని సమీపాన) మొదలైనవి. ఈ సిద్ధాంతాలలో నిర్వాణముక్తి అనేది (బ్రహ్మంలో లీనమవ్వడం లేదా జన్మరాహిత్యం) లేదు. అలా చెప్పే బదులు ఈ సిద్ధాంతాలను అనుసరించే వారు నిర్వాణాన్ని ఆకాంక్షించరని చెప్పడం సమంజసంగా ఉంటుంది.

ఈ జగత్తు దుఃఖభూయిష్టమని ద్వైతులు, విశిష్టాద్వైతులు అంగీకరిస్తారు. కానీ దైవానుగ్రహం వల్ల అది ఆనందదాయకమవుతుందంటారు. మరోవైపు అద్వైతులకు ఈ జగత్తు దుఃఖభూయిష్టమని తెలుసు. కాబట్టి నిర్వాణాన్ని పొందే ఉద్దేశ్యంతో, ఈ లోకంలోని

బంధాలనన్నింటినీ తెంచుకుని, వారు శాశ్వతమైన ముక్తిని ఆశిస్తారు. వారు అద్వైత జ్ఞానాన్ని అనుభవిస్తూ ఈ లోకంలో ఉండి మరణానంతరం ఈ లోకాన్ని శాశ్వతంగా వదలివేసి బ్రహ్మంలో ఐక్యమవుతారు. వారి అభిప్రాయంలో ఈ లోకం అనిత్యం. ఈ ముక్తపురుషులను గురించి ఛాందోగ్యోపనిషత్తు ఇలా చెపుతున్నది: “అతడు మరల తిరిగి రాడు” (8.15.1). అద్వైతజ్ఞానాన్ని పొందడాన్ని గురించి మన గురుదేవులు అభేదానంద స్వామికి అలాంటి బోధన ఒకసారి చేశారు.

మరొక ప్రక్క ఈ విషయాన్ని గురించి కృష్ణుడు అర్జునుడికి గీతలో ఏమి చెప్పాడో, ఉద్ధవుడికి భాగవతంలో ఏమి చెప్పాడో, అధ్యయనం చేస్తే మరింత స్పష్టంగా అర్థమవుతుంది. గీతలో కృష్ణుడు తనను గురించి ఇలా చెప్పాడు. “అన్ని వేదాల ద్వారా తెలుసుకోవలసినవాణ్ణి నేనొక్కణ్ణే. వేదాంతానికి కర్తను నేనే. వేదాలు తెలిసినవాణ్ణి కూడా నేనే” (గీత: 15:15).

భాగవతంలో కృష్ణుడు ఇలా చెప్పాడు.

“మానవుల పారమార్థిక వికాసానికై నేను మూడు రకాలైన యోగాలను ప్రతిపాదించాను. ఇవి జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం, (జ్ఞానమార్గం, కర్మమార్గం, భక్తిమార్గం.) ఈ మూడు యోగాలు తప్ప మరో మార్గం లేదు. కర్మలను చాలాకాలం ఆచరించి చివరకు వాటి యందు విరక్తి కలిగి, ఆ విరక్తి ఫలితంగా కర్మలను సన్న్యసించిన వారికి జ్ఞానమార్గం. కోరికలను కలిగివుండి, కర్మల మీద, కర్మఫలం మీద ఇంకా విరక్తి కలగకుండా ఉన్నవారికి కర్మమార్గం.¯అదృష్టవశాత్తూ నా దివ్యజీవితం మీద, నా సందేశం మీద కొంత విశ్వాసం కలిగి, తీవ్రమైన వైరాగ్యం గానీ, సంసారం నందు అత్యంతమైన మమకారం గానీ లేనివారికి భక్తిమార్గం అత్యంత ప్రయోజనకారి” (భాగవతం 11.20.6-8).

ఈ శాస్త్రభాగాలను గమనిస్తే, ఎవరి మనస్సులు ఇంద్రియ విషయాల నుండి నిగ్రహించ బడ్డాయో, వారికి జ్ఞానయోగం ఉద్దేశింపబడిందని మనకు అర్థమవుతున్నది. దాని ఫలితాలు – లోకాన్ని త్యాగం చెయ్యడం, జన్మరాహిత్యం, నిర్వాణప్రాప్తి. ఈ అద్వైత సిద్ధాంతం ప్రకారం “బ్రహ్మం ఒక్కటే సత్యం, జగత్తు మిథ్య.” కానీ ఇంకా ప్రపంచం మీద మమకారమున్నవారు ఈ జగత్తు అనిత్యమని ఎలా చెప్పగలరు? వారు ఈ లోకాన్ని భగవంతుని యొక్క దివ్యలీలగా భావిస్తారు. కాబట్టి వారు దీనిని అసత్యమని చెప్పరు. వారు దీని అవిద్యాలక్షణాన్ని (అజ్ఞాన లక్షణాన్ని) వదలిపెట్టి, విద్యాలక్షణాన్ని (జ్ఞాన లక్షణాన్ని) అంగీకరిస్తారు. నిర్వాణాన్ని పొందడానికి ప్రయత్నించరు. ఇదే సాధారణంగా కనిపించే నియమం.

కానీ కొన్ని ప్రత్యేక నియమాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు జ్ఞానాన్ని పొంది, నిర్వాణాన్ని పొందడానికి అర్హులైనప్పటికీ కొందరు నిర్వాణాన్ని అంగీకరించరు. కావాలని వారు అహేతుకమైన దివ్యప్రేమతో మానవజన్మను ఎత్తుతారు. వారిని భాగవతంలో ఈ విధంగా వర్ణించారు: “బంధవిముక్తులై, ఆత్మారాములైన మునులు అహేతుకమైన భక్తితో ఆ పరమపురుషుణ్ణి ప్రేమిస్తారు” (భాగవతం, 1.7.10). ప్రాపంచిక జీవితం మీద వారికి అభిలాష ఉండదు. భగవంతుని దివ్యలీలల్లో వారు సహచరులు. వివేకానంద స్వామి తమ

ఉపన్యాసాలలో అనేకసార్లు ఈ రకమైన జీవన్ముక్తులను గురించి ఉదహరించారు. మానవ కళ్యాణం కోసం, తన ముక్తిని కూడా త్యాగం చేసి, మళ్ళీమళ్ళీ జన్మనెత్తాలని తన ఆతురతను వ్యక్తపరిచారు.

జీవితంలో ముక్తి పొందడాన్ని గురించి గురుదేవులు అనేక ఉదాహరణ లిచ్చారు. "దాగుడుమూతలాటలో తల్లిని తాకావంటే నీవు పండిపోతావు." "స్తంభాన్ని పట్టుకుని గిరగిర తిరిగినా నీవు పడిపోవు." "పరుసవేదిని తాకి బంగారంగా మారిపో." "పాలను చిలికి, వెన్న తీసి, ఆ తర్వాత ఆ వెన్నముద్దను నీళ్ళలో పెడితే అది పైకి తేలుతుంది." జీవన్ముక్తిని పొందిన తర్వాత భక్తుడు ఆర్తితో ఇలా ప్రార్థిస్తాడు: "ఓ కృష్ణా! నేను కీటకాలలోను, పక్షులలోను, జంతువు లలోను, పాములలోను, భూతాలలోను, పిశాచాలలోను ఏ విధంగా జన్మించినా, నీ అపార కృపాకటాక్షం వల్ల నీ యందు నాకు అచంచలమైన భక్తి కలుగుగాక!" (ప్రపన్న గీత).

వీటన్నింటి యొక్క తుది విశ్లేషణలో తెలిసేదేమంటే ప్రతివారూ అవిద్యను (అజ్ఞానాన్ని) వదిలి పెట్టాలి. అజ్ఞానం నుండి తయారైన ఈ లోకం శాశ్వతంగా ఉండదు. నీ ఉత్తరంలో అజ్ఞానం, తప్పులు పట్టడం మొదలైన ఇతర విషయాల గురించి ఉదహరించావు. ఇవి మానవస్వభావంలో పుట్టుకతో వచ్చినవి. అందరికీ అనుభవమైనవే కూడా. వీటినే అవిద్య అంటారు. అవిద్య ఉన్నంతవరకు మనిషి జ్ఞానాన్ని, భక్తిని పొందలేడు. అటువంటివాడు ఒక్కసారిగా ఈ జగత్తును బ్రహ్మం యొక్క ఆవిర్భావంగా మనిషి తెలుసుకోగలడా? 'ఈ సర్వం బ్రహ్మమే' (ఛాందోగ్యోపనిషత్తు, 3.14.1) అని సాక్షాత్కరించుకోదలిస్తే ప్రపంచాన్ని గురించిన భావననే నీవు వదిలి వెయ్యాలి. త్యాగం లేకుండా జ్ఞానం గానీ, భక్తి గానీ మనస్సులో ఉదయించవు. త్యాగం ద్వారా మొదట జ్ఞానాన్ని గానీ, భక్తిని గానీ మనిషి పొందాలి. తర్వాత మరల జన్మనెత్తాలా లేకపోతే నిర్వాణాన్ని పొందాలా అనే స్వాతంత్ర్యం అతని ఇష్టం. అయినప్పటికి నిర్వాణం పొందాలనుకోవడం కంటే మానవకళ్యాణం కోసం భగవంతుని చెలికానిగా జన్మించడమే ఉత్తమం. నిస్సందేహంగా ఇది గురుదేవుల, వివేకానందుల అభిప్రాయం.

వేరే అభిప్రాయాలు: నీవు ఈ లోకంలో దేనినీ వదిలిపెట్టనక్కరలేదు; నీ హృదయం సంతృప్తి పడేలాగ అన్నింటినీ అనుభవించు; సర్వత్రా బ్రహ్మాన్ని దర్శించు; బ్రహ్మజ్ఞానాన్ని పొందడం సులభం – ఇటువంటి వాక్యాలు వినడానికి మధురంగాను, మనోహరంగాను ఉన్నా అవి అంగీకరించదగినవి కావు. ఎందుకంటే శాస్త్రాలకు, తర్కానికి, మహాపురుషుల అనుభవాలకు అవి విరుద్ధంగా ఉన్నాయి.

ఈ లోకం యథార్థమైనదని ఒకసారి గురుదేవుల ముందు ఎవరో వాదిస్తుండగా నేను విన్నాను. అతడు చెప్పినదంతా విన్న తర్వాత గురుదేవులు ఇలా చెప్పారు: "రామ్! నీకు ఇంకా పుల్లకూరను తిని, (అనిత్యమైన ప్రాపంచిక భోగాలను) అనుభవించాలనే కోరిక ఉందని మామూలు మాటలలో ఎందుకు చెప్పవు? ఈ వ్యర్థవాదానికి అవసరమేముంది?" ఇంతకంటే బలవత్తరమైన, ఖండించడానికి వీలులేని సమాధానం ఎక్కడ ఉంటుంది? సత్యమేమిటంటే,

మమకారాలున్నవాడు ఈ సంసారాన్ని సన్న్యసించడానికి భయపడతాడు. ఈ స్వభావాన్ని దాచిపెట్టి ఉంచడానికి, మమకారాల్ని విడిచిపెట్టకుండానే భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోగలమని ఊహించుకోవడం, మనిషిలో ఉన్న స్వాభావిక బలహీనతను సూచిస్తున్నది.

ఈ సంసారవృక్షం యొక్క ఉనికిని గురించి గీత ఇలా చెపుతున్నది. "గట్టిగా వేళ్ళు పాతుకుపోయిన అశ్వత్థవృక్షాన్ని వైరాగ్యమనే గండ్రగొడ్డలి చేత నరికి, ఆ గమ్యాన్ని అన్వేషించాలి" (గీత: 15:3-4). శ్రీకృష్ణుని ఈ బోధను ఏ విధంగానూ ఖండించలేం. వారికున్న మమకారం వల్ల వైరాగ్యాన్ని గురించిన శాస్త్రబోధను తిరస్కరించి, సాంసారిక జీవితమే గమ్యమని తలపోసి, లోపరహితమైన ఆ వేదాల నిర్ణయమైన త్యాగం అనవసరమని ప్రకటించేవారి వాదం సాహసమే కావచ్చు గాని ఎంతమాత్రం హేతుబద్ధం కాదు. భవిష్యత్తులో అవకాశముంటే ఈ విషయాన్ని మళ్ళీ చర్చించడానికి ప్రయత్నిస్తాను. ఈ రోజుకిది చాలు.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(124)

(ఈ అమూల్యమైన ఉత్తరాన్ని తురీయానంద స్వామి చెప్పగా వారి సహాయకుడు శ్రీ ధ్రువేశ్వరానంద స్వామి వ్రాశారు).

వారణాసి
2 మార్చి, 1920

ప్రియమైన ఖ. మహరాజ్,

మీరు ఫిబ్రవరి 17వ తేదీన వ్రాసిన ఉత్తరం తురీయానందజీ మహరాజ్‌వారికి అందింది. మీ ఉత్తరంలోని ప్రశ్నలు విని, వారు నాకు చెప్పినదాని ప్రకారం నేను వ్రాస్తున్నాను.

జ్ఞానం రెండు విధాలు. స్వసంవేద్యం (తనకుగా తెలిసిన జ్ఞానం); పరసం వేద్యం (ఇతరుల వల్ల తెలిసిన జ్ఞానం). స్వసంవేద్యం - తన సొంత అనుభవం ద్వారా తెలుసుకున్న జ్ఞానం - ఇదే అసలైనది. జ్ఞానోదయం పొందిన మహాపురుషుల లక్షణాలతో పోల్చిచూసి నిస్సందేహంగా ఆ జ్ఞానాన్ని నిరూపించ వచ్చు. ఈ జ్ఞానాన్ని శాస్త్రాలలో ఇవ్వబడిన వివరాలతో కూడా సరిచూడవచ్చు. అటువంటి మహాపురుషుని జీవనవిధానం మామూలుగా చూసే దానికి విరుద్ధంగా కనిపించినా, బ్రహ్మంలో స్థిరంగా నెలకొని ఉన్నందువల్ల ఆయన ఏకత్వభావన ఎప్పటికీ మార్పు చెందదు. పరసంవేద్యజ్ఞానం - శాస్త్రాధ్యయనం వల్ల, ఇతర కారణాలవల్ల కలిగిన జ్ఞానం - ఇది ఇతర లక్షణాల మీద ఆధార పడింది. పరోక్షంగా సంపాదించిన ఈ జ్ఞానం స్వయంగా సాక్షాత్కరించుకున్న జ్ఞానం కాదు కాబట్టి, అటువంటి వ్యక్తి ఆత్మజ్ఞానాన్ని, జీవన్ముక్తిని సరిగ్గా తెలుసుకోలేడు.

యవ్వనదశ రానిదే చిన్నపిల్లలకు ఇంద్రియసుఖానుభవాన్ని విశదీకరించ లేనట్లు, పారమార్థిక సాధకుడు పరిణామక్రమంలో (అంచెలంచెలుగా) వికాసం కలగడం ద్వారా సత్యాన్ని సాక్షాత్కరించుకుంటాడు. శాస్త్రవాక్యాల మీద, గురుబోధనల మీద శ్రద్ధ కలిగిన సాధకుడు సాధన కొనసాగిస్తున్న కొద్దీ, కాలక్రమేణా బ్రహ్మజ్ఞానం అతని హృదయంలో ఉదయిస్తుంది.

ఈ సందర్భంలో వేదాంతసాంప్రదాయంలో చెప్పిన ఒక కథ ఉంది. వివాహమైన తర్వాత ఒక యువతి తన భర్త దగ్గర కొంతకాలం ఉండి, పుట్టింటికి తిరిగి వచ్చింది. అప్పుడు పెళ్ళికాని కన్యలైన ఆమె స్నేహితురాండ్రు, "నీ భర్త దగ్గర నుండి నువ్వు ఎంత ఆనందాన్ని పొందావో చెప్పు," అని అడిగారు. "ఎంతో సుఖాన్ని పొందాను," అని ఆమె సమాధానమిచ్చింది. కానీ ఆమె స్నేహితురాండ్రు దాన్ని అర్థం చేసుకోలేకపోయారు. ఇంతలో కొత్తగా వివాహమైన మరో యువతి అక్కడకు వచ్చింది. ఈ కన్యలు వేస్తున్న ప్రశ్నలు విని తాను పొందిన సుఖం తెలుసు కాబట్టి, ఆమె చిరునవ్వు నవ్వింది. కానీ ఆ ఇతర కన్యలకు అది అర్థం కాలేదు. అదే విధంగా జీవన్ముక్తిని పొందినవారు మాత్రమే జీవన్ముక్తి అంటే ఏమిటో సరిగా అర్థం చేసుకోగలుగుతారు. ఇక ఇతరులు దానిని ఊహించు కుంటూ ఉంటారు. వాళ్ళ సందేహం ఎన్నటికీ తొలగదు.

జీవించి ఉండగానే బ్రహ్మైక్యజ్ఞానాన్ని పొందిన వారిని జీవన్ముక్తులని, బ్రహ్మవేత్తలని అంటారు. వారు భూత, భవిష్యత్, వర్తమానాలచేత బద్ధులు కారు. ప్రారబ్ధం (పూర్వం చేసిన కర్మల ఫలం) వల్ల, జీవన్ముక్తుడు ఈ దేహంలో ఉండి శరీరానుభవాలను పొందుతూ ఉంటాడు. అంటే మంచిచెడ్డల సంపర్కం వల్ల సుఖంగా, దుఃఖంగా ఉన్నట్లు చూపరులకు అతడు కనిపించవచ్చు; కానీ, తన సమచిత్తత్వాన్ని (సుఖదుఃఖాది ద్వంద్వాల యందు సమంగా ఉండడాన్ని) ఎన్నటికీ కోల్పోడు. ఎందుకంటే అతనికి తన నిజస్వభావజ్ఞానం (తాను బ్రహ్మపదార్థాన్ననీ, ద్వంద్వాలకు అతీతుణ్ణనీ గుర్తెరిగిన జ్ఞానం) ఉంది. కృష్ణుడు ఈ స్థితిని గీతలో స్థితప్రజ్ఞుని లక్షణాలు చెప్పడం ద్వారా నిరూపించాడు. "సుఖాన్ని ఆశించడు, దుఃఖం వల్ల కృంగడు" (గీత: 2:56). ఈ శ్లోకం, ఇతర శ్లోకాలు సమాధిస్థితుడైన స్థితప్రజ్ఞుని లక్షణాలను తెలుపుతాయి...

జ్ఞానోదయం కలిగిన మహాపురుషునికి నిత్యానిత్యాల యొక్క విస్పష్టమైన జ్ఞానముంటుంది. అందువల్ల అతని మనస్సు అనిత్య విషయాలలో ఎన్నటికీ తాదాత్మ్యం చెందదు. ఇక సామాన్య మానవుడు, నేను, నాది అంటూ అనిత్య వస్తువిషయాలతో తాదాత్మ్యం చెందుతాడు. ఈ అజ్ఞానం వల్ల ఎడతెగని బాధలు అనుభవిస్తాడు.

అజ్ఞానమే బంధం, జ్ఞానమే విముక్తి, ఈ యోగజ్ఞానదర్శనమైన వాడు జీవన్ముక్తుడు (శరీరంతో జీవించి ఉండగానే ముక్తి పొందినవాడు) అవుతాడు. అతని పరిణామవికాసాన్ని బట్టి పారమార్థిక అన్వేషణకు యోగవాశిష్ఠ రామాయ ణంలో ఏడు స్థితులు వర్ణింపబడ్డాయి. మొదటి మూడు స్థితులను తపోభూమి అంటారు. నాలుగు నుండి ఏడు వరకు గల స్థితులను

జ్ఞానభూమి అంటారు. జీవన్ముక్తస్థితి నాలుగో భూమిక నుండి ప్రారంభమవుతుంది. ఆ స్థితిని స్వప్నస్థితి (స్వప్న భూమిక) అని కూడా అంటారు. అక్కడ ఈ ప్రపంచం అసత్యమని పిస్తుంది. కానీ మనస్సు ఇంకా పూర్తిగా ప్రశాంత స్థితిని పొందలేదు. ఐదవ స్థితిని (భూమికని) సుషుప్త స్థితి (కలలు లేని స్థితి) అంటారు. ఈ స్థితిలో మనస్సులో ఆలోచనాతరంగాలు ఉండవు. మనస్సు పూర్తి విశ్రాంతిని పొందు తుంది. సమాధిస్థితి నుండి తనంతట తానే మేల్కొన గలుగుతుంది. ఆరవ స్థితి తీవ్రతరమైన ఐదవ స్థితి. దీనిని గాఢసుషుప్తస్థితి (గాఢమైన, కలలు లేని నిద్ర) అని కూడా అంటారు. ఈ స్థితిలో యోగి ఇతరుల సహాయం లేకుండా సమాధి నుండి మేల్కొనలేడు. ఏడవస్థితిని (సప్తమ భూమిక) 'తురీయం' అంటారు. ఇది సర్వోత్కృష్టమైన, భావాతీతస్థితి. ఈ స్థితి నుండి యోగి ఇతరులు సహాయం చేసినప్పటికీ సమాధిస్థితి నుండి మేల్కొనలేడు. అతడు 'ఆనందబ్రహ్మం'లో లీనమై ఉంటాడు. ప్రారబ్ధం కొనసాగుతున్నంత వరకు అతని శరీరం నిలిచి ఉంటుంది. సామాన్యుడైన యోగి ఈ స్థితి నుండి తిరిగి వెనుకకు రాలేడు. కానీ అవతార పురుషుల వంటి మహానుభావులు లోకకళ్యాణం కోసం, భగవంతుని కరుణవల్ల, 'నేను, నాది', అనే స్థితిలోకి మళ్ళీ తిరిగి వస్తారు. గురుదేవులు ఇలా చెప్పేవారు: "మహాపురుషుడు క్రింది స్థితుల నుండి ఏడవ స్థితికి (సప్తమ భూమికకు), పైకి క్రిందికి, పోతూ వస్తూ ఉండగలడు. 'నేను భక్తుణ్ణి, నేను జ్ఞానిని' మొదలైన మంచి కోరికలను ఊతంగా పట్టుకుని ఈ లోకంలో జీవిస్తాడు."

అప్యాయతతో,

ధ్రువేశ్వరానంద

(125)

వారణాసి,

10 ఏప్రిల్, 1920

ప్రియమైన నిర్మల్ (స్వామి మాధవానంద),

నీవు ఏప్రిల్ 7వ తేదీన వ్రాసిన జాబు అందింది... ఈ మనిషి గాని, ఆ మనిషి గాని దీనికి కారణం కాదు. దీనికంతకు మూలం భగవంతుడే. సర్వం ఆయన నుండే బయటికి ప్రవహించింది. "ఎవరి నుండి ఈ ఎడతెగని పనిచేసే చురుకుతనం బయటికి ప్రవహించిందో," ఆయనను ఎన్నడూ మరచిపోవద్దు (గీత: 15:4). నీ మనస్సును దేవుని మీద లగ్నం చెయ్యి. ఆయన సంతుష్టుడైతే, ఎటువంటి ఆందోళనలు గానీ, మరొకరి కోపతాపాల వల్ల భయం గానీ ఇక ఎంత మాత్రం ఉండవు. బాహ్యమైన కారణాలను పట్టించుకోవద్దు. ప్రతిదానిని నీలోనే చూడడం అభ్యాసం చెయ్యి. "నీ ప్రియుడు నీలోనే ఉన్నాడు, నీ విరోధి నీలోనే ఉన్నాడు" (హిందీ సామెత). "తనకు తానే మిత్రుడు, తనకు తానే శత్రువు" (గీత: 6:5). "ఈ సర్వం ఆత్మయే" (ఛాందోగ్యోపనిషత్తు 7.25.2). "ఆత్మలో భిన్నత్వం లేదు" (బృహదారణ్యకోపనిషత్తు 4.4.19). శాస్త్రాలలోని ఈ బోధలు చదివితే

సరిపోదు. వాటిని నీ అంతట నీవు అనుభవంలోకి తెచ్చుకోవాలి. ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ కాదు...

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(126)

రామకృష్ణ మిషన్, వారణాసి,

15 ఏప్రిల్, 1920

ప్రియమైన బాషీ (బాషీశ్వర సేన్),

నీవు ఏప్రిల్ 11వ తేదీన వ్రాసిన ఉత్తరం చేరింది. నేను వ్రాసిన క్రిందటి ఉత్తరంలో, "ఈ లోకంలో మనం సాక్షీమాత్రులుగా ఉండాలి," అని వ్రాశానని నీవు ఉదహరించావు. అది ముమ్మాటికీ సత్యమే. నీ ఒక్కడికే కాక అది మనందరికీ వర్తిస్తుంది. ఈ లోకంలో మనం సాక్షీమాత్రులుగా ఉంటే ఆనందాన్నీ, వినోదాలనూ అనుభవించవచ్చు; లేకపోతే లేదు. కానీ మనం చేసే ప్రతికార్యంలోను సాక్షిగా ఉండడం చాలా కష్టం. మన కార్యకలాపాలతో మనం తాదాత్మ్యం చెందుతాం. దానివల్ల మనం సుఖదుఃఖాలను అనుభవిస్తాం. దివ్యజనని ఎల్లప్పుడూ మనల్ని తనకు అతి దగ్గరగా ఉంచుకోవాలనీ, ఆమె నుండి మనం పారిపోయి ఈ మాయాజాలంలో చిక్కుపడకుండా చూడాలనీ నా ప్రార్థన! ఆమె అనుగ్రహం వల్ల నేను నా జీవితంలో మిగిలిన కాలం, నిజమైన సాక్షీమాత్రుడుగా గడిపే అవకాశం కలిగితే ధన్యుణ్ణవుతాను...

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(127)

రామకృష్ణ మిషన్, వారణాసి,

19 ఏప్రిల్, 1920

ప్రియమైన రమేష్,

నీవు వైశాఖ ప్రథమ తిథి (ఏప్రిల్ 1920)న వ్రాసిన ఉత్తరం అందింది... ఉత్తర ప్రత్యుత్తరాల వల్ల, పుస్తకాలు చదవడం వల్ల మనస్సులో నుండి సందేహాలు తొలగిపోవు. ప్రయత్నం చేసి తీరాలి. శాస్త్ర ఆదేశాలను, గురూపదేశాలను అనుసరించాలి. ఆ విధంగా శ్రద్ధ ఏర్పడుతుంది. శ్రద్ధవల్ల హృదయ పవిత్రత (చిత్తశుద్ధి) కలుగుతుంది. అప్పుడు మాత్రమే మనస్సులోని సందేహాలు తొలగి పోతాయి. గీతలో దీనినే కృష్ణుడు అర్జునుడికి బోధించాడు: "ఓ భారతా! మేలుకో! నీ హృదయంలో అజ్ఞానం వల్ల జనించిన ఆత్మవిషయమైన సందేహాన్ని జ్ఞానఖడ్గం చేత ఖండించి, యోగాన్ని అభ్యసించు" (గీత: 4:42). భగవానుడు "మేలుకుని

యోగాన్ని అభ్యసించు" అని ఆదేశించాడు. అంటే శాస్త్రాలలోని ఆదేశాలను అనుసరించమని బోధించాడు. సంశయాలను జ్ఞానఖడ్గం చేత ఛేదించాలి. ఉపదేశాలు వినడం వల్ల ఇది జరగదు. సాధన అవసరం. అభ్యాసం మనిషిని పరిపూర్ణతకు కొనిపోతుంది. యథార్థమేమంటే, "నీ మనస్సును భగవంతుని యందు నిలిపివుంచు. క్రమంగా ఆయనలో లీనమవుతావు." వదలకుండా అభ్యాసం చేస్తూనే ఉండాలి.

నీ ఆదర్శం ఏదైనప్పటికీ ధ్యానం మాత్రం తప్పకుండా ఫలితాలను కలిగిస్తుంది. మనిషి ధ్యానవస్తువును బ్రహ్మంగా చింతించాలి. భక్తుడైన రామప్రసాదు తాను రచించిన నిగూఢార్థాలైన కొన్ని పాటలలో ఇష్టదైవం మీద స్థిరమైన భక్తి ఉండాలని ఉదహరించాడు: "వేర్వేరు పూజాపద్ధతుల ప్రకారం ఒకే దైవాన్ని నీవు ఐదుగా చేశావు; ఇప్పుడు సాధకుడు ఈ ఐదును ఒకటిగా లీనం చేస్తే, నీవు ఇంకా ఏ విధంగా మిగిలివుంటావమ్మా?" "కాళిని బ్రహ్మంగా తెలుసుకుని పాపపుణ్యాలను రెంటినీ త్యాగం చేశాను." రామప్రసాదు ఇంకా ఇలా అంటాడు: "అమ్మా అని నేను ఎవరిని సంబోధిస్తానో ఆమెయే పరమసత్యం. ఓ మనసా! నా ఉద్దేశాన్ని తెలుసుకోలేవా? ఈ మర్మాన్ని నలుగురి ముందు బట్టబయలు చెయ్యాలా?" మానవునికి పట్టుసడలని భక్తి ఉండాలి; అంటే మూర్ఖంగా ఉండాలని అర్థం కాదు. ఈ విషయాన్ని గురించి తరచు శ్రీరామకృష్ణులు భక్తులను హెచ్చరిస్తూ ఉండేవారు.

ఎవరుపడితే వారు చెప్పేది వినకూడదు. తన గురువు యొక్క ఆదేశాన్ని పాటించాలి; అలా చేస్తే జయం కలుగుతుంది. ఏకాగ్రచిత్తంతో నీ సొంతమార్గాన్ని అనుసరించు. మనిషి అనేకమంది చెప్పిన మాటలు వింటూ, తన దృష్టిని ఒక విషయం నుండి మరొక విషయం వైపు మరలిస్తూ ఉంటే తన పారమార్థిక జీవితాన్ని నాశనం చేసుకున్నవాడవుతాడు. అలా చేయడం ఎటువంటి ప్రయోజనాన్నీ కలిగించదు.

గురుదేవులు, "గ్రంథాలు గ్రంథులు (ముడులు)" అన్నారు. అవి జీవుణ్ణి బంధిస్తాయి. ఎండమావుల కోసం పరుగు తీయడాన్ని కట్టిపెట్టి గీత ఆదేశాన్ని మన ఏకైకలక్ష్యంగా అనుసరించాలి. "ఓ అర్జునా! నిశ్చలమైన ఆలోచనతో ఒకే నిర్ణయాన్ని చేసుకో! (జ్ఞానోదయం కోసం)" (గీత: 2:41). ముక్తి పొందిన తర్వాత కూడా కొందరు అవతారపురుషుల సహచరులుగా జన్మిస్తారు. వాళ్ళు నిత్యముక్తులు. భాగవతంలో వాళ్ళు ఇలా ఉదహరించబడ్డారు: "ఎవరి నుండి బంధాలన్నీ తెగిపోయాయో అటువంటి ఆత్మారాములైన మునులు కూడా నిర్హేతుకభక్తితో ఆ పరమపురుషుణ్ణి ప్రేమిస్తారు. శోభాయమానమైన భగవంతుని గుణాలు అటువంటివి" (భాగవతం, 1.7.10).

మంచి చెడ్డలన్నీ దీర్ఘంగా ఆలోచించుకున్న తర్వాత ఒక నిర్ణయాన్ని తీసుకో. చెప్పడానికి ఇంకేముంది?

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(128)

వారణాసి,

24 ఏప్రిల్, 1920

ప్రియమైన ఎక్స్.,

నీవు వైశాఖ ద్వితీయ (ఏప్రిల్ 1920) నాడు వ్రాసిన ఉత్తరం అందింది... నీవు అన్నీ అర్థం చేసుకున్నావు కాబట్టి, నీకు ఏది శ్రేయస్కరమో దానిని ఇప్పుడు ఆచరించాలి. బలహీనత అనేది మానవుల స్వభావంలో అంతర్గతంగా ఉండనే ఉంది. "నేను బలహీనుణ్ణి, నేను బలహీనుణ్ణి!" అని అనుకోవడం వల్ల బలహీనత తొలగిపోదు. ఆశావహభావాలను, "నేను బలహీనుణ్ణి ఎందు కవుతాను? నేను బలవంతుణ్ణి అయితీరాలి!" అని హృదయపూర్వకంగా భావిస్తే మనిషి నిశ్చయంగా బలవంతుడవుతాడు. నీ గురువుగారి ఉపదేశాలను ఆచరణ లోకి తీసుకురావడానికి ప్రయత్నించు. కేవలం సలహాలు విన్నంత మాత్రాన ఫలితమేమీ కలగదు. గురుదేవులు ఇలా చెప్పేవారు: "సిద్ధి, సిద్ధి (భంగు) అని వల్లించినంత మాత్రాన మనిషికి కైపెక్కదు. సిద్ధిని తీసుకువచ్చి, దాన్ని మెత్తగా నూరి ఆ తర్వాత త్రాగాలి. అలా చేస్తే అప్పుడు మత్తులో కలిగే ఆనందం అనుభవమవుతుంది."

నీ ప్రార్థన, ధ్యానం సరైనమార్గంలో కొనసాగడం లేదని ఎందుకు అనుకుంటున్నావు? తగిన చర్యలు తీసుకో – ఇదే నీకు నేనిచ్చే సలహా. అన్ని విధాలా సాధనను కొనసాగిస్తుండాలి. అంటీఅంటనట్లుంటే ప్రయోజనం ఉండదు. తాత్కాలికంగా కలిగే ఉత్సాహం ఫలితాన్ని కలిగించదు – ఆ ఉత్సాహాన్ని శాశ్వతం చెయ్యడానికి ప్రయత్నించాలి. నీవేమీ పసిబిడ్డవు కాదు. ఈ విషయంలో ఇంతకంటే నేను చెప్పవలసిందేమీ లేదు. ఏది నిన్ను బలవంతుణ్ణి చేస్తుందో దాన్ని దృఢనిశ్చయంతో చేపట్టు. ఇంతకంటే చెప్పడానికి ఏమీ లేదు.

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(129)

వారణాసి,

10 మే, 1920

ప్రియమైన గురుదాస్ (గుప్త),

నీవు 1920 మే 8వ తేదీ వ్రాసిన ఉత్తరం అందింది... ఉపదేశాన్ని గురించి నీ ఆతురత సద్దుమణిగిందని తెలుసుకుని సంతోషించాను. ఈ సందర్భంలో నీవు వ్రాసినదంతా సందర్భోచితంగాను, న్యాయసమ్మతంగాను ఉంది. పారమార్థిక జీవితంలో ఉపదేశం తప్పకుండా సహాయం చేస్తుంది. తన జీవితాన్ని భగవంతుని కోసం త్యాగం చెయ్యాలని నిర్ణయం తీసుకున్న వానికి, సర్వజ్ఞుడైన భగవంతుడు అన్నిటినీ అనుకూలంగా చేస్తాడు. ఉపదేశం కోసం అతడు ప్రత్యేక ప్రయత్నమేమీ చెయ్యనక్కరలేదు. భగవంతుణ్ణి పొందాలనే

తీవ్రమైన ఆకాంక్ష, హృదయపూర్వకంగా ఆ పనిలో నిమగ్నమై పోవడం ముఖ్యం. అప్పుడు జయం దానంతట అదే వచ్చితీరుతుంది. గురువు రూపంలో భగవంతుడు ఉపదేశం చేసి, సర్వాన్ని బోధిస్తాడు. భగవంతుడొక్కడే గురువు. మిగిలిన వారు నిమిత్తమాత్రులు. అంటే ఉపదేశమనేది అవసరం లేదని నేను నిరూపించ దలిచానని అర్థం కాదు. ఉపదేశం వల్ల అనేక మంది ప్రయోజనాన్ని పొందారు. ప్రజల్లో ఎక్కువశాతం మందికి ఉపదేశం అవసరం. కానీ, మనం సొంతం చేసుకున్న స్థిరభక్తి ఎక్కువ ప్రయోజనకారి – అదే నేను చెప్పదలచింది.

నీవు గీతాధ్యయనం చేస్తున్నావని తెలిసి నేనెంతో ఆనందిస్తున్నాను. గీత సర్వశాస్త్ర స్వరూపం. గీత అశాశ్వతమైన ఈ లోకంలో మనిషికి పునర్జన్మ కలగకుండా చేస్తుంది. గీత భగవంతుని హృదయం. దానికి సమానమైనది మరొకటి లేదు. గీతాబోధను ఆచరించిన వాని మనస్సు పరిశుద్ధమవుతుంది. ప్రతి విషయాన్నీ సరిగా అర్థం చేసుకునే శక్తిని వృద్ధి చేస్తుంది. ఆ వ్యక్తి పరమశాంతిని పొందుతాడు.

విషయాలను అర్థం చేసుకునే శక్తి నీలో మరింతగా వికసిస్తున్నట్లు గ్రహించావని తెలిసి నేను నిజంగా ఎంతో సంతోషించాను. భగవంతుణ్ణి శరణువేడు. నీకు ఏది శ్రేయస్కరమో దానిని ఆయన నీ చేత చేయిస్తాడు. అశాంతి చెందవద్దు. నీకు ఆయన దారి చూపిస్తాడు. నీవు ఎక్కడ ఉన్నా, భగవంతుణ్ణి అంటిపెట్టుకుని ఉంటే భయపడవలసింది ఏమీ ఉండదు. స్తంభాన్ని పట్టుకుని గిరగిర తిరిగితే పడిపోవు. భగవంతునికి సంపూర్ణంగా శరణాగతుడైన వాడు బాధ్యతల నుండి విముక్తుడవుతాడు. భాగవతం ఇలా చెపుతోంది: "అహం కారాన్నీ, తానే అన్నీ చేస్తున్నానన్న భావాన్నీ వదలిపెట్టి, హృదయపూర్వకంగా భగవంతుణ్ణి శరణువేడిన వారికి దేవ ఋణం, ఋషి ఋణం, పితృాణం, భూత ఋణం, బంధు ఋణం, మనుష్య ఋణం ఉండవు. భగవంతునికి తప్ప మరెవరికీ అతడు దాసుడు కాడు" (భాగవతం, 11.5.41). (ఆ విధంగా ఉండి, అన్ని ఋణాలను తీర్చివేసి, తన విధిని నిర్వర్తించకపోవడం వల్ల కలిగే పాపం నుండి విముక్తుడవుతాడు.)

దిగులు చెందవద్దు. ఇదివరకటి లాగానే సాగిపో, నీ భూత, వర్తమాన, భవిష్యత్తుల్ని భగవంతునికి అర్పించు. నీ కోసం ఎటువంటి ప్రణాళికలు వేసుకోవద్దు. ప్రతిదీ నీ కోసం భగవంతుడు ఏర్పాటు చేస్తాడు..

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(130)

వారణాసి,

31 మే, 1920

ప్రియమైన గురుదాస్ (గుప్త),

నీవు మే 28 వ తేదీ వ్రాసిన ఉత్తరం అంది సంతోషం కలిగింది. క్రమంగా నీ గురించి నీవు మరింతగా తెలుసుకోవడం అన్నది అంత చిన్న విషయమేమీ కాదు. ఆ విధంగా నీ పయనాన్ని బాహ్యంలో నుండి అంతరంగంలోకి కొనసాగించి, క్రమంగా నీ అంతరాత్మను చేరుకో. నీ నిజస్వభావాన్ని అనుభవంలోకి తెచ్చుకోగలిగితే, నీ జీవిత ప్రయోజనం నెరవేరుతుంది. ఆ స్థితిని పొంది నీ జీవితం సార్థకత చెందుతుంది. "అది (అంటే ఆత్మ) చెవుకు చెవి, మనస్సుకు మనస్సు, వాక్కుకు వాక్కు, ప్రాణానికి ప్రాణం, కంటికి కన్ను. ఆత్మను జ్ఞానేంద్రియాల నుండి విడదీసి, లోకాన్ని త్యాగం చేసి జ్ఞాని అమృతత్వాన్ని పొందుతాడు" (కేనోపనిషత్తు, 1.2). ఆత్మను అన్నింటిలోనూ దర్శించి, "అతడు ఎవ్వరినీ ద్వేషించలేడు" (ఈశోపనిషత్తు, 8).

మనిషికి – దేహం, ఇంద్రియాలు, మనస్సుతో సంబంధం ఉన్నంత వరకూ – ఇది మంచి, ఇది చెడు అనే జ్ఞానం ఉంటుంది. అతనికి పరమాత్మతో దృఢసంబంధం ఏర్పడ్డప్పుడు ద్వంద్వాలు (సుఖదుఃఖాలు, మంచిచెడ్డలు అనేవి) ఉండవు. అంటే అతనిని మంచి, చెడు అనేవి ఇక ఏమాత్రం కలతపెట్టవు. "మనిషి నేను ఆత్మను అని తెలుసుకున్న తర్వాత, దేనిని కోరి, ఎవరి కోసం వెంపర్లాడుతూ వ్యథ చెందుతాడు?" (బృహదారణ్యకోపనిషత్తు, 44.12). మనిషికి నేను ఆత్మను అనే జ్ఞానం కలిగిన తర్వాత శారీరిక, మానసిక బాధలు కలిగినా ఆనందంలో స్థిరంగా నిలిచివుండి తన నిజస్వరూపాన్ని దర్శిస్తుంటాడు. అతడు తన శరీరం నుంచి మనస్సును వేరు చేసుకున్నాడు కాబట్టి శారీరిక రుగ్మతలు అతనిని బాధపెట్టవు.

'నేను దేహాన్ని, నేను దేహాన్ని' అని అనుకుంటే నేను శరీరంతో తాదాత్మ్యం చెందుతాను. అటువంటప్పుడు 'నేను ఆత్మను, నేను ఆత్మను' అనుకుంటే నేను ఆత్మను ఎందుకు కాను? మన బాధలకు కారణం అసత్యాన్ని సత్యంగా భావించడమే. సత్యాన్ని సత్యంగా తెలుసుకోగలిగితే మన దుఃఖమంతా తొలగిపోయి ఆనందం కలుగుతుంది. సత్యాన్ని దర్శించడానికి అనంతమైన ఓర్పుతో, సుదీర్ఘమైన అభ్యాసం చెయ్యాలి. అభ్యాసవైరాగ్యాలే ప్రధానమైన అండలు. మనిషి స్థిరమైన భక్తిని కలిగివుంటే భగవంతుని కృపవల్ల అంతా సులువైపోతుంది.

భగవద్గీతాధ్యయనం సత్యాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి నీకెంతో ఉప కరిస్తుంది. "ఓ భగవద్గీతా! అశాశ్వతమైన ఈ లోకంలో మానవుని పునర్జన్మను నీవు నాశనం చేస్తావు. ఓ అమ్మా! నిన్ను నేను ధ్యానిస్తున్నాను." (గీతాధ్యానశ్లోకం 1) చెప్పడానికి ఇంకేముంది? జీవనంలోనూ, మరణంలోనూ ఇదే గమ్యం.

గురుదేవుల ఈ ఉపదేశాలను ఎన్నడూ మరువవద్దు. "వందల ఏళ్ళుగా ఉన్న అంధకారాన్ని ఒక్క అగ్గిపుల్ల క్షణంలో వెలిగిస్తుంది. జన్మజన్మల నుండి పేరుకున్న అజ్ఞానాన్నంతా భగవంతుని ఒక్క కరుణాబిందువు తొలగిస్తుంది." తీవ్రమైన ఆకాంక్ష, పరితాపం అవసరం. అది పరిపూర్ణత్వానికి త్వరగా చేరుస్తుంది. నీవు చక్కగా అభివృద్ధి చెందుతున్నావని తెలిసి, నేను నిజంగా ఎంతో ఆనందిస్తున్నాను.

ప్రారంభదశలో పశ్చాత్తాపానికి, శరీరాన్ని కష్టపెట్టడం ద్వారా మనస్సును స్వాధీనం చేసుకోవడానికి చేసే ప్రయత్నాలకు కొంత అవసరముంది. కానీ వాటిని ఎక్కువకాలం

ప్రోత్సహిస్తూ ఆశ్రయమిస్తే అవి అపాయకరంగా మారతాయి. కాబట్టి మనిషి వాటిని దూరంగా ఉంచాలి. అనవసరంగా వాటిని పట్టుకుని ఉండడం తామసికమైన పట్టుదల (తామసికధృతి) అవుతుంది. భగవద్గీతలో కృష్ణుడు ఇలా చెప్పాడు: "మూర్ఖుడు ఏ పట్టుదల వల్ల నిద్ర, భయం, దిగులు, విషాదం, ఇంద్రియమదం మొదలైన దుర్లక్షణాలను విడిచిపెట్టడో, ఓ పార్థా! అది తామసిక స్వభావం గల ధృతి (పట్టుదల)" (గీత: 18:35). చెడు అలవాట్లను వదిలిపెట్టినప్పుడే పశ్చాత్తాపానికి సార్థకత కలుగుతుంది. లేకపోతే తన పాపకృత్యాలను గురించి పశ్చాత్తాపపడుతూ కూర్చుంటే మనిషి ఏమి సాధించగలడు? మనువు ఇలా అంటాడు: "పాపం చేసినవాడు పశ్చాత్తాపపడితే ఆ పాపం తొలగిపోతుంది. 'నేనీ పాపం మళ్ళీ చెయ్యను' అంటూ ఆ పాపం చెయ్యకుండా ఉండడానికి నిర్ణయం తీసుకున్నప్పుడే అతడు పరిశుద్ధుడవుతాడు" (మనుస్మృతి, 11.231).

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(131)

వారణాసి,
27 జూన్, 1920

ప్రియమైన ఎక్స్.,

నీవు జూన్ 25వ తేదీన వ్రాసిన పోస్టుకార్డు అందింది. మాతృదేవి పరిస్థితిని గురించి దాదాపు ప్రతిరోజూ వర్తమానం అందుతున్నది. పరిస్థితులు బాగుపడడం భగవంతుని అనుగ్రహం మీద ఆధారపడి ఉన్నది.

"యోగాన్ని పొందాలని కోరేవాడికి సాధనం కర్మ – కానీ, యోగాన్ని సాధించిన వాడికి సాధనం శాంతి" (గీత: 6:3). గీతలోని ఈ భాగం యోగి యొక్క స్థితులను చక్కగా వర్ణిస్తున్నది. దీని అర్థమేమంటే యోగాన్ని పొందాలని అనుకునేవాడు కర్మ (అంటే సరైన మార్గంలో పనిచేయడం) ద్వారానే దాన్ని సాధించాలి. యోగాన్ని పొందిన వారికి ఇక కర్మతో అవసరం లేదు. ఆలోచనా ప్రవాహం తెంపులేకుండా ఉండేట్లు చూడడానికి కర్మను తగ్గిస్తూ రావాలి. కర్మ అనేది అంతరంగంలోనూ, బాహ్యంలోనూ సాగిపోతూనే ఉండాలి. ఈ విషయం గీతలో స్పష్టంగా చెప్పబడి ఉన్నది: "కర్మ చెయ్యకుండా ఎవ్వరూ ఒక్కక్షణం కూడా ఉండలేరు" (గీత: 3:5).

మొదట బాహ్యకర్మ అవసరం. తర్వాత – ధ్యానం మొదలైన అంతర్‌కర్మ అవసరం. అందువల్ల కృష్ణుడు యోగాన్ని సాధించినవాడి లక్షణాలను తర్వాత చెప్పాడు. "మనిషి కర్మల మీద గానీ, ఇంద్రియ విషయాల మీద గానీ మమకారం లేకుండా ఉన్నప్పుడు, సంకల్పాలను అన్నింటినీ త్యాగం చేసినప్పుడు, అతడు యోగారూఢుడు (యోగాన్ని సాధించిన వాడు) అని చెప్పబడతాడు" (గీత: 6:4). ఈ శ్లోకాన్ని శ్రీ రామకృష్ణులు గర్భవతియైన కోడలి విషయంలో

ఆమె అత్తగారు చూపించే విధానం ద్వారా ఉదహరించారు. ఆ కోడలి బాధ్యతలను అత్త క్రమక్రమంగా తగ్గిస్తూ వస్తుంది. బిడ్డను కన్న తర్వాత, కోడలికి బాధ్యతలేమీ ఉండవు. ఇక ఆ చంటిబిడ్డ బాగోగులు చూడడమే ఆమె పని.

ప్రారంభంలో అన్ని కర్మలు భగవత్సాక్షాత్కారం కోసమే చెయ్యబడతాయి. భగవద్దర్శనమైన తర్వాత చేసే కర్మ అంతా భగవంతుని కోసమే. అప్పుడు మనిషికి పూర్తి ఆనందం కలుగుతుంది. సొంత అవసరాలనేవే ఉండవు. ఆ స్థితిలో ఆచరించే కర్మ ఏ స్వార్థప్రయోజనానికీ కాదు. అందువల్ల అది కర్మ అనే లెక్కలోకి రాదు. భగవత్సాక్షాత్కారమైన తర్వాత పారమార్థిక సాధనలు చెయ్యడం గానీ, భగవంతుని మీద మనస్సును ఏకాగ్రం చెయ్యడం గానీ ఉండవు. అన్ని పరిస్థితుల లోను ఆ వ్యక్తి మనస్సు భగవంతుని మీద ఏకాగ్రమై ఉంటుంది. జనకమహారాజు గానీ, వివేకానంద స్వామి గానీ చేసిన కర్మ స్వప్రయోజనానికి కాదు. స్వార్థమనేది వారిలో నుండి పూర్తిగా తొలగిపోయింది. కాబట్టి ఆ స్థితిలో వారు చేసిన కర్మ అంతా ఇతరుల కోసం మాత్రమే. వారు సత్యాన్ని దర్శించారు. అంతటా ఏకత్వాన్ని దర్శించారు. ఈ క్రింది గీతాశ్లోకంలో వర్ణించిన స్థితిని వారు సాక్షాత్కరించుకున్నారు. “హృదయాన్ని యోగంలో ఏకాగ్రం చేసి, అన్ని విషయాలను సమదృష్టితో చూస్తూ, అతడు సర్వజీవులను తనలోనూ, తనను సర్వజీవులలోనూ చూస్తాడు” (గీత: 6:29).

కాబట్టి ఈ స్థితిని పొందని వారు కర్మ చెయ్యక తప్పదు. ఎందుకంటే, కోరికలు లేని స్థితిని చేరడం కోసం వారు కొంత కర్మ చెయ్యాల్సి ఉంది. కాబట్టి, సాధ్యమైనంత వరకూ ఫలాన్ని ఆశించకుండా కర్మను చెయ్యమని కృష్ణుడు ప్రజలకు సలహా ఇస్తున్నాడు. ఇది క్రమంగా చిత్తశుద్ధిని కలిగించి, అందరిలోనూ తనను దర్శించేటట్లు చేస్తుంది. తనను అందరిలో పరిపూర్ణంగా దర్శించినప్పుడు అతనికి ఆచరించవలసిన కర్మ అంటూ ఉండదు. అంటే, కర్మ చేస్తున్నప్పుడు కూడా తాను, చేసేవాణ్ణి కాను అని అనుభూతి చెందుతాడు.

అహంకారం ఉన్నంత వరకే పనులు, బాధ్యతలు ఉంటాయి. “అహం ఎప్పుడు పోతుందో అప్పుడు కష్టమంతా పోతుంది”. “నేను కాదు, నీవు” అనే దృష్టితో భక్తుడు అన్ని పనులు చేస్తాడు. జ్ఞాని (జ్ఞానమార్గాన్ని అనుసరించేవాడు) తాను ఆత్మనని తెలుసుకుని, తన దేహం, మనస్సు, బుద్ధి మాత్రమే కర్మ చేస్తున్నాయని తెలుసుకుంటాడు. కాబట్టి ఏ కర్మతోను తాదాత్మ్యం చెందడు – అంతే.

నా మాట నమ్ము. శాస్త్రాల్లో ఎక్కడా – స్తబ్ధుడిగా ఉండి, కర్మలన్నింటినీ వదిలిన స్థితిని – యాంత్రికంగా పని నుండి కాళ్ళు, చేతులు ముడుచుకుని ఉండే స్థితిని – విధించలేదు. అజ్ఞానస్థితిలో తామే చేస్తున్నామనే భావంతో ప్రజలు కర్మ చేస్తుంటారు. జ్ఞానాన్ని, భక్తిని పొందిన తర్వాత వారికి అహంకార భావం తొలగిపోతుంది. భక్తుడు భగవంతుని కోసం కర్మలను ఆచరిస్తాడు. కర్మను చేస్తున్నా, తాను చేసేవాణ్ణి (కర్తను) కానని తెలిసి జ్ఞాని ప్రశాంతంగా ఉంటాడు. అతడు, “ఇంద్రియాలు, ఇంద్రియవిషయాల యందు నిమగ్నమై ఉన్నాయ”ని దర్శిస్తూ ఉంటాడు (గీత: 5:9). ప్రస్తుతానికి ఇంతవరకు చాలు.

మీ అందరికీ ప్రేమ, ఆశీస్సులతో,
ఆప్యాయతతో,
తురీయానంద

(132)

వారణాసి,
13 జులై, 1920

ప్రియమైన గురుదాస్ (గుప్త),

నీవు జులై 8వ తేదీ వ్రాసిన ఉత్తరం అందింది... సజ్జన సాంగత్యం లభించడం దుర్లభం కావడం విచారకరం. కృష్ణుడు గీతలో ఇలా చెప్పాడు: "వేలమందిలో ఏ ఒక్కరో పరిపూర్ణత కోసం ప్రయత్నిస్తారు" (గీత: 7:3). ఈ లోకంలో అనేకమంది ఇంద్రియసుఖాల వైపే ఆకర్షించబడుతూ ఉంటారు. త్యాగం చెయ్యడానికి ఎవరు ఇష్టపడతారు? మానవులకు అన్నీ సుఖాలే కావాలి గానీ దుఃఖం అక్కరలేదు. కానీ, దుఃఖం లేకుండా సుఖం కలగడం అసంభవమని వారు తెలుసుకోరు. మహామాయ యొక్క మాయ ఎటువంటిదంటే ప్రజలను అది ఆత్మజ్ఞానం పొందనివ్వదు.

గీత సర్వశాస్త్రసారం. గీతాధ్యయనం వల్ల నీ గమ్యాన్ని పొందెదవుగాక! ఇది నా ప్రార్థన. గీతపై ధ్యానం చెయ్యి. నీవు ఏది చదివినా దాని మీద – నడుస్తున్నా, కూర్చున్నా, భుజిస్తున్నా, నిద్రిస్తున్నా – అన్నివేళలా గీతను మననం చెయ్యి. అప్పుడు నీ హృదయంలో గీతార్థం దర్శనమవుతుంది. ప్రశాంతత కలుగుతుంది. గీతను ఆచరిస్తే ఫలితాన్ని పొందుతావు. ఇది పరమసత్యం.

గీత 14వ అధ్యాయంలో ఉదహరించినట్లు త్రిగుణాలను (సత్త్వం, రజస్సు, తమస్సు – ఈ మూడు గుణాలను) దాటిన స్థితిని పొందినవానికి ముక్తి వచ్చి తీరుతుంది. ఆ అధ్యాయంలో గుణాతీతుని లక్షణాలు, గుణాలను ఏ విధంగా దాటిపోతాడనే విషయాలు స్పష్టంగా తెలియజేయబడ్డాయి. కృష్ణుడు ఇలా చెపుతున్నాడు: "సడలని భక్తితో ఎవరైతే నన్ను అర్చిస్తాడో, అతడు బ్రహ్మైక్యానికి అర్హుడవుతాడు" (గీత: 14:26). కారణం కూడా కృష్ణుడు చెపుతున్నాడు: "నేను బ్రహ్మం యందు ప్రతిష్ఠితమై ఉన్నాను. ఆ బ్రహ్మం శాశ్వతుడు, మార్పు చెందనివాడు. సనాతన ధర్మానికి, అఖండానందానికి ఆ బ్రహ్మం నివాసస్థానం" (గీత: 14:27). ఈ 14వ అధ్యాయాన్ని సాధన చేసి, త్రిగుణాతీతస్థితిని అనుభూతి చెందితే నీకు మరేదీ అవసరం ఉండదు.

కృష్ణుడు గీత రెండవ అధ్యాయంలో స్థితప్రజ్ఞుని లక్షణాల్ని వివరించాడు (స్థితప్రజ్ఞుడు – సుఖదుఃఖాలలో చెదరని మనఃస్థితిని కలిగి ఉండేవాడు. గీత: 2:55–72). 14వ అధ్యాయంలో అవే లక్షణాల్ని మూడు గుణాల్ని అధిగమించిన వాని లక్షణాలుగా కొంత తేడాతో వివరించాడు (గీత: 14:22–27). మళ్ళీ 12వ అధ్యాయంలో నిజమైన భక్తుని

లక్షణాలను పై అధ్యాయాలలో పేర్కొనబడిన స్థితప్రజ్ఞుని లక్షణాలలాగా వివరంగా వర్ణించాడు (గీత: 12:13-20). భగవంతుని లక్షణాలను మానవులు తమ లక్షణాలతో పోల్చుకోవడానికి మళ్ళీ మళ్ళీ ఉదహరించాడనే విషయం గుర్తుంచుకో.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(133)

వారణాసి,
17 జులై, 1920

ప్రియమైన నిర్మల్ (మాధవానంద),

నీవు జులై 13వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది... ప్రయత్నమొక్కటే ప్రశాంతత నివ్వదు. శరణాగతి పొంది వినమ్రుడై ఉండాలి. భగవంతుని కృపవల్ల అన్నీ క్రమంగా స్పష్టమవుతాయి... క్రమవిధానంలో పారమార్థిక సాధనలు సాగిస్తూనే ఉండాలి. ఒక రోజువారీ కార్యక్రమాన్ని అనుసరించడం ముఖ్యం కానీ, ఆంతర్యంలో ఎల్లప్పుడూ ఆధ్యాత్మిక ప్రవాహాన్ని నిలుపుకోవడానికి తప్పక ప్రయత్నం చేస్తుండాలి. మొదట సిద్ధాంతం, దాని ఆచరణ వేర్వేరుగా ఉంటాయి. కానీ తర్వాత అవి రెండూ ఏకమై పోతాయి. సిద్ధాంతమే ఆచరణగా మారిపోతుంది. అప్పుడు పారమార్థికజీవితం సులభం, స్వాభావికం అవుతుంది. దీనినే సహజావస్థ లేక సహజస్థితి అంటారు. ఆ స్థితి కలిగిన మీదట పారమార్థిక సాధనలు చేసేందుకు ప్రయత్నించనక్కరలేదు. మనస్సు సహజంగా భగవంతునిలోనే ఉంటుంది.

మనస్సును ఆధ్యాత్మికం చెయ్యలేకపోవడం చాలా బాధను కలిగిస్తుంది. నిరంతర ఆధ్యాత్మికాభ్యాసం వల్ల మనస్సు సాధుస్వభావాన్ని పొందుతుంది. అప్పుడు అది నిరంతరం భగవంతునితో అనుసంధానించబడి ఉంటుంది. కాబట్టి, దానికి బాహ్యమైన సత్సంగం యొక్క ఆవశ్యకత ఉండదు.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(134)

వారణాసి,
27 జులై, 1920

ప్రియమైన ఎక్స్.,

నీవు గురువారం వ్రాసిన ఉత్తరం అందింది... మనస్సు, ఆత్మ ఒకటి కాదనే విషయం యథార్థం. మనస్సు పవిత్రం కాగానే, ఆత్మ అక్కడ ప్రత్యక్షమై మనస్సు ఇక పనిచెయ్యడం ఆగిపోతుంది. విశ్వం ఉన్నంత వరకు విశ్వమనస్సు ఉంటుంది. విశ్వం అనంతం కాదు కాబట్టి

విశ్వమనస్సు కూడా అనంతమైనది కావడానికి వీల్లేదు. ఒక్క పరమాత్మే ఆది, అంతం లేనివాడు. మరేదీ అనంతం కాదు. దీర్ఘంగా ఆలోచిస్తే దీనిని నీవు అర్థం చేసుకుంటావు...

భవదీయ శ్రేయోభిలాషి,

తురీయానంద

(135)

వారణాసి,

26 ఆగష్టు, 1920

ప్రియమైన గురుదాస్ (గుప్త),

నీ ఆగష్టు 20వ తేదీ ఉత్తరం అంది సంతోషం కలిగింది. పారమార్థిక జీవనంలో అభివృద్ధి అంచెలు, అంచెలుగా కలుగుతుంది. అలా కలగడం అవసరం, శ్రేయస్కరం. మనిషి పారమార్థిక వాతావరణాన్ని తానే సృష్టించు కోవాలి. కాలక్రమంలో ప్రతిదీ జరుగుతుంది. జ్ఞానం లేకుండా మనిషి విరాగి కాలేడన్నది నిజం. కానీ అతడు వైరాగ్యాన్ని అభ్యాసం చెయ్యవచ్చు. దీర్ఘకాలం చిత్తశుద్ధితో అభ్యాసం చేస్తే దానంతట అదే అతనికి లభిస్తుంది. మొదట మనిషి తన సంతృప్తి కోసం తాను చేసిన కర్మఫలాన్ని భగవంతునికి అర్పించాలి. తర్వాత తాను భగవంతుని కోసమే కర్మ చేస్తున్నాననే దృఢవిశ్వాసం కలిగితే అతనికి భగవంతుని యందు అధికమైన ప్రేమ పెంపొందుతుంది. దీనినే భక్తి అంటారు.

తల్లి తన సంతానం కోసం ఎంతో బాధపడుతుంది. వారికి సుఖశాంతులు కలగడానికి ఆమె ఎన్నో చేస్తుంది. కానీ తాను వారి కోసం పని చేస్తున్నానని అనుకోదు. అందుకే తల్లికి సంతోషం కలుగుతూ ఉంటుంది. అందుకే ఆమె చేసింది ప్రేమ అవుతుంది కానీ కర్మ కాదు. మనిషి భగవంతుని యందు ప్రేమ అభివృద్ధి చేసుకుంటే దాన్ని భక్తి అంటారు. అతడు దైవాన్ని ప్రేమించి, ఆయనను తన సొంతం చేసుకుంటే అతని జీవితం ధన్యమవుతుంది. ఎందుకంటే, భగవంతుడు మన 'ప్రాణానికి ప్రాణం', 'ఆత్మకు ఆత్మ'.

ప్రేమ, ఆశీస్సులతో,

తురీయానంద

(136)

వారణాసి,

12 ఏప్రిల్, 1921

ప్రియమైన దినేష్ (స్వామి నిఖిలానంద),

నీ ఉత్తరం కొద్ది రోజుల క్రితమే అందింది... ఎందుకంత ఆర్భాటం చేశావు? నీవు భగవంతుణ్ణి తలిస్తే, ఆ విషయం నీకు, భగవంతునికి మాత్రమే తెలుస్తుంది. నీవు తప్పు చేసినప్పుడు ఆయన దాన్ని సవరిస్తాడు. భగవంతుడు సర్వజ్ఞుడు. పారమార్థిక జీవితంలో

మనకు కావలసింది నిజాయితీ, పట్టుదల. జగన్నాథస్వామిని దర్శించాలని పూరీయాత్రకు బయలుదేరిన యాత్రికుని గురించి గురుదేవులు చెప్పిన కథ గుర్తు తెచ్చుకో. అతనికి పూరీకి దారి తెలియదు. కానీ భగవంతుని యందు అతనికి గల నిష్కపటమైన భక్తి అతనిని దేవాలయానికి చేర్చింది.

నీవు మాతృదేవి దగ్గర మంత్రదీక్ష తీసుకున్నావు. అందువల్ల నీవు దిగులు పడవలసిన పనిలేదు. నీ ధ్యాన విధానాన్ని గురించి వ్రాశావు. అది నాకు అద్భుతంగా కనిపించింది. నీవు గురువును ఇష్టదైవంతో ఐక్యం చెయ్యగలిగితే ప్రయోజనం నెరవేరుతుంది. ఏ మాత్రం తొందరపడవద్దు. మనిషి ఎంతోకాలం సాధన చెయ్యాలి. జయం కలిగినా, అపజయం కలిగినా మనశ్శాంతిని కోల్పోవద్దు. పారమార్థిక సాధనలు చేస్తూ ఎంత కాలం నీ మనస్సు భగవంతుని మీద ఉంటుందో గమనిస్తూ ఉండు. మనస్సు భగవంతుని మీది నుండి పారిపోతుంటే మళ్ళీ దానిని భగవంతుని దగ్గరకు తీసుకురావడానికి ప్రయత్నించు. ఇది మూన్నాళ్ళముచ్చట అనుకున్నావా? నీ జీవితాన్ని పూర్తిగా అంకితం చెయ్యాలి. అంతకంటే నీవు ఏమి చెయ్యగలవు? నీ సర్వస్వం భగవంతుడేనని, ఆయన సాక్షాత్కారమే నీ జీవితగమ్యమని తలిస్తే, నీ జీవితాన్ని పూర్తిగా ఆ కార్యసాధన కోసం వినియోగించు. నీవు చెయ్యగలిగినదంతా చెయ్యి. అశాంతి చెందవద్దు.

మనస్సులో పేరుప్రతిష్ఠల మీద కోరిక దాగి ఉన్నవాడు ముందు భగవంతుణ్ణి సాక్షాత్కరించుకుని, తర్వాత పేరుప్రతిష్ఠలు తొందరగా సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తాడు. కానీ, అది పనిచెయ్యదు. అంతకంటే, మొదట పేరుప్రతిష్ఠల మీది కోరికను తీర్చుకుని, తర్వాత భగవంతుణ్ణి దర్శించడానికి ప్రయత్నించు. అంతే కాకుండా ఈ సందర్భంలో గురుదేవుల మాటలను గుర్తు చేస్తున్నాను: "దారపు పోగులు పొడుచుకుని వస్తుంటే దారం సూది బెజ్జంలోకి ఎక్కదు. అందువల్ల మొదట దారాన్ని తడిపి, వేళ్ళతో మెలిపెట్టి, మొనదేల్చినప్పుడు దారం సూది బెజ్జంలో దూరుతుంది." కాబట్టి, కామాలన్నింటినీ వదిలిపెట్టి ఏకాగ్రమైన ఆర్తితో మనిషి భగవంతుణ్ణి ప్రార్థించాలి. గీతలో కృష్ణుడు ఇలా చెప్పాడు: "ఓ కురునందనా! (ఈ కర్మయోగంలో) దృఢనిశ్చయం ఉన్న మానవుడికి, ఒకే ఒక్క అచంచలమైన, నిశ్చయమైన తలంపు ఉంటుంది. అటువంటి దృఢనిశ్చయం ఉండని వారి తలంపులు పరిపరివిధాలుగాను, అనంతంగాను ఉంటాయి" (గీత: 2:41). నేను చెప్పదలచినదాని భావాన్ని ఈ శ్లోకం నీకు తెలియజేస్తుంది.

నీ పారమార్థిక సాధనను కొనసాగించు. అది తప్పక నీకు ఫలితాన్నిస్తుంది. సంత్ తులసీదాసు ఇలా చెప్పారు: "పైకి గాని, క్రిందికి గాని, విత్తనాన్ని ఎటుతిప్పి నాటినా అది పైపైపుకే మొలకెత్తుతుంది." అదే విధంగా నీవు హృదయపూర్వకంగా సాధన చేస్తే, నీ విధానాలు లోపరహితమైనా, కాకపోయినా, అది మంచి ఫలితాలనే కలిగిస్తుంది. నీ హృదయంలో యథార్థమైన భక్తి ఉంటే భగవంతుడు దానిని కనిపెడతాడు. మానవలోపాలను ఆయన పట్టించుకోడు. మన ఆలోచనలలోని ఆంతర్యం ఆయనకు తెలుసు. దీన్ని గురించి ఒక

సామెత ఉంది: “విద్య లేనివాడి ప్రార్థన వ్యాకరణలోపాలతో ఉన్నా, విద్యావంతుని ప్రార్థన వ్యాకరణబద్ధంగా చక్కగా ఉన్నా, రెండు ప్రార్థనలూ సమానమైన పుణ్యాన్నే ప్రసాదిస్తాయి. ఎందుకంటే భగవంతుడు భావాల్లోని ఆంతర్యాన్నే అంగీకరిస్తాడు కానీ భాషను చూడడు.” కాబట్టి నీ ధ్యానం సక్రమమైన మార్గంలో నడుస్తున్నదా లేదా అని విచారపడవద్దు. మొట్టమొదట గురువును ధ్యానించాలి. ఇష్టదైవ ధ్యానాన్ని గురించి ఒక నిర్ణీతమైన విధానం లేదు. అయినా నీ సాధన నీవు చేస్తూ ఉండు. భగవంతుడు అన్నింటినీ సక్రమంగా చేస్తాడు.

సాధన ప్రాథమికమనీ, ఆంతరంగిక ప్రేరేపణ ద్వారా చేసేదనీ – రెండు రకాలు. చేసే కర్మల నుండి ఫలితాలను కోరేవారు ప్రాథమిక సాధనవైపు పోతారు. ఈ జీవితంలో ఎవరి గమ్యం భగవత్సాక్షాత్కారమో వారు విధి నియమాలకు, శాస్త్రవిధులకు బానిసలుగా ఉండడానికి ఇష్టపడరు. భగవత్ప్రేమను వృద్ధి చేసుకోవడానికి హృదయపూర్వకంగా శ్రమిస్తారు. గురుదేవులు, “మేత బాగా ఉన్నా, లేకపోయినా దానిలో తెలగపిండి కలిపితే ఆవు ఆత్రంతో గుటకలు వేస్తూ తింటుంది” అని చెప్పేవారు. అదే విధంగా మనిషి చేసే ఆరాధనా విధానంలో లోపాలుండవచ్చు. కానీ, ఏ మాత్రం కృత్రిమత్వం లేకుండా చేసినప్పుడు భగవంతుడు ఆ పూజను అంగీకరిస్తాడు. ఇంతకంటే ఏమి చెప్పమంటావు? ఈ రోజుకు ఇంత వరకు చాలు.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(137)

వారణాసి,
17 ఏప్రిల్, 1921

ప్రియమైన జీవన్,

నీవు వైశాఖ ప్రథమ (ఏప్రిల్ 1921) రోజున వ్రాసిన ఉత్తరం అంది సంతోషించాను. భగవంతుని కరుణాకటాక్షం వల్ల నీవు పవిత్ర హిమాలయాలలో సుఖంగా, మంచి ఆరోగ్యంతో నివసిస్తూ భగవంతుని చింతనలో రోజులు వెళ్ళబుచ్చుతున్నావని తలుస్తున్నాను.

నీ శరీరరుగ్మతలను, మానసిక చికాకులను తెలియజెయ్యడం, నీకు మరో చోటికి పోవాలనే కోరిక ఉన్నదనడానికి సూచనా? అలా ఎందుకు వ్రాశావో నాకు అర్థం కాలేదు. నీవు స్థిరపరచడానికి ప్రయత్నించకపోతే మనస్సు దానంతట అదే స్థిరపడుతుందా? హిమాలయాలలో పారమార్థిక సాధనలకు అనుకూలంగా ఉన్న చోటికి పోయినా లేక మరేచోటికి పోయినా, నీ మనస్సు ఎల్లప్పుడూ నీ వెంటే ఉంటుంది. నీ మనస్సును నిగ్రహించడంలో జయం సాధించి, దాన్ని భగవంతుని వైపు మరల్చకపోతే, నీవు మరోచోటికి పోవడం నిరుపయోగం. ఈ పనిని నీవు సొంతంగా శ్రమించి సాధించాల్సిందే. దీనిని నీ కోసం ఇతరులెవరూ చేసిపెట్టలేరు. అయితే అనుకూలమైన ప్రదేశం, సజ్జన సాంగత్యం

చాలావరకూ సహాయపడతాయి. మనస్సును స్వాధీనం చేసుకోవడానికి మనిషి తనకు తానుగా ఎంతో శ్రమపడాలనే విషయంలో సందేహం ఏమాత్రం లేదు.

నీకు మంచి పూర్వసంస్కారాలు లేవని నీవు చెప్పలేవు. నీకు సాధన చేయడానికి ఈ విధమైన అవకాశం వచ్చిందంటే, కారణం ఆ సంస్కారాలే. జాగ్రత్త తీసుకోవడం వల్లనూ, ప్రత్యేక ప్రయత్నం చెయ్యడం వల్లనూ, మనిషి గడుస్తున్న ప్రస్తుత జీవితంలోనే ఎంతో సాధించవచ్చు. కానీ, మనిషి తన తెలివితక్కువతనం వల్ల అనేక విధాలుగా బాధపడుతూ ఉంటాడు. మనస్సును పవిత్రం చేసుకోవడంలో విజయం సాధించగలిగితే ఈ బాధలను చాలావరకు తగ్గించుకోవచ్చు. ప్రతివారూ సుఖాన్నీ, దుఃఖాన్నీ అనుభవిస్తారు. ఎవ్వరూ వాటి బారి నుంచి తప్పించుకోలేరు. శరీరమున్నంత వరకూ అవి ఉంటాయి. కానీ, భగవంతుని యందు భక్తి కలిగి ఉంటే ఆ సుఖదుఃఖాలు మనిషిని వివశుణ్ణి చెయ్యలేవు. అవి వస్తుంటాయి, పోతుంటాయి. జ్ఞానవంతుడు వాటిని పట్టించుకోకుండా సాధనలో నిమగ్నుడై ఉంటాడు. పారమార్థిక సాధనలో పాదు కున్నప్పుడు, వాటి ప్రభావం ఉండదు. అప్పుడు అతని మనస్సు భక్త్యానందంలో మునిగిపోయి, శాంతిని అనుభవిస్తాడు. భగవంతుణ్ణి భజిస్తే మనస్సు దానంతట అదే శాంతిస్తుంది. ఒక వ్యక్తి మీద, ఒక ప్రదేశం మీద ఆధారపడకుండా, నీ అంతరాత్మను శరణువేడు. శాయశక్తులా నీ మనస్సును పవిత్రం చేసుకోవడానికి ప్రయత్నించు. అటూయిటూ పరిగెత్తే ప్రవృత్తి మనస్సుకు సహజం. దాన్ని అణచివేసి, అంతర్ముఖుడివి కావడానికి ప్రయత్నించు. ప్రాపంచికమైన కోరికల్ని వదిలివేసి, భగవంతుని వైపు మనస్సును మరల్చు. అప్పుడు నీ మనస్సు చేసే పనికిమాలిన ప్రేరణలవల్ల నీవు దారి తప్పే అవకాశం ఉండదు. భగవంతుని కృపవల్ల నీవు సుఖశాంతులతో తులతూగుతావు.

భవదీయ శ్రేయోభిలాషి,
తురీయానంద

(138)

వారణాసి,
6 మే, 1921

ప్రియమైన దినేష్ (స్వామి నిఖిలానంద),

నిన్న నీ సుదీర్ఘమైన ఉత్తరం అందింది. నీవు ఇదివరకు వ్రాసిన విషయాలే మళ్ళీ వ్రాశావు. నా సలహా వల్ల నీవు ఎంత లాభాన్ని పొందావో మాటల్లో వ్యక్తం చెయ్యలేనని వ్రాశావు కానీ నీవు ఎంత ప్రయోజనాన్ని పొందావో నాకు అర్థం కాలేదు. నీ పాతకథే, నీ పాత ఫిర్యాదులే, నీ పాత దిగుళ్ళే మళ్ళీ ఈ ఉత్తరంలో కూడా కనిపిస్తున్నాయి. వాటిలో మార్పేమీ లేదు. దీనివల్ల నీవు ఉపకారాన్ని పొందావని నాకెలా అనిపిస్తుంది?

అభ్యాసం ద్వారానే అన్ని పనులు నేర్చుకోవాలి. మనోనిగ్రహాన్ని, పారమార్థిక సాధనల యొక్క అవసరాన్ని, మీరు – ఈ కాలం యువత – అంగీకరించరని నాకు అనిపిస్తున్నది.

రెండు రోజుల ధ్యానంతోనో, నాలుగు రోజుల జపంతోనో నీవు గొప్ప యోగివి, మహా భక్తుడివి కావాలనుకుంటున్నావు. తక్కిన అన్ని విషయాలలోను నీవు కష్టపడడానికి, ఫలితాల కోసం వేచివుండడానికి సిద్ధంగానే ఉన్నావు. కానీ, పారమార్థిక విషయాలలో ఆలస్యాన్ని ఎంత మాత్రం సహించలేవు. ఎంతో తొందరపడిపోతావు.

అయినప్పటికీ, జన్మల తరబడి పారమార్థిక సాధనల్ని అభ్యాసం చెయ్యడం వల్లనే మనిషికి శీలం (నడవడిక) ఏర్పడుతుంది. ఈ విషయాన్ని అవగాహన చేసుకోకుండా మీరు – ఈ కాలం యువత – మూడు రోజుల్లోనే జయం కలగాలని చూస్తున్నారు. ఇంతకంటే నేనేమి చెప్పగలను? నేను వ్రాసిన ఉత్తరాన్ని నీవు శ్రద్ధగా చదివినట్లు కనిపించడం లేదు. చదివి ఉంటే పాతపద్ధతిలోనే మళ్ళీ వేసిన ప్రశ్నే వేసి ఉండేవాడివి కాదు. మనస్సును నిగ్రహించడం అంత సులభమైన పని అనుకున్నావా? నీవు ఏ మాత్రం కష్టపడకుండా ఆ పనిని ఎలా సాధించగలవు? ఈ విషయాన్ని నా క్రితం జాబులో ఉదహరించానను కుంటాను. ఇంతకంటే వ్రాయడానికేమీ లేదు.

శుభాశీస్సులతో,
తురీయానంద

ద్వితీయ భాగము

ఆంగ్లంలో వ్రాయబడిన లేఖలు

(1)

లాస్ ఏంజలిస్, కాలిఫోర్నియా
1901

నా ప్రియమైన గురుదాస్ (స్వామి అతులానంద),

అధైర్యపడవద్దు. క్రుంగిపోవద్దు. మంచి కాలం, మంచి పరిస్థితులు ఎల్లప్పుడూ కొనసాగుతూ ఉండాలని మనం ఎందుకు కోరాలి? జగజ్జనని ఇచ్ఛ ప్రకారం జరుగనివ్వు. సుఖం కలిగినా, దుఃఖం కలిగినా పట్టించుకోవద్దు. ఎండయినా, వానయినా, అన్ని పరిస్థితులలోనూ దివ్యజననిని మనం మరువకుండా ఉండాలి. ఆమెను మనం దర్శించలేకపోయినా సరే, నిరుత్సాహపడడం ఎందుకు? మన దృష్టిపథంలో మళ్ళీ ఆమె తప్పక దర్శనమిస్తుంది. మనకు ఏది మంచిదో ఆమెకు తెలుసు. ఒకసారి ఆమెకు మనల్ని మనం సమర్పించుకున్న తర్వాత, మళ్ళీ మనల్ని గురించి మనమే ఆలోచించడానికి ఏమి హక్కు ఉంది? చేసిచూపడం మాటలు చెప్పినంత సులభం కాదని నాకు బాగా తెలుసు. కానీ మరొక గత్యంతరం లేదు. మనం ఆమెను దర్శించినా, దర్శించకపోయినా ఆ దివ్యజననియే మనకు విశ్రాంతిస్థానం. సుఖదుఃఖాలు, ఒడుదొడుకులు అందరికీ ఉంటాయి. కానీ, మనం వాటికి లొంగకూడదు.

సత్యమైన, యథార్థమైన సానుభూతి ఒక్కటే అద్భుత కార్యాలను చెయ్యగలదు. విషాదాలకు, బలహీనతలకు ఆలవాలమైన ఈ లోకంలో సర్వశక్తిమంతమైనది అది ఒక్కటే. అటువంటి సానుభూతి కోసం అమ్మను యాచించు. అది నీకు సంప్రాప్తమవుతుంది. నీ గురించి ఆలోచన చేయవద్దు. పరులను గురించి మాత్రమే ఆలోచించు. అదే త్యాగం, అదే మతం (ధర్మం), అదే సర్వం. నీవు మరణించావు (సన్న్యసించావు)! అలాంటప్పుడు నిన్ను గురించి మళ్ళీ ఎందుకు ఆలోచిస్తావు? అమ్మకు నీవు నీ సర్వం అర్పించలేదా? ఇప్పుడు మళ్ళీ నీ గురించి నీవు ఎందుకు ఆలోచిస్తున్నావు? అధికారాన్ని లెక్క చెయ్యవద్దు. ఆ రకమైన భావాలన్నింటికీ స్వస్తి చెప్పు. కర్మయే ఆరాధన. మనం జీవిస్తున్న ఈ జీవితంలోనే సర్వం ఉంది – పదవిలో లేదు. దివ్యజననికి మన హృదయం తెలుసు. ఆమె దాన్ని కనిపెట్టి అన్ని విషయాలనూ సమకూర్చుతుంది. నీలో ఉండే దీపాన్ని అందరూ చూసేలా వెలగనివ్వు. నీవు చేసే పని ఎవ్వరికీ తెలియకుండా, రహస్యంగానూ, నిశ్శబ్దంగానూ ఉండనివ్వు. నీ తల్లి (దివ్యజనని) రహస్యంగా దానిని గమనించి, బహిరంగంగా నీకు బహూకరిస్తుంది. గాలిలో ఎగిరే పక్షులకు విశ్రాంతి కోసం గూళ్ళు ఉన్నాయి. కానీ దైవపుత్రునికి (ఏసుక్రీస్తుకు) తలదాచుకునే చోటే లేదు! నిజానికి, కోటానుకోట్లమంది జీవుల హృదయాలే ఆయన

నివాసస్థానం. అలసిపోయిన కోటానుకోట్ల జీవులు విశ్రాంతి తీసుకోవడానికి ఆయన వైపు చూస్తూ నిరీక్షిస్తుంటారు. నాయనా! నీ జీవితాన్ని జీవించు. దానికోసం హృదయపూర్వకంగాను, చిత్తశుద్ధితోను ప్రార్థించు.

శాంతి ఆశ్రమంలో జరిగిన శ్రీ రామకృష్ణ జన్మదినోత్సవ నివేదిక చదివి మహదానంద భరితుడనయ్యాను. ఇక్కడ కూడా ఆయనను గురించిన ప్రసంగంతోను, ప్రార్థనతోను మేము ఉత్సవం జరుపుకున్నాం. శ్రీ రామకృష్ణుడు ఏ దివ్యజనని రూపాన్ని తాల్చివున్నాడో ఆ దివ్యజనని యందు ప్రేమను, యథార్థమైన త్యాగశక్తిని, ఆయన మనలో జాగృత మొనర్చుగాక!

ప్రియమైన వత్సా! బలిష్ఠుడవుగా ఉండు. దేనికీ లొంగకు. బలహీనుడవుగా ఉండడం మంచిది కాదు; దుర్బలులకు వినాశం తప్పదు. ఇది లోక నియమం. కానీ, ఈ లోకంతో ఇక నీకేమి పని? దివ్యజనని బిడ్డవైన నీవు మంచివాడివైనా, చెడ్డవాడివైనా, బలవంతుడివైనా లేక బలహీనుడివైనా, ఎవరివైనా కావచ్చు. నీవు వేరెవరి సహాయం కోసం చూడనక్కరలేదు. దివ్యజనని మీదే ఆధారపడు. దివ్య జననిని తెలుసుకోలేనివారే తాత్కాలికమైన సహాయాలను పొందడాన్ని గురించి ఆలోచిస్తారు. కానీ, నీవు ఆ విధంగా ఆలోచించనక్కర లేదని నా నమ్మకం.

శ్రీరామకృష్ణులు మూర్తీభవించిన వేదాంత సత్యం. వేదాంతతత్త్వశాస్త్రంలో మనం చదివిన ధర్మసూక్ష్మాలన్నింటినీ ఆయన తన జీవితంలో వ్యక్తపరిచారు. తర గని ప్రేమను, భక్తిని ప్రసాదించమని ఆయనను ప్రార్థిస్తే, నీకు సర్వం లభిస్తాయి.

ప్రపంచం బయట ఎక్కడో లేదు. మనం బహిర్గతం చేసినదే ఈ ప్రపంచం. ఈ భావాన్ని అర్థం చేసుకోవడం ఎంత కష్టం! అర్థం చేసుకున్నా, దాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవడం ఇంకా ఎంత కష్టం!

మనను మనం తక్కువ చేసుకుంటే దుఃఖపడతాం. మనం పరిమితమైన వాళ్ళమని తలచినప్పుడు విషాదంలో మునిగిపోతాం. కానీ, దివ్యజనని కృప వల్ల త్వరలోనే మనం దాన్ని గుర్తిస్తాం. "పరిమితమైన దానిలో సుఖం లేదు. పరిమితమైనది నశించి పోతుంది. ఏది సర్వవ్యాప్తమో అదే ఆనందం" (ఛాందోగ్యోపనిషత్తు, 7.23.1, 24.1). సర్వవ్యాప్తమైన దాన్ని తెలుసుకో. అదే నీ యథార్థమైన ఆత్మ.

మన అందరిలో ఆత్మ ఎవరో, మనం ఎవరి సంతానమో, ఆమే మన ప్రియతమ దివ్యజనని. మన యథార్థమైన ఈ ఆత్మస్వరూపాన్ని మనమెన్నడును మరువకుందుము గాక!

తురీయానంద

(2)

శాంతి ఆశ్రమం, కాలిఫోర్నియా,

2 జూన్, 1901

నా ప్రియమైన మిస్టర్ ఆర్.,

నీవు దయతో వ్రాసిన ఉత్తరం అందుకుని సంతోషించాను. గత కొద్దిరోజుల నుండి నిన్ను ఎంతో తలుస్తున్నాను. ఇప్పుడు మీరంతా క్షేమంగా ఉన్నందుకు సంతోషం. నా ఆరోగ్యం అంత బాగాలేదుకానీ ఇప్పుడు కొంత కులాసాగా ఉంది. రోజురోజుకీ నీ ఆరోగ్యం మరింత బాగుపడుతున్నదని తెలియడం ఆనందాన్ని కలిగిస్తున్నది. నేనెల్లప్పుడు నా ఆత్మతో నీతోనే ఉన్నాను. నీవీమారు కలిసినప్పుడు --కు నా ప్రేమను తెలియజెయ్యి. ఆమె ఎంతో మంచిది. ఆమె కూడా దివ్యజనని బిడ్డయే. ఆమె తెలియకుండా ఏమైనా తప్పు చేస్తే దివ్యజనని ఆమెను క్షమిస్తుంది. ఆమె తన తప్పు తెలుసుకుంటే మరొకమారు అదే తప్పు చెయ్యదు. ఆమె విషయాన్ని గురించి నీవు ఆదుర్దా చెందనక్కరలేదు. నీవు సత్యమని తెలుసుకున్న దాని యందు స్థిరంగా ఉండు. అంతే! ఆమెలో దేనినైనా నీవు భరించలేకపోతే ఆ విషయాన్ని పట్టించుకోవద్దు. అసంతృప్తిని పోగొట్టుకోవడానికి అదే ఉత్తమమైన మార్గం. సత్యం దానిదైన గొప్పతనం మీదనే ఆధారపడి ఉంటుంది. దానిని నిలపడానికి మరే ఆధారం అవసరం లేదు. వేదాంతానికి ఎవరితోనూ ఎటువంటి వివాదం లేదు. అది సమస్తాన్నీ తనలో ఇముడ్చు కొంటుంది. అది ఎంతమాత్రం వ్యక్తిగతమైనది కాదు. నీ మార్గంలో నీవు పయనించు. నీ విషయం అమ్మ చూసుకుంటుంది. నీ కుమారునికి, నీ భార్యకు, కుమారి--కు నా ప్రేమ.

ప్రేమ, ఆశీర్వాదాలతో,

జగజ్జననిలో, భవదీయ
తురీయానంద

(3)

శాంతి ఆశ్రమం, కాలిఫోర్నియా,
20 ఆగష్టు, 1901

నా ప్రియమైన ఎక్స్.,

నీ ఉత్తరం, నీవు పంపిన రొక్కం నా చేతికి అందాయి. అందుకు అనేక ధన్యవాదాలు. కానీ, నీవు ఇబ్బంది పడి డబ్బు పంపవద్దు. నీవు నన్ను ఎంత ప్రేమిస్తున్నావో, నా పనిలో సహాయం చెయ్యడానికి నీవు ఎంత ఇష్టపడుతున్నావో నాకు తెలుసు. అన్ని విషయాలను గురించి అమ్మ జాగ్రత్త తీసుకుంటున్నది. మీరందరూ క్షేమంగా ఉన్నారనీ, అభేదానంద స్వామిని ఇష్టపడుతున్నారనీ తెలిసి సంతోషిస్తున్నాను. ఆయన ఇక్కడికి వచ్చి ఒక వారం మాత్రమే ఉన్నారు. ఎక్కువ రోజులు ఉండలేక పోయినందుకు విచారపడ్డాను. ఇక్కడ చాలా వేడిగా ఉంది. ఆయన యోస్‌మైట్‌కు వెళ్ళారు. ఆయన లాస్‌ఏంజిలిస్ వెళ్ళబోయే లోపు నీవు మళ్ళీ ఆయనను శాన్‌ఫ్రాన్సిస్కోలో చూడగలవు. ఆయన రాక, ఆయనతో జరిగిన సంభాషణ చాలా బాగున్నాయి.

నాకు ఎంతో అలసిపోయినట్లుంది. ఇక్కడ కొంతమంది విద్యార్థులు (శిష్యులు) నన్ను విశ్రాంతి కోసం మరోచోటికి వెళ్ళమంటున్నారు. ఇంతవరకు ఏ నిర్ణయానికీ రాలేదు. నీవు గీతను కంఠస్థం చేస్తున్నావని తెలిసి ఆనందపడు తున్నాను. దానిలోని భావాన్ని అర్థం చేసుకోవ డానికీ, ఆ ప్రకారం నడచుకోవ డానికీ ప్రయత్నించు. గీత వంటి గ్రంథం మరొకటి లేదు. అది సర్వవేదాంత తత్త్వశాస్త్రసారం. అవును, మహదేవశాస్త్రి అనువాదం అత్యుత్తమమైనదిగా పరిగణించబడుతోంది. దానికి కారణం అది ఆదిశంకరాచార్యుల భాష్యాన్ని కూడా కలిగి ఉండడమే. అందరికీ నా ప్రేమ, ఆశీర్వాదాలు. ఇప్పుడు తరచుగా మీ అందరి గురించి మనస్సులో ఆలోచిస్తున్నాను.

నీకు సర్వశ్రేయం, ఆనందం కలగాలని నా ప్రార్థన.

దివ్యజననిలో, భవదీయ,

తురీయానంద

(4)

బుఖానన్ వీధి, కేరాఫ్ శ్రీమతి సి.ఎఫ్. పీటర్‌సన్

శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా

18 నవంబరు, 1901

నా ప్రియమైన ఎక్స్.,

నీవు వ్రాసిన మంచి ఉత్తరానికి ధన్యవాదాలు. అది నాకు మొన్న అందింది. కుమారి 'బి' అనారోగ్యాన్ని గురించి తెలిసి నాకెంతో కలవరం, బాధ కలిగాయి. ఆమె ఇప్పుడు ఎలా ఉన్నదో తిరుగు టపాలో నాకు తెలియజేయగలవా? ఆమెకు త్వరలో ఆరోగ్యం, ఉత్సాహం చేకూరుగాక! ఆమెను అడిగానని చెప్పి, ఆమెకు నా ప్రేమ, ఆశీర్వాదాలు అందజెయ్యి. నన్ను చూడడానికి ఇక్కడికి వచ్చినప్పుడు నీవు ఉంచిన కార్డు నాకు అందింది. స్వస్థత చిక్కిన తర్వాత నేను ఆ రోజే వాహ్యాళికి బయటికి వెళ్ళాను. ఇప్పుడు చాలావరకు కులాసాగా ఉన్నట్లే. -- యొక్క దయవల్ల, మంచి సంరక్షణ వల్ల త్వరలోనే నేను మామూలు స్థితికి రాగలనని ఆశిస్తున్నాను. పిల్లలను తరలించావనీ, మీరంతా క్షేమంగా ఉన్నారనీ తెలిసి సంతోషిస్తున్నాను. కుమారి 'బి' క్షేమాన్ని గురించి త్వరలో తెలియజేస్తావని ఆశిస్తున్నాను.

ప్రేమ, ఆశీర్వాదాలతో,

జగజ్జననిలో, భవదీయ

తురీయానంద

(5)

1309, బుఖానన్ వీధి, శాన్‌ఫ్రాన్సిస్కో

18 నవంబరు, 1901

నా ప్రియమైన ఎక్స్..,

నీ మంచి ఉత్తరం, నీవు పంపిన పుస్తకం అందాయి. అవి పంపినందుకు ధన్యవాదాలు. కుమారి 'బి' ప్రమాదస్థితి నుండి బయటపడిందనీ, నెమ్మదిగా కోలుకుంటున్నదనీ తెలిసి నాకెంతో ఆనందంగా ఉన్నది. 'బోస్టన్' సమీపంలో ఉన్న 'కేంబ్రిడ్జి' లో ఉన్నప్పుడు ఈ పుస్తకాన్ని చూశాను. సెయింట్ ఫ్రాన్సిస్ మీద ఉపన్యాసమివ్వడానికి ఆ గ్రంథకర్త అక్కడికి వచ్చినప్పుడు ఆయనను దర్శించాను. ఆయనతో పరిచయం కలిగింది. ఆయన నాకెంతో నచ్చాడు. ముఖ్యంగా ఆయన యొక్క సరళనమ్రస్వభావాన్ని నేనెంతో సంప్రీతితోను, సంతోషంతోను గమనిం చాను. ఆయన ఈ దేశంలోని మేధావులలో ఒకడనీ, తనకు తెలిసినంతలో ఉన్నత జీవనాన్ని గడపడానికి ప్రయత్నిస్తున్నాడనీ నేను భావిస్తున్నాను. ఆయనకు ఇంకా వేదాంత సత్యాలతో సన్నిహిత సంబంధం ఏర్పడలేదని నాకు అనిపించింది. అయినా, ఆయన తన భావాలలో స్వతంత్రంగాను, విశాల హృదయుడుగాను ఉన్నట్టు కనిపించాడు. ఈసారి ఆ పుస్తకాన్ని జాగ్రత్తగా చదువుతాను. పుస్తకాన్ని పంపించినందుకు నీకు మరొకసారి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఎప్పుడైనా వీలుచేసుకుని నీవు ఇక్కడికి వస్తే నిన్ను చూడడం నాకెంతో ఆనందాన్ని కలిగిస్తుంది. ఇప్పుడు నేను క్షేమంగాను, ఉత్సాహంగాను ఉన్నాను. మీరందరు క్షేమంగా ఉన్నారని విశ్వసిస్తున్నాను.

ప్రేమ, ఆశీర్వాదాలతో,
జగజ్జననిలో, భవదీయ,
తురీయానంద

(6)

(1902 జులై, 4వ తేదీ వివేకానంద స్వామి మహాసమాధి తర్వాత ఈ ఉత్తరం వ్రాయబడింది. తురీయానంద స్వామి భారతదేశానికి తిరిగి వచ్చేటప్పుడు రంగూనులో ఈ విషాదవార్త ఆయనకు తెలిసింది.)

బేలూరు మఠం, ఇండియా
20 సెప్టెంబరు, 1902

నా ప్రియమైన ఉజ్జ్వల,

ఆప్యాయతతో కూడిన నీ ఉత్తరం అందింది. మీరంతా క్షేమంగా ఉన్నారని తెలిసి ఆనందిస్తున్నాను. ఇక్కడ సర్వం తల్లక్రిందులైపోయింది. కానీ, జగజ్జనని అన్నింటినీ మంచివైపుకే మరలిస్తుందని ఆశిస్తున్నాను. ఇక్కడికి వచ్చిన తర్వాత అనారోగ్యంతో మంచం పట్టాను. ఇప్పటికి కూడా మామూలు స్థితికి రాలేదు. నాకు తగిలిన దెబ్బ చాలా తీవ్రమైనది. ఆ తాకిడి నుండి ఇంకా కోలుకోలేకుండా ఉన్నాను. వివేకానంద స్వామి ఎంతగానో ఆశిస్తున్న విశ్రాంతి ఇప్పుడు ఆయనకు లభించిందన్నదే కొంత సంతృప్తి. ఆయన లోకానికి ఎంత సేవ చేశారో లోకమే తెలుసుకోవాలి. అలా తెలుసుకుని ఈ లోకం యుగాల పర్యంతం దాని

ప్రయోజనాన్ని పొందుగాక. సమాధిలో ఆయన తన శరీరాన్ని వదిలివేశారు. అది సామాన్యమైన మరణం ఎంతమాత్రం కాదు. అది చైతన్యంతోనే శరీరంలో నుండి వెళ్ళిపోవడం. నిజంగా అది మనకు అత్యంత బాధాకరమైన విషయం. కానీ, మనం దివ్యజనని ఇచ్ఛకు తల ఒగ్గడం నేర్చుకోవాల్సి ఉంది. నేను ఇక్కడికి చేరే లోపలే ఆయన వెళ్ళిపోయారు. అది నా జీవితంలో ఎన్నడూ మరువలేని విషాదకరమైన సంఘటన. ఇక నా భవిష్యత్ ప్రణాళిక ఎలా ఉంటుందో నాకు తెలియదు. అయినా దివ్యజనని నాకు దారి చూపుతుందని విశ్వసిస్తున్నాను. త్రిగుణాతీతానంద స్వామి త్వరలో శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళే ప్రయాణంలో ఉంటారు. ఆయన చాలా చక్కని వ్యక్తి. పారమార్థిక విషయాలలో అనేకమందికి ఆయన ఎంతో సహాయకారిగా ఉండగలడు. ఆయన మీతో ఉన్నప్పుడు మీరు ఆయనను సర్వవిధాలా సుఖంగా ఉండేలా, మీలో ఒకడిగా చూసుకుంటారని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. -- దగ్గర నుండి, ఇతరుల దగ్గర నుండి జాబులు వచ్చాయి. దయచేసి అక్కడి స్నేహితులందరికీ నన్ను జ్ఞాపకం చెయ్యగోరుతున్నాను. యథాప్రకారం వారందరికీ నా హృదయపూర్వకమైన ప్రేమ, ఆశీస్సులు తెలియజెయ్యి. దయచేసి మీ అమ్మకు నా ప్రేమపూర్వక నమస్కారాలు అందించు. మీ అందరి మీద శ్రీ రామకృష్ణుల అనుగ్రహం సదా ఉండుగాక! ఈ శ్రీరామకృష్ణుల పుత్రుడు, సేవకుడు అయిన నా నుండి విన్న శ్రీరామకృష్ణుల ఉపదేశాల వలన మీకు ఏమన్నా వికాసం కలిగితే, వాటిలో మంచివని తోచినవాటిని మీరు ఆచరిస్తూ సకల సంతోషసౌభాగ్యాలతో వర్ధిల్లెదరు గాక.

తురీయానంద

అప్పుడప్పుడు మీ విషయాలు తెలిపితే సంతోషిస్తాను. ఇతరులకు నేను వ్రాసిన ఉత్తరాల నుండి ఇక్కడి సమాచారం మీకు తెలిసి ఉంటుంది. నిజమైన భక్త్యుత్సాహాలతో నీవు వ్రాసిన ఉత్తరాన్ని చూసి నేనెంతో ఆనందించాను. దివ్యజనని నిన్ను ఆశీర్వదించు గాక! నన్ను ఆమె తన రక్షణలో ఉంచుకుని నీవు దారి తప్పకుండా ఉండేట్లు చేయుగాక అని నా హృదయపూర్వక ప్రార్థన.

తురీయానంద

మలిమాట: -- నుండి అందిన కొన్ని చక్కని మాటలను చూసి నేనెంతో ఆనందించాను. ఆ ఉత్తరంలో ఆమె చిరునామా వ్రాయలేదు. నీవు ఆమెను కలిసినప్పుడు దయచేసి నా కృతజ్ఞతా భావాలు, ప్రేమ, ఆశీస్సులు తెలియజేసి నన్ను ఆమెకు జ్ఞాపకం చెయ్యి. నా అమెరికా మిత్రులలో ఆమె ఒక ప్రధానమైన వ్యక్తి. యథాప్రకారం నా హృదయపూర్వకమైన ప్రేమ, ఆశీస్సులు ఆమె ప్రియతమ సోదరికి, మేనకోడలికి తెలియజెయ్యి.

(7)

బేలూరు మఠం, హౌరా, ఇండియా
16 అక్టోబరు, 1902

నా ప్రియమైన జో (కుమారి జోసఫీన్ మెక్లౌడ్),

ఆప్యాయతతో నిండిన నీ ఉత్తరాన్ని ఎంతో సంతృప్తితో మొన్న అందుకున్నాను. వివేకానంద స్వామి నా యెడల విసుగు చెందలేదని, తన ఉద్యమంలో నాకు ఉన్న విశ్వాసాన్నీ, భక్తినీ చూసి సంతృప్తి చెందారనీ నీవు వ్రాసినందువల్ల నా కెంతో ఓదార్పు కలిగింది. మళ్ళీ ఆయనను చూడలేకపోవడం నిజంగా ఎంతో దురదృష్టకరమైన విషయం. అయితే మార్చలేని దాన్ని మనం సహించడం నేర్చుకోవాలి. స్టీమరు రంగూన్ నుండి బయలుదేరుతున్నప్పుడు తోటి ప్రయాణీకుడి ద్వారా ఈ విషాదవార్త (వివేకానంద స్వామి నిర్యాణవార్త) నాకు అందింది. మొదట దాన్ని నమ్మలేకపోయాను. మేము అమెరికాలో ఉన్నప్పుడు పత్రికలలో ప్రకటించే ఇతర వార్తలలాగా ఇది కూడా గాలి కబురేమోనని అనుకున్నాను. కానీ, ఆ దుఃఖవార్త యొక్క నిజం తెలిసినప్పుడు నాకు తట్టుకోలేనంత గాఢమైన దెబ్బ తగిలింది. పూర్తిగా దిగ్భ్రమ చెందాను. దాని ప్రభావం నుండి ఇంకా నేను కోలుకోలేకుండా ఉన్నాను. శారీరికంగా నేనెంతో కోలుకున్నాను కానీ, ఇంకా నా మెదడు బలహీనంగానే ఉంది. ఇప్పుడప్పుడే నేను ఏదైనా (ఉద్యమ) కార్యక్రమాన్ని చేపట్టాలన్న ఆలోచననైనా చెయ్యలేకుండా ఉన్నాను. నాకు సంపూర్ణమైన విశ్రాంతి, ముఖ్యంగా మానసిక విశ్రాంతి అవసరం. కానీ అది లభించడం చాలా కష్టంగా కనిపిస్తోంది. రామకృష్ణానంద స్వామి నన్ను మద్రాసు రమ్మన్నారు. అక్కడ నాకు విశ్రాంతి కలిగేటట్లు అన్ని జాగ్రత్తలు తీసుకుంటానని వ్రాశారు. శ్రీమతి సేవియరు కూడా ఎంతో దయతో నన్ను హిమాలయాలకు రమ్మని ఆహ్వానించింది. ఎక్కడికి వెళ్ళాలో నాకు పాలుపోవడం లేదు. ప్రస్తుతం ప్రశాంతంగా ఏకాంతంలో ఉండాలనీ, ఆధ్యాత్మిక బోధ వగైరా పనులతో ఏమాత్రం సంబంధం లేకుండా ఉండాలనీ అనిపిస్తున్నది. నేను మళ్ళీ ఏదో ఒక కార్యక్రమం చేపట్టే లోపల కొంతకాలం దివ్యజననితో పూర్తిగా లీనమై ఉండాలనే భావన మాత్రం కలుగుతున్నది. ఆమెకు అలా చెయ్యాలనే ఇచ్ఛ ఉంటే 'అమ్మ' నాకు ఆ మార్గంలో తగిన ఏర్పాటు చేస్తుందని ఆశిస్తున్నాను. దాని కోసం ప్రార్థిస్తున్నాను.

వివేకానంద స్వామి విషయంలో అది ఆయనకు మరణం కాదని నేను గట్టిగా నొక్కి చెప్పగలను. ఆయన సమాధిలో పూర్తి చైతన్యంతో, స్వచ్ఛందంగా తన శరీరంలో నుండి బయటకు వెళ్ళిపోయారు. దానికి ఇతర కారణాలు కూడా ఉండవచ్చు. కానీ, ఆయనకు విశ్రాంతి కావాలనేది యథార్థం. ఈ లోకం ఆయనకు ఎన్నటికీ ఆ విశ్రాంతిని ఇచ్చి వుండేది కాదు. అందువల్ల ఆయన తానుగా చేపట్టిన ప్రపంచ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని కొనసాగించడానికి ఆయనకు ఈ విశ్రాంతి ఉపయోగిస్తుందని భావించి మనం ఓదార్పు చెందవచ్చు. ఆయన అకాలమరణాన్ని గురించి ఈ లోకం విచారపడడం సమంజసమే. ప్రపంచ చరిత్రలో అద్వితీయంగా నిలిచిపోయిన ఆయన యొక్క మహత్తరకార్యాన్ని మెచ్చుకోవడానికి లోకం ఇప్పుడు జాగృతమవుతున్నది. కాలం గడిచే కొద్దీ ఈ లోకం దానిని మరింతగా తెలుసుకుంటుంది.

యథాప్రకారం నీకు ఆప్యాయతతో కూడిన ప్రేమ, నమస్కారాలు.

జగజ్జననిలో, భవదీయ
తురీయానంద

(8)

బృందావనం, ఇండియా
20 జనవరి, 1903

నా ప్రియమైన ఉజ్జ్వల,

ఆప్యాయతతో నీవు వ్రాసిన జాబు కొద్దిరోజుల క్రితం అందింది. దాన్ని మఠం నుంచి నాకు పంపించారు. రెండు మాసాలుగా నేను ఇక్కడ ఉంటున్నాను. నాలుగు నెలల క్రితం మఠం వదలిపెట్టి దారిలో అనేక పుణ్యక్షేత్రాలు దర్శించాను. ఇప్పుడు నేనున్న ప్రదేశం మఠం నుండి సుమారు వెయ్యిమైళ్ళ దూరంలో ఉంది. ఇది భగవద్గీత బోధించిన జగద్గురువైన శ్రీకృష్ణుని జన్మస్థానం. హిందువులు మహోన్నతమైన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా దీనిని భావిస్తారు. ఇంకా పూర్తిగా స్వస్థత చిక్కకపోయినా ఇక్కడ నాకు చాలా హాయిగా ఉంది. ఈపాటికి కొత్తగా వచ్చిన స్వామి మీకు పాతవాడయ్యాడని తలుస్తున్నాను. ఆయన సాంగత్యాన్ని అనుభవిస్తున్నారనీ, ఆయన బోధన వల్ల లాభం పొందుతున్నారనీ భావిస్తున్నాను. 'ధీర' ఇంటిలో ఇంతకాలం ధ్యానం కొనసాగిస్తున్నందుకు సంతోషం. ఇంకా క్రమబద్ధంగా దాన్ని కొనసాగిస్తూ ఉండండి. దివ్యజనని --ను, దివ్యజనని సంతానమైన మీ అందరినీ ఆశీర్వదించుగాక! విషయాలను విమర్శించి చూసి, అవి పైకి కనపడే విధంగా కాక, వాటి యథార్థస్థితిలో గ్రహించగల వివేకాన్నీ ఆమె మీకు ఒసగుగాక. ఉజ్జ్వలా! శక్తి కలిగి ఉండు. వారు వీరు చెప్పే సలహాల మీద ఆధారపడకుండా, నీలోనే ఉన్న అమ్మను సంప్రదించి, ఆమె ఆజ్ఞల ప్రకారం నడుచుకో! నిన్ను బంధాలలో పడవేసేది అమ్మ ఆజ్ఞ కాజాలదనీ, విముక్తురాలిగా చేసేది మాత్రమే ఆమె ఆజ్ఞ అనీ నిశ్చయంగా తెలుసుకో! హృదయపూర్వకంగా ఆ విధంగా ఉండు. ఎటువంటి స్వార్థప్రయోజనాలనూ ఆశించవద్దు. సత్యంపట్ల, భక్తి పట్ల యథార్థమైన ప్రేమను కలిగి ఉండు. నీ అంతరంగంలో నుండి 'ఆమే' మాట్లాడుతుంది. ఉజ్జ్వలా! నీవు ఎలా పురోగమిస్తున్నావు? పైపైకి జ్వలిస్తున్నావా? 'వెన్న' అవుతున్నావా? (ఇది శ్రీరామకృష్ణులు చెప్పిన ఒక ఉపదేశం: పాలు చిలికిన తర్వాత వెన్న పైకి తేలుతుంది. అదే విధంగా భక్తి లభించిన తర్వాత మనిషి లోకం నుంచి వేరయిపోయి మాయా సముద్రం పైన తేలుతాడు). లేక నీ సమయాన్నీ, శక్తినీ (విందులు, వినోదాల) సాంఘిక చెత్తాచెదారంలో వ్యర్థం చేస్తున్నావా? నీ ఆదర్శాన్ని ఎన్నడూ వదలకు. గట్టి బిగువుతో దానిని పట్టుకో! అందరికీ సమానమే అయిన 'ఏకైక గమ్యాని'కి నీవు కొనిపోబడతావు. నీవు క్రితం ఉత్తరంలో అడిగినటువంటి ప్రశ్నలు నన్ను అడుగకూడదు. నేను అందరిలోనూ జగజ్జననిని దర్శించగోరేవాణ్ణన్న విషయం నీకు తెలుసు కదా.

అక్కడి దివ్యజనని బిడ్డలందరికీ నన్ను గుర్తు చెయ్యి. అనేకమంది నాకు జాబులు వ్రాస్తున్నారు. కానీ, వారందరికీ జవాబులు వ్రాయలేక పోతున్నందుకు విచారిస్తున్నాను. కానీ, వారందరూ నా స్మృతిపథంలోనే ఉన్నారు. అందరికీ నా ఆశీస్సులు, ప్రేమ! దయచేసి మీ అమ్మకు నా ప్రేమపూర్వకమైన నమస్కారాలు తెలియజెయ్యి.

యథాప్రకారం నీకు నా హృదపూర్వకమైన ప్రేమ, ఆశీస్సులు.

జగజ్జననిలో, భవదీయ
తురీయానంద

(9)

బృందావనం, ఇండియా
26 జనవరి, 1903

నా ప్రియమైన కుమారి మెక్లౌడ్,

నీవు నవంబరు 18వ తేదీన వ్రాసిన ఉత్తరం ఇక్కడికి తిరిగి బట్వాడా చెయ్యబడి 1902 డిసెంబరు 16వ తేదీన అందింది. దానికి నేను ఎన్ని ధన్యవాదాలు చెప్పినా తక్కువే. ఇంతకంటే ముందే జవాబు వ్రాయలేకపోయినందుకు చింతిస్తున్నాను.

పనిని చేపట్టే విషయంలో నీవు ఇచ్చిన ఒక సలహా నాకు చాలా ప్రోత్సాహ జనకంగా ఉంది. పని గురించి నేనెంతో ఆందోళన పడుతుండేవాణ్ణి. కానీ, "పనిని ప్రారంభించడానికి తొందరపడవద్దు. ప్రణాళికలకు నీవు కావాలి, నీకు ప్రణాళికలు అక్కరలేదు," అనే నీ సలహా నా మనస్సును స్థిరపరచింది. నా ప్రియమైన జో! దివ్యజనని నిన్ను దీవించు గాక! క్రమంగా నేను స్థిమితపడు తున్నాను. వివేకానంద స్వామి వెళ్ళిపోవాలనీ, మళ్ళీ నేను ఆయనను దర్శించకూడదనీ దివ్యజనని ఇచ్ఛ కాబోలు. నీవు గానీ, మరెవరు గానీ ఏమి చెయ్యగలరు? ఎప్పుడెప్పుడు ఆయనను గురించి తలచుకున్నా, ఆయన తనకు అత్యావశ్యకమైన విశ్రాంతిలో ఇప్పుడు ఉన్నారనీ, ఈ లోకం దాన్ని ఆయనకు ఎన్నడూ ఇచ్చి ఉండేది కాదనీ ఒక ఓదార్పు మాత్రం కలుగుతోంది.

మొట్టమొదటిసారిగా వివేకానంద స్వామి జన్మదినోత్సవం ఈ సంవత్సరం మఠంలో జరిపారు. దిగ్విజయంగా జరిగింది. నీవు శారదానంద స్వామి నుండి ఈ వార్తను వినే ఉంటావు. మద్రాసు, వారణాసి, అలహాబాదు, ఇంకా అనేకచోట్ల ఆ జన్మదినాన్ని ఉత్సవాలతో జరుపుకున్నారు. యావద్భారతదేశం ఆ ఆనందంలో మునిగిపోవడం నేర్చుకొంటుంది గాక! వివేకానంద స్వామి జీవితంలో గురుమహరాజ్ (శ్రీరామకృష్ణులు) శాశ్వతంగా కీర్తింపబడుదురు గాక! అట్టి వారిని కీర్తించడం, వారి పట్ల భక్తిగౌరవాలను కనపరచడమే అన్ని దేశాలలో ఉన్న మానవజాతిని నైతికంగాను, పారమార్థికంగాను, సర్వకాలాలలో ఆనందింపజేస్తుంది.

మనఃపూర్వకంగా భవదీయ,

(10)

బృందావనం, ఇండియా
29 ఏప్రిల్, 1903

నా ప్రియమైన ఉజ్జ్వల,

మార్చి 2వ తేదీన నీవు వ్రాసిన సుదీర్ఘమైన ఉత్తరం, ఏప్రిల్ 16వ తేదీన బేలూరు మఠం నుండి తిరిగి పంపబడి నాకు అందింది. దానికి నీకు నా ధన్యవాదాలు. నీవు అంత చక్కగా పనిచేస్తున్నందుకు, త్రిగుణాతీతానంద స్వామి పని మీకు తృప్తికరంగా ఉన్నందుకు నాకు ఆనందం కలిగింది. --- నుండి ఒక ఉత్తరం, --- నుండి మరొక ఉత్తరం వచ్చాయి. దయచేసి నా తరఫున వారికి ధన్యవాదాలు తెలియజేస్తావా? మొట్టమొదటసారిగా వేదాంత సొసైటీ కొత్త గదులలో శ్రీరామకృష్ణుల జన్మదినోత్సవం చెయ్యడం ఎంతో నచ్చింది. ఈ దివ్యమైన పని సొసైటీకి చాలా శుభప్రదమైనది, అదృష్టదాయకమైనది. అక్కడ ఉత్సవాలను వర్ణిస్తూ నీవు మఠానికి తెలియజెయ్యడం నాకు సంతోషాన్ని కలిగించింది. కానీ ఆ నివేదికను నేను చూడలేదు. నేను మఠానికి వెయ్యి మైళ్ళదూరంలో ఉన్నాను. అక్కడి నుంచి నాకు ఉత్తరాలు ఎప్పుడో కానీ రావు. నీవు రజస్సుతో చురుకుగా పనిచేయడం మంచిదే. కానీ అంతటితో అక్కడే ఆగిపోకూడదు. నీవు వెన్నగా తయారు కావాలని అమ్మ కోరుతోంది. అంతకు ఏమాత్రం తక్కువైనా ఆమెకు సంతోషం కలగదు. దీనినెప్పుడు మరువవద్దు. ఓ జగజ్జనని పుత్రికా! హృదయంలో పసిబిడ్డలాగా ఉండు. ఏ ప్రలోభానికీ నీవు భయపడనక్కరలేదు. పెద్దపిల్లల విషయంలో కంటే అమ్మ తన చంటిపిల్లల విషయంలో ఎక్కువ జాగ్రత్త తీసుకుంటుందని గట్టిగా నమ్ము.

'జి' నుంచి నాకు తరచు జాబులు వస్తుంటాయి. ప్రస్తుతం శాంతి ఆశ్రమంలో అతడు ఒంటరిగానే ఉంటున్నాడు. అతడు ధైర్యవంతుడు, విశ్వాసపాత్రుడు. అయినా నీకు చేతనైనంతగా అతణ్ణి ఉత్సాహపరచడానికి ప్రయత్నించు. ఆప్తులు, సన్నిహితులయిన వారి నుండి వచ్చే మంచి మాటలు నిరుత్సాహంలో ఉన్న వ్యక్తికి ఎంతో మేలు చేస్తాయి. దీనిని చక్కగా గుర్తుంచుకో. దూరప్రదేశాలకు విహారానికి పోయి సంతోషపడుతూ ఉండడం కంటే సోదరమానవుణ్ణి ఓదార్చి, సానుభూతి చూపించడం మరింత మానవత్వం అనిపించుకుంటుంది. ఓ నా శిశువా! నిజంగా, యథార్థంగా, నిస్స్వార్థంగా ఉండడం నేర్చుకో. ఆ మార్గంలో సూక్ష్మంగా దాగివుండే తప్పుడు తర్కాల విషయంలో జాగ్రత్తపడుతూ, వాటి నుండి తప్పించుకో. దివ్యజనని నిన్ను దీవించు గాక!

'సి' వివాహాన్ని గురించి విన్నాను. 'ఎస్' కు నా ప్రేమను తెలుపు. ఆమెను గురించి ఎంతో అనుకుంటూ ఉంటాను. ఆమె నాకు తల్లి. కానీ ఆమె తన సమయాన్ని గురించి ఏమీ పట్టించుకుంటున్నట్లు కనిపించడం లేదు. 'సి' గురించి నాకు తెలియజేస్తావా? కొన్నిసార్లు

ఆమెను గురించి తెలుసుకోవాలని అనిపిస్తుంది. ఇప్పుడు ఆమె కులాసాగా ఉన్నదని అనుకుంటాను. మీ అమ్మ ఎలా ఉంది? నీ కాళ్ళమీద నీవు నిలబడి ఇప్పుడు స్వతంత్రురాలివిగా ఉన్నందుకు ఆమె నిజంగా సంతోషపడి ఉంటుంది. నీకు చేతనైనంత వరకు ఆమెను సంతోషపెట్టు. అది నీ ప్రథమ కర్తవ్యం. దయచేసి ఆమెకు నా ప్రేమపూర్వకమైన నమస్కారాలు అందించు. అక్కడి మిత్రులు, విద్యార్థులందరికీ నన్ను గుర్తుచేసి, వారికి నా శుభాశీస్సులు, ప్రేమ తెలియజెయ్యి. ఇప్పుడు నేను చాలావరకు స్వస్థతతోనే ఉన్నాను. కానీ, ఇంకా పనిని సరైన విధానంలో ప్రారంభించలేదు. అమ్మ నా కోసం దాన్ని ఏర్పరుస్తుంది. నాకు ఏది మంచిదని ఆమెకు తోస్తుందో ఆ ప్రకారం నన్ను సరైన ప్రదేశంలో, సరైన పనిలో నియోగిస్తుందని నాకు తెలుసు. మనకు తెలిసినా, తెలియకపోయినా ఈ విశ్వంలో పని చేస్తున్నదంతా ఆమెయే. కానీ ముక్తి కలగాలంటే, అనుభవం ద్వారా ఈ విషయాన్ని మనిషి తెలుసుకోవాలి. నా దగ్గర నుండి ప్రతిసారీ ప్రత్యుత్తరాలను ఆశించకుండా, ఎక్కువ వివరాలతో తరచుగా ఉత్తరాలు వ్రాస్తూ ఉండు. ఎల్లప్పుడూ నా ఉత్తరాలను వ్యక్తిగతమైనవిగానూ, వీలైతే రహస్యమైనవిగానూ భావించు. నీ గురించి నీవు నిరంతరం ప్రార్థిస్తున్నట్లు, నా గురించి కూడా ప్రార్థించు. సదా నీకు నా ప్రేమ, దీవెనలు.

దివ్యజననిలో, భవదీయ,
తురీయానంద

(11)

బృందావనం,
27 మే, 1903

నా ప్రియమైన ఎక్స్.,

నీ ఏప్రిల్ 18వ తేదీ ఉత్తరం నాకు అందింది. నీ ఉత్తరంలో కుమారి 'బి' దయతో వ్రాసిన చీటీ కూడా ఉంది. అక్టోబరు 1902లో నీవు ఆప్యాయతతో వ్రాసిన చక్కని జాబు కూడా చేరింది. ఆ రెండు ఉత్తరాలకు సదా నా ధన్యవాదాలు. కుమారి 'బి' కి కూడా నా ధన్యవాదాలను ఇంతకాలంగా వ్రాయలేక పోయినందుకు చింతిస్తున్నాను. ఇంతకాలం ఏదో ఒక దానివల్ల బాధపడుతూనే ఉన్నాను. బాధల నుండి ఇప్పటికీ విముక్తి కలగలేదు. గడచిన కొద్ది సంవత్సరాలుగా నేను ఎదుర్కొన్న జీవిత పరీక్షలన్నింటి నుండి కలిగిన దుర్భరమైన దెబ్బల వల్ల, నా నాడీవ్యవస్థ గొప్ప మార్పుకు లోనైందనుకుంటాను. నా మామూలు ఆరోగ్యస్థితి ఈ మిగిలిన జీవితంలో అసలు వస్తుందో రాదో అనుమానమే. అసలు వస్తే, దానికి చాలాకాలం పడుతుందని భావిస్తున్నాను. త్రిగుణాతీతానంద స్వామి శాన్‌ఫ్రాన్సిస్కోలో చాలా గొప్పగా పనిచేశారనీ, మీకందరకు ఆయన ఎంతో నచ్చారనీ విని ఆనందిస్తున్నాను. మీరు అనుకున్నట్లు నాకు ఎవ్వరి దగ్గర నుంచీ ఆయన చేసిన పనిని గురించిన వివరాలు అందలేదు. దానిని గురించి వినాలని ఎంతో కుతూహలంగా ఉన్నాను. ఆ పనిని గురించి పూర్తి వివరాలు

నీవు నాకు తెలియజేస్తే ఎంతో ఆనందిస్తాను. కానీ మన ఉత్తరాలు మన ఇద్దరి మధ్యనే ఉండనివ్వు.

మీతోపాటు కొంతకాలం ఒక స్వామి రామ్ (తీర్థ) ఉన్నారని తెలిసింది. ఆయనను గురించి నీ నుండి కొంత వినాలని ఉంది. గ్రూప్‌ఫోటోలో నాతో పాటు ఇతర స్వామీజీలను కూడా నీవు చూశావని తెలిసి చాలా సంతోషించాను. ఆ ఫోటో యొక్క కాపీ ఒకటి నాకు పంపుతావా? నాకు దానిని చూడాలని ఉంది. దానిని నా బృందావనం చిరునామాకు పంపు. నీవు పారమార్థికంగా ముందుకు సాగడం, నీ శక్తివంచన లేకుండా నీ ఆదర్శాన్ని అనుసరించడం కన్నా నాకు ఆనందకరమైన విషయం మరొకటి లేదు. 'అమ్మ' మీ అందరినీ దీవించి, ఆమె కౌగిలిలో సన్నిహితంగా ఉంచుగాక!

నీవు (గురుదాసుతో) ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతున్నావని తెలిసి చాలా సంతృప్తి చెందుతున్నాను. ఈ (గురుదాసు) ఎంత గొప్ప వ్యక్తి! ఆశ్రమంలో ఇప్పుడు అతడు ఒక్కడే ఉంటున్నాడు. (గురుదాసు) తన పేరుకు తగినట్టే సార్థకనామధేయుడు. నిజంగా అతడు ధన్యాత్ముడు. నన్ను శ్రీమతి --కి, కుమారి --కి గుర్తు చెయ్యి. నా మీద వారు మాటల్లో వ్రాసి వ్యక్తపరచిన భావాలకు, వారి పారమార్థికాభివృద్ధికి నేను నిజంగా ఎంతో ఆనందిస్తున్నాను. ప్రేమ అంతా --కు. దివ్యజనని తన ఇష్టానుసారం అతనిని పైకి తెచ్చుగాక. స్నేహితులందరికీ నా శుభాశీస్సులు, ప్రేమ, సదా నీ కోసం ప్రేమ, ప్రార్థనలతో,

దివ్యజననిలో, భవదీయ,

తురీయానంద.

(12)

బృందావనం, ఇండియా

24 జూన్, 1903

నా ప్రియమైన కుమారి మెక్లౌడ్‌కు,

నీవు స్విట్జరులాండు నుంచి అత్యంత ఆప్యాయతతో వ్రాసిన మే 5వ తేదీ ఉత్తరానికి స్వాగతం, సుస్వాగతం. నీకు చాలావరకు కులాసాగా ఉన్నదని తెలిసి చాలా సంతోషించాను. నీవు ఇప్పుడు పూర్తి ఆరోగ్యంతో ఉన్నావని ఆశిస్తాను.

వివేకానంద స్వామి ప్రారంభించిన దివ్యజనని యొక్క ఉద్యమం సర్వత్రా వర్ధిల్లుగాక! దివ్యజనని బిడ్డలు ఆమె సన్నిధికి చేరుదురుగాక. అవును, జో! నీతో నేను సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాను. భారత ప్రజలు తమను పెంచి, పోషిస్తున్న అమృతమయమైన దివ్యశక్తితో సజీవంగా ఉన్నారు. ఆ ప్రకారంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం వారి పరిస్థితి దుర్భరంగా ఉంది. వారి మధ్యలో నుండి వివేకానంద స్వామి హఠాత్తుగా అస్తమించడం నాకింకా అగమ్యగోచరంగానే ఉంది. వివేకానంద స్వామి ఈ సమస్యని పరిష్కరించినట్లుగానే నాకనిపిస్తోంది. ఆయన జీవితమంతా భారతదేశంలోని పేదల దుఃస్థితిని బాగుచెయ్యడానికే

సమర్పిం చారు. అయినప్పటికీ, ఏది మనకు శ్రేయస్కరమో ఆ జగజ్జననికే తెలుసు, మనకు తెలియదు. జగజ్జనని ఏది నిర్ణయిస్తుందో అది మన మంచికేననీ, వేరే గత్యంతరం లేదనీ తెలుసుకుని, ఆమె ఆజ్ఞను శిరసావహించాలి! ఆమెను ఎప్పటికీ మరువకుండా ఉండడమే మనం చేయవలసిన పని!

మనఃపూర్వకంగా భవదీయ,
తురీయానంద

(13)

బృందావనం, ఇండియా
12 ఆగష్టు, 1903

నా ప్రియమైన ఉజ్జ్వలకు,

నీవు జూన్ 10వ తేదీన వ్రాసిన జాబు అందింది. మీరందరు కులాసాగా ఉన్నారని తెలిసి నేను ఎంతో ఆనందించాను. అదే టపాలో 'డి' దగ్గర నుండి కూడా ఉత్తరం వచ్చింది. ఆమె ఉత్తరానికి సమాధానం ఇదివరకే వ్రాశాను. ఆమె దగ్గర నుండి మరో ఉత్తరం వచ్చింది. దానికి ఇప్పటిదాకా సమాధానం వ్రాయడం కుదరలేదు. క్రితం ఉత్తరంలో 'సి' ని గురించి సమాచారం ఇస్తానని నీవు వ్రాశావు. అందువల్ల నీ ఉత్తరం కోసం వేచి ఉన్నాను. ఏమైనా ఆమె అన్నివిధాలా క్షేమంగా ఉన్నదని ఆశిస్తున్నాను. ఇటీవల 'సి' దగ్గర నుండి జాబు వచ్చింది. అది చక్కగానూ, ఉత్సాహభరితంగానూ ఉంది. కానీ, దానిలో కూడా ఆమె ఆరోగ్యాన్ని గురించి ఏమీ వ్రాయలేదు. దాని నిండా మనోభావాలు (సెంటిమెంట్లు) మాత్రమే ఉన్నాయి. ఇంకా ఆమెకు సమాధానమివ్వలేదు. ఈసారి నీవు ఆమెకు వ్రాసినప్పుడు దయచేసి నాప్రేమపూర్వక నమస్కారాలను అందజెయ్యి. ఓ, నా ప్రియమైన ఉజ్జ్వలా! అవును, మీ తీరాన్ని వదిలిపెట్టి, సంవత్సరం దాటిపోయింది. కానీ అంతకంటే ఎక్కువ రోజులే అయినట్లు అనిపిస్తున్నది. నన్ను ఎక్కడ ఉంచదలుచుకున్నదో, ఆ జగజ్జననికే తెలుసు. కానీ ఒక్క విషయం గట్టిగా చెప్పగలను. నేను ఎక్కడ ఉన్నప్పటికీ, మీ అందరి విషయం నా మనస్సులో ఉంచుకుని, మీ అందరి పారమార్థిక అభివృద్ధి కోసం జగజ్జనని ప్రార్థించడంలో ఏమాత్రం అశ్రద్ధ చెయ్యను. మీరందరు జగజ్జననిని అంటిపెట్టుకుని, ఒకరికొకరు ప్రేమాస్పదులుగాను, సహాయభూతులుగాను ఉండండి. --యొక్క విషయం తరచూ వింటున్నాను. సదా దివ్యజనని అతణ్ణి రక్షించుగాక. ఆశ్రమంలో అతడు ఒక విశ్వాసపాత్రుడైన ధీరుడుగా తన స్థానంలో స్థిరంగా ఉన్నాడు. అతనిని గురించి నీకు ఎక్కువగా చెప్పనవసరం లేదు. నీవు అతనికి ఎంత సహాయం చేస్తున్నావో! దానికి నిజంగా నేనెంతో ఆనందిస్తున్నాను. 'బి' కు నా ప్రేమపూర్వకమైన నమస్కారాలు. ఆమెకు కోటిన్నర కోరికలున్నా ఫర్వాలేదు. ఇంకా ఆమె నా తల్లియే. త్రిగుణాతీతానంద స్వామి ఈసారి మళ్ళీ నూతనోత్సాహంతోనూ, శక్తితోనూ మీ మధ్య ఉన్నారని ఆశిస్తున్నాను. ఇదివరకటి కంటే ఎక్కువ సంతోషంతో ఆయన సాంగత్యాన్ని, ఉపన్యాసాలను మీరు

ఆనందిస్తున్నారనుకుంటాను. మీ శక్తివంచన లేకుండా ఆయనకు సాయపడుతున్నారని తెలిసి సంతోషిస్తున్నాను. 'ఎస్' హ్రస్వలేఖనం (షార్టు హాండు) నేర్చుకోవడం నాకు సంతృప్తికరంగా ఉన్నది. అక్కడ ఆమె స్వామికి మరో సహాయకురాలిగా ఉంటుంది. 'ఎస్' మళ్ళీ ఒక ప్రమాదకరమైన శస్త్రచికిత్స తర్వాత కులాసాగా ఉన్నదనీ, --తోను, --తోను కలిసి 'కాంప్ టేలర్'లో ఉంటున్నదనీ తెలిసి చాలా సంతోషించాను. వారికి నా ప్రేమ. 'ఎఫ్' విషయమేమిటి? నేను కోరినవాటి గురించి నీవు శ్రద్ధ తీసుకోనట్లు కనిపిస్తోంది. స్పష్టంగా వ్రాయగోరుతున్నాను. వేదాంత సొసైటీ సభ్యుల మధ్య -- విషయంలో సఖ్యత లేదని నా ఊహ. ఇది యథార్థమేనా? మంచిది. ఏ వర్గభావంగల వారితోనైనా నీవు జట్టు కట్టవద్దు. నీవు సుఖంగా ఉండదలిస్తే, ఎల్లప్పుడూ వర్గభేదాలకు దూరంగా ఉండు. అందరిలోనూ అమ్మను చూడు. అదే కీలకం. ఇప్పుడు నేను చాలావరకు కులాసాగానే ఉన్నాను. మీరందరూ క్షేమంగా ఉన్నారని తలుస్తున్నాను. 'ఎమ్'కు, 'ఎస్'కు, కోరుతున్న స్నేహితులందరికీ నా ప్రేమ. యథాప్రకారం నీకు నా ప్రేమ, ఆశీర్వాదాలు.

దివ్యజననిలో, భవదీయ,

తురీయానంద

మలిమాట: నీవు ఈ సారి వ్రాసినప్పుడు వీలుంటే స్వామి రామ(తీర్థ) చేస్తున్న పనిని గురించి, ధర్మపాల చేస్తున్న కార్యక్రమాల గురించి కొంత సమాచారాన్ని నాకు తెలియజెయ్యి. నాకు ఆసక్తి ఉన్న ముఖ్యసమాచారాన్ని తెలియజెయ్యడానికి ప్రయత్నించు.

(14)

బృందావనం, ఇండియా

16 ఆగష్టు, 1904

నా ప్రియమైన ఎక్స్.,

నీవు జులై 4వ తేదీన వ్రాసిన జాబు అందింది. ధన్యవాదాలు. మీ అందరి విషయాలతోనూ ఆ జాబు నిండి ఉంది. అన్ని విషయాలను వివరిస్తూ అంత పెద్ద ఉత్తరాన్ని వ్రాయడం నీ మంచితనాన్ని తెలియజేస్తున్నది. నీ మనియార్డరు కూడా చేరింది. నీ అక్కరలకే అంతంత మాత్రంగా ఉన్న రాబడిలో నుండి నీవు డబ్బు పంపించినందుకు బాధపడుతున్నాను. ఏ విధంగానైనా సరే నా కోసం ఇబ్బంది పడవద్దని చెప్పదలచుకున్నాను. అది నాకు చాలా బాధ కలిగిస్తుంది. కుమారి --- నుండి కొన్ని వారాల క్రితం ఒక ఉత్తరం వచ్చింది. దానిలో ---, పిల్లలు, ఆమె కూడా శాంతి ఆశ్రమంలో ఎలా ఉన్నదీ, అక్కడి ప్రశాంత వాతావరణాన్ని ఎలా అనుభవించిందీ, దానివల్ల ఎలా లాభం పొందిందీ, మొదలైన విషయాలు వ్రాసింది. ఆ ఉత్తరం నన్ను ఎంతగానో ఆనందింపజేసింది. నా తరఫున దయచేసి ఆమెకు ధన్యవాదాలు తెలియజేస్తావా? నాకు వచ్చిన ఉత్తరాలన్నింటికీ నేను సమాధానం వ్రాయలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. కానీ కుమారి --- దీన్ని అర్థం చేసుకుంటుందని, క్షమిస్తుందని నాకు

తెలుసు. ఇప్పుడు చాలా బాగా ఉన్నాను. శారీరికంగా ఎంతో కోలుకున్నాను. కానీ, ఇంకా నా నరాలు సరైన స్థితికి రాలేదు. అప్పుడప్పుడు నరాల బలహీనతను అనుభవిస్తున్నాను. నా మెదడు కూడా బలహీనత నుంచి ఇంకా బయట పడలేదు. నాతో ఏమి చేయదలచుకుందో ఆ జగజ్జననికే తెలుసు. కానీ జగజ్జనని నాకెంతో మేలు కలిగిస్తున్నది. దానిలో నాకేమాత్రం సందేహం లేదు. ఆమె నన్నెక్కడ ఉంచినా, ఎలా ఉంచినా ఫరవాలేదు. కానీ మీరంతా జగజ్జననికి సన్నిహితంగా ఉన్నారనీ, ఆమెను ఈ జన్మలోనూ, వచ్చే జన్మలలో కూడా మీ ఏకైక జీవితలక్ష్యంగా చేసుకున్నారనీ తెలిస్తే, అది నాకు అనంతమైన ఆనందాన్ని కలిగిస్తుంది.

--- క్షేమంగా ఉన్నాడనీ, మీ అందరికీ ఎంతో ప్రేమపాత్రుడవుతున్నాడనీ తెలియడం ఎంత ఆనందకరమైన విషయం! కొద్దికాలమైనా ఆయన నగరంలోకి రాగలిగితే ఎంతో బాగుంటుంది. చాలాకాలంగా ఆయన ఒకే ప్రదేశంలో ఉంటున్నాడు. స్థలమార్పు ఆయనకు ఎన్నో విధాలుగా ఉపకరిస్తుంది. కానీ, ఆయన ఆలోచన, దొడ్డహృదయం కలవాడు కాబట్టి, ఏది సక్రమమైందో, ఏది మంచిదో దాన్నే చేస్తాడని నా దృఢనిశ్చయం. నీ ఉత్తరంలో ఉదహరించిన 'ఫిర్యాదు' ఏమిటో నాకు అర్థం కాలేదు. అది ఏమైనప్పటికీ, దానిలో సంతకం పెట్టడాన్ని గురించి నీవు అంతగా పట్టించుకోవద్దు, దాని గురించి విచారపడ వద్దు. ఏ విధంగా చూసినా దానికి అంత ప్రాముఖ్యత ఇవ్వడం అనవసరం. నగరంలో కొంతకాలం క్రితం, నా గురించి ఏదో అపోహ ప్రచారమవుతున్నదని అనుమానించాను. కానీ అది ఏమిటో, ఏ విధమైనదో నాకర్థం కాలేదు. నేను తక్షణమే అక్కడి నా మిత్రులకు ఉత్తరాలు వ్రాయడం ఆపివేశాను. బహుశా అదే కారణమేమో అనుకున్నాను. నేను శాంతిని, సామరస్యాన్ని కోరేవాణ్ణి. వాటిని నిలబెట్టడానికి నేను దేనినైనా త్యాగం చేస్తాను. జీవితం ఇప్పటికే బాధలతోనూ, విసుగుతోనూ నిండిపోయి ఉంది. దానికి ఇంకా బాధలను జోడించడం అనవసరం. మీ అందరినీ జగజ్జనని దీవించు గాక. మీరందరు మరిదేనినో కాక జగజ్జననినే ఆశ్రయించి ఉందురుగాక. "ఇప్పటికున్న చెడు చాలు ఈ జీవితానికి" - ఎన్నడూ దీనిని మరువవద్దు. జగజ్జననిని అంటిపెట్టుకుని ఉండు. అలా చెయ్యడంలో ఏ అంతరాయం ఎదురైనా దానిని తక్షణమే తిరస్కరించి వెయ్యి.

-- 'మంత్రం' వల్ల నీ పారమార్థిక స్థితిలో అభివృద్ధి కలుగుతుండడం నాకు వర్ణనాతీతమైన ఆనందాన్ని కలిగించింది. అది నీ యందు శాశ్వతంగా నిలిచియుండు గాక. నీ ముద్దుబిడ్డలకు దీవెనలు. --కు, --కు నా ప్రేమ, ఆశీర్వాదాలు. సదా నీకు నా ప్రేమ, ఆశీస్సులు.

దివ్యజననిలో భవదీయ,
తురీయానంద

(15)

ఋషీకేశ్,
17 ఫిబ్రవరి, 1914

ప్రియమైన ఎక్స్., (ఒక కాలిఫోర్నియా విద్యార్థి),

సన్న్యాస జీవితమే మనకు నిజమైన ఆనందాన్ని కలిగించే జీవితం. మరే ఇతర జీవితం అలా చెయ్యలేదు. మనకు ఇష్టమున్నా, లేకపోయినా ఏదో ఒకనాడు మనం అన్నింటినీ వదిలివేయడం తథ్యం. అలా నిర్బంధంగా చెయ్యవలసిరావడం కంటే మనంతట మనమే సంతోషంగా, స్వేచ్ఛగా వదలివెయ్యడం సర్వోత్తమం. కానీ, అలా చెయ్యలేకపోతే, అన్నింటినీ జగన్మాతకు సమర్పించి, ఆమె ఆజ్ఞ ప్రకారం ఉండడం మంచిది. అన్ని పరిస్థితుల్లోనూ ఆమె ఒక్కతే జీవితంలో మార్గదర్శి అని తెలుసుకో. సుఖదుఃఖాలు వచ్చిపోయేవి. అవి కలకాలం ఉండవు. అనుభవం ద్వారా మనం జ్ఞానాన్ని ఆర్జిస్తాం. అంతేగాని సుఖంతోనో, దుఃఖంతోనో తాదాత్మ్యం చెందడం వల్ల ముక్తిని పొందలేం. జగజ్జనని ఏమి నిర్ణయిస్తుందో దానితో సంతృప్తి చెందు. మనకేది మంచిదో అమ్మకు తెలుసు. ఆ విధమైన జీవితం శాంతిని, దుః ఖోపశమనాన్ని కలిగిస్తుంది. అప్పుడు ఈ లోకం మనకి ఏ హాని కలిగించలేదు.

మీరు జగజ్జనని బిడ్డలు. ఈ లోకాన్ని చూసి మీరేమీ భయపడనక్కరలేదు. ఆమె యందు భక్తిని కలిగి ఉంటే ఆమె మిమ్మల్ని కనిపెట్టి ఉంటుంది. ఆమెయే సత్యం. మిగిలినదంతా కేవలం ఆడంబరం, బాధాకరం. "మానవుడు ఈ సర్వప్రపంచాన్ని పొందినా తన ఆత్మను కోల్పోతే, ఏమి లాభం?" అని క్రీస్తు చెప్పలేదా? జగజ్జనని మన ఆత్మలకు ఆత్మ. ఆమె మనదైతే ఈ ప్రపంచంలోని విషయాలను గురించి పట్టించుకోనవసరం లేదు.

ఈ లోకం దాని విధానంలో అనంతకాలం సాగిపోతూ ఉంటుంది. కానీ ఎవరు అన్నింటిలో జగజ్జననిని దర్శిస్తారో, ఎవరు ఈ సర్వం ఆమె లీల అని తెలుసుకుంటారో, అతని ఆత్మకు విశ్రాంతి, అంతరంగంలో ప్రశాంతి కలుగుతాయి. ప్రతిదానిలో ఆమె ఉనికినీ, మార్గదర్శకత్వాన్నీ గమనించెదము గాక! ఆమె మనల్ని దీవించు గాక.

దివ్యజననిలో భవదీయ,
తురీయానంద

(16)

(డా॥ డిమెల్లో భారతీయ వైద్యుడు. తర్వాత ఆయనను తాత్కాలికంగా రంగూన్‌లో ఉద్యోగంలో చేర్చుకున్నారు. ఆయన కనీసం ఒకసారైనా తురీయానంద స్వామిని దర్శించి ఉంటాడు. తర్వాత మాయావతికి వెళ్ళి 1919 సంవత్సరం జూన్, జులై నెలలలో ఏడు, ఏనిమిది వారాలు గడిపాడని మనం గమనించవచ్చు. డాక్టరుకు నిష్కపటమైన పారమార్థిక ఆకాంక్ష ఉన్నందువల్ల స్వామికి అతని మీద మిక్కుటమైన ప్రేమ ఉంది. ఈ ఉత్తరాలు, అసలు–లేఖలు (మూలం) కావు గాని స్పష్టంగా ఉన్న నకళ్ళు (కాపీలు). ఇవి కొన్ని సంవత్సరాల క్రితమే మా స్వాధీనంలోకి వచ్చాయి, కానీ ఇంతవరకు ప్రచురించబడలేదు. వాటి అసలు ప్రతులను మేము సంపాదించలేకపోయినా, ఈ లేఖలను చదివితే, ఎవరికైనా

అవి యథార్థమైనవని తోస్తుంది. శక్తిలోనూ, పారమార్థిక విశేషాలలోను అవి చూడడానికి గంభీరంగా ఉన్నాయి – సంపాదకుడు, ప్రబుద్ధ భారత, మే నెల సంచిక, 1975).

రామకృష్ణ కుటీరం, అల్మోరా
7 అక్టోబరు, 1916

నా ప్రియమైన డాక్టర్,

నీవు ఆప్యాయతతో వ్రాసిన 2వ తేదీ ఉత్తరం ఇప్పుడే అందింది. ఈ రోజుల్లో నీ గురించి ఎంతో అనుకుంటున్నాను. నీవు కూడా జబ్బుపడి ఇంకా బాధపడుతున్నందుకు విచారపడుతున్నాను. విధివిధానాలు ఊహించలేనివి. కానీ, భగవంతుడు మనపట్ల మంచి కరుణను చూపుతున్నాడు. ఆ విషయాన్ని మనం అంగీకరించక తప్పదు. మనం ఏ పరిస్థితులలో ఉన్నా ఆయన విధి విధానాలలో విశ్వాసం కోల్పోకుండా ఉండెదము గాక! స్వార్థపరత్వంతో ఆలోచింపకుందుము గాక! ఆయన ఏది చేసినా మన మంచి కోసమేనని పూర్తిగా తెలుసుకుని ఆయన నియంత్రణలో సంతృప్తి చెందెదము గాక! ఆ భావన వల్ల మనకు కనీసం మనశ్శాంతి లభిస్తుంది.

మీ నాన్న విషయంలో నేను ఎంతగానో విచారపడుతున్నాను. ఆయనకు స్వస్థత చిక్కడానికి నీవు చెయ్యవలసినదంతా చేస్తున్నావు. దానికన్నా ఆయనకు ఓదార్పు ఏముంటుంది? ఆయన జబ్బు నుండి త్వరలో కోలుకుంటారని ఆశిద్దాం. సాధ్యమైనంత త్వరలో నీ యోగక్షేమాల గురించి తెలుసుకోవడానికి ఆత్రుతతో వేచి ఉంటాను...

మీ నాన్నకు కులాసా చిక్కిన తర్వాత, నీవు అల్మోరా వచ్చినప్పుడు ఇక్కడికి వస్తే సంతోషిస్తాను. ప్రస్తుతం నీవు అనుభవిస్తున్న కష్టనష్టాలలో జగజ్జనని నీకు అటువంటి విశ్వాసాన్ని కలిగిస్తున్నందుకు ఆమెకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. నీ ప్రస్తుత మానసిక స్థితి, పారమార్థిక అభివృద్ధికి నిజంగా అనుకూలంగా ఉంది. నీవు ముక్తి పొందడానికి ఏవేవో ప్రయత్నాలు చేయనవసరం లేదు. అలా చేయడం మంచిది కాదు. ఇతర ప్రదేశాలకు తిరగాల్సిన అవసరం లేకుండా, ఉన్నచోటి నుండి కదలకుండా, ఏమాత్రం ప్రయత్నించకుండా, నీవు ఉన్నచోటనే విముక్తుడివైనట్టు అనుభూతి పొందగలగడం జగజ్జనని ఇచ్ఛ. ఇప్పుడు నీవున్న శరణాగతస్థితినే గట్టిగా పట్టుకుని ఉండు...

నీవు ఉత్సాహంతో, ఆరోగ్యంతో ఉండాలని ఆశిస్తున్నాను. నా ప్రేమ, ఆశీర్వాదాలు.

ఆప్యాయతతో, భవదీయ,
తురీయానంద

(17)

రామకృష్ణ కుటీరం, అల్మోరా.
23 అక్టోబరు, 1916

నా ప్రియమైన డాక్టర్,

నీవు 8.10.1916న వ్రాసిన ఉత్తరం అంది, మీ తండ్రి వ్యాధి కొంత తగ్గిందని తెలిసి సంతోషంగా ఉన్నది. జగజ్జనని కరుణవల్ల ఆయన మాట్లాడే శక్తిని, పూర్వపు ఆరోగ్యాన్ని త్వరలో పొందుగాక! స్త్రీలను పొందాలనే భావన వల్ల నీవు మళ్ళీ బాధపడుతున్నావని తెలిసి నిజంగా నేనెంతో విచారపడుతున్నాను. ఎప్పటికీ తిరిగి రాకుండా, శాశ్వతంగా నీ దగ్గర సెలవు తీసుకోవడానికే ఆ ఆలోచన మళ్ళీ వచ్చిందని భావిస్తున్నాను. మంచి మార్గంలో నడవడానికి తగినంత వివేకం నీకుంది. అంతేకాకుండా జగజ్జనని నీ విషయంలో జాగ్రత్త తీసుకుంటుందనీ, నిన్ను ప్రక్కదారి త్రొక్కనివ్వదనీ, నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. నీ ఉత్తరంలో వ్రాసిన 'జగజ్జననితో–నా–స్వగతం' చదివి చాలా సంతోషించాను. జగజ్జనని నీ విషయం పట్టించుకోకుండా ఉండలేదనే సూచనను దాని నుంచి గ్రహించాను. హృదయపూర్వకంగానూ, నిష్కపటంగానూ నీ అంతరంగంలో ఉన్న జగజ్జననితో ఈ విధంగా మాట్లాడగలిగితే ఆమె అంత సులభంగా నిన్ను ప్రక్కకు తొలగిపోనివ్వదు. నిన్ను అదుపులో ఉంచుతుంది. నీ ఉత్తరంలో ఉదహరించిన ఆ 'సాధు సిద్ధారుద్ధ' ఎవరు? ఆయన ఒక బౌద్ధభిక్షువా? లేక హిందూ సాధువా? సలహా రూపంలో ఆయన నీతో మాట్లాడినది చక్కగాను, హేతుబద్ధంగాను, యథార్థంగాను ఉన్నది. (ఈయన ఒక ప్రఖ్యాత హిందూ సాధువు. దక్షిణభారతంలోని కర్ణాటకలో హుబ్లీ ప్రాంతంలో నివసించారు – సంపాదకుడు.) సన్న్యాసాన్ని అవమానించడానికే అయితే, జగజ్జనని నిన్ను దాన్ని తీసుకోనివ్వదు. కామభావనను నీవు ఒకసారి త్యజించగలిగితే, నీ హృదయంలో ఒక్క నలుసు కూడా అది కనపడకపోతే – ఆ విషయం నీకు బాగా తెలిసి ఉంటే – ఆ స్థితి (సన్న్యాస స్థితి) నీకు మళ్ళీ కలుగు తుందని దృఢంగా విశ్వసించు. ఏది ఏమైనా కామభావనలకు లొంగవద్దు. సన్న్యాస ఆదర్శాన్ని మాత్రం వదలవద్దు. ఒక్కసారి లొంగిపోతే మళ్ళీ నీకు ఆదర్శంలో నిలద్రొక్కుకునే అవకాశం ఉండదు. పాయసం ఒక విషయం – స్త్రీ మరొక విషయం. కామాన్ని అనుభవించడం వల్ల అది శాంతిస్తుందనే భావాన్ని నమ్మవద్దు. చేతనైనంత వరకు ఆత్మనిగ్రహాన్ని అభ్యసించు. సహాయం కోసం జగజ్జననిని ప్రార్థించు. ధైర్యం కలిగి వుండు. తప్పక సహాయం లభిస్తుంది. నీలో ఉన్న ఆ పశువును జయించడానికి జగజ్జనని నీకు పూర్తి శక్తిని ప్రసాదించు గాక!

నీవు మళ్ళీ ఒక ఉద్యోగాన్ని సంపాదించుకున్నావని తెలిస్తే సంతోషిస్తాను. నీవు ఇక్కడికి వస్తే మరింత ఆనందిస్తాను. కానీ ఉద్యోగం సంపాదించిన తర్వాత రావచ్చును; సందేహం లేదు. ఈ చలి వాతావరణంలో మైదాన ప్రాంతాలకు వెళ్ళగలిగేదీ, లేనిదీ నిశ్చయంగా తెలియదు. కులాసాగానే ఉంటున్నాను.

నీవు ఉత్సాహంగాను, ఆరోగ్యంగాను ఉన్నావని నమ్ముతున్నాను.

సదా నా ఆశీర్వాదాలతో,

భగవంతునిలో, భవదీయ,

తురీయానంద

(18)

రామకృష్ణ కుటీరం, అల్మోరా
3 నవంబరు, 1916

నా ప్రియమైన డాక్టర్,

క్రితం నెల 28వ తేదీ వ్రాసిన ఉత్తరం అందింది. అనేక ధన్యవాదాలు. మీ తండ్రి కూర్చోగలుగుతున్నారని తెలిసి సంతోషించాను. క్రమంగా పూర్వపు ఆరోగ్యాన్ని ఆయన పొందుగాక!

మనోవికారాలను నిగ్రహించడానికి నీవు అటువంటి భయంకరమైన పద్ధతులను పాటించనక్కరలేదు. అటువంటి కఠినమైన, క్రూరమైన విధానాలు తామసంతో నిండిన మూఢులకు (జంతుస్వభావం గలవారికి) సరిపోతాయి. కామవాంఛను నిగ్రహించడానికి నిన్ను జగజ్జనని అటువంటి హింసాత్మకమైన విధానాలకు గురిచెయ్యదు. జగజ్జననిని సాక్షాత్కరించుకోవాలనే వాంఛ నీలో పెంపొందినప్పుడు, ఆ కామవాంఛలు వాటంతట అవే తొలగిపోతాయి. కలకండ రుచి చూసిన మనిషి బెల్లపునీటిని లెక్కచెయ్యడు. కాబట్టి నిజమైన దివ్యానందం యొక్క రుచి తెలిసిన తర్వాత, ఇంద్రియసుఖాలు కావాలనే వాంఛ ఇక ఎన్నడూ బాధించదు. ప్రస్తుతం నీకు కావలసినది జగజ్జనని. అందువల్ల జగజ్జననినే తలుచుకో. సహాయానికి గానీ, మార్గదర్శకత్వానికి గానీ వేరే ఎవరినీ ఆశ్రయించవద్దు. దివ్యజనని యందు అఖండమైన విశ్వాసం ఉంచు. ఆమె నిన్ను కాపాడి, సక్రమమైన మార్గంలో నడిపిస్తుంది. నిన్ను తప్పక రక్షిస్తుంది.

గీతలోని 'స్వధర్మం' అనేది క్రైస్తవమతం కాదు; హిందూమతం కాదు; మరే మతమూ కాదు. అది జీవితంలో మనిషి ఉన్న దశకు సంబంధించిన మానవధర్మం. అర్జునుడు క్షత్రియ రాజకుమారుడు. యుద్ధం చెయ్యడం అతని ధర్మం. కానీ, అతడు బ్రాహ్మణ ధర్మాన్ని అనుసరించి యుద్ధం చెయ్యకూడదను కున్నాడు. అందువల్ల భగవానుడు అతనికి ఇలా చెప్పాడు, "తన స్వధర్మంలో మరణించడం మేలు. పరధర్మం ప్రమాదంతో కూడుకుని ఉంటుంది" (గీత: 3.35). నీ ఉత్తరంలో ఆ సాధువు యొక్క ఆత్మ నిగ్రహాన్ని గురించి వ్రాశావు. అది నాకెంతో నచ్చింది. కొందరికి ఆ విధంగా తనని తాను శిక్షించుకునే విధానం సహాయపడుతుంది. కానీ నీ విషయంలో కాదు. నీది భక్తి మార్గమే కానీ, హింసామార్గం కాదు. జగజ్జనని యందలి ప్రేమ, శారీరికసుఖాల మీద ఉన్న ప్రేమను తొలగిస్తుంది. అది నీ విషయంలో నేడో రేపో జరగబోతోంది.

ఇప్పుడు నువ్వు ఏమి చేస్తున్నావు? ఉద్యోగాన్ని సంపాదించడానికి ప్రయత్నించడం లేదా? సోమరిగా కూర్చోవడం మంచిది కాదు. నీవేదో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిస్తే నేను సంతోషిస్తాను. ఎల్లప్పుడూ నీకు నా ప్రేమ, ఆశీర్వాదాలు.

పరమేశ్వరునిలో, భవదీయ,

తురీయానంద

(19)

రామకృష్ణ కుటీరం, అల్మోరా
26 నవంబరు, 1916

నా ప్రియమైన డాక్టర్,

నీ ఉత్తరం కోసం ఎంతో ఆతురతతో ఎదురు చూస్తుండగా, నీవు 19వ తేదీ వ్రాసిన సుదీర్ఘమైన చక్కని ఉత్తరం మొన్న రావడం ఎంతో సంతృప్తినిచ్చింది.

ఈ రోజులలో నీవు ప్రశాంతంగా ఉన్నావనీ, ఇదివరకటి లాగా పారమార్థి కాభివృద్ధి విషయంలో దుష్ట తలంపేదీ నీ మానసిక శాంతిని కలవర పరచడం లేదని తెలిసి, ఎంతో సంతోషించాను. నీవు నాకు ధన్యవాదాలు చెప్ప నక్కరలేదు. అవసరమనిపిస్తే జగజ్జననికి ధన్యవాదాలు తెలుపుకో! ఆమెకే కృతజ్ఞుడివై ఉండు. మనఃపూర్వకంగా మనం ఏది కావాలని ప్రార్థించినా ఆమె వాటన్నింటినీ మనకు ప్రసాదిస్తుంది. నీకు కొంత శాంతిని కలిగించడానికి జగజ్జనని నన్ను తన పరికరంగా చేసుకున్నదని నీవు తలచినందుకు నాకెంతో ఆనందంగా ఉంది. అది నిజమే అయితే దానికి ఆమెకెంతో కృతజ్ఞుణ్ణని భావిస్తాను. నిజమే; నీది భక్తిమార్గమనీ, స్వయం-హింసావిధానం వేరెవరికైనా ఉపయోగపడవచ్చునేమో కానీ, నీకు మాత్రం తగినది కాదనీ, ఆమె నాకు అర్థం అయేటట్లు చేసింది.

నీవు ఎల్లప్పుడూ ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉన్నందుకు సంతోషం. సరియైన కాలక్షేపం లేక జీవితం దుర్భరం కాకుండా చూసుకో. అయినప్పటికీ నీ క్షేమం కోసం, నీ మీద ఆధారపడి ఉన్నవారి సంరక్షణ కోసం నీకు ఏదో ఒక పని దొరకాలని ప్రార్థిస్తున్నాను. ఉద్యోగం కోసం ప్రయత్నం చెయ్యడం మంచిది; త్వరలోనే అది లభిస్తుందని విశ్వసిస్తున్నాను. ఇంకా మీ తండ్రి ఆరోగ్యంలో ఎక్కువ మార్పు కలగనందుకు విచారిస్తున్నాను. ఆయన ఇదివరకటి మనిషి కాలేడని నీవు తలచడం సమంజసమే. ఇప్పుడు ఆయన చాలా వృద్ధుడయ్యాడు కూడా. కానీ, చెయ్యగలిగిందేమీ లేదు. సామెత చెప్పినట్లు, 'ఏమీ చెయ్యలేనప్పుడు భరించక తప్పదు.' నీవు అనుకున్నట్లు అల్మోరా రాలేకపోవడం విచారకరం. కానీ ఏమీ బాధపడవద్దు. జగజ్జనని అనుగ్రహం వల్ల సరియైన కాలంలో మనం తప్పక మళ్ళీ కలుస్తాం. సాధ్యమైనంత త్వరగా వారణాసికి రమ్మని ఎస్., శివానంద స్వామి తదితరులు కోరారు. త్వరలో నేను వారణాసికి వెళ్ళవలసి రావచ్చు. జగజ్జనని ఏమి చేస్తుందో చూద్దాం.

ఇప్పుడు నీవు అనుసరిస్తున్న ధ్యానపద్ధతి బాగానే ఉంది. అదే విధానాన్ని అనుసరించు. నీ లక్ష్యం సిద్ధిస్తుంది. నీ పద్ధతులు చాలా సహజంగానూ, అద్భుతంగానూ ఉన్నాయి. నీవు సంపూర్ణంగా తృప్తి చెందేవరకు వాటినే అనుసరించు. అదే నీ హృదయాన్ని పవిత్రం చేస్తుంది. నీవు అనుకున్నట్లు నీ హృదయపు ఆంతర్యాన్ని దర్శించేట్లు చేస్తుంది. నిన్నెల్లప్పుడు ఆ జగన్మాత దీవించు గాక! ఎల్లప్పుడూ నీకు నా ప్రేమ, ఆశీర్వాదాలు.

పరమేశ్వరునిలో, భవదీయ,
తురీయానంద

(20)

బేలూరు మఠం, ఇండియా
6 మార్చి, 1917

నా ప్రియమైన డాక్టర్,

నీవు సాదరంగా వ్రాసిన ఒకటవ తేదీ ఉత్తరం నాకు ఆనందాన్ని కలిగించింది. ఇప్పుడు నీవు మళ్ళీ అల్మోరాలో బ్రహ్మచారులతో కలసి రామకృష్ణ కుటీరంలో నివసిస్తున్నందుకు నేను చాలా, చాలా ఆనందిస్తున్నాను. ఎంత బాగుంది! ఎంత అద్భుతంగా ఉంది! అవును, ఈ సమయంలో నేను అక్కడ ఉంటే మరీ బాగుండేది. అయినా, ఫర్వాలేదులే. నీకు కావలసినదంతా అమ్మ చూస్తుంది. ఈ విషయంలో నాకేమాత్రం సందేహం లేదు.

దుఃఖాలను, బాధలను ఎందుకు ఆహ్వానిస్తావు? అవి ఇప్పుడు తొలగి పోయాయి. ఇప్పుడు నీవు జగదంబను – జగదంబను మాత్రమే – స్మరించు. అమ్మను ఎక్కడో వెదకనక్కరలేదు. నీ లోపలనే అన్వేషించు. అందరికీ ఆమే అంతరాత్మ. నీ ఉనికిని గురించి నీవు సందేహించనప్పుడు, జగజ్జనని ఉనికిని గురించి ఎలా సందేహించగలవు? ఈ జగత్తులన్నింటికీ ఆమెయే ఉనికి. అన్నింటికీ ఆమే ఆధారం. "అతడు భాసిస్తుంటే, అతడి వల్ల ఈ సర్వం భాసిస్తూ ఉంటుంది. అతడి ప్రకాశం వల్ల సర్వం ప్రకాశింపబడుచున్నది" (ముండకో పనిషత్తు, 2.10). ఆమె ప్రకాశిస్తుంటే సర్వం ప్రకాశిస్తూ ఉంటుంది. ఆమె ప్రకాశం వల్లనే మిగిలినదంతా ప్రకాశింపబడుతున్నది. మొదట జగజ్జనని, ఆ తర్వాతే మిగిలినదంతా. ఆమె అనుగ్రహం ఉంటే తప్ప ఎవ్వరూ ఆమెను తెలుసు కోలేరు. వేచిచూడు. ఆమె కరుణించిన సమయంలో నీ హృదయంలో ఆమె ముఖారవిందాన్ని దర్శించడానికి అడ్డంగా ఉన్న అంధకారాన్ని తొలగించి, ఆమె నీ మీద వెలుగును ప్రకాశింప జేస్తుంది. ఆమె యందు నివసించు. నిన్ను తన చెంతకు లాగుతున్న దివ్యజనని హస్తాన్ని నీవు చూడడం లేదా? ఇప్పుడు నీవు ఓర్పుతో ఆమెవైపే దృష్టి సారించవలసి ఉంది. ఆమె యందు నీకు విశ్వాసం లేదని కాదు గానీ, మరింత నమ్మకం కలగాలని వాంఛిస్తున్నాను. ఇక ఎక్కువ ఆలస్యం లేదు. ఓర్పుతో ఉండి, పట్టు వదలకుండా, శ్రద్ధతో పనిచెయ్యి. జయం నీదే...

"జగజ్జనని ఇక్కడే, ఇప్పుడే నీకు ఐహిక, పారమార్థిక విషయాలలో జయం ప్రసాదించు గాక! నీ శక్తితో, ఇతరులకు అన్ని విధాలా జయం కలిగించడానికి, నిన్ను తన యొక్క సమర్థవంతమైన పరికరంగా చేసుకొను గాక," అనేదే సదా నీ క్షేమాన్ని కోరుతూ, నిన్ను ప్రేమించే తురీయానందుని హృదయపూర్వక ప్రార్థన.

బ్రహ్మచారి నవచైతన్యకు, బ్రహ్మచారి రామ్‌కు నా ప్రేమ, ఆశీర్వాదాలు. ఓర్చుకోదగిన ఆరోగ్యంతో, నేను క్షేమంగా ఉన్నాను.

పరమేశ్వరునిలో, భవదీయ,
తురీయానంద

(21)

బేలూరు మఠం, ఇండియా
18 మార్చి, 1917

నా ప్రియమైన డాక్టర్,

నీవు 13వ తేదీ వ్రాసిన ఉత్తరం ఇప్పుడే అందింది. నీకు నా ధన్యవాదాలు... ఈ రోజులలో నీ మానసికస్థితిని గురించి నీవు అంత ఆదుర్దా చెందనక్కర లేదు. దివ్యజనని అనుగ్రహం కోసం తీవ్రంగా ప్రార్థించు. నీకు మంచిదని జగజ్జనని తలిస్తే, సరైన సమయంలో నీ మీద వెలుగును ప్రసరిస్తుంది. హృదయ పూర్వకంగా ఆమె చరణాల ముందు వాలిపో. తానే నీ

జాగ్రత్తను వహిస్తుంది. నీవు విముక్తుడవవుతావు. అక్కడ మీరందరూ క్షేమంగా ఉన్నందుకు సంతోషం. ఇక్కడ స్వామీజీలు, బ్రహ్మచారులు క్షేమంగా ఉన్నారు. నీకు ఎల్లప్పుడూ నా ప్రేమ, ఆశీర్వాదాలు.

పరమేశ్వరునిలో, భవదీయ,
తురీయానంద

(22)

బేలూరు మఠం, ఇండియా
2 ఏప్రిల్, 1917

నా ప్రియమైన డాక్టర్,

...నీవు వ్రాసింది యథార్థం – గతాన్ని మరచిపోవడానికి మంచి మార్గం జరిగిపోయిన సంఘటనలను గురించి ఆలోచించకుండా ఉండడమే! నీవు దేనిని గురించి అయినా ఆలోచించాల్సి వస్తే జగజ్జననిని గురించి ఆలోచించు. అలా ఆమె అనుగ్రహం వల్ల మనిషి ఆమె తలంపులోనే పూర్తిగా లీనమై పోతాడు..

'గురుమహరాజ్' అని సంబోధించే కంటే, 'ప్రియమైన స్వామి' అని నన్ను ఎందుకు సంబోధించకూడదు? అది నాకు ఎక్కువ సంతోషాన్ని కలిగిస్తుంది. 'గురువు' అనీ, 'తండ్రి' అనీ పిలిపించుకోవడాన్ని మన గురుదేవులు ఇష్టపడేవారు కాదు...

సదా మీ అందరికీ నా ప్రేమ, ఆశీర్వాదాలతో,

పరమేశ్వరునిలో, భవదీయ,
తురీయానంద

(23)

బేలూరు మఠం, ఇండియా
15 ఏప్రిల్, 1917

నా ప్రియమైన డాక్టర్,

... భక్తి విషయంలో నీ మానసిక వైఖరిలో కలుగుతున్న ఒడుదొడుకులను గురించి ఆదుర్దా చెందనక్కరలేదు. నిలదొక్కుకుని స్థిరత్వం పొందబోయే ముందు అది నడిచే విధానమదే. ఒక్క నీ విషయంలోనే కాదు, అందరి విషయంలోను అంతే. నీ భక్తి, ప్రార్థనలు కొనసాగిస్తూ ఉండు. తన ఇష్టప్రకారం జగజ్జనని నీ వాంఛలను తీరుస్తుందని గట్టిగా విశ్వసించు..

ఎప్పటికీ నీకు నా ప్రేమ, ఆశీర్వాదాలు. నీకు నిజమైన అభివృద్ధి కలగడం కోసం జగన్మాతను ప్రార్థిస్తూ....

పరమేశ్వరునిలో, భవదీయ,
తురీయానంద

(24)

బేలూరు మఠం, ఇండియా
9 మే, 1917

నా ప్రియమైన డాక్టర్,

బర్మా వెళ్ళడానికి నీవు ఇక భయపడడం లేదని తెలిసి సంతోషిస్తున్నాను. నీ ఆంతరంగిక శక్తి యందు నీకు విశ్వాసం కలుగుతోంది. అది చాలా మంచిది. కానీ, నీవు చాలా జాగ్రత్తగా ఉండాలి. నీ మీద నీకు అతి విశ్వాసం పనికిరాదు. నిజమే, తుప్పుపట్టి పాడైపోయే కంటే అరిగి పోవడం మంచిది. అయితే అలా అనుకున్నప్పుడు, చెయ్యడానికి ఏదో ఒక పని సంపాదించడం మంచిది. ప్రస్తుత పరిస్థితులకు అది అవసరం. అవును! (బ్రహ్మచారి) రామ్, నీవు సరిగానే చెప్పారు. మీ ఇద్దరి అభిప్రాయాలతో నేను కూడా ఏకీభవిస్తున్నాను. నీవు ఎక్కడున్నా జగజ్జనని నిన్ను రక్షించి, సహాయం చేస్తుంది; ప్రక్కదారి త్రొక్కనివ్వదు...

నీవు క్షేమంగా సౌభాగ్యంతో ఉన్నావని విశ్వసిస్తూ, నీ సంక్షేమం కోసం అమ్మను హృదయపూర్వకంగా ప్రార్థిస్తూ...

పరమేశ్వరునిలో, భవదీయ,
తురీయానంద

(25)

శశినికేతన్, పూరీ
28 జూన్, 1917

నా ప్రియమైన డాక్టర్,

తేదీ వెయ్యకుండా నీవు వ్రాసిన ఉత్తరం ఈ ఉదయం అందింది. నీవు 14 జూన్, 1917న వ్రాసిన ఉత్తరం కూడా అందింది. ఈ రెండు ఉత్తరాలకు నా కృతజ్ఞతలు. నీవు నా యందు ఎంతో దయగా ఉన్నావు. కానీ జగజ్జనని నన్ను చెవినొప్పి నుండి పూర్తిగా విముక్తి చెయ్యలేదు. ఈ ఉదయం నేను, శంకరానంద స్వామి ఇక్కడ ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి సివిల్ సర్జన్‌ని వైద్య సలహా కోసం కలిశాము. దానివల్ల ఏమి ప్రయోజనం కలుగుతుందో చూద్దాం. ఈ ఇరవై రోజులుగా దాదాపు ప్రతిరోజూ నీ ఉత్తరంలో సూచించిన దాని ప్రకారం చేస్తూనే ఉన్నాను. కానీ, ఆ బాధను పూర్తిగా అనుభవించనంత వరకు దాన్ని ఎవరు తీసి వేయగలరు? జగజ్జననికి నాపై అనుగ్రహం కలిగి ఆ నొప్పిని తగ్గించే వరకు నేను దాన్ని భరించక తప్పదు...

నిన్ను చూడాలని, నీతో పాటు ఉండాలని, నేను ఎంతగా వాంఛిస్తున్నానో! కానీ అమ్మ విధానాలు వేరు. నీవు చెప్పినట్లు ఏది మంచిదో అది ఆమెకు తెలుసు. ఆమె విధించిన విధానాల ప్రకారం మనం నడచుకొందుము గాక! మనల్ని తన చేతుల లోనికి తీసుకోవడానికి అవసరమైనదంతా అమ్మ చేస్తుందని నాకు తెలుసు. మన యందు ఆమెకు ఎంతో దయ

ఉంది. మీ అందరికీ జయం కలుగుగాక! నీకు సంక్షేమం, అభివృద్ధి కలుగుతాయని విశ్వసిస్తూ, సదా ప్రేమ, ఆశీర్వాదాలతో,

ప్రేమపూర్వకంగా, భవదీయ,
తురీయానంద

(26)

శశినికేతన్, పూరీ
9 ఆగష్టు, 1917

నా ప్రియమైన డాక్టర్,

పని నుండి విముక్తి పొందాలని అప్పుడే నీవు అంత తొందరపడనవసరం లేదు. నీకు ఏది ఎప్పుడు అవసరమో జగజ్జననికి తెలుసు. ఆమెకు మంచిదని తోచినప్పుడు నీకు దానిని ఏర్పాటు చేస్తుంది. అన్నింటి కంటే ప్రధానంగా ధ్యానం చెయ్యడానికి నీకు విరామం ఉండాలి. దివ్యజననిని గురించి ఆలోచించడానికి సమయం ఉండాలి. అది లేకపోతే ఎవ్వరూ సక్రమంగా ఉండలేరు. ఏ విధంగానైనా ధ్యానానికి నీవు అవకాశం కలిగించుకుంటావని నాకు తెలుసు. నిస్సందేహంగా దానికి మార్గం కనిపిస్తుంది. ఓపికపట్టి అది ఎలా సంభవిస్తుందో చూడు. నీవు ఉద్యోగం లేకుండా ఉన్నప్పుడు నాకు బాధగా అనిపించింది. కానీ ఇప్పుడు నీవు పనిలో తలమునకలుగా ఉన్నందుకు సంతోషం. జగజ్జనని సంరక్షణలో సుఖంగాను, అభివృద్ధి చెందుతూ ఉన్నప్పుడు నీవు రంగూనులో ఉంటే ఏం, లేకపోతే మద్రాసులో గాని, నైనిటాలులోగాని ఉంటే ఏం? జగజ్జనని నిన్ను తన చేతులలోకి తీసుకుని రక్షించుగాక!

ఈసారి బ్రహ్మానందస్వామి పూరీలో అనారోగ్యంతో ఉన్నారు. త్వరలో మార్పు కోసం ఆయన భువనేశ్వరం వెళ్ళవచ్చు. భువనేశ్వరం చాలా ఆరోగ్యవంతమైన ప్రదేశం. అక్కడ ఆయనకు స్వస్థత చిక్కవచ్చు. త్వరలో భువనేశ్వరంలో ఒక ఆశ్రమం స్థాపించడానికి ఇటీవలే స్వామి ఐదు ఎకరాల స్థలం కొన్నారు. అది తెలిస్తే నీవు సంతోషిస్తావు. అంత చక్కని ఆరోగ్యవంతమైన ప్రదేశం మఠానికి అంత సమీపంలో దొరకడం ఎంతో బాగుంది. ఇప్పుడే దానిని నివాసయోగ్యంగా చెయ్యడానికి స్వామి ఆ భూమిపై త్వరలోనే కొన్ని గదులు కట్టించాలని ఆలోచిస్తున్నారు...

వ్యాధులు, బాధలు లేకుండా మంచి ఆరోగ్యంతోనూ, మానసిక శాంతితోనూ ఉన్నప్పుడు నీకు ఈ ఉత్తరం అందాలని ఆశిస్తూ, సదా నా ప్రేమ, ఆశీస్సులతో,

భవదీయ, ప్రేమయుత,
తురీయానంద

(27)

శశినికేతన్, పూరీ

22 ఆగష్టు, 1917

నా ప్రియమైన డాక్టర్,

..ఏదో ఒక ప్రణాళిక వేసుకోవాలని నీవు ఆదుర్దా చెందనక్కరలేదు. సకాలంలో అమ్మ నీకు దారి చూపించి, ఏ విధానాన్ని నీవు అనుసరించాలో నిర్దేశిస్తుంది. ధ్యానానికి నీకు సమయం చిక్కినందుకు, దాని ప్రయోజనాన్ని పొందుతున్నందుకు సంతోషం. అది ఎంత చక్కని విషయం! ధ్యానమొక్కటే నిన్ను జగజ్జననితో సరాసరి సంబంధం కలిగించి ఉంచుతుంది...

ప్రేమతో, భవదీయ

తురీయానంద

(28)

57, రామ్‌కాంత బోస్ వీధి, కలకత్తా

1 ఆగష్టు, 1918

నా ప్రియమైన డాక్టర్,

నీవు క్రితం నెల 21వ తేదీన వ్రాసిన ఆప్యాయతతో నిండిన జాబు ఇప్పుడే అందింది. నీవు 7 జులై, 1918 తేదీన వ్రాసిన మరొక ఉత్తరం కూడా అందింది. ఇంతకంటే త్వరగా నీకు సమాధానమివ్వలేక పోయినందుకు విచారిస్తున్నాను. ప్రేమానంద స్వామి ఇక లేరు. ఈ వార్త నీకు బాధ కలిగిస్తుంది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల 15 నిమిషాలకు ఆయన తన భౌతిక కాయాన్ని వదిలివేశారు. ఆయన పార్థివశరీరాన్ని బేలూరు మఠానికి తీసుకుపోయి దహన సంస్కారాలు చేశారు.

ఆయన నిర్యాణం చాలా ఆకస్మికంగా జరిగింది. క్రితం శనివారం దేవఘర్ నుండి ఆయనను ఇక్కడకి తీసుకువచ్చారు. అక్కడ ఆయన వ్యాధి లక్షణాలు ఎక్కు వైనట్లు కనిపించింది. ఇక్కడికి వచ్చినప్పుడు చాలా ప్రమాదస్థితిలో ఉన్నారు. వైద్యుడు పరీక్ష చేసిన తర్వాత ఆయన ముదిరిపోయిన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నట్లు కనుగొన్నాడు. చికిత్సకు గానీ, సేవ చెయ్యడంలో గానీ, ఏ విధమైన లోపం లేదు. కానీ ఏదీ ప్రయోజనం కలిగించలేదు. అన్నింటినీ నిష్ఫలం చేసి, దీర్ఘవ్యాధి వల్ల అనుభవించిన నొప్పులను, బాధలను పూర్తిగా వదిలివేసి, ఆయన శాశ్వత శాంతిధామానికి వెళ్ళిపోయారు.

ఆయన లేకపోవడం వలన భక్త బృందానికి, మఠానికి కలిగిన లోటు తీర్చడానికి వీలుకానిది. కానీ ఏమి చెయ్యగలం? భగవదిచ్ఛ ప్రతిసారీ జరిగి తీరుతుంది. అందరూ ఇప్పుడు దుఃఖంలో మునిగి ఉన్నారు. వాళ్ళు ఎలా ఉన్నారో ఇప్పుడు నీకు వర్ణించలేను. ఉదాత్తమైన ఆయన ఆత్మ భగవానునిలో అనిర్వచనీయమైన మహదానందాన్ని అనుభవిస్తూ ఉంటుంది. వారి స్నేహితులు, భక్తులు ఆయన తమ మధ్యలో లేనందుకు విషాదంలో క్రుంగిపోయి ఉన్నారు. కానీ, ఆయన కలిగించిన ప్రభావం వారి మనస్సులలో రాబోయే కాలమంతా నిత్యనూతనంగా ఉండిపోతుంది. ప్రస్తుతం నేనెక్కువ వ్రాయలేను. అందుకు నీవు

నన్ను క్షమిస్తావనుకుంటాను. మనస్సు కుదుట పడ్డాక నీకు సమాధాన మివ్వడానికి ప్రయత్నిస్తాను. మాతృదేవి, ఇతర స్వామీజీలు క్షేమంగానే ఉన్నారు. నీకు సర్వదా నా ప్రేమ, ఆశీర్వాదాలు.

పరమేశ్వరునిలో, భవదీయ,
తురీయానంద

(29)

57, రామ్‌కాంత బోస్ వీధి, కలకత్తా
12 అక్టోబరు, 1918

నా ప్రియమైన డాక్టర్,

నీవు 30 సెప్టెంబరు, 1918, 1 అక్టోబరు, 1918 తేదీలలో వ్రాసిన రెండు ఉత్తరాలు ఒకేసారి చేరాయి. నీ శరీర రుగ్మతలన్నీ తగ్గిపోయి ఇప్పుడు నీవు క్షేమంగా ఉన్నావని తెలిసి ఆనందంగా ఉంది. నీ దగ్గర నుండి ఉత్తరాలు రాలేదని ఆదుర్దా చెందుతున్నాను. వివేకానంద స్వామి లేఖలలోని వాక్యాలు నీకెంతో మేలు చేశాయని తెలిసి ఆనందించాను. అవును నిజమే. వివేకాంద స్వామి మాటలు చాలా శక్తిమంతమైనవి, ఉజ్జీవనం కలిగించేవి. అవి శరీర వ్యాధులను తొలగించడమే కాక, ఆత్మలను పరిశుద్ధం చేసి, మనల్ని దైవోన్ముఖులను చెయ్యగలవు. నీ శారీరిక బాధలను తొలగించడం వల్ల ఆ మాటలు ఎంత శక్తిమంతమైనవో నీవు ప్రత్యక్షంగా అనుభవించి ఉంటావు. మానవులకు దైవసాక్షాత్కారాన్నీ, పరిపూర్ణమైన ముక్తిని కలిగించే ఆయన శక్తిని నీవు అనుభవింతువు గాక! నీకు సర్వదా నా ప్రేమ, ఆశీర్వాదాలు.

పరమేశ్వరునిలో, భవదీయ,
తురీయానంద

(30)

వారణాసి, ఇండియా
12 జూన్, 1919

నా ప్రియమైన డాక్టర్,

నీవు 8వ తేదీ వ్రాసిన ఉత్తరం ఈ ఉదయం అంది సంతోషాన్ని కలిగించింది. ఎట్టకేలకు నీవు క్షేమంగా 'మాయావతి'కి చేరుకున్నావని తెలిసి సంతృప్తి చెందాను. దారిలో కలిగిన బాధలను పట్టించుకోవద్దు. నీ గమ్యాన్ని చేరావు. మనోహరమైన దృశ్యాలతోను, పరిసరాలతోను నీవెంతగానో చూడాలనుకున్న ప్రదేశాన్ని చేరుకున్నావు. నిన్నెంతగానో తృప్తిపరిచిన ఆ ప్రదేశం దుఃఖాలన్నిటికీ అతీతమైనది. ఏ తల్లి మనందరికీ జగన్మాతయో, ఎవరి ఏకైక కరుణాకటాక్షం మన జీవితాలను మహదానంద పూరితం గావించి, సమస్త

బాధలనుండి, వ్యర్థమైన కలతలనుండి విముక్తి గావిస్తుందో ఆ జగదాంబ ధ్యానంలో నీవిప్పుడు నిమగ్నమై పో! నీ మనస్సులో ఏ లక్ష్యాలున్నాయో వాటిని పొందే అదృష్టం నీకు కలుగుగాక! ఏ దివ్యజననిలో నీకు అత్యంత భక్తి, ప్రేమ ఉన్నాయో ఆమె అనుగ్రహం వలన ధన్యుడవయ్యెదవు గాక! సంపూర్ణంగా ఆమె పాదాల మీద పడు! అప్పుడు అత్యంత నిస్సహాయస్థితిలో ఏడుస్తున్న చంటిబిడ్డను తల్లి ఏ విధంగా తన చేతులలోనికి తీసుకొంటుందో, అదే విధంగా జగజ్జనని నిన్ను తన చేతులలోనికి తీసుకుంటుంది.

ఈ సమయంలో నిన్ను ఉత్తరాలతో కదిలించదలుచుకోలేదు. కానీ, ఏ విధంగానైనా సరే, నీవు నా అవ్యాజమైన దీవెనలను, హృదయపూర్వకమైన ప్రేమను కలిగి ఉంటావు.

జగజ్జననిలో, భవదీయ,
తురీయానంద

(31)

వారణాసి, ఇండియా
23 జూన్, 1919

నా ప్రియమైన డాక్టర్,

నీవు 18వ తేదీ వ్రాసిన ఉత్తరం అందింది. అక్కడ నీవు స్వామీజీల సత్సాంగత్యాన్ని అనుభవిస్తున్నావని, దాని ద్వారా ఎంతో ప్రయోజనాన్ని పొందుతున్నావని తెలిసి సంతోషిస్తున్నాను. ఎల్లప్పుడూ పారమార్థిక అభివృద్ధి వల్ల కలిగే తీవ్రతను, ఉత్సాహాన్ని ఒకే విధంగా నిలుపుకోలేం. కానీ, ధైర్యాన్ని కోల్పోవడం, నిరుత్సాహపడడం పనికిరావు. మరింతగా పారమార్థిక సాధనలలో నిమగ్నమై ఉండాలి. అంతేకానీ లక్ష్యాన్నే మరచిపోకూడదు. దివ్యజనని అనుగ్రహం వల్లనే మనకు అటువంటి ఉన్నత పారమార్థిక స్థితులు కలుగు తాయి. కొంతకాలం ఆ లక్ష్యం మరుగున పడిపోవచ్చు, కానీ అది నశించదు. నీవు దాని వెంటపడితే ఆ స్థితి తప్పకుండా మళ్ళీ లభిస్తుంది. అయినా, ఉత్సాహం తగ్గిపోయి హృదయం ఎండి పోయినట్లున్నప్పుడు కూడా పట్టువదల కుండా జగజ్జననిని ప్రార్థిస్తూనే ఉండాలి. నీ హృదయాన్ని మళ్ళీ భక్తితో, ప్రేమతో నింపేటటువంటి వికాసాన్నీ, ఓదార్పునూ ఆమె నీకు తప్పక ప్రసాదిస్తుంది. ఎల్లప్పుడూ నీవు జగజ్జనని బిడ్డవని భావించు. నీవు నిజంగా ఆమె బిడ్డవే. నీవు దేనిని ఆశిస్తున్నావో దానిని ప్రసాదించమని ప్రార్థించడమెన్నడూ మానకు. రాత్రిని అనుసరించి ఉదయం వచ్చినట్లు, నేడో రేపో అది నీకు సమకూరుతుంది...

నీవు క్షేమంగాను, సుఖంగాను ఉన్నప్పుడు ఈ ఉత్తరం నీకు అందుతుందని విశ్వసిస్తున్నాను. నీకు, అద్వైతాశ్రమంలోని సభ్యులందరకు నా ప్రేమ, శుభాశీస్సులు.

ప్రేమపూర్వకంగా, భవదీయ,
తురీయానంద

(32)

వారణాసి

21 జులై, 1919

నా ప్రియమైన డాక్టర్,

ఆప్యాయమైన నీ 18వ తేదీ ఉత్తరం అందింది.. ఆ ప్రశాంతమైన పవిత్ర ప్రదేశంలో ఉపనిషత్తులను అధ్యయనం చేస్తూ, వాటి ప్రభావం వల్ల ఉన్నతిని పొందుతున్నావని తెలిసి నాకెంతో ఆనందం కలిగింది. కానీ ఉత్తరంలో నిన్ను గురించి నీవు అంత విచారంగా ఎందుకు తెలియపరిచావు? పూర్వసంస్కారాలను గురించి నీవెందుకు అంత పట్టించుకుంటావు? ఎంత చెడ్డవిగా అనిపించినా, నీకు వచ్చిన స్వప్నాల గురించి అంతగా ఎందుకు పట్టించుకుంటావు? ఏ స్వప్నాల నుండి నీవు మేలుకున్నావో, అవి చెడ్డవైనప్పటికీ, ఆ స్వప్నాలను గురించి నీవు ఎందుకంత శ్రద్ధ తీసుకుంటావు? పూర్వం ఎప్పుడో ఉండి, ఇప్పుడు లేనటువంటి సంస్కారాలను గురించి ఎందుకు అంత తీవ్రంగా ఆలోచిస్తావు? నిద్ర మేలుకున్న తర్వాత చెదిరిపోయిన కలలుగా వాటిని పరిగణించు.

ధ్యాన సమయంలో మనస్సులోనికి అనంతమైన సంకల్పాలు రావచ్చు. కానీ వాటిని ఎందుకు గమనిస్తావు? వాటిని రానియ్యి, పోనియ్యి. వాటితో నీకేమీ పని లేదు. వాటికి సాక్షిగా ఉండు. నీ 'ఇష్టదేవత' ఏదైనా సరే, నీ మనస్సును దాని మీద బంధించి, దానితో నీ అహాన్ని 'పలుచన' చేసుకోవడానికి ప్రయత్నించు. నీ వ్యక్తిత్వాన్ని, అహంకారాన్ని ఇష్టదేవత ద్వారా తగ్గించుకోవడానికి ప్రయత్నించు. అసలు ఏ సంస్కారంతోనూ తాదాత్మ్యం చెందవద్దు. నీవు విముక్తుడవవుతావు. నీవు ఏది తలుస్తావో అదే అవుతావు. అదే రహస్యం. నీవు క్రీస్తువని భావిస్తే, ఆంతరంగికంగా క్రీస్తువవుతావు. నీవు అలా కానంతవరకూ, నీ ఇష్టదైవాన్ని గురించి ఎంత దీర్ఘంగా, తీవ్రంగా ఆలోచించడానికి నీవల్ల అవుతుందో, అంత తీవ్రంగా ఆలోచించడాన్ని మానవద్దు. నీకు ఓర్పు అవసరం. రోమ్ నగరం ఒక్క రోజులో నిర్మించబడలేదు. ఈ విషయాన్ని ఎన్నడూ మరువవద్దు.

నీ గమ్యాన్ని నీవు పొందాలన్నదే నా హృదయపూర్వకమైన ప్రార్థన. అద్వైతా శ్రమంలోని సభ్యులందరికీ నన్ను గుర్తుచేసి వారందరికీ నా హృదయపూర్వకమైన శుభాశీస్సులు, ప్రేమ అందించు. ఎప్పుడూ నీకు నా ప్రేమ, శుభాశీస్సులు.

ప్రేమపూర్వకంగా భవదీయ,

తురీయానంద

(33)

వారణాసి, ఇండియా

10 అక్టోబరు, 1919

నా ప్రియమైన డాక్టర్,

నీవు ఒకటవ తేదీ వ్రాసిన జాబు అందింది. (బర్మాలోని) మేమ్యోకు మారడం వలన నీ ఆరోగ్యం బలపడిందని తెలిసి నాకు చాలా సంతోషంగా ఉంది. నీవు క్షేమంగా ఉండెదవు గాక! నీవు అనేక ప్రదేశాలకు దరఖాస్తులు పెట్టుకోవడం చాలా మంచిది. త్వరలో నీకేదో ఒక ఉద్యోగం లభించాలని వాంఛిస్తున్నాను. నీ భావాలను నేను చక్కగా అర్థం చేసుకోగలను. కానీ, అంతమాత్రం చాలదు. నీ కుమార్తెను ఒక మంచి సంపత్కరమార్గంలో ఉంచేవరకూ నీవు కొంతకాలం పని చేయాలి. అలా చేసిన తర్వాత ఈ నికృష్టమైన సాంసారిక సంబంధాలను సంపూ ర్ణంగా త్యజించే ఆలోచన చెయ్యవచ్చు. అప్పుడు అన్ని బాధ్యతల నుండి విడివడిన చిత్తంతో శాశ్వతంగా విరమించడానికి నీకు స్వాతంత్ర్యం కలుగుతుంది. కానీ ఇప్పుడే సంసారాన్ని వదిలివేస్తే, సన్న్యాసం వల్ల లభించే మానసిక శాంతి నీకు లభించదు. ఈ లోకానికి నీవు చెయ్యవలసిన విధులను మొదట నిర్వర్తించడానికి జగజ్జనని నీకు శక్తిని ప్రసాదించు గాక! నీవు నీ కర్తవ్యాన్ని పూర్తిగా నిర్వర్తించిన తర్వాత సర్వాన్నీ త్యజించి జగజ్జననికి నిన్ను నీవు అంకితం చేసుకునే శక్తిని ఆమె ప్రసాదించు గాక! నీకు కావలసినంత తెలివి ఉన్నది. ఈ విషయాన్ని గురించి నేను ఎక్కువ మాట్లాడవలసిన అవసరం లేదు. తొందరవద్దు. శాంతం వహించు. సరైన కాలంలో జగజ్జనని సరైన దానిని నీకు సమకూర్చుతుంది...

ఉత్సాహంతో, ఆరోగ్యంతో ఉన్నప్పుడు ఈ జాబు నీకు అందుతుందని విశ్వసిస్తూ, నీకు నా శుభాశీస్సులు, ప్రేమ తెలుపుతున్నాను.

పరమేశ్వరునిలో, భవదీయ,
తురీయానంద

(34)

వారణాసి, ఇండియా
24 అక్టోబరు, 1919

నా ప్రియమైన డాక్టర్,

నీవు పంపిన దరఖాస్తులలో కొన్నిటికి అనుకూలమైన సమాధానం రాలేదని తెలిసి నాకేమంత ఆనందం కలగలేదు. నీకింకా సమాధానం రాని దరఖాస్తుల విషయమేమైందో చూద్దాం. ఉద్యోగంలో ఉన్నా నీవు ధ్యానాన్ని కొనసాగిస్తూ ఉండవచ్చు. దాని కోసం ఇప్పుడే సర్వాన్నీ నీవు త్యజించనక్కరలేదు. నీవు ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ఏది యథార్థమో నీ మనస్సు ఇంతకు ముందే నీకు చెప్పింది. ఏ పేదరికస్థితికి నీవు సిద్ధంగా ఉన్నానని తలుస్తున్నావో ఆ స్థితికి అర్హత నీవింకా సాధించలేదు. అందువల్ల నీ మనస్సును దుర్మార్గమైనదనీ, మోసకారి అనీ అనవద్దు. ఈ విషయాన్ని గురించి దీర్ఘంగా ఆలోచించమని గంభీరమైన నిశ్శబ్దంతో అది నీకు సలహా ఇచ్చినట్లు నాకు కనిపిస్తున్నది.

జగజ్జనని అనుకూలమైన ఉద్యోగాన్ని అతి త్వరలో నీకు లభింపజేస్తుందని ఆశిస్తున్నాను. ధ్యానానికి, ఆమెను గురించి భక్తి శ్రద్ధలతో చింతించడానికి ఎంతో అవకాశాన్ని కూడా నీకు

త్వరలో ప్రసాదిస్తుందని విశ్వసిస్తున్నాను. ప్రియమైన 'డెలీషియా'కు, నీకు నా శుభాశీస్సులు, ప్రేమ.

పరమేశ్వరునిలో, భవదీయ,
తురీయానంద

(35)

రామకృష్ణ మిషను, లక్నో, వారణాసి
21 డిసెంబరు, 1919

నా ప్రియమైన డాక్టర్,

నీవు 14వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది... నీవు రంగూన్ వదలిపెట్టి, ఉద్యోగానికి త్వరలో ఇండియా వచ్చే అవకాశం కలిగినందుకు సంతోషం. ఊటీలో ఉద్యోగం దొరికి, మళ్ళీ భారతదేశంలో ఉండెదవు గాక...

నీవు నిరుత్సాహపడనవసరం లేదు. అర్జునుడికి కృష్ణ భగవానుడు ఇచ్చిన సమాధానాన్ని గుర్తుంచుకుని మంచి ఉత్సాహంతో ఉండు. "మంచి చేసే వాడెప్పుడూ దుఃఖాన్ని పొందడు!" అని అమరగ్రంథమైన భగవద్గీతలోని ఆరవ అధ్యాయంలో చెప్పబడింది. ప్రస్తుతం నీకు సన్న్యాసానికి అర్హత లేకపోయినా, దాని కోసం నీవు దిగులు పడడానికి ఎటువంటి కారణం లేదు.

ఏ విధంగానైనా నీవు జగజ్జనని పుత్రుడివి కావా! ఇదివరకే ఆమె భక్తుడివి కావా! నీవు సన్న్యాసివి కాకపోతే ఏమైంది? నీవు ఎప్పటిలాగే జగజ్జనని బిడ్డవు; నీ మీద ఆమె ప్రేమ ఏమాత్రం తగ్గదు. ప్రతిదానికీ ఆమె వైపు చూడు; అన్నివిధాలా ఆమెను ప్రేమించు. నిన్ను ఎక్కడ ఉంచాలి, ఎలా ఉంచాలి అన్న విషయం, నిన్ను నీవు చూసుకోగలిగిన దాని కంటే, ఆమెకే బాగా తెలుసు. ఆమెను మాత్రమే అంటిపెట్టుకుని ఉండు; నీవు ఆమెకు చెందినవాడివనే విషయం ఎన్నడూ మరువకు. జీవితంలో నీవు ఏ స్థితిలో ఉంచబడినా, ధీరుడివై నీ విధి నిర్వహణ చేసి, నీవు ఆ జగజ్జనని బిడ్డవని నిరూపించుకో. అన్ని విధాలైన పరిస్థితులకు నీవు అతీతుడవనే దృష్టితో వాటన్నింటినీ నీ పాదాక్రాంతం గావించుకో. అప్పుడు వాటికి నీ మీద ఆధిపత్యం చలాయించే శక్తి కాదు కదా, నిన్ను భయపెట్టే శక్తి కూడా ఉండదు. దీనిని సాధించడానికి జగజ్జనని నీకు శక్త్యుత్సాహాలను ప్రసాదించు గాక...

జగజ్జననిలో, భవదీయ,
తురీయానంద

(36)

రామకృష్ణ మిషన్, లక్నో, వారణాసి
14 ఫిబ్రవరి, 1920

నా ప్రియమైన డాక్టర్,

దయతో నీవు 4 ఫిబ్రవరి, 1920 తేదీన వ్రాసిన జాబు మొన్న చేరింది. అనేక ధన్యవాదాలు. పారమార్థికంగా నీవెంతో బాగున్నావని తెలిసి ఆనందించాను. ఎల్లప్పుడూ జగజ్జననితో సంబంధం కలిగి ఉండు. ఆమె నిన్ను తప్పక రక్షించి, నిస్సందేహంగా సక్రమమైన మార్గంలో నడిపిస్తుంది. నీతో జగజ్జనని సలిపిన లీలను నీవు అర్థం చేసుకున్నందుకు చాలా సంతోషం. నీ ఆలోచన ప్రక్కదారి తొక్కినప్పుడు, నీకు ఒక దెబ్బ తగిలేలా చేసి, నీ బుద్ధిని మేల్కొల్పింది. అది చాలా చక్కగా ఉంది. జగజ్జననికి అనుకూలం కానీ విషయాలను, నీవు ఎలా ఆలోచిం చాలనే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండు... పారమార్థిక విషయాలలో సహాయభూతుడుగా ఒక పంజాబీ మిత్రుడు 'రాజకృష్ణ' నీకు లభించినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. మనస్సు విప్పి మాట చెప్పుకోవడానికి, సమాధానం పొందడానికి అటువంటి సహచరుడు లభించడం ఎంతో అదృష్టం.

అన్ని విధాలా నీ విషయాన్ని గురించి నీవు తుది వరకు పోరాడాల్సిందే. నీవు దాన్ని పూర్తిగా సాధించాలి. సగం, సగం చేసే పనులు ఎన్నటికీ సక్రమంగా ఉండవు. నీ ప్రయత్నాలను సక్రమంగా నెరవేరుస్తూ, ఫలితాలను జగజ్జననికి వదలిపెట్టి, నిర్లిప్తుడుగా ఉండడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తూ, ఆ పోరాటాన్ని సాగించు. ఇతరుల కొరకే ఈ పనిలో నిమగ్నుడవై ఉన్నావని తెలుసుకో. ఎల్లప్పుడూ నీవు సాక్షివే కానీ భాగస్వామివి కాదు. 'నిష్కామకర్మ' చెయ్యడంలో ఉన్న రహస్యమిదే.

'మిథిలాయాం ప్రదగ్ధాయాం న మే దహతి కించన' ('మిథిల దగ్ధమైనా, నాది అనేది ఏదీ కాల్చబడదు' – జనక మహారాజు ఈ మాటల్ని ఒక సన్న్యాసితో అన్నారు). ఈ వచనం పరిపూర్ణమైనది. దానికి ఇంకో పాదం ఉందేమో నాకు తెలియదు. ఈ ఒక్క పంక్తిలో 'నిస్వార్థాన్ని' గురించి ఎంత అద్భుతమైన భావం విశదీకరింపబడింది!... 'అహం' భావం నుండి విడివడడం ఎంతో కష్టం. 'నేను' అనే భావమే ఈ అహం. మానవుని మనస్సులో ఇది దీర్ఘంగా నాటుకుపోయింది. కానీ జగజ్జనని అనుగ్రహం వల్ల 'ఏ ఒక్కరో' గట్టిగా, యథార్థంగా, అఖండమైన ఓర్పుతో శ్రమిస్తే ఈ 'అహం' ను తొలగించుకోగలుగుతారు. సాధకుడు సంపూర్ణంగా, అరమరికలు లేకుండా జగజ్జననికి శరణాగతుడైతే జగజ్జనని ఈ 'అహాన్ని' తన స్వహస్తంతో తుడిచివేస్తుంది...

నీవు ఆరోగ్యోత్సాహాలతో ఉన్నావని విశ్వసిస్తూ, నీకు, ప్రియమైన 'డెలీషియా'కు శుభాశీస్సులు, ప్రేమ తెలుపుతూ,

జగజ్జననిలో, భవదీయ,
తురీయానంద

(37)

రామకృష్ణ మిషన్, లక్సా, వారణాసి

22 మార్చి, 1920

నా ప్రియమైన డాక్టర్,

నీవు ఎంతో ఆప్యాయంగా 13వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది. నీకు ఊటీలో ఉద్యోగం దొరికిందనీ, త్వరలో చేరబోతున్నావని తెలిసి మహదానందం పొందాను. ముందు తాత్కాలికంగా ఉద్యోగంలో చేరి, కొంత కాలమైన తర్వాత అనవసరమైన ఆతురత, శ్రమ పడకుండా స్థిరమైన ఉద్యోగం ఎన్నుకోవడం వల్ల నీవు తెలివైన పని చేశావనుకుంటున్నాను. ఆర్థికలాభాన్ని గురించి మాత్రమే చూచుకోవద్దు. నీవు చేపట్టిన ఉద్యోగంలో పారమార్థికాభివృద్ధికి అత్యవసరమైన ధ్యానం చెయ్యడానికి తీరుబాటు, జగజ్జననితో తాదాత్మ్యం చెందే అవకాశం, ఇతర ప్రయోజనాలు ఉంటాయి. పైగా ఊటీ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అది ఎంతో మంచిది కదా!

హస్తసాముద్రికాన్ని గురించి, జాతకచక్రాన్ని గురించి ఏమి అర్థంపర్థంలేని విషయాలు వ్రాశావు? అటువంటి రోత పుట్టించే విషయాలను గురించి అసలు ఆలోచించవద్దు. జగజ్జనని యందు నీ విశ్వాసాన్ని వదలిపెట్టవద్దు. జగజ్జనని సర్వశక్తిమంతురాలు. ఆమె తలుచుకుంటే దేన్నైనా చెయ్యగలదు. అసలు 'విధి' అనేది ఏదైనా ఉంటే ఆమె ఆ 'విధి'ని తుడిచివేయగలదు. ఇటువంటి విషయాలలో చిక్కుకుని ఏమారిపోవద్దు. జగజ్జననిమీద విశ్వాసం కోల్పోవద్దు. వివాహం చేసుకోవాలన్న ఇచ్ఛ ఉంటే, అది వేరే విషయం. ఒంటరిగా పారమార్థిక జీవితం గడపదలిస్తే నీ ఉన్నతాశయం నుండి నిన్ను మరల్చడానికి భువిలో గానీ, దివిలో గానీ దేనికీ శక్తిలేదు. ఈ విషయాన్ని గట్టిగా నమ్ము. నీవు వివాహమాడదలిస్తే బుద్ధిపూర్వకంగా వివాహం చేసుకో. నీ తరఫున నిర్ణయం చెయ్యడానికి నీవు తప్ప మరెవ్వరూ లేరు. వివాహం వైపు మొగ్గే స్వభావం నీలో ఉంటే అది వేరే విషయం. కానీ, నిజంగా నీకు వివాహం అయిష్టంగా ఉంటే, యథార్థంగా నీవు స్వేచ్ఛగా ఉండదలిస్తే, నీ ఆంతర్యంలో నుండి సమస్తమైన సహాయం లభిస్తుంది. జ్యోతిష్యంలో నీ భవిష్యత్తును గురించి చెప్పింది కేవలం గారడియే. జగజ్జనని యందలి పరిపూర్ణ విశ్వాసంతోనూ, నీ ఆత్మయందలి నమ్మకంతోను దానిని త్రోసి పారవెయ్యి. నీ ఆత్మ ఎల్లప్పుడూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కలిగి ఉంటుంది. నీవు వివాహమాడావని నేను విన్నట్లయితే నీ ఇచ్ఛ వల్లనే నీవు వివాహం చేసుకున్నావని, ఏ విధమైన బయటి ప్రేరేపణ నీమీద పనిచేసి, నిన్ను ఆ ప్రకారంగా చేయించలేదని భావిస్తాను. జాగ్రత్తగాను, ధైర్యంగాను ఉండు. నిజంగా నీవు సుఖశాంతులతో ఉండదలిస్తే ఏ బలవంతాలకూ లొంగిపోవద్దు. జగజ్జనని నిన్ను ఈ సంసారకూపం నుండి బయటకు తీసుకురాదలచిన సమయంలో, మళ్ళీ బుద్ధిపూర్వకంగా నీవు దానిలో తగులుకుని నీ తెలివితక్కువతనాన్ని నిరూపించుకోవద్దు..

సుఖసంతోషాలతో క్షేమంగా ఉన్నప్పుడు ఈ ఉత్తరం నీకు అందుతుందని విశ్వసిస్తున్నాను. నా ప్రేమ, శుభాశీస్సులతో, ధైర్యంగా, భద్రంగా ఉండు.

జగజ్జననిలో, భవదీయ,

తురీయానంద

(38)

రామకృష్ణ మిషన్, లక్నో, వారణాసి
25 ఏప్రిల్, 1920

నా ప్రియమైన డాక్టర్,

మన లాటూ మహరాజ్ (స్వామి అద్భుతానంద) ఇక మనకు లేరంటే నీవెంతో దుఃఖిస్తావు. క్రితం శనివారం ఉదయం 12 గంటల 10 నిమిషాలకు ఆయన ఆఖరు శ్వాస విడిచారు. వారి నిర్యాణం ఒక అద్భుతమైన విషయం. వారు శరీరాన్ని వదలిన తర్వాత వారి ముఖసౌందర్యాన్ని నేను నీకు వర్ణించలేను. ఆ ముహూర్తంలో వారి యావజ్జీవ సాధనాఫలితం సాక్షాత్కరించిందా అన్నట్లు ఆ వదనం ఎంతో ప్రశాంతంగానూ, ఎంతో ప్రేమాస్పదంగానూ, తేజోమయం గానూ, ఆనందమయంగానూ ఉంది. ఆయనకు వ్యాధి సోకినప్పటి నుండి ధ్యానంలోనే ఉన్నారు. ఆ ప్రశాంత స్థితిలో చివరి వరకు, ఆఖరు శ్వాస వదిలే వరకు ఉన్నారు. వారిని అప్పుడు ఎవరు దర్శించినా గౌరవభావంతో ఇలా ప్రకటించారు: "వీరిలాగా యథార్థ సాధువు కావడం, లోకాన్ని వదలి వేయడం ఎంత అద్భుతం!" నిస్సందేహంగా వారి జీవితం ఎంతో ఆదర్శప్రాయమైనది; ముమ్మాటికీ ధన్యతమమైనది. శ్రీరామకృష్ణుల యొక్క ఒక ఉత్కృష్ట శిష్యుడు, ప్రియతమ సేవకుడు అయిన ఈ సాధువు జీవితంలో ఎవరి దివ్యప్రభావం ఇంత విస్పష్టంగా విశదపరచబడిందో, ఎవరు ఆ పారమార్థిక సత్యాన్ని మేము సాక్షాత్క రించుకొనేలా చేశారో ఆ ప్రభువుకు జయమగు గాక! ఆ సమయంలో ఆచరించ వలసిన కర్మకలాపాల్ని ముగించిన తర్వాత వారి శరీరాన్ని పుష్పమాలలతోనూ, ఇతర పవిత్ర వస్తువులతోనూ అలంకరించి పావన గంగాజలాలలో నిమజ్జనం – జలసమాధి గావించడానికి మణికర్ణికా ఘట్టానికి (వారణాసిలోని ప్రఖ్యాత స్మశాన ఘట్టం) గొనిపోయాం. (జలసమాధి అంటే నీళ్ళలో సమాధి చెయ్యడం. ఉత్తర భారతదేశంలో చనిపోయిన సాధువు శరీరానికి ఒక పెద్ద బరువును కట్టి గంగానది వంటి ఒక పుణ్యనదిలో వేస్తారు.) వారు సమాధి చెందిన 13వ రోజున ఇక్కడి అద్వైతాశ్రమంలో సాధువులకు, దరిద్ర నారాయణులకు సమారాధన చెయ్యడం ద్వారా అంత్యకర్మను ఆచరించబోతున్నాం. లాటూ మహరాజ్ నిర్యాణంతో మనం ఒక మహాపురుషుణ్ణి, అద్భుత పారమార్థిక సంపన్నుణ్ణి కోల్పోయాం. భగవానునకు జయమగు గాక!

ఇక్కడ రెండు ఆశ్రమాలలో అందరూ క్షేమంగానే ఉన్నారు. నీవు సుఖసంతోషాలతో ఉన్నావని విశ్వసిస్తూ నీకూ, ప్రియమైన డెలీషియాకూ, ఎప్పుడూ నా ప్రేమ, శుభాశీస్సులతో,

జగజ్జననిలో, భవదీయ,
తురీయానంద

(39)

రామకృష్ణ మిషన్, లక్సా, వారణాసి

10 ఆగష్టు, 1920

నా ప్రియమైన డాక్టర్,

చాలా రోజుల తర్వాత నీవు ఆగష్టు 3వ తేదీన ఆప్యాయంగా వ్రాసిన ఉత్తరం అందింది. బహుశా, నా సంకల్పశక్తి నిన్ను జాబు వ్రాయించేటట్లు చేసింది. ఇటీవల నిన్ను గురించి ఎంతో ఎక్కువగా తలుచుకుంటున్నాను...

మాతృదేవి మనల్ని వదిలివెళ్ళారు. కానీ భక్తుల హృదయాలను వదలిపోలేదు. శాశ్వతంగా అక్కడ వుండి, సర్వకాలాలలోను మనల్ని ఆశీర్వదిస్తూనే ఉంటారు.

నా ఆరోగ్యం అంత సంతృప్తికరంగా లేదు. నా కాళ్ళలో నొప్పులు దుర్భరంగా ఉన్నాయి. మధుమేహవ్యాధివల్ల వచ్చే ఇతర బాధల నుండి కూడా విముక్తి లభించలేదు. కానీ ఏమి చెయ్యగలం? అనవసరమైన అశాంతి వల్ల, కలతల వల్ల వచ్చిపడే మరిన్ని కలవరాలను తప్పించుకోవాలంటే వాటిని శాంతంగా భరించక తప్పదు.

సుఖశాంతులతో ఉన్నప్పుడు ఈ జాబు నీకు అందాలని విశ్వసిస్తూ, మీ అందరికీ ప్రేమ, శుభాశీస్సులు.

పరమేశ్వరునిలో, భవదీయ,

తురీయానంద

(40)

వారణాసి

21 మార్చి, 1922

నా ప్రియమైన డాక్టర్,

నీవు అన్నింటిలోనూ భగవంతుణ్ణి దర్శించాలని వాంఛిస్తున్నావు. మరి, ఇప్పటి నుండే భగవంతుణ్ణి సర్వత్రా దర్శించడాన్ని ఎందుకు ప్రారంభించవు? యత్నిస్తే విజయాన్ని సాధించవచ్చు. ఈ క్షణం నుండే ప్రయత్నం చెయ్యకపోతే ఆయనను అన్నింటిలో ఎన్నటికీ దర్శించలేవు. ఈ బృహద్యత్నాన్ని నీవు సొంతంగా చేసి తీరాలి. నీ కోసం మరెవ్వరూ చెయ్యరు. కాబట్టి ఆ విధంగా దర్శిస్తూ ఉండు. అభ్యాసమే నిన్ను పరిపూర్ణుణ్ణి చేస్తుంది. హృదయ పూర్వకమైన నిష్కాపట్యం – మనకు అన్నిటికన్నా మిన్నగా కావలసింది అదే.

అసహ్యకరమైన ఆ అనుమానమనే దుర్గుణం ఇంకా నీలో తారట్లాడు తున్నందుకు నీవు బాధపడుతున్నట్లు కనిపిస్తున్నది. అది నిజంగా నీలో ఉండడం ఇష్టం లేకపోతే, ఇక ముందు దాన్ని బయటకు రానివ్వవద్దు. ఒక విషయాన్ని మళ్ళీ మళ్ళీ చేస్తుండడమే గదా అలవాటు అంటే! ఈ అనుమానంలో మళ్ళీ మళ్ళీ మునిగిపోవద్దు. క్రమంగా ఇతరులను

అనుమానించడమనే అలవాటు నుండి బయటపడతావు. ఇక్కడ కూడా ఈ పనిని నీవే చెయ్యాలి గానీ ఇతరులెవ్వరూ నీ కోసం పాటుపడరు.

అక్కడి స్వామీజీలకు, బ్రహ్మచారులకు నా శుభాశీస్సులు. ఎల్లప్పుడూ నీకు నా ప్రేమ, శుభాశీస్సులు.

పరమేశ్వరునిలో, భవదీయ,

తురీయానంద

(41)

వారణాసి, ఇండియా

12 మే, 1920

నా ప్రియమైన కుమారి మెక్లౌడ్,

నీవు సాదరంగా మార్చి 31వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది... అద్భుతానంద స్వామి (లాటూ మహరాజ్) ఇక లేరని తెలుపడానికి ఎంతో విచారిస్తున్నాను. క్రితం నెల ఏప్రిల్ 24వ తేదీన ఆయన ఆఖరు శ్వాస వదిలారు. ఆయన మరణం నిజంగా ఒక అద్భుత విషయం. ఆయన వ్యాధిగ్రస్తులై, జబ్బుపడినప్పటి నుండి ధ్యానస్థితిలోనే ఉన్నారు. ఆ ధ్యానస్థితిలోనే లీనమై శరీరాన్ని వదిలారు.

కుడికాలి మడమ మీద ఏదో ఒక పొక్కు వచ్చింది. దానికి శస్త్రచికిత్స చేసిన కొద్దిరోజులకు అది దుర్మాంసంగా మారింది. ఇక్కడ ప్రాంతీయంగా లభ్యమయ్యే వైద్య సహాయమంతా తీసుకున్నాం. కానీ, లాభం లేకపోయింది. తర్వాత 10, 12 రోజులలో ఆయన మృతి చెందారు. జబ్బుచేసిన స్థితిలో ఉన్నప్పుడు బాధపడు తున్న సూచనలేవీ ఆయన కనపరచలేదు. ఆశ్చర్యాలలోకెల్లా ఆశ్చర్యమేమంటే మృతి చెందిన తర్వాత, ఆ సందర్భంలో చెయ్యవలసిన కొన్ని కర్మలు చెయ్యడానికి ఆయనను కూర్చోబెట్టినప్పుడు ఎంతో సుందరంగానూ, నిర్మలంగానూ, శాంతితోనూ, ఆనందంతోనూ నిండివున్నట్లు కనిపించారు. దేదీప్యంగా వెలుగుతున్న తేజస్సుతో, అనిర్వచనీయమైన జ్ఞానంతో, వాత్సల్యపూర్ణమైన దీవెనలందజేస్తూ తన స్నేహితుల దగ్గర ఆఖరుసారి సెలవు తీసుకుంటున్నట్లు ఆయన ముఖం ప్రకాశించింది. నిజంగా ఆ దృశ్యం దేవతలు చూడదగినది. తర్వాత మూడు గంటలు భగవన్నామ పారాయణం చేసి, ఆయన శరీరాన్ని చందనం, పూలమాలలు మొదలైనవాటితో అలంకరించి ఊరేగింపుగా గంగాతీరానికి తీసుకుపోయాము. అక్కడి నుండి పడవలో మణికర్ణికాఘట్టానికి తీసుకుపోయి, ఆ సమయంలో చెయ్యవలసిన ఆఖరు కర్మలు ఆచరించిన తర్వాత గంగామాత పావనజలాలలో జలసమాధి గావించాము. లాటూ మహరాజ్ శాశ్వతశాంతిని పొందారు. మరొక శ్రీరామకృష్ణుల పుత్రుడు వారిని కలుసుకున్నాడు. ఆయన మరణం మాకు తీరనిలోటు. అది మమ్మల్ని మరింత పేదలను చేసింది. ఎవరు నిరక్షరాస్యుడైనప్పటికీ తన సరళమైన

జీవితం ద్వారా శ్రీరామకృష్ణుల యథార్థమైన పరమభక్తునిగా మారారో, అటువంటి పారమార్థిక మహామహుని మనం కోల్పోయాం.

పాశ్చాత్యదేశాలు పారమార్థికం కావలసి ఉంది. లేకపోతే అవి ప్రశాంతంగా మనుగడ సాగించేందుకు ఆస్కారమే లేదు.

ప్రేమపూర్వకంగా, భవదీయ,
తురీయానంద

హరి ఓం తత్సత్